Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరి వారి
సాహితీ సమాలోచనము

పింగళి వేంకట కృష్ణారావు
ఎం.ఎ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

DONATION

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

DONATION

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరివారి సాహితీ సమాలోచనము

FORWARDED FREE OF COST, AND WITH THE COMPLIMENTS OF THE DEPT. OF EDUCATION, GOVT. OF INDIA, NEW DELHI

8113

పింగళి వేంకట కృష్ణారావు, ఎం. ఏ.,

ఆంధ్రోపన్యాసకులు — శాతవాహన కళాశాల

విజయవాడ - 520 003

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రథమ ముద్రణ :

మార్చి, 1992.

తెలుగు విశ్వవిద్యాలయం వారి
ఆర్థిక సహాయముతో ప్రచురితము.

వెయ్యి ప్రతులు

సర్వస్వామ్యములు రచయితవి.

వెల : సాదా ప్రతి రు. 60/-
గ్రంథాలయ ప్రతి రు. 90/-

ప్రతులకు :

1. పి. వి. యస్. రామారావు,
శ్రీనగర్ - రెండవ లైను,
సత్యనారాయణపురం - విజయవాడ-11.

2. న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్
ఏలూరు రోడ్, విజయవాడ-2.

ముద్రణ :

"శ్రీ రాఘవేంద్ర"
రామకృష్ణాపురం, విజయవాడ-3.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు

पुस्तकालय
पुस्तकालय
विश्वविद्यालय
DONATION

1895 – 1962

అరుదై తోచెడు బుఱ్ఱమీసములు, మేలౌ సుందరీ శిల్పమన్
సిరికిన్ పొంకము దిద్ద జంటయగు, లక్ష్మీ కాంతుచే మిత్రుడౌ
గురుడౌ వేంకట శాస్త్రి యంట; ఇక నీకున్ బోల నెవ్వారికిన్
తరమే, ఖద్దరు వేషపున్ కవి బహద్దర్! నీకు కై మోడ్చెదన్.

— పింగళి వేంకట కృష్ణారావు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స మ ర్ప ణ ము



శ్రీ పింగళి రామగోపాలరావు — శ్రీమతి లక్ష్మీనరసమ్మ

1918–75 1926–90

శ్రీ దోలాబ్ధము, సాధ్వి మాజనని, లక్ష్మి నర్సమాంబా సతిన్
చూడ న్రాజిన మొప్పువాని జనకున్, సుశ్లోకు బ్రాహ్మ్యంబు సై
దోడా పింగళి వంశవారినిధిచంద్రున్ రామగోపాలునిన్
నేడీ గ్రంథము నిచ్చి కొల్తు, నిధికిన్ నిష్కాంబుగా దోపగన్.

— పింగళి వేంకట కృష్ణారావు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

पुस्तकालय गुरुकुल कांगड़ी विश्वविद्यालय

శుభాశంసనం

— కరుణశ్రీ
డాక్టర్ జంధ్యాల పాపయ్యశాస్త్రి

కృష్ణారావుగారూ! మీ "కాటూరివారి సాహితీ సమాలోచనం" సమగ్రంగా చదివి చాలా సంతోషించాను. మీ కృషిని ఎంతగానో మెచ్చుకున్నాను. శ్రీ కాటూరి వేంకటేశ్వరరావుగారితో నాకు ఉన్న పరిచయాన్ని వెల్లడించే ఒకటి రెండు సన్ని వేశాలు చెప్తాను.

ఒకనాటి ఉదయం గుంటూరులో మా ఇంటికి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారితో కలిసి కాటూరి వేంకటేశ్వరరావుగారు వచ్చారు. ఇద్దరూ ఒకరి భుజాలమీద ఒకరు చేతులు వేసుకొని వస్తూ ఉండటం చూచి "రండి, రండి కృష్ణార్జునులు" అంటూ లోపలికి ఆహ్వానించాను. మీ "ఉపమ" బాగుంది అన్నారు కృష్ణశాస్త్రి నవ్వుతూ. అనుకోకుండా ఇంటికి వచ్చిన అతిథులకోసం మా ఆవిడ ఉప్మా తయారుచేసింది. జీడిపప్పు వేసిన వేడివేడి ఉప్మా తింటూ కాటూరివారు అన్నారు- "కరుణశ్రీ! ఇందాక నీవు పలికిన 'ఉపమ' బాగుంది. అంతకంటే మీ శ్రీమతి చేసిన 'ఉపమా' ఇంకా రుచిగా ఉంది." ఆయన ఛలోక్తికి అంతా నవ్వుకున్నాము.

ఒకమాటు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారికి బందరులో షష్టిపూర్తి మహోత్సవం జరిగింది. వేటూరి, వేలూరి, కాటూరి, పింగళి, విశ్వనాథ మొదలైన హేమా హేమీలంతా గురువుగారి షష్టిపూర్తికి వచ్చారు. పింగళి, కాటూరి తాము రచించిన "సౌందర నంద" కావ్యాన్ని గురువుగారికి కృతి ఇచ్చారు. ఆ సభలో పాల్గొన్న కవులంతా వేంకటశాస్త్రిగారిని స్తుతించుతూ పద్యాలు చదివారు. నేను కూడా మూడు సీసపద్యాలు చదివాను. శాస్త్రిగారు "ఏ ఊరు నాయనా? నీది?" అన్నారు. "గుంటూ రండీ" అన్నాను. "పద్యాలు సరిగా వినబడలేదు. సాయంత్రం నేను నా గదిలో విశ్రాంతి తీసుకుంటాను. అక్కడికివచ్చి వినిపించు పద్యాలు బాగున్నాయి" అన్నారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సాయంకాలం నేను వెళ్ళేసరికి శాస్త్రిగారు గదిలో ఒక మంచంమీద పడుకొని ఉన్నారు. కాటూరివారు మంచందగ్గర కూర్చుని శాస్త్రిగారి తల వత్తుతున్నారు. నేను నమస్కరించాను. "వచ్చావా నాయనా! ఏవీ ఆ పద్యాలు?" అన్నారు. నేను-

"దండంబు చండప్రచండ పాండిత్య వి
ఖండితారి వచః ప్రకాండ! నీకు"

ఇత్యాదిగా సీసపద్యాలు చదివి చివరి గీత పాదంలో "షష్ఠిపూర్తి మహోత్సవ సార్వభౌమ!" అనే సంబోధనతో ముగించాను. అది విన్న శాస్త్రిగారు "మరీ అంత గట్టిగా నొక్కబోకోయ్" అన్నారు కాటూరివారిని చూస్తూ. కాటూరి నావైపు చూచి ఒక చిరునవ్వు నవ్వారు. నాకేమీ అర్థం కాలేదు. తర్వాత కాటూరివారు రహస్యంగా నాతో అన్నారు— "మరీ అంత నొక్కబోకోయ్ అన్నది నన్ను కాదు, నిన్నే" అని. "ఇదిగో చూడు! నీ పద్యంలో అరవై ఏండ్ల శాస్త్రిగారిని ఆరేళ్ళ పిల్లవాణ్ణి చేశావు" అన్నారు. నేను చాలా ఆశ్చర్యపడ్డాను. "మరేమీ లేదు. 'షష్టి' అంటే అరవై, 'షష్ఠి' అంటే ఆరు. అర్థమైందిగా?" అన్నారు కాటూరి. అప్పుడు నా పొరపాటు గ్రహించాను. కాటూరివారి వాక్చమత్కారానికి ఇదో ఉదాహరణ.

ఒకమాటు ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీలో ఉపన్యాసానికి కృష్ణశాస్త్రిగారిని పిలిచాము. ఆ సభకు కాటూరి అధ్యక్షుడు. నా స్వాగతవచనాల్లో కృష్ణశాస్త్రిగార్ని "మహాకవీ" అనీ, కాటూరివారిని "సుకవి చూడామణీ" అనీ సంబోధించాను.

తరువాత కాటూరి వారు ప్రసంగిస్తూ "చూశారా! మీ కరుణశ్రీ పక్షపాతం. ఆయన్ని 'మహాకవీ' అన్నాడు. నన్ను 'ఏదో ఏదో' అన్నాడు. నాకంటే ఆయన గొప్పేమిటి? ఆయనా పద్యాలు వ్రాస్తాడు. నేనూ పద్యాలు వ్రాస్తాను. కాకపోతే నా పద్యాలకంటే ఆయన పద్యాలు బాగుంటాయి. అంతే" అన్నారు. ఆ మాటలు విని మా కాలేజీ పిల్లలంతా గొల్లున నవ్వారు. కాటూరి వారి వాక్చాతుర్యానికి ఇదొక మచ్చు తునక.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇక మీ "సాహితీ సమాలోచనం" గురించి నా శుభాశంసనం వినండి—

"పౌలస్త్యహృదయ" సౌభాగ్యంబు ప్రకటించి
"పన్నీటి జల్లు"లో పరవశించి
"సౌందర్యలహరి"లో స్నానంబు గావించి
"ముగ్గురు మూర్తుల" నుగ్గడించి
గణగణమని "గుడి గంటలు" మ్రోగించి
"మువ్వగోపాలుని" ముద్దులాడి
"స్వప్న వాసవదత్త" సౌందర్య మెరిగించి
"నల్ల కలువ" సౌరు వెల్లడించి

"శ్రీనివాస కల్యాణము" "సీత పెండ్లి"
"ధర్మ పథము"న "సత్యశోధన" మొనర్చి
మేటి కాటూరి ప్రతిభను చాటినావు
కృత హిత ధ్యేయ! వేంకట కృష్ణరాయ!

శుభాకృతి అయిన మీ కృతి కాటూరి వారి సాహితీ సరస్వతికి చక్కని అలంకృతి.

"సరస్వతీ శ్రుతి మహతీ మహీయతామ్"

మీ

కరుణశ్రీ

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆప్త వాక్యం

కవి సుధాకర
— డాక్టర్ ప్రసాదరాయ కులపతి

పింగళివంశము కవితకు
బంగరుగని అందు విబుధవర్యుడు విద్యా
శృంగారి కృష్ణరాయం
డంగీకృత రసకళా రహస్యవిదుండున్.

సాహిత్య తత్త్వవేత్తల
సౌహిత్యముతోడ పిలిచి సభలు జరిపి - ప్ర
జ్ఞాహయముఖులకు సత్కృతి
దోహదములు సేయు భక్తితో నిత్యమ్మున్.

తాను కవి, పండితుడు ని
త్యానుష్ఠానమ్ము సుకవితానంద క్షే
త్రాన - అయిన ననసూయుడు
మానితహితుడగుట నితని మన్నింతునెదన్.

కాటూరివారి కవితా
పాటవమును గూర్చి, లలితభావుకరీతిన్
పాటించి పలికె, భారతి
నీటీ గంధమ్ము దిశల విస్తృమర మయ్యెన్.

పింగళి కాంత సుకవితో
సంగాతము సలిపినట్టి సహృదయు, సాహి
త్యాంగన మెరుగుల; మరియొక
పింగళి కవి చూపె, చిత్రవిలసనమిదియున్.

ధన్యుండు కృష్ణరాయడు
ధన్యుడు కాటూరి సుకవి, ధన్యులు బుధసా
ర్థన్యులు, సారస్వత సౌ
జన్యులు జననమ్ముగన్న సరస విమర్శన్.

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గ్రంథకర్త

శ్రీ పింగళి వేంకట కృష్ణారావు — శ్రీమతి రంగనాయకమ్మ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హర్షం

డాక్టర్ తమ్మారెడ్డి నిర్మల
ప్రొఫెసర్
నాగార్జున యూనివర్శిటీ

ఆధునికాంధ్ర సాహిత్యాన్ని పరిమళ భరిత మొనర్చిన పుష్పాలలో కొన్ని జంట పూవులున్నాయి. అటువంటి పూజంటలలో పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావులది సుందర నందన మాధురీ విలసితం. ఈ జంటకవులు సమష్టిగాను వ్యష్టిగాను కూడ తమ రచనా వ్యాసంగం కావించారు. వీరిలో ఒకరైన కాటూరి వేంకటేశ్వరరావుగారి రచనల సమాలోచనమే ఈ గ్రంథం.

పింగళి వేంకట కృష్ణారావుగారు డిగ్రీలను గాని, అవార్డులను గాని ఆశించి ఈ గ్రంథ రచన చేయలేదు. కాటూరివారి మీద గౌరవంతో, వారి రచనలపట్ల ఇష్టంతో ప్రారంభించిన వీరి పరిశీలనా ఫలితమే ఇది.

కాటూరివారి రచనల నన్నిటిని ప్రక్రియ ప్రకారంగా విభజించి సమీక్షించటం వలన, పాఠకులు ఏ రచన గురించి తెలుసుకోవాలన్నా ఆ శీర్షికలో చూడటానికి వీలవుతుంది. ఏ పుస్తకాన్ని ఏ సంవత్సరంలో ఎవరు ప్రచురించారో తెలిపిన వివరాలు భవిష్యత్తులో పాఠకులకు, పరిశోధకులకు ఎంతో ఉపయోగపడతాయి.

ఒక కవి లేక రచయిత రచనలను గురించి సవిమర్శక గ్రంథాన్ని వ్రాసేటప్పుడు ఆ కవి జీవిత విశేషాలను కూడ పరిశీలించి చెప్పటం ఆధునిక విమర్శలో భాగమైంది. ఇప్పుడు కాటూరివారి జీవిత విశేషాలను వారు రచించిన పద్యకావ్య సమీక్ష సందర్భంగా చెప్పవలసి రావటంతో సమయోచితమై, సాహితీ సమాలోచనలోనే ఇమిడిపోవటం అనోక అందం.

గుమ్మడిపండు వంటకం, పైడికంట్లు, పంచకోల కషాయం, నీరుకావిపంచెలు, రెడ్డిగాలు, కిర్రుచెప్పుల రహస్యం, గరిసెలు, బొమ్మకట్టటం, కప్పలు ఎండి వరుగులై ముక్కు మూసుకొని నిద్రపోవటం వంటి విషయాలను వివరించటం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అవసరమే. వీటిని గురించి చెప్పగలిగిన పైతరంవారు వెళ్ళిపోతే ఈ తరంవారికి అర్థం తెలీని పదాలివి. వీటిని వివరించిన తీరు "అసలు" రచనతో పోటీపడింది.

కృష్ణానదికి ఆనకట్టను కట్టక పూర్వపు పరిస్థితిని, కట్టిన తరువాతి పరిస్థితిని పోల్చిచూడటం, కృష్ణాపత్రికలలో ప్రచురించబడిన విషయాలద్వారా తెలిసిన ముట్నూరివారి దర్బారు విశేషాలను, అడివి బాపిరాజుగారి వెన్నెలదేవత శశికళ ఉదంతాన్ని చెప్పటం వలన కాటూరివారి కాలం నాటి విషయాలను మన కళ్ళ ముందుంచినట్లయింది.

కాటూరివారి రచనలలోని రసదృష్టిని, చమత్కారాన్ని, తెలుగుదనాన్ని, శిల్పాన్ని సోపపత్తికంగా ప్రదర్శించటంతో పాటు కాటూరివారి తత్త్వాన్ని కూడ మనముందు నిలిపారీ రచయిత. పౌలస్త్య హృదయంలోని వైరభక్తిని, అది ఒక సంక్షిప్త రామాయణమన్న విషయాన్ని స్థాపిస్తూ, కాటూరివారి హృదయాన్ని ఆవిష్కరించిన పద్ధతి ప్రశంసనీయంగా ఉంది.

ఖండకావ్యాల రచనా కాలాన్ని గురించి పరిశోధనాత్మకంగా చర్చించటం వలన, నామౌచిత్యాన్ని పరామర్శించటం వలన రచయిత బహుగ్రంథ పఠన ఫలితంగా గ్రహించిన విశేషాలను తగినచోట అనుసంధించుకోవటం వలన, కాటూరి వారి కవితా సౌందర్యాలనే కాక ఆయనను గురించిన విషయాలను విశేషాలను అందిస్తున్న సమగ్ర రచన కావటం వలన ఈ "సాహితీ సమాలోచనము"నకు సిద్ధాంత గ్రంథ గౌరవం సిద్ధిస్తుంది.

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

* *

లోచనం

డా॥ బేతవోలు రామబ్రహ్మం
తెలుగు విశ్వవిద్యాలయం
సాహిత్య పీఠం
రాజమండ్రి

పింగళి-కాటూరి జంట తెలుగు సాహితీ లోకానికి సౌందరనందం పంట అందించింది. సౌందరనందం మీద చాలా పరిశోధనలు జరిగాయి. పింగళి లక్ష్మీ కాంతం గారి ఇతర రచనలమీదా పరిశోధనలు బాగానే జరిగాయి. ఇది ఇప్పుడు కాటూరి వేంకటేశ్వరరావుగారి సమస్త రచనలమీదా వెలువడుతున్న సమగ్ర పరిశోధన నిబంధన. తమాషా ఏమిటంటే దీని రచయిత మరో పింగళివారు కావటం.

కాటూరి వేంకటేశ్వరరావుగారి జీవితమే ఒక ప్రబంధం. ఏ బాదరబందీ లేకుండా కవితా సృష్టికీ సాహిత్య చర్చలకీ కవి గోష్ఠులకీ రసాస్వాదనలకీ మొత్తం జీవితాన్ని మీదుగట్టిన మహానుభావుడు వేంకటేశ్వరరావుగారు. ఆ రకం జరుగుబాటు వారికి కుదిరింది. కృష్ణశాస్త్రితో మొదలుపెట్టి చాలామంది కవులకు వీరు ఆత్మీయులూ ఆశ్రయులూ. బందరు సాహిత్య వాతావరణం, ముట్నూరివారి దర్బారూ వీరివల్లనే ఘుమఘుమలాడాయి. ఆనాటి ఏ కవిని పరామర్శించవలసి వచ్చినా కాటూరివారు చేతికి తగలకమానరు.

సౌందరనందం జంట కవిత్వం. అది వదిలేస్తే వీరు చేసిన రచనలు ఆట్టే లేవు. పౌలస్త్య హృదయం, గుడిగంటలు - ఖండకావ్యాలు, పన్నీటి జల్లు ప్రకీర్ణ పరిచ్ఛేదం. ఇవికాక నేనూ, మాఊరు, మావాళ్ళు అనేవి పీఠికాప్రాయమైన ఖండికలు. అనువాద రచనలు మరికొన్ని - ఇదీ మొత్తం వీరి సాహిత్యసృష్టి. ఏటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిశోధించి అనుశీలించి ఈ సాహితీ సమాలోచనని మనకు అందిస్తున్నారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పీఠికాకృతుల్లో ప్రతిబింబించిన ఆనాటి పల్లెసీమల అందచందాలనూ మానవీయ సంబంధాలనూ రుచిచూపించి ఆ రోజులే బాగున్నాయి అనిపించారు. యాభై లనాటికే కాటూరివారికి "గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్" అనిపించింది. బహుశ ఇదికూడా ఒక శాశ్వత సత్యమేమో. ప్రతి తరానికీ ఇలాగే అనిపిస్తుందేమో!

పైడికంట్లని ప్రజలంతా మర్చిపోయారు. ఇప్పుడు ఆ పక్షులు పల్లెటూళ్ళలో కూడా కనపడటంలేదు. ఇక ఈ ప్రజల్ని మనం మేలుకొల్పలేమని అవీ విసిగిపోయాయేమో! వీటితోపాటు నీరుకావి ధోవతులూ, కిర్రుచెప్పులూ, వీటి తయారీ గురించి మిత్రులు శ్రీ పింగళి వేంకట కృష్ణారావుగారు మంచి వివరణలు ఇచ్చారు.

అప్పటికీ ఇప్పటికీ ఉన్న తేడాని గురించి చెబుతూ కాటూరి వారన్న మాట అందరూ గుర్తించదగింది -

నాడును గల్లు ద్రావిరి, ధనమ్ములు ప్రుచ్చిలి, రన్యదారలన్
గూడిరి-కాని పాపమును గొంతును బొక్కెనొయన్న భీతి పె
న్నాడెను వారి, ఇయ్యదన నట్టి భయమ్ముడివోయి, చప్పగా
సూడెను సిగ్గు పాపరతులార్జితులై విహరింతు రిచ్చమై

పౌలస్త్య హృదయం చిక్కని ఖండకావ్యం. ఇందులో రావణుడి వైరభక్తి కవితా రమ్యంగా రూపుకట్టింది. రామాయణ కథ అంతా ఎలా ఇమిడిందో, రావణుడి వైరభక్తికి పునాదులు ఏమిటో కృష్ణారావుగారు సమగ్రంగా సంస్కృత శ్లోకాలతో సహా వివరించారు. పాతాళాధిపుఁడోఁకఁ ద్రొక్కడంలోనూ, శచీప్రాణేశు కైశ్యంబు డాచేతం బట్టుటలోనూ ఉన్న ఔచిత్యాన్ని ప్రశంసనీయంగా పేర్కొన్నారు.

గుడిగంటలు హరిజన సమస్యమీద ఆవిష్కరించిన కావ్యం. కాటూరివారు కాంగ్రెస్ అభిమాని. గాంధేయవాది. ఖద్దరు తప్ప కట్టను పెట్టను అన్నంత పట్టుదల వీరిది. (శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు దీనికి పూర్తిగా వ్యతిరేకం). హరిజనోద్ధరణలో భాగంగా దేవాలయ ప్రవేశం ప్రబోధించే ఆర్ద్రమైన రచన ఈ గుడిగంటలు. దీన్ని అంత ఆర్ద్రంగానూ పింగళివారు అనుశీలించారు.

కాటూరి వారికున్న సామాజిక స్పృహ, రాజకీయ చైతన్యం గుడిగంటల్లోనే కాదు పన్నీటిజల్లులోని అన్ని రచనల్లో బాగా ప్రస్ఫుటమవుతుంది. జమీందారీ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యవస్థకి వ్యతిరేకంగా వీరు రచించిన పాటల్లో పద్యాల్లో వాడి వేడీ గట్టిగానే తగు ల్తుంది. ఏ సంప్రదాయానికి చెందినవాడైనా కవి సమకాలీన సామాజిక సమస్యలకి స్పందించకుండా ఉండలేడు.

అనువాద రచనలను గురించి సాగిన పరిశీలన ఈ గ్రంథానికి గౌరవప్రదంగా ఉంది.

కాటూరివారి చిలిపితనానికి నిదర్శనంగా ఉన్న పద్యాలు కూడా పన్నీటి జల్లులో ఉన్నాయి. పింగళివారు వాటినీ ఉదాహరించి పాఠకులను గిలిగింతలుపెట్టారు. మొత్తంమీద పింగళి వేంకట కృష్ణారావుగారి శైలి పఠనీయం. పత్రికల్లో రచనలు చేసిన అనుభవం, సభల్లో ప్రసంగాలు చేసిన పాటవం వీరికి ఈ రచనలో బాగా ఉపక రించాయి. చెయ్యిచేసుకోవడం, నోరు చేసుకోవడం బాగా అలవాటున్న వ్యక్తి వీరు.

కాటూరివారి వ్యక్తిత్వాన్నీ, సాహితీ మూర్తిమత్వాన్నీ కవితాశిల్ప మహితంగా పట్టి ఇచ్చిన పరిశోధన ఇది అని నిరాక్షేపణగా అంగీకరించవచ్చు. సాహిత్య ప్రియులు చదివి ఆనందిస్తారనీ అభినందిస్తారనీ విశ్వసిస్తున్నాను.

ఒక మహాకావ్యాన్ని రచించలేకపోయామే అని కాటూరివారిలో ఏదో అస్పష్ట మైన అసంతృప్తి ఉండిపోయిందేమో అని నా అనుమానం. విశ్వనాథవారి గజా రోహణోత్సవం గురించి చెప్పిన పద్యాల్లో-కవితా మకరందం ఒకటి రెండు బిందు వులు చెదిరి ఆకులమీద పడితే "వాపిరిగొట్టులై యవియ నాల్కలనద్ది లఘూక్తి నీరసాలాపములాడ మాదృశులు" నీవేమో కడుపునిండా సేవించి త్రేన్చావు అని విశ్వనాథవారిని వీరు మెచ్చుకున్నారు. "లఘూక్తి" అనడంలో మేము లఘు కావ్యా లతో, ఖండకావ్యాలతో ఆగిపోయాం, మహాకావ్య నిర్మాణం చెయ్యలేకపోయాం అనే అసంతృప్తి ధ్వనిస్తోంది. నిజమే, చెయ్యగలిగిన సత్తా ఉండీ వీరు చెయ్యలేదు. కాటూరివారి నుంచి తెలుగువారికి అందవలసినంతగా అందలేదు. ఇది అసంతృప్తే. బహుళ సౌందరనందంతో సంతృప్తి పడిపోయారేమో! మనమూ అలాగే సంతృప్తి పడుతున్నాం. నిజానికి కవీ రచయితా ఏనాడూ సంతృప్తి పడకూడదుట! శ్రీ పింగళి వేంకట కృష్ణారావుగారు కూడా దీనితోనే సంతృప్తి పడకుందురు గాక!! సెలవు.

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రతిభాలోచనం

డా॥ ఎల్లూరి శివారెడ్డి
రీడర్, తెలుగుశాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం.

నిక్కమైన పరిశోధన దృక్పథంతో, ఇంతకుముందు సాహితీవేత్తలకు అంతగా తెలియని విషయ గౌరవంతో, కాటూరివారి కవితా మూర్తికి నిలిపిన స్వచ్ఛ దర్పణం ఈ 'కాటూరి వారి సాహితీ సమాలోచనము'. కాటూరివారి వంశవృత్తాంతం నుంచి ఆయన వాగమృతంచిలుకరించిన చమత్కారాలవరకు అన్నివిషయాలను సమగ్ర గంభీరంగా చిత్రించారు, ఈ రచనలో శ్రీ పింగళి వేంకట కృష్ణారావు గారు. పింగళి—కాటూరి కవుల కొన్ని రచనలతోనే ఇంతకు ముందు సాహితీ లోకానికి ఎక్కువ పరిచయం. కాని కాటూరి వారి రచనల్ని విడిగా, విశదంగా సుమారు 300 పుటల్లో విభాగ పూర్వకంగా చర్చించి పఠితలను పరవశింపచేశారు ఈ రచయిత. ప్రత్యగ్రమైన విషయాల్ని ప్రతిభా సుందరంగా తీర్చారు కృష్ణారావుగారు.

కాటూరివారి పౌలస్త్య హృదయంలోని భావుకత లోతుల్ని వీరు పరిశీలించిన విషయం పఠితల్ని చకితుల్ని చేస్తుంది. ఈ కావ్యం విషయంలో పౌరాణికమైనా వ్యక్తీకరణలో భావకవితా ఛాయల్ని పొదుగుకున్నదని, కాటూరివారి జీవనాడిని పట్టుకున్నారు. కాటూరివారు రావణుని హృదయనాడిని పట్టుకుంటే కృష్ణారావుగారు కాటూరివారి జీవనాడిని పట్టుకున్నారు. గాంధేయవాది అయిన కాటూరివారి ఆంధ్రోద్యమ స్పందన ఎంతగా ప్రగాఢమైందో వివరిస్తూ 'ముందు అతడు ఆంధ్రుడు. తరువాత భారతీయుడు' అని స్వచ్ఛందంగా చెప్పారు. కాటూరివారు రచించిన రూపకాలు ఎనిమిది దాకా ఉన్నాయి. వాటిని సంక్షిప్తంగా, సారవంతంగా విశ్లేషించారు. ఈ రూపకాల్లో 'తెలుగు పలుకుబడులు కాటూరివారి రచనకు సహజాలంకారాలు' అనీ, 'ప్రదర్శన యోగ్యతలో ఉన్నత ప్రమాణాలు కలవి' అనీ 'సున్నితమైన హాస్యంతో సాగే'వనీ 'ఆదర్శ భావనను చక్కగా అందించే'వనీ తీర్పు చెప్పారు. ఈ తీర్పులు రచయిత నేర్పుకు విషయ సూచికలు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పలు ముఖాలుగా విస్తరించిన కాటూరివారి కళాప్రతిభ నిష్యందులు వారి వ్యాసాలు. వారి విమర్శ కళను గురించి 'కళాకోవిదుని .... మనోగత భావకళా రూపాన్ని' అంతకు మించిన సౌందర్యాన్ని పట్టి పాఠకునికి అందించేదే సరైన విమర్శ' అన్నారు కృష్ణారావుగారు. ఈ మాట కాటూరివారి విమర్శకళకు ఎంతగా అన్వయిస్తుందో ఈ రచయిత విశ్లేషణకు అంతగా వర్తిస్తుంది. 'విదురుని విందు' అనే వ్యాసాన్ని వీరు వివరించిన తీరు రమ్యంగా ఉంది.

కాటూరివారు చేసిన సంస్కృతానువాదాలు ఉన్నాయి. చాటూక్తులకు సరసానువాదాలున్నాయి. ప్రతిజ్ఞాయౌగంధరాయణం, స్వప్నవాసవదత్తలకు వారు చేసిన అనువాదాల్ని గురించి ప్రమాణాత్మకంగా, తులనాత్మకంగా చర్చించారు ఈ రచనలో. 'పాత్రల ఆకారాలకంటే స్వభావాలను చిత్రించటం భాసుడికి చాలా ఇష్టం' అన్నది ఎంతో నిగ్గు తేల్చుకొని చెప్పిన అంశం. కాటూరివారి రచనలో కూడా ఈ లక్షణం గోచరిస్తుంది అంటారు కృష్ణారావుగారు. నిజంగా హృదయానికి నచ్చితేనే అనువాద రచన వస్తుంది. కాటూరివారు ఆంగ్లంలోని కొన్ని జీవిత చరిత్రలు, నవలలకు రుచిరమైన అనువాదాలు చేశారు. వాటిని సూక్ష్మేక్షికతో సమీక్షించారు కృష్ణారావుగారు.

కాటూరివారి సాహితీ కళా జీవితాన్ని ఎంతో మధురోదాత్తంగా చిత్రించిన కృష్ణారావుగారు అభినందనీయులు. సమగ్ర విషయావగాహనతో, పఠితను ముందుకు తీసుకొని వెళ్ళే ఆవేగపూర్ణమైన శైలితో, నుడికారపు సొంపులతో అలరారే ఈ రచన అందరినీ అలరిస్తుంది. పచ్చగా పది కాలాలు నిలుస్తుంది. కృష్ణారావుగారి ప్రతిభాలోచనం సునిశితమైనదీ, సుందరమైనదీ. ఆ ప్రతిభా చక్షువు మరికొన్ని రచనా రోచిస్సులను కురవాలనీ నా ఆశ, ఆశంసన.

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరమామోదము

శ్రీమాన్ కోగంటి సీతారామాచార్యులు

మిత్రులు శ్రీ పింగళి వేంకట కృష్ణారావుగారు నిష్కపటి, నిరాడంబరుడు. తనకు తెలిసిందే తెలుసునని, తెలియనిదేదో తెలియదని చెప్పే సాధుశీలి. తనత్రోవన తాను పోయేవాడేకాని పరుల త్రోవల్లోకి వెళ్ళి పరిహాసంపాలు కాని పండిత మౌళి. నిజంగా స్నేహపాత్రుడు. ఈ కృష్ణారావుగారు ఒకరోజు 'కాటూరివారి సాహిత్యం మీద సమీక్ష వ్రాస్తున్నాను. తమరు వినాలి' అన్నారు. మా బాబుగారి సాహిత్యం మీద సమీక్ష! ఆహా! వింటాను అన్నాను. వినిపించారు, విన్నాను.

ఈ రోజుల్లో పి. హెచ్.డి అనే పేరుతో పరిశోధన ప్రబంధాలు ఎన్నో వచ్చినై. రాగలవు కూడాను. ఆ పరిశోధనకు కొన్ని నిబంధనలు ఉన్నై. దాని ప్రకారం ఉంటే అది పరిశోధన. ఆ యేర్పాటు చేసిన మహానుభావులు ఎవరో కాని ఆ వారి సిద్ధాంతం బాగా వ్యాపించింది. ఆ పట్టం పొందినవారికి ఏదో కొంత లాభం కూడా ప్రభుత్వం అందిస్తూనే ఉంది.

కాని ఈ గ్రంథం అలాంటిది కాదు. కేవలం సాహిత్య సంసేవనమే ప్రధా నంగా పెట్టుకొని చేసిన కృషి ఫలితం. దీనినే విమర్శ అంటారు. నిజమైన డాక్టరేటు ఇది. కాని దీనివల్ల డాక్టరు అనరుగదా!

ఋషి అంటే కాటూరి వేంకటేశ్వరరావుగారే! శాంత గంభీరమైన ఆకారం, పెలితిలేని మాటతీరు, చెప్పదలచినదాన్ని క్లుప్తసుందరంగా చెప్పే ఒడుపు, కావ్యంలో నుండి కవిని దర్శించే ఉపాసనసిద్ధి, ఇతరులను ఏ మాత్రం నొప్పించని మేలి నడ వడి — ఇలాంటివి అన్నీ కలిసి కాటూరి మాష్టరుగారు. కాటూరు మాష్టరుగారి పద్యం తెలుగు రచనకు ఉదాహరణం, అలా ఉండాలి! అని విశ్వనాథవారు ఎన్నోసార్లు అన్నారు. పింగళివారు కాటూరివారు కలిసి కవిత్వం వ్రాసినా ఎవరి ఆత్మ లక్షణం వారిదిగానే ఉంది. అందువల్లనే శ్రీ పింగళి వేంకట కృష్ణారావుగారు ఒక కాటూరి వారినే ఎన్నుకొని వారి సాహిత్యాన్ని మొత్తాన్ని సమాలోచనం చేసారు. ఇందులో బాగోగులను రెంటినీ కూడా సోపపత్తికంగానే నిరూపించారు. ఇలా నిరూపించటానికే సామర్థ్యం అని పేరు. ఏ గ్రంథాన్నైనా నిష్పాక్షికంగా నిబ్బ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రంగా సమాలోచనం చేయటం అందరికీ చేతనైన పనికాదు. కొందరికి మాత్రమే అలా సమాలోచనం చేసే శక్తి ఉంటుంది. అట్టి శక్తి కలవారు శ్రీ పింగళి వేంకట కృష్ణారావుగారు.

వేంకటేశ్వరరావుగారు పౌలస్త్య హృదయం, గుడిగంటలు, పన్నీటి జల్లు, నేను—మా వాళ్లు, మా ఊరు- పద్య కావ్యాలు కాక, కొన్ని శంకరాచార్య స్తోత్రాలను కూడా తెలుగు చేసారు. అంతేకాకుండా కొన్ని దేశభక్తి గేయాలు కూడా వ్రాసారు. దేన్ని వ్రాసినా ఎంతో భావించి, ఎంతో నిబ్బరంగా వ్రాసేవారు. కాటూరి వారెంత మధురంగా నిబ్బరంగా వ్రాస్తారో ఈ పింగళివారు కూడా అలాగే మధురంగా నిబ్బరంగా సమాలోచనం చేసారంటే ఏ మాత్రం అతిశయోక్తి కాదు. పైన యక్షగానాలున్నై. అనూదితాలైన భాస నాటకాలున్నై. నవలలూ ఉన్నై. ఏది ఏ మోతాదులో ఎలా ఉండాలో అలాగే కవిగారు వ్రాస్తే, సమాలోచనం కూడా అలాగే సాగటం ఏదో జన్మాంతర సంబంధం తప్ప మరేమీ కాదు.

పౌలస్త్యుని హృదయం రాముని కోసం ఎలా ఆరాటపడిందో కొంత కొంత ఉత్తరకాండలో కనిపిస్తుంది. ఆ ఆరాటాన్ని కాటూరివారు గ్రహించి ఎంతో నిబ్బరంగా ప్రకటించారు. అలాగే సమీక్ష కూడాను. ఈ పౌలస్త్య హృదయం వైరభక్తికి ఒక విధమైన స్వరూపకల్పనం. "ఈ జగదభిఘాతి రక్కసుడె స్వామికి మిక్కిలి కూర్చు నెచ్చెలీ!" అని స్వామికి ఉన్న భక్త వాత్సల్యంలోని ఆంతర్యాన్ని ఎంతో సుఖంగా చెప్పి, అందులో కూడా తన దోషాన్ని తానే జగదభిఘాతిగా చెప్పుకోవటం ఎంత నిష్కపట లక్షణమో! ఇలాంటి విశేషాలన్నింటిని శ్రీ పింగళివారు చక్కగా సమీక్షించి సమాలోచనం చేసారు.

"కంఠదళనారంభమ్ముచే నీకు ద
ర్పితు గావించినయట్లుగాదు, మురవైరిన్ శ్రీకు నాత్మేశు స
ర్పితు గావించెడి మేటి పందువు—" ఈ వాక్య వైభవానికి చక్కని క్లుప్త సుందరమైన వ్యాఖ్య వ్రాసారు శ్రీ వేంకట కృష్ణారావుగారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'గుడిగంటలు' నామౌచిత్యం కూడా ఏ కొంచెం వదలకుండా సమాలోచన చేసారు. నానావిధాలైన సంస్కారాలా సన్నివేశాలు ఎన్నో ఎన్నో సమాలోచనలు అనుభవంలోకి తెచ్చుకొని అనుభవసాక్షికంగానే ఈ గ్రంథాన్ని వ్రాసారు.

ఒక రకంగా చూస్తే ఈ జాతి గ్రంథాలు నిజంగా అవసరం. ఇప్పుడు ఇలాంటివి రావటం లేదు. పూర్వం పత్రికల్లో ఇలాంటివి ప్రచురించేవారు. ఇప్పుడు అలాంటి పత్రికలు లేవు. ఇలాంటి దాన్ని వ్రాసి అంతట ఊరుకోక అవస్థలు పడి అచ్చు వేయించడం ఈ కష్టకాలంలో ఎలా కుదురుతుంది? కాని మా మిత్రులు శ్రీ వేంకట కృష్ణారావుగారు ఇన్ని శ్రమలకోర్చి యథార్థమైన సమాలోచనాన్ని ప్రకటించి కృతార్థులైనారు. మల్లినాథ వాక్యం సత్యం.

"ధన్యో మాఘకవికవయం చ కృతినః తత్సూక్తి సంశీలనాత్"

మొదటినుండి తుదిదాకా విన్నాను. ఆనందంతో నాయీ పరమామోదాన్ని అందిస్తున్నాను. అనుకున్నదాన్ని వ్రాయలేకపోయినాను. ఆరోగ్యం ఏ మాత్రం బాగులేదు. ఈ నా అశక్తతను క్షమించమని కోరుచున్నాను.

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరిచయం

—కోటగిరి విశ్వనాథరావు
రిటైర్డు ఆంధ్రభాషాధ్యక్షులు, ఆంధ్ర లయోల కళాశాల

"ఏషాం కావ్యానుశీలనాభ్యాసవశాత్ విశదీ భూతే మనో
ముకురే వర్ణనీయ తన్మయీభవన యోగ్యతా
తే హృదయ సంవాదభాజః సహృదయాః"

కావ్యానుశీలనం వలన హృదయం నిర్మలమైన అద్దంలా భాసిస్తుంది. అప్పుడు కావ్యంలో వర్ణితమైన విభావాదులు అందులో ప్రతిబింబిస్తవి. అప్పుడే సహృదయునకు కావ్యగత నాయకాదులతో తన్మయత్వం కలుగుతుంది. అట్టివారే సహృదయులు అని అభినవ గుప్తపాదులు సహృదయ పదమును నిర్వచించారు. అట్టి సహృదయుడు విమర్శకుడైనచో అతడు ఉత్తమ విమర్శకుడు కాగలడు.

"కాటూరివారి సాహితీ సమాలోచనము"ను పరిశీలించినచో పింగళి వేంకట కృష్ణారావుగారు ఉత్తమ విమర్శకులని స్పష్టం కాగలదు.

పింగళి కాంత సుకవితో
సంగాతము చెళ్లపిళ్ల సద్గురుకృప న
న్నుం గవిమాత్రుని గావిం
చెం గొండొక పద్యరచన చేతు చపలతన్

అని కాటూరి వేంకటేశ్వరరావుగారు వినయంతో చెప్పుకొన్నారు. కాని వారు ఉత్తమ కవీంద్రులు. వారి పద్య రచన పరమ రమణీయంగా ఉంటుంది. "ఒకప్పుడు మేము కాటూరి వేంకటేశ్వరరావుగారిలా పద్యరచన చేయాలని ప్రయత్నించేవాళ్ళం" అని విశ్వనాథ సత్యనారాయణగారి వంటివారు సెలవిచ్చారంటే కాటూరివారి పద్య రచనా శక్తి ఎటువంటిదో విదితం కాగలదు.

"అంతట నింద్రకీల గిరియంఘ్రి సమీపమునందు మేటి ధీ
మంతులు హూణపాలకులమర్చిన సేతువు హేతువై దిశా
భ్యంతర పూర్ణవీచిని చయార్భటినాథుని జేరు కృష్ణకా
కింత విలంబనమ్ము లభియించెను వేణికలల్లికొంటకున్."

విజయవాటికకడ కృష్ణకు ఆనకట్ట నిర్మించిన సందర్భంలోనిది ఈ పద్యం. "ఒక స్త్రీ భర్త కడకు త్వరగా వెళ్ళ హడావుడిలో వున్నది. ఇంతలో జడలు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సరిగా ఉన్నవా లేవా అనే అనుమానం వచ్చి క్షణంఆగి సరిదిద్దుకొని ముందుకు సాగి నది. అలాటి స్త్రీగా సముద్రుని కడకు వెళ్ళు కృష్ణను వర్ణించటంలోనే ఉన్నది కాటూరివారి కల్పనాశిల్పం అని పింగళి వేంకట కృష్ణారావుగారు పై పద్యంలోని ప్రతీయమానార్థమును చక్కగ వివరించారు.

"పరుల మేలునకై చెమరించిసానపై
జందన ఖండపై మనిన సాధ్వీమదంబకునీడువత్తురే"

త్యాగమూర్తియైన తమ తల్లిగారిని సానపై అరుగుతున్న గంధపు చెక్కతో పోల్చటం కాటూరివారి అతిలోకమయిన ఊహాశక్తికి ఉదాహరణంగా వీరు చెప్పారు.

పౌలస్త్య హృదయంలో రావణుని చిత్రీకరణను గురించి వీరు ఒక పరిశోధ నాత్మకమయిన వ్యాసం వ్రాశారు. వాల్మీకి రామాయణం మొదలుకొని, ఉత్తర గోపు రము అనే విన్నపము వరకు రామాయణ కథగల అనేక గ్రంథాలను పరిశీలించి కాటూరివారి కథా నిర్వహణ వైశిష్ట్యాన్ని, కవితా శిల్పాన్ని, పరమ ప్రామాణికంగా సిద్ధాంతీకరించారు. అందుకు వేంకట కృష్ణారావుగారు అభినందనీయులు. అయితే ఈ వివరణ లేకపోయినను కాటూరివారి పద్య రచనాశక్తి వలన, వారిలోని ప్రతిభ వలన సహృదయుడైన పాఠకునకు తన్మయత్వం కలిగి ఆనందాన్ని పొందగలడు.

వేంకటేశ్వరరావుగారు మా ఊరు అను శీర్షిక క్రింద వ్రాసిన పద్యాలలో తెలుగునాట పల్లెటూరు జీవితం ప్రతిబింబితమైనది. ఆధునిక యుగంలోని ఆంధ్ర మహాకవులందరు పల్లెటూరి జీవితాన్ని రమణీయంగా వర్ణించినవారే! వారి రచనలు చదివితే తెలుగులో మహాకవి కావాలంటే పల్లెటూరులో పుట్టి, పెరుగవలెనేమో అని పిస్తుంది.

కరువు వచ్చినప్పుడు గుమ్మడిపండులో గుడము గూరిచి వండటం, జొన్నల తొక్కునకు మజ్జిగ పోయటం, మోటమోకు జవ్వాటలను ఆలకించటం, మొదలైన పల్లెటూళ్ళకు సంబంధించిన విషయాలను వివరించిన తీరు బాగుగనున్నది.

కాటూరి వేంకటేశ్వరరావు గారికి సంబంధించిన సాహితీ విషయములను సామాన్య పాఠకుడు కూడ తెలిసికొని ఆనందించు రీతిలో "కాటూరివారి సాహితీ సమాలోచనం" అను ఒక ప్రామాణిక గ్రంథమును రచించిన పింగళి వేంకట కృష్ణారావుగారు ప్రశంసనీయులు.

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ మో ద ం

కవితాకళానిధి, నటశేఖర, కావ్యమర్మజ్ఞ
అన్నపర్తి సీతారామాంజనేయులు
బి. ఎ., బి. ఇ డి.,
బ్రాడీపేట, గుంటూరు.

మూర్తీభవించిన తెలుగుదనం శ్రీ కాటూరివారు. ఆజానుబాహు విగ్రహం, దబ్బపండు చాయ, బుఱ్ఱ మీసం, పొగచుట్ట, చేతికఱ్ఱ — ఆ పల్లెటూరి వాలకంలో ఒక హుందాతనం, నిరాడంబరత్వం, కళ్ళల్లో సౌజన్యం, బుఱ్ఱమీసాల వెనుక మంద హాసం, పలకరింపులో ఆప్యాయత, మాటల్లో మార్దవం.

నా చిన్నతనంలో మా మేనమామ కీ॥ శే॥ శ్రీ ఉన్నవ రాజగోపాలకృష్ణయ్య గారితో వెళ్ళి తొలిసారి వారిని దర్శించినప్పుడు నాలో ముద్ర వేసికొన్న రూపమిది.

ఈ రూపసంపదకు వన్నె పెట్టేది వారి సాహితీ మూర్తిమత్వం.

కాటూరి వారి పద్యం అసలు సిసలైన తెలుగు పద్యం. అంటే తత్సమ విర హితమైన అచ్చ తెనుగని కాదు — తెలుగులోని మాధుర్యమంతా 'సారం పర్వణి పర్వణి' అన్నట్లుగా వారి పద్యాల్లోంచి చదివిన కొద్దీ ఊరుతూ ఉంటుంది.

తెలుగు పలుకుబడిలోని సోయగము, తియ్యదనము తెలియాలంటే పల్లె పట్టు లకు మళ్ళాలి. పల్లెపట్టులంటే నవనాగరికతతో వచ్చిపడిన కృత్రిమత్వ, స్వార్థ పరత్వములతో కలుషితంకాని, సుమారు యాభై యేళ్ళ, ఇంకా అంతకు ముందటి పల్లెటూళ్ళు.

ఆనాటి పల్లెటూళ్ళలో సహజత్వము, సారళ్యము, హృదయ ధర్మము పొంగి పొరలింది.

ఆ యింపు సొంపులన్నీ కాటూరివారి సాహిత్యంలో కదనుత్రొక్కినాయి. అదీ అచ్చమైన తెలుగుదనం.

పల్లెపట్టుల పసందు గుండె లోతుల్లోంచి పెల్లుబికే మధుర హృదయులు మిత్రులు శ్రీ పింగళి వేంకట కృష్ణారావుగారు. కాబట్టే కాటూరి వారి సాహిత్యంలోని మధురిమలను సమగ్రంగాను, సుందరంగాను వెలువరించగలిగారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పింగళి కాటూరి జంటలో ఒకరైన శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు-

ప్రీణిత సద్రసజ్ఞుడగు పింగళి కాంతుని కావ్య శిల్ప ని
ర్మాణ ధురీణ బుద్ధిగరిమంబున కిర్వురె సాక్షులిమ్మహిన్
వాణికి వాణియైన గురుపర్యుడు చెళ్ళపిళ వేంకటేశుడున్
ప్రాణము ప్రాణమైన గుణరమ్యుడు కాటూరి వేంకటేశుడున్

అంటూ కాటూరివారిని 'గుణరమ్యుడు' అన్నారు. ఈ విశేషణం వారి సాహిత్య వ్యక్తిత్వానికి కూడా సరిపోతుంది.

ఇంతకూ చెప్పవచ్చిందేమంటే, పింగళివారు తమ 'కావ్య శిల్ప నిర్మాణ ధురీణ బుద్ధిగరిమంబునకు కాటూరివారు ఒక సాక్షి' అన్నారు.

బహుశః ఇది వారి జంట కవిత్వంలో ఎవరి పాలు ఎక్కువ? అని చర్చించే వారికి సమాధానంగా చెప్పారేమో! ఏమైనా, మరి కాటూరివారి కావ్యశిల్ప నిర్మాణ ధురీణ బుద్ధిగరిమంబునకు పింగళి వారుకూడా సాక్షి కావాలి గదా!

అందుకే కాబోలు పింగళి వంశీయులైన వేంకటకృష్ణారావుగారికి కాటూరివారి సాహితీ సమాలోచన బుద్ధి పొడమింది.

కాటూరివారి సాహిత్యం రాసిలో చిన్న అయినా వాసిలో మిన్న. వారి కావ్యాలను పదేపదే చదువుకొని ఆనందించే రసలుబ్ధులైన పఠితలకు వారి సాహిత్యాన్ని గూర్చి ఎంత చెప్పినా తక్కువగానే చెప్పినట్లనిపిస్తుంది. ఎందువల్లనంటే అలాంటి పాఠకులు కాటూరివారి సాహిత్య పఠనంవల్ల పొందే ఆనందం అనుభవైకవేద్యమే గాని మాటల్లో వ్యక్తీకరించగలిగేది కాదు. శ్రీ కృష్ణారావుగారు కాటూరివారి సాహిత్య వైభవాన్ని మాటల్లో ఎంతవరకు చెప్పటానికి వీలౌతుందో అంతవరకూ చెప్పారు.

కాటూరివారి సాహిత్యాన్ని విశ్లేషించే ఇలాంటి గ్రంథం వెలువడటం ముదావహం.

ఇందులోని ప్రతి అంశాన్ని ఆనందంగాను, సామోదంగాను చదివాను. కాటూరివారి కొండంత సాహితీ మూర్తిత్వానికిది పింగళివారు పట్టిన మణిదర్పణం. ప్రతిఫలనం ఏకదేశ మాత్రంగాకాక, సమగ్రంగాను, సంపూర్ణంగాను ఉన్నది. సాహితీసమాలోచనా పిపాసువులకిది అమృత రసాయనం.

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సాహితీ మిత్రులు



శ్రీ ఉయ్యూరు సాంబిరెడ్డి — శ్రీమతి అంజనీకుమారి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అక్షర సన్మానం

— పింగళి వేంకట కృష్ణారావు

శ్రీమంతుండయి, పాడిపంటల సదా చెన్నొందుచున్, తేల్ప్రోల్
గ్రామంబందు వసించు ధార్మికుడు చంద్రారెడ్డి, ఉయ్యూరు వం
శా ముష్యాయణు డాతడెప్పుడును, సేద్యంబందు నిష్ణాతుడై
భూమాతన్ తనవారిగూడి కొలుచున్ పుణ్యాత్ము లాహాలికుల్.

ఘనుడు చంద్రారెడ్డి గాంచెను ముదమార
వేంకటరెడ్డిని వినుత యశుని
తండ్రికిన్ సాటియాతండు భూదేవికిన్
తిలకంబు దిద్దెను హలము తోడ
వేంకటరెడ్డి, సాధ్వీమణి నాగర
త్నాంబల కుదయించె సాంబిరెడ్డి
ఆతని కర్ధాంగియైతనరెను మాన
నీయురాలగు అంజనీ కుమారి

సంతు, చంద్రశేఖరరెడ్డి, శైలజయును
మురిపె మొనగూర్ప, సంస్కార సరణిపెరుగు
వీరి సంసారమెప్పుడు విరులుపూసి
ముగ్ధ సౌరభములుచిందు పూలతోట.

బావగారు పున్నారెడ్డి భాగ్యనిధిని,
సోదరియగు సుమాదేవి నాదరాభి
మానముల గారవించును మమత తోడ
సరసు డుత్తమ గృహమేధి సాంబిరెడ్డి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హలము వదలిన ఈతండు కలముపట్టి
సర్వ వాణిజ్యశాస్త్ర నిష్ణాతుడనుచు
పేరు పొందెను, తన సరివారు మెచ్చు
సరణి, శాతవాహన కళాశాల లోన.

ఈవిధమైన చుట్టరిక మిప్పటిదా! మరిమీకుమాకు, వి
ద్యావని కొండవీటి పొలమందున బుట్టియు, రాజమహేంద్రి గో
దావరి తీరభూములకు తానెగ్రబాకియు, మూదుపూవులై
భావి తరాలవారలకు పండెను తీయగ నారుకాయలై.

అడుగుట చేతగాదు మరియాదనుగోల్పడి, వాణికై యెటో
కడిగి కరంబు క్రిందిడిన గాని, పయిన్ చెయి నాదియే యనం
బడు నొకతత్త్వమెప్పుడును బాయదు నామనమందు, దీనికిన్
చిడిముడిపాటులేక నిటుజేసె సహాయ్యము యెంతమేటియో.

అభ్యుదయ భావ లోలుడు, అంజనీ కు
మారి రమణుడు, వితరణ చారు శీలి
సాంబిరెడ్డి ఉయ్యూరువంశ ఘనకీర్తి
సాహితీ సమారాధన చక్రవర్తి.

వీరి వంశంబు నిత్యంబు వృద్ధిబొంది
తరుగని ధనధాన్యములచే తనరు గాత
ఆయు రారోగ్య విద్యల నంద జేసి
సతత మార్వాణి వీరల సాకు గాత.

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అభివందనము

ఒకరోజు భువన విజయ సంస్థ అధినేతలు నా మిత్రులు శ్రీ గానుగపాటి వేంకట హరనాథ్‌గారు మా ఇంటికి వచ్చి "మేమొక సభ ఏర్పాటు చేస్తున్నాం, దాంట్లో మీరు కాటూరివారి గురించి ప్రసంగించాలి" అన్నారు. "సరే" అన్నాను. అప్పుడు "పౌలస్త్య హృదయం", "గుడిగంటలు" పుస్తకాన్ని శ్రద్ధగా చదివాను. అప్పుడనిపించింది! కాటూరి వారిని గురించి వ్రాయవలసింది చాలా ఉన్నదని. ఆ తరువాత కాటూరి వారి పన్నీటిజల్లులో మునకలు వేయాలని చేసిన ప్రయత్నానికి ఫలితమే ఈ గ్రంథం. ఇది దీని పూర్వ రంగం.

కాటూరివారి గ్రంథాలన్నీ ఇచ్చి, సాహిత్య ధర్మకర్తలు శ్రీ గూడూరి నమశ్శివాయగారు నన్నీ రచనకు ప్రోత్సహించారు. పద్యకావ్యాల వరకు రచన పూర్తిచేసి కాటూరివారి నెరిగిన మాన్యులు శ్రీ కోటగిరి విశ్వనాథరావు గారికి చూపించాను. వారు చాలా బాగున్నదని ప్రశంసించి వెన్నుతట్టారు. ఇప్పుడు పరిచయ వాక్యాలు వ్రాసి ఆశీర్వదించారు. నాకు ఆప్తులు, ఆత్మీయులు శ్రీ మహతీ శంకర్ గారికి ఆ పుస్తకాన్ని చూపించినప్పుడు, రచన బాగున్నదని, అనువాదాలతో సహా సమగ్రంగా వ్రాయమని ప్రోత్సహించారు. ముద్రణ విషయంలో గ్రంథం అంతా చదివి తగు సూచనలిచ్చారు. కాటూరివారి విషయాలేమైనా చెబుతారేమోనని ఒకనాడు శ్రీమాన్ కోగంటి సీతారామాచార్యులవారి దగ్గరకు వెళ్ళాను. వారు "కాటూరివారంటే నాకెంతో అభిమానం, ముందు అసలు నీవేం వ్రాశావో ప్రతి అక్షరం నేను వినాలి. వినిపించు వింటాను" అన్నారు. విని వాత్సల్యంతో చాలా బాగున్నదని హర్షామోదాలు వ్యక్తం చేస్తూ, అక్కడక్కడ జారిన నెరసుల్ని సరసాలుగా మార్చారు. కులపతిగారిని చూస్తేనే ఒక ఉత్సాహం. వారి దరహాసమే ఆశీర్వచనం. వారు నాకు ఆప్తవాక్యం అందించారు. వీరందరికి కృతజ్ఞతాభివందనములు.

నేను నా చిన్నతనంలో ఒకసారి పింగళి లక్ష్మీకాంతం గారిని దర్శించాను. వారు "మీ ఇంటి పేరేమిటి" అన్నారు. "పింగళి" అన్నాను. "ఆ విషయం బాగా గుర్తుంచుకో" అన్నారు. తరువాత గుంటూరులో చదివేటప్పుడు కరుణశ్రీ గారి ఇంటిప్రక్కన ఉండేవాణ్ణి. వారిని చూచినప్పుడల్లా లక్ష్మీకాంతంగారి మాట గుర్తుకు వచ్చేది. పాపయ్యశాస్త్రిగారిని ఆరాధనా భావంతో బాబాయిగారని పిలిచే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వాణ్ణి. మరి వారి గాలి ఎంత సోకిందో! లక్ష్మీకాంతంగారి మాటల్లోని ధ్వని నా యెడల ఎంత ప్రదీపమానమయిందో సందేహమే! వారు నాకు ఆశీర్వచన మందించారు. వారి వాత్సల్యానికి నా నమస్సులు. అయినా! సంజ్ఞకు, సౌరభానికే తృప్తిపడి, ఇంకేదో అందలేదని బాధపడి ఏం ప్రయోజనం. ఇప్పుడు దీంతో తృప్తి పడతారేమో! జాగ్రత్త! అంటూ, స్వభావంచేత మిత్రులు, ప్రభావంచేత పెద్దలైన శ్రీ బేతవోలు రామబ్రహ్మంగారు లోచనంతో సూచించినందుకు కృతజ్ఞుడిన్ని. డా॥ తమ్మారెడ్డి నిర్మలగారు ఓపికతో ప్రతి అక్షరం చదివి ఇది సిద్ధాంత గ్రంథమే నని హర్షం వ్యక్తం చేశారు. వారి సౌజన్యం అలాటిది. చిన్నప్పటినుండి నన్నెరిగిన అనపర్తి సీతారామాంజనేయులుగారు, ఈ రచనకు ఆమోదాన్ని తెలిపారు. డా॥ ఎల్లూరి శివారెడ్డిగారు సాహితీ సమ్మానాన్ని అందించారు. అందరకు కృతజ్ఞతాంజలి.

కృష్ణాపత్రిక లందించి ఈ రచనకు తోడ్పడ్డ వేటపాలెం గ్రంథాలయం లైబ్రేరియన్ శ్రీ కె. సుబ్రహ్మణ్యంగారికి, విజయవాడ రామమోహన గ్రంథాలయం లైబ్రేరియన్ శ్రీ తుర్లపాటి రాఘవేంద్రరావుగారికి, ముద్రణలో చేయూతనిచ్చిన శ్రీ ఉయ్యూరు సాంబిరెడ్డిగారికి, ఆర్థిక సహాయం అందించిన తెలుగు విశ్వవిద్యాలయం వారికి, సమాచారమందించిన కాటూరి వేంకట కృష్ణశర్మగారికి, కాటూరి విజయసారధి గారికి కృతజ్ఞతలు. ఈ గ్రంథం వ్రాతప్రతిని సిద్ధంచేసిన నా కుమార్తె చి॥ల॥సౌ॥ కనకదుర్గకు నా ఆశీస్సులు.

నా హంసపాదుల్ని హంస నడకలుగా మార్చి ముద్రించిన శ్రీ రాఘవేంద్ర ప్రింటర్స్ సోదరులు మాధవశర్మ, జవహర్ గారులకు, హంసవాహనను తీర్చిదిద్దిన బాలీ గారికి, ముద్రించిన భూషణంగారికి అభినందనలు.

ఇంతకు, ఈ గ్రంథ రచన చేయటం కాటూరివారు మహాకవులని చెప్పటానికి కాదు. వారు లబ్ధప్రతిష్ఠులు. ఆ మహనీయుని కవిత్వపు వెలుగులో మరచిపోతున్న గ్రామీణ జీవిత విశేషాలు ప్రదర్శించటం, సామాన్య పాఠకుడికి కూడ అందుబాటులో ఉండేటట్లు ఒక్కచోట కాటూరివారి జీవిత, కవితా విశేషాలు పొందుపరచటం నా లక్ష్యాలు. మూలందాకా పోకపోయినా, ఇంతో అంతో ఆనందం అందరికి దక్కాలని నా ఆకాంక్ష. ఇక ఈ గ్రంథం మీది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విషయసూచిక

★

ప్రస్తావన

I. పద్యకావ్యములు

1. నేను — మా వాళ్ళు — మా ఊరు 5

కాటూరివారి వంశము; వేంకటేశ్వరరావు—గ్రామీణ జీవితం — కవితాశిల్పం.

2. పౌలస్త్య హృదయం 33

రామాయణ పూర్వకాండల్లో పౌలస్త్య హృదయం — ఉత్తర రామాయణాలల్లో పౌలస్త్య హృదయం — వైరభక్తి — పౌలస్త్య హృదయంలో వైరభక్తి - పౌలస్త్య హృదయమొక సంక్షిప్తరామాయణం- కథా నిర్వహణ; కాటూరి తీర్పు నేర్పు - కవితాశిల్పం

3. గుడిగంటలు 67

"గుడిగంటలు" "పౌలస్త్య హృదయం" రచనాకాలం—నామౌచిత్యం- మేలుకొలుపు — హింసా నిరసనం — హరిజన సమస్య — ఆత్మభక్తి భావన — కవితాశిల్పం.

4. పన్నీటి జల్లు 93

నామౌచిత్యం — కాటూరివారి రాజకీయ స్ఫూర్తి — ప్రపంచయుద్ధం; కాటూరివారి స్పందన — ఆంధ్రోద్యమం: కాటూరివారి స్పందన — ఆధ్యాత్మిక ప్రవృత్తి — బాల సాహిత్యం — కవితాశిల్పం.

II. రూపకములు

ముద్దుగోపాల — పునఃప్రతిష్ఠ — నిగమశర్మ — నాగార్జునకొండ 150
డాక్టర్ — రాధ — పెద్దన; కృష్ణరాయలు — శ్రీనివాస కల్యాణం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

III. వ్యా స ము లు

విమర్శకళ — మా బాపిరాజు — పేరిగాడు — విదురుని విందు — మధుర భారతి; మా బుచ్చి సుందరుని స్మృతి—సరస్వతీ చతుర్ముఖుల శృంగారం — మా గురుదేవులు — చిత్రశాల — శంభుదాసుని సాత్వికత—ఆశుకవిత్వం—నవల సంఘ సంస్కారం — రవీంద్రుడు: తపోవన సందేశం. 180

IV. అ ను వా ద ము లు

1. సంస్కృతానువాదములు — పద్యకావ్యములు 203

దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రం — సౌందర్యలహరి — ఒక చాటువు.

2. సంస్కృతానువాదములు — నాటకములు 210

భాసుడు: కాటూరివారు — ప్రతిజ్ఞా యౌగంధరాయణం, కథా సంగ్రహం — అనువాదపు తీరుతెన్నులు — అనువాద విశేషాలు. స్వప్న వాసవదత్తము; కథా సంగ్రహం — అనువాద విశేషాలు.

3. ఆంగ్లానువాదములు — జీవిత చరిత్రలు 246

సత్యశోధన: అనువాద విశేషాలు — కవీంద్ర కథ — మౌలానా అబుల్ కలామ్ అజాద్.

4. ఆంగ్లానువాదములు — నవలలు 261

నల్లకలువ; విశేషాలు — ముగ్గురుమూర్తులు; వింతలు విశేషాలు.

5. ఆంగ్లానువాదములు — నాటికలు 274

సీత పెండ్లి — ధర్మపథము — భావ బంధనము

V. పూర్ణపురుషుడు కాటూరి

కాటూరివారి మిత్రులు — చమత్కారాలు — సుమాంజలి. 281

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రస్తావన

శ్రీ నిలయమైన ఆంధ్రావనిలో 19వ శతాబ్ది ఉత్తరార్ధాన కాలపురుషుడు రత్నాలు ప్రవిపోశాడు. అందులో కొన్ని రత్నాలు స్వాతంత్ర్యోద్యమ ఖడ్గంలో పొదగబడితే, మరికొన్ని సంస్కరణోద్యమ పతాకంలో మెరసిపోయినవి. మరి కొన్ని రత్నాలు వాణీవేణీ సుమాలుగా దివ్యాభరణ ధరణ మణిగణాలుగా భాసించినవి. ఎక్కడున్నా ఒకే కాలంలో జన్మించటం వల్ల కాబోలు కొంత సామాన్య ప్రకాశం, స్వభావం వాటి కలవడింది. దివ్య స్వాతంత్ర్యోద్యమం, భవ్య సంస్కరణోద్యమం, నవ్య సాహిత్యోద్యమం ముప్పిరిగొన్న రోజులవి. అప్పుడు పలుకుచేడియ కంఠ హారములో మెరసిన మణి మాణిక్యాలకు లెక్కలేదు. అందులో ఒక అపూర్వమైన జంట నన్నాకర్షించింది. రెండూ రెండే! రెండు కలిసి ఒకటిగానే భాసిస్తున్నవి. అయినా దేని ప్రకాశం దానికి ఉండనే ఉన్నది. అందులో ఒకదాన్ని ఈ అద్దంలో ప్రతిఫలింపజేస్తే ఎలా ఉంటుంది! ఆ ఆలోచనే నన్ను ఈ గ్రంథ రచనకు ప్రేరే పించింది.

19వ శతాబ్ది పూర్వార్ధంలో-అందునా చివరి దశకంలో వాగ్దేవికి మహర్దశ పట్టింది. తిరుపతి వేంకట కవులు, కొప్పరపు సోదర కవులు, పందిళ్ళు వేసి కవితా సంతర్పణం చేశారు. వారి అవధానాలు జరుగుతుంటే సామాన్య రైతులు కూడా చుట్టుప్రక్క పల్లెల నుండి బండ్లు కట్టుకొని వచ్చేవారట. చదువుల తల్లి, తన పిల్లలు గిల్లి కజ్జాలు పెట్టుకుంటూ ఒకసారి నాది పైచేయంటూ, మరొకసారి నాది పై చేయని గంతులేస్తుంటే, అన్ని విజయాలు తనవిగానే భావిస్తూ మురిసి పోయిన రోజులవి. అది తిరుపతి కవుల తరం. ఎంతో రసవత్తరం. విశ్వనాథ సత్యనారాయణ, వేలూరి శివరామశాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, గడియారం వేంకట శేషశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖరశర్మ, రాయప్రోలు సుబ్బారావు, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, దువ్వూరి రామిరెడ్డి, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, అడవి బాపిరాజు, దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి, పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంక టేశ్వరరావు, వేదుల సత్యనారాయణశాస్త్రి ఇలా ఎందరో ప్రఖ్యాత కవి పండితులు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ పదీ సంవత్సరాలలో జన్మించినవారే. తెనుగు సాహిత్యం వీరి కాలంలో క్రొత్త పుంతలు త్రొక్కింది.

ఆధునికాంధ్ర సాహిత్యంలో పింగళి, కాటూరి, కవులకొక ప్రత్యేకమైన స్థానమున్నది. జంట కవులుగా వీరు ఆధునిక పంచ కావ్యాలలో ఒకటైన సౌందరనందాన్ని, తొలకరిని రచించారు. మధుర పండిత రాజం, తేజోలహరి, గౌతమ వ్యాసాలు, కుమార వ్యాకరణం, ఆంధ్ర వాఙ్మయ చరిత్ర మొదలైనవి లక్ష్మీకాంతం గారు విడిగా రచించిన కృతులు. సమాన ప్రతిభా పాటవాలు గల వీరి కవిత్వము సమష్టిగా ఎంతటి సుందర మధుర రసాన్వితమో, వ్యష్టిగా అంతకుమించి కవితా శిల్ప నిర్మాణ చాతుర్య విలసితము.

ప్రస్తుతానికి కాటూరి వారికి మాత్రం పరిమితమవుతూ, వారి జీవిత విశేషాల్ని, కవితా విలాసాల్ని, ప్రతిభా పాటవాల్ని పరిశీలించే ప్రయత్నమిది. పింగళి లక్ష్మీకాంతంతో కలిసి తొలకరిలో పులకరించిన వీరి కలం నుండి పద్యకావ్యాలు, నాటికలు, వ్యాసాలు, సంస్కృత, ఆంగ్లానువాదాలు వెలువడినవి. "మాఊరు", "పౌలస్త్య హృదయము", "గుడిగంటలు", "పన్నీటి జల్లు" - వీరి పద్యకావ్యాలు. "మువ్వ గోపాల" వీరి రేడియో రూపకాల సంపుటి. "శ్రీనివాస కళ్యాణం" వీరి యక్షగానం, "సాహిత్య దర్శనము" వీరి వ్యాస సంకలనం. "సౌందర్య లహరి", "దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రం," "శివాపరాధ క్షమాపణ స్తోత్రం" - సంస్కృతం నుండి అనువదించిన పద్య రచనలు. "స్వప్న వాసవదత్త", "ప్రతిజ్ఞా యౌగంధరాయణం" వీరనువదించిన సంస్కృత నాటకాలు. సత్యశోధన అనే గాంధీ కథ, కవీంద్ర కథ, మౌలానా అబుల్ కలామ్ అజాద్ వీరు ఆంగ్లం నుంచి అనువదించిన మహాపురుషుల జీవిత చరిత్రలు. "నల్ల కలువ", "ముగ్గురు మూర్తులు" వీరు ఆంగ్లం నుండి అనువదించిన నవలలు. "సీత పెండ్లి", "ధర్మపథము", "భావ బంధనము" అనేవి వీరు ఆంగ్లం నుండి అనువదించిన నాటికలు. "కావ్యమాల"- వీరు ఢిల్లీ సాహిత్య అకాడమీ కోసం చేసిన సంకలన గ్రంథం.

కవులలో కొందరు విషయ ప్రధానంగాను, మరికొందరు రసప్రధానంగాను రచనలు చేస్తుంటారు. విషయ ప్రధానంగా కావ్య నిర్మాణం చేసే కవులకు తాము నమ్మిన సిద్ధాంతం వ్యక్తం చేయటమే ప్రధాన లక్ష్యం. ప్రాచీనులైన శివకవులు, ఆధునికులైన మార్క్సిస్టు కవులు ఈ శాఖలోని వారే. మరికొందరిది రసదృష్టి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వీరు ఆయా సన్నివేశాలలో రస నిర్వహణకే ప్రాధాన్యమిస్తారు. కాళిదాసు మేఘ సందేశ కావ్యాన్ని రసప్రధానంగా నిర్మించాడు. ఆధునికులైన భావకవుల కవితా సృష్టికూడ రసప్రధానంగానే సాగింది. రసవాదులైన కవులకు సిద్ధాంత రాద్ధాంతాల పైన, న్యాయా న్యాయాలపైన పెద్దగా దృష్టిపోదు. ఇద్దరు యువతీ యువకుల ప్రణయంలో ఉన్న ధర్మాధర్మ ప్రసక్తికంటే శృంగారరస ప్రవృత్తే వీరికి ముఖ్యం. వీరు ఉరి తీయబడే హంతకుణ్ని చూసి న్యాయం అమలు జరుగుతుందని సంతోషించరు. చివరి క్షణంలో మృత్యుముఖంలో వాడు పడే ఆవేదన, వాడి భార్యాపిల్లల దుఃఖం— వీరిని కదిలిస్తుంది. ఆ సన్నివేశం ఆయా కవుల కలాలనుండి కరుణ రసప్రవాహంగా జాలువారుతుంది. విషయానికి రసానికి సమ ప్రాధాన్యమిస్తూ ఔచిత్యాన్ని పాటిస్తూ రచన సాగించగల నన్నయ, తిక్కన వంటి మహాకవులు ఏ భాషా సాహిత్యంలోనైనా పరిమితంగానే ఉంటారు.

కథా వస్తువును దృష్టిలో పెట్టుకొని చూస్తే రచనలు సమకాలీనాలు, సర్వకాలీనాలు అని రెండు విధాలు. ఈ రెంటిలో దేనికి ప్రాధాన్యమిచ్చినా రెండవదాన్ని కలుపుకొనకపోతే, ఆ రచనకు, రచయితకు గౌరవాదరాలు ఎక్కువ కాలం నిలవవు. అందువలన ఆలోచనా పరులయిన కవులు, తమ గ్రంథం కొన్ని కాలాలపాటు నిలవాలనుకునేవారు తమ రచనలను సమకాలీన, సర్వకాలీనాలుగా తీర్చిదిద్దుతారు.

కాటూరి వేంకటేశ్వరరావుగారిది ప్రధానంగా రసదృష్టి. సమకాలీన, సర్వకాలీనాలను మేళవించిన కవితా సృష్టి. వీరి రచనల్లో రసానికి, చమత్కారానికి ప్రాధాన్యం గోచరిస్తుంది. విషయం ఎప్పటిదైనా విధానంలో విశ్లేషణలో ఆధునిక స్పర్శ ఉంటుంది.

—0—

కాటూరివారి కవిత్వంలో తెలుగు పలుకుబడి, గ్రామీణ వాతావరణం, గాంధేయ వాదం, చాలచోట్ల మనం చూడవచ్చు. స్వతంత్రమైన భావన, సరసమైన రచన మనసెంతో ఆహ్లాదం కలిగిస్తుంది. వారి లఘు కావ్యాలలో, వ్యాసాలలో, నాటకాలలో, అనువాదాలలో పరామర్శించవలసిన ఆయా విషయాలెన్నో ఉన్నవి. ఇక శిల్పం విషయానికొస్తే అది ఎంతో సముచిత సుందరం, ఆయన సౌంధరనంద శిల్పాలలో ఒకటుష గదా!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"క్రియాయాం కౌశలం శిల్పం" అని పెద్దలు శిల్ప శబ్దాన్ని నిర్వచించారు. కవితా శిల్పం బహుముఖాలుగా ఉంటుంది. శబ్దంలో, శైలిలో, అలంకారంలో, ధ్వనిలో, కవి తనదైన నిర్మాణ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంటాడు. ఆ నైపుణ్యమే శిల్పం. అది మహా కావ్యమయినపుడు కవి తన కౌశలాన్ని అనేక విధాలుగా ప్రదర్శించే వీలు కలుగుతుంది. అలాంటి గ్రంథాలు పరామర్శించేటప్పుడు ఏ శిల్పాని కాశిల్పం విడిగా వివరించవచ్చు. కాని లఘుకావ్యాల విషయంలో అది అంత సొగసుగా ఉండదు. అందువలన కాటూరివారి లఘుకావ్యాలను పరిశీలించేటప్పుడు ప్రతి కావ్యానికి అనుబంధంగా అందులో గల వివిధ శిల్ప చాతుర్యాల్ని సమష్టిగా పరామర్శిస్తేనే బాగుంటుంది.

కాటూరి వేంకటేశ్వరరావుగారు పల్లెటూర్లో పుట్టారు. అక్కడే పెరిగారు. ఆయన పొలమున్న వ్యవసాయదారుడు. హృదయమున్న ఉదారుడు. తాను కవి, ఎందరో కవులను ఆదరించాడు. ఆయన గాంధేయవాది. కవితా సౌందర్యవేది. బుర్రమీసాలు, ఖద్దరు పంచె లాల్చీ, దబ్బపండు లాంటి శరీరం - గంభీరమైన భారీ విగ్రహం - పొరచుట్ట. అతడు మూర్తీభవించిన తెలుగుదనం, లక్ష్మీకాంతం తెలుగు దట్టాకు చేదోడు వాదోడు. అలనాటి ముట్నూరి దర్బారుకు తెలుగు వెలుగు.

—0—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

FORWARDED FREE OF COST AND
WITH THE COMPLIMENTS OF THE
DEPT. OF EDUCATION, GOVT. OF
INDIA, NEW DELHI.

I. పద్య కావ్యాలు

కాటూరివారి పద్య కావ్యాలలో ముఖ్యమైనవి "పౌలస్త్య హృదయము" "గుడిగంటలు." ఈ రెండు కావ్యాలను అన్నగారికి అంకితం చేస్తూ వ్రాసిన అవతారికలాంటివి "నేను" "మావాళ్లు, మా ఊరు." కాటూరివారు మరణించిన తరువాత ప్రచురింపబడ్డ ఖండకావ్య సంపుటి "పన్నీటి జల్లు."

"పౌలస్త్య హృదయం" వేంకటేశ్వరరావుగారి కల్పనా కౌశలానికి, పాత్ర చిత్రణా నైపుణ్యానికి, నాటకీయ శిల్పానికి ప్రతిబింబం కాగా, "గుడిగంటలు" వారి గాంధేయవాద విశ్వాసానికి, సంస్కరణ దృష్టికి నిదర్శనం. అనేక సందర్భాలలో విభిన్నమైన అంశాలపై కాటూరివారు చెప్పిన పద్యాల సంకలన గ్రంథం "పన్నీటి జల్లు." కాటూరివారి రాజకీయ, ఆధ్యాత్మిక జీవితాన్ని మనకు పట్టి ఇచ్చే మచ్చుతునకలు, పట్టుకుచ్చులు దీంట్లో పద్యాలు.

"పౌలస్త్య హృదయం" కథాకావ్యం; "గుడిగంటలు" సాంఘిక సమస్యా కావ్యం. ఈ రెండు కావ్యాలను సమీక్ష చేస్తూ, "పన్నీటి జల్లులో" కాటూరివారి వ్యక్తిత్వాన్ని పరామర్శిస్తూ, "మా వాళ్లు, మా ఊరు" కావ్యంలో వేంకటేశ్వర రావుగారి వంశకథనాన్ని, నాటి గ్రామీణ జీవితాన్ని వివరిస్తూ, ఈ మహాకవి పద్య కావ్య సౌందర్యాన్ని అందిస్తాను.

నేను — మా వాళ్లు, మా ఊరు

కాటూరివారు "నేను" అనే శీర్షిక క్రింద వ్రాసిన పద్యాలు తనను గురించి చెప్పుకున్నవి. "మా వాళ్ళు, మా ఊరు" అనే శీర్షిక క్రింద ఎనభైయైదు పద్యాలున్నవి. ఇవన్నీ ఒక్కమారు వ్రాసినవి కావు. పద్దెనిమిదవ పద్యంనుండి నలభైవ పద్యందాకా ఉన్న పద్యాలు "మా ఊరు" పేరుతో కృష్ణా పత్రిక 1959వ సంవత్సరం సంక్రాంతి సంచికలో ప్రచురింపబడ్డవి. ఈ ఇరవైమూడు పద్యాలలో "తొలికోళ్ళ మెచ్చరింతలు...." "వేగుట లెప్పుడెప్పుడను...." "చేపుల్ వచ్చి మొగమ్ము లెత్తి...." అనే మూడు పద్యాలు "అరుణు డుదయించునదిగా...." అనే పద్యంతో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కలిపి "పన్నీటి జల్లు"లో "పేగుటోక" అనే శీర్షిక క్రింద ప్రచురింపబడ్డవి. ఈ నాలుగు పద్యాల్ని వారు 1931 సం॥లో వ్రాశారు. వీటిలో "అరుణు డుదయించు నదిగో...." అనే పద్యాన్ని "మా ఊరు"లో ఎందుకు చేర్చలేదో తెలియదు. అయితే కొద్దిగా మార్పు చేస్తే కాని ఆ పద్యం ఈ పద్యాలలో ఇమడదు. దీన్నిబట్టి చూస్తే 1931 సం॥లో వ్రాసిన పద్యాలకు కొన్ని చేర్చి 1959వ సంవత్సరంలో కృష్ణా పత్రికలోను, వాటికి కృష్ణానది ఆనకట్ట కట్టిన తరువాత డెల్టా పరిస్థితులను తెలిపే మరి నాలుగు పద్యాలను, తన వంశవర్ణనకు సంబంధించిన పద్యాలను జోడించి "పౌలస్త్య హృదయం" "గుడిగంటలకు" పీఠికగా "మా వాళ్లు, మా ఊరు" అని ఒకే శీర్షిక క్రింద పొందుపరచారని తెలుస్తున్నది. అందువల్ల మా ఊరును ప్రత్యేక కావ్యంగా చెప్ప వచ్చు. దీంట్లో ఆనాటి పల్లెజీవితం సమగ్రంగా చిత్రింపబడ్డది. మిగిలిన పద్యాలలో కాటూరివారు తమ వంశ వర్ణనం చేశారు. తనవాళ్లు, తన ఊరిలోనే ఉన్నారు. తనుమాత్రం అక్కడకంటె బయట ఉండటమే ఎక్కువ. అందుకే "నేను" శీర్షికను విడిగా ఉంచి "మా వాళ్లు" "మా ఊరు"ను ఒకే శీర్షికగా చేశారు. ఇది ఇక్కడి చమత్కారం. తన వంశ వర్ణనంతో ప్రారంభించి మధ్యలో ఇతర గ్రామస్తులను, గ్రామీణ జీవితాన్ని గురించి చెబుతూ, చివర తమ వంశ ప్రశస్తితోనే ఈ పద్యాలను ముగించటంతో ఆ గ్రామంలో తమ వంశానికున్న ప్రాధాన్యాన్ని చెప్పక చెప్పినట్లయింది. "మా ఊరు, అక్కడి వారందరు మా వాళ్ళే" ఇది మరో చమత్కారం. అంతేకాదు గ్రామాధికారులైనవారు అలా భావించటం సముచితం; అది వారి సౌజన్యం.

కాటూరి వారు ఇలా తన వంశ వర్ణనం చేయటం చూస్తుంటే పింగళి సూరన గుర్తుకు వస్తున్నాడు. ఒకప్పుడు సూరన గారికి అసంతృప్తి కలిగింది.

"జనము ల్మెచ్చగ మున్రచించితి నుదంచద్వైఖరిం గారుడం
బును శ్రీరాఘవ పాండవీయము గళా పూర్ణోదయంబున్మఱి
న్దెనుగుం గబ్బము లెన్ని యేనియును మత్పిత్రాది వంశాభి వ
ర్ణన లేమిం బరితుష్టి నాకవి యొనర్పంజాల వత్యంతమున్"

(ప్ర. భా. పీ. 6)

గరుడ పురాణం. రాఘవ పాండవీయం, కళాపూర్ణోదయం జనములు మెచ్చే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

టట్లు రచించాడు. కాని ఆ కావ్యాలలో తన వంశ వర్ణనం చేయలేదే అని ఒక అసంతృప్తి!

మరి ఇప్పుడు అలాంటి అసంతృప్తే కాటూరివారికి కలిగింది.

"కవికుల వంద్య మౌ కవిత గల్పన చేయని చింత నామదిన్
దవులదు సుంత! ఏదో కవి నామము దాల్చిన దాని కీశ్వర
స్తవ మయినన్ మదన్వయ కథా విధమేనియు జెప్పనైతి న
న్న వెలితి యప్పుడప్పుడ మనంబున దోచి దిగుల్లనించెడెన్"

(నేను ప. 4)

1932 నాటికే సౌందరనందం అచ్చు పడింది. అది గురువు గారికి అంకితం. ఆ కావ్యంలో కాటూరివారు తన వంశాన్ని గురించి చెప్పుకోలేదు. అది ఆయనకు కొరతగా కనబడ్డది.

అప్పుడు సూరనగారు పితృ పూజనం ఎలా చేయాలి అని చింతించాడు.

"గయలో గాశి బ్రయాగ శ్రీగిరిని గంగాద్వార నీలాచలో
జ్జయనీ ద్వారకలం దయోధ్య మధురన్ సంస్తుత్య పుణ్యస్థలా
గ్రియత న్వెండియు మించు నైమిశ కురుక్షేత్రాదులం దర్పణ
క్రియచే నా పినతమ్ము డెట్టిన యొనర్చెం దండ్రి కాహ్లాదమున్"

(ప్ర. భా. పీ. ఠి. ప. 8)

తన చిన్న తమ్ముడు అయోధ్య. మధుర, మాయా, కాశీ మొదలైన పుణ్య క్షేత్రాలు దర్శించి అక్కడ శ్రాద్ధ తర్పణాదులచేత పితృ దేవతల్ని తృప్తి పరచాడు. మరి తానవేం చేయలేదు. తండ్రిని అర్చించటమెలా!

"ఏనుం బితృ పూజన నా
చేనైన న్శైద్ధిమైన జేయగ వలయున్
గాన కృతి యిచ్చి మేదిని
పై నిలుపుదు నతని కీర్తి బరమేశు కృపన్" (ప్ర. భా. పీఠి ప. 9)

"నా చేతనైనట్లు ఏదో విధంగా పిత్రార్చనం చేస్తాను. ఈ కావ్యాన్ని అంకిత మిచ్చి నా ఋణం తీర్చుకుంటాను" అని నిర్ణయానికి వచ్చి, తన వంశ వర్ణనాన్ని కృతికి ముందుగా నిలిపి, ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యాన్ని రచించి, తండ్రి అమరా మాత్యునికి అంకితం చేశాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరి వారి పరిస్థితి కూడా సరిగ్గా ఇలానే ఉన్నది. సూరనగారు తన తమ్ముడు తీర్థయాత్రలు చేశాడంటే కాటూరి వారు నేను చేయలేదంటున్నారు.

"చేసి యెఱుంగ దేవతల సేవలు, తీర్థములాడ, క్షేత్ర సం
వాస మొనర్ప, విప్రుల సపర్య లొనర్పను, పైతృకమ్ము శ్ర
ద్ధా సహితుండనై సలుప, దానము ధర్మ మెఱుంగ, సంజకున్
దోసిలి యొగ్గ నెన్నడు అధోగతికే చెయి సాచుదున్ సదా"

(నేను ప. 5)

మరి పితృరుణం తీర్చుకోవటం ఎలా ? సూరనగారు చూపిన మార్గమే!

"అప్రయత్నముగా నాకు నబ్బినట్టి
కవన లేశమ్ము మద్వంశ కథనమున గృ
తార్థమగు నంచు నద్దాన దలగుబో పి
తృణ భారమ్మటంచు నూహించుకొంటి"

(నేను ప. 7)

సూరనగారు తండ్రికి అంకిత మిచ్చాడు. కాని కాటూరి వారి పరిస్థితి వేరు. బుద్ధి తెలిసీ తెలియనప్పుడే ఆయనకు పితృ వియోగం కలిగింది.

"ము_త్తెములును బవడములు గ్రుచ్చిన సరమ్ము
వ్రేల బసిడి పలకవోలె మెరయు
తండ్రి యురము స్మృతికి దవులు నీ నాడు ద
ద్వదన చంద్ర వైభవమ్ము నెరుగ"

(మా వాళ్ళు, మా ఊరు - ప. 64)

తండ్రి ముఖం కూడా ఆయనకు గుర్తు లేదు. జ్యేష్ఠభ్రాత రామకృష్ణయ్య గారే పితృ సమానులై వేంకటేశ్వరరావుగారిని పెంచి పోషించారు. అందువల్ల తన కృతులు "పౌలస్త్య హృదయం", "గుడిగంటలు" రెండింటిని అన్నగారికి అంకితం చేశారు కాటూరి వారు.

"ఇంక నే గృతులల్లుట యిల్లగాన
ఈ కృతులు రెండు స్వర్లో కమేగినట్టి
యన్నకున్ రామకృష్ణయ్య కంకితమ్ము
సలుపుదు బితృణ భారమ్ము దలగుపొంటె"

(పౌ. హృ కృతి సమర్పణం ప. 21)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పింగళి సూరన అంటే అభిమానం గల కాటూరివారు. ఆయన మార్గంలోనే కృత్యాదిన వంశ వర్ణనం చేసి కృతిని అన్నగారికి అంకితమిచ్చి పితృ ఋణ విముక్తులైనారు.

కాటూరి వారి వంశము - వేంకటేశ్వరరావు

కాటూరి వేంకటేశ్వరరావుగారు 15 అక్టోబరు 1895 సంవత్సరంలో కృష్ణా జిల్లా కాటూరు గ్రామంలో జన్మించారు. తండ్రి వేంకట కృష్ణయ్యగారు, తల్లి రామాంబగారు. దత్తత తండ్రి కొండయ్యగారు, తల్లి లక్ష్మమ్మగారు.

కాటూరివారు పూర్వం నుండి కాటూరివారు కాదు. వీరి పూర్వీకులు మొదట చదలవాడ నివాసులు. ఆ వంశంలో కొందరు కల్పటం చేరి "కల్పటం" వారయినారు. వారిలో ఒక శాఖ కాటూరుకు తరలి వచ్చింది. ఆ శాఖలోనివారే కవి వేంకటేశ్వరరావు. కాటూరివారు శ్రీవత్స గోత్రులు. ఆరువేల నియోగులు. వీరు ప్రబంధ పరమేశ్వరుడైన ఎర్రన వంశంలోని వారని ప్రతీతి. వేంకటేశ్వరరావుగారి ముత్తాత వేంకటరెడ్డిగారు. "రెడ్డి" శబ్దం బ్రాహ్మణుల నామాంతంలో ఉండటం అరుదు. ఆ విషయాన్ని కొంత పరామర్శిస్తాను.

"రెడ్డి" శబ్దం కులవాచకం గానేకాక గౌరవసూచకంగా కూడ కనబడు తున్నది. "రెడ్డొచ్చె మొదలాడు" అనే సామెత అందరికి తెలిసిందే. రెడ్డి పదం కేవలం రెడ్డి కులంలోనే కాదు అన్ని కులాల్లోను ఉన్నది. గోదావరి జిల్లాలలో ఇది మరీ ఎక్కువ. మద్రాసు గవర్నమెంటులో, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటులో, మంత్రి పదవులు నిర్వహించిన రెడ్డి నాయుడు అనబడే గ్రంథి వెంకట రెడ్డి నాయుడు, ఇప్పటి మంత్రి సంగీతం వెంకటరెడ్డి కాపు కులస్థులు. విజయవాడలో ఒకప్పటి ప్రసిద్ధ వ్యాపారస్థుడు, వదాన్యుడు చుండూరు వెంకటరెడ్డి వైశ్యుడు. రెడ్డప్ప దవేణి అనే బ్రాహ్మణ సంపన్నుడు నరసాపురానికి చెందినవాడు. రెడ్డి పంతులు అనే పేరు గోదావరి జిల్లా బ్రాహ్మణుల్లో కనిపిస్తున్నది. ఇప్పటి మచిలీ పట్నం యం. పి. రెడ్డయ్య యాదవుడు. ప్రఖ్యాత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి పి. యల్. సంజీవరెడ్డి కమ్మ కులస్థుడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇతర కులంవారికి "రెడ్డి" పదం రావటానికి రెండు మూడు కారణాలు తోస్తున్నవి. రెడ్లు బహుకాలం రాజ్యపరిపాలన చెయ్యటంవల్ల 'రెడ్డి'శబ్దాన్ని గౌరవవాచకంగా మిగిలినవారు తమపేర్లకు జోడించుకొని ఉండవచ్చు. నాయక రాజుల తరువాత "నాయుడు" శబ్దంకూడ గౌరవవాచకంగా మారింది. రెడ్డినాయుళ్ళు, బలిజ నాయుళ్ళు కమ్మ నాయుళ్ళు మనకు కనబడుతూనే ఉన్నారు. అంతదాకా ఎందుకు "రాజు" శబ్దం బ్రాహ్మణుల్లో ముఖ్యంగా నియోగి బ్రాహ్మణుల్లో ఎక్కువగా కనబడుతుంది. యాదవులు, ఇతర కులాల్లోనూ కనబడుతున్నది. వీరరాజులు, పేరరాజులు ఆంధ్రదేశంలో ఎందరో కనబడతారు. వారందరు క్షత్రియులు కారు. వీరందరు "రాజు" శబ్దం గౌరవ వాచకంగా పెట్టుకున్నవారే. కాటూరి వెంకట రెడ్డిగారికి, లేదా అదే పేరుగల వారి పూర్వీకుడికి "రెడ్డి" శబ్దం గౌరవ వాచకంగా వచ్చి ఉండవచ్చు.

మరొక చారిత్రక సత్యం కూడా ఉన్నది. కృష్ణదేవరాయల సోదరుడు అచ్యుతదేవరాయల వల్ల రాజ్యం పొందిన చెవ్వప్ప నాయకుడు తన కుమారుడికి అచ్యుత నాయకుడని పేరు పెట్టుకున్నాడు. ఇది కృతజ్ఞతా సూచకంగా చేసిన పని. కాటూరి వారి పూర్వీకుల్లో ఎవరో ఒకరో, లేక వేంకటేశ్వరరావుగారు ఉటంకించిన వేంకటరెడ్డి తండ్రో! ఎవరో ఒక వేంకటరెడ్డి నుండి అగ్రహారమో, అధికారమో పొంది కృతజ్ఞతా సూచకంగా ఆ పేరు పెట్టుకొని ఉండవచ్చు.

అసలు రెడ్డి అంటే గ్రామాధికారి అనే అర్థమున్నది. "రెడ్డో రాజో" అనే సామెత చాల ప్రసిద్ధమైనది. ఆముక్తమాల్యదలో పద్యం చూడండి.

"అనిన లాతుగ గోల్కొక నతడు రడ్డి
రాజు గనునని కొదయు దీర్పంగ మగుడి
యంత బరియును బై ప్రజ కలికిపాటి
పోవ వాడును వెడపోట్లు వొడిచి చనిమె" (ఆ. ము. అ. ర. ప. 83)

ఇక్కడ కాటూరివారి వ్రాతలను ఒకసారి చూద్దాం!

"వారలలోన గల్పటము వాసిన కొండొక శాఖమాది కా
టూరువ సూఃవీణ్ణుప నియోగ వశమ్మున గ్రామణికత్వమున్
జేరుగ దాల్చి వర్తిలుచు వెంపువహించెను..........."

(మా వాళ్లు, మా పూరు ప. 3)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఆరు తరములు చనుమీద వారిలోన
బొడమె వేంకటరెడ్డి..........." (మా వాళ్ళు, మా ఊరు- ప. 4.)

కల్పటం బందరుకు సమీపంలో ఉన్న ఒక చిన్న గ్రామం. ఈ వంశీకులు కల్పటం నుండి కాటూరు వచ్చి నూజివీడు ప్రభువుల అనుగ్రహంతో గ్రామాధికారు లయ్యారని తెలుస్తున్నది. ఆరు తరాల తరువాత వేంకటరెడ్డిని గురించి కాటూరి వారు వ్రాశారు· కాని కల్పటం నుండి నూజివీడు వచ్చిన ఏ వెంకయ్యగారో గ్రామణి కత్వం పొంది రెడ్డి బిరుదం లభించగా, "వేంకటరెడ్డి"గా మారాడని, అదే పేరు ఆరు తరాల తరువాత మరొకరికి పెట్టారని నా అభిప్రాయం. పైన చెప్పిన అన్ని కారణాలకంటే ఇదే సమంజసమనిపిస్తున్నది. వేంకటేశ్వరరావుగారి కుమారుడు విజయసారథిగారు "రెడ్డి" శబ్దం పౌరుష నామంగా వచ్చి ఉంటుందని అభిప్రాయపడ్డారు.

కాటూరివారి వంశంలో ప్రసిద్ధుడైన ఈ వేంకటరెడ్డి కలమునకు, హలమునకు చాలినవాడు. ఉయ్యూరు దేశపాండ్యా తాతయామాత్యుని కుమార్తె అనంతమ్మను వీరు వివాహం చేసుకున్నారు. ఈ పుణ్యదంపతులకు శంకరయ్య, కొండయ్య అనే ఇద్దరు కుమారులు; సీతమ్మ అనే కుమార్తె కలిగారు. ఈ కాటూరి సోదరులు నూజివీడు ప్రభువుల అనుగ్రహం పొంది గ్రామ కరణాలుగా, సముద్దారులుగా పదవీ నిర్వహణం చేస్తూ, మంచిపేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్నారు. శంకరయ్యగారు గురజాడవారి ఆడబిడ్డ ఆదెమ్మను వివాహమాడారు. ఈ దంపతుల కుమారుడు వేంకటకృష్ణయ్య. రామాంబ వేంకట కృష్ణయ్య దంపతులకు రామకృష్ణయ్య, వేంకటేశ్వరరావు, శంకరరావు అనే ముగ్గురు కుమారులు, వేంకట రత్నమాంబ, ఆది లక్ష్మమ్మ, అనే ఇద్దరు కుమార్తెలు కలిగారు. ఇక కొండయ్యగారు ముదునూరి రామభద్రయ్యగారి కుమార్తె లక్ష్మమ్మను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు సంతానం కలుగలేదు. ఈ కొండయ్యగారు తన అన్న మనుమడైన వేంకటేశ్వరరావును దత్తతకు తీసుకున్నాడు. ఈ వేంకటేశ్వరరావే కవి వేంకటేశ్వరరావు. అంటే వేంకటేశ్వరరావుగారు తన పినతాతకు దత్తత వెళ్ళాడన్నమాట.

సాహిత్యానికి, సదాచారానికి, దానధర్మాలకు, కాటూరివారి వంశం పెట్టిందిపేరు. శంకరయ్య, కొండయ్య గార్లు ఆదర్శ సోదరులు. శంకరయ్యగారి దయాగుణాన్ని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రుజువర్తనాన్ని సదాచార పరాయణత్వాన్ని కొనియాడుతూ వేంకటేశ్వరరావుగారు వ్రాసిన పద్యమిది.

"కింకర కల్పపాదప మకించన కాంక్షిత కామధేనువై
వంకర త్రోవలుం గపట వర్తనముం, దిగద్రావి చారుతా
లంకృత సాధువృత్తి, అవిలంఘ్య సదాచరణమ్ము తోడుగా
శంకర మంత్రి భోగమున జాగమున న్నుతికెక్కె నెంతయున్"

(మా వాళ్ళు, మా ఊరు ప. 44)

ఆయన మనసు వెన్నకన్న మెత్తన. అడిగిన వారికి లేదనటం ఆయనకు చేతకాని పని. తమ్ముడు కొండయ్యగారు అన్న ఎదురుగా మాట్లాడటానికే జంకేవాడు. అది భయం కాదు! భక్తి, గౌరవం.

కొండయ్యగారు సాహిత్యంలో చక్కని అభినివేశం గలవారు.

"ఊరిలో చిన్నలును పెద్ద లాకొనంగ
పంజవేళ రాముని గుడి సవిధమందు
కొండయా మాత్యుడు వచించుచుండు రామ
కథయొ భారతమో సుధా మధుర ఫణితి"

(మా వాళ్ళు, మా ఊరు ప. 36)

కమ్మని కంఠంతో రామాయణ భారత గాథల్ని కొండయ్యగారు గానం చేస్తుంటే పిన్నలు, పెద్దలు మైమరచి వినేవారు. తాతగారి ఈ గుణాలకు వేంకటేశ్వరరావుగారు వారసులైనారు.

శంకరయ్యగారి కుమారుడు రామకృష్ణయ్యగారు. ఈయన మంచి రూపసి, సంగీత సాహిత్యాభిమాని, రసజ్ఞుడు.

"మేలిమి పైడి కీడయిన మేనిపసల్ పరిపూర్ణచంద్రునిన్
దేలిక సేయు నెమ్మొగము తీరు, వెడంద యురమ్ముసౌరు మో
కాళుల కాను కేలుగవ క్రొల్గనులున్ చెవిదాకు చూపులున్
దోలగ జూచి తండ్రి శుభమూర్తి గణింతురు రేల నాల్మగల్"

(మా వాళ్ళు, మా ఊరు ప. 59)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బంగారు రంగుతో, విశాలమైన వక్షస్థలంతో, చక్కని కన్నులతో మోహన రూపుడైన ఆయన సౌందర్యం అందరి నోళ్ళ కెక్కింది. వేంకటకృష్ణయ్యగారు "కుసుమాస్త్ర సన్నిభుడు, గీతి సాహితీ రస వివశ సుధీ కలితుడు". ఒకనాడు వేంకటకృష్ణయ్యగారు తిరుపతికి ప్రయాణమైనారు.

"దేవుని కొండకున్ బయలు దేరిన బండ్లకు ముందు కుంచిత
గ్రీవత నాలబోతెదిరి ఘీంకృతి సేయుచు గాలు ద్రవ్వగా
బోవలదిప్డు దుశ్శకునమ్ముం గనుడం చెవరెంత చెప్పినన్
దా వినడయ్యె దండ్రి హరి దాపునమై దొరగందలంచెనో"

(మా వాళ్ళు, మా ఊరు ప. 62)

వారి బండికి ఆబోతు కాలు దువ్వుతూ ఎదురు వచ్చింది. ఇది మంచి శకునం గాదని ఎవరు చెప్పినా ఆయన వినలేదు. తిరుపతి యాత్రకై వెళ్ళి అక్కడ దేహ యాత్రనే చాలించారు. అప్పటికి వేంకటేశ్వరరావు అన్నగారికి ఎనిమిదవ సంవత్సరం. వేంకటేశ్వరరావుగారికి షుమారు అయిదు సంవత్సరాలుండవచ్చు.

ఆబోతు కలలో కనిపిస్తే మంచి శకునమంటారు. అంతేకాదు వేంకటేశ్వర స్వామిగా భావిస్తారు. కాని మామూలుగా ప్రయాణం చేసేటప్పుడు ఎదురుగా వస్తే మంచిది కాదంటారు.

తాతల నుండి వీరిది అవిభక్త కుటుంబం. వేంకటకృష్ణయ్యగారు అకాల మృత్యువు వాత పడటం వల్ల ఆ కుటుంబం కొంతకాలం అంధకారంలో చిక్కు పడింది. వేంకటకృష్ణయ్యగారి పెద్ద కుమారుడు రామకృష్ణయ్యగారు, పద్దెనిమిది సంవత్సరాలు రావటంతోనే గ్రామాధిపత్యం, కుటుంబాధిపత్యం స్వీకరించి ఆ వంశా నికి క్రొత్త వెలుగై నిలిచాడు. ఈయన భార్య రంగనాయకమ్మ, రామకృష్ణయ్య గారు మంచి శిష్టాచార సంపన్నుడు, వ్యవహారదక్షుడు, ధర్మాత్ముడు, సాహిత్యా భిమాని. కవులను, కళాకారులను ఇతోధికంగా సన్మానిస్తుండేవాడు. తమ తాతల నాడు త్రవ్విన చెరువు పూడిపోగా దాన్ని తిరిగి త్రవ్వించాడు. కాటూరులోని భీమేశ్వరాలయం సొమ్ము అన్యాక్రాంతం అవుతుండగా, తాను పట్టించుకొని, ఆ ధనాన్ని రాబట్టి ఆలయ పునర్నిర్మాణం చేసి స్వామివారికి పూర్వ వైభవం కలి గించాడు. భగవద్భక్తి, ఆధ్యాత్మిక చింతన కలిగిన ఉదారుడు రామకృష్ణయ్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"గ్రామణిమాత్రుండే పూ
ర్వామాత్యనిభుండు వైదికాచారుడు, కా
వ్యామోదము గీతా, త
త్త్వామృతము భణించు ధన్యునగ్రజు నెంతున్
(మా నాన్న, మా ఊరు ప. 76)

"సతత సమర్చిత హుతవహు,
హితమితవాక్యప్రవీణు ఇష్టాగ్రసుధీ
యుతు, దత్త్వ విచారణ మతి
కృత బుద్ధి, మదగ్రజున్ గృష్ణు నుతింతున్"
(మా నాన్న, మా ఊరు ప. 77)

రామకృష్ణయ్యగారికి కూడ సంతానం లేదు. వీరు తన చిన్న తమ్ముడు శంకర్రావుగారి కుమారుడు భాస్కరరావును దత్తత చేసికున్నారు. శంకర్రావుగారు ఆదర్శ సోదరులు. అన్నగారికి చేదోడు వాదోడుగా వుండేవారు. వేంకటేశ్వర్రావుగారు దత్తత పోయినా, రామకృష్ణయ్యగారికి గారాబు తమ్ముడే.

వేంకటేశ్వర్రావుగారిది ఉమ్మడి కుటుంబం. ఇంటి బాధ్యతలు, పొలం వ్యవహారాలు అన్నీ రామకృష్ణయ్యగారే చూచేవారు. తమ్ముడి అవసరాన్ని గమనించి డబ్బిస్తుండేవారు. వేంకటేశ్వర్రావుగారు ఎవరి దగ్గరైనా అప్పు తీసుకుంటే అన్నా తీసి, మరి బాకీ తీర్చేవారు. వేంకటేశ్వర్రావుగారికి కావలసినంత స్వేచ్ఛ - రాజకీయ వ్యాసంగం - స్వాతంత్ర్యోద్యమం - కవితా వ్యవసాయం - నవ్య సాహిత్య పరిషత్తు వ్యవహారం - సాహిత్య సభలు ఒకటేమిటి, ఎన్నో విషయాలు. ఇంటి బాధ్యత మాత్రం బొత్తిగా పట్టేదిగాదు. ఈయన బాధ్యతా రాహిత్యానికి, రామకృష్ణయ్యగారి వాత్సల్య ఔదార్యాలకి "పౌలస్త్య హృదయము", "గుడిగంటలు" కృతి సమర్పణలోని ఈ పద్యాలే సాక్షి.

"నేరడు మంచి చెడ్డలు; గణింపడు గీమున కష్టసౌఖ్యముల్:
వీధిడిమ్మై సదా తిరుగు వీడని రోయక, నన్ను మత్ప్రియిన్
గూరిమి నోమె అగ్రజునకుం డుడకిచ్చెరి నిష్ఠురాగ్ని సం
స్కారము నింక నాకెసగ జాలిన దొక్క కృతిప్రదానమే!"
(పౌలస్త్య హృదయం కృతి సమర్పణం ప. 3)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఆలుబిడ్డలు పైరుపచ్చలనకే "యాగమ్మకాకం" బలెన్
గాలిచ్చం దిరుగాడు దుర్వ్యసని నాకై యెంత చింతించెనో
లోలో నెన్నడు నొవ్వనాడడు దయాసంపైై ససుంద్రోచె; స
చ్ఛీలుం డన్నకు నీ కృతిద్వితయమున్ జేమోడ్చి యర్పించెదన్".
(పౌలస్త్య హృదయం. కృతి సమర్పణం. ప. 4)

వేంకటేశ్వర్రావుగారు బందరు హిందూహైస్కూలులో విద్యాభ్యాసం చేస్తున్న రోజులవి. అప్పుడే చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి గురుత్వంతో పాటు, పింగళి లక్ష్మీకాంతంగారి సాంగత్యం కూడా వారికి లభించింది. వేంకటేశ్వర్రావు గారు సహజంగా బిడియస్తులు, చొరవ తక్కువ, సున్నితమయిన మనస్తత్వం. చెళ్ళపిళ్ళ వారి దగ్గర సంపాదించిన, సంస్కృతాంధ్ర పాండిత్యానికి పింగళి వారి ప్రోత్సాహం తోడయింది. కమ్మని కవిత జాలువారింది. "ఎప్పుడు నిర్లిప్తంగా ఉండే వేంకటేశ్వర్రావుగారితో, అక్కడ ఉపన్యాసం ఉన్నదనో, ఇక్కడ సభ ఉన్నదనో లక్ష్మీకాంతంగారు చెప్పటం, వెళదాం రమ్మనటం, ఇరువురూ జంటగా కదలటం. ఇలా జరుగు తుండేది" అంటారు వారి మిత్రులు డా॥ గూడూరి నమశ్శివాయగారు. వేంకటేశ్వర్రావుగారే తనను గురించి ఇలా చెప్పుకున్నారు.

"పింగళి కాంత సుకవితో
సంగాతము చెళ్ళ పిళ్ళ సద్గురు కృప స
న్నుం గవి మాత్రుని గావిం
చెం గొండొక పద్య రచన చేతు జపలతన్" (నేను. ప. 2)

ఇందులో వినయం పాలు ఉన్నా సత్యమే అధికం.

1921లో బి.ఏ. సీనియర్ చదువుతున్న వేంకటేశ్వర్రావుగారు గాంధీగారి సహాయనిరాకరణోద్యమం పిలుపువిని కళాశాలమానివేసి స్వాతంత్ర్య సమరంలోదూకారు. కళాశాల విద్యకు అంతటితో స్వస్తి. 1930వ సంవత్సరంలో వీరు వ్రాసిన దేశభక్తి గేయానికి గాను ప్రభుత్వ ద్రోహ నేరం క్రింద ఆరునెలలు జైలుశిక్ష అనుభవించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వారు వ్రాసిన గేయమిది.

"స్వేచ్ఛ కొరకే బ్రతికేము
స్వేచ్ఛ కొరకే ప్రాణమిచ్చేము
స్వేచ్ఛ కొరకే పాట పాడేము
స్వేచ్ఛ కొరకే యురుల ప్రేలేము
అన్నలారా రండు రండోయి
దాస్యబంధము ద్రెంచ రండోయి
ముందడుగు వేసి నడవండోయి
స్వేచ్ఛ స్వర్గము పట్టుకొండోయి
స్వాతంత్ర్యమే తల్లి మనకెల్ల
అరుణోదయమే తండ్రి మనకెల్ల
నష్ట కష్టము లెంచ కండోయి.
తల్లి కౌగిట వ్రాల రండోయి.

ఈ గేయం మైనేని రామకోటయ్యగారు సంగ్రహకర్తగా వెలువడ్డ "జాతీయ గీతములు" అనే గ్రంథంలో ఉన్నది.

ఇదే గేయాన్ని మరికొంత పెంచి "ముగ్గురు మూర్తులు" నవలలో వ్రాశారు. అలగ్జాండరు సింధు దేశపు రాజైన మూషకసేనుడ్ని అతని సలహాదారులు పది కొండుమంది బ్రాహ్మణులను ఉరి తీయించాడు. ఆ సందర్భంలో వారీ గేయాన్ని పాడుతూ ఉరికంబమెక్కారు. ఆ పాటలో పైన ఉన్న పన్నెండు పంక్తులుకాక మిగిలినవి ఇవి.

సొమ్ముచే మోసపోయేమా
దానమ్ములకు దేశ మమ్మేమా
భేదాలచే చీలిపోయేమా
దండమ్ములకు వెరచి పరచేమా
బొమ్మరిల్లే మాకు చెరసాల
పట్టబంధమే మాకు ఉరిత్రాడు
పూల చెల్లే మాకు సురె పోటు
తల్లి దేశమె మాకు దైవమ్ము

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్వాతంత్ర్య తీర్థమ్ము దొడొల
పాటపాడుగున పుండ్ల తొడుగేను
స్వేచ్ఛా పిపాసులకు దవ్వేది
దేశభక్తులకు గడగండ్లేవి

స్వేచ్ఛ పమ్మెర గాలి సాగింది
ఒడలు చల్లగ సోకి పిలిచింది
స్వేచ్ఛా మురళి చెవుల మ్రోగింది
బంధ మోక్ష మ్మెదుట నిలచింది"

(మొగ్గరు ముత్యాలు-పే. 132 ప్రచురణ. వావిళ్ళ. 1950)

ఇలా సందర్భమొచ్చి నప్పుడల్లా తన స్వాతంత్ర్య కాంక్షను దేశభక్తిని కాటూరి వారు వ్యక్తం చేశారు.

వేంకటేశ్వరరావుగారు బందరు ఆంధ్ర జాతీయ కళాశాలలో 1933 మొదలు 1939 వరకు ఆంధ్రోపన్యాసకులుగా, తదుపరి 1943 దాకా వైస్‌ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్‌గా ఎంతో సమర్థతతో ఉద్యోగ నిర్వహణం చేశారు. 1945 నుండి 1953 వరకు కృష్ణా పత్రికకు సంపాదకత్వం కూడా వహించారు.

కాటూరి వారికి సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో మంచి పాండిత్యమున్నది. రవీంద్రుని కవిత్వమంటే వీరికెంతో అభిమానం.

"ఆంధ్ర గీర్వాణ కవిరాజు లాంగ్లసుకవు
లల రవీంద్ర కవీంద్రుడు నలుపు గావ్య
కుసుమ మాలలు దలదాల్చు కానెడు పాటి
సరసత ఘటిల్లె జాలు నీ జన్మమునకు"

(నేను. ప. 3)

అంటూ ఎంతో వినయంగా చెప్పారు.

(3)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జీవిత పూర్వార్థంలో వేంకటేశ్వరరావుగారిమీద గాంధీ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. కాంగ్రేసువాదయిన కాటూరివారు వంశాను గతమైన సంధ్యా వందనాది కర్మల్ని, మడి, ఆచారాల్ని పాటించినట్లుగా కనిపించదు. భగవద్భక్తి కూడా అంతంత మాత్రమే. జీవిత ఉత్తరార్థంలో ముఖ్యంగా రమణమహర్షిని దర్శించిన తరువాత వీరిలో ఆధ్యాత్మిక చింతన, భక్తి భావన మేల్కొనినవి. ఆరోజుల్లోనే కుర్తాళం పీఠాధిపతులు శ్రీ విమలానంద భారతీ స్వాములతో వీరికి అనుబంధం ఏర్పడింది. ఏమైనా గాంధేయవాదం మాత్రం ఆయనను జీవితాంతం అంటిపెట్టుకొని ఉన్న సంస్కారం.

1927లో పింగళి లక్ష్మీ కాంతంగారు మద్రాసుచేరారు. అక్కడ "ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీ"లో పరిశోధకుని పదవి వారికి లభించింది. బందరులోనే ఉండిపోయిన వేంకటేశ్వరరావుగారికి, అప్పటినుండి అడవి బాపిరాజు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, మాధవపెద్ది బుచ్చి సుందర రామశాస్త్రి, మొదలైన కవులతో స్నేహబంధం బాగా పెరిగింది. విజయవాడలో తరచుగా మకాం వేసేవారు. ఆకాశవాణికి ఎన్నో నాటికలు, ప్రసంగాలు అందించారు. నవ్య సాహిత్య పరిషత్తులో సభ్యులుగా ఎంతో కృషి చేశారు. 1944లో తెనాలిలో జరిగిన సభలో నవ్య సాహిత్య పరిషత్తుకు అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య, టంగుటూరి ప్రకాశం, దుగ్గిరాల గోపాలకృష్ణయ్యలతో వీరికి మంచి సాన్నిహిత్య ముండేది. విశ్వనాథ, తుమ్మల మొదలైన కవులతో వీరికి చక్కని సంబంధాలున్నవి. కాటూరి ముట్నూరివారి దర్బారు కవి.

గ్రామీణ జీవితం

ఈ లఘు కృతిలో మా ఊరంటూ వేంకటేశ్వరరావుగారు వర్ణించిన గ్రామీణ విషయాలు కాటూరుకు మాత్రమే పరిమితం కావు. ఆ నాటి సాధారణ పల్లె జీవితం దీంట్లో ప్రతిఫలించింది. విజయవాడవద్ద కృష్ణకు ఆనకట్ట కట్టక పూర్వం కృష్ణాజిల్లా అంతా మెట్టప్రాంతమే. అన్నిచోట్ల వర్షాధారం వల్ల పండే పంటలే. మెట్టపంటలకు వర్షాధిక్యం పనికిరాదు. పూర్వం అనావృష్టికంటే అతివృష్టి వలన కలిగే ఇబ్బందే ఎక్కువగా ఉండేది. వర్షాలెక్కువ అయితే మెట్ట వ్యవసాయం సాగదు. అథవా ఏమైనా పంటలు వేసినా ఎర్రబడిపోతాయి. ముఖ్యంగా రోహిణి, మృగశిర కార్తెల్లో వేసే పునాస పంటలు పండవు. అప్పుడు ఉత్తరకార్తె

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మొదలుగా వేసే పైరపంటలే గతి. పొలాల్లో గడ్డి బలిసి దున్నటానికి వీలుకాక, పైరపంటలు వేయటం కూడ కష్టంగానే ఉంటుంది. ఇది షుమారు నూరు సంవత్సరాల క్రిందటి మాట. ఈ ప్రాంతంలో ముసలివారు ధాత కరువును గురించి చెబుతుంటారు. అది అతివృష్టివల్ల ఏర్పడ్డ కరువు. ఈ ధాత వెళ్ళిపోయిన అరువది సంవత్సరాల కాలచక్రంలోది కాకుండా, అంతకుముందు అరువది సంవత్సరాలలో వచ్చిన ధాత సంవత్సరం. అంటే ఇప్పటికి నూట పదమూడు సంవత్సరాలయింది. అప్పుడు విపరీతమయిన వర్షాలు కురిసినవట. పొలాల నిండ గడ్డి, పశువులకు మంచిమేత, పాడి పుష్కలం, పంట సున్న. ఆకలికి తాళలేక రేగడి బురదలో పెరుగు పోసుకుని తినేవారట. ఈ పచ్చికరువులో ప్రజలను ఆదుకునేవి మంచి గుమ్మడికాయలు. వర్షాలధికమయితే వీటి కాపు కూడ ఎక్కువగానే ఉంటుంది. గుమ్మడిపండ్లు తియ్యగా ఉండి మంచి బలవర్ధకమైనవి. గుమ్మడికాయ తొడిమదగ్గర చిన్న రంధ్రంచేసి దాంట్లో గింజల్ని తీసివేస్తారు, పాలు, బెల్లం, జొన్నపిండి కలిపి, దాన్ని ఆ కాయనిండా నింపుతారు. ఆ రంధ్రాన్ని మూసివేసి ఆ కాయకు పూర్తిగా పైన మందంగా ఒక గుడ్డ గట్టిగా చుట్టి దానిపై తడిమట్టి పూస్తారు. కొంచెం ఆరిన తరువాత, దాన్ని మంటల్లో బాగా కాలుస్తారు. కాయ పైన గుడ్డ, దానిపైన మట్టిపూత ఉండటంవల్ల మాడకుండా లోపలిపదార్థం చక్కగా ఉడికి గట్టిపడుతుంది. అప్పుడు ఆపైన గుడ్డను వలిచేసి, కాయను ముక్కలుగా కోసుకుని తలా ఒకముక్క తింటారు. ఇది అన్నం కూర ఒకటే అయిన ఆనాటి కరువు భోజనపు వంట.

ఈ పచ్చి కరువు ప్రస్తావన "మా ఊరు"లో ఉన్నది. వేంకటేశ్వరరావుగారి తాతలు కొండయ్య, శంకరయ్యగార్ల హయాంలో ఈ కరువు వచ్చింది. దాన్ని వర్ణిస్తూ కాటూరివారు వ్రాసిన పద్యమిది.

"గుమ్మడి పండులన్ గుడము గూరిచి వండియు, దాటి పండులన్
గుమ్మన గాల్చియున్ మెసవి, గోగులు, దొగ్గలి చింతయాకు శా
కమ్ములు, జొన్నయన్నమును, కమ్మని మజ్జిగ తోడుగా అనం
తమ్ము కుటుంబమున్ గడపె దాల్మిమె సర్వము జక్కబెట్టగన్."

(మా వాళ్ళు-మా ఊరు ప. 9)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కుమ్ముల్లో కాల్చిన తాటిపండ్లు మరొక ఆహారం. అప్పటి రోజుల భోజనం జొన్నన్నం, గోంగూర, కాదంటే, దొగ్గలి చింతాకు కలిపి వండిన శాకం. కమ్మని మజ్జిగ మాత్రం కావలసినన్ని.

“గుమ్మడిపండులన్ గుడము గూరిచి వండి.......” అంటే గుమ్మడికాయ కూర అనుకునే ప్రమాదముంది. అందుకే ఆ గుమ్మడికాయ వంటకాన్ని ఇంతగా వివరించాల్సి వచ్చింది.

కృష్ణానదికి సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు విజయవాడవద్ద ఆనకట్ట నిర్మించాడు. దాంతో తూర్పు కృష్ణాజిల్లా పరిస్థితి మారిపోయింది. ఆనకట్ట దగ్గర ఆగిన కృష్ణను కాటూరివారు కడు రమణీయంగా వర్ణించారు.

“అంతట నింద్రకీలగిరి యంఘ్రి సమీపమునందు మేటి ధీ
మంతులు హూణపాలకు లమర్చిన సేతువు హేతువై దిశా
భ్యంతర పూర్ణవీచి నిచయార్భటి నాథుని జేరు కృష్ణ కొ
క్కంత విలంబనమ్ము లభియించెను వేణిక లల్లికొంటకున్.”

(మా వాళ్ళు- మా ఊరు ప. 14)

“ఉత్తుంగ తరంగాలతో సముద్రుడ్ని చేరటానికి ఉరుకులు, పరుగులతో పోతున్న కృష్ణమ్మకు, విజయవాడవద్ద సేతువు ఆపటం వలన, వేణికలల్లుకొనటానికి కొంత విశ్రాంతి దొరికింది” అన్నారు వేంకటేశ్వరరావుగారు. ఇది చాలా మనోహరమయిన భావం, వేణికలంటే కాలువలు, జడలు, అని రెండర్థాలున్నవి. కృష్ణ కాలువలు అన్నిప్రాంతాలకు వ్యాపించినవనే భావం పెద్ద విశేషం కాదు.

ఒక స్త్రీ భర్త దగ్గరకు త్వరగా పోయే అడావుడిలో ఉంది. ఇంతలో జడలు సరిగా వున్నవా లేవా అనే అనుమానం వచ్చి, క్షణం ఆగి సరిదిద్దుకొని ముందుకు సాగింది. అలాంటి స్త్రీగా సముద్రుని కడకు పోయే కృష్ణను వర్ణించటంలోనే ఉన్నది కాటూరివారి కల్పనాశిల్పం.

కృష్ణనీరు అందటంతో మారిపోయిన డెల్టా తాలూకాల పరిస్థితులను వేంకటేశ్వరరావుగారు చాలా చక్కగా వర్ణించారు. ఎండకు కాగి నోరు తెరిచిన భూదేవి కృష్ణాజలంతో దప్పిక తీర్చుకున్నది. తాము తింటానికి, కట్టుకొనటానికి, మరొకరికి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

8113

పెట్టటానికి గృహస్థులకు అవకాశం కలిగింది. పంటలతో జీవనవిధానంలో ఎంతో మార్పు వచ్చింది.

"ఎఱుపాల్ బియ్యము వోయి రాజనము లాయెన్ భుక్తి, పూరింటికాఁ
పురముల్ వోయెను మండువాల భవనమ్ముల్ మన్కికాయెన్, జలా
హరణ క్లేశము వాసి యాంధ్రకు వెరళ్ళం దప్పెఁ గూపాంబువుల్
సరసాంతః కరణావధిన్ బొగడగా శక్యంబె కృష్ణానదిన్."

(మా వాళ్ళు, మా ఊరు ప. 17)

కొన్నిరకాల వడ్లను మెట్టపంటగా పండిస్తారు. అందులో నల్లవడ్లొక విత్తనం. వడ్లు నల్లగా వుండి బియ్యం ఎఱ్ఱగా, లావుగా ఉంటవి. మరొక రకం వడ్లు, తెల్లగానే ఉన్నా బియ్యం మాత్రం ఎరుపే. మెట్టప్రాంతంవారికి వరి అంటూ పండితే ఈ ఎఱ్ఱరకాలు బియ్యమే. ఇప్పుడు కాటూరు ప్రాంతంలో నివసించేవారికి ఎఱ్ఱబియ్యం పోయి సన్నని తెల్లబియ్యం పండుతున్నవి. నీటి ఎద్దడిపోయి పెరటి బావులలో మంచినీళ్ళు లభించటంవల్ల ఆడవారికి శ్రమ తగ్గింది. పంటలు బాగా పండి ఆదాయం చేతికందటంతో పూరిళ్ళు మండువాలోగిళ్ళుగా మార్పు చెందినవి. నాలుగుప్రక్కల ఇల్లు వుండి మధ్యలో ఖాళీగా వుండే పెంకుటిల్లే మండువా లోగిలి. వీటికి గాలి, వెలుతురుతోపాటు భద్రత కూడ పుష్కలంగా వుంటుంది.

కాటూరివారు పల్లెలోని ప్రభాతాన్ని కడుమనోహరంగా వర్ణించారు. ఇది చదువుతుంటే పల్లె స్వస్థానమైన ప్రతివారికి ఇది మా ఊరి వర్ణనే అనిపిస్తుంది. పల్లెలలో ఉదయం ఎంతో సందడిగా సుందరంగా వుంటుంది. కోడి కూసిన దగ్గరనుండే అక్కడ దైనందిన జీవనం ప్రారంభమవుతుంది. పెందలకడే నిద్ర పోయిన పల్లె ఒక్కసారిగా తెల్లవారకుండానే మేలుకొంటుంది.

"కాలికోళ్ళ మెచ్చరింతల రెక్కలల్లార్చి
మలుకోళ్ళగములు మాటెలుగు సూప
మునుమున్న మేల్కొన్న ముదియవ్వ కదురుఝుం
కృతి సుతిగా మాలిక్రతులు పాడ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గరకంకణధ్వనుల్ కవ్వంపుఁ జప్పుళ్ళ
పెరయఁగా నిల్లాండ్రు పెరుగుదరువ
బులుఁగుల కలకలమ్ములతోడఁ గలయంపి
సవ్వడుల్ తీయనై సందడింప.

మోటగిలకల రవళితోఁ దోఁటలకును
జలముతోడు బలీవర్దములను గాఁపు
లదలుపన్ మోకు బవ్వాట లాలకించు
చల్లన న్మేలుకాంచు మా పల్లెటూరు." (మా వాళ్ళు, మా ఊరు. ప. 25)

స్వభావోక్తిలో ఇంతటి సౌందర్య స్ఫూర్తిని పొదుగగలిగే కవులను వ్రేళ్ళమీద లెక్కించవచ్చు. ఈ విషయాలు గమనించాలంటే నలుగురితోపాటు లేచి తమ పనులు తాము చూసుకొనే వారికి సాధ్యంకాదు. పల్లెటూళ్ళో తెల్లవారుఝామున ఈ సందడితో కలత నిద్ర తప్ప గాఢ నిద్ర పట్టదు. అలా పడుకుని వింటుంటే ఈ విశేషాలన్నీ వినిపిస్తవి. ఉదయం చీకటితోనే లేవవలసిన అవసరం లేని వెంకటేశ్వర్రావుగారు స్వయంగా ఆ అనుభూతిని పొందే వ్రాశారని నిస్సందేహంగా చెప్ప వచ్చు.

తొలికోడి కూతతో వ్యవసాయదారులు మేల్కొంటారు. మలికోడి కూసే టప్పటికి పల్లె అంతా నిద్ర లేస్తుంది. పూర్వం కోడి గ్రామీణుల గడియారం. జామునకొకసారి కూసే ప్రత్యేకమయిన జాతి కోళ్ళను జాము కోళ్ళంటారు. వీటికి కాలజ్ఞానం ఎక్కువ. జాము అంటే షుమారు మూడు గంటల కాలం. నాలుగవ జాము ప్రారంభంలో కూసే కోడిని తొలికోడి అంటారు. తరువాత అన్ని కోళ్ళు కూస్తవి. అవి మలికోళ్ళు. వేకువజాములో స్త్రీలు చల్ల చిలుకుతుంటారు. అప్పుడు వచ్చే చప్పుడు ఒక చక్కని ప్రఖ్యాత సంగీతం. పెరుగు చిలికే మ్రోత "ఘుమ్మ ఘుమ్మ" అంటుంటే, దాంతో గాజులమ్రోత "ఘల్లు ఘల్లు" అంటూ కలసి కమ్మగా కలత నిద్దురలో వినిపిస్తుంటుంది.

పక్షుల కిలకిల రావాలతో కలసిన కలాపి నీళ్ళ చప్పుళ్ళు, ఆ చల్లేది స్త్రీలయితే సుతి కలిపే గాజుల మ్రోతలు, దూరంగా పెరటి పొలాల్లోనుంచి సన్నగా వినబడుతున్న మోట బావుల గిలకల చప్పుళ్ళు, మోట ఎద్దుల్ని అదిలిస్తున్న కాపుల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అరుపులు, ఎంత రమణీయమైనదా పల్లె ప్రకృతి! ఇంత మనోహరంగా వర్ణించిన వేంకటేశ్వర్రావుగారిది ఎంత సుకృతి.

మోట మోకు జవ్వాటలు ఆలకించటం మామూలు కవులకు సాధ్యంకాదు. కాటూరి—కవి, కృషీవలుడు, రైతు జనజీవనాన్ని ఎరిగినవాడు. పాడి, పంట, కమతము, కామాటము ఉన్నవాడు. మోటబొక్కెన లాగేటప్పుడు ఎద్దులు ముందుకు నడుస్తవి. మరల బొక్కెన బావిలో మునగటానికి ఎద్దులను వెనుకకు నడిపిస్తాడు ఆసామి. బొక్కెనను బయటకు లాగేటప్పుడు దానికికట్టిన మోకు త్రాడుమీద మనిషి కూర్చుంటాడు. అలా చేయటంవల్ల ఎద్దుల మెడమీద కాడి పైకి లేవకుండా ఉంటుంది. వెనక్కు లాగే నీటి బొక్కెన బరువుకు సమతూకం ఏర్పడుతుంది. వెనక్కు నడిచేటప్పుడు మోకు మీద నుంచి మనిషి దిగుతాడు. అప్పుడు మోకు కంపించటంవల్ల "జవ్వు" "జవ్వు" మనే చప్పుడు వస్తుంది. అంతే కాకుండ "జవ్వు" అంటే సౌందర్యమని. ఏదైనా మునిగేటప్పుడు వచ్చే ధ్వని అనుకరణమని అర్థాలున్నవి. ఈ శబ్దం బొక్కెన నీటిలో మునిగే ధ్వనిని కూడ సూచిస్తుంది. మోకు చప్పుడు, బొక్కెన మునిగే చప్పుడు అన్నీ కలసి ఒక సౌందర్య స్ఫూర్తి. ఒక్క శబ్ద ప్రయోగంతో కవి ఇంత సాధించాడు. శబ్దాన్ని వాడటంలో కాటూరివారి ప్రజ్ఞ ఎలాటిదో దీన్ని బట్టి తెలుస్తున్నది.

చేనేత పూర్వం మన గ్రామాలలో ముఖ్యమైన కుటీర పరిశ్రమ. తిండి, బట్ట, మానవుని ముఖ్యావసరాలు. ఈ రెంటి విషయంలో ఏ గ్రామాని కాగ్రామమే నాడు స్వయం సమృద్ధంగా ఉండేది. బ్రిటీషువారు మిల్లు వస్త్రాలు దిగుమతి చేసి చేనేత కార్మికుల పొట్టగొట్టటమే కాకుండ గ్రామీణ జీవన వృక్షానికి బలమైన వేరును నరికి వేశారు. అది గమనించిన గాంధీమహాత్ముడు స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ఖాదీ ఉద్యమాన్ని నడిపాడు. గాంధేయవాది, స్వాతంత్ర్య సమరయోధులయిన కాటూరి వారు వేకువజామున లేచిన ముసలి అవ్వ పాటలు పాడుతూ, నూలు వడికే సన్నివేశాన్ని చిత్రించి ఖాదీ ఉద్యమాన్ని స్ఫురింపజేశారు. పల్లె ప్రజలు పాటలు పాడుతూ పనులు చేసుకుంటారు. నూలు వడికేటప్పుడు, నేసేటప్పుడు పాడే పాటలే రాట్నపు పాటలు, అవే నూలి పాటలు. కాటూరివారు వ్రాసిన అలాటి పాట ఒకటి పన్నీటి జల్లులో ఉన్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రభాతాన్ని వర్ణించే మరొక పద్యం మనల్ని కూడ ఆకర్షిస్తుంది.

"వేగుట లెప్పుడెప్పుడను వేగిరపాటు నడంపలేక హ్రా
ద్రాగ తరంగ ముద్దవిడి దాటులు వెట్టుచు గంఠ తీరమం
దాగక భంగమై చిద్రుపలై చిరు ముత్తెపు గుత్తి మొత్తమై
సాగగ బైడికంట్లు తొలిజాముల పల్లియ మేలు కొల్పెడిన్"

(మా వాళ్ళు, మా ఊరు ప. 26)

పైడికంట్లు అనేవి శకున పక్షులు. వీటి కండ్లు బంగారు రంగులో ఉంటవి. గ్రుడ్లగూబ, పెద్దపక్షి అనేవి కూడా శకున పక్షులే. పైడికంట్లు ఉదయం పూట అరుస్తుంటవి. వాటి కంఠధ్వని అలలు అలలుగా సాగుతుంది. ఒక చెట్టు మీద ఒక పక్షి అరిస్తే ప్రతిగా మరొక చెట్టు మీద నుండి మరొక పక్షి అరుస్తుంది. అవి ఆడ, మగ జంటలు అంటారు. బాగా ప్రొద్దెక్కిన తరువాత వాటి అరుపులు వినబడవు. రెండు పక్షులు అరిస్తే మంచి శకునం. అన్ని శకున పక్షుల్లా వాటంతట అవి అరవటమే కాకుండ వీటికొక ప్రత్యేకత ఉన్నది. ప్రశ్న తెలుసుకోదలచిన వారు అవి నివసించే చెట్ల ప్రాంతానికి పోయి గంధాక్షతలతో పూజించి నైవేద్యం సమర్పిస్తే అవి అరగిస్తవట. వాటి రాకడ, అప్పటి చేష్టలు, అరుపులను బట్టి శుభాశుభాలు తెలుసుకోవచ్చు. ముఖ్యంగా వానకురిసే విషయంలో ఈ పక్షి శకునాలను గురించి "రెట్టమత శాస్త్రం" ప్రథమాశ్వాసంలో విపులంగా ఉన్నది.

పల్లెలలో ఉదయం పాలు పితకటం ఒక ప్రత్యేకమైన కార్యక్రమం. పగలు మేసిన మేత వంట బట్టటం వల్ల కాబోలు పశువులు సాయంత్రం కంటె ఉదయం ఇచ్చే పాలు ఎక్కువ. దూడలు ఆకలితో, తల్లులు చేపులతో ఒకటే అరుపులు. అది చూచి ఇంటి ఇల్లాలు పాలు తీయమని భర్తను కేకలేస్తుంటుంది. దూడలు మెడ పలుపు విప్పిందాకా ఆగకుండ గుంజుకుంటూ మెడతన్నె విడదీయటానికి వీలు లేకుండా వేసే గంతులు-అరిచే అరుపులు - వాటిని అదలిస్తూ యజమాని చీదరింపులు-అదంతా ఒక కోలాహలం. ఇంక ఎవరైనా పనిపాటు లేనివాళ్ళు నిద్రాపోదామన్నా సాధ్యం కాదు. ఈ విషయాన్ని సహజ సుందరంగా వర్ణించిన కాటూరివారి పద్యం చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"చేపుల్వచ్చి మొగమ్ము లెత్తి తనయ స్నేహార్ద్రిమా చూడ్కులన్
గేహపుం గాంచుచు నాలు పిల్వ, దలుగుల్ గ్రేడించి పెల్లాకటన్
గాపు ల్విప్పెడి దస్క గ్రేశ్యులకు లేగల్ మాటుపల్కన్ బళీ
మా పల్లీరమ మేలుకొల్పును తదంభారావ సన్నాహముల్"

(మా వాళ్ళ. మా ఊరు ప. 27)

గ్రామీణ జీవితాన్ని చిత్రించే కవిత్వాన్ని ఆంగ్ల సాహిత్యంలో "పాస్టరల్ పొయిట్రీ" అంటారు. మాద్యూ ఆరనాల్డు ప్రభృతులు దీన్ని విస్తృతంగా ప్రచారంలోనికి తెచ్చారు. ఆంగ్ల సాహిత్యంలో అభినివేశం గల కాటూరివారు తెలుగు కవితకు ఆ సొగసులు సంతరించి పెట్టారు. దువ్వూరి రామిరెడ్డి, ఏటుకూరి వేంకట నరసయ్య, తుమ్మల సీతారామమూర్తి మొదలైన కవులు కూడ తమ కావ్యాలలో తెలుగు పల్లె జన జీవనాన్ని వర్ణించారు.

కాటూరివారు ఈ కవితా ఖండికలో, మా వాళ్ళంటూ, తనవంశాన్ని గురించే కాకుండ, కాటూరులోని అన్ని కులాల వారిని గురించి వర్ణించారు. శిష్టులు, పండితులైన భాగవతులవారు, ప్రాతూరివారు, సంగీత విద్వాంసులైన పెంద్యాల వారు, సదాచార సంపన్నులైన ఉప్పులూరివారు, మొదలైన బ్రాహ్మణ వంశాలు-వెల్లంకి, కడియాల, ఏర్లగడ్డ, సూరపనేని, సూర్యదేవర మొదలైన కమ్మవారి వంశాలు-కాపులే కాక, యక్షగానాలాడే సాతానులు, సోదె చెప్పే పరిక ముగ్గులవారు, విజయ దశమి నాడు భేతాళ పూజ చేసే లాయిరీలు కూడ ఈ వర్ణనలో చోటు చేసుకున్నారు. ఇది వేంకటేశ్వరరావుగారి సౌహార్దానికి, విశాల దృక్పథానికి నిదర్శనం.

తన జీవిత కాలంలోనే గ్రామీణ జీవితంలో అనూహ్యమైన పరిణామాలు సంభవించటం కాటూరి కెంతో మనస్తాపం కలిగించింది.

అరవై ఆరు సంవత్సరాల జీవితానుభవంలో గమనించిన పల్లె జీవితంలోని మార్పులను వీరు చాలా చక్కగా వర్ణించారు. స్వాతంత్ర్య పూర్వస్థితి, స్వాతంత్రోద్యమ కాలం, బ్రిటీషువారి ప్రభావం వల్ల చెలరేగిన వర్ణ, వర్గ వైషమ్యాలు, స్వాతంత్ర్యంతో పాటు తలెత్తిన క్రొత్త పార్టీలు మొదలైన విషయాలన్నింటిని ఆయన పరామర్శించారు.

(4)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పూర్వం పల్లె ప్రజల మధ్య గల ఆత్మీయతలు, అనంతర కాలంలో సడలి, లౌకికమర్యాద లెక్కవయినవి. ఆర్థికంగా, వృత్తులలో, ప్రవృత్తులలో వచ్చిన మార్పులను కాటూరి వారు పదమూడు పద్యాలలో వర్ణించారు. ఇంత అల్పాక్షర సాధనంతో అంత అనల్పార్థ సంపత్తిని ఆవిష్కరించటమే కాటూరి వారు గొప్ప కవులనుటకు కారణం.

పల్లెటూళ్ళలో కులాలతో నిమిత్తం లేకుండా, తాత, మామ, బాబాయి, ఇలా ఏదో వరసలతో పిలుచుకుంటారు. కష్టసుఖాలను కలసి పంచుకుంటారు. వారి ఆత్మీయతలకు, అనురాగాలకు కులాలడ్డు రాలేదు. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పరిస్థితి మారిపోయింది. ఓట్లు, ఎన్నికలు, కులాల ప్రసక్తి, వైషమ్యాలు పెరిగినవి. ఈ విషయాన్ని వివరిస్తూ-

"కష్ట సుఖములందు గలిమి లేముల యందు
బంచి కుడుచు నాటి పల్లె బ్రతుకు
కన్ను మొఱగె, నేటి యన్నల కెడమొగాల్
పెడమొగాలు వచ్చి పడియె నెట్లు ?"

(మా వాళ్ళు, మా ఊరు ప. 29)

"నాడు లేని కొలమ్ములు నేడు రావు
కలిమి లేము లేనాడును గలవు గాదె
పల్లె బ్రతుకుల మాధుర్య మెల్ల విరిగి
పంచకోల కషాయ మప్పతిల నేల ?"

(మా వాళ్ళు, మా ఊరు ప. 30)

అస్తవ్యస్తంగా, అసహ్యంగా ఉన్న పల్లె జీవితాన్ని పంచకోల కషాయంతో పోల్చటం బాగుంది. శొంఠి, చవ్యము, మోడి, పిప్పళ్ళు, చిత్రమూలము వీటి కషాయమే పంచకోల కషాయము.

ఆనాటి గ్రామీణ రైతులు కొన్ని నియమాలు పాటించేవారు. క్రొత్త ధాన్యాన్ని చూచి కాని, పాత ధాన్యం అమ్మేవారు కాదు. అదీ ఊళ్ళోనే. గ్రామంలో బీదసాద భోజనం లేకుండా పస్తుండగా తాము ధాన్యం అమ్ముకోవటం పాపంగా భావించేవారు. అన్ని వృత్తులవారు తమ తమ పనులు తాము చేసుకుంటూ సఖ్యంగా సంతోషంగా ఉండేవారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"పండిన పంట యార్పిడిచి పైటికి నేగదు పేదసాద ప
స్తుండగ ధాన్య మమ్ముటలు దోసముగా దలపోతు రూర...."

(మా వాళ్ళు, మా ఊరు ప. 31)

పంటకు సంబంధించిన వ్యవహారం అలా వుంటే! పాడికి సంబంధించిన వ్యవహారం చూడండి. వీళ్ళ నిండా మొలలోతు గడ్డి పుష్కలంగా వుండటం వలన ఎవరి గొడ్లయినా ఎవరి బీళ్లోనైనా మేస్తుండేవి.

"కలవారి పాడి కుండలు
గలుగన్ పేదలకు జల్లకలు వెటులుండున్"

(మా వాళ్ళు, మా ఊరు ప. 34)

అంటారు వేంకటేశ్వర్రావుగారు.

గ్రామాలల్లో పూర్వం ఒక ఆనవాయితీ ఉండేది. పాడిలేని బీదవారు ఉదయమే జొన్నలు తొక్కుకొని, ఆ కుడితిని పాడి గలవారి గేదెలకు పోసేవారు. పాడి గలవారు పెరుగు, మజ్జిగ పాడిలేని వారికి ఇచ్చేవారు. ఇది వారి సహజీవనంలోని అన్యోన్యత.

ఆ రోజుల్లో పల్లెల్లో ఏ వస్తువయినా ధాన్యం కొలిచి కొనుక్కోటం అలవాటు. కూరలు, పండ్లు చివరకు చిల్లర దుకాణంలో వెచ్చాలు అన్నీ ధాన్యం ఇచ్చి తెచ్చుకోవటమే. నేటి కాలానికి ఆ పరిస్థితి మారింది. డబ్బు ప్రాధాన్యం పెరిగింది. వస్తు మార్పిడి పద్ధతి పోయింది. పల్లెలో పండే పంట, కూర, నార, పాలు, పెరుగు అన్ని అమ్ముకోవటం అలవాటయింది. ఈ పరిస్థితిని కాటూరివారు ఇలా చెప్పారు.

"ఊరబండనట్టి యుప్పున కుంగూడ
కొలుదొసంగి నాడు విలిచికొనిరి.
పుట్టనిప్పుగూడ బుట్టదు డబ్బీయ
కిప్పుడు పల్లెటూళ్ళ కేమివచ్చె" (మా వాళ్ళు, మా ఊరు. ప. 35)

ఇక్కడ "కొలుపు" అనే శబ్దం చక్కగా ప్రయోగించారు. కొలుపు అంటే కొలవటం, ధాన్యం అనే అర్థాలున్నవి.

ప్రజల మనస్తత్వంలో నాటికి, నేటికి వచ్చిన మార్పును, మార్పులోని సూక్ష్మత్వాన్ని వేంకటేశ్వర్రావుగారు సునిశితంగా వివరించారు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నాడును గల్లు ద్రావిరి, ధనమ్ములు ప్రుచ్చిరి, రన్యదారలన్
గూడిరి కాని పాపమను కొంకును, పొక్కునోయన్న భీతి వె
న్నాడెను వారి, నియ్యదన నట్టి భయమ్ముడివోయి, చప్పగా
నూడెను సిగ్గు పాపరతు లార్జితులై విహరింతు రిచ్చమై."

(మా వాళ్లు, మా ఊరు. ప. 37)

త్రాగుడు, దొంగతనం, వ్యభిచారం, అప్పుడూ ఇప్పుడూ ఉన్నవి. అయితే అప్పుడు జనంలో పాపభీతి, పరువుపోతుందనే భయం ఉండేవి. ఇప్పుడవి పూర్తిగా లేవు. మనం చేసిందే మంచిదనే దురభిమానం ప్రబలింది. నేటి కాలానికి త్రాగుబోతులు, జారులు, చోరులే పెద్దమనుష్యులుగా చెలామణీ అవుతున్నారు. ఈ సమాజం వారికే పెద్దపీట వేస్తున్నది.

అప్పటి పల్లె ప్రజలు, ఇతరులకు పెట్టటమే భోగంగా, నలుగురిలో అవమానమే కొరతబడటంగా భావించేవారు. వృత్తులలో తక్కువ ఎక్కువలు లేవు. మంచివారిని నెత్తిమీద పెట్టుకొనేవారు. నీతిలేని సంపదకు, లేని పాండిత్య ప్రకర్షకు విలువలేదు. దైవము, సత్యమే వారికి సాక్షి. అలాంటి సజ్జనులు సన్నుతి పాత్రులంటారు - కాటూరివారు. మరి నేటి పరిస్థితి పూర్తిగ విరుద్ధం.

పూర్వం గ్రామంలో ఏ తగాదాలు వచ్చినా కోర్టుకెక్కేవారు కాదు. ఊరి పెద్దలే తగవులు తీర్చేవారు. ప్రతి ఊరుకు రచ్చబండ, దానిపైన కూర్చునే పెద్ద మనుష్యులు, వారి దర్పం, ధర్మదీక్ష అపూర్వ మనోహర దృశ్యం. చిన్న పద్యంలో కళ్ళకు కట్టినట్లు చేసిన ఈ వర్ణన అపూర్వం.

"పొన్ను గఱ్ఱలు, గిఱ్ఱు చెప్పులును, నీరు
కావి పంచెలు, దలలగోకలును, దాల్చి
రెడ్డి గాలతో గొలువు దీరిచెడి ధర్మ
తత్పరుల నాటి యూరి పెద్దల దలంతు." (మా వాళ్ళు, మా ఊరు. ప.40)

నీరుకావి పంచల్ని గురించి నేటితరం మరచిపోయింది. తెల్లటి వస్త్రాలు నీళ్ళలో ముంచి పిండకుండా కొంతసేపు ఉంచి నీడలో ఆరేస్తారు. అలా ఒకటి రెండుసార్లు చేస్తే ఆ వస్త్రానికి లేత కాషాయవర్ణం వస్తుంది. అదే నీరుకావి. తల గుడ్డ, నడిచేటప్పుడు కిర్రుకిర్రుమనే చెప్పులు, పొన్నుకర్ర, అది ఒక ఠీవి. ఎర్రని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

డాలు కుచ్చులతో కిర్రుకిర్రులాడే చెప్పులు, కీలుగుర్రంతో పోటీ. అవి హోదాకి ప్రతిరూపాలు. జీతం బత్తెంలేని వందిమాగధులు.

కిర్రు చెప్పులంటుంటే నాబాల్యంలో జరిగిన ఒక సంఘటన గుర్తుకు వస్తున్నది.

మా తండ్రిగారు గ్రామాధికారులు. మాకు చెప్పులు కుట్టే అతను ఒకరోజు "కరణంగారూ! మీకు కిర్రుచెప్పులు చేసుకొస్తాను" అన్నాడు. "ఎందుకురా! మామూలు చెప్పులు చాల్లే" అన్నారు, మా నాన్నగారు అక్కడున్న పాలేర్లు మూకుమ్మడిగా "అయ్యగారికి కిర్రుచెప్పులే బాగుంటాయి. ఏమైనా సరే మీరు కిర్రుచెప్పులే వేసుకోవాలి దొరగారు" అని పట్టుబట్టారు. "సరే అలానే కానివ్వండి" అన్నారు మా తండ్రిగారు. వాళ్లు వెళ్ళిపోయిన తర్వాత నేను "నాన్నా! మీ కిర్రు చెప్పుల మీద జీతగాళ్ళకింత ఆసక్తి ఏమిటి" అన్నాను. "అదా! కిర్రు చెప్పులేసుకుంటే నేను రావటం అంత దూరంనుంచే తెలుస్తుంది గద. వాకిట్లో ఉన్నవాళ్ళు, పెరట్లో పనిచేసే వాళ్లు దాంతో జాగ్రత్త పడవచ్చు. అదీ వాళ్ళ ఏడుపు" అన్నారు. "మరయితే నువ్వు మామూలు చెప్పులే వేసుకో. పని చేయని వాళ్ళను వెనుకపాటుగా పోయి కనిపెట్టవచ్చు" అన్నాను నేను. "వాళ్ళని ప్రతిసారీ తిట్టటం నాకు కష్టంగానే ఉంటుంది. కిర్రుచెప్పులు నాకూ, సుఖమే. అందుకే సరే అన్నాను" అన్నారు.

అంటే కిర్రుచెప్పులు యజమానికి, నౌకరుకు ఉభయ తారకాలుగా పని చేసేవి. అంతేగాదు చీకట్లో నడిచేటప్పుడు పాములలాంటివి ఆ చప్పుడుకు దూరంగా పోతవి.

మనకెదురయ్యే ఒక చిన్న అనుభవం చెబుతాను. మనం ఇంట్లోంచి బజారుకు బయలుదేరతాం. నడవలో అడ్డంగా ప్రక్కవాటాల ఆడవాళ్లు కూర్చుని మాట్లాడుకుంటుంటారు. "ప్రక్కకు తప్పుకోండి" అనటానికి సంకోచంగా ఉంటుంది. ఇక అప్పుడు చెప్పులు గట్టిగా చప్పుడు చేస్తూ నడవక తప్పదు. నా మటుకు నాకు అప్పుడు కిర్రు చెప్పులుంటే బాగుండనిపిస్తుంది. మా నాన్నగారి కిర్రుచెప్పులు జీతగాళ్ళకే గాదు, చదవకుండా గోలీలాడే మాకూ, హెచ్చరికగానే ఉండేవి. ఒక పదిరోజుల తరువాత మా యింటికి కిర్రుచెప్పులొచ్చినవి. మా నాన్నగారు లేకుండా చూచి అతడ్ని "కిర్రుచెప్పులు బాగా చేశావా" అని అడిగాను. "కిర్రు బాగా పెట్టాను. ఫర్లాంగుదూరం ఇనపడాల్సిందే" అన్నాడు. నా కనుమానమొచ్చింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"కిర్రుపెట్టడమంటే ఏంటిరా ? ఎలా పెడతారు ? ఎక్కడ పెడతారు ?" అన్నాను. అప్పుడతను చెప్పిన మాటలు ఎంతో ఆశ్చర్యం కలిగించినవి.

ముదురు జంతువుల తోలును చిన్న చిన్న ముక్కలుగా కత్తిరిస్తారు. ఆ తోలుముక్కల్ని చింతాకు పసరులో నానబెడతారు. తరువాత ఎండబెట్టి గట్టిగా ఇనప గూటంతో తాటిస్తారు. మళ్ళీ నిమ్మకాయ పులుసులో వాటిని తడుపుతారు. మళ్ళీ ఎండ బెట్టి గూటంతో గట్టిగా తాటిస్తారు. అప్పుడవి గట్టిగా బిరుసెక్కుతవి. క్రింద ఒక తోలు అడ్డుపెట్టి దానిపైన ఈ ముక్కల్ని పేరుస్తారు. పైన మరో తోలుఅట్ట వేసి కుడతారు. అది చెప్పు అడుగు భాగం. నడిచేటప్పుడు ఆ ముక్కలు ఒకదానికొకటి ఒరుసుకొని కిర్రుకిర్రున చప్పుడు వస్తుంది. ఇది ఆ కీలుగుర్రాల రహస్యం.

"రెడ్డిగాలు" అనే మాట ఆనాటి గ్రామీణ వాతావరణాన్ని గుర్తుకుతెచ్చే చక్కని మాట.

"రెడ్డిరికం వేసుకొని కూర్చున్నాడు" "రెడ్డిగాలతో కూర్చున్నాడు" అనే మాటలు మనం పల్లెటూళ్ళలో వింటుంటాం. హోదా, దొరతనం గల కరణాలు, మునసబులు, గ్రామపెద్దలు మొదలైనవారు రచ్చబండపై కూర్చునే పద్ధతి అది.

మామూలుగా మడిచిన ఒక కాలిపాదం రెండవకాలి తొడక్రింద నేలకానేటట్లు, రెండవ కాలిపాదం మొదటికాలి తొడపైవేసి మోకాలు కొంచెం నిలువుగా ఉండేటట్లు కూర్చొనటాన్నే రెడ్డిగం వేసుకొని కూర్చోవటమంటారు. అంటే కాలుమీద కాలు వేసుకొని కూర్చోవటమన్నమాట. అలా కూర్చున్నపుడు మనిషి కొంచెం వెనక్కు వ్రాలుతాడు. పడకుండా ఉండటంకోసం రెండు చేతుల్ని వ్రేళ్ల కలిపి మోకాలికి బంధంగా తగిలిస్తారు. చేతులకు బదులు ఉత్తరీయాన్ని నడుముచుట్టూ రానిచ్చి రెండు చెరగుల్ని మోకాలిపైనుండి తీసి ముడివేయటంకూడ ఉన్నది. దీన్ని "రెడ్డి గాలు" అని కూడ అంటారు. ఇది ఒక దర్జా. పూర్వం వీధి అరుగులమీద, రచ్చ బండలమీద పెద్దలిలా కూర్చొని అన్ని గ్రామాల్లో కనిపించేవారు. ఇప్పుడు పెద్దరి కానికి అర్థమే మారిపోయింది.

ఈ రెడ్డిరికంమీద కొన్ని సామెతలు కూడ పుట్టినవి. "వాడికేంరా ! కాలు మీద కాలేసుకొని కూర్చుంటాడు" అనేదొక జాతీయం. కాలుమీద కాలేసుకుని కూర్చునేవాడు పెత్తందారి, గ్రామపెద్ద. తినగుడవ పున్నవాడే గ్రామపెద్దగా చెలా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పని అవుతాడు. ఏరోజు కారోజు తిండికి వెదుక్కునేవాడు తెలివిగలవాడైనా గ్రామ వ్యవహారాలెలా చక్కబెట్టగలడు? అలాంటివాడెవడైనా అలా పెద్దరికంకోసం ప్రయత్నిస్తే, ఇంటిల్లపాది మాడాల్సిందే. ఇంట్లోవాళ్ళను పస్తులుంచి తమ గొప్పకోసం పెద్దరికం వెలగబెట్టేవారు కూడ కొందరుంటారు. వాళ్ని గురించి మరొక సామెత పుట్టింది, "కాలుమీద కాలేసుకుని కూర్చుంటే నోట్లో వేలేసుకోవాల్సిందే" అనేదే ఆ సామెత. ఇలా ఈ కృతి గ్రామీణ జీవిత సౌందర్యానికి దర్పణంగా నిలిచింది.

కవితా శిల్పం

కాటూరి వారు తన వంశ వర్ణనం చేయటానికి నాందిగ "నేను" అనే శీర్షిక క్రింద వ్రాసిన ఒక పద్యంలో పింగళి సూరనను అనుకరిస్తూనే అద్భుతమైన ప్రతిభ చూపించారు.

సూరన పద్యపాదం :

"జనముల్మెచ్చగ మున్రచించితి సుదంచ ద్వైఖరిం గారుడం
బను శ్రీ రాఘవ పాండవీయము గళాపూర్ణోదయంబున్మరి
స్తెనుగుం గబ్బము లెన్నియేనియును........" (ప్రభా. ప్ర. పీ. ప. 6)

కాటూరి వారి పద్యపాదం :

"కవికుల వంద్యమౌ కవిత గల్పన చేయని చింత నా మదిన్
దవులదు సుంత ...." (నేను. ప. 4)

పింగళివారు జనములు మెచ్చేటట్లు కృతులు రచించానని చెప్పుకున్నారు. మరి కాటూరి వారు ఏమి చెప్పినట్లు? "కవులు కొనియాడదగిన కవిత్వం వ్రాయలేదనే చింత నాకు లేదు" అంటే కొనియాడదగిన కవిత్వం వ్రాశాను, అందుకే విచారం లేదని ఒక అర్థం. నేను అంత గొప్ప కవిత్వం వ్రాయలేదుకాని అది నాకు విచారం కలిగించటంలేదని ఒక అర్థం. ఇలా సూరనగారి ద్వ్యర్థి కళ కాటూరి వారికి పట్టుబడింది.

మొదటిది పింగళి వారి ఔద్ధత్యం, రెండవది కాటూరి వారి గడుసుదనం.

తెలుగు జాతీయాలన్నా పలుకుబడులన్నా కాటూరి వారి కెంతో మోజు. వారి కవిత్వంలో అవి ప్రత్యేకమైన దర్శనాలు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"కంటను వత్తి పై చికొని కాచెడి సైరికపాళి పున్నెపుం
బంటలు కృష్ణకాలువలు..........." (మావాళ్లు, మాఊరు. ప. 16)

అంటూ కృష్ణానది కాలువలను వర్ణించారు.

"కంట్లో వత్తి వేసికొని చూడటం" అన్నది చక్కని జాతీయం.

కాటూరిలోని కమ్మవారిని గురించి చెబుతూ

"పలు తెగల కమ్మ నాయకుల్ హలముఖాన
పల్లియ నొసంట దిద్దిరి భాగ్యరేఖ" (మా వాళ్లు, మా ఊరు ప. 23)

అని వర్ణించారు. తిలకం దిద్దేటప్పుడు పుల్లను ఉపయోగిస్తుంటారు. ఇక్కడ పల్లియ అనే సుందరి నొసట నాగలి అనే పుల్లతో రైతులు తిలకం దిద్దారనటం ఎంతో రమ్యమైన భావన.

వేంకటేశ్వరరావుగారు తన తండ్రి తిరుపతిలో మరణించిన సందర్భంలో చేసిన వర్ణన ఎంతో భావ గర్భితంగా ఉన్నది.

"కొండపైకి జేదికొన్న వేంకట సామి
కుతల మందు మమ్ము గూల ద్రోచె" (మా వాళ్లు, మా ఊరు ప. 63)

తన తల్లిని గురించి వర్ణిస్తూ

"........... బరుల మేలునకై చెమరించి సానపై
జందన ఖండమై మనిన సాధ్వి మదంబకు నీడు వత్తురే"
(మా వాళ్లు, మా ఊరు ప. 65)

త్యాగమూర్తియైన ఆమెను అరుగుతున్న గంధపు చెక్కతో పోల్చటం సహజ సుందరం.

శిల్పంలో, కల్పనలో, వర్ణనలో మనోహరంగా ఉన్న "మా వాళ్ళు మా ఊరు"ని కావ్య పీఠిక అనటం కన్న పీఠికా కావ్యం అంటే బాగుంటుంది. ఈ రచన నాటి గ్రామీణ జీవితాన్ని మన కన్నుల ముందు నిలుపుతుంది. ఒక రకంగా ఇది నాటి సామాజిక చరిత్ర. ఈ కావ్యంలో కాటూరి వారి కవితా కల్పనా శిల్పంకాక వాస్తవాన్ని కన్నులకు కట్టించే నేర్పు మనల్ని ఆకర్షిస్తుంది.

"దర్శనా ద్వర్ణనా చ్చాథ రూఢా లోకే కవిశ్రుతిః"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

2. పౌలస్త్య హృదయము

"పౌలస్త్య హృదయం" మొట్టమొదటిసారిగా పుస్తకరూపంలో 1944వ సంవత్సరం జనవరిలో మచిలీపట్నంలో ప్రచురింపబడింది. హాండ్ మేడ్ పేపరుపై ముద్రింపబడ్డ ఈ లఘుకావ్యం "శశికళా కిరణమాల" వారి తొలిప్రచురణ. ఇది కాటూరివారి రచనే అయినా పింగళి లక్ష్మీకాంతం గారి పేరుకూడ చేర్చబడింది. తమ గురువుల వలె, ఎవరు ఏకావ్యం రచించినా ఇద్దరి పేర్లతో ప్రకటించాలనే ఉద్దేశ్యంతో అలాచేసుంటారు. కాని కొంతకాలం తరువాత ఎవరి కావ్యాలను వారు తమతమ పేర్లతో విడివిడిగా ప్రచురించుకున్నారు. 1960వ సంవత్సర ప్రాంతంలో "త్రివేణీ పబ్లిషర్సు" బందరువారు, "పౌలస్త్య హృదయం" "గుడిగంటలను" "మావాళ్లు-మాఊరు" అనే పీఠికాకావ్యంతో కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారు. దీనిపై ఒక్క కాటూరి వేంకటేశ్వర్రావు గారి పేరు మాత్రమే ఉన్నది. వీరు ఈ గ్రంథాన్ని తమ అన్న రామకృష్ణయ్యగారికి మరణానంతరం అంకితం చేశారు.

కాటూరివారి కృతులలో పౌలస్త్య హృదయానికొక ప్రత్యేకత ఉన్నది. యుగయుగాలుగా దుర్మార్గుడని చెరగని ముద్రపడిన రావణుని రామభక్తునిగా ఈ కావ్యంలో వారు చిత్రించారు. కైక, దశకంఠుడు మొదలైన పాత్రలలో సౌజన్యాన్ని ఆరోపించి, వాల్మీకికి భిన్నంగా వ్రాసిన భాసుని లాంటి కవులు పూర్వం లేకపోలేదు. అసలు! వాల్మీకి రామాయణంలోనే రావణుడు, రాముని విష్ణువు యొక్క అవతారంగా గుర్తించినట్లున్నది. పూర్వ కాండల్లో సూచన ప్రాయంగా ఉన్న ఈ విషయం ఉత్తర కాండలో విపులంగా వివరించబడింది. ఆంధ్ర రామాయణకర్తలు కొందరు ఈ విషయంలో వాల్మీకాన్ని అనుసరించారు. మరి కొందరు దాన్ని విస్తరించారు. ముఖ్యంగా కంకంటి పాపరాజు తన ఉత్తర రామాయణంలో రావణుని ప్రవృత్తిని స్పష్టంగా చిత్రించాడు. ఇవన్నీ వేంకటేశ్వర్రావుగారి రచనకు ప్రేరకాలై యుండవచ్చు.

వైకుంఠ ద్వారపాలకులు జయ విజయులు. వారు సనకసనందనాదుల చేత రాక్షసులుగా పుట్టునట్లు శపింప బడ్డారు. వైరంతో మూడు జన్మల్లో తిరిగి వైకుంఠం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చేరే విధంగా విష్ణువే వారి శాప విమోచనాన్ని నిర్దేశించాడు. రావణ కుంభకర్ణులు శాపగ్రస్తులైన జయ విజయుల రెండవజన్మ. మరి అలాంటప్పుడు రావణుని దుర్మార్గ దని ఆడిపోసు కోవటంలో ఔచిత్య మేమున్నదన్న సందేహం కలుగక మానదు. అందుకే! రాముడై జన్మించిన విష్ణువు తనను గుర్తించటానికే రావణుడు అన్ని దుర్మార్గాలూ చేసినట్లు కాటూరి వారు చిత్రించారు.

సముద్రానికి ఆవలిప్రక్క వానర వీరులతో దండెత్తి వచ్చిన రాముడు. ఈవలి ఒడ్డున సీతను అపహరించి తెచ్చిన రావణుడు— మరొక వంక రాముని రాకను రావణునికి చెప్పటానికై నురగలు గ్రక్కుతూ పరుగెత్తి వచ్చిన సముద్రుడు. ఇది "పౌలస్త్య హృదయం"లోని కథారంగం. కథనం విషయానికొస్తే ఒక్క రావణుని పాత్రతోనే కథ అంతా నడుస్తుంది. రావణుని మాటలను బట్టి, రాముని ఆగమన వార్తను, సముద్రుడు చెప్పినట్లు వూహించవలసిందేగాని, సముద్రుడు ఈ కావ్యంలో ప్రత్యక్షంగా మాట్లాడడు. ప్రాచీన దృష్టితో పరిశీలిస్తే ఈ కావ్యం రావణుని స్వగతంగాను, ఆధునికదృష్టితో చూస్తే ఏకపాత్రాభినయంగాను కనిపిస్తుంది.

రాముడు లంకపై దండెత్తి వచ్చాడని, సముద్రుడు రావణునకు చెప్పినట్లు కాటూరివారు నూతనమైన కల్పన చేశారు. ఇందులో చాలా చమత్కారమున్నది. వాల్మీకంలో సముద్రం ఆవలి ప్రక్కన విడిసిన రాముని వార్తలను మొదటిగా రావణునికి చెప్పినవాడు శార్దూలుడనే గూఢచార రాక్షసుడు. తరువాత రావణుడు పంపగా వచ్చి, వానర సైన్యాన్ని చూచి, ఆసమాచారం అందించినవారు శుక, సారణులు అనే ఇద్దరు రాక్షస మంత్రులు. కాగా కాటూరి వారు వాల్మీకికి భిన్నంగా చేసిన కల్పనలో ఔచిత్యం ఎలాంటిదో పరిశీలించవలసి వున్నది.

సముద్రుడు రామదండును గురించి రావణునికి చెప్పటానికి కారణం, లంకను కాపుకొని ఉన్నవాడు కావటమే! ఇక రావణుడో—ఇంద్రాది దిక్పాలకులపై, ప్రకృతి శక్తులపై ఆధిపత్యం సాధించి, మూడులోకాల్ని గడగడ లాడిస్తున్నవాడు. అందు వల్ల సముద్రుడు రావణునికి లోబడి, లంకకు కాపలా కాయక తప్పదు. అందుకే ఇలా పడివచ్చి వార్తలందించటం. ఈ కల్పనలోనే కవి రావణుని లోక కంటకత్వాన్ని, త్రిభువన భయంకరత్వాన్ని సూచించాడు.

ఈ కల్పనలో మరొక చమత్కారం భాసిస్తున్నది — కావ్యారంభంలోనే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒక చక్కని దృశ్యాన్ని కాటూరివారు మన ముందుంచారు. రావణునికి ఎట్ట ఎదురుగా సముద్రం-మనసులో గూఢచారులు చెప్పిన దాశరధి సైనిక సమాచారం-చూపుమేరలో ఆదరినుండి వచ్చి, ఈ ఒడ్డునుతాకి, ఎగిరి పడుతూ ఘూర్ణిల్లుతున్న సముద్రపు అలలు-మనసు పొరలలో సీతపై వ్యామోహానికి, రామునిపై యుద్ధానికి, మధ్య కల్లోల పడుతున్న ఆలోచనలు. ఆ అలలు చూస్తుంటే, చేతులు చాచి సాగరుడు రామునివార్తలు తనకు చెబుతున్నాడా! అనిపిస్తుంది. అలా భావించిన రావణుడు, పలికిన స్వగతమిది. ఇది ఉత్ప్రేక్షామూలకమైన కల్పన.

ఒకపాత్ర స్వరూప స్వభావాలను; ఆపాత్ర పాల్గొన్న కథా సన్నివేశాల చిత్రణద్వారానో, మరోపాత్ర చేత వ్యాఖ్యానం చేయించటంద్వారానో, చిత్రించటం ప్రాచీనమైన కావ్యపద్ధతి. ప్రాచీన కావ్యాలలో స్వగతాలున్నా కావ్యం మొత్తాన్ని ఒక పాత్ర స్వగతంగా మలచటంగాని, తద్వారా పాత్ర చిత్రణం కావించటం కాని అరుదు. "ఏకపాత్రాభినయం" అనే ఆధునిక ప్రక్రియలో స్వగతంతోనే పాత్ర చిత్రణం జరుగుతుంది. కాటూరివారు ఈక్రొత్త పోకడలో రావణ పాత్రను చిత్రించారు.

రామాయణం పూర్వ కాండల్లో పౌలస్త్య హృదయము

వాల్మీకి రామాయణంలోనే కాక మరికొన్ని ఇతర రామాయణాలల్లో కూడ రాముడు వైకుంఠధాముడేనని రావణుడు గుర్తించినట్లు చిత్రింపబడింది. అధ్యాత్మ, రంగనాథ, భాస్కర, గోపీనాథ రామాయణాలు, అలాంటి వాటిలో కొన్ని. విశ్వామిత్రుడు, హనుమంతుడు, విభీషణుడు, కుంభకర్ణుడు, మండోదరీ, మొదలైన వారే కాకుండ, రావణుడు కూడ స్వయంగా, రాముడు విష్ణువు యొక్క అవతారమని చెప్పిన సన్నివేశాలున్నవి. వాటిని స్థూలంగా పరిశీలిస్తాను.

వాల్మీకి రామాయణంలో మాల్యవంతుడు, సీతను సమర్పించి రామునితో సంధి చేసికొనమని చెప్పినపుడు, రావణుడు పలికిన పలుకులివి.

"ఆనీయ చ వనాత్సీతాం పద్మ హీన మివ శ్రియమ్
కి మర్థం ప్రతి దాస్యామి రాఘవస్య భయాదహమ్"

(యుద్ధ. స. 36 శ్లో. 8)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నేను పద్మాసనంలేని లక్ష్మీదేవి వలెనున్న సీతాదేవిని వనంనుండి తెచ్చి, రామునికి భయపడి ఎందుకిస్తాను" అని దీని భావం.

ఈ మాటల్ని బట్టి, సీత, లక్ష్మి యొక్క అవతారమనే విషయం రావణుడు గ్రహించాడనిపిస్తుంది.

యుద్ధరంగంలో, అకంపనుడు, ప్రహస్తుడు, కుంభకర్ణుడు మొదలైన రాక్షస వీరులు మరణించిన తరువాత, రామ పరాక్రమానికి భీతిల్లిన రావణుని మాటలు చూడండి.

"అహో ను బలవా న్రామో మహద స్త్రి బలం చ వై
యస్య విక్రమ మాసాద్య రాక్షసా నిధనం గతాః
తం మన్యే రాఘవం వీరం నారాయణ మనామయం
తద్భయా ద్ధి పురీ లంకా పిహిత ద్వారతోరణా !"

(యుద్ధ. స. 72 శ్లో. 10, 11)

"రాముని కంటబడగానే బలవంతులైన రాక్షసులందరు మరణించారు. అతని అస్త్రబలం సామాన్యంకాదు. మహావీరుడైన ఈ రాముడు నారాయణుడనే తోస్తున్నదీ. అతనికి భయపడేగదా ! లంకానగర ద్వారాలన్నీ మూసుకున్నాను" అంటూ రావణుడు చింతించాడు.

ఈ రెండు సన్నివేశాలలో రావణుడు సీతను లక్ష్మిగాను, రాముని విష్ణువుగాను గుర్తించినట్లు మన కనిపిస్తుంది.

ఇక అధ్యాత్మ రామాయణంలో కూడ రావణుడు రాముని గుర్తించినట్లుగానే ఉన్నదీ.

"జానామి రాఘవం విష్ణుం లక్ష్మీం జానామి జానకీం
జ్ఞాత్వైవ జానకీ సీతా మయానీతా వనా ద్బలాత్
రామేణ నిధనం ప్రాప్య యాస్యా మీతి పరంపదం
పరానందమ:ా శుద్ధా సేవ్యతే యా ముముక్షుభిః
తాం గతింతు గమిష్యామి హతో రామేణ సంయుగే"

"రాముడు విష్ణువని, సీత లక్ష్మి అని తెలుసు. రాముని చేతిలో మరణించి మోక్షం పొందటానికే ఆమెను బలాత్కారంగా తెచ్చాను" అంటాడు దశకంఠుడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రంగనాథ రామాయణంలో ఈ విషయం చాలా ప్రస్ఫుటంగా చిత్రింపబడింది. "హరి రాముని గా జన్మించాడని నారదుడు నాకు చెప్పాడు" అని కుంభకర్ణుడు రావణునితో పలికినప్పుడు, అతని సమాధానం చూడండి.

"చెలువారగా నిటు సీతయై లక్ష్మి
ఇలకు జనించుట యే నెఱుంగుదును
అరయంగ రఘురాము డా విష్ణుడగుట
పరికించి యెరుగుదు భావంబు లోన
వల నొప్ప దేవతల్ వానరులగుచు
నిలమీద జన్మించు టే నెఱుంగుదును
నెలమి గామంబున నే సీత దేను
బలిమి గ్రోధంబున బట్టి యేదేను
రణము లోపల రఘురాము చే నీల్గి
ప్రణుతింప విష్ణుని పరమ పదంబు
దక్కక పొందంగ దలచియే సీత
నిక్కంబు తెచ్చితి నింకేల దాప" (తె. వి. ప్ర. — పే. 350)

భాస్కర రామాయణంలో కూడ, కుంభకర్ణుడు రామతత్వాన్ని చెప్పినపుడు రావణుడు అంతా తనకు తెలిసినట్లే ప్రవర్తించాడు.

"జనక సుత లక్ష్మి రాముండు వనజ నాభు
డగుట నిక్క మెరింగియు నితని చేత
బవరమున గూలి కైవల్య పదము నొంద
సీత దెచ్చితి నింకేమి సెప్పబొమ్ము" (యుద్ధ. ప. 896)

అంటూ తన మనోనిశ్చయాన్ని తెలిపాడు.

మరొక సన్నివేశంలో కూడ, రావణుడు తన అంతర్యాన్ని విప్పి చెప్పాడు. పాతాళహోమం చేస్తున్నాడు రావణుడు. దాన్ని భగ్నం చేయటానికి అంగదుడు మండోదరిని అక్కడకు ఈడ్చి తెచ్చాడు. యజ్ఞం విఘ్నమయింది. తనకు జరిగిన పరాభవానికి కుమిలిపోతూ ఆమె, భర్తకు రాముని మహాత్మ్యాన్ని ఉపదేశించింది. ఆమెకు సమాధానంగా రావణుని మాటలు చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఎఱుగుదు బ్రహ్మ బాంధవ కులేశుడు పంకజ నాభుడౌట యే
నెఱుగుదు మున్ను యిందిర మహీసుతయై తనరారు సీతగా
నెఱుగుదు నాకు రాఘవ మహేశుని చేతి వధక్రమంబు ని
ట్లెఱిగియు ముక్తి బొందగ నభీష్టము గల్గుట నింత చేసితిన్"

(యుద్ధ. ప. 1926)

గోపీనాథ రామాయణంలో కూడ రావణుని పాత్ర, పై రామాయణాలలో లాగానే చిత్రింపబడింది. క్రీ॥ శ॥ 1700 సంవత్సర ప్రాంతంలో కుందుర్తి వేంకటాచల కవి రచించిన "ఉత్తర గోపుర కథ" లేక "గొడుగుల వచనము" అనే వచన రామాయణంలో కూడ రావణునికి రామతత్వం తెలిసినట్లుగానే చిత్రింపబడింది.

"మున్నుశుక సారణులు రామగుణ పరాక్రమంబులు చెప్పిన తెలియనైతి, అతడే ధర్మి, అతడే ఆదిమూర్తి, అతడే సత్యసంధుడని నేను నిక్కంబెఱింగితి అతడే సర్వలోక రక్షకుడు, అతడే సర్వ జీవదయా పరమూర్తి"

(ఆంధ్ర వచన వాఙ్మయము—నిడదవోలు వెంకట్రావు పే. 47 - ప్రచురణ 1977)

ఇలా రామాయణాల పూర్వ కాండల్లో చిత్రింపబడిన దానికన్న, వివరంగా సమగ్రంగా రావణుని హృదయం ఉత్తర కాండల్లో ఆవిష్కరింపబడింది. అవి కూడ పరిశీలించటం సముచితంగా ఉంటుంది.

ఉత్తర రామాయణాలలో పౌలస్త్య హృదయము

కాటూరివారి "పౌలస్త్య హృదయము" కావ్యంలోని కథావస్తువునకు మూలం వాల్మీకి, రంగనాథ రామాయణాల ఉత్తర కాండల్లోను, కంకంటి పాపరాజుగారి ఉత్తర రామాయణంలోను ఉన్నది. ఆయా సన్నివేశాల్ని పరిశీలిస్తే ఈ విషయం ధృవపడుతుంది. ఈ గ్రంథాలన్నిట్లో రావణుని వృత్తాంతం ఇంచుమించుగా ఒకే విధంగా ఉన్నట్లు మనం గ్రహించవచ్చు.

వాల్మీకి రామాయణం ఉత్తరకాండలో ఈ విషయానికి సంబంధించిన దశకంఠుని వృత్తాంత మిలా ఉన్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పౌలస్త్యుని హృదయంలో రామాయణాన్ని మొదట ప్రతిష్ఠించినవాడు సనత్కుమారుడు. ఆ హృదయాన్ని విప్పి చెప్పినవాడు అగస్త్యుడు. ఆ చెప్పింది రావణాంతకుడైన రామునితోనే కావడం మరీ విచిత్రం. రావణ సంహారం పూర్తయింది. అయోధ్యలో రామపట్టాభిషేకం జరుగుతున్నది. ఆహూతులైన వశిష్ఠ, వామదేవ, అగస్త్య, కణ్వాది ఋషిపుంగవులు రాముణ్ణి ఆశీర్వదించటానికి వచ్చారు. వారిలో అగస్త్యుడు రామునికి రావణ కుంభ కర్ణాదుల పూర్వ వృత్తాంతం వినిపించిన సందర్భంలో ఈ విషయాలు ప్రస్తావింపబడినవి.

— : కపిల మహామునిని సందర్శించిన రావణుడు : —

తనతో పోరాడగల యోధుల్ని వెదకుతూ, పశ్చిమ సముద్ర తీరంలో సంచరిస్తున్న దశకంఠునికి కపిల మహాముని కనిపించాడు. తపోనిష్ఠలో ఉన్న ఆ మునిని రావణుడు సమీపించాడో లేదో ఆయన క్రీగంటి చూపుల్లోనుండి భయంకరమైన అగ్నిజ్వాలలు వెలువడినవి. ఆశ్చర్యంతో మరొకమారు పౌలస్త్యుడు తేరిపార జూచాడు. కపిలుని శరీరంలో నిఖిల విశ్వం గోచరించింది. తన ముందు వీడెవడో మాయలు ప్రదర్శిస్తున్నాడని ఆగ్రహించిన రావణుడు ఆ మునిపై నిశితాస్త్రాలు ప్రయోగించాడు "నన్ను సాధించటానికిక్కడికి వచ్చావురా! మూర్ఖుడా" అంటూ హుంకరించి కపిలుడు రక్కసుడ్ని, పిడికిలితో ఒక్క పోటు పొడిచి, గుహాంతరాళంలోకి వెళ్ళిపోయాడు. వజ్రాయుధ ఘాతానికి కూలిన పర్వతంలాగ క్రిందపడ్డ రావణుడు కొంతసేపటికి మూర్ఛ తేరుకుని, తక్కిన అనుచరులు వారిస్తున్నా వినకుండా, కపిలుణ్ణి వెంబడించాడు. ఆ గుహలో శంఖ చక్ర గదాధరులైన వీరవరులు, సిద్ధులు, దేవకాంతలు అతనికి గోచరించారు. వారి తేజానికి జంకి వెనుదిరిగిన రావణునికి అంధకారాన్ని పారద్రోలుతున్న మకరకుండల ప్రభలతో, దివ్య గంధ, మాల్యాభరణ భూషితుడై నిద్రిస్తున్న ఒక మహాపురుషుడు కనిపించాడు. ఆ తల్పంమీద ఆయన పాదాలొత్తుతూ శరచ్చంద్రికా ధావళ్యంతో మెరసిపోతున్న ఒక సుందర స్త్రీమూర్తి కూడ ఉన్నది. ఆమెను చూడటంతోనే, మోహవశుడై రావణుడు సమీపించాడు. అది గమనించిన ఆ దివ్య పురుషుడు దిగ్గున లేచి ప్రళయాట్టహాసంచేశాడు. ఆ ధ్వనికి భీతిల్లిన దశకంఠుడు "బ్రహ్మను, రుద్రుణ్ణి, యముణ్ణి, సూర్యుణ్ణి ఎందరినో చూచాను. ఇలాంటి ప్రభావం వారెవరికీ లేదు! నీవెవ్వడవు?" అని ప్రశ్నించాడు. సమాధానంగా "బ్రహ్మ వరంచేత బ్రతికిపోయావు, లేకపోతే నిన్నిప్పుడే వధించేవాణ్ణి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇప్పుడు నేనెవరో గ్రహించలేవు. నాచే వధింపబడేనాడు నేనెవరైంది తెలుస్తుంది" అంటూ తన విశ్వరూపం చూపింవాడతడు. నిఖిల చరాచర ప్రపంచం ఆ మహాత్మ నిలో గోచరించింది. ఆ అద్భుత తేజానికి దశాననుడు కంపించిపోయాడు. ఆ సంద ర్భంలో రావణుని అభిప్రాయాల్ని, ఏయే రామాయణాలు ఎలా వ్యక్తం చేసినవో చూడండి.

రావణుడు కపిలునితో అన్న విషయం వాల్మీకి రామాయణం ఉత్తరకాండలో ఉన్న వైనమిది.

"అమరో వా సురశ్రేష్ఠ తేన మాం నావిశద్భయమ్
అథపి చ భవేన్మృత్యుస్త్వత్తో మే నాన్యతః ప్రభో
యశస్యం శ్లాఘనీయం చ త్వత్తోమే మరణం త్విదమ్
అథాపశ్యత్తస్యగాత్రే రావణో భీమవిక్రమః"

(సర్గ 5; శ్లో॥ 59, 60: మైలాపూర్ ప్రతి)

"మహా పరాక్రమం గలిగిన నాకు ఏ దేవతలవల్ల ప్రాణభయంలేదు. ఒక వేళ మృత్యువు నాకు సంభవిస్తే, నీవల్లనేకాని, ఇతరులవల్ల కాదు. అది నాకు శ్లాఘ నీయమే" అంటాడు రావణుడు.

అదే సన్నివేశము రంగనాథ రామాయణంలో ఇలా ఉన్నది.

"బ్రహ్మతేజంబున బాపేలకల్గు; బ్రహ్మకు మనుమడౌ పంక్తికంఠునకు
నక్షైన నీచేత నగునట్టి మరణ మెట్లును గీర్తి నాకెల్లలోకముల;"

(ఉ. కాం. 591 పే. తె. వి. ప్ర)

ఇక కంకంటి పాపరాజు తన ఉత్తర రామాయణంలో రావణుని భావాన్ని ప్రస్ఫుటంగా చిత్రించాడు.

"కన్ను లన్నియు మొగిచి నక్తంచరేంద్రు
డమ్మహామూర్తి కానక లాచరించి
యంజలులొనర్చి "దేవ నీవని వధించు
నంతకంటె శుభంబేది" యనుచు బలికె" (అ. 5 ప. 67)

తనకంటే అధికుడొకడున్నాడని, అతని చేతిలో తనకు మరణం సంభవిస్తుం దేమోనని, రావణుడు మొట్టమొదటిసారిగా భయపడిన సన్నివేశమిది. ఇదే పౌలస్త్య హృదయాంతర్గత రామాయణ కథకు బీజం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తనకంటె అధికుడైన ఆ వ్యక్తి విష్ణువు కావాలని, ఆయన చేతిలో మర ణించి ముక్తి చెందిన హిరణ్యాక్ష హిరణ్యకశిపులలాగా తనుకూడా మోక్షాన్ని పొందు తానని, సనత్కుమారుని దర్శించకముందే రావణుడు నిర్ణయించుకొనినట్లు కంకంటి వారు చిత్రించారు.

వాల్మీకి, రంగనాథ రామాయణాలల్లో మాత్రం సనత్కుమారుని బోధ తరువా తనే దశకంఠుడు అలాటి నిర్ణయానికొచ్చినట్లు చిత్రింపబడింది.

—: సనత్కుమారుని సందర్శించిన రావణుడు :—

నారాయణరూపుడైన కపిల మహా మునిని ఎపుడు దర్శించాడో! విష్ణువుచేత తనకు మరణం కలుగుతుందనే భావన ఎప్పుడు ధృవపడిందో! అప్పుడే! అలా మర ణించటంవల్ల ఎలాంటి గతులు ప్రాప్తిస్తవో తెలుసుకోవాలనే ఆసక్తి కూడ, రావణు నికి కలిగింది. అందుకే, బ్రహ్మ మానసపుత్రుడు సనత్కుమారుని దర్శించి—

"అమరులకన్న అధికబల సంపన్నుడెవడు? బ్రహ్మాదిరుద్రులు, ఋషులు, నిత్యం ఎవ్వని ధ్యానిస్తుంటారు? ఎవరా సర్వ శక్తిమంతుడు? వానిని గురించి తెలుప వలసింది" అని ప్రార్థించాడు.

అలాంటివాడు నారాయణు డొక్కడేనని, అతడు రాక్షస సంహారకుడని, వివ రించా డాముని.

"ఆ విష్ణువు చేతిలో మరణించినవానికి ఎలాంటి గతులు ప్రాప్తిస్తవి" అంటూ మరొక ప్రశ్నవేశాడు దశకంఠుడు.

"హరి చేతిలో మరణించినవారు ఆ హరి రూపంతోనే వైకుంఠంలో విష్ణు సాన్నిధ్యంలో విహరిస్తుంటారు" అన్నాడు సనత్కుమారుడు.

ఆ సమయంలో రావణుని హృదయంలో చెలరేగిన ఆలోచనలు సనత్కు మారుని బోధన, వివిధ రామాయణాలల్లో ఎలా ఉన్నదో చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వాల్మీకి రామాయణంలో రావణుడు భావించిన తీరిది.

"శ్రుత్వా తత స్తద్వచనం నిశాచరః
సనత్కుమారస్య ముఖాద్వినిర్గతమ్
తథా ప్రహృష్టః స బభూవ విస్మితః
కథంతు యాస్యామి హరిం మహాహవే"

(స. 7. శ్లో॥ 23. మైలాపూర్ ప్రతి)

ముని మాటలు విన్న తరువాత, హరితో యుద్ధం ఎలా వస్తుందా! అని రావణుడు ఆలోచించాడు.

రంగనాథ రామాయణంలోని విషయం చూడండి.

"వారక యాదైత్యవైరితో వైర, మేరూపమున గీర్తి హేతువు నాకు
నిటుమీద నా తెరంగేయుపాయముల, ఘటించునోయని కడువిచారింప
నామహా యోగియు నా తలంపెఱిగి, యామినీ చరనాథ యనుమాన ముడుగు
కమల నాభుడు నిన్ను గయ్యంబులోన, సమయింప గలడన్న సంతోష మంది"

(తె. వి. ప్ర. పే. 604)

కంకంటి వారి ఉత్తర రామాయణంలో రావణుని భావం సంపూర్ణంగా చిత్రింపబడ్డది.

"పలుకులు పేయునేల మధు భంజను కిన్క తపః ఫలంబు శ
త్రుల కని యమ్మహా మునివరుం డెఱిగించిన బంక్తి కంధరుం
డలరి ముకుందుతో సమర మబ్బునె యవ్విభుచేత జచ్చి ని
శ్చల పద మొందగా గలనె శాంతినిధీ వివరింప వే యనన్"

(అ. 5. ప. 189)

"సనకా వరజుం డిట్లను
కనకాచల ధీర పంక్తి కంధర వినుమా
ఘనకాయునితో నని మా
ర్కొని కాయము విడువగలవు కుందకు మదిలోన్"

(అ. 5. ప. 190)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"అనిన ముదమంది దశకంఠు డమ్మహాను
భావుగని యెన్ని నాళ్ళ కప్పని యొనర్చ
హరియన నతండు పెండియు ననియె గృతయు
గాంతమున మానవేంద్రుడై హరిజనించు (అ. 5. ప. 191)

రాముని చేతిలో వధింపబడటానికి రావణుడు ఎందుకు, ఎలా, సిద్ధంగా ఉన్నాడో, పై విషయాల్ని బట్టి మనం గ్రహించవచ్చు.

—: సనత్కుమారుడు చెప్పిన రామకథ :—

సనత్కుమారుడు భవిష్యత్తులో జరగబోయే రామకథను సంక్షిప్తంగా అప్పుడే రావణునికి చెప్పాడు. ఆ రామకథ వివిధ రామాయణాలలో ఎలా ఉన్నదో కూడ చూద్దాం.

ముందుగా వాల్మీకి రామాయణం ఉత్తరకాండలో విషయం పరిశీలిద్దాం.

"కృతే యుగే వ్యతీతే వై ముఖే త్రేతాయుగస్య తు
హితార్థం దేవ మర్త్యానాం భవితా నృపవిగ్రహః॥
ఇక్ష్వాకూణాం చ యో రాజా భావ్యో దశరథో భువి
తస్య సూనుర్మహాతేజా రామో నామ భవిష్యతి॥

మహాతేజా మహాబుద్ధి ర్మహా బల పరాక్రమః
మహాబాహు ర్మహా సత్త్వః క్షమయా పృథివీ సమః॥
ఆదిత్య ఇవ దుష్ప్రేక్ష్యః సమరే శత్రుభిః సదా
భవితా హి తదా రామో నరో నారాయణః ప్రభుః॥

పితుర్నియోగాత్ స విభుర్దండకే వివిధే వనే
విచరిష్యతి ధర్మాత్మా సహ భ్రాత్రా మహాత్మనా॥
తస్య పత్నీ మహాభాగా లక్ష్మీః సీతేతి విశ్రుతా
దుహితా జనకస్యైషా ఉత్థితా వసుధా తలాత్॥"

(స. 8 శ్లో. 18 నుండి 23, మైలాపూర్ ప్రతి)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రంగనాథ రామాయణంలో రామకథ ఇలా చెప్పబడింది.

"యామినీ చరనాథ యా జగన్నాథు, తామసిపై బొంద దలచితే వినుము
అనఘుడు త్రేతాయుగాది నిక్ష్వాకు, డను రాజ పుంగవు నన్వయంబునను
దశరథుడను పేర ధరణీశ్వరుండు, విశదోరుకీర్తులు వెలయ జన్మించు
నాసత్య సంధున కాజానుభుజుడు, భాసురాకారుడు పటుపరాక్రముడు
రాము డయ్యాది నారాయణమూర్తి, భూమండలంబున బుట్టంగ గలడు
సిరియను భూపుత్రి సీత నా బుట్టి, గురుమతి జనకుని కూతురై పెరిగి
రూపలక్షణ గుణ రుచిర తేజముల, దీపించి యా రాముదేవి గా గలదు
అటమీద దనకూర్మి యనుజన్ముడైన, చటుల విక్రమశాలి సౌమిత్రి గొలువ
పరమ పాతివ్రత్య భవ్యశీలముల, నిరుపమ స్థితి దోడ నీడయు బోలె
నామహీసుత తోడ నరుగు దేరంగ, రాముడు దండకారణ్యంబునందు
తన తండ్రియయియున్న దశరథు నాజ్ఞ, సముచిత మునివృత్తి జరి
యింపగలడు"

(తె. వి. ప్ర. పే. 606)

కంకంటివారి ఉత్తర రామాయణంలో చిత్రింపబడ్డ రామకథ ప్రస్ఫుటంగా ఉన్నది.

వేల్పులు గావించు విన్నపంబులు వించు
హరి నిన్ను వధియించు నాత్మ మించు
రవికులాబ్ధి జనించు రామనామము గాంచు
దపసి జన్నము బెంచు రిపులనొంచు
శిల జెల్వ నొనరించు శివుని చాపమ్ముద్రుంచు
జానకి వరియించు సంతసించు
జామదగ్ని కలంచు జనకాజ్ఞ పాలించు
మునివృత్తి ధరియించు వనిజరించు
నీ సహోదరి ముక్కు ఖండింప బంచు
సరగ ఖరదూషణాదుల సంహరించు
నవనిసుత నీవు గొనిపోవ నాగ్రహించు
నది నిమిత్తంబు నిను రాము డని వధించు (అ. 5 ప. 193)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ మూడు రామాయణాలను పరిశీలించిన తరువాత కంకంటివారి ఉత్తర రామాయణంలోనే రామకథ సమగ్రంగా ఒక సీస పద్యంలో వివరింప బడినట్లు మనం గమనించవచ్చు.

—: అగస్త్యుడు వ్యక్తీకరించిన పౌలస్త్య హృదయము :—

ఇప్పటి వరకు సనత్కుమారుడు రావణునకు చెప్పిన రామకథను, అగస్త్యుడు రామునకు చెప్పి, చివరిగా తన మాటల్లో పౌలస్త్య హృదయాన్ని విప్పి చెప్పాడు. అదీ కూడ ఆయా రామాయణాలల్లో ఎలా ఉన్నదో చూడండి.

ముందుగ వాల్మీకి రామాయణంలో అగస్త్యుడు పలికిన పలుకులిలా ఉన్నవి.

ఏవం శ్రుత్వా మహా బాహూ రాక్షసేంద్రః ప్రతాపవాన్
తత్వయా సహా విరోధేచ్ఛుశ్చింతయామాస రాఘవ॥
వాక్యం సనత్కుమారస్య చింతయానో ముహుర్ముహుః
రావణో ముముదే శ్రీమాన్ యుద్ధార్థీ విచారహ॥"

(స. 8. శ్లో. 27, 28)

"శ్రుత్వా తవ మహాబాహో కథామృత ముదాహృతమ్
ఏతదర్థం మహాబాహో రావణేన దురాత్మనా॥
విజ్ఞాయ చ హృతా సీతా త్వత్తో మరణ కాంక్షయా
భవాన్నారాయణో దేవః శంఖ చక్ర గదాధరః॥"

(స. 10. శ్లో. 104, 105)

రంగనాథ రామాయణంలో ఆదే భావం స్వీకరింపబడింది.

"అన విని రఘునాథ యంతరంగమున; ననురాగమును బొంది యా రావణుండు
మదగర్వ మెసగంగ మసలి నీతోడ; గదన మెప్పుడు సేయగలుగునో యనుచు
సర్వలోకములందు జరియింపు చుండె; సర్వేశ్వరుడ నీవు సముచితతని
....
జననాథ నీ చేత సమరంబులోన; దునియలై పడి ముక్తిదొరకొందు ననుచు
ఘనబాహుడగు పంక్తికంఠుడు సీత; గొనిపోయెనని చెప్పి కుంభ సంభవుడు"

(తె. వి. ప్ర. పే 606)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కంకంటివారి ఉత్తర రామాయణంలో అగస్త్యుడు రావణ హృదయాన్ని స్పష్టంగా చెప్పాడు.

"రామనృపాల వింటి గద రావణు బుద్ధి సమృద్ధి జానకిం
గాముకుడై హరించెనని కానక పల్కుదు రామె యిందిరా
శ్యామ యటంచు నీవు హరి వంచు నెరింగియె యుద్ధ భూమి నీ
చే మృతి బొంద గావలసి సీత నొగిం గొని పోయె లంకకున్"
(అ. 5. ప. 196)

"నెమకి సనత్కుమారు గని నీ మహిమంబులు విన్నదాదిగా
నమర విరోధి నీ మదికి నక్కజనింప సురారి నొంచు లో
కముల నలంచు జన్నములు గాంచిన విఘ్నము లాచరించు సం
యముల గలంచు బుణ్యసతులన్న గ్రహించు జరించు నెయ్యడన్
(అ. 5. ప. 199)

ఈ విషయాలను పరిశీలించిన తరువాత రాముడు జన్మించక ముందే పౌలస్త్యుని హృదయంలో రామకథ నిండి ఉన్నదని తెలుస్తున్నది. కాటూరివారు తన కావ్యానికి ఈ రామాయణాలలోని ఉత్తరకాండలను ఆధారంగా తీసుకున్నా! కంకంటివారి ఉత్తర రామాయణ ప్రభావమే ఎక్కువగ కనిపిస్తుంది. కంకంటివారు కాటూరివారి అభిమాన కవి కూడ.

ఆధారం ఏదైనా కవి ప్రతిభ, కావ్యాన్ని నిత్య నూతనంగా తీర్చిదిద్దుతుంది. కాటూరివారు సముద్రునిపాత్రను క్రొత్తగా కల్పించారు. అగస్త్యుడు చెప్పిన పౌలస్త్య హృదయాన్ని తనకు తానుగా ఈ కావ్యంలో విప్పి చెప్పుకున్నాడు రావణుడు.

తనను చేరుకొనే వైర మార్గాన్ని విష్ణువు జయ విజయులకు ఉపదేశించాడు. ఆ మార్గంలో వాడే రావణుడు. ఆ వైరభక్తి ఎలాంటిదో కాటూరివారు ఆభక్తిని తన కావ్యంలో ఎలా పొందుపరచారో కొంత పరామర్శిస్తాను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వైరభక్తి

భాగవతం నవవిధ భక్తుల్ని చెప్పింది.

"శ్రవణం, కీర్తనం, విష్ణో, స్మరణం పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్"
(శ్రీమద్భాగవతం—7-5-33)

ఈ మార్గాలన్నీ సత్వ రజో గుణాలకు సంబంధించినవి. వైరభక్తి తమో గుణానికి సంబంధించినది. అదే విషయాన్ని రంగనాథరామాయణంలో సనత్కుమారుడు రావణునితో :

"యామినీ చరనాథ యా జగన్నాథు; తామసిపై పొందలచితేని? వినుము" అంటూ సూచించాడు. (తె.వి. ప్ర. పే. 607)

ఆ వైరభక్తిని కంకంటి పాపరాజు మూడు పద్యాలలో చాలా విపులంగా వివరించాడు.

"ప్రణవంబు జపియించు ఫలము కేశవుజేరి
యట్టహాసము జేసి నంతలోన
భాగీరథీస్నాన ఫలము శ్రీధరు దేయు
నస్త్రాళి మునిగిన యంతలోన

బహుకాల చింతనా ఫలము నారాయణు
నలుకమై వీక్షించి నంతలోన
బ్రౌ బల్కుల నుతించు ఫలము నందకపాణి
నదలంచి తిట్టిన యంతలోన

దనువు గృశియింప శాంతితో దపము సేయు
ఫలము బహుమత్సరంబుతో బద్మనాభు
నాగి మెయి వొంగ మార్కొన్న యంతలోన
గలదు హరితోడి పగకంటె గలదె మేలు." (ఉ.రా. అ. 5. ప. 186)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"చపలతలేని చూడ్కులను సారెకు శౌరిముఖంబు చూచుచున్
విపుల రణోత్సవంబులను విష్ణుని పేరులు పెట్టి పిల్చుచుం
గుపిత మనస్కులై యొరసి కొంచు ముకుందుని మ్రోల గూలు దై
త్యపతుల భాగ్యమెంత సుకృతాత్ముల కైనను గల్గనేర్చునే"
(ఉ.రా. అ.5. ప. 187)

"ఆయుధధార ముంచి రుధిరారుణ చందన కర్దమంబునం
గాయము నించి శాత విశిఖ ప్రసవాళి పై నిగిడ్చి దై
తేయులు శౌరిచేత నతితీవ్రముగా గయికొంద్రు ముక్తి స్వా
ధ్యాయ తపోమఖక్రియలు దాల్చిన ధన్యులకంటె ముందరన్"
(ఉ.రా. అ.5. ప. 158)

విష్ణువును చూచి అట్టహాసం చేస్తే ఓంకారం జపించిన ఫలితం కలుగుతుంది. విష్ణువు యొక్క శరపరంపరలో మునిగితే గంగలో స్నానమాడినట్లు. కోపంతో నారాయణుడ్ని చూస్తే చింతనాఫలం కలుగుతుంది. ఆ దేవుడ్ని తిడితే వేదం వల్లించినట్లే. మాత్సర్యం వహిస్తే తపము చేసిన ఫలితం దక్కుతుంది. నారాయణునితో పోరి యుద్ధంలో మరణించే రాక్షసాధిపతులెంతో ధన్యులు.

ఆయుధధారతో అభిషేకించి రక్తంతో తడిసిన బురద అనే గంధం పూసి వాడిబాణాలనే పూలతో పూజించడమే వైరభక్తి. కొందరు వేదానుష్ఠానం ద్వారా, కొందరు యజ్ఞయాగాది క్రతువులద్వారా, మరికొందరు తపస్సుద్వారా విష్ణువును చేరుతుంటారు. కాని వైరభక్తుడు వారందరికంటె ముందు ముక్తిని సాధిస్తాడు.

ఈ విషయాలను సనత్కుమారుడు రావణునికి తెలియజేస్తూ చివరిగా "పలుకులు వేయునేల మధుభంజనుకిన్క తపఃఫలంబు శత్రులకు" అన్నాడు.

ప్రపంచంలో భగవంతుడు కానిది లేనపుడు భగవంతుని చేరని మార్గంకూడ ఏది ఉండదు. వైరభక్తి త్వరితమార్గం. మిగిలిన మార్గాలలో విలంబన మెక్కువ. ఈ సుగుణమున్నా ఈ మార్గం అనుసరణీయమని ఏ పెద్దలు చెప్పలేదు. వైరభక్తిలో వైరం భక్తిస్థాయికి పరిణామం చెందటం కష్టం. ఇది అందరిలో సాధ్యంకాదు. చాలా సందర్భాలలో వైరస్థాయిలోనె ఆగిపోతుంది. తమోగుణ ప్రధానులైన రాక్షసులీ మార్గాన్ని అవలంబించారు. అయితే అందులో చాలా తక్కువ మంది మాత్రమే విష్ణునిహతులై కైవల్యం పొందారు. మిగిలినవారు అంధకారమయమైన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అధోలోకాల సృష్టికి హేతువయినారు. మిగిలిన భక్తిమార్గాలు సురక్షితమైనవి. ఈ మార్గాలలో భగవంతుడు భక్తునికొరకు ఎదురుచూస్తుంటాడు, ఎదురు వస్తాడు కూడ. అహల్యను, శబరిని వెదుక్కుంటూ రాముడే వెళ్ళాడు. రావణుడు రాముణ్ణి లంకకు రప్పించటానికి సీతను హరించాడు. ఒకటి మంచి మార్గంలో మంచిని సాధించటం, మరొకటి చెడుమార్గంలో మంచిని సాధించటం. వైరభక్తిలో కడవరకు చేరితేనే అమృతత్వం. మిగిలిన మార్గాలు ఆద్యంతం శుభాలే.

రావణునిది వైరభక్తి. వాని పరిస్థితి చాలా విచిత్రమైనది. అసలు మాధవుడు అవతరించాడో లేదో! అవతరిస్తే ఎక్కడ జన్మించాడో తెలుసుకోవాలి. ఆయనకు కోపం పుట్టించాలి. తనను ఆ దేవాధి దేవుడు సంహరించేటంతస్థాయికి శత్రువుగా ఎదగాలి.ఈ తిప్పలన్నీ తాను పడవలసినదే. వైకుంఠంచేరే తాపత్రయం రావణునిదే కాని, చేర్చుకొనే తొందర స్వామికి లేదు. వైరభక్తిలో భక్తుదే పరమాత్మునికోసం అన్వేషణ సాగిస్తాడు.

పౌలస్త్య హృదయంలో వైరభక్తి

కంకంటివారు వైరభక్తికి లక్షణం చెబితే, కాటూరివారు లక్ష్యం చూపించారు. పౌలస్త్య హృదయంలో ఆయా విషయాలు కొంత పరిశీలిస్తాను.

వైరభక్తికి, ఇతర భక్తిమార్గాలకు గల వ్యత్యాసాన్ని రావణుని మాటల్లోనే విందాం !

"శ్యామల కాంతి మోహనము సౌమ్యగభీరము సుప్రసన్న రే
ఖామృదు హాస భాసురము గన్నుల పండువునైన రాము నె
మ్మోమును మీరువోలె గన నోమనుగాదె కఠోరవృత్తినై
సామిని మున్నె ఘోరరణసత్ర నిమంత్రితుజేసి యుంచుటన్"

(పౌ. హృ. ప. 26)

రావణుడు సముద్రునితో అన్న మాటలివి. "సౌమ్యము, గంభీరము, సుప్రసన్నము అయిన రాముని మోమును కన్నులపండువుగా మీలాంటి భక్తులు దర్శిస్తుంటారు. ముందే స్వామితో యుద్ధానికి సిద్ధపడిన నాకు అలాటి అదృష్టంలేదు" అంటూ మూడుజన్మల వైరంతో వైకుంఠం చేరే తమ పూర్వపు నిర్ణయాన్ని పౌలస్త్యుడు గుర్తుచేస్తున్నాడు.

(7)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మరి తాను రాముణ్ణి ఎలా దర్శిస్తున్నాడోకూడా చెప్పాడు.

ప్రియదర్శనుడై శ్రితుల క
భయముద్ర ధరించు సర్వభద్రుని భయ వి
స్మయకారి విలయ సమయా
ద్వయభావం బన్య దుర్లభము నేగందున్" (పౌ.హ్యా. ప. 31)

"అభయ ముద్ర ధరించి శుభప్రదుడై ఆశ్రితులకు ప్రియదర్శనుడై గోచరించే రాముణ్ణి నేను భయవిస్మయకారిగా, ప్రళయస్వరూపునిగా దర్శిస్తాను" అంటాడు రావణుడు.

"విలయ సమయాద్వయ భావము" అనటంలో కాటూరివారు గొప్ప నేర్పు చూపించారు.

పోషకుడైన విష్ణువు వాత్సల్య స్వరూపానికి, నాశనకారుడైనప్పటి ప్రళయ స్వరూపానికి భేదంలేదని చెప్పటం ఇక్కడి తాత్పర్యం.

ఇదేభావం వ్యక్తంచేసిన కంకంటివారి పద్యపాదం ఇక్కడ గుర్తుకు రాక మానదు. సనత్కుమారుడు రావణునికి విష్ణుతత్వాన్ని బోధిస్తూ—

"పోషకుండయ్యు నుగ్రుడై పొడవడంచు
నట్టి హరినెంచశక్యమే; యసురనాథ" అన్నాడు.
(కం. ఉ. రా. అ. 5, ప. 181)

ఈ అద్వయ భావం అన్యదుర్లభం. విష్ణువుచేతిలో మరణించిన, సోమకాసురుని వంటి రాక్షసులకు ఆ దేవాధిదేవుని ప్రళయ భయంకర స్వరూపమే తెలుసు. ప్రహ్లాదుడు మొదలైన భక్తులు విష్ణువు భద్రరూపాన్నే దర్శించారు. మరి రావణుడో! జయ విజయుల్లో ఒకడుగా, సౌమ్యసుందరమూర్తిగా నున్న విష్ణువును వైకుంఠంలో దర్శించి సేవించాడు. ఇప్పుడు శాపగ్రస్తుడై దర్పించి, ఎదిరించి. విష్ణువు ఉగ్రరూపాన్ని దర్శిస్తున్నాడు. రెంటి పర్యవసానము విష్ణు సాన్నిధ్యమే! ఈ రెండూ ఒకటేనని తెలిసినవాడు రావణుడు. ఇది మహాకవికి లేని చరిత్ర. ఇదే అన్య దుర్లభమైన అద్వయ భావం.

ఇంత తక్కువ శబ్దాలతో అంత భావాన్ని వ్యక్తీకరించిన కవి ప్రతిభ బహుధా ప్రశంసనీయం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"....రాము నెమ్మోమును మీరువోలె గన నోమనుగాదె"

(పౌ. హ్య. ప. 26)

అన్న రావణుని మాటలలోని "మీరు" అంటే ఎవరో కూడ కాటూరివారు రావణునిచే చెప్పించారు.

"రావణుడన్న కాళ్ల బడు రాయియు రప్పయుగాదు జాలిమై
గావగ నాతి కోతియును గాకియు గ్రద్దయు గాదు లోక వి
ద్రావణు డుగ్రవీర చరిత్రప్రథితుం డతిమానియౌ దశ
గ్రీవుడు పోరిలో బొడిచి గెల్చును జచ్చును గాక, వేడునే"

(పౌ. హ్య. ప. 22)

రాముని కాళ్లపై బడిన రాయి అంటే అహల్య - రాముడు రక్షించిన నాతి అంటే శబరి-కోతి అంటే సుగ్రీవుడు—కాకి అంటే కాకాసురుడు—గ్రద్ద అంటే జటాయువు. వీరందరు రామానుగ్రహ పాత్రులైన ధన్యజీవులు. "వీరిలాంటి వాణ్ణికాదు వారికంటే రామునికి నేనే ఎక్కువ" అంటూ రావణుడు, తన భావాన్ని వ్యక్తం చేసిన మరో పద్యంకూడ ఇక్కడ గమనించదగింది.

"అగుదురు మిమ్ముబోంట్లు చరితార్థులు కాదనగాని మోము సు
ద్దుగొనిన తండ్రికంటె దయతో జను గ్రోల్చిన తల్లికంటె మై
సగమగు సీతకంటె బరిచర్యలొనర్చిన తమ్ముకంటె నీ
జగదభిభూతి రక్కసుడె సామికి మిక్కిలి గూర్చు నెచ్చెలీ."

(పౌ. హ్య. ప. 29)

విష్ణువును కుమారునిగా పొందిన ధన్యజీవులు కౌసల్య, దశరథులు—నవవిధ భక్తి భావాలకు నిలయమైన అర్ధాంగి సీత - సేవనం చేసిన లక్ష్మణుడు - వీరికంటే రామునికి మిక్కిలి కావలసిన వాణ్ణే నేనే అంటాడు, రావణుడు. నిజమే విష్ణువు రామునిగా అవతరించటం దశకంఠుని శాప విమోచనంకోసమేగాని కేవలం వీరి సపర్యలు స్వీకరించటానికి కాదు.

ఇతరభక్తులతో తనను పోల్చుకోవటమే కాదు, ఇతర దేవతలతో విష్ణువును పోల్చి వైరభక్తి అంటే ఏమిటో రావణునిచే కాటూరివారు చెప్పించారు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"............కంఠదళనారంభమ్ముచే నీవు ద
ర్పితు గావించినయట్లుగాదు పురవైరిన్ శ్రీశు నాత్మేశు న
ర్చితు గావించెడి మేటిపండువిదె వచ్చెన్ జంద్రహాసి రో"
(పౌ. హృ. ప. 34)

"స్వీకృత వీరవ్రత పరి
పాకము వైరానుబంధఫలసిద్ధి యిదే
నైకరణప్రణయిని! యెటు
కాకుత్థ్సున కాణిభిక్ష కల్పించెదవో!" (పౌ. హృ. ప. 35)

తలను తరిగి ఆత్మార్పణం చేయటానికి సిద్ధపడితే శివుడు తృప్తిచెంది అనుగ్రహించాడు. విష్ణువుని పూజించే విధంవేరు! అది వీరవ్రతం—వైరానుబంధం. ఈ వైరభక్తి మార్గం ఒక్క విష్ణుదేవుని అర్చనకే పరిమితం.

చంద్రహాసాన్ని ఉద్దేశించి "ఎటు కాకుత్థ్సున కాణిభిక్ష కల్పించెదవో" అంటాడు రావణుడు. భిక్ష అంటే సేవ అనికూడ అర్థమున్నది. తాను రామునికి చేసే సేవ యుద్ధమే. యుద్ధం, వైరభక్తిలో అర్చన ఎలా అవుతుందో కంకంటి వారు చెప్పనే చెప్పారు.

ఇక రావణుని చంద్రహాసం సామాన్యమైనది కాదు. కైలాసపర్వతాన్ని ఎత్తిన సందర్భంలో శివుడే దాన్ని అతనికి ప్రసాదించాడు.

చివరిగా తన లక్ష్యాన్ని వివరిస్తూ రావణుడు పలికిన పలుకుల్లో ఎంతో లోతైన భావాలు ఇమిడి ఉన్నవి.

"............పౌలస్త్యుండు సిరికొల్వు
చవికయౌ వక్షమ్ము చంద్రహాస
దారితమొనర్చి, అగంటుదారివెంట
హృదయమున్ జొచ్చి యేకాంత మిచ్చగించి
స్వాగతము బల్కనని విన్నపమ్ము సల్పు
మటనే "పునర్దర్శన మగుత మనకు" (పౌ. హృ. ప. 39)

"లక్ష్మీదేవి కొలువు మంటపమైన రాముని వక్షాన్ని చంద్రహాసంతో చీల్చి ఆదారివెంట స్వామి హృదయంలోకి ప్రవేశిస్తాను" అంటూ రావణుడు తన వైరభక్తికి చరమావధిని తెలిపాడు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"అచటనే పునర్దర్శనమగుత మనకు" అన్న రావణుని మాటలకు ఎంతో అర్థమున్నది.

సముద్రుడుకూడ రామభక్తుడే. ఆ రఘువీరుని శరణుజొచ్చి లంకకు దారి ఇచ్చాడు. ఆ పుణ్యాత్మునికి విష్ణు సాయుజ్యం లభిస్తుంది. వైర భక్తుడైన రావణుడు కూడ చేరేదక్కడికే. అంటే వైరభక్తికి మిగిలిన భక్తులకు లక్ష్యమొక్కటేనని భావం. "మళ్ళీ మనకు పునర్దర్శనం విష్ణుమూర్తి హృదయంలోనే" అన్న పౌలస్త్యుని మాటలకు అంతరార్థమిది.

పౌలస్త్య హృదయము ఒక సంక్షిప్త రామాయణము

ఈ కావ్యం పేరు "పౌలస్త్య హృదయము". ఇందలి ఇతివృత్తం రామాయణం. ఈ పేరు చూడగానే వాల్మీకి రామాయణం, బాలకాండ నాలుగవ సర్గలోని ఈ శ్లోకం మనకు గుర్తుకు వస్తుంది.

"కావ్యం రామాయణం కృత్స్నం సీతాయాశ్చరితం మహత్
పౌలస్త్య వధ మిత్యేవ చకార చరిత వ్రతః" (బాల. స. 4. శ్లో. 7)

రామాయణం, సీతాచరితం, పౌలస్త్య వధ, ఈ మూడు పేర్లు వాల్మీకే తన కావ్యానికి పెట్టుకున్నాడు. మొదటి రెండు పేర్ల కేంగాని, "పౌలస్త్య వధ" అనటం వేంకటేశ్వర్రావు గారికి నచ్చి ఉండదు. ఆరు జన్మల వియోగాన్ని భరించలేక, విరోధమైనా సరే, మూడు జన్మల్లోనే స్వామిని చేరుకోవాలని తాపత్రయపడిన, రావణ వధేనా! కావ్యపరమార్థం! ఇలాంటి ఆలోచనలతో కరిగిన కవి హృదయం "పౌలస్త్య హృదయంగా" ఆ పౌలస్త్య హృదయమే రామాయణంగా రూపుదిద్దు కున్నది. రాముడు జన్మించక ముందే పౌలస్త్యుని హృదయం రామచరితంతో నిండి ఉన్నదని ఉత్తర రామాయణాలు చెప్పనే చెప్పినవి. అందువల్ల కాటూరి వారు రావణునిచే పలికించిన ఈ రామకథకు "పౌలస్త్య హృదయము" అని పేరు పెట్టడం సముచితంగా ఉన్నది.

శ్రీరాముడు లంకపై దండెత్తి వచ్చిన విషయాన్ని, సముద్రుడు రావణునికి విన్నవించటం, రావణుడు సీతను అపహరించటంలో గల పరమార్థాన్ని సముద్రునకు తెలియజేయటం, ఈ కావ్యంలోని ముఖ్య విషయాలు. రామాయణంలో రాముడు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రావణుడు ప్రధాన పాత్రలు. రాముని చరిత్ర, రావణుని చరిత్ర, కలిపితే సంపూర్ణ రామాయణం. కాటూరి వారు రావణుని చేతనే తన చరిత్రను, రాముని చరిత్రను కూడ చెప్పించి, గొప్ప చమత్కారం చేశారు. జయ విజయుల శాప వృత్తాంతం మొదలు యుద్ధకాండ ప్రారంభం వరకు గల రామాయణ కథ ఇందులో సంగ్రహింప బడ్డది. అయితే ఈ కథాంశం, రామ పట్టాభిషేక సమయంలో అగస్త్యుడు రామునికి చెప్పిందే కావటం వల్ల, ఈ ఘట్టం ఉత్తర రామాయణంలో ఉండటం వల్ల, ఈ కావ్య పరిధిలోకి యుద్ధకాండ, ఉత్తరకాండలు కూడ వచ్చినట్లే అయింది. ఇది కాటూరి వారి మరొక చమత్కారం. ఈ కావ్యమొక సంక్షిప్త రామాయణం.

సముద్రుణ్ణి అడ్డం పెట్టుకొని రావణుని రాజనీతిని కాటూరి వారు చక్కగా చిత్రించారు. ఇతడు నిరంకుశుడైనా, గొప్ప రాజనీతివేత్త. యుద్ధంలాంటి విపత్కర పరిస్థితులలో చుట్టు ఉన్నవారిని కూడగట్టుకొనటంలో నేర్పరి. రావణుని మంత్రులలో, అనుచరులలో సీతాపహరణం తప్పు అని చెప్పినవారున్నారు, యుద్ధం నివారించటానికి ప్రయత్నించినవారూ ఉన్నారు. అయినా ఒక్క విభీషణుడు తప్ప మిగిలిన వారెవరూ రావణుణ్ణి వదలి వెళ్ళలేదు. అతని రాజనీతి అట్టిది !

సముద్రుని రావణుడు తనతో సమానంగా సంభావించాడు.

"భ్రుకుటి మాత్రముచే మూడు భువనములకు
విలయము ఘటించు జగదేక వీరులమట
నీకు మద్బాహు వింశతి నాకు నీదు
వీచికా కోటియట కోట పెర్ర పికేల". (పౌ. కృ. ప. 2)

"సాగరా ! నా ఇరవై చేతులు నీకు రక్ష. నీ అలలు నాకు రక్షణ. మనం కనుబొమలు ముడిస్తేనే ముల్లోకాలు గడగడలాడతవి గదా. ఇలాంటి జగదేక వీరులకు, మనకు భయమేమిటి" అని, అంతటితో ఆగక—

"నాకున్నీకు భయంబటన్ననుడి యెన్నండైన విన్నామ"
....
చంద్రహాసము నాచేయి జారలేదు
ఔర్వశిఖియు నీ జఠరము దూరలేదు." (ప. 3)

అంటూ సముద్రుడ్ని తనతో సమానంగా చేసి మాట్లాడుతూనే తన చంద్రహాసం బడబాగ్నిలాంటిదని స్వోత్కర్ష ప్రదర్శించాడు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రావణుడు త్రిభువన భయంకరుడు. ముల్లోకాలను ముప్పుతిప్పలు పెట్టాడు.

"పాతాలాధిపు తోక ద్రొక్కితి శచీప్రాణేశుకైశ్యమ్ము దా
చేతం బట్టితి వెండికొండ శివుతో శీతాచలేంద్రాత్మజో
పేతం బల్లల నాడ జేసితిగదా !............
.... (ప. 8)

పతిభిక్షన్ శచికిచ్చి గుహ్యకపతిన్ బంధించి కైలాస ప
ర్వతమున్ బాతగలంచి కంఠదళనారంభమ్ముచే నీశు ద
ర్పితు గావించినయట్లు .... (ప. 34)

పై పద్యాలలో కాటూరి వారు రావణుని వృత్తాంతం రేఖామాత్రంగా చిత్రించారు.

బ్రహ్మ యొక్క మానసపుత్రుడు పులస్త్య బ్రహ్మ. పులస్త్య బ్రహ్మ కుమారుడు విశ్రవసుడు. విశ్రవసునికి, ఇలబిలకు జన్మించినవాడు కుబేరుడు. విశ్రవసునికి కైకసికి జన్మించినవారు రావణ, కుంభకర్ణ, విభీషణులు. రావణుడు, బ్రహ్మ వరబల గర్వితుడై స్వర్గ, మర్త్య పాతాళలోకాలపై దండెత్తాడు. మునులను హింసించాడు. స్త్రీలను చెరబట్టాడు. ఇంద్రుడ్ని జుట్టుపట్టి ఈడ్చాడు. శచీదేవి మీద దయతో పతిభిక్ష పెట్టాడటగాని లేకపోతే సంహరించేవాడేనట. తన సోదరుడైన కుబేరుడ్ని లంక నుండి వెళ్ళగొట్టి అతని పుష్పక విమానం స్వాధీనం జేసుకున్నాడు. దిగ్విజయంచేసి పుష్పక విమానంలో ప్రయాణం చేస్తుంటే, అది కైలాస సమీపంలో ఆగిపోయింది. "ఇది మహేశ్వర నివాసం. ఇటు సంచరింపరాదు" అని నందీశ్వరుడు హితం చెప్పినా పౌలస్త్యుని తలకెక్కలేదు. పైపెచ్చు వానరముఖునిగా గోచరించిన నందిని అపహసించి వానరులచేత హతుడయ్యేట్లు శాపం పొందాడు. అయినా ఇదేమీ లక్ష్యపెట్టక అహంకరించిన రావణుడు, పార్వతీ పరమేశ్వర సహితంగా, కైలాసాన్ని పైకెత్తాడు. ఆగ్రహించిన శివుడు కాలితో అణచేటప్పటికి కైలాసనగం క్రిందపడి వికృతరావం చేయటంతో వానికి రావణుడనే పేరు వచ్చింది. ఇది రావణునికి సంబంధించిన కథ. ఈ కథంతా మూడు నాలుగు పద్యపాదాలలో వేంకటేశ్వర్రావు గారు రావణుని స్వగతంగా పలికించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రావణ కుంభకర్ణుల పూర్వజన్మ వృత్తాంతం కూడా ఈ ఖండ కావ్యంలో సూచింపబడింది.

"నాటికి నేడా! తలపున
నాటెను సామికి వికుంఠనగరోదితమౌ
మాటలు, దీర్ఘ విలంబము
వాటించి విభుండు నన్ను వంచించెగదే. (ప. 7)

"వికుంఠనగరోదితము" అన్న ఒక్క మాటతో జయ విజయుల శాప వృత్తాంతం అంతా మనస్ఫురణకు వచ్చేటట్లు చేశాడు కవి. రావణ పాత్రను పరిచయం చేయటమే కాకుండా శాపవృత్తాంతాన్ని కూడా అల్పాక్షరాలలో చెప్పిన కాటూరి వారి కవిత ఎంతో చిక్కన, మరెంతో చక్కన.

వేంకటేశ్వరరావుగారు "దీర్ఘ విలంబము, వాటించి విభుండు నన్ను వంచించెగదే". అన్న మాటలతో రావణ హృదయావిష్కరణకు నాంది పలికారు. "విష్ణువు త్వరగా వచ్చి నా శాపవిమోచనం చేయలేదు. ఇది పెద్ద మోసం. రాముడే విష్ణువంటున్నారు గదా! ఇక శుభముహూర్తం వచ్చినట్లే" ఇది రావణుని భావన! రాముడు తనను గుర్తు పట్టటానికి ఎన్నో దుర్మార్గాలు చేయవలసి వచ్చిందని వాపోతాడు లోకవిద్రావణుడు రావణుడు.

రావణుడు తన దుర్మార్గాలను సమర్థించుకుంటూ తన మనోగత భావాలు వ్యక్తం చేశాడు. ఆయా సన్నివేశాలు కథను ముందుకు నడుపుతూ ఉంటే, ఆయా భావాలు రావణునిపై పాఠకునికి సానుభూతిని కలిగిస్తవి. ఒకవంక రామాయణ కథాగానం, మరొకవంక రావణ పాత్రపై కరుణ రసానుభూతి ప్రసారం, ఒకే విన్యాసంలో సాధించటమే కాటూరి వారి కవితా శిల్పం. "ఏకక్రియా ద్వ్యర్థకరీ బభూవ" అంటే ఇలా ఉండాలి.

రావణుడు, శాపవిమోచన విలంబనానికి సహించలేక పోతున్నాడు. విష్ణువు ఎక్కడ జన్మించాడో తెలియదు. అలాంటి సమయంలో శివధనుర్భంగం సంగతి చెవినబడ్డది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"శివకోదండము(ద్రుంచె, సీత. వరియించెన్ రాము(" డన్నప్డె మా
ధవు కార్యం బనుకొంటి, భార్గవ భుజా దర్పాపహార క్రియా
శ్రవణంబున్ సరిదాక(గా, దీనము వర్షంబైన యుత్కంఠచే
నవివేకమ్మున(గన్నుగాన కటు ద్రోహారంభమున్ జేసితిన్".

(ప. 9)

"శివధనుర్భంగం చేసి సీతను పెండ్లాడాడు, భార్గవరాముణ్ణి జయించాడు, అన్నపుడే రాముడు వైకుంఠధాముడని గుర్తించాను. ఇక అప్పటి నుండే నా పని ప్రారంభించాను". అంటూ రామద్రోహ ప్రారంభాన్ని తెలిపాడు రావణుడు.

లోకం రావణుడు దుర్మార్గుడంటుంటే రావణుడు రాముడే క్రూరచిత్తుడనటం విచిత్రమయిన కల్పన.

"పదుగురలోన నన్ గుఱుతు పట్టునొ లేదొ యటంచు సర్వభూ
విదిత పరాక్రముండ నయి వీఁడి సేఁతలు పెక్కు చేసితిన్
బదుగురు "వీడు రక్కసు" డనన్ పెడనిందల కగ్గమైతిఁ, దా
మదిమదినుండి నన్ మఱచె మాధవుఁ డెంతటి క్రూరచిత్తుఁడో!

(ప. 13)

నన్ను రాముడు గుర్తుపడతాడో లేదో అని త్రిలోక భయంకర కృత్యాలు చేశాను గాని "మునుల హింసించటం నాకు మనసా? సతుల జెఱనిడుట కేను బుద్ధునో?" అని ఎదురు ప్రశ్న వేస్తున్న రావణునికి ఎవరు సమాధానం చెప్ప గలరు ?

ఇటులు దాసు నృశంసుఁ జేయుటలు గూడఁ
బ్రభునకు వినోదమైనఁ గావచ్చు దాస
జన గవేషణాయాసము దనకుఁ గూర్చు
క్రూరకర్మము మాత్రమే నేర నిజము.

(ప. 14)

"తన దాసునకు దుర్మార్గుడనే అప్రతిష్ఠ కలిగించటం ఆయనకు వినోదమేమో కాని ఒక సేవకుడి కోసం వెదకే ప్రయాస నా ప్రభువునకు కలిగించను. అలాంటి దుర్మార్గం నాచేత కాదు.

(8)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఇంత చేసిన గాని నా కించుకంత
మంచి దక్కఁగనీఁడాయె మాధవుండు.
సాగరా! ఏమి వచియింతు? జానకమ్మ
తల్లినే హరియింపక తప్పదాయె." (ప. 15)

ఎంత చేసినా నామంచి దక్కనీయలేదు. చివరకు జానకమ్మనే హరించవలసి వచ్చింది. "స్వామి ద్రోహము కూడ నేర్పె దుదకున్ వైకుంఠ ద్వారార!" ఈ గ్రుడ్డిలోకం తప్పంతా నామీద రుద్దుతున్నది. అంతా తెలిసి, తెలియనట్లు హరి సంచరిస్తుంటే నేను తెలియక సీతను అపహరించాను.

"తనదరి కేను రాఁదగిన దారుల నన్నిటి మూసి యుంచినన్
మనమున నోర్చి నన్ దరియు మార్గములన్నిటి విప్పియుంచి," (ప. 20)

ఎదురుచూచాను. అయినా నన్ను తెలిసికొనలేదు. నేను దుర్మార్గుణ్ణా! ఈ మనుజుల రాజకీయం చూచావా! పోనీలే! మంచితనం మాధవునికే దక్కనివ్వండి. అతడు నన్ను గుర్తిస్తే చాలు. నేను కోరేది శాపవిమోచనం."

ఇలా మాట్లాడుతున్న రావణుణ్ణి చూస్తే నిజంగానే "పాపం!" అనిపిస్తుంది.

"ఎంచి చూడ జానకి హరియించు టెంత
మంచి పని యయ్యె! స్వాత్మ కిమ్మాడ్కిఁ ద్రొల్లి
ఎవ్వరపచార మొనరించి? రెవ్వరికిని.
దొరకని యగాధతలములు దొరకు నాకు." (ప. 32)

నేను హరిభక్తుడనా! సంకల్పం హరిని చేరడమా! విష్ణుపత్నిని హరించానా! దీంట్లోకూడ నాకు నేనే సాటి. అంటూ తనతో యుద్ధం చేసేటప్పుడు రామునికి ఎక్కడ కష్టం కలుగుతుందోనని విలవిలలాడతాడు రావణుడు.

"లేదు పతంగవాహనము లేవు కరంబులఁ బాంచజన్య కౌమోదకులున్,
సుదర్శనము పూనడు" (ప. 36)

మరి తనను రాముడు ఎలా జయించగలడు. జయించలేక పోతే యుద్ధంలో క్షతగాత్రుడయితే! స్వామికి మరోమారు ద్రోహం చేసినట్లవుతుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఒంటి విలుకాఁడపై నన్నునోర్చు తెగువ
వలదురా! రాఘవా రాఘవా! దశాస్య
నక్కటా! క్రూర విక్రమ, స్వాత్మహనన
పాతకుని జేయకుమర! నీ పాదమాన!" (ప. 37)

అంటూ వాపోతాడు పౌలస్త్యుడు. ఇది అతని ఆవేదన. మరి వైరమేమ యింది. రామునికి బాధ కలుగుతుందని రావణునికి దుఃఖమేమిటి? ఇదే వైరభక్తి. వైరం భక్తిగా పరిణామం చెందిన స్థితి అది.

రావణుడు తనను గురించి తాను ఇప్పటివరకు ఉపన్యసించాడు. దానితో రామాయణంలో రావణ సంబంధమయిన కథ చాలా వరకు మనకు తెలిసింది. ఇక రాముణ్ణి గురించి సంభాషించి మిగిలిన రామాయణం పూర్తి చేస్తాడు.

వేంకటేశ్వరరావుగారు బాలకాండ మొదలు సుందరకాండ వరకు గల కథను రెండు మూడు పద్యాలలో సంగ్రహించి ప్రస్తుత కథా సన్నివేశానికి తక్షణ పూర్వ రంగమైన వనవాస వృత్తాంతాన్ని కొంచెం విపులంగా వర్ణించారు. ఈ పద్యాలు అల్పాక్షర అనల్పార్థ కథా సంగ్రహాలు, అలంకార విలసితాలు.

ఈ లఘుకావ్యాన్ని ఒక సంక్షిప్త రామాయణంగా కాటూరి వారు ఎలా తీర్చారో చూడండి.

"వింటిని మారీచునిచే
వింటిని శూర్పణఖచేత, వింటి హనుమచే
వింటిని జనకాత్మజచే
వింటిని రఘువీరు బాహువీర్య కథనముల్." (ప. 24)

పసవల్పు చెక్కుఁళ్ళ వయసున లజ్జయై
మునియాజ్ఞఁ దాటకఁ దునుము సొగసు,
జనపాలు వ్రేలు నీడున శైవచాపమ్ము
విఱిచిన శృంగార వీర మహిమ
పసుపుబట్టల నిగ్గుపస భార్గవక్రోధ
సంధ్య మాయించిన శౌర్యసార
మాలిఁ బాసిన క్రొత్త యలఁత మై వజ్రసా
ధని వాలి నొకకోలఁ దునుము పటిమ (ప. 25)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రావణునికి మొదట రాముని వృత్తాంతం విపులంగా చెప్పింది శూర్పణఖ. జన స్థానంలో లక్ష్మణుని చేత ముక్కు, చెవులు కోయబడ్డ ఆ రాక్షసి తన సోదరుడు పౌలస్త్యునితో రామలక్ష్మణుల చందము, సీత అందము వివరించింది. ఇక సీతాప హరణంలో సహకరించమని రావణుడు మారీచుని కోరినపుడు, మారీచుడు తాటక వథా సన్నివేశాన్ని వివరించాడు.

పాలుగారే చెక్కిళ్ళతో ముద్దులు గొలిపే బాలకులు రామలక్ష్మణులు. విశ్వా మిత్రుని అభ్యర్థన మేరకు దశరథుడు వారిని యాగరక్షణ నిమిత్తం పంపాడు. యాగాన్ని భగ్నం చేయటానికి వచ్చిన తాటకను, సుబాహుని చంపి రాముడు రాక్షస సంహారానికి నాంది పలికిన సన్నివేశమిది. చావు తప్పి, రామబాణంతో లంకలోకి విసిరి వేయబడ్డాడు మారీచుడు. ఈ వృత్తాంతం రావణునికి వినిపించి రాముని జోలికి పోవద్దని హితం పలికాడు మారీచుడు.

శివధనుర్భంగం—సీతాకల్యాణం—పరశురామ గర్వభంగం. రామాయణ కథా గమనంలో ముఖ్య సన్నివేశాలు. ఇవన్నీ రావణుడు విన్నాడు. శూర్పణఖ, ఖర దూషణాదుల వధను తెలిపి, రాముని పరాక్రమం రావణునికి వివరించింది.

యతి వేషంలో పర్ణశాలకు వచ్చిన రావణుణ్ణి చూచి సీత మోసం తెలియక తన చరిత్రనంతా చెప్పింది. సీతాకల్యాణం, అయోధ్యలో పన్నెండు సంవత్సరాలు సుఖజీవనం, తరువాత పట్టాభిషేక సంకల్పం, కైక వరాలు—రామ వనవాసం—సీతా లక్ష్మణులు రాముని అనుసరించటం మొదలయిన కథనంతా సీత ద్వారా రావణుడు విన్నాడు.

సీతాన్వేషణలో లంకకు వచ్చిన హనుమంతుడు రావణ సభలో రామ సుగ్రీవ మైత్రి, వాలి వధ మొదలైన విషయాలు తెలిపాడు.

ఈ విషయాలను రావణుని నోటితోనే పలికించి రామాయణ గాథను బాల కాండ నుండి సుందరకాండ దాకా నడిపారు కాటూరి వారు.

ఇక "రావణు డన్నగాళ్ళ బదరాయియు అప్పయు గాదు........" అనే పద్యంలో, మధ్యలో మిగిలిపోయిన అహల్యా శాపవిమోచనం, శబరి విందు సుగ్రీవమైత్రి, జటాయు సందర్శనం, కాకాసుర శిక్షణం మొదలైన ముఖ్యఘట్టాలను పాత్రలను గుర్తుచేయటం ద్వారా, సన్నివేశాలను స్మరించటం ద్వారా, రావణునితోనే చెప్పించి వేంకటేశ్వరరావుగారు రామాయణం పూర్తిచేశారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రావణుణ్ణి, సుగ్రీవుడు, జటాయువు, కాకాసురుల సరసన నిలిపి వాని స్వభావాన్ని చిత్రించిన కవి చమత్కారం ప్రశంసనీయం.

ఇది "పౌలస్త్య హృదయము" అనే సంగ్రహ రామాయణం. రామాయణ గాథ వ్రాస్తే పుణ్యమనే సంప్రదాయం మనకున్నది. అందువల్లనే కాటోలు కాటూరి వారు ఆత్మార్థాన్ని, పరమార్థాన్ని ఇలా జోడించి కావ్యంగా మలవారు.

కథానిర్వహణ – కాటూరి తీర్పు నేర్పు

ఆయా ప్రముఖ రామాయణ పఠనపాఠన సంస్కారజనిత కావ్యఖండంగా కాటూరివారి పౌలస్త్య హృదయాన్ని భావించవచ్చు. ఆయా రామాయణాల్లోని భావాలు దీంట్లో కనబడ్డా, అనుకరణ అని చెప్పటానికి మాత్రం వీలులేదు. రచనా ప్రణాళికలో నిర్మాణ శిల్పంలో ఈ కావ్యం ప్రత్యేకత దీనిదే.

అధ్యాత్మ, భాస్కర రామాయణాలలోని భావాలు పౌలస్త్య హృదయంలో తొంగి చూచిన జాడలు ఒకటి రెండు చూడండి.

ఇది అధ్యాత్మ రామాయణంలో రావణునికి సీతపైగల మాతృభావాన్ని తెలిపే శ్లోకం-

"స్వాంతఃపురే రహస్యే తా మశోక విపినేఽక్షిపత్
రాక్షసీభిః పరివృతాం మాతృబుధ్యా స్వపాలయత్"

పౌలస్త్య హృదయంలో పద్యపాదాలివి-

"సాగరా ఏమి వచింతు జానకమ్మ
తల్లినే హరియింపక తప్పదాయె" (పౌ.హృ.15)

ఒక భావంలోనే పోలిక. శిల్పంలో ఇక్కడ నాటకీయత తొంగి చూస్తుండగా అక్కడ అలాటిదేమీ లేదు.

భాస్కర రామాయణంలో రావణుడు మండోదరితో అన్నమాటలివి.

"........రఘురాముతో దొడరి పోరెద గూల్చెద నొంచెద జచ్చెదన్"
(యుద్ధ.ప. 1920

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇక పౌలస్త్య హృదయంలో :

"దశగ్రీవుడు పోరిలో బోడిచి గెల్చును జచ్చును గాక పేడునే" అన్నాడు. (ప. 22)

మరొక ఉదాహరణ :

"....సీత నిచ్చు పెట్లు ; భరిత చంద్రహాస బలము గల్గుచునుండ"

అని భాస్కర రామాయణంలో ఉంటే (భాస్క. యుద్ధ 1924)

"చంద్ర హాసము నాచేయి జారలేదు" అని పౌలస్త్య హృదయంలో ఉన్నది.

భాస్కర రామాయణ కర్తలూ, పౌలస్త్య హృదయ కావ్యకర్త, రావణుడు, రామునితో జరిపే యుద్ధాన్ని యజ్ఞంతోనే పోల్చారు.

భాస్కర రామాయణ పద్యం :

"అమితబలుండు రాఘవుడు యాజకుడైన దదగ్రవహ్ని సా
క్ష్యమున మదీయ సాంద్రతర కాండ శతాహుతులొప్ప వేల్చి మో
దమునను ముక్తికాంత నిరతంబుగ మంగళలీల బెండ్లియై
విమల తదీయ భోగపద విశ్రుత సౌఖ్య నిరూఢి పొందెదన్
(భాస్క. యుద్ధ. ప. 1928)

ఇది పౌలస్త్య హృదయంలో పద్యం :

"చిరవిరహాగ్ని గ్రాగు నడచిప్పల గుండమువోలె బగ్గుబ
గ్గురనెడి చేతులిర్వదిట గూరిచిపట్టి, దశాస్యమండలిన్
దరికొని రావణాగ్ని బహుధా దహియింప సవాంతమందు దా
శరధి మొ పంక్తికంధరుడొ శాశ్వత భావము గాంచు గావుతన్"
(ప. 38)

భాస్కర రామాయణంలో రాముడు యజ్ఞం చేయించేవాడు. రాముని అస్త్రాగ్నే యజ్ఞవేది. ఇక తన దట్టమైన బాణపరంపరే సమిధలు, యజ్ఞకర్త రావణుడు, ఫలితం ముక్తికాంతతో వివాహం. ఇక్కడ సాంద్రతర కాండము అన్నప్పుడు ఘనమైన శరీరం అని కూడా చెప్పవచ్చు. అప్పుడు తన శరీరమే సమిధ అని రావణుడు చెప్పినట్లవుతుంది.

ఇక కాటూరి వారిచేతిలో ఈ భావం పూర్తిగా మారిపోయింది. చేతులనే ఇరవై అగ్ని గుండాలతో, పది ముఖాలతో మండే అగ్ని రావణుడు. యుద్ధమే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యజ్ఞం. యజ్ఞం తరువాత రాముడో, రావణుడో ఒకరే మిగులుతారు. ఇది కాటూరి వారి పద్యభావం. కల్పన క్రొత్తగా ఉన్నా, యుద్ధాన్ని యజ్ఞంగా వర్ణించిన విషయంలో, భాస్కర రామాయణానిదే, పైచేయి అని చెప్పవచ్చు. అయితే కాటూరి వారు యజ్ఞం అనేమాటను సామాన్య లౌకికార్థంలో, అంటే భస్మం కావటం అనే భావంతో వాడారని అనుకుందాం. భాస్కర రామాయణంలో మాత్రం సంప్రదాయ యజ్ఞ విశేషాలన్నిటితో పోల్చబడి యుద్ధం వర్ణింపబడింది.

ఇక కాటూరివారు సముద్రాన్ని మానవీకరణ చేసి కథ నడపటం నూతనం. ఇలాటి కల్పన ఎక్కడా కనబడదు. కానీ జయదేవుని ప్రసన్న రాఘవనాటకంలో ఒక చిత్రమైన కల్పన ఉన్నది. పంచమాంకంలో నదులన్నీ ఆకారాన్ని ధరించి సముద్రునితో రామకథను చెప్పటమే ఇక్కడి విశేషం. విశేషగ్రంథ పఠనం గలిగిన కాటూరి వారికి ఇది స్ఫూర్తినిచ్చిందేమోనని నాభావన. ప్రసన్న రాఘవంలో నదులు సాకారలై సముద్రునికి రామకథ చెబితే, కాటూరివారి కవితలో సముద్రుడు సాకారుడై రావణునికి రామకథ చెప్పాడు.

కాటూరివారి కవితలు అలవోకగా, అప్రయత్నంగా సాగిపోతున్నట్లు కనిపిస్తవి. కాని శోధించినకొద్దీ అనర్ఘరత్నాలు లభించే గనులవి.

కవితా శిల్పం

ఒక దృశ్యాన్ని చిత్రీకరించటంలో కాటూరివారి నైపుణ్యం గొప్పది. రావణుని మాటల్లో సీతా వియోగంతో తల్లడిల్లి పోతున్న రాముని రూపం చూడండి.

"దేవి! జానకీ! యెచటనే దేవి!" యనుచు
దండకాటవి నెగ్గెత్తి తరుల గిరుల
నెమకి, మృగముల ఖగముల నిలిపి యడిగి,
యులక వాపోయెనఁట! నన్ను మఱచి విభుండు. (ప. 10)

తమ్ముఁ గుత్తుమూపునఁ గేలుఁదమ్మి మోపి
ఉబుకు వక్షమ్ము బాష్పమ్ము లొలుకు గనులు
నగుచు నా తండ్రి యార్తిమై నడలు నాఁటి
జాలిరూపు నా మోమున వ్రేలు నేఁడు." (ప. 11)

రావణుని కళ్ళ ముందే కాదు, మనకళ్ళ ముందు కూడా రాముని శోకమూర్తి నిలుస్తుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇంత లఘుకావ్యంలో కూడ తన వర్ణనా చమత్కారాలను కాటూరివారు మచ్చుకు చూపించారు. సముద్రుని వర్ణన అత్యంత రమణీయంగా సాగింది.

"నురుగుల్ గ్రక్కుచు నూర్పు సందడులు మిన్నుల్ ముట్ట నొక్కుమ్మడిన్
బిరుగుల్ ద్రొక్కుచు శీర్ణకేశముల నుద్వాహాండపై వచ్చు త
త్తరమున్ గాంచిన నుత్తలంపడెడిఁ జిత్తం; బీభయోద్వేగ మె
వ్వరిచే నీకొనఁగూడె నర్ణవపతీ! వ్రాకుచ్చవయ్యా! వెసన్."

(ప. 1)

భయోద్వేగాలతో పరుగెత్తుకొని వచ్చే మనిషిరూపాన్ని మన కండ్లముందు నిలిపారు కాటూరివారు. ఈ వర్ణన మానవీకరణ పొందిన సముద్రుని విషయంలో స్వభావోక్తి, జలరాశి విషయంలో ఉత్ప్రేక్ష.

కాటూరివారి కవితకు చమత్కారం ప్రాణం. ఇది చాలా గంభీరమైన ఇతివృత్తం, చమత్కారానికి చోటు తక్కువ. ప్రస్తుత సన్నివేశంలో ప్రధానపాత్రలయిన రాముడు, రావణుడు ఇరువురూ ఆవేశకావేషాలతో ఉన్నవారే. అయినా కాటూరివారి కవితలో ఉండే సహజ చమత్కారం కనిపిస్తూనే ఉంటుంది.

"శివకోదండము ద్రుంచె సీత వరియించెన్ రాముడన్నప్డె
మాధవుకార్యంబనుకొంటి" అంటాడు రావణుడు.

మా ధవుడు—లక్ష్మీదేవిభర్త, మా ధవుడు—మా ప్రభువు ఇది ఇక్కడి శబ్దగత చమత్కారం.

అర్థగత చమత్కార విలసితమైన ఈ పద్యం చూడండి.

"తల్లి దండ్రి యాలు దమ్ముండు మొదలు మీ
కెల్ల లంకె పైచె వల్లభుండు;
వల్లభునకు నేనె పైచితిఁ బెనులంకె
నొరు లెఱుంగ రిద్ది పరుఁడె యెఱుఁగు." (ప. 30)

అంటాడు రావణుడు.

భగవంతుడు ప్రతివానికి భార్యాపిల్లలు, తల్లి, దండ్రి సోదరులనే బంధాలు తగిలించి ఆడిస్తుంటాడు. కానీ రావణుడు విష్ణువునకే లంకె తగిలించాడు. నిజమే! పాపం మాధవుడు మూడు జన్మల లంకె వదిలించుకోడానికి వరాహ, నృసింహ, రామ, కృష్ణావతారాలు ఎత్తవలసి వచ్చింది. ఇదే ఇక్కడి చమత్కారం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మరొకచోట రావణుడు.

"పోరు లెఱుంగఁడో, దనుజ పుంగవులన్ మధుకైట భాదులన్
జీటి వధింపఁడో, కిటి నృసింహ ముఖాకృతులన్ ధరింపఁడో
గౌరవ మిట్లొనర్చె దశకంఠున కీ పురుషోత్తమాకృతిన్
శౌరి కపూర్వవిక్రమ రసమ్మునఁ బారణసేయఁ గావలెన్." (ప. 33)

హిరణ్యాక్ష హిరణ్య కశిపులను వరాహ, నారసింహ రూపాలలో చంపి నన్ను చంపటానికి పురుషోత్తమాకృతిలో వచ్చాడు విష్ణువు. నేనంటే అంత గౌరవం అంటాడు. ఈ మాటల్లో కూడా సున్నితమైన చమత్కారమున్నది.

"పాతాళాధిపు తోకద్రొక్కితి శచీప్రాణేశు కైశ్యమ్ముదా; చేతంబట్టితి" అన్న మాటల్లోనూ అలాటి చమత్కారమే!

పాముకు తోక, ప్రభువుకు తల రోష స్థానాలు. పాము తోక త్రొక్కినా, ప్రభువు తల తాకినా వాడికి ఆయువు మూడినట్లే. అయితే రావణుడు వాసుకిని, ఇంద్రుణ్ణి జయించాడు. పాతాళానికి అట్టడుగు వాసుకి తోక-స్వర్గానికి, తుట్ట తుది భాగం ఇంద్రమస్తకం. పాతాళంనుండి స్వర్గందాకా సాగిన రావణ విజృంభణాన్ని కొటూరి వారిలా అద్భుతంగా చిత్రించారు.

మరొకచోట రాముని ఉద్దేశించి రావణుడు—

"ఇంత నున్నయప్పు డీ మాయనటనముల్
లేవు కేశవునకు, గేవలుఁడయి
దర్పన మ్మొసంగు తండ్రి నే నెఱుఁగనే!
మాయదారి యయ్యె మహికి డిగ్గి" (ప. 19) —అంటాడు.

మాయ అంటే ప్రకృతి. మాయదారి అంటే మాయను ధరించినవాడు. పురుషుడైన విష్ణువు మానవునిగా ప్రకృతిలోకి దిగి వచ్చాడు. ఇక్కడ మాయదారి అనటం చక్కని చమత్కారం. మాయదారి అంటే మోసకారి అని లోకవ్యవహారం. రాముడు ఎంతవరకు నేను దశరథనందనుణ్ణి అంటాడేకాని విష్ణువుననడు. ఇదే నటన. ఇదే మాయదారి తనం.

చివరిగా "సిరికొల్వు చవికయౌ వక్షమ్ము చంద్రహాస; దారిత మొనర్చి, ఆ గంటు దారి వెంట హృదయమున్ జొచ్చి ఏకాంతం అనుభవిస్తాను." అంటాడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రావణుడు. "గుండె చీల్చి లోపల దూరి నిద్రపోతాను" అంటే ఇది చమత్కారమా—వైరమా—వైరభక్తా! అన్నీ ఇలా కలపటమే కాటూరి కవితారక్తి.

ఈ కావ్యంలో చక్కటి తెలుగు పలుకుబడులను కూడ మనం చూడవచ్చు. రావణుడు "దొసగెల్ల(జాల్పుదలలన్ నిల్పెన్" అంటాడు.

తప్పు నెత్తిన రుద్దటం అనేది మంచి తెలుగు పలుకుబడి.

"ఈ రాజ్యం నాకెందుకు రాముని రప్పించటానికే నేచేసే కృత్యాలు! ఉట్టి గట్టి యిచట నూరేగ నుంటినా" (ప. 16) అంటాడు మరొకచోట.

"ఉట్టి గట్టుకొని ఊరేగటం" అనేది మంచి సామెత.

విష్ణువు మాహాత్మ్యం రామావతారంతో సరిపెట్టక అంతకు ముందు అవతారాల ప్రస్తావన కూడా చేసిన కాటూరి వారి ఊహారేఖలు శేషశాయియైన విష్ణువు మాల తత్త్వం దాకా ప్రసరించినవి.

"తోయధీ! ధన్యు(డవు నీవు, తొల్లి మత్స్య
కమఠరూపత నీదె నీ గర్భము హరి
నే(డు వెండి(దరింపనున్నా(డు నిన్ను,
నెల్లి నిను(జేరి పవళించు నేమి యెఱు(గ
నట్టులు తరంగ లాలితుండగుచు శౌరి." (ప. 28)

నలుబది పద్యాల ఖండకావ్యంలో ఇన్ని విశేషాలు పొందుపరచటం అందరకు సాధ్యంకాదు.

కాటూరివారు రావణుని పాత్రను ఉదాత్తంగా చిత్రించారు. కానీ ఒక విషయం. ప్రతి వ్యక్తి లక్షణాలు, సమాజ సంబంధములయినవి. లక్ష్యం అంటూ ఉంటే అది వ్యక్తి సంబంధమైనది. అందువలన లోకం లక్షణాన్ని విస్మరించి లక్ష్యాన్ని మాత్రమే ఆమోదించదు. రావణుడు ఎందుకు జన్మించాడు. అన్న దాని కన్నా ఎలా జీవించాడన్నదే జనానికి పట్టిన విషయం. అందుకే అతడ్ని లోకం దుర్మార్గుడనే అంటుంది.

ఈ కావ్యం, విషయంలో పౌరాణికమైనా, వ్యక్తీకరణలో భావకవితా ఛాయల్ని చూడవచ్చు. ఏ పద్యానికదే ఒక ప్రత్యేకమైన ఊహ. కథ వరుసక్రమంలో లేదు. కథా కథన శిల్పంలో నాటకీయత భావవ్యక్తీకరణలో ఆధునికత ఈకావ్య విశిష్ట లక్షణాలు.

ఈ ఖండిక కాటూరి వారి కల్పనా సామర్థ్యానికి అద్దం పడుతుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

3. గు డి గ ం ట లు

"గుడి గంటలు" సాంఘిక ఇతివృత్తం గల కావ్యం. సమకాలీన సాంఘిక పరిస్థితులకు, మహాత్ముని హరిజనోద్యమానికి కాటూరి వారి అక్షర రూపమే "గుడిగంటలు". అంటరాని వారుగా అవమానింపబడుతూ, హైందవ సమాజంలో ఆదరానికి నోచుకోని మాల, మాదిగ, మొదలైన జాతులకు హరిజనులుగా జాతి పిత గాంధీజీ నామకరణం చేశారు. ఈ కావ్యంలో ప్రధాన విషయం హరిజన దేవాలయ ప్రవేశం. అయితే కవి ప్రతిభావంతుడు కాబట్టి, నినాద ప్రాయంగా ప్రబోధం చేయకుండా, కరుణ రస ప్రధానంగా హరిజనుల స్థితిగతులను వివరించి, అగ్రవర్ణాలలో పరివర్తన కలిగించటానికి ప్రయత్నించాడు. ఇందులో అక్కడక్కడ ఆత్మభక్తి భావన కూడా చోటు చేసుకున్నది. నాటి సామాజిక పరిస్థితులకు స్పందించి కాటూరివారు రెండవ ప్రపంచ యుద్ధంనాటి హింసాయుత వాతావరణాన్ని కూడ ప్రసక్తాను ప్రసక్తంగా ఈ కావ్యంలో వర్ణించారు.

"గుడి గంటలు – పౌలస్త్య హృదయము" రచనాకాలము

"గుడి గంటలు", "పౌలస్త్య హృదయం" కలిపి ఒకే పుస్తకంగా త్రివేణి పబ్లిషర్సు - మచిలీపట్టణం వారు ముద్రించారు. ఈ గ్రంథంపై ప్రచురణ సంవత్సరం లేదు. ముందు కావ్య పరిచయం గానీ, అవతారిక గానీ లేదు. అందువలన కాటూరివారు పౌలస్త్య హృదయాన్ని, గుడి గంటల్ని ఏయే సంవత్సరాలల్లో రచించారో శోధించవలసిన అవసరం ఏర్పడింది.

"గుడిగంటలు" పద్యాలలో కొన్ని 1947 మార్చి 1వ తేదీ కృష్ణాపత్రికలోను, మరికొన్ని అదే సంవత్సరం మార్చి 22వ తేదీ కృష్ణా పత్రికలోను, ప్రచురింపబడ్డవి. ఇందులో ఇతివృత్తం తిరుపతి దేవాలయంలో హరిజన ప్రవేశం. కాటూరి వార్ని "గుడిగంటలు" రచనకు ప్రేరేపించిన పరిస్థితులను ఒక్కసారి పరిశీలిద్దాం.

ఈ సందర్భంగా 1947 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో కృష్ణా పత్రికలో ప్రచురింపబడ్డ హరిజన దేవాలయ ప్రవేశానికి సంబంధించిన రెండు వార్తల్ని గమనించండి,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఏడు కొండలవాడ! వేంకటరమణ! గోవిందా! అంటూ ఒక హరిజన బృందం శ్రీ బి.యన్. మూర్తి, ఆచార్య భన్సాలీ ప్రభృతుల నాయకత్వాన తిరుపతి కొండ నెక్కింది. వేంకటరమణుని ఆలయం చుట్టూ ప్రదక్షిణం చేసింది. ధర్మకర్తల మనసింకా తటపటాయిస్తున్నందున ఆలయం లోపలికి మాత్రం ప్రవేశించ లేదు. గోపురము వద్దకు ఊరేగుతూ వచ్చిన ఉత్సవ విగ్రహాలను సందర్శించి పరమానందభరితులయ్యారు. నేడు కాకపోతే రేపో ఎల్లుండో మూలవిరాట్టు దర్శనం కలుగడం నిశ్చయమనే ఆశాభావం ఎల్ల ముఖాలలో తాండవించింది. పుష్కరిణిలో స్నానమాడి గోపురం వరకైనా మొన్న హరిజనులు పోగలగటం గొప్ప విశేషం." (కృ.ప. 1947 జనవరి-11-పే-12)

ఈ రోజుల్లోనే కంచి వరదరాజస్వామి, మద్రాసు పార్థసారథి, కాళహస్తి దేవాలయాల్లో హరిజనప్రవేశం జరిగింది.

ఇక అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రప్రభుత్వ శాసనానికి సంబంధించిన మరొక వార్త.

"హిందూ ధర్మాదాయ సంస్థల మంత్రి శ్రీ కె. కోటిరెడ్డిగారు అసెంబ్లీలో హరిజన దేవాలయ ప్రవేశ బిల్లును ప్రవేశపెడుతున్నారు. ఈ బిల్లు ప్యాసయితే! ప్యాసయినట్లే లెక్క! రాష్ట్రంలో అన్ని దేవాలయాల తలుపులు హరిజనులకు తెరువబడి తీరవలసిందే." (కృ.ప. 1947 ఫిబ్రవరి 1-పే. 9)

1939 లోనే హరిజనుల దేవాలయ ప్రవేశాన్ని గురించి ఒక చట్టం వచ్చింది. అయితే దాని ప్రకారం హరిజనులు దేవాలయ ప్రవేశం చేయాలంటే, మిగిలిన హిందువుల, ధర్మకర్తల అంగీకారం కావాలి.

పై విషయాలను పరిశీలించినప్పుడు 1947 వ సంవత్సరం జనవరి, ఫిబ్రవరి నెలలలో జరిగిన హరిజన దేవాలయ ప్రవేశ సంఘటనలకు స్పందించి, అదే సంవత్సరం ఫిబ్రవరిలోనే కాటూరివారు గుడిగంటల్ని రచించారని, ఆ పద్యాల్ని మార్చి 1న, 22న వెలువడే కృష్ణాపత్రికల్లో ప్రచురించారని ధృవపడుతుంది.

సవర్ణహిందువుల, ధర్మకర్తల హృదయాలలో హరిజనుల యెడల దయా భావాన్ని పెంపొందింప జేయటమే కాటూరివారి రచనకు లక్ష్యంగా కనబడుతున్నది. "పౌలస్త్య హృదయము" "గుడి గంటలు" కృతి సమర్పణలోని ఒక పద్యాన్ని పరిశీలిస్తే మరికొన్ని విషయాలు కూడ నిర్ధారించవచ్చు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఇరువ దేండ్లాయె పౌలస్త్యహృదయమును ర
చించి గుడిగంటలంజెప్పి చెల్లె బదియు
నైదు వర్షము; లొక పద్యమైన మరల
జెప్పినది లేదు; కవినంట సిగ్గుగాదె" (కృతి. స. ప.1)

"పౌలస్త్య హృదయము" రచించిన 20 సంవత్సరాల తరువాత, "గుడిగంటలు" రచించిన 15 సంవత్సరాల తరువాత; ఈ రెండు కావ్యాలు ఒకే పుస్తకంగా వెలువడ్డాయని పై పద్యాన్ని బట్టి మనం గ్రహించవచ్చు. కాటూరివారు గుడిగంటల్ని 1947లో రచించారు. అంతకు 5 సంవత్సరాల క్రితం అంటే 1942లో "పౌలస్త్య హృదయము" రచించారన్నమాట. అయితే అది 1944లో కాని పుస్తకరూపం ధరించలేదు. ఇక గుడిగంటలు రచించిన తరువాత 15 సంవత్సరాలకు, అంటే 1962వ సంవత్సరంలో త్రివేణి వారు ఈ రెండు కావ్యాలను కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారని చెప్పవచ్చు. 1985లో కాటూరివారి మిత్రులు గూడూరి నమశ్శివాయ గారు దీన్ని రెండవసారి ముద్రించారు.

కృష్ణాపత్రికలో ప్రచురింపబడ్డ గుడిగంటల పద్యాలివి.

1947 మార్చి 1—కృష్ణాపత్రికలో :

1. ఏలికవై .... 2. అరుణగభస్తి.... 3. ఆడెద రచ్చరల్.... 4. చీమల బారులై .... 5. ఏడు కొండల నెక్కి.... 6. ఆదుకొమ్మింత.... 7. వేంకటసామి కొండపయి.... 8. దిద్దిన పట్టెనామములు.... 9. వేదశిఖాధ్వనీనము.... 10. అదుగగ రారు.... అనే పది పద్యాలు ప్రచురింపబడినవి.

1947 మార్చి 22- కృష్ణాపత్రికలో :

1. ఆగమ మూల మంత్రములు... 2. తిరుపతి తుంగ శృంగవసతీ!.... 3. తిరుమలదేవ.... 4. నీ పాదమ్ములు.... 5. గంగానమ్మలు.... 6. వినుమో దేవత....; అనే ఆరు పద్యాలు మొత్తం 16 పద్యాలు ప్రకటింపబడినవి.

త్రివేణి వారు ప్రకటించిన పుస్తకంలో ఈ శీర్షిక క్రింద మొత్తం 40 పద్యాలున్నవి. కృష్ణాపత్రికలో పద్యాలు ప్రచురింపబడిన వరుసకు, ఈ పుస్తకంలో వరుసకు వ్యత్యాసమున్నది. అక్కడక్కడ కొన్ని మార్పులు చేర్పులు జరిగినట్లు స్పష్టమవుతున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నామౌచిత్యం

ఈ ఖండకావ్యం పేరులోనే ఒక ప్రత్యేకత ఉన్నది. సంబోధించేది వేంకటేశ్వరుని - విషయం హరిజనోద్ధరణం – కావ్యం పేరు "గుడిగంటలు" కావ్యానికి నాయిక పేరో, నాయకుని పేరో, లేక ప్రధాన సన్నివేశమో స్వీకరించి నామకరణం చేయటం ప్రాచీన పద్ధతి. కవితలోని ప్రధాన భావనా రేఖను, లేక ప్రధాన సన్నివేశానికి, పాత్రకు, ప్రతీకలను స్వీకరించి కవితలకు ఆధునిక కాలంలో పేర్లు పెడుతున్నారు. కాటూరివారీ విషయంలో నూత్న పద్ధతిని అవలంబించారు.

ఈ కావ్యంలో గుడిగంటల ప్రసక్తి ఉన్న ఒకే ఒక పద్యమిది.

"నైగమ మూలమంత్రములు నాందిముఖమ్ములు విశ్వసృష్టికిన్
యోగి సహజ మానస గుహోదిత మంగళ దీపికారుచుల్
సాగర కన్యకా హృదయ సారస షట్పద గీతికారుతుల్
నీ గుడి గంట సవ్వడులు నింగె చెలంగె ప్రబుద్ధలోకముల్. (ప.2)

స్వామివారి గుడిగంటలు నైగమ మూల మంత్రములు, అంటే ఉపనిషద్వాక్యములు. వేదాలలో చివరి భాగాలు ఉపనిషత్తులు. వీటిని వేదాంతాలని కూడ అంటారు. మిగిలిన వేద భాగాలు కర్మ కాండను ప్రతిపాదిస్తుండగా, ఉపనిషత్తులు జ్ఞానాన్ని ప్రబోధిస్తున్నవి. వర్ణాశ్రమ ధర్మాలే కాదు; మరే వ్యత్యాసాలు జ్ఞాన స్థితిలో ఉండవు. అది కేవలం బ్రహ్మజ్ఞానం. మరో విషయం! గుడిగంటలను కంచుతో చేసి, లోపల వెదురు కర్ర నాలుకగా అమరుస్తారు. వెదురులోపల బోలుగా ఉండటం వల్ల మ్రోగించినపుడు ఓంకారం ధ్వనిస్తుంది. "ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ" అని గదా వేదసూక్తి! అందువల్లనే గుడిగంటలు అన్ని భేదాలకు అతీతమైన జ్ఞాన ప్రబోధకాలు.

విశ్వసృష్టికి మూలం ఓంకారం. ఓంకారంలో నుండే సృష్టి ప్రభవించిందని శాస్త్రాలు చెబుతున్నవి. అందువలన ఓంకారం ధ్వనించే గుడిగంటలు సృష్టికి నాంది ముఖములే! యోగుల మనసులో వెలిగే ఓంకార శబ్ద వాచ్యుడైన భగవంతుని కాంతి పుంజాలే గుడిగంటలు. లక్ష్మీదేవి హృదయ కమలంలో మ్రోగే తుమ్మెద పాటలివి. ప్రబుద్ధ లోకములంటే జ్ఞాన ప్రవృద్ధములైన జగములు. జగత్తు, జగదాత్మ, ఆ భగవంతుడే! భగవంతునిలో నిద్రాణమైన లోకాలు చైతన్యం పొంది

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యక్తం కావటమే సృష్టి. అందువలన శబ్దరూపంలో చైతన్యం పొందిన లోకాలే గుడిగంటలు. ఒకే విషయాన్ని అనేక రకాలుగా వర్ణిస్తే అది ఉల్లేఖాలంకారం. ఇక్కడ గుడిగంటలు బహువిధాలుగా చెప్పబడటంవల్ల ఈ పద్యంలో చక్కని ఉల్లేఖాలంకారమున్నది. ఈ పద్యాన్ని ఇలా సంప్రదాయ మార్గంలో వివరించవచ్చు. అయితే గుడిగంటలను వర్ణించిన ఈ పద్యంలో సూచించిన భావాలు తదనంతర కావ్యంలో విస్తరింపబడలేదు. "నైగమ మూల మంత్రములు" అనటాన్ని ఏదో విధంగా హరిజనుల అంటరాని సమస్యకు, ముడిపెట్టవచ్చునేమో కాని, ఈ స్వల్ప సంబంధాన్ని పురస్కరించుకొని కావ్య శీర్షికను సమర్థించటం సాధ్యం కాదు.

గుడిగంటల కావ్యంలో ఉన్నవి నలభై పద్యాలు. అందులో పదిహేను పద్యాలలో హరిజన సమస్య, అయిదు లేక ఆరు పద్యాలలో స్వామి వారి మేలు కొలుపు, మూడు పద్యాలలో హింసాసమస్య, మిగిలినపద్యాలలో ఆత్మభక్తి భావన వర్ణింపబడ్డవి. భగవంతునకు హరిజన, హింసా సమస్యలను నివేదించటం ఈ కావ్యంలోని ప్రధానాంశం. స్వామిని మేలుకొలపటం అనుబంధాంశం. గుడిగంటల వర్ణనకు, కావ్యాంశానికి అటే సంబంధం లేదు. ప్రసక్తానుప్రసక్తంగా ఒక పద్యంలో వర్ణించిన గుడిగంటల అంశాన్ని స్వీకరించి కావ్యానికి పేరుపెట్టటం అంతగా సమంజసమనిపించదు.

కాటూరి వారు మంచికవులు, మేధావులు. కావ్య శీర్షికలను అంత అనాలోచితంగా పెడతారని భావించకూడదు. ఈ కావ్య శీర్షిక సార్థకమనే విషయం మరో దృష్టితో పరిశీలించినప్పుడు గాని తేటతెల్లంగాదు.

వేంకటేశ్వరరావుగారు గాంధేయవాదులు, స్వాతంత్ర్య సమరయోధులు. దీన్ని మనసులో ఉంచుకొని శీర్షికానుబంధమైన ఈ పద్యాన్ని పరిశీలిస్తే మరికొన్ని క్రొత్త భావాలు సాక్షాత్కరిస్తవి. ఆ ప్రయత్నంలో ముందుగా కవికి గాంధీగారి మీద, ఆయన బోధనల మీద ఎలాటి అభిప్రాయమున్నదో చూద్దాం.

కాటూరి వారు 1921లో వ్రాసిన మరొక చక్కని కావ్యఖండిక "పిల్లంగ్రోవి పిలుపు". దీన్ని బందరులో శ్రీ ముట్నూరి కృష్ణారావుగారి అధ్యక్షతన జరిగిన ఒక విద్యార్థి సభలో చదివారు. దీన్ని పరిశీలిస్తే! కవి గాంధీని కృష్ణునిగా, విద్యార్థుల్ని, ప్రజల్ని గోపాలురుగా; బ్రిటీషు రాజును ఇంద్రునిగా చిత్రించినట్లు ఒక స్ఫురణ కలుగుతుంది. కృష్ణుడు ఇంద్రయాగ సందర్భంలో చేసిన బోధ, గాంధీ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రజలకు బోధించిన సహాయ నిరాకరణంగా తోస్తుంది. గాంధీ ప్రబోధాన్నే "పిల్లం గ్రోవి పిలుపు"గా వీరు ధ్వనింపజేశారనేది సుస్పష్టం. ఇదే ధోరణిలో పెట్టిన శీర్షికే "గుడిగంటలు" కూడ. కొంత ఆలోచన చేస్తే ఈ విషయం స్పష్టపడుతుంది.

గాంధీ సిద్ధాంతాలైన సత్యం పలకటం, అహింసాచరణం, ధర్మంగా ప్రవర్తించటం, సమత్వం, ఉపనిషద్వాక్యాలే. "నాంది ముఖమ్ములు విశ్వసృష్టికి" అనటంలో ఒక విశిష్టత ఉన్నది. నాందీ పేరు, నాంది ముఖం పేరు. నాంది అంటే ఏదైనా కర్మారంభంలోగాని నాటకం ముందు గానీ చేసే దేవతాస్తోత్రం. నాందీ ముఖం అంటే వివాహాది శుభకార్యాలకు ముందు జరిపే పితృదేవతార్చన. మరి ఇక్కడ "నాంది ముఖమ్ములు" అన్న శబ్దంలో ఔచిత్యమేమిటి? నాందిముఖంలో గతంపై గౌరవం, శుభమైన భవిష్యత్తు అనే రెండంశాలిమిడి ఉన్నవి. గాంధీగారి సిద్ధాంతాలు కూడ, ప్రాచీన ఋషి సంప్రదాయం నుండి వచ్చినవే! గాంధీ గారికి మన పురాణాలన్నా, పూర్వపు మహాపురుషులన్నా, భగవద్గీత అన్నా అపారమైన గౌరవం. హరిశ్చంద్రుడి నాటకాన్ని చూచి సత్యవ్రతం అభ్యసించినట్లు గాంధీ తానే స్వయంగా చెప్పుకున్నాడు.

ఒకప్పుడు సత్యము, అహింస మొదలైన ధర్మాలు ఆత్మోద్ధరణకు మాత్రమే మార్గాలుగా ప్రాచుర్యం పొంది ఉన్నవి. గాంధీకి ముందు, మానవ సమాజంలో రాజ్యాలకు, రాజ్యాలకు; వ్యక్తులకు. వ్యక్తులకు, మధ్య తలెత్తే సమస్యలకు యుద్ధమే పరిష్కార మార్గంగా అధికులు విశ్వసించారు. కానీ! గాంధీ, సత్యము అహింసలతో వ్యక్తిగత, రాజకీయ సమస్యలను కూడ పరిష్కరించవచ్చు! అని ప్రబోధించి, ఆచరించి చూపాడు. సత్యాహింసలు పునాదిగా నూతన విశ్వమానవ సమాజానికి అంకురార్పణ చేశాడు. మన స్వాతంత్ర్య సిద్ధే గాంధీ సిద్ధాంతాల ప్రామాణికత్వానికి నిదర్శనం. యుద్ధ భయరహితమైన సమాజమే ఆయన భావించిన భవిష్యత్ కల్యాణం. "నాంది ముఖమ్ములు విశ్వసృష్టికిన్" అంటే ఇది. పదము పదునెరిగిన కాటూరి వారు "నాంది ముఖమ్ములు" అనే మాట "ప్రారంభం" అనే సామాన్యార్థంలో ప్రయోగించారని నేననుకోను.

గాంధేయవాదులే యోగులు. వారిమనసులో మంగళ గీతికలు గాంధీ సిద్ధాంతాలే.

సాగరకన్యక అంటే భారతమాత అనే సూచ్యార్థాన్ని గ్రహిస్తే, భారతావని గుండెల్లో మ్రోగేవి వేద, ఉపనిషద్వాణలైన సత్యాహింస సమానత్వాలే. వీటిని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గుర్తు చేసికొనటంతోనే లోకాలు మేల్కొంటున్నవి. హరిజన సమాజం చైతన్యం పొంది సమానత్వం కోరుతున్న విషయం కూడ ఇక్కడ సూచింపబడ్డది. ఇంతకూ ఈ నాందీ ముఖమ్ములు, మంగళదీపికలు, ప్రబుద్ధ లోకములు, ఏమిటి ?

వేంకటేశ్వర స్వామివారి గుడిగంటలు !

అంతేకాదు, అవే గాంధీగారి ప్రబోధాలు.

గాంధీగారి సహాయ నిరాకరణోద్యమం పిలుపుకు "పిల్లంగ్రోవి పిలుపు" అనే పేరు ఎలా పెట్టారో అలాగే హరిజనోద్ధరణం, హింసానిరసనం మొదలైన గాంధీ ప్రవచనాలు గల ఈ ఖండకావ్యానికి కాటూరి వారు "గుడిగంటలు" శీర్షికనుంచారు.

మే లు కొ లు పు

గుడిగంటల ప్రసక్తి ఉన్న పద్యం దాని ముందు పద్యం ఈ కావ్యఖండికకు నాందీ పద్యాల వంటివి. మొదటి పద్యం స్వామివారికి సంప్రదాయ సిద్ధంగా పాడిన మేలుకొలుపు. రెండవ పద్యం స్వామి వారి గుడిగంటల వర్ణన. తరువాత వరుసగా మేలుకొలుపు పద్యాలు. మొదటి రెండు పద్యాలకు ప్రత్యేకత లేకపోతే! గుడిగంటల పద్యం ముందుండి మేలుకొలుపు పద్యాలు వరుసగా ఉండేవి. ఈ రెండు పద్యాలలో వేంకటేశ్వరుని మేలుకొలుపు, సమస్యానివేదనం, గాంధీ సిద్ధాంతాల ప్రబోధం, ఆత్మభక్తి భావన మొదలైన కావ్యాంశాలు సూచింపబడినవి.

స్వామివారికి సుప్రభాతం పలికినవారు చాలామంది ఉన్నారు. భక్తుల సేవ లందుకోటానికి నిద్దుర లెమ్మని ప్రార్థించే భావాలే వాటిలో ఎక్కువ. కాటూరివారు ఈ పద్ధతిలోనే కాకుండ "హింసాప్రళయం ముంచుకొస్తున్నది. మమ్ము కాపాడ నిద్రలేవయ్యా" అంటూ కూడ వేంకటేశ్వరుని మేల్కొల్పారు.

గుడిగంటలలో మొదటి పద్యమిది !

"ఏలికవై, జగమ్ములకు నేడుమలల్ పయికొమ్ముమీఁద శ్రీ
నీళలు గొలవాడ శయనించిన దేవర! మేలుకో, కృపా
వాల! శ్రితానుకూల! శ్రుతి పారచర త్పదపద్మ ! మేలుకో
నీల సరోజపత్ర రమణీయ విలోకన! మేలుకొనఁగదే ! (ప. 1)

(10)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"శ్రీ నీళలు జోలవాడ శయనించిన దేవర" అనటంలో చాలా విశిష్టతఉన్నది. విష్ణువు భార్యలుగా శ్రీదేవి, భూదేవులను ప్రసిద్ధంగా చెబుతారు. నీళ విష్ణువు అవతారమైన కృష్ణుని భార్య. కాటూరివారు ఈ పద్యంలో లక్ష్మీదేవి తరువాత స్థానం నీళకు ఇచ్చారు. వేంకటేశ్వర ప్రపత్తిలోని ఈ శ్లోకం చూడండి.

"లక్ష్మీ మహీ తదనురూప నిజానుభావ
నీళాది దివ్య మహిషీ కర పల్లవానామ్.
ఆరుణ్య సంక్రమణ తఃకిల సాంద్రరాగౌ
శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే"

ఇక్కడ లక్ష్మీదేవి, భూదేవి తరువాత నీళ మొదలైనవారు స్వామివారి పాద సంవాహనం చేసినట్లున్నది. కాటూరి వారు శ్రీ నీళలను జోడించటంలో కూడ కావ్యార్థ సూచనమున్నది.

కూచిమంచి తిమ్మకవి రచించిన "నీలాసుందరీ పరిణయం"లో నీళ వృత్తాంతమిలా ఉన్నది. కుంభకుడనే యాదవుని కుమార్తె నీళ. ఇతని ఇంట కాలనేమి అనే రాక్షసుని కొడుకులు ఆబోతులై జన్మించారు. వారు పైరుపంటలు పాడుచేస్తూ జనాన్ని హింసిస్తూ మహోపద్రవం సృష్టించారు. వాటిని వధించిన వానికి తన కుమార్తెనిచ్చి వివాహం చేస్తానని ప్రకటించాడు కుంభకుడు. కృష్ణుడు ఆ రక్కసి వృషభాల్ని చంపి నీళను వివాహం చేసికున్నాడు. ఇది నీలాకృష్ణుల కథ. కాటూరి వారు వేంకటేశ్వరునికి, కృష్ణునికీ అభేదం పాటించి వర్ణించారు.

"జగన్మాత సర్వ సంపత్స్వరూపిణి లక్ష్మీదేవి ఒక వంక, యాదవ వనిత నీల మరో వంక జోలపాట పాడగా శయనించిన స్వామీ లేవయ్యా!" అనటంలో అంతరాలు లేక అందరిని కరుణించే స్వామి వేంకటేశ్వరుడని కవి సూచించాడు. ఇది కవితా ప్రధానాంశమైన వర్ణభేద నిరసనమునకు సూచన.

"శ్రుతిపార చరత్పద పద్మ" అనటంలో ఉన్న భావం కూడ ఇదే. శ్రుతి అంటే వేదం, పారము అంటే తీరం. వేదతీరములు ఉపనిషత్తులే. వేదాంత వీథుల సంచరించే స్వామిని కవి స్మరిస్తున్నాడంటే అది వర్ణ వ్యత్యాసాన్ని అధిగమించిన జ్ఞానతత్వాన్ని మనకు అందించే సూచన.

ఇది ఇంతగా వ్యాఖ్యానించతగినదేనా? కవి "నీళ" అనేమాట ప్రాస కోసం వేసి ఉంటాడు. ఇదంతా లేని విషయం ఊహించటమని ఎవరైనా అనవచ్చు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పద్య నిర్మాణ శిల్పంలో ఒక రహస్యమున్నది. కవి మనస్సులో ఒక రమణీయమైన శబ్దచిత్రం స్ఫురిస్తుంది. దాన్ని ప్రధానంగా చేసికొని మిగిలిన పద్యం అల్లిక పూర్తి చేస్తాడు. మరొకసారి మహత్తరమైన భావనా చిత్రం స్ఫురిస్తుంది. దాని చుట్టూ మిగిలిన పద్యమల్లుతాడు. ఈ అర్థ, భావ చిత్రాలు పద్య హారంలో నాయక మణి లాంటివి, మిగిలినవి, చిన్న చిన్న రాళ్లు, బంగారం, టంకం వగైరాలు.

ఈ పద్యంలో వేంకటేశ్వరుడు మూడు లోకాలకు ప్రభువు కావటం కాని, ఏడుకొండలపైన ఉండటంకాని, నీల సరోజనేత్రుడు కావటంకాని, ప్రధాన భావనలు కావు. శ్రీ నీలలు జోలపాడగా నిద్రపోవటం, ప్రులిపార చరత్పద పద్ముడు కావటం". ఈ రెండే ప్రధానాంశాలు. వీటి చుట్టూ కవి పద్యం అల్లాడు. వేంకటేశ్వరరావుగారి వంటి కవికి, యతిప్రాసల తడబాటు పద్యంలో పట్టక భావేవి జారిపోవటం ఉంటుందా!

నీల కథలో ముడిపడ్డ వృషభ వృత్తాంతం సాధారణ ప్రజను బాధిస్తున్న యుద్ధ హింసా ప్రవృత్తిని సూచిస్తున్నది. ఇదే తరువాత పద్యాలలో చోటుచేసి కొన్న రెండవప్రపంచ యుద్ధ హింసాకల్లోలం! ఇలా ఆలోచించకపోతే ఈ కావ్యంలో పద్యాలు ప్రణాళికా రహితంగా ఏక సూత్రత లేకుండా వ్రాసినట్లు కన్పిస్తవి.

వేంకటేశ్వరునికి మేలుకొలుపు పాడటంలో కూడ కాటూరివారు తన ప్రత్యేకతను నిలుపుకున్నారు. ఒక చోట.

"........... దాస జనులు కపురంపుటారతుల్"
కరముల దాల్చి నిల్చిరి జగమ్ములు నీ కనువిప్పు వేచెడిన్
సరగున మేలుకో కొలువుసాలను దర్శనమిచ్చి యేలుకో" (ప. 3)

అన్నారు. కొలువుసాల అనేది "కొలువు కూటం" "ముఖసాల" ఈ రెంటి కన్న అందమైన ప్రయోగం. చక్కని తేటతెనుగు మాటలతో అంత్యప్రాసతో సాగిన చక్కని పద్యమిది.

వేంకటేశ్వరరావుగారి కవిత్వంలో అనుభవ రహితమైన అభూత కల్పనల కన్నా స్వయంగా పొందిన అనుభూతులే ఎక్కువ. అయితే ఆ అనుభూతుల్ని ఒక ప్రణాళిక ప్రకారం కూర్చి శ్రద్ధగా కావ్యాన్ని రూపొందించే ఓపిక తక్కువ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ని పిస్తుంది. వీరి కవిత్వంలో ముందు భావోద్వేగం, వెనుక మేధా చాలనం. వీరు తిరుమలపై కనిపించే మనోహర దృశ్యాలను జోడించి పాడిన మేలుకొలుపు సహజ సుందరం.

ఈ కావ్యంలో ప్రాతఃకాలంలో తిరుమల సౌందర్యాన్ని వర్ణించే పద్యాలు రెండున్నవి. "తెల తెల వేగెడున్" అనే పద్యంలో ఉషస్సు, "అరుణ గభస్తి గిరుల" అనే పద్యంలో, సూర్యోదయం తరువాత అందాలు వర్ణింపబడినవి. అందు వల్ల ముందు "తెల తెల వేగెడున్" అనే పద్యం, వెంటనే "అరుణగభస్తి" అనే పద్యం ఉంటే బాగుండేది. కానీ అలా లేదు. "తెల తెల వేగెడున్" అనే పద్యం కావ్యం చివరలో ఉన్నది. సాధారణంగా కవులు, మనసులో ఒక భావం మెదలగానే పద్యరూపంలో పెట్టుకుంటూ పోయి, కావ్యంగా రూపం ఇచ్చేటప్పుడు ఏ పద్యం తరువాత ఏ పద్యం ఉంటే బాగుంటుందో సరి చూసుకుంటారు. కథా ప్రధానంగా కాక, భావ ప్రధానంగా సాగే కావ్యాలలో ఈ అవసరం మరీ యెక్కువ. కాటూరి వారు ఇంత జాగ్రత్త తీసికొనక పోయినా కావ్య సౌందర్యానికి కొరత రాలేదు. కారణం ప్రతి పద్యమొక సురభిళ ప్రసూనం. ఇంతకూ ఆ పద్యమిది.

"తెలతెల వేగెడున్ దెసలు తెమ్మెర లల్లలనార్పగా వన
స్థలములు కమ్మ తావి పెడజల్లుచు విచ్చెను నేత్రకుట్మల
మ్ములు, తొలి మెట్టపై నడుగుమోపె ప్రయాముము దండజాతముల్
వెలువడె గూండ్లు లోకములు వేచెడు దేవర పాదసేవకై" (ప.37)

వికసించిన పుష్పాలు వనసీమలు విచ్చిన కనులనటం, కొండలపై ఉదయించే సూర్యుడు, సప్తగిరులలో తొలిమెట్ట, అంటే పర్వతంపై అడుగుపెట్టాడనటం, చాలా మనోహరమైన భావాలు. దూరం నుండి చూస్తే పర్వత సానువులపై అక్కడక్కడా గుబురులుగా పుష్పించిన పొదలు, కొంతమేరకు పూలులేని పచ్చని వృక్షాలు, మనకు తిరుమలలో కనిపిస్తవి. మొత్తం దృశ్యాన్ని పరికిస్తే! పుష్పించిన పొదల గుబురులు, ఆ వనప్రాంతం విచ్చిన కన్నులుగానే భాసిస్తవి. దిక్కులు తెల్లబారటం, పక్షులు గూండ్ల నుండి ఎగిరిపోవటం, ఉషస్సులో కనిపించే సుందర దృశ్యాలు, ఈ సౌందర్యాన్ని అక్షర బద్ధం చేసిన కాటూరివారి ప్రతిభ అసామాన్యం.

ఏడుకొండలు ఎగ్రాకి వేంకటేశ్వరుని దర్శించటానికి ముందుకు నడుస్తున్న సూర్యుని సొగసు వర్ణించిన మరో పద్యం చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"అరుణ గభస్తి నీ గిరుల యంఘ్రులుచుట్టి ప్రదక్షిణించి, గో
పుర శిఖరమ్ములం దొదిలి పుష్కరిణీ జలజాత కోశముల్
విరియగజేసి పుప్పొడులు వేయుకరమ్ముల దాల్చి నిల్చె దే
వర తిరుమజ్జనమ్ము తటివాల్చి జగత్పతి మేలుకోగదే." (ప.4)

భూ కక్ష్య దగ్గర సూర్యుడుదయిస్తాడు. ఆ సూర్యోదయం కొండపైకి కనబడదు. ఆ ఎర్రని కిరణాలు సూటిగా పోలేక పర్వతపాదాన్ని తాకి చుట్టూ వ్యాపించటం చూస్తుంటే సూర్యకిరణాలు నిజంగా శేషగిరికి ప్రదక్షిణం చేస్తున్నట్లుగానే ఉంటుంది. గభస్తి అంటే, సూర్యుడు, సూర్య కిరణాలు అని రెండర్థాలున్నవి. "గభస్తి" శబ్ద ప్రయోగమే ఒక విశిష్టత. తిరుమలపై కొంత ప్రొద్దెక్కనదాకా మంచు విడిపోదు. సూర్య కిరణాలు పడవు. భూమి కంటే స్వామివారి కోవెల చాలా ఎత్తున ఉన్నా, అంతకంటె చుట్టు ఎత్తయిన పర్వతాలుండటం వల్ల గుడి చక్కని అంచు గట్టిన ఉన్నత వేదికపై అమర్చినట్లుంటుంది. చుట్టు ఉన్న పర్వత శిఖరాగ్రాలను దాటుతున్న సూర్యకిరణాలు అదే కోణంలో సూటిగా ముందు ఆ యెత్తులోనే ఉన్న గోపుర శిఖరాల్ని తాకుతవి. పూర్తిగ గిరి శిఖరాలపైకి సూర్య బింబం వస్తే గాని కిరణాలు క్రిందకు ప్రాలవు. అప్పుడే పుష్కరిణిలోని పద్మాలు వికసించటం, పుష్కరిణీ జలాలపై పడి మళ్ళీ పైకి లేచిన కిరణాలు గుడి ప్రాంగణమంతా వ్యాపిస్తవి. ఇది అక్కడి మనోహరమైన ప్రకృతి దృశ్యం. రస హృదయులెవరైనా తిరుమలలోని సూర్యోదయాన్ని దర్శిస్తే, కవి ఆ సౌందర్యాన్ని ఎంతగా ఉపాసించాడో, తన్మయంచెందాడో గ్రహించగలుగుతారు. తాదృశ సౌందర్య భావనను అక్షర దర్పణంలో మనకు చూపించిన కాటూరివారు గొప్పశిల్పి. "సూర్యుడు తిరుమలకు ప్రదక్షిణం చేసి గోపుర శిఖరాలను పరామర్శించి కొలనిలోని పద్మాల పుప్పొడులు వేయి చేతులతో తెచ్చి నీ ముందు నిలుచున్నాడు. మేలుకోవయ్యా" అనటం చక్కని వర్ణన.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హింసా నిరసనం

భక్తిని ప్రదర్శించటానికే కాదు భయాన్ని నివారించుకోటానికి కూడ స్వామి వారిని మేల్కొల్ప వలసినదే. అంటరానివారుగా ముద్ర వేయబడ్డ హరిజనుల దైన్య, హైన్య జీవనం భారతీయ సమాజాన్ని పట్టి పీడిస్తున్న సాంఘిక దురంతం. 1942లో జరిగిన "క్విట్ ఇండియా" ఉద్యమంలో భారతదేశం హింసా ప్రజ్వలనంతో అట్టుడికి పోయింది. ఇది జాతీయ విపత్తు. 1939లో ప్రారంభమై, యావత్ ప్రపంచాన్నే హింసాజ్వాలల్లో ముంచెత్తింది, రెండవ ప్రపంచ యుద్ధం. ఈ భీతావహ పరిస్థితుల నుండి మానవ జాతిని రక్షించమని కాటూరివారు వేంకటేశ్వర స్వామిని కాటూరి మేలుకొలిపారు.

అమెరికా, 1945 అగస్టులో జపానులోవున్న, హిరోషిమా, నాగసాకీలపైన ఆటంబాంబు వేసింది. రెండవ ప్రపంచయుద్ధ ప్రభావం మనదేశంపై కూడా పడింది. విశాఖపట్నం, కాకినాడలపైన బాంబులు పడినవి. ప్రజలు భయోత్పాతాన్ని పొందారు. ఈ విషయాలను సూచించే కాటూరివారి పద్యం చూడండి.

> "వరడులు గంక గృధ్రములు వాయసముల్ చెరలాడు నిచ్చమై
> కొఱవులు బూని శాకినులు గ్రుమ్మరు నెత్తుటి వట్టు లోడగా
> బుఱియలు చేల మొండెములు ముక్కలు పెట్టగ వల్లకాడుగా
> బరగిన పంటచేల వెసపాపము పండెడు నిద్రమేలుకో." (ప.24)

"పంట చేలల్లో పాపం పండుతున్నది. ఎక్కడ చూచినా రాబందులు, గ్రద్దలు కాకులు గుంపులుగా ముసురుతున్నవి. ముసలి నక్కలు అరుస్తున్నవి. ఇవన్నీ అశుభసూచకాలే. ముసలి నక్కలు మరీను, శాకినీ ఢాకిన్యాది పిశాచగణాలు కొర వులు పట్టుకొని తిరుగుతున్నవి. పంటచేలల్లో నెత్తుటి కాలువలు, అందులో తేలే మొండాలు, పుర్రెలు, అంతా వల్లకాడుగా గోచరిస్తున్నది." అంటూ ఆనాటి భయానక వాతావరణాన్ని చిత్రించారు వేంకటేశ్వరరావుగారు.

మూగుతున్న గ్రద్దలు, రాబందులు అనటంలో, యుద్ధ విమానాలు, కొరవులు పట్టుకున్న శాకినీ దయ్యాలనటంలో, తుపాకులు ధరించిన సైనికులు, మనకు స్ఫురి స్తారు. పంటచేలల్లో నెత్తుటి ప్రవాహాలనటంలో రెండవ ప్రపంచయుద్ధంలో హింసా ధ్వంసాలకు గురయిన జపాన్ మనకు గుర్తుకు వస్తుంది. జపాను వ్యవసాయక దేశం. అప్పుడు ఆ దేశం నష్టపడినంతగా మరే దేశం నష్టపోలేదు. అక్కడ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నెత్తుటి యేరులు పారినవి. ఈ పద్యంలో వర్ణన ప్రపంచ యుద్ధానికి సంబంధించినదే అనటానికి తరువాత పద్యమే నిదర్శనం.

"నేలపయిన్ జలమ్ములను నింగిదెసన్ బెడ దొబ్బ పెట్టుచున్
గాల కరాళ వక్త్రియు ల కాల మహాశని గోళపాత నా
భీలములై జ్వలద్వికృత వేషము లీ పెనుభూతముల్ పవల్
రే లొకమై(జరింప నిదురించెదవే పదిలమ్ముగా గుడిన్. (ప. 25)

ఈ పద్యం భూ, జల, ఆకాశ మార్గాలలో జరిగిన విధ్వంసం తెలియజేస్తున్నది. అకాల మహాశని గోళ పాతములంటే, అకాలంలో పడే గోళాలలాంటి పిడుగులు కావు ! బాంబులే.

8113

"కాలము" అంటే ఇనుమని కూడ అర్థమున్నది. కాల కరాళవక్త్రియులంటే భయంకరమయిన ఇనుపనోళ్ళు. అవి తుపాకులు, రైఫిళ్ళు, శతఘ్నులేకాని మరిం కేవోకాదు. జ్వలత్ వికృత వేషములయిన పెనుభూతాలు! యుద్ధవిమానాలు, నౌకలు. ఈ విషయాన్నే చెబుతూ స్వామివారికి మేల్కొల్పు పాడిన మరో ముఖ్యమైన పద్యం చూడండి.

"కావిరి దిక్కులం దలమె, క్రవ్యభుజుల్ ప్రబలాట్టహాసులై
రావముఖుల్ పురమ్ములను గ్రామములందు కపాలహస్తులై
త్రావుచు నెత్తురుల్ వికట తాండవకేళి యొనర్తు; రిమ్మెయిన్
గోవెలలోన(గన్మొగిచి కూరుకు చెందకు మో జగత్పతీ। (ప. 26)

"రాక్షసులు కపాలహస్తులై నెత్తురు త్రావుచు గ్రామాలలో, నగరాలలో అట్టహాసం చేస్తూ తాండవం చేస్తున్నారు. ఇక నీ నిద్రచాలు" అని కవిస్వామికి విన్నవించాడు.

ఈ భయానక వాతావరణం రెండవ ప్రపంచయుద్ధం వల్ల అన్ని దేశాలలో "క్విట్ ఇండియా" మూవ్‌మెంటువలన మనదేశంలో ఏర్పడింది. ఆనాడు దేశంలో చెలరేగిన బ్రిటీషు దమనచర్యలు పై పద్యంలో సూచింపబడినవి.

పై పద్యాలల్లో విషయం రెండో ప్రపంచయుద్ధానికి సంబంధించినదని చెప్పటానికి "పన్నీటిజల్లు"లో కూడ ఆధారాలున్నవి.

రెండవ ప్రపంచయుద్ధం 1939వ సంవత్సరంలో ప్రకటింపబడి 1945లో ముగిసింది. గుడిగంటల రచన 1947. 1944 మార్చి 25న దర్బార్‌శాయర్ పేరుతో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కృష్ణాపత్రికలో ప్రచురింపబడ్డ "ఉగాదీ-తారణ" అనే కవితా ఖండికలో ఇదేభావాలు వర్ణించబడినవి. ఈ కావ్యఖండిక పన్నీటిజల్లులో కనిపిస్తుంది. తారణనామ సంవత్సర ఉగాదికి వ్రాసినదిది. దీంట్లో "అప్పుడు" "ఇప్పుడు" అని రెండు ఉపశీర్షికలున్నవి. అప్పుడు అంటే పూర్వపు ఉగాది. దీంట్లో మలయమారుతాలు, పుష్పసౌరభాలు, వసంత వైభవాలు, పూల తోరణాలు గట్టిన వనలక్ష్మి సౌందర్యాలు, కోయిల పాటలు, మదన విలాసాలు వర్ణింపబడినవి. ఇప్పుడు అంటే 1944 మార్చి ఉగాది. ఈ శీర్షికక్రింద రెండవ ప్రపంచ యుద్ధ హింస, బ్రిటీషువారిచేత మోసగింపబడిన భారతీయుల ఇక్కట్లు వర్ణింపబడినవి.

గుడిగంటల పద్యాలకు, ఈ పద్యాలకు సామ్యం గ్రహించటానికి వీలుగా ఆ పద్యాలు ఇక్కడ పొందుపరుస్తున్నాను.

"రుధిర గంధము దాల్చి మారుతము వీచె
ఆర్తనాదమ్ము శబ్దించె నాకసమ్ము
నెత్తుటేరులు వరకట్టి నేలదున్ని
క్రౌర్యపుంబంట పండించ్రు కాపులెల్ల" (పన్నీటిజల్లు-ఉగాది)

"నగర ఘంటా పథమ్ముల నక్కకూత
కొలువు కూటములందు గబ్బిలపు రెక్క-
సవ్వడులు వేల్పుగుడిలోన నివ్వటిలె, శ
తఘ్ని కాగోళ భయద నిర్వానములును" (పన్నీటిజల్లు-ఉగాది)

పై రెండు తేటగీతులకు గుడిగంటలలోని "వరడులు కంక గృధ్రములు...." "నేలపయిన్ జలమ్ములను...." అనే రెండు పద్యాలు ఛాయారూపాలు.

"ఉగాది-తారణ" లో నెత్తుటేర్లలో దమ్ముచేసిన పొలాలలో క్రౌర్యం పండినట్లు వర్ణించిన కాటూరివారు, "గుడిగంటలు" పద్యాలలో నెత్తుటివఱదలు అంటే ప్రవాహాలు, పొలాలలో ప్రవహించి పాపం పండినట్లు వర్ణించారు. నక్కల ప్రసక్తి రెంటిలో ఉన్నది. "ఉగాది-తారణ" లో కొలువుకూటాలలో గబ్బిలాలు ముసురుతున్నట్లు వర్ణిస్తే, "గుడిగంటలు" లో రాబందులు గ్రద్దలు ముసురుతున్నట్లు వర్ణించారు. "ఉగాది"లో మానవుల ఆర్తనాదాలు, "గుడిగంటలు"లో మారణాయుధాల పెడబొబ్బలు వర్ణింపబడినవి. "ఉగాది"లో శతఘ్నికాగోళ భయదనిర్వానములను వర్ణించిన కాటూరివారు "గుడిగంటలు"లో "కాలకరాళ వక్త్రిముల కాల మహాశని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గోళపాతములు" అంటూ అణుబాంబు విధ్వంసాన్ని సూచించారు. అంతేకాకుండ "పేల్చు గుడిలోన నివ్వటిలె శతఘ్ని కాగోళ భయదనిధ్వానములు" అనటంలో శాంతికి, సత్యానికీ, తాత్త్విక చింతనకు నిలయమైన భారతదేశంపై కూడ బాంబులు పడ్డ విషయం సూచింపబడింది.

రెండు కవితా ఖండికలలో "కావిరి దిక్కులందలమె" అని ప్రారంభించిన పద్యాలుండటాన్నిబట్టి ఈ రెండు విషయాలకు గల సాన్నిహిత్యం తెలుస్తున్నది.

"కావిరి దిక్కులం దలమె, గాటియ పాలగు విశ్వమెల్ల దుః
ఖా విలమయ్యె నర్దతను వాసతి, దక్షిణ బాహువౌ మహా
దేవుని బాసి ఒంటిమెయి దీర్ఘ తపమ్మొనరించుచుండె మా
దైవము లంఘనమ్ములను దారణ విందయివచ్చె భూమికిన్"

(పన్నీటిజల్లు—ఉగాది)

ప్రకృతి పురుషుల సంబంధమే విశ్వం. పార్వతీ పరమేశ్వరులను అర్ధనారీశ్వరులనటంలోని పరమార్థమిదే. పురుషుని వదలిన ప్రకృతి ధ్వంసమౌతుంది. పరమేశ్వరుని కాదని దక్షుని యజ్ఞానికి వచ్చిన సతీదేవి హింసకు గురయి, రోషంతో భస్మమై, తిరిగి పార్వతిగా జన్మించి పరమేశ్వరుని పొందటానికి తపస్సు చేస్తున్నది. ఇది దక్షాధ్వర ధ్వంసకథ. ఇక ప్రపంచం సత్యాహింస స్వరూపమైన భగవంతుని కాదన్నది. యుద్ధానల జ్వాలలో చిక్కుకున్నది. ఇదీ ప్రపంచయుద్ధ విధ్వంస కథ. ఈ విధంగా దక్షాధ్వర ధ్వంసాన్ని సూచిస్తూ ప్రపంచయుద్ధాన్ని ధ్వనింపజేసిన వెంకటేశ్వరరావుగారి కవితాశిల్ప మనల్పం.

"ఉగాదీ—తారణ" రచించేనాటికి మామూలు ధ్వంసమేకాని ఆటంబాంబు విధ్వంసం జరుగలేదు. 1945 ఆగష్టులో జపానుపై అణుబాంబు పడి సర్వనాశన మయింది. దీనికి కాటూరివారు పొందిన మానసిక వ్యథే గుడిగంటలలో తిరిగి యుద్ధహింసను వర్ణించటానికి కారణం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హరిజన సమస్య

ఈ కావ్యంలో ప్రధానాంశం హరిజన దేవాలయ ప్రవేశం. హరిజనులు హిందువులే కాని ఈ మతంలో వారికి సరయిన గౌరవంలేదు. వేదవిహితంగా నిర్మింపబడ్డ అర్చనా వ్యవస్థలో వారికి స్థానం లేదు. భారతీయ సంస్కృతికి వైదికమత విశిష్టతకు చిహ్నాలుగా నిలచిన దేవాలయాల్లో వారికి ప్రవేశం లేదు. హిందువులందరూ పూజించే దేవతలు వారికి దైవాలుకారు. వారి దేవుళ్ళెవరో వారికే తెలియదు. అన్యమతస్థులయిన క్రైస్తవులు, క్రీస్తే మీ దైవం అంటే, కాటోలను కొవటం, మహమ్మదీయుల మాటలునమ్మి పీరులను పకీరులను సేవించటం, ఊరు చివర చెట్లక్రింద కొలువుండే అనార్య దేవతలు అంకానమ్మ, గొంతెమ్మ, మద్ది రావమ్మ, మహాలక్ష్మమ్మలను కొలవటం, ఇదే వారి ఆధ్యాత్మిక జీవితం. దీన్ని వర్ణించే పద్యమిది.

"గంగానమ్మల బీబిసాహెబుల సంకమ్మల్ మదార్సాహెబుల్
బంగారమ్మల మద్దిరామమల మాలక్ష్మమ్మలన్, బోటుసా
జుం గొంతెమ్మల గొల్చు వీరినెదలో జూపట్టి నీ ప్రాపు జే
రంగా వచ్చిన యీ ప్రపన్నులకు దీరా మోము వాటయ్యెదే (ప. 16)

హరిజనులు సాటివారి ఆదరానికి నోచుకోక అన్యమతాలలో చేరటం దేశానికి, సమాజానికి తీరని నష్టం. ఇక రెండవది ఇప్పటికీ సాగుతున్న గ్రామ దేవతార్చన. ఇందులో అనివార్యంగా జంతుబలులు జరుగుతూనే ఉన్నవి. ఆర్య సంప్రదాయంలో మాత్రం బుద్ధుడు, శంకరుడు మొదలైన ప్రవక్తలు జన్మించిన తరువాత హింసా పూరితమైన అర్చనా విధానం రూపుమాసిపోయింది. హరిజనులు జంతుబలులు చేస్తూ ఆ దేవతలను పూజించటం అహింసావాది అయిన గాంధీగారికి సుతరమూ సమ్మతం కాదు. సమాజశ్రేయస్సు, హింసానిరోధం, ఈ రెండూ హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించడంలో గాంధీమహాత్ముడు ఆశించిన ప్రయోజనాలు.

"జాతిపిత ప్రబోధంతో వారి మనసులలో దేవాలయాలకు రావాలనే కోరిక అంకురించింది. మనసులో నీ రూపం మెదిలింది. తీరా ఇక్కడికి వస్తే నీవు ముఖం చాటేస్తున్నావు! ఇదేం పద్ధతి" అంటూ కవి స్వామివారిని ప్రశ్నించాడు.

"దిద్దిన పట్టె నామములు తిర్మణి బొట్లు" ధరించి నీ దర్శనానికి వచ్చారు. కేవలం నీ దర్శనానికి భక్తులై వచ్చిన వీరు, 'ఆపద మ్రొక్కులవారి కన్న ఉత్తములు" అంటూ రచించిన పద్యం కాటూరి వారి సాంఘిక దృక్పథాన్ని వ్యక్తం చేస్తున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"అడుగగవారు రాచరిక; మాపద మ్రొక్కుల వారు గారు; నీ
కుడుగర లీయ లే రడుగనొల్లని యర్థము లేడబోరు; నీ
రడిగిన డొక్కటే, విరచితాంజలి మాలలు మాలలెల్ల నీ
యడుగు గవన్ ప్రపన్న జనతార్తి హరమ్మను జూడనీ గదే (ప. 11)

"స్వామీ! ఇవ్వగలవారు నీకుకానుకలిస్తారు, ఎంతలేసి కోరికలైనా కోరతారు. వీరు కానుకలే ఈయలేరు. ఇక నిన్ను అడుగగ రాని కోరికలడగటం ఎక్కడిది. వారికి నీ పాద దర్శన మివ్వు. అంతే చాలు" అనటంలో పేదవారైన హరిజనులపై సానుభూతి, ఎన్ని పాపాలైనా మొక్కు చెల్లింపులతో ముక్కలై పోతాయనుకునే సంపన్నులపైన విమర్శ ధ్వనిస్తుంది.

"విరచితాంజలి మాలలు మాలలెల్ల" అన్న శబ్ద చిత్రం చాలా అందంగా ఉన్నది. నమస్కరిస్తూ వరుసగా పోయేవారిని నమస్కారాల దండలుగా వర్ణించటం అద్భుతం. నమస్కారాలు దండలుగా ఉన్న హరిజనులని, నమస్కారాల దండలు దండలని, మాల శబ్దాన్ని సమన్వయం చేయవచ్చు.

"నీ పాద దర్శనం కోసం వచ్చారు హరిజనులు, తలుపులు మూయకయ్యా" అంటూ స్వామివారిని ఉద్దేశించి కాటూరివారు పలికిన మరో పద్యం గంభీర భావ గర్భితం.

"వేద శిఖాధ్వనీన మరవింద సఖమ్మమరేంద్ర పూజితం
బాదిమసర్గమూల మఖిలాశ్రిత రక్షణ దక్షమైన శ్రీ
పాదయుగమ్ము దొలగని, పాతితలమ్ములు మోడ్చి ధన్యులై
పోదురు వీరు, వాకిలులు మూయకు నీగుడి కోదయాలయా." (ప. 12)

వీలయినపుడల్లా వేంకటేశ్వరరావుగారు వేదాలను కాకుండా ఉపనిషత్తులను స్మరిస్తుంటారు. వేదశిఖాధ్వనీనములంటే ఉపనిషద్వీధులలో సంచరించేవని, ఆదిమ సర్గమూలములంటే సృష్టికి మూలాలని, అందరు ఆశ్రితులను రక్షించేవని, స్వామి వారి పాదాలు వర్ణింపబడినవి. ఉపనిషత్తులను స్మరించటం వర్ణాన్ని అతిగమించిన జ్ఞానాన్ని ప్రబోధించటమే! స్వామివారి పాదాలు అఖిలాశ్రితులను రక్షించటానికి చాలినవి. మరి ఈ హరిజనులు, అందరిలో వారుకారా! నీకొక్కరికే గుడి తలుపులు మూసుకుంటావా? అని ప్రశ్నించటంలో కవి మనసులో ఎంత వేదన దాగి ఉన్నదో వ్యక్తమవుతున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మరొక చోట "ఎప్పుడు నీవు కొండపై వెలిశావో- ఏమో ? అప్పటినుండి నిత్యం కష్టాలల్లో ఉన్నవారు నిన్ను దర్శించుకుంటున్నారు. వారికి నీవు శుభాలిస్తున్నావు. ఇప్పటికీ ఈ హరిజనులు నిన్ను చేరుకుని దర్శనానికి చేతులు చాస్తున్నారు. వీరిని చిన్నబుచ్చటం దొడ్డ దైవానివైన నీకు తగదు సుమా!" అంటూ స్వామివారికి విన్నవించారు వేంకటేశ్వర్రావుగారు.

నీతులు వల్లించిన దానికంటే వాటిని రసాత్మకంగా చెప్పటంలో గల ప్రయోజనమేమిటో బాగా తెలిసిన కాటూరివారు, హరిజనుల కష్టాల్ని కరుణ రసాత్మకంగా నాలుగు పద్యాలలో వర్ణించారు. నినాదప్రాయంగా చెప్పిన నీతుల ప్రయోజనం స్వల్పం. వాటి ప్రభావం ఒక్క క్షణం మాత్రమే. రసప్లావితమైనపుడు పాఠకుల హృదయాలను శాశ్వతంగా పరిణామం చెందించే మహత్వం వాటికి లభిస్తుంది.

మనం భగవంతుణ్ని ఆలయంలో దర్శిస్తుంటే పాశ్చాత్యులు "వర్క్ ఈజ్ గాడ్" అన్నారు. పోనీ హరిజనులకు అక్కడన్నా భగదనుగ్రహం లభిస్తున్నదా!

"ఒరగంబండిన పంటచేల గనరా వుర్వీశ్వరాస్థానముల్
దొరదో వంగడి చేరసారములలో జూపట్ట వీ యంత్ర మం
దిర నిర్ఘోషలలో వినంబడవు తండ్రీ! వీరిపాలింటి కీ
గిరి శృంగమ్మున గూడ లేవయితివే కీడెంచి మేలెంచవే (ప. 23)

"పంట చేలల్లో, ప్రభువుల సేవల్లో, యంత్రశాలల్లో కర్షకులుగా, సేవకులుగా, కార్మికులుగా, పనిచేసేవారికి దరిద్రమేకాని, నీ దయా విశేష లభ్యమైన భాగ్యమెక్కడిది! వారికక్కడ ఎక్కడా నీవు కనిపించటం లేదు. చివరకు ఈ కొండ కొమ్మునకూడ నీవు వారికి లేవా!" అంటూ- హరిజనులు చేసే వాకిరిని, వారి దయనీయమైన స్థితిని, మన కండ్లముందుంచారు వేంకటేశ్వర్రావుగారు.

ఇక వారి నివాసాలు, తిండి తిప్పలు దుర్భరాలు.

"చీకటి కొంపలో బ్రతుకు చింకితలల్ మెయిగాటిపాత పె
ల్లాకటి కింత సంకటియు నంబలియున్ జవికింత యుప్పుగల్
వేకటి కింత చప్పిడియు వేకికి బస్తులు నైన వీరిపై
నీ కరుణాకటాక్ష రస నిస్సరణమ్ములు పొంగి పారుతన్" (ప. 28)

అంధకార బంధురమైన గృహాలు - తైల సంస్కారం లేని చింపిరి తలలు- కట్టుకుంటానికి వల్లకాడులో శవంపై నుండి పడేసిన వస్త్రం - ఆకలికి సంకటి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అంబలి- ఇదీ వారి జీవితం. ఉప్పుకల్లే వారి శాకం. తిండే లేదు. మరి రోగానికి మందు లెక్కడి మాట. ఇలాటి హరిజనుడు తాను అష్టకష్టాలు పడుతూ కూడా సమాజానికి ఎంతో సేవ చేస్తున్నాడు.

"ఆలంగాచును, క్షీరములు పిదికి నీ కర్పించు, ముక్కారులున్
జేలం బైరులు పెంచు, నీ గరిసెలన్నిండించు ధాన్యమ్ము లి
ట్లాలుం బిడ్డల కొక్క ప్రొద్దు లిడి నిన్నర్చించు ముప్రొద్దు; ప్రా
ల్మాలందెన్నడు మాల దాతనికి నేలా మోము జూపింపవో" (ప. 30)

ముక్కారు అంటే మూడు కాలాలు. పునర్వసు కార్తెలో పండే పునాసపంట. కార్తీక మాసంనుండి పండే పైరపంట, ఎండాకాలంలో పండే వేసంగి పంట- ఇవి ముక్కారు పంటలు. ఈ పద్యంలో గరిసెల ప్రస్తావన ఉన్నది. వీటిని గురించి నేటి వారికంతగా తెలియదు. బస్తాన్నర, రెండు బస్తాల ధాన్యం పట్టేటట్లు మట్టితో తయారు చేయబడ్డ పాత్రలివి. మధ్య బొట్ట పెద్దదిగా ఉండి పైన క్రింద సన్నగా ఉండే వీటిని వరి ఊక, మట్టి కొన్ని పాళ్ళలో కలిపి తయారు చేస్తారు. అవి చాలా దృఢంగా ఉంటవి. నేలమీద వాటిని ఎక్కడికి కావాలంటే అక్కడికి దొర్లించుకొని పోవచ్చు. నేటి సిమెంటు తయారీలకంటే అవి ఎంతో దృఢంగా ఉండేవి. నాలుగయిదు తరాల క్రిందనుండి చెక్కు చెదరకుండా ఇప్పటికీ పల్లెలలో కొన్నిచోట్ల ఉన్న ఈ గరిసెలను చూడవచ్చు. ఈ గరిసెలలో ధాన్యం పోయటంలో ఒక విశేషం ఉన్నది. పూర్వం క్రొత్త ధాన్యం వెంటనే తినేవారు కాదు. వాటిని నేలలో గుంటలు త్రవ్వి చుట్టూ గడ్డిపెట్టి పాతర వేసేవారు. ఆ నేల మాళిగలో ఏర్పడ్డ వేడికి ధాన్యం మగ్గి కొంచెం బోలుగా తయారవుతుంది. పాతరబడ్డ ధాన్యం త్వరగా జీర్ణమవుతుంది. క్రొత్త ధాన్యం త్వరగా అరగదు. భూమిలో పాతర చేసే పని భూమిపై గరిసె చేస్తుంది. సంపన్నులు క్రొత్త ధాన్యం పాతర తీసిందాకా పాత ధాన్యమే తినేవారు. లేనివారు రెండు గరిసెల్లో ధాన్యం పోసుకునేవారు. ఒకటి వాడుకునేసరికి మరొక గరిసెలో ధాన్యం మాగేది.

ఇంత కష్టించినవాడికి, వాడి భార్యా పిల్లలకి, ఒక పూట తిండి దొరకటమే కష్టం. అంటే వారికి ఇచ్చే కూలి చాలా స్వల్పం అన్న సంగతి గుర్తు చేస్తున్నాడు కవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"తిన్నావో పస్తులే యున్నావో మున్రొద్దు
గుడువ బెట్టును నీకు గడుపునిండ
కట్టెనో పైగోచి పెట్టెనో దువ్వలు
వలుదెచ్చి నీకిచ్చు దలకు మొలకు
నీరాడెనో ధూళి పారాడెనో సుగంధి
నీరమ్ము లార్చు నిన్ రేపు మాపు
ఎండెనో తడిసెనో ఎండవానలు సోక
కుండ నీకిడు గుళ్ల గోపురములు

నేడు కాదు గదా యితం డూడిగమ్ము
సలుపు టాకనాడు గోరిక దెలియనడుగ
వడుగ వచ్చిన గుడిదూరి గడియపైచి
కూరుచుంటివి కొండెక్కి గొప్పదొరవు (ప. 31)

పాడి, పంట, నేత, గృహ నిర్మాణం అన్నిట్లో హరిజనుల సేవ సామాన్యం గాదు. తన పొట్టకు, బట్టకు కరువు పడుతూ ఆవులను కాయడం, పాలు పిండడం, పంటలు పండించటం, వస్త్రాలు నేయటం, గృహనిర్మాణం చేయటం మొదలైన పనులు సర్వశ్రీమంతుడైన వేంకటేశ్వర స్వామి కోసమే కాదు. స్వల్ప నామమాత్ర శ్రీమంతులైన తోటి మానవులకు కూడ! ఇక్కడ, కవి హరిజనుల స్థితిగతులను స్వామివారికి చెప్పినట్లు కనిపించినా, అదే విషయం లోకానికి చెప్పినట్లు కూడా అన్వయిస్తుంది. ఇది కాటూరివారి రచనలోని లోతు, సున్నితంగా ఉపదేశించే తీరు.

ఆత్మ భక్తి భావన

గాంధేయ వాదులైనందుకు కాటూరి వారు గాంధీ జీవన విధానాన్ని కవితలో ప్రతిఫలింప జేశారు. ఆత్మ సాధన, సత్య శోధన ఇవి గాంధీ జీవిత లక్ష్యాలు. కాటూరి వారు కూడ, హరిజన సమస్యా బోధనమే కాకుండా ఆత్మభక్తి భావనను కూడ ఈ కవితలో నింపారు.

తిరుపతి వేంకటేశ్వరస్వామి విగ్రహం పూర్వం వీరభద్రుడని కొందరు, పార్వతీదేవని కొందరు, జైన విగ్రహమని మరి కొందరు రకరకాల కథలున్నవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామానుజులు ఈ విగ్రహాన్ని శ్రీనివాసునిగా మార్చాడంటారు. ఈ మీమాంసకు, హరిజన దేవాలయ ప్రవేశానికి సంబంధంలేదు. గుడిలో దేవుడెవరని కాదు, గుడిలోకి రానిచ్చారా లేదా హరిజనుల్ని అనేదే సమస్య ఈ సందేహం కవిగారిదే.

"ఘన దేవుండవో శక్తివో, శివుడవో, శ్రీమద్వికుంఠుండవో
కనువిందై కనుపింపరావె త్రిజగత్కల్యాణ రమ్యాకృతీ" (ప. 13)

ఎవరైతే నాకేం-మూడు లోకాలకు శుభాలిచ్చే స్వామివి, అంతేచాలు అంటారు కాటూరి వారు.

"సుమ సుకుమారముల్ సులభ సుందరముల్ జగదేక మోహ వి
భ్రమములు, నబ్ధిజా మృదుల పాణి సరోరుహ సేవితమ్ము లా
క్రమిత త్రివిష్టపమ్ములు పురాభవ మత్కృత పుణ్యభోగ భా
గ్యమ్ములు విలోకనోత్సవములై చరణమ్ములు మమ్మునేలుతన్"
(ప. 20)

"హరి! గోవింద! రమామనోరమణ! శేషాహార్య శృంగాగ్ర మం
దిర! మాణిక్య కిరీట కాంతి నిచయాంధీ భూత సప్తాశ్వ! పా
దరజో లేశ విధూత ఘోరకలి సంతాపా! కృపాపాంగ! నీ
చరణమ్ముల్ శరణాగతా భయ కళా సర్వస్వముల్ చూపవే" (ప. 21)

ఇది సంప్రదాయ సిద్ధంగా కాటూరి వారు వ్రాసిన చేసిన ప్రార్థన. నూతన దృక్పథం, గాంధీ సిద్ధాంతాల సంస్కారం వంటబట్టి, వెంకటేశ్వరుని స్తుతించిన మరో పద్యం చూడండి.

"ఆలుం బిడ్డల ప్రోపులో గలవు రోగార్తోప చారమ్ములో
జోలల్ వాడుచు నిద్రపుచ్చుటలలో, శోకాపనోదమ్ములో
నాలం గాచుటలో బుభుక్షకిడు నాహారమ్ములో కట్టియల్
వ్రీలం గొట్టెడి వ్రేటులో, గలవు నీ వృత్తమ్మకా సర్వమున్"
(ప. 39)

పై పద్యం వేదాంత ధోరణిలో సాగింది.

వైష్ణవ సంప్రదాయంలో దాస్యభక్తికి ఎక్కువ ప్రాముఖ్యమున్నదీ. ఆ విషయాన్ని స్మరిస్తూ తనను సేవకునిగా జన్మ జన్మలకు అంగీకరించమని తిరుమ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దేవుని ప్రార్థిస్తూ వేంకటేశ్వరరావుగారు ఈ కావ్యాన్ని ముగించారు. ఆచార వ్యవహారాలు ఆచే పాటించక పోయినా భగవద్భక్తి వీరి మనస్సులో చెరగని సంస్కారంగా ఉన్నదనే విషయం ఈ పద్యాలే చెబుతున్నవి. ఎవరైనా వీటిని ప్రార్థన పద్యాలుగా వినియోగించుకోవచ్చు. ఆర్తులంటే రక్తి, భగవంతుడంటే భక్తిగల వేంకటేశ్వరరావుగారి ప్రపత్తికి ఈ పద్యం నిదర్శనం.

> "కనపున్ జిమ్మెద నీదు జిల్కెడదను నీ కల్యాణ గేహాన, జా
> ననపుం జేసెద గట్టియల్ విరుతు గింజల్ పొట్టువో దంచెదన్
> కుసుమాన్నంబులు వార్చి నీ కిడెద, నంట్లుం దోముదున్ నీవసన్
> విసరన్ వాదము లొత్త నాకిడవె తండ్రీ జన్మ జన్మాలకున్" (ప. 40)

కవితా శిల్పం

సహజమైన వర్ణనలు, గ్రామీణ జీవన చిత్రణము, తెలుగు పలుకుబడులు, కాటూరి వారి కవితలోని ప్రత్యేకతలు. కవులు రమణీయమైన ప్రకృతి దృశ్యాలను వర్ణించటం, వాటిని కథాత్మకంగా చిత్రించటం సర్వ సాధారణం. అవి ఉత్ప్రేక్ష ఉపమలతో సాగిపోతూనే ఉంటవి కానీ, సామాన్య విషయాలు వర్ణించేటప్పుడే కవి ప్రతిభ బయటపడుతుంది. తిరుమల కొండనెక్కే అసంఖ్యాకులైన భక్తులను కాటూరి వారు సహజసుందరంగా ఎలా వర్ణించారో చూడండి.

> "చీమల బారులై సగము చెంత విహంగమ పంక్తులయ్యు శా
> ఖా మృగ తండమౌచు మని గాటల దాటెడి మేక మందలై
> వామన మూర్తులై దరియ వచ్చిరదే! నర నారులో పరం
> ధామ నివాస! యీ హరిజనమ్ములు విందయి తల్పుతీయవే" (ప. 7)

కొండపై నుండి చూస్తుంటే, దూరంగా వరుసలుగా నడిచే జనం చీమలబారు లాగానే అనిపిస్తుంది. నేల బారున ఉన్నవారు పర్వతం ఎక్కడం ప్రారంభించి నప్పటినుండి అంతంత ఎత్తులో కనబడుతూ గాలిలో ఎగిరే పక్షుల్లాగా కనుపిస్తారు. కొంతదూరం సాగేసరికి తిరుమల కాలిబాట అనేక వంకర్లుతిరిగి ఉంటుంది. మధ్యలో అగాధాలు, దాంతో ప్రయాణీకులు వరుసలో కనబడక అక్కడ కొందరు, ఇక్కడ కొందరు, ఈ మూల కొందరు, చెట్ల గుబురుల్లో గుంపులు గుంపులుగా కనబడతారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అప్పుడు వరుసలో కాకుండా విచ్చలవిడిగా సంచరించే కోతుల్లా వారు భాసిస్తారు. ఇంకా ముందుకు పోతే, వోపిక సన్నగిల్లి, ఎదురుగాఉన్న మిట్ట పర్వతాలు ఎక్కేటప్పుడు, మోకాళ్ళపై చేతులానించి ప్రయాస పడేవారు, మునిగాళ్ళమీద నడిచే మేక మందలే! మేకలు గుట్టలు మిట్టలు ఎక్కేటప్పుడు ముందు కాళ్లు నిలువునాపెట్టి నడవవు. అలా నడిస్తే వెల్లికిల్ల పడిపోతవి. అందువల్ల ముందు కాళ్ళు మడతవేసి నడుస్తవి. అప్పుడు ముందుభాగం ఎత్తు తగ్గి ఆ ప్రమాదం తప్పుతుంది. మునిగాళ్ళల నడిచే మేక మందలంటే ఇది.

పైనుండి చూస్తుంటే క్రింద ఉన్నవారు చిన్నగా కనబడి క్రమంగా దగ్గరకు వచ్చేకొద్ది పెద్దవారుగా కనపడతారు. అందుకే ముందు చీమల బారులు, తరువాత పక్షులు, తరువాత కోతులు, తరువాత మేకలుగా పైకివచ్చే యాత్రికుల్ని వర్ణించారు కాటూరివారు. అంతేకాదు ముందు దేవాలయ ప్రవేశానికి భయపడి వెనుకంజ వేసిన హరిజనులు క్రమంగా తండోపతండాలుగా బయలుదేరారు. మొదట పిపీలికల్లా ఉన్నవారు బ్రహ్మకడిగిన పాదాన్ని చేరారు. అదే ఇంతింతై వటుడింతయై నభో వీధిపైకి ఎగబ్రాకటం అందుకే వారిని వామనమూర్తులై స్వామిని సమీపించారు అన్నారు వెంకటేశ్వర్రావుగారు.

ఈ పద్యం స్వభావోక్తో, రూపకమో, ధ్వనో అన్నీ కలసిన కవి ప్రతిభో విడగొట్టి వివరించటం రసాభాసం.

హరిజన దేవాలయ ప్రవేశాన్ని సమర్థించటంలో వేంకటేశ్వర్రావుగారు కరుణనే కాకుండ చమత్కారాన్నికూడ చూపించారు.

"కొండిక నాడు ముజ్జగము గొల్చిన నీ చరణ ద్వయమ్ము నె
న్నండో యొకప్పుడీ హరిజనమ్ములు గొల్చుట కేక సాక్షియై
యుండగ బాదుకా ద్వయి, అయో! యిపుడూడిగ మొల్ల నందువే
వెండియు గొల్చుకొందు రిడవే! కయి సేతురు క్రొత్త పాదుకల్"

(ప. 18)

ఏమయ్యా స్వామీ! నీ కాళ్ళకు పాదుకలున్నవి గదా! అవి నీకు సమర్పించిందెవరు? అవి పూర్వం ఏదు నీకు చేసిన సేవలు తెలుపుతుంటే, ఇప్పుడు అభ్యంతరం దేనికి? మరల నీ సేవా భాగ్యం హరిజనులకు కలిగించు, క్రొత్త పాదుకలు

(12)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సమర్పిస్తారు. స్వీకరించు-" అంటూ రామావతార సన్నివేశాన్ని గుర్తు చేశారు కాటూరి వారు.

"కొండల లోయలన్ దిరిగి కోనల గ్రుమ్మరి తమ్ము గుఱ్ఱితో
నండజయానతో నడవులందటు ద్రిమ్మరి బొబ్బలెత్తెనో ?
పుండులు పడ్డవో చరణముల్........ (ప. 19)

రామావతారంలో భార్యతో, తమ్మునితో కొండలు, కోనలు తిరిగావు కదా కాళ్లు పుండ్లు పడ్డవా! బొబ్బలెత్తినవా! అదీ కారణంగాదు గదా! వీరి పాదుకలంగీక రింపక పోవటానికి! అయినా నీ చరణములు మూడు లోకములకు శరణములు గదా! అంటూ చమత్కారంగా ఈ విషయం ప్రస్తావించాడు కవి. నిజమే చెప్పులు లేక పోతే కాళ్ళు పుండ్లు పడతవి. బొబ్బలెక్కుతవి తరువాత చెప్పులు వేసుకున్నా బాధే. క్రొత్త చెప్పులు కరవటం బొబ్బలెక్కటం కూడ కద్దు. ఇది పైకి చమత్కారంగా ఉన్నా అనేక భావాలు ధ్వనించే వర్ణన.

పూర్వం స్వామివారికి పాదుకలున్నవనటంలో అంటరానితనం మధ్యలో వచ్చిందిగాని అనాది కాదనే భావం వ్యక్తమవుతున్నది. క్రొత్త పాదుకలు స్వీక రించటమంటే నూతన సంస్కరణను ఆమోదించి హరిజనులను దేవాలయంలోకి అనుమతించటం. దీన్ని సనాతనవాదు లంగీకరించకపోవచ్చు. స్వామివారికి సంప్రో క్షణ వగైరా ఇక్కట్లు తప్పకపోవచ్చు. ఇవే క్రొత్త చెప్పుల బాధలు. అంతేకాదు రామావతారాన్ని స్మరించటంలో మరొక ప్రత్యేకత ఉన్నది. గుహుని, శబరిని, వానర భల్లూకాలను, జటాయువు మొదలయిన పక్షుల్ని, ఉడుతను ఆదరించిన మహ నీయుడు రాముడు. అతి సామాన్యులను కూడా ఆదరించే సౌజన్యం ఆ అవతార పరమార్థాలలో ఒకటి. ఈ హరిజనులు వారికంటే తీసిపోయారా! అని అన్యాప దేశంగా సందేహం. పరిశీలిస్తే- కృత, త్రేతాయుగాలకంటే, ద్వాపరం నుండే వర్ణ వ్యత్యాసాలు పెరిగి కలియుగంలో పరాకాష్ఠనందుకున్నట్లు కనబడుతుంది. అంటరాని తనం సనాతనం కాదని, మధ్యలో వచ్చిన దురాచారమని చమత్కారంగా బోధించారు వేంకటేశ్వరరావుగారు.

సమకాలీన సమాజంలోని ఆలోచనా ధోరణులను, విశేషాల్ని కాటూరివారు సందర్భం కల్పించుకోనైనా ఎక్కడో అక్కడ వర్ణిస్తుంటారు. గాంధీగారు ఆధ్యా త్మికవాది, కర్మయోగి. ఆయన హరిజనుల దేవాలయ ప్రవేశం గొప్ప సంస్కరణగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భావించారు. అంటరానితనం నిర్మూలించటానికి వారు చేపట్టిన ఉద్యమమిది. అదే కాలంలో ఆంగ్లేయుల ప్రభావంవల్ల ప్రజలలో శాస్త్రీయ దృక్పథం పెరిగింది. హేతువాదులు, ప్రతిదానికి కారణం, ప్రయోజనం వెతకటం ప్రారంభించారు. వీరి దృష్టిలో ప్రత్యక్ష ప్రమాణాలున్నవే సత్యాలు. దేవతలకు చేసే అభిషేకాలు, హోమాలు మొదలయినవి పదార్థాలను వృథా చేయటమేనని వీరి నమ్మకం. దేవతల మహిమలమీద, వరాలమీద వీరికి విశ్వాసంలేదు. ప్రతిదీ లేబరేటరీలో పరీక్ష చేయాలనే ఉబలాటం. ఇక సనాతన సంప్రదాయవాదుల దృష్టిలో, మొక్కుబడులు చెల్లిస్తే ఎలాంటి కోరికలైనా దైవం తీరుస్తాడు! పూజల వల్ల పాపాలు పోతవి! ఇక తిరుపతి సంగతి చెప్పేదేముంది. అసలే ఆయన ఆపద మ్రొక్కులవాడు భక్తులు వేలకువేలు ఖర్చుచేసి రకరకాల ఉత్సవాలు స్వామికి నిర్వహిస్తుంటారు. ఈ విషయాలను ఈ పద్యంలో సూచించారు కాటూరివారు.

> "భయమే యీగిరి మీద నిన్ నిలిపె! నాపన్నగ్నులే వచ్చి నీ
> దయ రొక్కమ్మిడి విల్తు రేమిపుడు ప్రత్యక్ష ప్రమాణాగమా
> ధ్యయనాగారములందు తేల్చిలిమి నీ తత్వమ్ము నల్లంత పెం
> కయ సామీ! తొలినాళ్ళ బోలె నిక సాగంబోవయూ భోగముల్" (ప. 29)

"ఏమయ్యా వెంకన్న స్వామీ! డబ్బుతో నీదయ కొనుక్కోవాలనుకొనేవారికి, నీ మహత్తును ప్రత్యక్ష ప్రమాణ ఆగమ అధ్యయనాగారాలలో అంటే లేబరేటరీలలో పరీక్ష చేద్దామనుకొనే భౌతిక వాదులకు, భయపడే నువ్వు ఏడుకొండలెక్కావు. ఇక ఇదివరకులా నీ భోగాలు సాగవుసుమా!" అన్నారు. పైకి చమత్కారంగా కనిపించినా ఇది వెర్రితలలువేస్తున్న అభ్యుదయవాదానికి, మూర్ఖత్వంలో మునిగిపోతున్న సనాతన వాదానికి ఒక హెచ్చరిక.

ఎన్ని వర్ణించినా గ్రామీణ జీవితాన్ని మాత్రం కాటూరివారు చిత్రించకుండా వదలరు. ఈ కావ్యంలో విషయం తిరుపతికి సంబంధించినది. ఆ ప్రాంతంలోని గ్రామీణ జీవనం వర్ణించి వీరు ఎంతో ఔచిత్యం పాటించారు.

> "............................ఏతాములం దోట కా
> పరి నీళ్ళెత్తెను గొండరాళ్ళ బయిడిన్ బండింప నాగళ్ళ ప
> న్నిరి కాపుల్..........., (ప. 38)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తిరుపతి ప్రాంతం రాళ్ళ రప్పలతో నిండిన నేల. బావులు, మోటలు, తోటలు, ఆ రాళ్ళ మధ్యలో రైతులు చేసే వ్యవసాయం - ఈ దృశ్యం తిరుపతి ప్రాంతంలో మనకు కనబడుతుంది.

ఒకచోట స్వామివారిని స్మరిస్తూ....

"....నీ పేరుగా నింటిలో; దీపంబెత్తుచు నేటికోళ్ళిడుదురింతే...." అంటారు, వేంకటేశ్వరావుగారు. పల్లెటూళ్ళలో దీపారాధన చేసుకున్నామని, వేంకటేశ్వర దీపం పెట్టుకున్నామని, అనటం పరిపాటి. ఏదైనా ఇంట్లో శుభకార్యాలు జరిగినప్పుడు గోడకు ఎఱ్ఱమట్టి నలుచదరంగా అలికి దానిపై నాముతో నామాలుపెట్టి అక్కడ దీపం వెలిగిస్తారు. ఈ పద్ధతి వేంకటేశ్వరస్వామికి తప్ప మరే దైవానికీ లేదు.

కాటూరివారి కవిత్వం చక్కటి తెలుగు పలుకుబడికి పెట్టిందిపేరు. "మోము చాటయ్యేదే" (ప. 16) పద్యంలో - మోముచాటు చేయటమనేది చక్కటి జాతీయం.

"ఒరగంబండిన పంటచేలు ...." "బేరసారములు" "కీడెంచిమేలెంచవే" (ప. 23) మొదలయిన చక్కటి తెలుగు పలుకుబడుల్ని ఈ కావ్యంలో మనం చూడవచ్చు.

కవనంలో, జీవనంలో, తెలుగుదనం పండించుకున్న మహాకవి కాటూరి వేంకటేశ్వరావుగారు.

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

4. పన్నీటి జల్లు

పౌలస్త్య హృదయం, గుడిగంటలు కాటూరి వారి కవితా శిల్పాన్ని ప్రదర్శిస్తుండగా, "పన్నీటిజల్లు" వారి బహుముఖ వ్యక్తిత్వాన్ని మనకు పట్టి ఇస్తుంది. వారు అప్పుడప్పుడు రచించిన పద్య గేయాల సంకలనమే ఈ గ్రంథం. దీన్ని "కాటూరి కవితాలత" వారు 1966 జూన్‌లో ప్రకటించారు. "పన్నీటి జల్లు"లో అనేక సువాసనలు-కాటూరి వారి రాజకీయ జీవితం, ఆధ్యాత్మిక చింతన, కళాభిజ్ఞతలను ఈ కావ్యంలో మనం దర్శించవచ్చు. ఇందులోని కవితా ఖండికలు కథా ప్రధానాలు కావు. కవి ఆయా సందర్భాలలో వ్యక్తం చేసిన తన మనోభావాలు. చమత్కారం, ఆత్మీయత, సౌజన్యం, భక్తి, ప్రతిభ, ఇలా ఎన్నో కాటూరివారి గుణాలకు ఈ ఖండకావ్య సంపుటి దర్పణంగా నిలుస్తుంది.

"పన్నీటి జల్లు" శీర్షికతో కాటూరివారు చాలా రచనలు చేశారు. అందులో కొన్ని పద్యాలు, మరికొన్ని వ్యాసాలు. ఎవరినైనా ప్రశంసించదలచినపుడు వారు ఈ శీర్షికను ఉపయోగించినట్లు కనబడుతున్నది. 1936 వ సం॥ మేలో ముట్నూరి కృష్ణారావుగారి మీద, 1940వ సం॥ నవంబరులో షష్టిపూర్తి సందర్భంగా భోగరాజు పట్టాభి సీతారామయ్యగారిమీద, 1942వ సం॥ జనవరిలో గుడివాడ సన్మాన సందర్భంగా విశ్వనాథ సత్యనారాయణగారి మీద, 1950 వ సం॥ మేలో కోలవెన్ను రామకోటేశ్వరరావుగారి మీద కాటూరివారు పన్నీటి జల్లు కురిపించారు. వీటిలో ముట్నూరి వారి మీద, విశ్వనాథవారి మీద వ్రాసినవి పద్యాలు. ఇవన్నీ కృష్ణా పత్రికలలో పైన ఉటంకించిన సమయాలల్లో ప్రచురింపబడినవే! ఈ వ్యాసాలు, కవితలు వ్యాజస్తుతితో సాగినవి.

"పన్నీటి జల్లు" శీర్షిక క్రింద రచనలను వేంకటేశ్వరరావుగారు "దర్బార్ కాయర్" అనే పేరుతో ప్రకటించారు. మరికొన్ని ఇతర రచనలు కూడ ఈ పేరుతో కనిపిస్తున్నవి. "దర్బార్ కాయర్" అంటే ఆస్థానకవి అని అర్థం. కాటూరి వారు ముట్నూరి వారి దర్బారు కవి. అలా తనను తాను ప్రకటించుకున్నారంటే కాటూరి వారికి ముట్నూరి వారిపై ఎంత గౌరవం, భక్తి ఉండి ఉండాలి! కృష్ణారావుగారికి కూడ కాటూరివారి ప్రతిభా పాటవాలపై అఖండమైన విశ్వాసం. వారంటే ఎనలేని అభిమానం! అందువల్లనే తన తరువాత కృష్ణా పత్రికకు వేంకటేశ్వరరావు గారిని సంపాదకులుగా నియమిస్తున్నట్లు వీలునామాలో వ్రాశారు. కోలవెన్ను రామ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కోటేశ్వరరావుగారు, పింగళి నాగేంద్రరావుగారు, మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి గారు, అడివి బాపిరాజుగారు, మల్లాది రామకృష్ణశాస్త్రిగారు, కొడాలి ఆంజనేయులు గారు మొదలైన కవులు కృష్ణాపత్రిక దర్బారులో ఉండేవారు. అందులో ఒక్క వేంకటేశ్వరరావుగారే "దర్బార్ శాయర్". ఇది కృష్ణారావుగారికి, వేంకటేశ్వరరావుగారికి గల అనుబంధం ఎంత గొప్పదో తెలియజేస్తున్నది.

నామౌచిత్యం

ఈ పుస్తకంలో "పన్నీటి జల్లు" పేరుతో రెండు కవితా ఖండికలున్నవి. మొదటిది కృష్ణాపత్రిక అధినేతలు, సంపాదకులు సాహిత్య వేత్తలైన ముట్నూరి కృష్ణారావుగారి దర్బారును గురించి వ్రాసినది. రెండవది విశ్వనాథవారి గజారోహణోత్సవ సందర్భంగా వ్రాసినది.

ముట్నూరి వారి దర్బారు కళోపాసకులతో నిత్యం కళకళలాడుతుండేది.

"కమ్మని కైతగాండ్రు, పులకండములొల్కెడి గాయకుల్ తధోం
ధిమ్మని నాట్యమాడు సభినేత లనేక కళాప్రవీణులున్
సమ్మతి గొల్వగా సగము సాగిలబడ్డ త్రిభంగి శాకృతిన్
జమ్ము మసీదులో గురుతసల్పు నినుం గన గన్ను పండువౌ.

జమ్ము మసీదు అంటే జమ్ముగడ్డి కప్పిన పాక. అందులో ముట్నూరి వారు సాహిత్య గోష్ఠి నిర్వహించేవారు. అక్కడ సాహిత్య వేత్తలకు కవులకే కాక, తక్కిన కళావేత్తలకు కూడ గౌరవం లభించేది. ఆ దర్బారులో సాగే చమత్కార సంభాషణలు ముట్నూరి వారి హర్షామోద, దరహాసాలు పన్నీటిజల్లుగా ఇందులో వర్ణింపబడినవి.

"సారెకు సారెకున్ దరగ జాలయి లేచుచు, భంగ సంగతం
బై, రసశీకరమ్ములకు నాకరమై, మినువాక ముట్టు ప
న్నీరపు జల్లు తుంపురులు, నీ చిరునవ్వుల, మవ్వ మెక్కి ద
ర్బారున కీవుతన్ శుభపరంపర లీ నవ వర్ష వేళలన్."

పై పద్యంలో సాహితీ చమత్కారాలకు హాయిగా నవ్వే రసజ్ఞుడు, సరసుడైన ముట్నూరివారు మనకు దర్శనమిస్తారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవులను కళావిదులను, కృష్ణారావుగారు ఘనంగా సత్కరించేవారు. ఎంత గానో గౌరవించేవారు. జాజులు, మొల్లలు విరిసినట్లు, వాటి సౌరభాల పన్నీటి జల్లులు, అంతటా చల్లినట్లు, ఆ సభ శోభాయమానంగా ఉండేది.

"తీరును దీయమై, మెరుపుదీగెల తళుక్కులు మొల్కలెత్త, స
త్కారము గారమొల్క, నయగారము సన్నగ జాలువారగా,
సౌరభముల్ దెసల్ ముసర, జాజి సరుల్ విరిమొల్లలట్లు, ప
న్నీరపు జల్లు వెల్లువలు, నీ దరబారున పొంగులెత్తతన్."

అంటూ కాటూరి వారు ముట్నూరి వారి దర్బారును ఎంతో కొనియాడారు. రససంతుష్టులైన ముట్నూరి వారి, సత్కార గౌరవాలు పొందిన కళాకోవిదులు చిందించిన నవ్వులే మెరుపుతీగెల తళుకులు. ఆ దర్బారులో ప్రభవించిన కవితలు, పన్నీటి తుంపరలు-జాజిపూల దండలు-మొల్ల మొగ్గలు. ఆ దర్బారులో విలసిల్లిన కవితా సౌరభం అన్ని దిక్కులకు వ్యాపించింది. మరో పద్యంలో, ఆ సభలో దానిమ్మ రసప్రవాహం జాలువారినట్లు దాంట్లో మొగలి పూ పుప్పొడులు ఈదులాడినట్లు కమనీయమైన కల్పన చేశారు. ఇక్కడ కాటూరి వారు వ్రాసిన పద్యం ఒక రసగుళిక.

"అరగ విచ్చు కేతకుల అంతర గర్భపుఁ బూదుమారముల్
ధీర సమీర ఖేలనగతిన్ దెసలల్లిన వేఁగుబోక జా
లా రసదాడి యోడికల నల్లన నీదెడు నింపు ప
న్నీరపు జల్లులాట లవి, నీ దరబారును ముంచి యెత్తతన్."

పై పద్యం ఎంతో భావగర్భితం. వేగుబోక అంటే పేకువ జామున, అర విచ్చిన మొగలిపుష్పాలలోని పుప్పొడిరేణువులు, మందమారుతం తాకిడికి, దిక్కులకు వ్యాపించి, దానిమ్మ రస ప్రవాహంలో పడి, ఈదులాడే ఇంపు సొంపులు, పన్నీటి జల్లుల ఆటల వంటివి. అవి నీ దర్బారును ముంచి ఎత్తు గావుత! అంటారు కాటూరి వారు.

మొగలి పూలు చాలా రకాలు. చూడటానికి అట్టే తేడా కనిపించదు. అయితే కొన్ని మాత్రమే మంచి వాసన కలిగి ఉంటవి. ఏది సువాసనా భరితమో పేకువలో సగం వికసించగానే తెలిసిపోతుంది. ఆ విషయం మనకు అందించేది పిల్లగాలులు. ఇక్కడ మొగలిపూలు పుస్తకాలు. వాటిని తెరచి ఏవి సువాసనా భరితాలో తెలిపే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గాలులు పండితులు, విమర్శకులు. వారి సరససల్లాపాలే రసదాడి ఓడికలు. ఇక్కడ మరో విశేషం. రసదాడి అంటే, రసవంతమైన దానిమ్మఫలం. అంతేగాదు రసదాడి అంటే, ఒక రకమైన చెరకు కూడ. వారి రసచర్చ దానిమ్మ రసమో, చెరకు రసమో! ఏదైనా అద్భుతమే. ఇక ఆ రసంలో ఈదులాడే పుప్పొడి రేణువులు విమర్శలో బహిర్గతమైన కావ్యశిల్ప కల్పనా విశేషాలు. ఈ సాహితీ వినోదం పన్నీటి జల్లుల్లో తడిసే ఆట. అది నీ దర్బారును ఎల్లప్పుడు ముంచి ఎత్తుగాక. అని ముట్నూరి వారికి శుభ కామనలు తెలిపారు కాటూరి వారు. బందరులో మొగలి పూలు ఎక్కువ. వాటి విషయం కాటూరి వారికి బాగా అనుభవంలో ఉండిఉంటుంది. తెల్లగానున్న మొగలిపూలకు అంతగా వాసన ఉండదు. బంగారు రంగు పూలకు వాసన ఎక్కువ. అమ్మకొనేవాళ్ళు ఒక బంగారు రంగు పూవును విడదీసి ఆ రెక్కలు మనకు తెలియకుండా తెల్లపూలకు చుట్టూ అమరుస్తారు. ఇక అన్ని పూలను మంచివిగా భ్రమింపజేసి అమ్ముకుంటారు. దాన్ని, అనుభవం, విమర్శనా దృష్టి ఉన్నవాళ్లు తప్ప అందరు కనిపెట్టలేరు. కావ్యాలు కూడ అంతే. ముట్నూరి వారి దర్బారు కళా విమర్శకులకు నిలయం. ఒక ప్రకృతి దృశ్యాన్ని తీసుకొని మహత్తర విషయాన్ని స్ఫురింపజేస్తూ వర్ణించటం వేంకటేశ్వరరావుగారికే తగింది. ఇలా నాలుగు పద్యాలలో కాటూరి వారు ముట్నూరి వారి స్వభావాన్ని, ఆ దర్బారులో ఉండే కవుల్ని, వారు పొందిన గౌరవాల్ని, వారు వెదజల్లిన కవితా సౌరభాల్ని చక్కగా వర్ణించారు.

ముట్నూరి వారు గొప్ప ఆధ్యాత్మిక దృష్టి కలవారు. సంప్రదాయ సిద్ధమైన కర్మమార్గం మీద కంటే జ్ఞానమార్గం మీద వీరికి అభిలాష ఎక్కువ. రవీంద్ర, అరవిందుల ప్రభావం కృష్ణారావుగారి పైన ఎక్కువగా ఉండేది. బ్రహ్మసమాజ మతావలంబులైన రఘుపతి వెంకటరత్నంనాయుడుగారి గురుత్వం వల్ల వీరిలో బ్రహ్మసమాజ భావాలు ఎక్కువగా ఉండేవి. బ్రహ్మసమాజ ప్రార్థనా సమావేశాలలో కృష్ణారావుగారు ఉపన్యసించేవారట. ఒక్క మాటలో చెప్పాలంటే ముట్నూరివారు సంప్రదాయ హిందూ మత కర్మ మార్గానికంటె అధునాతన జ్ఞానమార్గాన్ని ఎక్కువ అభిమానించారు, అవలంబించారు. ఈ విషయాలను కాటూరి వారు చాలా చమత్కారంగా చిత్రించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఈ జోడి న్నినుబోలు గ్రంథగురు లేరీ నేటి కాలమ్మునన్
సాక్షాద్బ్రహ్మ పదార్థ నిర్గుణ కథా వ్యాఖ్యాన విఖ్యాత ధీ
శిక్షా దైశిక శుద్ధ మానసపుట శ్వేతాక్షరాక్షౌహిణీ
భిక్షా దాన కళా సమంచిత మహర్ధీ! గ్రంథసాహెబుజీ!

పైపద్యంలో ముట్నూరివారి తాత్త్వికధోరణిని బ్రహ్మసమాజ అభిమానాన్ని వేంకటేశ్వర్రావుగారు చిత్రించారు. "సాక్షాద్బ్రహ్మ పదార్థ నిర్గుణ కథా వ్యాఖ్యాన" దక్షుడు ఆయన. విగ్రహారాధన సగుణారాధన, బ్రహ్మ సమాజంలో విగ్రహారాధన లేదు, ఏకేశ్వరోపాసన ఆ మత అదర్శం. కృష్ణారావుగారు ఈ మార్గాన్ని అభిమానించారు.

ముట్నూరివారిని పై పద్యంలో "గ్రంథ సాహెబుజీ!" అని, మరొకచోట "గ్రంథగురుడు" అని మరోపద్యంలో "గురుగ్రంథ సాహెబ" అని కాటూరివారు సంబోధించారు.

"గురుగ్రంథ సాహెబు" అనేది గమ్మత్తయిన ప్రయోగం. "సాహెబా" అనేది గౌరవ వాచకం, అనేక గ్రంథాలు చదివినవాడు, వ్రాసినవాడు. వ్రాయించినవాడు కాబట్టి ముట్నూరివారిని గ్రంథ గురుడనటం, గురుగ్రంథసాహెబా అనటం ఎంతో సమర్థనీయమయిన చమత్కారం. గురుగ్రంథ సాహెబు అనగానే నిజానికి సిక్కుల మత గ్రంథం గుర్తుకువస్తుంది. పుస్తకాన్నే దైవంగా భావించే మతమది. విజ్ఞానమే బ్రహ్మమని భావించే ముట్నూరివారిని అలా సంబోధించటం ఎంతో భావగర్భితం. ఆయన కొలువుతీర్చే పాకను జుమ్మమసీదు అనటంలో కూడ విగ్రహారాధనపై ముట్నూరివారికి మక్కువ లేకపోవటాన్ని తెలియజేస్తుంది. మసీదులో విగ్రహాలుండవు గదా. అంతేకాదు, హిందువయిన కృష్ణారావుగారికి, మసీదు, గ్రంథసాహెబు, విశేషణాలను జోడించి వారి సర్వమత సమన్వయ దృక్పథాన్ని తెలిపారు వేంకటేశ్వర్రావుగారు. బహుశా బ్రిటిషువాళ్ళు క్రైస్తవులు కాకుండానో లేక బ్రిటీషువాళ్ళు మనల్ని పాలించకుండానో ఉంటే, ఎక్కడోక్కడ చర్చిని కూడ ముట్నూరివారికి కాటూరివారు అంటగట్టేవారేమో! ముట్నూరివారి మత సమన్వయ దృక్పథాన్ని తెలియచేయటానికే ఇలా వర్ణించారు. ఈ కవితాఖండికలో పన్నెండు పద్యాలున్నవి. ఏ ఒక పద్యంలోనూ, ముట్నూరివారిని గురించి వాచ్యంగా కవి చెప్పలేదు. ఒక్క "దర్బారు" అనే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మాట తప్ప కృష్ణారావుగారి పేరెక్కడలేదు. పైగా "జమ్మ మసీదు" "గురుగ్రంథ సాహెబు" మొదలయిన మాటలు, తప్పుదారి పట్టించే అవకాశం కూడా ఉన్నది. జమ్మమసీదును, జుమ్మామసీదు అని భ్రాంతితో తప్పుదిద్దటానికి ఎవరైనా ప్రయత్నించినా ఆశ్చర్యపడనవసరంలేదు. కాటూరివారి కవితలు నూటికి తొంభై ఇలానే ఉండి వ్యాఖ్యానాన్ని అపేక్షిస్తుంటవి.

మరో "పన్నీటిజల్లు" విశ్వనాథవారి గజారోహణోత్సవ సందర్భంలో చెప్పింది. ఇది 1942 జనవరి 24 కృష్ణాపత్రికలో అచ్చయింది. దీంట్లో విశ్వనాథ వారిని గురించి వాచ్యంగానే ఉన్నది. కానీ పన్నీటిజల్లు అనే శబ్ద ప్రయోగం లేదు. కాటూరివారు ప్రశంసించినా, విమర్శించినా చమత్కారంగానే అంటుంది.

ఈ పద్యం చూడండి.

"పాయక నీ పయిం గవులు పద్యము లల్లెడి వేళ 'సత్యనా
రాయణ యంచు బ్రాసమున యందిడి మీదులు చూడకుండ నీ
వే యొక ప్రాసదాన మిడ నెంచికదా రచియించు చుంటి రా
మాయణ! మెంత నేర్పరివిరా! స్తుతిలోభము నీకె చెల్లురా!

సత్యనారాయణ అనంగానే రామాయణకల్పవృక్షం, స్ఫురణకువచ్చే సత్యాన్ని ఇలా సున్నితంగా చమత్కారంగా చెప్పారు కాటూరివారు.

విశ్వనాథవారి కవితామూర్తిని వర్ణిస్తూ వ్రాసిన పద్యం సత్యనారాయణగారికే కాదు. సరస్వతికే పన్నీటిజల్లు.

"నిను లోకుల్ వచియింతురంట నిజమౌనే? యుద్ది యీతండు నా
చన సోమన్న కటంచు, గాదనగబో నాపల్కు, నే నొక్కటిన్
మనలో మాట వచింతు, మారనయొ సోమన్నో మహే పెద్దనో
యన జెప్పంబని యేమి? నీ కగుదు నీవే సాటి మమ్మాటికిన్॥

మన తెలుగునాట ఒక కవిని గురించి చెప్పేటప్పుడు వీరు వారికి రెండో వారనో, అంతటివారనో, అంతకు తక్కువవారనో విమర్శించటం ఆనవాయితీ. ప్రతిభావంతుడైన కవి వాడికి వాడేకాని, ఒకరికన్న అధికుడుకాడు, మరొకరికన్న అల్పుడూకాడు. ఈ సత్యాన్ని కాటూరివారు ఇక్కడ వక్కాణించారు.

సత్యనారాయణగారి రచనల గురించి చెబుతూ వ్రాసిన పద్యం చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"కిన్నెరసాని యాటలకు గిన్నెర మీటి, పురాతనాంధ్ర శౌ
ర్యోన్నతి నూది కాహళము నూదితి, నర్తనశాల వీణపై
మిన్నక మెట్టు లొత్తితివి, మేటి ఫణమ్ములు వేయగల్గు నా
గన్నకు బుఱ్ఱ పట్టితివిరా! యిటువంటివిరా భవత్కృతుల్!"

కిన్నెరసాని, పురాతనాంధ్ర శౌర్యాన్ని తెలిపే ఆంధ్రప్రశస్తి, నర్తనశాల నాటకం, మొదలయిన విశ్వనాథ కృతులను ఇక్కడ స్మరించారు. అయితే "మేటి ఫణమ్ములు వేయుగల్గు నాగన్నకు బుఱ్ఱ పట్టితివిరా" అనటంలో ఎంతో చమత్కార మున్నది. విశ్వనాథవారి వేయి పడగలు సుమారు వెయ్యి పేజీలున్న నవల. వేయి పడగలవాడు ఆదిశేషుడు పాండిత్యానికి ప్రతీక. బుఱ్ఱ అంటే నాగస్వరం అని అర్థం. నాగన్నకు బుర్ర పట్టడమంటే, నీ రచనా నాగస్వరం ఊది ఆదిశేషుణ్ణి మెప్పించావని ప్రశంస. ఇలాటిది కాటూరివారి ఉక్తి వైచిత్రి.

ఇలా పరిశీలిస్తే ఈ సంకలనంలో ప్రతి పద్యం ఒక పన్నీటి బిందువు. అన్నీ కలిపితే పన్నీటిజల్లు.

కాటూరి వారి రాజకీయ స్ఫూర్తి

కాటూరి వేంకటేశ్వరరావు గారు కాంగ్రెసు వాది - అంతకంటే అధికంగా గాంధేయవాది - దేశాభిమానం, ఆంధ్రాభిమానం కలసి పెనవేసుకొన్న మూర్తి - జాతీయ భావ స్ఫూర్తి. 1930 ప్రాంతంలో బెస్టు కృష్ణా కాంగ్రెసు ఆఫీసు మేనే జరుగా పార్టీకి ఎంతో సేపచేసిన వేంకటేశ్వరరావుగారికి, ఒక దేశభక్తి గేయం రచించాడనే నేరంమీద ప్రభుత్వం కారాగారశిక్ష విధించింది. వీరు ఆంధ్ర జాతీయ కళాశాల అధ్యాపకునిగా ప్రిన్సిపాల్‌గా విద్యార్థులకు జాతీయభావాలు ప్రబోధించారు.

కాటూరి వారికి గాంధీ అంటే ఆరాధనాభావమే కాకుండా సాన్నిహిత్యంకూడా ఉన్నది. గాంధీ గారు బేసిక్ ఎడ్యుకేషన్ గురించి ప్రచారం చేస్తూ మద్రాసు వచ్చినపుడు, ఆ సిలబస్‌లో హిందీతో పాటు ప్రాంతీయ భాషలను కూడ చేర్చవలసిన ఆవశ్యకతను వివరించి ఒప్పించారు. అప్పటి హిందీ విశారద పరీక్షలో ఒక తెలుగు పేపరు ఉండటం వెనుక, వీరి కృషి ఉన్నది. బేసిక్ ఎడ్యుకేషను హిందీ విశారద, విద్యార్థులకోసం కొన్ని వచన రచనలు చేశారు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గాంధీ 1920వ సంవత్సరంలో భారత రాజకీయ రంగంపై అవతరించాడు. ఆయన పిలుపు నందుకొని 1921లో భారతజాతి సహాయ నిరాకరణోద్యమానికి నడుము కట్టింది. అహింసా మార్గంలో గాంధీ ప్రారంభించిన ఉద్యమం "చౌరీ చౌరా" సంఘటనతో హింసా పూరితమయినది. అక్కడ జరిగిన హింసాకాండలో ఇరవై ఒక్క మంది పోలీసులు, ఒక ఇన్స్‌పెక్టర్‌తో సహా ఎందరో సాధారణ పౌరులు మరణించారు. మరెందరో క్షతగాత్రులైనారు. దాంతో ఉద్యమం తాత్కాలికంగా నిలిచిపోయింది. గాంధీని బ్రిటిష్ ప్రభుత్వం జైల్లో పెట్టింది. తిరిగి 1924 ఫిబ్రవరిలో విడుదల చేసింది. 1931లో ఇర్విన్ ఒడంబడిక. 1937లో రాష్ట్రాలలో స్వపరిపాలన ఏర్పడింది. కానీ ఆంధ్రులకు గుర్తింపులేదు. ఆంధ్రప్రాంతం మద్రాసు రాష్ట్రంలో భాగమై పోయింది. తెలుగువారు ఎంతో నొచ్చుకున్నారు. ఆగ్రహించారు. ఈ అన్ని సందర్భాలలో కాటూరి వారు స్పందించి కవిత్వం వ్రాశారు. సహాయ నిరాకరణకు మద్దతుగా, "పిల్లంగ్రోవి పిలుపు" "రాటపు పాట"లను, ఇర్విన్ ఒడంబడికకు స్పందించి "అవబృథోత్సవం", ఆంధ్ర రాష్ట్రాన్ని కోరుతూ, 1938లో "మేమాంధ్రులం" 1939లో "తెలుగు జెండా" అనే కవితా ఖండికలు రచించారు. రెండవ ప్రపంచ యుద్ధానికి స్పందించిన కాటూరి వారి కలం నుండి "ఉగాది తారణ" "ఫలశ్రుతి" అనే కవితా ఖండికలు వెలువడినవి. అయితే చాలా కవితలలో ఆయా విషయాలు అన్యాపదేశంగానో, సూచనగానో ధ్వనింపజేశారే కానీ వాచ్యం చేయలేదు. కాటూరి వారు మొదట్లో గాంధీని దైవంగా యోగిగా భావించారు. తరువాత వ్యక్తి ఆరాధన సిద్ధాంతంపై భక్తిగా మారింది. ఆంధ్ర రాష్ట్ర విషయం వచ్చేసరికి గాంధీని కూడ లెక్కచేయలేదు. వేంకటేశ్వర్రావు గారికి, గాంధీ, గాంధీ సిద్ధాంతం, ఆంధ్రరాష్ట్రం ఒక దాని కంటే ఒకటి అత్యధిక అభిమాన పాత్రాలు.

గాంధీ 1921లో ప్రతిపాదించిన సహాయనిరాకరణోద్యమంలో విదేశవస్తు బహిష్కరణ, ప్రభుత్వంచేత గాని, ప్రభుత్వపు గ్రాంట్ల చేత గాని నడపబడుతున్న పాఠశాలల, కళాశాలల బహిష్కరణ, ముఖ్యమయినవి. ప్రధానంగా విదేశ వస్త్రాలను బహిష్కరించాలని మనదైన ఖాదీ పరిశ్రమను ప్రోత్సహించాలని, జాతీయ పాఠశాలలు, కళాశాలలు స్థాపించి విద్యార్థులకు జాతీయ భావాలు ప్రబోధించాలని, ప్రభుత్వ విద్యాలయాలకు మన పిల్లల్ని పంపకూడదని గాంధీ ప్రబోధించాడు. జన సామాన్యానికి సంబంధించిన విషయాలివి. ప్రభుత్వమిచ్చే బిరుదులను, గౌరవోద్యోగాలను తిరస్కరించటం, న్యాయస్థానాలను సమావేశాలను బహిష్కరించటం పెద్దలైన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎన్నో అంశాలిందులో ఉన్నవి. భారతజాతి ఐక్యతకు గొడ్డలిపెట్టుగా ఉన్న అంట రానితనాన్ని నిర్మూలించవలసిన ఆవశ్యకతను కూడ మహాత్ముడు గ్రహించాడు. అందుకే హరిజనోద్యమం సాగించాడు. కాటూరివారు హరిజనోద్యమంలో భాగమైన దేవాలయ ప్రవేశాన్ని సమర్థిస్తూ ప్రత్యేకంగా వ్రాసిన గుడిగంటలు అనే లఘుకావ్యాన్ని మనం పరామర్శించే ఉన్నాము. ఇక మరికొన్ని ఉద్యమాలకు కాటూరి వారు ఎలా స్పందించారో చూద్దాం.

ఆనాడు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకున్న ఉద్యమాలు - విద్యాలయాల బహిష్కరణ, ఖాదీ ఉద్యమం. నాటికి నేటికి ఏదైనా ఉద్యమం వస్తే ముందు స్పందించేదీ విద్యార్థులనే విషయం సుస్పష్టం.

1921వ సంవత్సరం ఫిబ్రవరిలో "పిల్లం గ్రోవి పిలుపు" అనే కావ్య ఖండికను కాటూరివారు, బందరులో ముట్నూరి వారి అధ్యక్షతన జరిగిన విద్యార్థి సభలో చదివారు. ఈ కవితను పరిశీలిస్తే గాంధీని కృష్ణునిగా, భారత ప్రజను గోపాలురుగా బ్రిటీషు రాజును ఇంద్రునిగా, చిత్రించినట్లు ఒక స్ఫురణ కలుగుతుంది. ఇంద్రయాగ సందర్భాన్ని పురస్కరించుకొని కవి, "ఇంద్రునికి భయపడవలదనియు, విశ్వాత్ముడైన కృష్ణుడు మీకు అండగా ఉండగా, దేవేంద్రుడు కురిపించే పిడుగులు, రాళ్ళు, రప్పలు మిమ్మల్ని ఏమీ చేయలేవని, గోవర్ధనోద్ధారకుని ఆశ్రయించమని" గోపాలురకు ప్రబోధం చేశాడు.

ఇది అన్యాపదేశంగా "బ్రిటీషురాజుకు భయపడవద్దని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాడమని, సత్యాహింసా మూర్తి గాంధీని అనుసరించమని, గాంధీమార్గం సురక్షితమని, భద్రమని" ప్రజలకు కాటూరి వారు చేసిన ప్రబోధమే!

> "తన పూజల్ విడనాడినన్ త్రిజగదాధారుండు, దేవేంద్రు దే
> మనునో, కిన్కవహించి వెండియును కాలాంభోదముల్ గూర్చి, రా
> ళ్ళను రప్పల్ గురియంగలాడొ మనయిళ్ళన్ వాకిళుల్ గూల్చ సా
> గునొ యంచేటికి భీతి ? చేరజనరే గోవర్ధనోద్ధారకున్."

ఒక విషయాన్ని వాచ్యం చేస్తూ వ్రాసే కవిత్వం సామాన్యం. ఒకే పద్యంలో లేక ఒకే కవితాఖండికలో, అనేక విషయాలు స్ఫురించేటట్లు వ్రాయటం ప్రజ్ఞా విశేషం. అయితే అలాటి కవిత్వం సరిగా వ్యాఖ్యానింపబడకపోతే అన్వయక్లేశంతో పాఠకునికి దూరమయ్యే ప్రమాదం కూడా ఉన్నది. అందుకే దేవరకొండ బాల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గంగాధరతిలక్, కవిత ట్రాన్సిపిరెంటు చీకటిగా ఉండాలన్నాడు. కాటూరి వారి కవిత్వంలో ప్రపంచ, దేశ, రాష్ట్ర పరిస్థితులు ఛాయ ప్రచ్ఛాయల్లాగా కనిపిస్తుంటవి.

ఈ కావ్య ఖండికలో గుంటూరుకు సంబంధించిన "చీరాల-పేరాల" సంఘటన కూడ ప్రతిఫలించింది. 1921లోనే గాంధీ సహాయ నిరాకరణోద్యమానికి అనుబంధంగా జరిగిన తిరుగుబాటిది. 1919లో చీరాల పేరాలను కలిపి ప్రభుత్వం మునిసిపాలిటీ చేసింది. పన్నులు నాలుగువేలు, నలభై వేలయినవి కాని వసతులు ఏ మాత్రం పెరగలేదు. ఆ గ్రామాలలో ఉన్నవారు ఎక్కువ నేతపనివాండ్రు, చిన్న రైతులు. వారు పురపాలక సంఘాన్ని రద్దు చేయమని, చీరాలను సందర్శించిన ఉమ్మడి మద్రాసురాష్ట్రం ముఖ్యమంత్రి రామరాయంగారిని కోరారు. ఆయన కాంగ్రెసుకు వ్యతిరేకమైన జస్టిసు పార్టీవాడు కావటంవల్ల, చీరాల ప్రాంతంలో కాంగ్రెసు బలంగా ఉండటంవల్ల, వారి కోరికను త్రోసిపుచ్చాడు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి నాయకత్వంలో చీరాల పేరాల ప్రజలు పన్నులు కట్ట నిరాకరించారు. వెయ్యిమంది సభ్యులతో రామదండుని నిర్మించిన గోపాలకృష్ణయ్య 1921 మార్చిలో విజయవాడ వచ్చిన గాంధీని సందర్శించాడు. గాంధీ సలహామేరకు చీరాల ప్రజలు ఊరిని వదలి కొద్దిదూరంలో పాకలు వేసుకున్నారు. ప్రభుత్వం ప్రజలకు జరిమానాలు విధించింది, ఇళ్ళు కూలుస్తామని బెదిరించింది. ప్రజలు లొంగలేదు.

1921 మార్చి 31వ తేదీన అఖిలభారత కాంగ్రెసు మహాసభలో పాల్గొనటానికి గాంధీ విజయవాడ వస్తున్నాడనే సంగతి తెలిసిన వేంకటేశ్వరరావుగారు వారి రాకకు నాందిగా ఈ ప్రబోధం చేశారు. గాంధీ చీరాలను సందర్శించిన తరువాతనే ప్రజలు గ్రామం వదిలిపెట్టినప్పటికి ప్రజల తిరుగుబాటు, ప్రభుత్వం పేధింపు, ఫిబ్రవరి నాటికే పరాకాష్ఠ నందుకున్నది.

కృష్ణుని ప్రబోధంతో ఇంద్రుణ్ణి నిరాకరించి, అతని ఆగ్రహానికి గురయిన గోపాలురకు, పన్నులు కట్ట నిరాకరించి ప్రభుత్వ ఆగ్రహానికి గురయిన చీరాల, పేరాల వాసులకు ఎంతో పోలిక ఉన్నది. ఇక్కడ అక్కడ గోపాలకృష్ణయ్యలే నాయకులు కావటం విశేషం. అసలీ ఉద్యమానికి సిద్ధాంతకర్త మోహన్‌దాస్ కావటం మరో విశేషం. ప్రజల్ని ఉత్తేజపరుస్తూ గోపాలకృష్ణయ్యగారు కమ్మగా పాడే పాటలు పిల్లంగ్రోవి పిలుపే. ఈ విధంగా దేశ, రాష్ట్ర స్థాయిలలోని సహాయ నిరాకరణోద్యమాన్ని ఇక్కడ కాటూరివారు సూచించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గాంధీ పిలుపు విని ఎందరో విద్యార్థులు చదువు కట్టిపెట్టి స్వాతంత్ర్యోద్యమానికి నడుం కట్టారు. వారిలో వేంకటేశ్వర్రావుగారుకూడ ఒకరు. అందువల్ల ఇందులో విద్యార్థులను ఉద్దేశించి చేసిన ప్రబోధం కూడ కనిపిస్తుంది. పైన ఇది చదివింది విద్యార్థుల సభలో కదా!

ఈ పద్యాలు చూడండి.

"పిడుగుల్ రాల్ జడిగా బదింబదిగ దాపీడించిన న్మిమ్ము మీ
ర్విడువం బోరు సురాధిపాగమములన్, పేరందు! విశ్వాత్మ డ
ల్లడుగో! విశ్వము మాధురీపులకితమ్మౌ రీతి గానమ్ము స
ల్పెడి, చాలింపు డికేని మీచదువు లాలింపుండు గోపార్భకుల్."

అని ఒకచోట—

"చదువులు తుదముట్ట జదివిన వారల కందుకోరాని యానందపదము
నీటిపై వ్రాతలౌ మేటి సంపదలచే సాధింపరాని స్వేచ్ఛాపదమ్ము,
ఆత్మశోషణ ఫలమ్మౌ జపతపముల బడయగా రానట్టి బంధముక్తి
చిల్లర వేల్పుల సేవించు మాత్ర చేపడనట్టి దివ్యకైవల్య పదము."

"సరవి దనుజేర వచ్చిన సాధువులకు
పంచెద నటంచు మురళి మ్రోయించు నదిగో!
రండు తద్గానలహరిలో దాండవింప
ప్రాలు మాలక గోపాల బాలులార!"

పై పద్యాలలో "చాలింపుడికేని మీ చదువులు........" "చదువులు తుదముట్ట జదివిన వారల కందుకోరాని ఆనందపదము" అనే వాక్యాలలో ఇంగ్లీషు వాని సత్వపు చదువులు వదలి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనమని, కవి విద్యార్థులకిచ్చిన పిలుపు గోచరిస్తుంది.

"నీటిపై వ్రాతలౌ మేటి సంపదలచే సాధింపరాని స్వేచ్ఛాపదమ్ము" అనటం, పదవులను, బిరుదులను, కోర్టులను వదలి స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం గాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనమని, ధనవంతులకు విద్యాధికులకు కవి చేసిన ప్రబోధమే! గాంధీ బోధల్నే పిల్లంగ్రోవి పిలుపుగా సత్యాగ్రహుల్ని సాధువులుగా చిత్రించిన ప్రబోధాత్మకమయిన కవిత ఇది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరివారు గాంధీని కృష్ణునిగా భావించి, ఈ కవితా ఖండిక వ్రాశారని, చెప్పటానికి ప్రబలమైన ఆధారం, 1945వ సం॥ము జనవరి-13 కృష్ణాపత్రికలో లభించింది. నవ్య సాహిత్య పరిషత్తు అధ్యక్షునిగా వేంకటేశ్వరరావుగారు చేసిన ప్రసంగ సారాంశం "గాంధి దేవుని దివ్య సందేశం - కవుల కంఠాలలో, క[illegible]లలో కరగి పొంగాల" అనే శీర్షిక క్రింద ఈ పత్రికలో ప్రచురింపబడింది. దాంట్లోని కొన్ని వాక్యాలను "పిల్లంగ్రోవి పిలుపు"తో పోల్చి చూద్దాం.

"నేడు భారత భూమిలో తపోవన వాటికనుండి, యజ్ఞశాలల నుండి మరిమొక పిలుపు బయలుదేరింది. మృదులమై. మధురమై, మసృణమై, మృద్వీక మాధ్వీకమైన, ఆ పిలుపు సప్తసామ గంభీరమై గోపాలకృష్ణుని మురళివలె మ్రోగుచున్నది."

(కృ.ప. 1945-జనవరి-13)

ఇక "పిల్లంగ్రోవి పిలుపు" లోని మొదటిపద్యం చూడండి.

"మృదులమ్మై మధురమ్మునై మసృణమై మృద్వీక మాధ్వీకమై
ఉదిత ప్రస్ఫుట సప్త సామ విభమై ఉద్ఘూర్ణితో ద్ఘోషమై
అదె! బృందావనవీధి! మాధవుని దివ్యద్దివ్య వంశీ స్వనం
బుదితం బయ్యెను, గోపబాలకులు రారో! తండ తండమ్ములై"

1921లో వ్రాసిన పై పద్యానికి, 1945లో ఉపన్యాసానికి ఎంత సామ్యమున్నదో చూడండి. భావమేకాదు మాటలు కూడ అవే. అప్పుడు ధ్వని ప్రధానంగా వ్రాసిన విషయాన్ని 24 సంవత్సరాల తరువాత కాటూరివారు వాచ్యం చేశారు. ఇన్ని సంవత్సరాలుగా గాంధీ గారంటే అదే ఆరాధనాభావం వేంకటేశ్వరరావుగారి మనసులో పదిలంగా ఉండటం విశేషం.

సహాయ నిరాకరణంలో మరో ముఖ్యమయిన విషయం, విదేశ వస్త్ర బహిష్కరణ. స్వదేశీయ ఖాదీ ఉద్యమ ప్రోత్సాహం. గాంధీ కృష్ణుడనుకుంటే చరఖా ఆయన చక్రం. పల్లెల దగ్గర్నుంచి పట్నాలదాకా స్త్రీ, బాల, వృద్ధులనే భేదం లేకుండా ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ఖాదీ ఉద్యమాన్ని సమర్థిస్తూ కాటూరివారు వ్రాసిన కవితే "రాటపుపాట". ఇది కూడ 1921 సం॥ మార్చిలోనే వ్రాయబడింది.

అగ్గిపెట్టెలో మడిచి పెట్టగల అద్భుతమయిన వస్త్రాలు నేయగలిగిన భారతీయ చేనేత పనివారి ప్రతిభకు, కళకు బ్రిటీషు మిల్లు వస్త్రాల దిగుమతి విఘాతం కలిగించింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బ్రిటను నుండి వచ్చిన మిల్లు వస్త్రాలను కొనుక్కోటానికి ప్రజలు అలవాటు పడ్డారు. దాంతో నిరుద్యోగం దారిద్ర్యం, పరాధీనత అన్నీ ఒకసారి జాతిని చుట్టు ముట్టినవి. ఈవిషయాన్ని వివరిస్తూ పాడుకుంటానికి వీలయిన చక్కటిపాట వ్రాశారు. నూలువడికేవారు శ్రమ తెలియకుండా ఉండటానికి ఏవో పాటలు పాడుకోటం అందరికీ తెలిసిందే. ఏ కవితా ప్రక్రియ ఏ ప్రయోజనాన్ని సాధిస్తుందో గుర్తెరిగిన కాటూరివారు అలా పాడుకోటానికే ఈ పాట వ్రాశారు.

"నేను మీ యిలవేల్పునే చెల్లీ, నాతోడ నాడుకొనవే
నేను గృహలక్ష్మినే, తల్లి నను మరచి పోతివటే॥
పూయరే పసుపు నాకు, కుంకుమపు బొట్టు నా నుదుట నిడరే,
చేయరే యుపచారముల్, మరచుటకు, చెంపలనువై చికొనరే ॥నేను॥
దీపమై వెలగినానే మీయింట దివ్వెనై వెలిగినానే
కాపుదలగా నుంటినే, మును మీకు నాపదలు తొలగిస్తినే ॥నేను॥
మీ పెరటి కల్పకమునై, మీకెల్ల ఆపదలు బాపినానే
మీ పాలి వేల్పుటావై, యమృతమ్ము చేసి మీ కొసగినానే ॥నేను॥
నీ నెత్తురున చుక్కనై, చెల్లిరో నీ మాంసమున కండనై,
నీ ఎమ్ముకను మూలుగై, తల్లిరో నీవె నేనై యుంటినే ॥నేను॥
ఇలువేల్పు పూజమాని, పెరవేలుపుల పూజ సేయబూని
కలుములకు దవ్వైతిరే, యీనాడు కష్టముల పాలైతిరే ॥నేను॥
మీరు నన్ను మరచినా, తల్లిరో, మిమ్మునే మఱవగలనా
పారజూచి తెలియరే, మీపాలి పత్తి రాట్నమును నేను. ॥నేను॥

ముఖ్యంగా మనది వ్యవసాయదేశం. ఇప్పటి సంగతి అలా వుంచి పూర్వం, సంక్రాంతితో వ్యవసాయపు పనులు అయిపోయేవి. వేసవికాలం పూర్తిగా ప్రజలకు విశ్రాంతి. మిగిలిన రోజులలో కూడ రోజంతా పని వుండదు. ఆ ఖాళీ సమయాలలో నూలు వడకటం వస్త్రాలు నేసుకోవటం గ్రామీణుల వ్యాపకంగా ఉండేది. నేతగాళ్ళు కూడ, మూడువందల అరవైరోజులు, నేసేవాళ్ళు కాదు. వాళ్ళకు కూడ చిన్న చిన్న భూవసతులుండేవి. వర్షాకాలంలో పొలంపనులు చేసికొంటూ, పొలం పనులు లేనప్పుడే నేత నెయ్యటం నూలు వడకటం చేసేవారు. పొలం పనులు చేయలేని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వృద్ధులకు ఇది చక్కని కాలక్షేపం, బ్రిటీషు ప్రభుత్వం ధర్మమా అని చేనేత మూల బడ్డది. పండించిన ప్రత్తిని తక్కువ ధరకు అమ్ముకోటం, అదే ప్రత్తితో తయారైన బట్టలకు అధిక ధరలు చెల్లించటం. ఇలా అమ్మకంలో, కొనుగోలులో రెండింట ప్రజలు బ్రిటీషువారి దోపిడికి గురయినారు. దీన్ని గుర్తించి గాంధీగారు ఖాదీ ఉద్యమాన్ని ప్రారంభించారు. కాటూరివారు దాన్ని తన కవితతో ప్రచారం చేశారు.

రాట్నాన్ని ఇలవేల్పుగా, గృహలక్ష్మిగా, ఇంటిదీపంగా. పెరటి కల్పవృక్షంగా, కామధేనువుగా వర్ణించారు కాటూరివారు.మానవుల మనుగడకు ముఖ్యమయిన కూడు, గుడ్డలలో గుడ్డపై గొడ్డలిపెట్టు పెట్టారు బ్రిటీషువారు. ప్రజలందరు బ్రిటీషువారి దయాధర్మభిక్షంపై ఆధారపడవలసి వచ్చింది. అలాంటి స్థితిలో ఖాదీ ఉద్యమం జాతికి క్రొత్త ఊపిరినిచ్చింది. ఈ విధంగా కాటూరివారు సహాయనిరాకరణోద్యమంలో గాంధీ సిద్ధాంతాలకు కవితా ప్రచారకుడైనాడు.

ఉద్యమ ప్రచారంలో ఉత్సాహాన్నేకాదు, వైఫల్యంలో విషాదాన్ని కూడ అనుభవించిన కాటూరివారు అసలు సిసలయిన గాంధేయవాది. 1922వ సంవత్సరంలో "చౌరీ చౌరా"లో బొంబాయిలో ఎన్నోహింసాత్మక సంఘటనలు జరిగినవి.మనరాష్ట్రం గుంటూరు జిల్లాలో పర్వతనేని వీరయ్యచౌదరి నాయకత్వంలో పన్నుల నిరాకరణ ఉద్యమం తీవ్రతరమైనది. మంచాలపాడు ప్రాంతానికి నాయకుడైన కన్నెగంటి హనుమంతుని పోలీసులు కాల్చి చంపారు. ప్రజలు హింసామార్గాన్ని అవలంబించారు. గాంధీ తన అహింసా సిద్ధాంతం విఫలం కావటంతో, తాత్కాలికంగా ఉద్యమాన్ని ఉపసంహరించుకున్నాడు. 1922 మార్చిలో గాంధీని ప్రభుత్వం అరెస్టు చేసింది. చచ్చినవారు చావగా తాత్కాలిక శాంతి ఏర్పడింది. శాంతి కాముకులకు సామాన్యులకు సంతోషం కలిగింది. కానీ సహాయనిరాకరణం, స్వాతంత్ర్యం తెస్తుందని భావించినవారు బాధపడ్డారు. వారిలో కాటూరివారు కూడ ఒకరు. 1922లో వారు "స్వప్న భంగం" అనే ఖండికను అదే ఉద్దేశ్యంతో వ్రాసినట్లు తోస్తుంది.

1919 చట్టం ప్రకారం జరిగే ఎన్నికలలో పోటీచేసి ప్రభుత్వంలోజేరి ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని మోతీలాల్‌నెహ్రూ, చిత్తరంజన్‌దాస్ భావించి స్వరాజ్య పార్టీ పెట్టారు. కొందరు దీనికి వ్యతిరేకంగా సహాయ నిరాకరణ సిద్ధాంతానికే కట్టుబడి ఉన్నారు. ప్రజలలో గాంధీ మార్గం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని కొందరికి, స్వరాజ్య పార్టీ వల్ల వస్తుందని మరికొందరికి రెండు అభిప్రాయా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లేర్పడ్డవి. కాటూరి గాంధేయవాది కదా! తన నిరాశను. రెండవ అభిప్రాయం వారి ఆశను ఇక్కడ వ్యక్తం చేశారు.

"ఈ మంగళధ్వను లీ తూర్యరవము
లేటికి చెవిచెంత? యించుక నన్ను
కన్ను మూయఁగ నీరు కలఁగాంచనీరు
బంగారు వంటి స్వప్నము భంగమాయె.
పనిపాటు లేదో యీ ప్రజలకు నెల్ల
తప్పెటల్ బూరలు తాళము ల్వ్వాని
చెవి చెంత రొదసేయ చేరినా రిచట."

పై పంక్తుల్లో, విఫలమైన సహాయనిరాకరణ, స్వరాజ్య పార్టీ ఎన్నికల సంరంభం ధ్వనిస్తున్నది.

చివరలో

"వలదనన్ నేను, కన్నులు మోడ్చి మీరు
కలలు కనుండు, బంగారు కలలు."

అంటారు వేంకటేశ్వరరావుగారు. స్వరాజ్య పార్టీ వారిని ఉద్దేశించి అన్న మాటలివి.

1931లో గాంధీ ఇర్విన్ ఒప్పందం తరువాత కాటూరివారు వ్రాసిన గొప్ప కవితా ఖండిక "అవబృథోత్సవం". దీంట్లో నాటి రాజకీయ పరిస్థితులను వర్ణించ టమే కాదు, గాంధీ గారంటే తనకెంత ఆరాధనా భావమున్నదో వ్యక్తం చేశారు. ఈ పద్యాలు 1931వ సం॥ మార్చి 28 కృష్ణా పత్రికలో ప్రచురింపబడినవి.

కాటూరివారి దృష్టిలో సత్వ సంపన్నులైన మహాయోగులు సర్వశ్రేష్ఠులు, వారు సాధించలేనిది లేదు. తమోరజోగుణ ప్రవృత్తులైన ఇంద్రాది లోకపాలకులు వారికి తలవంచ వలసినదే. సత్యము, శౌచము, శాంతము, భూతదయ మొద లైన సద్గుణాలతో విరాజిల్లే మహాయోగి గాంధీ. కాటూరివారు ఈ కవితలో బ్రిటీషు రాజును ఇంద్రునితో పోల్చారు. "పిల్లంగ్రోవి పిలుపు"లో కూడా అలానే పోల్చటం గమనార్హం. ఇంద్రుడు సత్వ సంపన్నులైన మునుల చేతిలో భంగపడినంతగా రాక్షసుల చేతిలో భంగపడలేదు. ఇంద్రుడు రాక్షసులను ఎదిరించినప్పుడు దైవశక్తి అండగా నిలిచింది. కాని మునుల జోలికి పోయినపుడు మాత్రం భంగపాటు తప్ప లేదు. బ్రిటీషు రాజు ఇంద్రుడి లాంటివాడు. సాయుధ విప్లవాన్ని అణచివేయగలడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గాని, గాంధీ యోగి అహింసా మార్గంలో సాగిస్తున్న స్వాతంత్ర్య యజ్ఞాన్ని ఆప లేడు. పరాభూతుడు కాకుండా నిలువలేడు.

కాటూరివారి దృష్టిలో గాంధీ పూర్వపు ఋషులకన్నా గొప్పవాడు. వారు ఆత్మోద్ధరణకు తమ తపస్సును వినియోగించుకున్నారు. ఏవో కొన్ని సందర్భాలలో అధికార మత్తులైన వారిని శిక్షించారు. ఇక ఆనాడు రాజకీయ అధికారం పొందటం కాని, రాజ ధర్మం నిలపటంగాని ఒక్క యుద్ధం వల్లనే సాధ్యమయింది. సత్వ గుణ ప్రధానుడైన రాముడు కూడ యుద్ధం ద్వారానే ధర్మం నిలిపాడు గదా! ఒక్క గాంధి మాత్రమే సత్యము, అహింస తపస్సుల ద్వారా రాజకీయ అధికారం, ఆత్మోద్ధరణం రెండూ సాధించాడు. అందుకే యావత్ ప్రపంచం ఆయనను మహాత్ముడంటూ శ్లాఘించింది. గాంధీపై కాటూరి వారికెంత ఆరాధనా భావమున్నదో ఈ పద్యం చూస్తే తెలుస్తుంది.

"హుంకరించెనో? యగస్త్యుడు నేడు నహుషు నౌ
ద్ధత్యమ్ము వమ్మొంచు ధరణి ద్రెళ్ళ,
ధృత వజ్రమగు దివస్పతి హస్త స్తంభ
మొనరింప జేయుత్తెనో। చ్యవనుడు
తాల్చెనేమొ వశిష్ఠ తాపసి బ్రహ్మదం
డమ్ము కౌశికుని గర్వము హరింప,
అలికనేత్రుండు వెల్వెల బాఱ నలికాల
గన్ను చూపించెనో గౌతముండు.
అంతకును మీదుమిక్కిలి యద్భుతమ్ము
లేమి పొడమెనో! కాక యీరేడు జగము
లేల తలయూచు మక్కుపై ప్రేలిడి
బాపురే! మేలు! మేలుసేబా! సటంచు."

ఇంద్రత్వం చేత అహంకరించిన నహుషుని అగస్త్యుడు శిక్షించడం కంటె, తనపై వజ్రాయుధం ప్రయోగించబోయిన ఇంద్రుని చేతిని చ్యవనుడు స్తంభింప చేయటంకంటె, విశ్వామిత్రుని గర్వాన్ని వశిష్ఠుడు తన బ్రహ్మదండంతో అణచిన దానికంటే, మూడవ కన్ను చూపించి బెదిరింపబోయిన శివునికి, తన అలికాలులో కన్నును చూపించి గౌతముడు నిగ్రహించిన దానికంటె, ఈనాడు బ్రిటీషు సామ్రాజ్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వాదుల్ని గాంధీ గెలవటం, అద్భుతం అంటారు కాటూరివారు. ఇది కవికి, గాంధీపై గల మహోన్నత భావాన్ని తెలియజేస్తున్నది.

మొదటి రెండు పాదాలలో ఇంద్రుణ్ణి గురించి ప్రస్తావించటం, తరువాత ఇంద్రుణ్ణి అధిగమించి త్రిశంకు స్వర్గం సృష్టించిన విశ్వామిత్రుణ్ణి ప్రస్తావించటం, నాల్గవ పాదంలో శివుణ్ణి ప్రస్తావించటం, వీరందర్ని జయించిన ఋషుల మహత్తును గురించి చెప్పటంలో అంతరార్థమున్నది. ఇంద్రుడే కాదు వాణ్ణి గెలిచినవాడు, అంతకంటే సర్వేశ్వరుడైనాసరే, సత్వగుణ ప్రధానులైన ఋషులను ధిక్కరించటం అసాధ్యమనేదే దీని తాత్పర్యం. ఇంగ్లాండు రాజును ఇంద్రునితో పోల్చడంతో గాంధీముందు అతడెంత! అన్న భావాన్ని కాటూరివారు ఆవిష్కరించారు.

పై పద్యంలో మరో చమత్కారమున్నది. "జగములేల తలయూచు ముక్కుపై వ్రేలితోడ బాపురే! మేలు! మేలు సెబా! సటంచు" అన్నప్పుడు "బాపురే" అన్న ప్రశంసార్థక శబ్దాన్ని బాపు!, రే! అని విడదీస్తే "రే" అన్న శబ్దం కూడ ప్రశంసార్థకమే కాబట్టి, బాపు అంటే గాంధీ అనుకొంటే, గాంధీని గురించిన ప్రశంస సగాతోచి చక్కని స్ఫూర్తి కలుగుతుంది.

అవబృథోత్సవం అంటే యజ్ఞం తరువాత జేసే పుణ్యస్నానం. స్వాతంత్ర్యోద్యమమే యజ్ఞం. యజ్ఞకర్త గాంధీ. సమిధలు ఉద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య వీరులు. వారిని ఆశీర్వదిస్తూ వేంకటేశ్వరరావుగారు వ్రాసిన పద్యమిది.

"సత్య శౌచ దయాజ్ఞాన శాంతి రాశి
ఆత్మ యజ్ఞ దీక్షితుడైన యవసరమున
యజ్ఞకుండాన నేను నేనని దుమికిన
సమిధలకు మీకు నెల్ల నాశాస్య మిద్ది!"

ఎవరైనా యజ్ఞం చేస్తున్నారంటే తన పదవికి భంగం కలుగుతుందేమోనని ఇంద్రునికి భయం. తపస్సు ఆపటానికి ఎన్నో చతుర సల్లాపాలాడుతుంటాడు. ఇక్కడ ఇంద్రుడు, ఇండియాలో తన అధికారం కుప్పకూలుతుందని భయపడే బ్రిటీషురాజు. ఇర్విన్ ఒడంబడికే చతుర సల్లాపం. ఆ ఒడంబడిక స్వాతంత్ర్యోద్యమాన్ని నీరు కార్చటానికే గాని మనకి మేలు చేయటానికి కాదు. స్వాతంత్ర్య రణయజ్ఞం పూర్తి అయినదని భ్రమ పడవద్దు అని ప్రజలను వేంకటేశ్వరరావుగారు హెచ్చరించిన పద్యమిది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఆత్మ పద భంగ భీతి నయ్యమర విభుడు
చతుర సల్లాపము లోకింత సలుపు నంత
నవభృథస్నాన సంభ్రమములైన మీకు
నిచ్చు గావుత నిష్ఠ యజ్ఞేశ్వరుండు!"

"స్వాతంత్ర్యం వస్తుందని, మన రణయజ్ఞం ముగిసిందని, భ్రాంతి పడే మీకు యజ్ఞేశ్వరుడైన దేవాధిదేవుడు సత్యాన్ని గ్రహించే విజ్ఞత, ఉద్యమాన్ని కొనసాగించే నిష్ఠ ఇచ్చుగాక," అనటంలో స్వాతంత్ర్య సమరం ఒక సవనమని, తుదిదాకా నిర్వహించాలని, సంపూర్ణ స్వాతంత్ర్యమే మన లక్ష్యమనే ప్రబోధమున్నది. అయితే ఈ విషయాలు ఎక్కడా వాచ్యం చేయబడలేదు.

"అల్పకాయమ్ము బోసిన వ్వంగ వస్త్ర
మూత కోలయు నౌచు నుబ్బూత లాచె
చూడ్కి లోన త్రివిక్రమస్ఫూర్తి దాల్చి
మూడు జగములు నెవ్వడీ ముదుక తబిసి!"

అనే పద్యాన్ని బట్టి, ఈ కవితాఖండికకు ముందు "గాంధీ ఇర్విన్ ఒడంబడిక పిమ్మట చెప్పినది" అని వ్రాసి ఉండబట్టి, ఇలా వ్యాఖ్యానించే వీలు కలిగింది. "త్రివిక్రమ" శబ్ద ప్రయోగంతో వేంకటేశ్వరరావుగారు గాంధీని కృష్ణునిగా సూచించారు.

"అల్పకాయమ్ము........" అనే పద్యంలో వర్ణన గాంధీకి సంబంధించిందే అనటానికి ఆధారంగా "పిల్లంగ్రోవి పిలుపు" ఖండిక విమర్శలో ఉదాహరించిన "గాంధీ దేవుని దివ్య సందేశం, కవుల కంఠాలలో, కలాలలో కరిగి పొంగాలి"అనే వ్యాసంలోని మరికొన్ని వాక్యాలు ఇక్కడ ఉదాహరిస్తాము.

"........ఆ పిలుపు సప్తసామ గంభీరమై గోపాలకృష్ణుని మురళివలె మ్రోగుచున్నది. బోసినోటినుండి వెలువడే అవ్యాజ మధుర మందహాసంతో, అంగవస్త్రము దాల్చిన బడుగు దేహంతో ఊతకోలతో, గాంధీ మహర్షి చేతులు మోడ్చుకొని రంగమున కవతరించినాడు....."
(కృ. ప. 1945 జనవరి 13)

ఆ పద్యాన్ని పై వాక్యాలను పరిశీలిస్తే కాటూరివారు గాంధీని యోగీశ్వరునిగా, యోగీశ్వరేశ్వరుడైన కృష్ణునిగా భావించారనేది సుస్పష్టమౌతుంది.

కాటూరివారు తన కవిత్వంలో భావాలను ధ్వనింపజేయటమో, స్ఫురింపజేయటమో, సూచించటమో చేస్తారుగాని సాధారణంగా వాచ్యం చేయరు. ఆ కవిత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్రాసిన కాలం సందర్భాన్నిబట్టి మనం విశ్లేషించినపుడే అందులోని అంతర్గతభావాలు వ్యక్తమవుతవి.

1934 నవంబరులో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో కాంగ్రెసు అఖండ విజయం సాధించింది. స్త్రీలుకూడ ముఖ్యంగా ఖాదీ ఉద్యమంలో విశేషంగా పాల్గొన్నారు.

అంతేకాదు, 1934 జూన్‌లో విజయవాడలో జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతులను, రైతుకూలీలను సంఘటిత పరచటానికి కాంగ్రెసులో అంతర్భాగంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పడింది. దీనికి ఆచార్య రంగా అధ్యక్షులు. చిన్న రైతులకు దీదసాదకు అండగా నిలచి వారి యోగక్షేమాలు చూడటమే దీని లక్ష్యం. స్వాతంత్ర్యం సాధించటమేకాదు, ధనిక బీద తారతమ్యాలను తొలగించటానికి కూడ కాంగ్రెసు కంకణం కట్టుకున్నది. ఈ విషయాన్ని శ్లాఘిస్తూ కాటూరి వారు 1934 నవంబరులో వ్రాసిన కవితే "విజయతోరణం."

"పటు దండహతుల పాల్పడుచు నాబాలవృ
　　ద్ధమ్ము తాల్చిన సహనమ్ము పండి,
బంధనాలయములఁ బలువింత క్రూర క
　　ర్మములోర్చుకొన్న తాలిమి ఫలించి,
తలిరుబోండ్లెల్ల నంతర్గేహములు వీడి
　　తాల్చిన వీరవ్రతమ్ము పూచి
ధనము మానము ప్రాణమును వ్రేల్చు ధన్యుల
　　జన్మంపు ఫలము సాక్షాత్కరించి
సత్య కాంతుల పేరి యశ్వముల వల్గు
పల్లవముల కనర్ఘశతత్వమ్ము గలుప
విషమ తలములు చదును గావింప నదిగొ
వెడలె కాంగ్రెస్సు రథమున విజయలక్ష్మి."

ఈ పద్యంలో అహింసా వ్రతానికి కట్టుబడి పోలీసుల లాటీ దెబ్బలు తిని చెరసాలలో అష్టకష్టాలనుభవించిన ఆబాలవృద్ధులు, గృహాలు వదలి స్వాతంత్ర్య సమరంలో దూకిన వీర నారీమణులు, తమ ధన, ప్రాణాలు సాతంత్ర్య సవనంలో ఆహుతిగా అర్పించిన ధీరులు మన కండ్ల ముందు సాక్షాత్కరిస్తారు. "విషమ తలములు చదునుగావింప నదిగొ వెడలె కాంగ్రెస్సు రథమున విజయలక్ష్మి" అనటంలో దరిద్రులు, ధనికులు అనే అంతరాలు తొలగించి అందరికి సమాన అవ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాశాలు కల్పించాలనే కాంగ్రెసు లక్ష్యాన్ని, ఆ పార్టీ విజయాన్ని కాటూరివారు చెప్పారు. ఇక్కడ మరొక చమత్కారమున్నది. "విజయలక్ష్మి" అంటే విజయ లక్ష్మి పండిట్. ఆ రోజుల్లో ఆమె కాంగ్రెసు కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నది. ఆ విషయాన్ని కూడ స్ఫురింపజేశాడు కవి. ఒకే ఒక్క పద్యంలో స్వాతంత్ర్య సమర దృశ్యం, లక్ష్యం రెండూ చిత్రించిన వేంకటేశ్వరరావుగారి ప్రతిభ అసామాన్యం.

1935లో భారత రాజ్యాంగ చట్టం వచ్చింది. దీని ఫలితంగా రాష్ట్రాలకు స్వపరిపాలనాధికారాలు వచ్చినవి. 1937లో ఆంధ్ర రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో కొందరు జమీందారులు కాంగ్రేసుకు వ్యతిరేకంగా పోటీ చేశారు. వారిలో చల్లపల్లి రాజాగారొకరు. చల్లపల్లి రాజాగారు జస్టిస్ పార్టీ పక్షాన పోటీ చేయగా, కాంగ్రెసు అభ్యర్థిగా గొట్టిపాటి బ్రహ్మయ్యగారు పోటీ చేశారు. రాజాగారు విజయం సాధించారు. రాజాగారికి వ్యతిరేకంగా కాంగ్రెసు ప్రచారంకోసం కాటూరి వారు 1937 జనవరిలో వ్రాసిన కవిత"ఓటు పాట". దీంట్లో జమీందారుల నిరంకుశ పాలన, కాంగ్రెసు రాకతో ప్రజలలో విజృంభించిన ప్రజాస్వామ్య భావన మన కండ్లకు కట్టినట్లు చిత్రించారు.

"ఓటు ఓటనియేవు వోటు నిమ్మని యేవు
ఓటు నీకెటు లిత్తుమో రాజా!
ఓటు నీకెటు లిత్తుమో రాజా!!
కాడుడిపి, పాడుడిపి, కష్ట నష్టాలోర్చి
పండినా యెండినా దండగో ధర్మమో
పస్తు పడుకున్నాము శిస్తు నీకిచ్చాము— ॥ఓటు నీకెటు॥
బీళ్ళు దున్నేము మేటి పోళ్ళు దున్నేము
గొడ్డు బిడ్డా గోడు గోడు మనిపించాము— ॥ఓటు నీకెటు॥
ఇల్లు వాకిళ్ళమ్మి పెళ్ళాము నగలమ్మి
కళ్ళ ప్రాకాలతో పళ్ళ బింకాలతో
చెల్లించితిమి నీకు శిస్తులూ కిస్తీలు ॥ఓటు నీకెటు॥
పూటొక్క యుగముగా పొద్దుల్లు పుచ్చుతూ
కొటకష్ములు దాటి యేటి వరదలు దాటి
చేటుదప్పి వొక్క ఓటు గడియించాము ॥ఓటు నీకెటు॥

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పై చరణాలలో కరువులు, కాటకాలు, వరదలచేత రైతులు పడే బాధలు, కనికరం లేని జమీందారులకు కొంప గోడు అమ్మి శిస్తు కట్టవలసిన పరిస్థితులు వర్ణింపబడినవి. పనిచేసే రైతుల దుస్థితి ఇలా ఉంటే, జమీందారుల సంగతి ఎలా ఉన్నదో కూడ ఈ కవితలో వివరించారు.

"చీని చీనాంబరాల్ సిలుకు రవసెల్లాలు
సరిగవల కొడలు బరువెక్క దొరవిద్దా!
....
ఎండ కన్నెరగవూ, ఏడు మేడల మీద
పండుకొని కారులో పరవళ్లు పోతావు."

అంటారు, రాజావారిని గురించి కాజూరివారు. యథార్థానికి ఇది ఒక్క చల్లపల్లి రాజావారి సంగతే కాదు. దేశంలోని సంస్థానాధీశులందరు అంతే. అన్ని చోట్ల ప్రజల స్థితి ఇంతే. పై గేయంలో "కాడుడిపి పాడుడిపి" అనేది చాలా చక్కని ప్రయోగం. పండటం- ఎండటం, దండగ- ధర్మం. ఈ జంట పదాలు పల్లెలలో తరుచుగా వాడుతుంటారు కాని కాడు- పాడు అనే నానుడి కొంచెం తక్కువ. అయినా చాలా అర్థవంతమయిన చక్కని ప్రయోగమిది.

పాడు అంటే పాటి మన్ను దిబ్బలు. పూర్వం కట్టిన ఇళ్ళు, కట్టడాలు కూలి పోయి పల్లెటూళ్ళలో ఏర్పడ్డ మట్టి దిబ్బలివి. ఆ మట్టి పొలాలకు ఎరువుగా తోలు తుంటారు. ఆ మన్నే, మళ్ళీ ఇళ్ళు కట్టుకుంటానికి సున్నం, సిమెంటు బదులు మోర్టారుగా బీద ప్రజలు వాడుకుంటారు. కొందరు రైతులు అవసరానికి గజం ఇంత అని రేటు చేసి పాటి దిబ్బలను అమ్ముకుంటారు. బీద రైతులు అత్యవసర పరిస్థితులలో అమ్ముకుంటానికి ఏమీ లేకపోతే పెరట్లో పది గజాల పాటిమన్ను అమ్ముకొని అవసరం గడుపుకునేవారు. పాటి విషయం ఇది.

ఇక కాడు అంటే స్మశానం అనుకుంటాం. అడవి అనే అర్థం కూడ ఉన్నది. కొన్ని గ్రామాలకు సమీపంలో అడవులుంటవి. అందులోనూ ఉండే అడవి ప్రాంతాలు కొందరు రైతులకు పట్టా భూములే! రాళ్ళు, గుట్టలు, దుబ్బలు ఉన్న ఆ భూములు పశువుల మేతకు వాడుకునేవారు. ఇవి వ్యవసాయానికి పనికిరావు. వీటిని బెరికలని, బంజరులని అంటారు.

(15)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జమిందారులు తమ ఏలుబడిలోని గ్రామాలకన్నిటికీ కలిపి, పన్నుగ ఒక నిర్ణీతమైన పైకాన్ని బ్రిటీషు ప్రభుత్వానికి చెల్లించేవారు. ఇక వీరు తమ ఇష్టం వచ్చిన విధంగా ప్రజల నుండి శిస్తులు వసూలు చేసికొనేవారు. చాలా గ్రామాలలో జమిందారులకు స్వంత కమతాలుండేవి. శిస్తు కట్టలేని రైతుల పొలాలు జప్తు చేసి, ఆ కమతంలో కలుపుకొనేవారు. అడపుల్లో రైతువారీ పట్టా భూములు కాకుండా మిగిలింది జమిందారు గారిదే, శిస్తు కట్టలేక పోయినా పేరే ఏదైనా జమిందారుగారికి బాకీ వుండి తీర్చలేక పోయినా, రైతు తనకు సంబంధించిన అడవిని, పంటపొలాన్ని, అదీ చాలకపోతే పాడి దిబ్బల్ని అమ్మటమో, జమిందారు పరం చేయటమో జరిగేది. శిస్తు కట్టి పంటపొలాన్ని దక్కించుకుంటానికి రైతు కాడు, పాడు వదులుకోవాల్సి వచ్చేది. "కాడుడిపి-పాడుడిపి" అంటే ఇది.

చాలా దూరాన్వయంగా ఇది కనిపించవచ్చు. కాడి అంటే ఎద్దుల జత అని అర్థం చెప్పుకుంటే పాడి ఉడిపి, కాడి ఉడిపి అన్నప్పుడు పాడిగేదెల్ని, ఎద్దుల్ని అమ్మి శిస్తు కట్టారనే అన్వయం సమంజసంగానే ఉంటుంది. కాని కాటూరివారు, "పాడుడిపి" అనే శబ్దాన్ని మరొకచోట పాడుపడిపోవటం అంటే చెడిపోవటం అనే అర్థంలోనే ప్రయోగించారు.

"పాడుడిపి తొల్త నీయూరు వాసయోగ్య
మొనరిచిన పుణ్య నెఱుగమో, యనఘమూర్తి
క్రమ్ముకొన్న యజ్ఞాన తమమ్ము మాకు
నిక్కముగ మారసై పోయె నీ కతమున." (వీడ్కోలు)

వీడ్కోలు అనే కవితాఖండికలో తమ బాల్య గురువును గురించి చెప్పిన పద్యమిది. అవిద్య, అజ్ఞానమనే చెడులను పోగొట్టి ఊరును బాగుచేశాడనే అర్థమే ఇక్కడ పొసగుతుంది. అందువల్ల "పాడుడిపి" అనేమాట "పాడి ఉడిపి" అనే అర్థంలో ఓటుపాటలో కాటూరివారు ప్రయోగించి ఉండరని నా అభిప్రాయం. ఏ భావం తీసికున్నా రమ్యంగానే ఉంటుంది. ఈ విధంగా జాతీయ సమస్యలను పరామర్శించిన కాటూరివారు, అంతర్జాతీయ సమస్య అయిన రెండవ ప్రపంచ యుద్ధానికీ కూడ స్పందించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రపంచ యుద్ధం - కాటూరివారి స్పందన

దేశీయమైన హింసాధ్వంసాలకే కాదు, అంతర్జాతీయ హింసాఘోరములకు కూడ కాటూరివారు స్పందించారు. "పన్నీటిజల్లులో" రెండవ ప్రపంచ యుద్ధాన్ని వర్ణించిన కవిత చూడండి.

1944వ సం॥ మార్చి 25 కృష్ణాపత్రికలో ప్రచురింపబడ్డ "ఉగాదీ తారణ" అనే కవితా ఖండికలో రెండవ ప్రపంచ యుద్ధం, క్విట్ ఇండియా ఉద్యమాలను గురించిన వర్ణన ఉన్నది. 1941లో విశాఖపట్నం, కాకినాడలపై జపాను బాంబులు వేసింది. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో ఉత్తర భారతదేశంలోనే షుమారు వెయ్యి మంది మరణించారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని ఈ కవిత వ్రాసినట్లు తోస్తుంది.

"వేల్పుగుడిలోన నివ్వటిలె, శతఘ్నికా గోళ భయద నిధ్వానములును" అంటూ ఉగాదీ-తారణలో కాటూరి వారు వ్రాశారు.

ఇక్కడ శాంతికి నిలయమైన భారతదేశంపై పడ్డ బాంబుల సంగతి స్ఫురిస్తుంది. ఈ విషయం కొంత గుడిగంటలలో పరామర్శించాను.

రెండవ ప్రపంచయుద్ధంలో నష్టపోయిన భారతదేశ పరిస్థితులను వర్ణించిన మరొక పద్యం చూడండి.

> "ఆసలుచూపి, మాటు మొగమై, పొగ చూటిన చిప్పబాటలం
> దోసరిలెన్ జతుస్సమలోకొక్కటిమై, ఇపుడీ యుగాది ని
> శ్వాసభరాల సమ్మగుచు వచ్చెను: గాలపయోధి వీచికల్
> వాసరమాస వర్షములు, వానిపయిం బ్రయిపెట్ట నేటికిన్."

(ఉగాదీ తారణ)

ప్రపంచ యుద్ధంలో తమకు అండగా నిలిస్తే, యుద్ధం అయిపోయిన తరువాత భారతదేశానికి స్వాతంత్ర్యమిస్తామన్న బ్రిటీషు ప్రభుత్వం మాటలు నమ్మి గాంధీ దగ్గరనుండి అందరు సహకరించారు. జర్మనులు ఓడిపోయారు. బ్రిటను గెలిచింది. కానీ మనకు స్వాతంత్ర్యం మాత్రం వచ్చేటట్లు లేదు. బ్రిటీషు ప్రభుత్వం ఏరుదాటి తెప్పతగలేసినట్లుగా ప్రవర్తిస్తున్నది. "పొగచూరిన చిప్పబాటలు" అనటంలో యుద్ధ బాధను అనుభవించినదేశం సూచింపబడింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గాంధీ భారతదేశంలో సత్యము, అహింస అనే ఆయుధాలతో స్వాతంత్ర్య సమరంసాగిస్తుంటే, మరొక వంక దీనికి పూర్తిగా విరుద్ధమైన దారుణ హింసా విధానంలో హిట్లరు, తమజాతి ఆధిపత్యం కోసం పోరాడాడు. కాటూరివారు 1945 మార్చిలో వ్రాసిన "ఫలశ్రుతి" అనే కవితలో హింస, అహింసా మార్గాల వ్యత్యాసం తెలిపారు. మంచి పనులు సాధించటానికి మంచి మార్గాన్నే ఎన్నుకోవాలి. చెడు సాధనాలతో మంచిని సాధిస్తాననటం అవివేకం. గాంధీగారి ఈ సూక్తికి వ్యాఖ్యానమే ఈ కవిత.

"విత్తొకటి నాట మొలచునే వృక్షమొకటి
కొలిచినట్టి పేలుపె కాదె కోర్కె లొసగు
చేసినట్టి కర్మమె ఫలసిద్ధి చెందు
నోచికొన్న వారల కెల్ల నోచినంత! (ఫలశ్రుతి)

హింసామార్గాన్ని అవలంబించినవారికి హింసే ఫలించింది.

పురాతన చక్రవర్తులందరు తమ లక్ష్యాలను యుద్ధంతోనే సాధించారు. రాజకీయ లక్ష్యాలను శాంతి, అహింసలతో సాధించటానికి నడుంకట్టిన గాంధీ వంటివాడు ఇంతకు పూర్వంలేడు. పూర్వపు రాజులు రణాగ్ని కీలలకు ఆహుతి కావటమో, చేయటమో తప్ప మరొక మార్గాన్ని అనుసరించలేదు. గాంధీ అలాకాదు. గాంధీని నవపార్థివుడంటూ కాటూరివారు చెప్పిన పద్యమిది.

"దారుణ మారణాయుధ విదారణ కోర్చి, రణాగ్ని కీలలన్
దేరుగడై, నిజాఘములు నీరుగ వేల్చిన యజ్ఞ కర్తలై,
ఈరస మెల్ల (బోకడిచి, హింసకు దక్కి, దయా విధేయులై
కూరిమి కెక్కలౌ జనులకున్ నవపార్థివు దేగుదెంచెడిన్" (ఫలశ్రుతి)

యుద్ధంలో దారుణ మారణాయుధాల దెబ్బలకు ఓర్చి యుద్ధాగ్నిలో "తేరుగడై" అంటే నేర్పుతో తాను మసికాకుండా తన పాపాల్ని బూడిద చేస్తూ, "ఈరసము" అంటే అసూయను వదలి హింసను విసర్జించి, దయాపరులైన వీరులకు నాయకత్వం వహించటానికి, క్రొత్త రాజు వచ్చాడు. చూచారా! అంటాడు కవి. ఆ నవపార్థివుడు గాంధీయే. ఆ దయావీరులు భారతీయులే.

రెండవ ప్రపంచ యుద్ధానికి పతాక సన్నివేశంగా 1945 లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకీలపై అణుబాంబు దాడి మొదటిసారిగా జరిగింది. శాస్త్రీయ విజ్ఞానం, విధ్వంస మార్గంలో పయనించటం చూచి ప్రపంచం తల్లడిల్లిపోయింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

1949వ సం॥లో డాక్టర్ గోవిందరాజుల వెంకట సుబ్బారావుగారు "అణుశక్తి" అనే గ్రంథాన్ని వ్రాసి కంచి కామకోటి పీఠాధిపతులకు సమర్పించారు. ఆ సందర్భంలో కాటూరివారు 1949వ సం॥ జూన్-5న కృష్ణాపత్రికలో "జడశక్తి పరిణామము" అనే శీర్షికతో కొన్ని పద్యాలు వ్రాశారు. అణుశక్తి మానవ నాశనానికి ఉపయోగ పడటం వారికెంతో బాధ కలిగించింది. మానవుడి దానవకృత్యానికి నిరసనగా వ్రాసిన కవిత ఇది.

"వరదాన గర్వమున నీ
నరదానవు లింత నంత నలిరేగి వెసన్
పరపీడా వ్రతులై స్వో
దరపూరణ మాచరింత్రు దర్పోద్ధతులై"

అణు విజ్ఞానం భగవంతుడు మానవుల కిచ్చిన వరం. దాంతో గర్వించి మాన వులు దానవులై స్వప్రయోజనం కోసం, పరపీడనం సాగిస్తున్నారు. నీరు, నిప్పు, గాలిపై అదుపు సాధించి పరస్పర విద్వేషాలతో అణుజ్వాలలు సృష్టించి ప్రపంచాన్ని బూడిద చేయటానికి సిద్ధంగా ఉన్నారు.

"విశ్వ శాసనమ్ము విపరీత భోగమ్ము
నాస జేసి తపము లాచరించు
సత్వ హీనులకు వశంవదమై శక్తి,
జగదుపద్రవమ్ము సంఘటించె"

"తామసులు, విశ్వాన్ని శాసించాలనే కాంక్షగలవారు, సత్వగుణం లేనివారు, రజోగుణ తమోగుణ ప్రమత్తులయిన మానవులకు, ఈ అణుశక్తి వశమై, ప్రపంచ నాశనానికి కారణమౌతున్నది" అంటూ ఆవేదనను వ్యక్తం చేశారు కాటూరివారు.

ప్రకృతి, శక్తిమయమన్న సంగతి, క్రొత్తగా ఎవరు కనిపెట్టింది గాదు ! ప్రాచీన ఋషులకు కూడా ఆ విషయం తెలుసు.

"సర్గ సుస్థితి లయములు శక్తి మయము
లగుటఁ దలపోసి తొంటి మహర్షు లెల్ల
సత్వశక్తి నారాధించి సర్వలోక
హితము ఘటియించు తెఱుఁగ రీ హీనమతులు."

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ మహాఋషులు సృష్టి, స్థితి, లయలకు శక్తే కారణంగా తెలుసుకొని సత్వ గుణంతో ఆ శక్తిని వశీకృతం చేసికొని లోకోపకారం చేశారు. నేడు తమో గుణ ప్రవృత్తులయిన మానవులు అణుశక్తిని నాశనానికి వినియోగిస్తున్నారు. లోకోప కారం, జరగాలంటే విజ్ఞానవేత్తలు సత్వగుణ ప్రధానులు కావాలేకాని రజస్తమో గుణాలకు వశులు కారాదు.

"అణువు నజాండమున్ దెలియ నాత్మ మయంబను దివ్యదర్శనం
బున నెసలారు శాంతరస భోగులె శక్తులు గాక శక్తులే
అణువు నగల్చి లోకముల నగ్నిముఖమ్మున వేల్చు తామసుల్?
చణకము లట్టు లీ త్రిభువనమ్ములు వ్రేలపె వీరి చేతలన్."

అణురహస్యం, విశ్వరహస్యం తెలిసిన సత్వగుణ ప్రధానులు, శాంత గుణ సంభూతులే శక్తిమంతులుగాని. లోకాల్ని శనగల్లాగా అణు అగ్నిలో వేయించటానికి, సిద్ధంగా వున్న తామసులు శక్తిమంతులా? అని ప్రశ్నించారు కాటూరివారు. అణు విచ్ఛేదాన్ని గూర్చి తార్కికంగా చమత్కారంగా అన్నమాట చూడండి.

"అణు మయమైన విశ్వమున కయ్యణు సుస్థితి ఏక రక్షయై,
చనుఁగద బాపురే! భువన శాసన మాసమొనర్చు శేముషీ
ధను లణుగర్భ భేదన విధానమునన్ జగమేర్చి తాము ని
ల్చిన తరుశాఖకన్ నరకు చెన్నటులై చెడఁ జూతు రేటికో."

"వీరు భువనాల్ని శాసించాలని ఉబలాటపడుతున్నారు బాగానే ఉన్నది! అయితే! ఈ విశ్వం అణువులతో నిర్మింపబడింది. మనం విశ్వంలో ఉన్నాం. అణు వుల్ని ఛేదించి తాను కూర్చున్న కొమ్మను తానే నరికే ప్రయత్నం చేస్తున్న ఈ శాస్త్రజ్ఞులు ఎంత మేధావులు!" అంటారు వ్యంగ్యంగా వేంకటేశ్వరరావుగారు.

ఈ కవితలో ఇంతవరకు ఉన్న ఆలోచనా ధోరణి ఒక విధంగా ఉంటే, తరు వాత ఆలోచన మరొక విధంగా ఉన్నది. కవికి కలిగిన భయాందోళనలను అణు శక్తి గ్రంథం కొంత తీర్చి ఉంటుంది. ఆ గ్రంథ పఠనంతో అణు విచ్ఛేదం వల్ల కలిగే ఉత్పాతాలే కాకుండా లాభాలు కూడ తెలిసి ఉండవచ్చు. అందుకే చివరిలో—

"అని బహుభంగుల యోజన
మునిగిన చింతాసమాధి పూర్వ సుకృత కా
రణమున ప్రత్యక్షమ్మై
అణు మంగళరూప మొల్ల నాత్మ వెలింగెన్." అన్నారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శాస్త్రీయ పరిశోధనలు జరగాల్సిందే. అణుశక్తే కాదు మరే శక్తైనా సాధించాల్సిందే కానీ దాన్ని సంయమనంతో ప్రజాక్షేమానికే వినియోగించుకోవాలి కాని నాశనానికి కాదు అందుకే శాస్త్రవేత్తలకు హెచ్చరికగా చివరి పద్యం వ్రాశారు వెంకటేశ్వరరావుగారు.

"విమలమతి ప్రదీపమున విశ్వరహస్యము నాకళించు సం
యములకు స్వస్తి! సత్వ సముపాసిత ద్రవ్యగుణక్రియా నిదా
నములకు స్వస్తి! నిత్యము సనాతనమై జగమున్ ధరించు స
త్యమునకు స్వస్తి! లోకముల కయ్యెడు గావుత స్వస్తి! సర్వదా."

విశ్వరహస్యం తెలిసికొనే శాస్త్రజ్ఞులు సంయములై ఉండాలి. వారు సత్వగుణ బోధితమైన క్రియాకలాపాలకే, ఆ శక్తిని వినియోగించాలి. జగదాధారమయిన సత్వగుణం సర్వదా నిలుచుగాత, అంటూ స్వస్తి పలికాడు కవి. సత్యాహింసల గొప్పదనం, మేధాసంపత్తి పెడదారులు పట్టటంవల్ల కలిగిన అనర్థం ఇందులో కాటూరి వారు మనకు స్పష్టంచేశారు.

ఆంధ్రోద్యమం - కాటూరివారి స్పందన

స్వాతంత్ర్యోద్యమంతోపాటు ఆంధ్రోద్యమం కూడ 1913 నుండే సాగుతూ వచ్చింది. 1918లో ప్రత్యేక ఆంధ్ర కాంగ్రెసు ఏర్పడింది. అప్పటినుండి ప్రత్యేక రాష్ట్రం కొరకు సాగిన కృషి, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆరు సంవత్సరాలకు అంటే 1953 సం॥లో గాని ఫలించలేదు. కాటూరివారు స్వాతంత్ర్యోద్యమంతో పాటు, ఆంధ్ర రాష్ట్రోద్యమానికి కూడ తనదైన వీరకాహళ ఊదకుండా ఉండలేదు. ఆంధ్రోద్యమం వచ్చేసరికి వీరు కాంగ్రెసును, గాంధీని కూడ ధిక్కరించటానికి వెనుకాడలేదు. "మేమాంధ్రులం" "తెలుగు జెండా" అనే కవితలలో ఈ ధోరణి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

"మేమాంధ్రులం" అనే గేయం 1938 జూన్ 4-కృష్ణాపత్రికలో ప్రకటింపబడింది. ఇది ఎనిమిది భాగాలుగా ఉన్నది. ఆంధ్రుల అనైక్యత -ప్రాచీన వైభవం-ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రులు పొందిన అవమానం- ఆంధ్రరాష్ట్రం రాకుండా అప్పటి నాయకులు పన్నిన కుతంత్రాలు. ఇలా ఎన్నో విషయాలను కాటూరివారు దీంట్లో వర్ణించారు. ఒక్కొక్క భావనా ఏడికకు పదునైదు ఇరవై చరణాల చొప్పున సాగిన గీతమిది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ కాలంలోని ఆంధ్ర రాజకీయాల్ని కొంత పరామర్శిస్తేగాని ఈ గేయాన్ని వ్యాఖ్యానించటం కుదరదు. 1937 ఎన్నికలలో కాంగ్రెసుపార్టీ ఘనవిజయం సాధించింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి చక్రవర్తుల రాజగోపాలాచారి ముఖ్యమంత్రి ఐనాడు. ఇదే సంవత్సరం ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం తీవ్రతరంకాగా, ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షునిగా డా॥ పట్టాభి సీతారామయ్యగారు, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రానికై, అఖిల భారత జాతీయ కాంగ్రెసులో, ఒక తీర్మానం ఆమోదించాలని పట్టుబట్టారు. బులుసు సాంబమూర్తి మొదలయిన నాయకులు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. ఆంధ్రోద్యమం యీ కాలంలో విజృంభించటానికి వెనుక మరోకథ ఉన్నది.

రాజాజీ వాస్తవానికి 1935 మే నెలలోనే తాను రాజకీయాలనుండి విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఆయన తరువాత కాంగ్రెసులో అంత పలుకుబడి ఉన్న నాయకుడు ప్రకాశంగారు. కానీ అధిష్టాన వర్గం ప్రోద్బలంతో రాజాజీ తిరిగి 1937 ఎన్నికలలో నిలబడ్డాడు. ప్రకాశంగారు ముఖ్యమంత్రిగా ఎన్నిక కావటం ఇష్టంలేని గాంధీగారే యీ పథకం వేశారని ఆంధ్రులు భావించారు. శ్రీ పాద సుబ్రహ్మణ్యం గారు తమ "ప్రబుద్ధ ఆంధ్ర" అనే పత్రికలో ఈ విషయాన్ని ప్రస్ఫుటంగా వ్రాశారు అంటే ఒక రకంగా ఆంధ్రుల్లో గాంధీపైనా, రాజాజీ పైన కొంత వైముఖ్యం ఏర్పడిందన్న మాట. మరొక విషయం- రాయలసీమవారు ఆంధ్ర రాష్ట్రంలో తమకు భద్రత లేదని భావించారు. అంతేకాక 1938 ఏప్రియల్‌లో రెడ్డి నాయుడుగారు శాసనసభలో ఆంధ్రరాష్ట్రం తక్షణం ఏర్పాటు కావాలనే తీర్మానం ప్రవేశపెట్టగా, అది వీగిపోయింది. ఈ నేపథ్యంలో ఈ గేయాన్ని పరిశీలిద్దాం.

"ఆంధ్రులం! మే మాంధ్రులం!!
మావి మూడు కోట్ల తలలు
ఆరు కోట్ల చేతులు
మేము నోరు మూసుకొన్నామా ?
బంగాళా ఖాతానికి ముఖ బంధనమే
....
కటకం మొదలు సేతువుదాకా
కనుసన్నల పనులు గొన్నాం
బలి యవ ద్వీపాలు మా పలుకు చేతల్లోవి,"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అంటూ ఆంధ్రుల ప్రాచీన వైభవాన్ని గుర్తు చేశారు కాటూరివారు. ఇక ఆంధ్రుల తత్వాన్ని వివరిస్తూ

"కన్ను మూస్తే కదలం
కదిలితే వదలం
ఆంధ్రులం ! మే మాంధ్రులం
పుఱ్ఱెకో బుద్ధీ నోటికో మాటా-
అంతే—మేమేమి గొఱ్ఱెల మందా?
గంగెద్దు మేళమా?
అందరం అతిరథులమే
అంతా గజీతగాళ్ళమే
అంతా అన్ని రాజ్యాలకు కర్తలం
ఆత్మ బుద్ధి స్సుఖం చైవులం"
....

అలసత్వం, ఔన్నత్యం ఏదైనా పని ప్రారంభిస్తే వదలనిపట్టుదల, విభిన్నాభిప్రాయాలు, ప్రత్యేక వ్యక్తిత్వాలుగల మన ఆంధ్రులు ఒక పనిని ఎలా ఆలస్యంగా ప్రారంభిస్తారో, తీరా ప్రారంభించిన తరువాత అందరూ నాయకులై ఎవరికీ అనుచరులు లేక ఎలా విఫలం చెందుతారో సున్నితంగా చెప్పారు కాటూరి వారు.

అనైక్యతతో బాధపడే మనకి ఐక్యతతో ప్రపంచాన్ని గడగడలాడించిన జర్మనులను గురించి చెప్పి హితముపదేశించిన ఈ గేయ భాగం చూడండి.

"హిట్లరు చూచావా ?
ఒక్క హిట్లరు !
గోదాలోకి దూకి
మల్ల చఱచి సింహనాదం చేస్తే
యూరపు కంపించి కళపెళా ఉడికి పోతూ వుంది
చెదిరిన జర్మను ఖూఖండాలు
దొర్లి వచ్చి తల్లి గడ్డను చేరుతున్నై
మరి మేమో!"
....

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"మాయ మాటలా, న్యాయ నిష్ఠురాల్
తడి పాతలా, గొంతు కోతలా
కపట నాటకాల్, కృపణ చేష్టలా
కరిగి - సురిగి - విరిగి"

....

కవి అయినవాడు తన ప్రజల ఘనతను కీర్తించటమే కాదు. లోపాల్ని కూడా ఎత్తి చూపించాలి. అదే కవిత్వ లక్ష్యాలలో ఒకటైన ఉపదేశం. కాటూరివారు మనకు ఐక్యతను ఉపదేశించటమేకాదు. అప్పటి చారిత్రక విశేషాల్ని కూడ కొన్నిటిని సూచింపారు.

1934లో రాయలసీమ ప్రజల ప్రయోజనాల్ని రక్షించటం కోసం రాయలసీమ మహాసభ ఏర్పడింది. రాయలసీమ వారికి ప్రత్యేక రాష్ట్రం ఇష్టం లేదు. సర్కారు జిల్లాలవారే ఆంధ్రరాష్ట్రం కోసం మొదట్లో ఎక్కువ కృషి చేశారు. సర్కారు జిల్లాలవారు తమ ప్రయోజనాలకు భంగకరంగా ప్రవర్తిస్తారని రాయలసీమవారు అనుమాన పడ్డారు. జస్టిస్ పార్టీలో ఉన్న ఆంధ్ర నాయకులకు కూడా ప్రత్యేక రాష్ట్రం ఇష్టం లేదు. ఆ పార్టీకి ఆంధ్ర ప్రాంతంలో ఆదరణ లేకపోవటమే దీనికి కారణం. రాయలసీమ ప్రాంతంలోని జస్టిస్ పార్టీ నాయకులు సి. యల్. నరసింహారెడ్డి, సుబ్రహ్మణ్యం మొదలైన వారి వేర్పాటు ధోరణి కూడ ఆంధ్ర రాష్ట్రానికి అవరోధంగా పరిణమించింది. ఈ విషయాలు పై కవితలో సూచింపబడ్డవి.

ఆంధ్ర రాష్ట్ర ఉద్యమాన్ని వ్యతిరేకించిన నాయకుల్ని గురించి, ప్రజల మనోభావాల్ని కాటూరివారు చక్కగా వివరించారు.

"ఎవరి తిప్పలు వారే పడరారు
ఉమ్మడి కాపురం వొద్దంచే-
తమిళన్నయ్యల తగులాటం
మళయాళపు మాయమంత్రమూ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కర్ణాటకులా కలగాపులగం
మొత్తో మాకు వద్దంటే
మా తిప్పలు మేం పడతామంటే
రాజాజీకి కడుపు మంటా ?
పటేలు భాయికి పరియాచకమా ?
గాంధీయైనా కన్నుగానడూ?"

....

"మూటా ముల్లే కట్టుకు మేము
బోటుమీద కాలెడుతుంటేను
భేషు భేషు భేషంటూనే
సెబాసు శౌమ్మని చెపుతూనే
తంత్రం చేసి మంత్రం వేసి
తోకకు టాటాకులు కడతారా"?

....

"నోట నవ్వుతూ
నొసలు విరుస్తూ
వెనక నుంచి కొంకులు నరికేనా ?"

పై పాదాలు తెలుగులు, కన్నడికులు, తమిళులు కలగాపులగంగా ఉన్న స్థితిని తెలియజేస్తున్నవి. గాంధీకి, పటేలుకు ప్రత్యేక ఆంధ్ర ఇష్టంలేదు. "మూటా ముల్లే కట్టుకొని బోటుమీద కాలెడుతుంటేను" అనటంలో ఆంధ్ర రాష్ట్రం కోసం అప్పటి సెంట్రల్ ప్రావిన్సు గవర్నరైన ఆంధ్రుడు ఈడ్పుగంటి రాఘవేంద్రరావు ఇంగ్లండు వెళ్ళిన సన్నివేశం సూచింపబడింది. ముందుకు పోనిచ్చి వెనక కొంకులు నరికింది మోసగించింది రాజాజీ.

ఆంధ్ర నాయకులు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు శాసనసభలో తీర్మానం ప్రవేశ పెట్టగా రాజగోపాలాచారి ఆంధ్రతోపాటు తమిళ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల ఏర్పాటు జరగాలని, తీర్మానాన్ని సవరించి ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపాడు. ఒక్క ఆంధ్ర రాష్ట్రమైతే ఎలా ఉండేదో! ఇన్ని రాష్ట్రాల ఏర్పాటు చేయటం ప్రభుత్వా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నికి ఆర్థికపరంగా నష్టదాయకం అని భావించి బ్రిటీషు ప్రభుత్వం, ఆ తీర్మానాన్ని తిరస్కరించింది. రాజగోపాలాచారి సలహామేరకే ఇలా జరిగిందని అందరు భావిం చారు. రాష్ట్రం ఏర్పాటు చేసే విషయంలో ప్రభుత్వానికి నచ్చ చెప్పే ఉద్దేశంతో బ్రిటను వెళుతున్న రాఘవేంద్రరావును ఒక ప్రక్క ప్రోత్సహించి వెనుకగా ఇలా కుతంత్రం చేశాడు రాజగోపాలాచారి.

అప్పటివరకు కాంగ్రెసన్నా గాంధీ అన్నా విపరీతమైన అభిమానం గల కాటూరివారు రాష్ట్రోద్యమంలో వ్యక్తం చేసిన భావాలు చూడండి.

"ఎత్తండీ మన ఆంధ్ర పతాకా
చూపండీ మన ఆంధ్ర తడాఖా
కాంగ్రెస్ గీంగ్రెస్ జాంతేనై
గాంధీ గీంధీ కర్తేనై
....
తెలుగు బావుటా నాటకపోతే
కాంగ్రెసు గడ్డి కాంగ్రెసు చేత
కట్ట కట్టి కరిపించక పోతే
ఆంధ్రులమా! మన మాంధ్రులమా!"

అంటూ గాంధీని లెక్కచేయలేదు; కాంగ్రెసును అభిమానించలేదు. చివరకు ఆంధ్ర రాష్ట్రం లేకపోయిన తరువాత స్వాతంత్ర్యం మాత్రం ఎందుకు అని తెగేసి చెప్పారు.

"ఆంధ్రుల రాజ్యం అస్తమించితే
స్వరాజ్య మెవడికావాలి?
లేవండర్రా! లేవండి!
నడవండర్రా! నడవండి!"

అన్న మాటల్లో కాటూరివారి ఆంధ్రాభిమానం ఎంతటిదో మనకు తెలుస్తుంది.

ఆంధ్రోద్యమంపై 1939 సెప్టెంబరు, కృష్ణాపత్రికలో ప్రచురింపబడ్డ మరొక కవిత "తెలుగు జెండా". ఈ గేయాన్ని కాటూరివారు వీరావేశంతో వ్రాశారు. ఈ కాలంలోని రాజకీయ నేపథ్యం చూద్దాం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

1938 మే-లో "భారతదేశంలో క్రొత్త రాష్ట్రాలు ఏర్పడటం జరగదు" అని బ్రిటీషు ప్రభుత్వం ప్రకటించింది. రాజగోపాలాచారి కుతంత్రం బట్టబయలయింది. దానికి నిరసనగా అప్పటి మద్రాసు శాసనసభ స్పీకరు, ఆంధ్రోద్యమ నాయకుడు బులుసు సాంబమూర్తిగారు తన పదవికి రాజీనామా చేసి ఉద్యమాన్ని పటిష్ఠం చేయాలని నిర్ణయించుకున్నారు. కాని కాంగ్రెసు అధిష్ఠానవర్గం అనుమతించలేదు. అసలే అసంతృప్తితో ఉన్నారు ఆంధ్రులు. ఇక సాంబమూర్తి వంటి నాయకుడు పదవీ త్యాగంచేసి ఉద్యమంలో జోరబడితే విప్లవమే వస్తుందని, గాంధీ మొదలైన నాయకులు భయపడ్డారు. 1939 మార్చిలో రాజగోపాలాచారి శాసనసభలో ఆంధ్ర రాష్ట్ర స్థాపనకు బ్రిటీషు ప్రభుత్వం వ్యతిరేకించిన విషయం ప్రకటించారు. 1939 సెప్టెంబరులో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమయింది. ఇక ఆంధ్ర రాష్ట్రం మాట, ఇటు కాంగ్రెసు నాయకులు గాని అటు బ్రిటీషు ప్రభుత్వం గాని పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో నిరుత్సాహం, ఉద్రేకం, ద్వేషం ఆంధ్రుల్లో ముప్పిరి గొన్నవి. అప్పటి ఆంధ్రుల మనోభావాలకు అద్దమే ఈ గేయం.

కాంగ్రెసులో అగ్రనాయకులే ఆంధ్రోద్యమాన్ని నీరు కార్చేటప్పటికి, ఆంధ్ర కాంగ్రెసు నాయకులు భిన్నులైనారు. 1922 నుండి కాంగ్రెసంటే ప్రాణమిచ్చి, గాంధీ అంటే దేవుడని భావించి, సహాయ నిరాకరణంలో జైలుశిక్షకూడ, అనుభవించిన కాటూరివారికి గాంధీపైన కాంగ్రెసు పైన కొంత వైముఖ్యం ఏర్పడింది. దానికి ఫలితమే ఈ గేయం.

"తెలుగు జండా బయలుదేరింది
తెలుగు ఢంకా దిశల మ్రోగింది
గుగ్గిలం సాంబ్రాణి ధూపాలు
గుప్పు గుప్పున చుట్టు ముట్టాయి
వీరణం తప్పెటలు బాణాలు
వీరాంగములు బోరు కలిగాయి
వేప మండల పసుపు బంగారు
వీథూతులే ఓలలాడాయి
హాళ్కరథ శరభంటు చిందుల్లు
హాల్లల్లయని కత్తి-సాముల్లు" ॥ తెలుగు జెండా ॥

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అంటూ కాటూరివారు మహోద్రేకంలో వీరాలాపం చేశారు. ఎంత ఉద్రేకంతో వ్రాసినా వారి కవితలో శిల్పం కొరవడదు. సామాజిక పరిస్థితులు ప్రతిఫలించటం మానవు. పై వాక్యాలలో కొన్ని సాంప్రదాయక విశేషాలు అప్రయత్నంగానే ఇమిడి పోయినవి.

వీర శైవమతం, ఇతర మతాలనుండి హిందూ మతాన్ని రక్షించింది. ఈ మతంలో క్షాత్రం పాలు ఎక్కువ. వీరు వీరభద్రుణ్ణి ఆరాధిస్తూ వీరభద్ర పళ్ళెం అనే పూజా విధానం చేపడతారు. దీంట్లో భక్తులు గుగ్గిలం సాంబ్రాణి పొగలు వేసుకొని మేకులు నాటిన పావుకోళ్లు తొడుక్కొని నారసాలు పొడుచుకొని కత్తి చేతపట్టి హాశ్మరభ, శరభ, దశ్శరభ, శరభా అని వీరాలాపాలు పలుకుతూ, వీరణాల, డోళ్ళ మ్రోతకు అనుకూలంగా నృత్యం చేస్తారు. దీనిని వీరంగమని పిలుస్తారు. నారసాలు అంటే చివర బాగా పదునుగా సూదుల్లా ఉండి రెండవవైపు త్రిశూలం, బల్లెం మొదలైన ఆకారాలతో పొడుగుగా, గొడుగు ఊచల ప్రమాణంలో ఉండే ఇనుప కడ్డీలు. పదునైన చివరను నాలుకకు, బుగ్గలకు, కంఠానికి చేతులకు గ్రుచ్చుకుంటారు. రెండో వైపు శూలంలాగా ఉన్న కొసలకు, నూనె గుడ్డల్ని, కొందరు ఎండు కొబ్బరి ముక్కల్ని గ్రుచ్చి వాటిని వెలిగిస్తారు. ఈ నారసాలు వేసుకొని విభూది పూసుకొని గుగ్గిలం పొగలు వేసుకొని, చేతిలో జ్యోతులు వెలుగుతున్న పళ్ళెము పట్టుకొని భక్తులు వీరంగ నృత్యము చేస్తుంటే శత్రువులను కాల్చే భీషణాగ్ని జ్వాలాతోరణం కదిలినట్లుంటుంది. దక్షుణ్ణి శిక్షించటానికి బయలుదేరిన వీరభద్రుని అనుచరుడిలాగా ప్రతి భక్తుడు గోచరిస్తాడు. ఈ సంప్రదాయం అన్ని వర్గాలలోని వీర శైవులకు ఉన్నప్పటికీ అగ్రవర్ణాల వారిలో ఎక్కువ. ఇక్కడ కాటూరివారు గుగ్గిలం, సాంబ్రాణీ, విభూతి, వీరణాలు, వీరాంగములు, హాశ్మరభ, శరభ అనే మాటలతో శివమెత్తిన అగ్రవర్ణాలవారు ఆంధ్రోద్యమం విఫలమైనందుకు ఎంతగా ఆగ్రహించారో తెలిపారు

ఇక పల్లెలలో అంకానమ్మ, పోలేరమ్మ, పోతరాజు మొదలైన గ్రామ దేవతల పూజలు సాగుతుంటవి. వాటిని కొలుపులంటారు. కొలుపులంటే సేవలే. దీంట్లో అగ్రవర్ణాల ప్రత్యక్ష ప్రమేయం తక్కువ. పంబలవారు, యాదవులు, హరిజనులు మొదలైనవారు ఈ కొలుపుల్లో ప్రధాన పాత్ర నిర్వహిస్తారు. ఇవి కూడా వీరరస ప్రధానంగా సాగే ఆరాధనలే. తప్పెట మ్రోతలకు అనుగుణంగా చేతిలో వేప మండలు పట్టుకొని పసుపు, బండారు రాసుకొని కుంకుమబొట్టు పెట్టుకొని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భక్తులు హల్లల్ల అంటూ చిందులేస్తుంటారు. కత్తిసాము చేస్తుంటారు. వీరభద్ర పళ్ళెంలో నిమ్మకాయలు, కొబ్బరికాయలు, గుమ్మడి కాయలు పగులుతుంటే, కొలుపుల్లో దున్నలు, మేకలు, కోళ్ళు తెగుతుంటవి.

పైన కవితా పంక్తుల్లో కాటూరివారు పసుపు, బండారు, వేపమండల ప్రసక్తి తెచ్చి, అట్టడుగు ప్రజానీకం కూడా ఆంధ్ర రాష్ట్రోద్యమం విఫలమైనందుకు ఆగ్రహించిన విషయం తెలిపారు.

ఆంధ్ర ప్రజలందరు చిన్న నుండి పెద్దదాకా ఆంధ్రరాష్ట్రము కావాలని ఎంత గాఢంగా వాంఛించారో, కోరిక తీరనందుకు ఎంతగా ఉద్రేకం చెందారో చక్కగా వివరించిన కవిత ఇది.

ఒక చోట "తెలుగు ఆవకాయ బూజెక్కిందీ- తెలుగు గోంగూర పులుపెక్కింది" అంటూ తెలుగువారి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

తమిళులపై ఆంధ్రులకు ఏర్పడ్డ అసహ్యాన్ని,క్రోధాన్ని కాటూరివారు వ్యక్తం చేసిన గేయ భాగం చూడండి.

"తమిళనాడూ దద్దటిల్లింది
తమిళకుండా బద్దలయ్యింది
సాంబారు కాలువలు గట్టింది
ఇడ్డెన్లకు ఆట గట్టింది"

ఆంధ్రులదేముంది ఆవకాయ, గోంగూర అని చులకనగా తమిళులు మాట్లాడే మాటకు మారుగా సాంబారూ, ఇడ్లీ అంటూ వారిని ఎద్దేవా చేశారు. రాష్ట్ర విభాగమే అభిమతము అంటూ తెగేసి చెప్పారు.

"చెన్న పట్నం రెండు చెక్కల్లు
సెంటు జార్జీ కోట వక్కల్లు
ఇనుపపెట్టె రెండు ముక్కల్లు
ఎవరి కాతా వారి లెక్కల్లు
తెలుగు సీమల హద్దు పద్దుల్లు
తిరుపతి వెంకన్న ముడుపుల్లు
బంగాళాఖాతమునకు పాటుల్లు
తెలుగు సంద్రానికి పోటుల్లు"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒక చోట "హిందీకి బొమ్మల్లు గట్టేము, మందిరెల్ల మతులు విరిచేము" అంటారు కాటూరివారు. నాటికి నేటికి భారత రాజకీయాల్లో హిందీ మాట్లాడేవారిదే పై చెయ్యి. ఆంధ్రోద్యమాన్ని దెబ్బతీసిన వారు కూడ హిందీ మాట్లాడే ఉత్తర భారత కాంగ్రెసు నాయకులే. అందుకే వేంకటేశ్వర్రావుగారు వారి పైన ద్వేషాన్ని ఇలా వెళ్ళగ్రక్కారు. బొమ్మ కట్టడము అంటే చాలా అర్థమున్నది. పూర్వము గెలిచిన రాజు ఓడిపోయిన రాజు బొమ్మను చేయించి తన కాలి కడియానికి తగిలించు కొనేవాడు. దీనికి బొమ్మ కట్టు ఉత్సవమని పేరు. ఇక్కడ హిందీ మాట్లాడేవారిని క్రోసి రాజంటామని తిరుగుబాటు చేసి, నాయకులను పాదాక్రాంతులను చేసుకొంటా మని దీని భావము.

ఆంధ్రోద్యమ విషయములో వేంకటేశ్వర్రావుగారు గాంధీని కాంగ్రెసును లెక్కచేయలేదు. పైగా ప్రత్యేక రాష్ట్రం రాకపోవటానికి గాంధీ, పటేలు కారణ మని గట్టిగా విశ్వసించారు. అప్పటివరకు గాంధీని ప్రశంసించిన వాడే, ఇప్పుడు అధిశంసించాడు.

"కాంగ్రెస్సు పప్పింక ఉడికేనా
గాంధి ఏకూలింక వడికేనా
సన్నాయి నొక్కులిక పలికేనా
సర్దార్ల హుకుము లిక చెల్లేనా
సామెతలకు పనులు గట్టేనా
చాటు మంత్రాంగాలు దాగేనా
మూగ నోముల బెట్టు సాగేనా
శాంతి మంత్రాలింక పారేనా."

అంటూ ఘాటైన విమర్శ చేశారు. చాటు మంత్రాలు అంటే రాజాజీ, గాంధీల రహస్య సమాలోచన. మూగనోము పట్టింది గాంధీయే. బ్రిటీషుప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రాన్ని నిరాకరించినపుడు, ఆయన మౌనం దాల్చాడు. ఆంధ్రుల ఆగ్రహానికి పరాకాష్ఠగా అన్న మాటను చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"అగ్నిగుండాలలో దూకేము
బుగ్గితో బుక్కాయి లాడేము
కోటలకు లగ్గలు వాచేము
పేటలకు చిచ్చు ముట్టించేము
....
పెట్టిన్న ముగ్గులు చెరిపేము
ముందు పీటలు మేమె ఎక్కేము
పెసరుకుండలు పగుల గొట్టేము
సిద్ధాన్నములు పారజిమ్మేము
తిన్నదీ వెడల గ్రక్కించేము
ఉన్నదీ కలయ ద్రొక్కించేము" ॥తెలుగు జెండా॥

ఆంధ్రరాష్ట్రం రాకపోతే ఎంత విప్లవమైనా వస్తుందని కవి చేసిన సూచన ఇది.

ఆంధ్రోద్యమంలో వ్యతిరేకించినా, సహాయ నిరాకరణోద్యమం నాటినుండి స్వాతంత్ర్యం వచ్చినదాకా కాటూరివారి జీవితంలో కాంగ్రెసు, గాంధేయవాదం, ప్రధాన పాత్ర వహించినవి. తరువాత క్రమంగా అవి సన్నగిల్లిపోయి ఆధ్యాత్మిక చింతన, నిర్లిప్తత చోటు చేసుకున్నవి. వారికి దేశాభిమానం ఎంత ఉందో ఆంధ్రాభిమానం దానికి పెయ్యిరెట్లు. ముందు అతడు ఆంధ్రుడు తరువాత భారతీయుడు.

కాటూరివారి ఆధ్యాత్మిక ప్రవృత్తి

కాటూరి వారి జీవితంలో మూడువంతులు లౌకిక వ్యవహారాలతోనే గడచి పోయింది. అప్పటివరకు వ్రాసిన కవిత్వములో సౌందర్యదృష్టి, సామాజిక స్పృహ ఎక్కువ. అరవయ్యోపడిలో పడ్డ తర్వాత కొంత మార్పువచ్చి ఆధ్యాత్మిక భావ విలసితాలైన కవితాఖండికలు వెలయించారు. నేను దేవతల పూజలు చేయలేను, అని పదే పదే చెబుతుంటారు వారు. "చేసి ఎరుంగ దేవతల సేవలు" అని ప్రారంభించిన పద్యం ఒకటి "నేను" అనే శీర్షిక క్రింద వ్రాశారు.

(17)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మరొకటి 1960లో భద్రాచలంలో రామచంద్రుణ్ణి దర్శించినప్పుడు చెప్పారు. ఇంకొకటి "వేంకటాద్రీశ్వరా" అనే ఖండికలో చెప్పారు. ఆ పద్యాలు చూడండి.

"చేసి యెఱుంగ దేవతల సేవలు, తీర్థములాడ, క్షేత్ర సం
వాస మొనర్ప, విప్రుల సపర్య లొనర్పను, పైతృకమ్ము శ్ర
ద్ధా సహితుండనై సలుప, దానము ధర్మమెఱుంగ, సంజకున్
దోసిలి యొగ్గ నెన్నఁడు అధోగతికే చెయిసాచుదున్ సదా"

("నేను" ప. 5)

"చేసి యెఱుంగ దేవతల సేవలు, తీర్థములాడ, క్షేత్ర సం
వాస మొనర్ప, అర్వదికి పైఁబడి ప్రాయము వ్రాలె, నేఁడు నన్
నీ సవిధాన నిల్పెఁగద నీలమురాజకులుండు, వాని నీ
దాసులఁ జేర్చి ప్రోవగదె దాశరధీ కరుణాపయోనిధీ"

("భద్రాచల శ్రీరామ దర్శనము"లోనిది)

"నీలము రాజకులుండు" అంటే నీలంరాజు వేంకటశేషయ్యగారు. వేంకటశేషయ్యగారు కాటూరి వారిని భద్రాచలం తీసుకొనివెళ్లారు. అంటే అప్పటికీకూడా తీర్థయాత్రలు చేద్దామనేది సొంతంగాపుట్టిన బుద్ధి కాదన్నమాట. అందుకే "వానిని నీ దాసుల జేర్చి ప్రోవగదే" అన్నారు. అంటే వేంకటశేషయ్యగారిని రక్షించమని రాముణ్ణి ప్రార్థించటం! మరి తన సంగతో! అక్కడే ఉంది కాటూరివారి అభిజాత్యం.

"వేంకటాద్రీశ్వరా" అనే కవితా ఖండికలో ఇలాటి పద్యమే మరొకటి వ్రాశారు.

"చేసియెరుంగ దేవతల సేవలు, సంజకు నేనొకప్పుడున్
దోసిలియొగ్గ నేర్పెరుగ, నోములు నోమ, వ్రతమ్ముసల్ప స్వ
ర్వాసుల దాత తండ్రుల నివాప జలమ్ములు వార్చి తృప్తులం
జేసి యెఱుంగ, నీకిపుడు చేతులు మోడ్చు టొకండెరుంగుదున్"

పదే పదే ఇలా వ్రాయటం వెనుక ఆయన సంప్రదాయ జీవనాన్ని విడనాడినందుకు చాలా పశ్చాత్తాప పడినట్లుగా తోస్తుంది. మనసులో ఆవేదన లేకపోతే ఇన్ని సార్లు ఇలా వ్రాయరు. అన్ని పద్యాలలో తీర్థయాత్రలు చేయలేకపోవటం, వ్రతములు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నోములు, బ్రాహ్మణ పూజలు నిర్వహించకపోవటం, పితృకర్మలను సరిగా ఆచరించక పోవటం మొదలైన విషయాలను ప్రస్తావించారు.

కవిగా వేంకటేశ్వరరావుగారు మంచి కీర్తి గడించారు. ఆ విషయంలో వారు అసంతృప్తి చెందవలసింది లేదు. కానీ తన కవితాశక్తిని భగవంతుని అర్చనకు వినియోగించలేదనే బాధ మాత్రం ఉన్నదీ.

"కులమును విద్యయు రూపము
గలిమియు నాకిచ్చి పంపఁగా, నవియెల్లన్
గలుషిత మొనర్చుకొని పెం
గలినై దరిద్రొక్కి నేఁడు కళవళపడుదున్" ("నేను" ప. 6)

"నీ యనుగ్రహమ్ము నిండారు నీ పాత్ర
నేలపాలొనర్చి కూళనైతి
మరల నింపికొనగ దెరువేది? గతజల
సేతుబంధనమ్ము సేతునెట్లు" ("వేంకటాద్రీశ్వరా")

"కొలిచి యెఱుగ వేలుపుల నెవ్వరి న్మున్ను
మంత్ర తంత్రములను మఱిగి యెఱుగ,
మునగలేదు తీర్థముల, పాపపంకమ్ము
నందు మునిగి అంగలార్తు నేడు" ("వేంకటాద్రీశ్వరా")

ఈ పద్యాలు చదివితే జీవిత చరమాంకంలో కాటూరి వారు భక్తిరహితమైన తన గత జీవితాన్ని తలచుకొని కొంత బాధ పడ్డారనిపిస్తున్నది.

వేంకటేశ్వరరావుగారు నాస్తికుడు కాదు, అయితే కర్మిష్ఠికూడ కాడు. ప్రౌఢ్రు వ్రాలిన తర్వాత ఆయన జీవితం ఆధ్యాత్మిక పథంలో సాగింది.

1949లో వీరు రమణమహర్షిని దర్శించారు. రమణమహర్షి, మౌన వ్యాఖ్యాత. ఆయన దర్శనమాత్రం చేతనే భక్తుల అజ్ఞానతిమిరం తొలగిపోయేదట. అప్పటినుండే కాటూరివారిలో ఆధ్యాత్మిక జిజ్ఞాస పెరిగింది. బహుశా వయసుకూడా కొంత కారణం కావచ్చు. ఒకచోట "అరుణగిరివాసిచే, దుస్తర మత్పాప తాప సంశయ మడఁగున్" అని, మరొకచోట "రమణాఖ్య సద్గురు చరణ రజఃపాళిఁ బాపసంతతులడగున్" అని, తన భక్తిని ప్రదర్శించారు. తదుపరి కంచికామకోటి పీఠాధీశ్వరులపైన. కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠాధిపతులు శ్రీశ్రీ విమలానంద భారతీ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్వాములపైన, భద్రాచల రామునిపైన, కనకదుర్గపైన, ఆంజనేయస్వామిపైన అనేక పద్యఖండికలు రచించి తన భక్తి భావాన్ని ప్రకటించుకున్నారు. అంతేకాదు, ఆది శంకరుల దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రం, శివాపరాధ క్షమాపణ స్తోత్రం, సౌందర్య లహరి మొదలైన వాటినిఅనువదిస్తూ పద్యాలు వ్రాశారు. జైలులో ఉన్నప్పుడు వీర్ని కొంత మతిమరుపు ఆవరించిందట. విడుదలైన తరువాత అవ్యక్త భావమాధుర్యం గల "విప్రలబ్ధ విపంచి" అనే చక్కని కవిత వ్రాశారు. ఇవిగాక గుడిగంటలలో కూడ కొంత భక్తిభావన ఉన్నది.

కాటూరి వారు భక్తి కవిత్వం వ్రాసినా, కవితా శిల్పానిదీ, చమత్కారానిదే ముందడుగు. భక్తి వెనకడుగుగా నడుస్తుంటుంది. "భద్రాచల శ్రీరామదర్శనము"లో వ్రాసిన ఒక అద్భుతమైన పద్యం చూడండి. కావటానికి తేటగీతేగాని, దరులొరసి పొంగి పొరలే భావాన్ని మోస్తున్నది.

"భయ కోదండముం బూని పాపమతులఁ
జెరప నిల్చినదేవ! నిన్ జేరుటెట్లు?
నీ కెలన జానకమ్మ క్షమాకుమారి
చెలువ చూపులు మా పాలఁ గలుగకున్న?"

తాను అనేకమైన పాపాలు చేశాడు. రాముడు దుష్టశిక్షణకు బాణం ఎక్కుపెట్టి నిలిచాడు. మరి ఆయన్ను సమీపించటం ఎలా! "రామా! మా అమ్మ సీతమ్మ! చల్లని చూపులు మాపై ప్రసరించే తల్లి, నీ చెంత ఉన్నది. అందుకే నీ దగ్గరకు రాగల్గాము" అంటారు కాటూరివారు. నిజమే కుమారుడి అల్లరికి, తండ్రి దౌష్ట్యా నికి మధ్య నిలిచి సౌఖ్యాన్ని క్షేమాన్ని ప్రసాదించేది తల్లేగదా! "క్షమా కుమారి" శబ్దప్రయోగం ఎంతో సముచితంగా ఉన్నది.

ఈ ఖండికలో ఒక పద్యం రామదాసు పద్యాన్ని పోలిఉన్నది. అలా వ్రాయటం, రామదాసు స్ఫురణకు రావటం, ఆయనపై ప్రపత్తిని ప్రదర్శించటమే కాని, మరొకటి కాదు. ఆ పద్యం చూడండి.

"కంటి నదీతటంబు, పొడగంటిని భద్రనగాధి వాసముం
గంటి నిలాతనూజ, నురు కార్ముక మార్గణ శంఖచక్రముల్
గంటిని, మిమ్ము లక్ష్మణునిఁగంటి, కృతార్థుఁడనైతి నో జగ
త్కంటక దైత్యనిర్దళన, దాశరథీ కరుణాపయోనిధీ" (దాశరథీ శతకం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇక కాటూరివారి పద్యం చూడండి.

"కంటిని గౌతమిన్ నిగమగంధ సుగంధిల వారిపూర, క
న్గొంటిని భద్రశైలమును, కొండపయిన్ నెలకొన్న కోవెలం
గంటిని, కోవెలన్ బుడమి కానుపుతో(గొలువున్న పున్నెపుం
బంటను గంటి నా కనుల పండువు చేసితి, దోసిలొగ్గితిన్"

పద్యం బాగానే ఉన్నది. కానీ రామదాసు భక్త్యావేశం కాటూరి వారిలో వెదక కూడదు. ప్రతిభ మాత్రం వెదక్కుండానే కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

కాటూరివారి పద్యంలో సత్యనిష్ఠ ఉన్నది. పశ్చాత్తాపమున్నది. ప్రార్థనలో తన్మయత్వమున్నది.

"మనసు నిలుపజాల, మాట పెంబడి నిల్పఁ
జాల, నొడలు వంపజాల దేవ!
మ్రొక్కు నెరుగనట్టి మోటకు నీవె శి
క్షించు కొనుము పెన వశీకరించి." (వేంకటాద్రీశ్వరా)
తెలియక చేసిన పాప
మ్ములు కానేరావు నావి, పున్నెములున్నన్
తెలిసిచె సవ్యాజముగా
సలిపిన విక నిష్క్రియియు గొసంగునె నాకున్ ?" (వేంకటాద్రీశ్వరా)

సాధారణంగా మానవుడు, పాపం పొరపాటున చేశానని, పుణ్యం ప్రజ్ఞవల్ల ఆర్జించానని అంటుంటాడు. రెండూ తెలిసే చేశాను. నాకు మనసు కుదురులేదు, మాట నిలకడలేదు. మ్రొక్కటం చేతకాదు. నీ ఇష్టం ఏం చేస్తావో!

"దోసము లొనర్చు చుందును
దోసిలి మొగ్గుదును, దాసదోషమ్ములు నీ
వె సైపనేర్తువను వి
శ్వాసమ్మునజేసి భక్త పరతంత్రహరీ!" (వేంకటాద్రీశ్వరా)
"నిలుపంజాలను నీపయిన్ మనసు తండ్రీ! చెప్పపాపేనియున్
తలపుల్ తామరతంపరై పొడమచున్, దారాడుచున్, జాగృతిన్
గలగాదేల్చుచు బయ్యెతె త్తెడిని: పగ్గాల్బిగ్గబట్టగ! లా
వళె నీవె రథచోదకుండవయి దేవా! వేంకటాద్రీశ్వరా!"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరివారు నిజమైన కవి; నిజమైన భక్తుడు. కవికి సహజంగా భావ చాంచల్యం ఉంటుంది. ఆ భావాలకు పగ్గాలువేసి నిర్దిష్టపథంలో నడిపినప్పుడే అతడు మంచికవిత్వం సృష్టించగలడు. ప్రయోజనకరమైన జీవితం గడుపగలడు. ఆ ప్రయోజనం కోసమే వేంకటేశ్వరస్వామిని ప్రార్థించారు వేంకటేశ్వరరావుగారు. ఇంద్రియాలనే పగ్గాలుపట్టి మనోరథం నడపటానికి పార్థసారథిని ప్రార్థించటంకంటే ఔచిత్యమేమున్నది. ఈ విషయాల్ని పరిశీలిస్తే కాటూరివారికి వేంకటేశ్వరస్వామి పైన భక్తి విశ్వాసాలు మిక్కుటమని చెప్పవచ్చు. "గుడిగంటలు" "వేంకటాద్రీశ్వరా" మొదలైన ఖండికలలో వీరు తిరుమలవాసుని స్తుతించారు. తన పేరు, తన జంటకవి మిత్రుడు; ఆరాధ్యదైవం అంతా వేంకటేశ్వరమయం కావటం విశేషం.

వేంకటేశ్వరరావుగారికి కుర్తాళం పీఠాధిపతులు విమలానంద భారతీస్వామి ఆధ్యాత్మిక గురువుగా తోస్తుంది.

"తిరుకుర్తాళ మహామహి
ధరశిఖర కృతాశ్రముఁడు, తత్త్వజ్ఞానా
భరణుఁడు, బ్రహ్మీభూతుఁడు
గురుపాదుఁడటంచు దలఁచికొని నతిసేతున్."

తన తాపాలన్నీ ఆ గురు శుశ్రూషలో అణగి శాంతి కలగాలని వారు భావించారు. "విమలానంద యతీంద్రస్తుతి" "శ్రీశ్రీ విమలానంద భారతీ స్వాములకు" "అనుజ్ఞ" అనే మూడు కవితా ఖండికలలో స్వామివారిని కవి ప్రశంసించారు. ఆయన సన్నిధానంలో కాటూరివారికి ప్రశాంతత, చిత్తశాంతి లభించినట్లు తోస్తున్నది.

"పరమ శమ నిరతు వలనన్
స్థిర మంగళ కాంతి సాంద్ర చిద్ఘను వలనన్
కరుణా నిలయుని వలనన్
హరియించును గాత మామ కాఘపటలముల్."

విమలానంద భారతీస్వామిని "సిద్ధమతి" అని "త్రుటిత శిష్య హృదయ గ్రంథి" అని "తాపహరణుడని" "దయాత్ముడని" అనేక విధాలుగా ప్రస్తుతించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విమలానంద భారతీస్వాముల అనుగ్రహం తన పూర్వ పుణ్యం వల్ల లభించిందని చెప్పుకున్నారు. ఆధ్యాత్మిక భావన కలగటం ఒక మెట్టు. నిర్దిష్టమైన ఆధ్యాత్మిక మార్గం లభించటం మరొక ఎత్తు. కాటూరివారు వయసుమళ్ళిన తరువాత తత్వచింతన ప్రారంభించారు. కానీ అన్నీ సంశయాలే.

"శాంకరమంచు ద్వైతమని శాక్తమటంచును బౌద్ధమంచు న
ల్వంకల లాగు పండితుల వాక్కులు కర్కశ తర్క జుష్టముల్
శంకఁ దొలంగఁ జేయుటకుఁ జాలక కుత్తుక బంటిగా ననున్
బంకమునందుఁ గూలిచిన బాసిన దున్న రవంత తెల్వియున్."

(అనుజ్ఞ)

శాక్తేయము, శైవము, బౌద్ధము, అద్వైతం ఒక్కొక్కటి ఒక జటిల తర్క వాద సమన్వితాలు. వీటిని తెలుసుకోవాలని ప్రయత్నిస్తే ఉన్న తెలివికూడ పోయింది. చివరకు పూర్వపుణ్య విశేషంచేత విమలానంద భారతీస్వామి గురుత్వం లభించింది.

"తొలి పుట్టువునం దే నో
ములు నించుక నోచితినొ విముఖమయ్యెను నా
తలఁపమ్మైహికముల నెడఁ
దెలిసీ తెలియక చరించితిని బలుదెసలన్."

(అనుజ్ఞ)

స్వామివారి అనుగ్రహంతో ధ్యానం కుదిరింది. కొంత సాధన కూడ కాటూరి వారు చేసినట్లు కనబడుతుంది.

"ప్రాతర్వేళల బద్ధమై యలరు నా యాత్మాంబుజాతమ్మునన్
జ్యోతింబోలె వెలుంగుఁ జిత్సుఖ లవంబొక్కింత మాయా విని
ర్ధూతంబై యది యంతలోన బహుధాభావమ్ములం దాల్చి, మ
చ్చేతంబున్ వలపించుఁ దత్సుఖము నాచేఁగాదు పొనాడగన్."

(శ్రీశ్రీ విమలానంద భారతీస్వాములకు)

గురుకటాక్షం పొంది యోగసాధనతో వారు సాధించిన బ్రహ్మానంద లేశం వారిని పరిపూర్ణ మానవునిగా చేసింది. కవిగా, సహృదయునిగా, అందరి మన్నన లను పొందిన కాటూరివారు, తనకు ప్రాప్తించలేదని పరితపించిన ఆధ్యాత్మికానందం కూడా విమలానంద స్వాములవారి అనుగ్రహంతో పొంది ధన్యజీవులైనారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరివారు జైల్లో ఉన్నప్పుడు కొంత మతిమరుపు ఆవరించింది. అది వాస్తవానికి, జ్ఞాపకాలకు పడ్డ పలుచని తెర. కానీ ఈ మరుపును భగవంతునికి తనకు మధ్య ఏర్పడిన మరుపుగా భావించి "విప్రలబ్ధవిపంచి" అనే చక్కని కవితాఖండిక వ్రాశారు. ఇది పింగళి, కాటూరి పేరుతో 1931వ సం॥ నవంబరు 7 – కృష్ణా పత్రికలో ప్రచురింపబడింది.

"దేవర దివ్య చిత్తమునఁ దీయనిభావము లెత్తిపుట్టి, యీ
కేవల దారుగర్భమునఁ గీల్కొలుపంగ ననుగ్రహించి, త
ద్భావ రసానురూపమగు పట్టునకుం దగ మేళవించు కొ
న్నావు గదా! ఒకప్పుడును నన్ బలికింప వదేమయా, ప్రభూ!"

ఒకప్పుడు తన శరీరమున భగవానుని భావనలే మ్రోగినవి. ఇప్పుడు వీణ మూగవోయినది. మరల పలికించమని భగవంతుణ్ణి ప్రార్థించారు. జీవాత్మ పరమాత్మ నుండి వేరుపడ్డప్పుడు కొంతకాలం ఆ స్పృహ ఉంటుంది. జన్మలు గడిచేకొద్దీ జీవుడికి, దేవుడికి మధ్యలో అజ్ఞానం పొరలా ఏర్పడుతుంది. ఆ పొర తొలగాలంటే భగవదనుగ్రహమే మార్గం. త్యాగరాజు "తెరతీయరా వేంకటరమణా" అని పాడటం అలాంటిదే.

పరమాత్మణ్ణి సంబోధిస్తూ "నా వీణపై గవిసెన పడ్డది" దాన్ని తొలగించవయ్యా, తిరిగి నీ స్వరూపాన్ని గుర్తిస్తాను, కీర్తిస్తాను అంటూ కవి వ్రాసిన పద్యం చూడండి.

"ఒక యింత గవిసెన యూడ్చెదే, నలనాటి;
భవ్యమో నీ రూపు పట్టికొననా ?
ఉత్సంగమునఁ జేర్చి యుపలాలనము సల్ప
నల్లంత నీ మేన నల్లుకొననా ?
కొనగోట నింత మీటిన దెంద మోడికల్
గట్ట గానమ్ముగాఁ గఱఁగి పోనా ?
మనసిచ్చి పల్కరించిన సర్వమును విస్మ
రించి నీ లోన లయించి పోనో ?"
"నీరస నిదాఘ నీరవ నిర్ఘృణత్వ
మోపఁజాల, రసోత్కంఠ నాపఁజాల
భద్రమగు నీ కరావలంబనకు మొసంగి
మృదుల పృథులాంకమునఁజేర్చఁ గదవె నాథ!" (విప్రలబ్ధ విపంచి)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భగవంతునికి తనకు మధ్య ఏర్పడ్డ మరుపు తెరను తొలగించి స్వామిని గుర్తెరగటానికి పడే జీవుని వేదనగా సామాన్యమైన మతిమరుపును కాటూరివారు చిత్రించారు. ఇది భావకవితా ధోరణిలో సాగిన రచన. రవీంద్రుని ప్రభావం కూడ కొంత కాటూరివారిమీద ఉన్నది. ఒక పేరు పెట్టకుండా సర్వవ్యాపకుడు, అప్రమేయుడైన పరమాత్మ తత్త్వాన్ని వ్యక్తావ్యక్తంగా రవీంద్రుడు చిత్రిస్తుంటాడు. గీతాంజలి అలాటి రచనే. ఈ కవితలో కాటూరివారి ధోరణి రవీంద్రుడికి దగ్గరగా ఉన్నది. ఇలాటి కవిత్వాన్ని ఆంగ్ల సాహిత్యంలో "మిస్టిక్ పొయిట్రీ" అంటారు.

బాల సాహిత్యం

గంభీరమైన భావాలతో ప్రౌఢ కవిత్వం వ్రాసిన కాటూరి వారు బాలుర కోసం చిన్న చిన్న పదాలతో కొన్ని గేయాలు, పద్యాలు కూడ వ్రాశారు. 1938లో ఆంధ్ర జాతీయ కళాశాలలో బేసిక్ స్కూలు విద్యార్థుల కోసం వ్రాసిన పాపే "మాతృభూమి".

"పుడమి చేడియకు గొప్పైన మల్లెపూ దండ
పొలుపు గల మా జన్మభూమి భారత ధాత్రి
ఎంత చక్కని తల్లి వే! రాణివే యెల్ల భూములకు నీవు ॥"

అని ప్రారంభించి రమణీయమైన భారతీయ ప్రకృతి సౌందర్యాన్ని, పైరు పంటలను వర్ణించారు. ప్రకృతి సౌందర్యం అన్ని దేశాల్లోనూ ఉండవచ్చు. మరి మనదేశం ప్రత్యేకత ఏమిటి? ఏ విషయాల్ని వర్ణిస్తే ఈ దేశ స్వరూపం ఆవిష్కరింపబడుతుంది! అది గ్రహించి వర్ణించటమే కాటూరి వారి ఘనత. కుటుంబ బాంధవ్యాల దృఢమైన అనుబంధం మన సమాజంలోని ప్రత్యేకత. మరే దేశంలోనూ ఇంత ప్రగాఢమైన కుటుంబానుబంధం లేదు.

"తల్లిబిడ్డల ప్రేమమూ — అక్కచెల్లెళ్ల కమ్మని వలపులా
చల్లనైన సరాగమూ — అన్నద
మ్ముల్ల కింకెచట గలదూ ?" (మాతృభూమి)

అంటూ ఆ ప్రత్యేకతను వ్యక్తం చేశారు కాటూరి వారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎలిమెంటరీ విద్యార్థులు పాడుకుంటానికి వీలైన పాట మరొకటి చూడండి.

"చిటికెన వ్రేలు చెల్లాయి
వుంగరం వ్రేలు బంగారం
నడిమి వ్రేలు నా అన్న
చూపుడు వ్రేలు నీ కేసి
బొటన వ్రేలు బొట్టెట్టి
ఐదు వ్రేళ్ళ అరచేయి
అరచే యరచే యంటించి
దండం పెడుదూ గణపతికి."

1951 వ సం॥ ప్రాంతంలో ఈ పాట ఆలిండియా రేడియో విజయవాడ నుండి, పిల్లల కార్యక్రమంలో తరచుగా ప్రసారమౌతుండేది. ఏడిద కామేశ్వర్రావు గారి కుమార్తె రాజ్యలక్ష్మి మొదటిసారిగా పాడింది.

తేలిక మాటలతో చక్కని లయతో పిల్లల్ని అట్టే ఆకర్షించే పాట ఇది. మరొక ఆసక్తికరమైన పాట చూడండి.

"వెండి కొండమీద - విభుడు నీ మూపెక్కి
వేంచేసెనా ! స్వారి - బసవన్నా !
గండశిలలు దాకి - కటకటా పాదాలు
రెండుగా చీలినవి బసవన్నా !!"

ఆబోతుల్నీ, ఎద్దుల్నీ, పిల్లలు పల్లెల్లో చూస్తూనే ఉంటారు. రాళ్లు తగిలి వాటి గిట్టలు చీలినవనటం, వెండికొండ మీది విభుడు ఎద్దు మూపెక్కి స్వారి చేశాడనటం పిల్లలలో ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తుంది. పాట వినగానే పిల్లలు వెండి కొండ ఎక్కడుందీ? విభుడు ఎవ్వరు ? అని ప్రశ్న వేస్తారు. దాంతో శివుని కథ అంతా వారికి బోధించే వీలుకలుగుతుంది. అలా పిల్లలలో ఆసక్తి రేకెత్తించి బోధించే విధానంలో పాట వ్రాయటం ఉత్తమ అధ్యాపకులైన కాటూరి వారికే చెల్లింది.

"వానావానా వల్లప్పా" అంటూ ఒక వానపాట కూడ వ్రాశారు. పల్లెటూళ్లలో పిల్లలు తొలకరి చిరుజల్లులు పడే రోజుల్లో చిన్న తుంపరల్లో గుండ్రంగా తిరుగుతూ వానావానావల్లప్పా అని పాడుతూ ఆడుకుంటుంటారు. వేసవి తాపానికి అప్పటిదాకా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బాధపడ్డ పిల్లలకు అదీ ఎంతో ఉల్లాసకరమైన ఆట! పిల్లలతోపాటు తొలకరివానలో దర్శనమిచ్చేవి కప్పలు. ఈ కప్పలు గురించి అందరు అనుకునేవి, శాస్త్రజ్ఞులైన కొందరికే తెలిసినవి అయిన విషయాలు చెప్పి కాటూరి వారు ఈ పాటను వినోద విజ్ఞానదాయకంగా మలచారు.

"నకనకమంటూ ఎండి వరుగులై
తుక తుకలాడే పుడమి కడుపులో
ముకు మూసుకు నిదురించే కప్పలు
పకపకమంటూ బయలుదేరరేమే."

వర్షం పడగానే అనేక రంగుల్లో, ప్రమాణాల్లో, కప్పలు కుప్పలు తెప్పలుగా కనబడుతవి. అవి వర్షంతోపాటే ఆకాశం నుండి పడుతవని కొందరు చెబుతుంటారు. కాని అది సత్యం కాదు. చెరువులో నీరు తగ్గి బురదగా మారే స్థితిలో అక్కడి కప్పలన్ని నేలలోకి సొరంగాలు చేసికొని వెళ్ళిపోతవి. అక్కడ ఆహారం, గాలి కూడ అవసరంలేని సమాధిస్థితిలో ఉండి వర్షం పడగానే ఆ కన్నాలలోకి నీరు దిగి చెమ్మతగలడంతోటే మేల్కొని వెనక్కు వచ్చేస్తవి. అందువల్లనే అన్ని కప్పలు ఒకేసారి మనకు కనబడటం. కొన్ని కప్పలు పసుపురంగులో కొన్ని పాచి రంగులో ఉండటం మనం చూస్తుంటాం. అవి అరుస్తూ ఉంటే, పిల్లలు అక్కడ చేరి వాటికి శృతి కలిపి అరుస్తుంటారు. ఆ కప్పల అరుపులు రకరకాలు ఆ ధ్వనుల్ని తమ ఊహకు, పరిజ్ఞానానికి అనుగుణంగా అన్వయించుకొని పిల్లలు కేరింతలాడుతుంటారు. కొన్ని కప్పల అరుపులు "ముదపప్ ముదపప్" అన్నట్లు ధ్వనిస్తవట, వాటిని బాపన కప్పలని; మరికొన్ని దీర్ఘశృతిలో "బేర్ బేర్" అంటవి, అవి "బేరం బేరం" అని అరచే కోమటి కప్పలని-పిల్లలు అనుకుంటుంటారు.

"పసపు లాడినా బావురు కప్పలు
ముదపప్ ముదపప్ బాపన కప్పలు
బేరం బేరం కోమటి కప్పలు
చెంగు చెంగునా చిరుచిరు కప్పలు."

అంటూ వ్రాసిన పంక్తులు. పిల్లల మనస్సులకు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తవి. ఆకాశంలో పరుగెత్తే మబ్బుల్లో ఏవో జంతువుల ఆకారాల్ని ఊహించు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కోటం, ప్రకృతిలో వినబడే పక్షుల, జంతువుల అరుపుల్ని మానవ జీవనానికి సంబంధించిన మాటలకు అన్వయించుకోటం చిన్నపిల్లల మన స్తత్వం.

"పెద్దబాలశిక్ష"లో "పార్వతీపతి తెలుపు......." అంటూ తెలుపు, ఎరుపు సీస పద్యాలున్నవి. చిన్న పిల్లలకు పనికివచ్చేటట్లు నీకొక తెలుపు ఆటవెలది పద్యం వ్రాశారు.

"మల్లెపూవు తెలుపు, రెల్లుపూవు దెలుపు
కాకితమ్ము తెలుపు, ఏకు తెలుపు,
పాలతరక తెలుపు, పండు వెన్నెల తెల్పు
సుద్ద తెలుపు, తాతజుట్టు తెలుపు."

ఇందులో ఉపమానాలన్నీ పిల్లలకు నిత్యం సన్నిహితంగా ఉండేవే.

ఇలా అన్ని రుచులు, అన్ని అభిరుచుల వారికి అందించే కాటూరి కవితా నందనం రసహృదయులకు చందనం.

క వి తా శి ల్పం

వేంకటేశ్వర్రావుగారు రసవాది. వీరి కవిత్వంలో చమత్కారమో,ధ్వనో లేని పద్యాలు చాలా తక్కువ. చక్కని శయ్యా పాకాలతో పద్యాలు ఏనుగులులాగా గంభీరంగా, గుర్రాల లాగా వడివడిగా, సెలయేళ్లలాగా గలగలా కదులుతుంటవి. గుడిగంటలు, పౌలస్త్య హృదయాలలో కొన్ని పద్యమణులని పరామర్శించాను. సౌందర్య ప్రలోభంతో ఇక్కడ మరికొన్ని సన్నివేశాలలోని పద్యాలను పరామర్శించటానికి సిద్ధమౌతున్నాను.

కాటూరివారు తమ తాతల్ని, తండ్రుల్ని, అప్పచెల్లెళ్ళని "మా వాళ్లు మాఊరు"లో వర్ణించారు. మరి సతీమణి మాటేమిటి? ఎక్కడా ఒక్కమాట చెప్పినట్లు లేదే! చిత్రంగా ఉందే! అయినా తన భార్యను గురించి తను చెప్పుకోటం సంప్రదాయం కాదని భావించారేమో! అనుకొని కూడ అన్యాపదేశంగానో, ధ్వని మూలకంగానో ఎక్కడోక్కడ చెప్పకుండా ఉంటారా అని వెదికాను. కృషి ఫలించింది. ఎంతో నర్మ గర్భంగా చమత్కారంగా తన ఇల్లాలిని గురించి కాటూరి వారు ఏమి చెప్పారో ఎలా చెప్పారో చూడండి.

కాటూరి వారు సహాయ నిరాకరణోద్యమంలో అరస్టయి జైల్లో ఉన్నారు. వరలక్ష్మీవ్రతం వచ్చింది. పండుగ సందడి, విచారంలో ఉన్న తన భార్య స్థితి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆయన కళ్ల ముందు సాక్షాత్కరించింది. ఆమె వరలక్ష్మీదేవిని సంబోధించి సంభాషిస్తున్నట్లు "వరలక్ష్మి" అనే కవితా ఖండిక రచించారు. దాంట్లో చమత్కారంగా తన ధర్మపత్ని సౌందర్యము, సౌజన్యము ధ్వనింపజేశారు.

ఆమె వరలక్ష్మిని ఉద్దేశించి ఇలా అంటుంది.

"ఆయన యూరలేరు, నెలలైదు గతించె ప్రవాసియై ఎటో
త్రోయుచు నుంటి గాల మిసిరో! యొకగవ్వయు చేతలేక, నీ
కే యుపచారముల్ సలుప నెట్టుల నేరుతు? నీ యభాగ్యురా
లీ యనురాగ భారమున నెంతయు గుమ్మెలు వోయి క్రుంగెడిన్!"

వారిది ఉమ్మడి కుటుంబం. అలాటి కుటుంబాల్లో స్త్రీలకు సహజంగానే చనువు తక్కువ. ఆడవాళ్ళ చేతుల్లో డబ్బులుండవు. పండుగ వచ్చింది. భర్తను అడిగి తీసుకుందామంటే "ఆయన యూరలేరు" ఆపైన జైల్లో ఉన్నారు. కారణం ఉదాత్తమయినదే కావచ్చు. ఎంతమంది గుర్తిస్తారు. ఇంటి బాధ్యతలు పట్టించుకోక పోగా, ఇంటిమీదకి సమస్యలు తెస్తున్నాడని, ఎవరైన అనుకుంటారేమో! వియోగ వేదన ఎలాగో ఉండనే ఉన్నది.

ఈ సంఘర్షణ అంతా ఒక్కమాటలో ధ్వనింపజేస్తూ, కాటూరి వారు "ఎటో త్రోయుచు నుండి గాల మిసిరో! అభాగ్యురాలను" అనిపించారా మెతో. ఇంత కష్టంలో ఉన్నా ఆమె వరలక్ష్మీపూజ ఏదోవిధంగా చేయటానికే నిశ్చయించుకొన్నది. ఇలా ఆమె ఆస్తిక్యబుద్ధిని చెప్పారు, వేంకటేశ్వరరావుగారు. కాటూరివారి తెలుగు పలుకుబడి అపూర్వం. "ఆయన యూరలేరు" అనటం ఎంతో సహజ సుందరం.

ఇక ఆమె రూపాన్ని ఎంతో చమత్కారంగా ధ్వనింపజేశారు.

"విందవైన నిన్ను వీడు కొల్పను లేను
వ్రత మొనర్ప సజ్జురాల గాను,
ముందు నోతునన్న ముందేమొ నేనేమొ
కులము వారి బిలుతు నిలుము తల్లి!"

అంటుంది, ఆమె వరలక్ష్మిని ఉద్దేశించి. ఇంతకు కులము వారంటె ఎవరు ? సహజంగా బ్రాహ్మణ ముత్తయిదువ లనుకుంటాం! కాని ఆమె పిలిచిన వారెవరో చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"రావె కాదంబినీ ! క్షణప్రభరో ! రమ్మ
చాతకీ ! రమ్మ కేతకీ ! నాగు సేయ
కీవు నీవారు రారె? మా యింట నేడు,
విందు వరలక్ష్మి : మీ కెల్లఁ బేరఁటమ్మ !"

కాదంబిని అంటే మేఘమాల, క్షణప్రభ అంటే మెరుపు, చాతక పక్షి, కేతకి పుష్పం - ఇవి ఆమె కులము వారు.

మేఘాలను కురులకు ఉపమానాలుగా, మెరుపు తీగను తనువుకు ఉపమానంగా చెప్పటం కవిలోక ప్రసిద్ధం. ఇక భర్తకొరకు ఎదురు చూస్తున్న ఆమె చాతకపక్షే! పైకి సామాన్యంగా కనిపించి, మానసిక ఔన్నత్యం గలవారు, బాహ్యంగా సామాన్యమై అంతర్గతంగా సౌరభ భరితమైన మొగలిపూవు వంటివారే! ఉపమానాలతోనే ఆ సాధ్వీమణి సౌజన్యాన్ని కాటూరివారు చిత్రించిన తీరు అమోఘం. ఇంతకు ఈ మాటలన్నది కాటూరివారు కాదు. ఆయన భార్యే. ఆమె చేత ఆమె సౌందర్యాన్నే చెప్పించటం ఇక్కడి చమత్కారం. మరొకవంక ఇదంతా వర్షఋతువు వర్ణన. ఈ ఋతువులోనె వరలక్ష్మి వ్రతం వస్తుంది. ఇలా అనేక విషయాలు కలిపి కవితా కదంబం తీర్చిన ఘనత వేంకటేశ్వరరావుగారిది.

సున్నితమైన హాస్యం కాటూరివారిలో చాలాచోట్ల కనిపిస్తుంది. సోమయాజుల వేంకట నరసింహంగారు, కాటూరి వారికి బాల్య గురువులు. వారు బడి చెప్పటానికే కాటూరు వచ్చారు. వారు తిరిగి స్వగ్రామం వెళ్తున్న సందర్భంలో, పూర్వశిష్యులందరు సన్మానం చేసి స్వర్ణకంకణం తొడిగారు. ఆ సందర్భంలో, కాటూరి వారు కొన్ని పద్యాలు చెప్పారు. అందులో ఒక పద్యం చూడండి ఎంత చమత్కార భరితంగా ఉందో.

"గురుదేవుని దక్షిణపున్
గరమా ! మున్నెంత మమ్మగారియ యిడితో
దొలఁగెగద నిప్పుడే బం
గరు కడియములోన దూర్చి కసి దీర్చుకొనన్ !" (వీడ్కోలు)

గురువుగారి కుడిచెయ్యి చిన్నప్పుడు ఆయన్ని మొట్టికాయలేసిందట, దానికి ప్రతీకారంగ ఆ చేతిని బంగారు కడియంలో దూర్చి కసి తీర్చుకుంటాడట,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తదనంతర కాలంలో కవితా గురువులైన చెళ్ళపిళ్ళవారు బందరును వదలి కడియం వెళ్ళేటప్పుడు జరిగిన వీడ్కోలు సభలో కూడ, కాటూరివారు వ్రాసిన పద్యాలలో గురువుగారి ఎడబాటుకు బాధేకాక, చమత్కారం కూడ ఉన్నది.

"బందరు పత్తనమ్మ! నను బాయుచు నుండెను వేంకటేశ్వరుం
డందువు ప్రౌఢ నిర్భర వయః పరిపాకము(జూబలాడి తీ
విందు(ద్రయోదశాబ్దములు, నీ ముది ప్రాయపు ముద్దులేని క
న్నందుకు(దక్కనిమ్ము కడియమ్మనుచున్ నిను మెచ్చు లోకముల్."

(వీడ్కోలు)

"బందరు పట్టణమా! చెళ్ళపిళ్ళవారి వయసు సొగసంతా నీ పాలే గదా! కన్నందుకు కడియానికి ముదిప్రాయపు ముచ్చటన్న దక్కనివ్వు" అనటంలో చక్కని చమత్కారం చూపించారు.

కాటూరివారి స్నేహితులలో జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి గారొకరు. ఈయన పేరడీ రచనలో ప్రసిద్ధుడు. సాహిత్య శిరోమణి పరీక్ష తప్పిన శాస్త్రిగారిపైన వేంకటేశ్వరరావు గారు వ్రాసినది, పేరడీ కాదు కాని, చమత్కార రచన. "సిజర్సు శిరోమణి" అనే శీర్షిక క్రింద అయిదు పద్యాలు వ్రాశారు. మచ్చుకు రెండు మూడు చూపిస్తాను.

"మకరీకృత కాఫీ టీ
జలనిధి! ఖిల్లీ సహస్ర చర్వణచణ! ని
ర్మల ధూమోజ్వల పరిపే
ష లసన్మూర్తీ! సిజర్సు సారజ్ఞ మణీ!"

"శ్రవణావతంసమై చే
దివిటీమై, నీదుగెల్పు డెల్పు ధ్వజమ్మై,
భువి నీదు యశోభూతిమై
మిపులన్ వెలిగింపు మోయి! మేటి సిజర్సున్!"

రుక్మిణీనాథశాస్త్రి గారికున్న కాఫీ, టీ అలవాట్లని, నిరంతరం సాగే సిజర్సు సిగరెట్ ధూమపానాన్ని ఇక్కడ చమత్కారంగా చిత్రించారు. పైకి చమత్కారంగా ఉన్నా, దీంట్లో సున్నితమైన మందలింపు కూడ లేకపోలేదు. హితాన్ని మితంగా, సున్నితంగా చెప్పటంలోనే కాటూరివారి ఘనత. "సిజర్సు శిరోమణి" అనటంలోనే వ్యంగ్యమున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వేంకటేశ్వర్రావుగారు బి.ఎ. చదివేటప్పుడు ఒక సహవిద్యార్థిని ఉండేది. ఆమె మిటారి, వగలాడి, ఆమెనుగూర్చి చెప్పిన పద్యం చూస్తుంటే చిన్నతనంలోనే కాటూరివారి కవిత్వానికబ్బిన చమత్కార సౌరభం మనకు తెలుస్తుంది.

"ఒకనికి వాలుజూపు, మరి యొక్కనికిన్ గడకంటి చూపు, వే
రొకనికి నిండుజూపు, మరియొక్కనికిన్ నిడు నిట్టజూపు, నిం
కొకనికి మోవినొక్కు, మరియొక్కని కల్లన బైటజార్పు, జా
వకళిఖ యొచు మాకు ఫలపక్ష మొనర్పదు పంక్తి లోపలన్."

ఒకనాడు పింగళివారు వేంకటేశ్వర్రావు గారింటికి వచ్చి "ఏం చేస్తున్నావోయ్" అన్నారుట. "తెల్లకాగితం మీద ఏదో వ్రాస్తున్నా" అన్నారట కాటూరి! "కాగితం మీదకాక గోడమీద వ్రాస్తావా? ఏం! ఇంతకి అది....!"అన్నారుట అర్థోక్తితో లక్ష్మీకాంతంగారు. "అదే తెల్లకాగితం కవితా వస్తువుగా కవిత్వం వ్రాస్తున్నాను" అన్నారట వేంకటేశ్వర్రావుగారు. గొప్ప విషయాల మీద కవిత్వం చెప్పటం తేలిక. అక్కడ కల్పనకు అవకాశం ఎక్కువ. చిన్న వస్తువుల మీద చాలాకష్టం. అయినా ముల్లుమీద కమ్మని పద్యం చెప్పిన గురువుల శిష్యుడు కదా!

"సంజలో వికసించిన మల్లెపూవు కన్న, పాలకన్న తెల్లనైన ఓ కాగితమా! మచ్చలేని నీ ముఖంమీద ఎవరు వ్రాస్తారో? ఏమి వ్రాస్తారో? ఏమి కానున్నదో నీ అదృష్టరేఖ" అంటూ కాటూరివారు అద్భుతమయిన కవితను వెలయించారు. అందులో వదలదగ్గ పంక్తి ఒక్కటి కూడ లేకపోయినా, రసనిర్భరమైన కొన్ని భాగాలు ఉదాహరిస్తాను. ఆ కాగితం భవిష్యత్తును గురించి చెబుతూ ;

"కాల వాహినిలో మునుంగక, యుగమ్ము
లెన్ని కడ చన్నను ప్రతిధ్వనించు నే యు
దార హృదయుని భావగీతారవమ్ము
లీవు వహియింప నుంటివో యెవరి కెఱుక ?

పారవశ్యము ఘటియించి భావనా త
రంగములు పొంగి పొరలాడు భంగి నీదు
నొసట నే కవి వ్రాయునో రసమయమ్ము
పద్యమొక్కటి ? యెవరు చెప్పంగలారు ?

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దుస్సహ వియోగ బాధచేఁ దూలు కాము
కుండెవండేని ప్రియురాలి, గూర్చి జాలి
కలుగ మృదువాక్యములు మందగతి లిఖించి
యంప, నల్లన మృదుల కరాంగుళుల ను
విచ్చి, యా కాంత నిన్ను గ్రొవ్వేడి బాష్ప
కణము లొలుకంగఁ గన్నులఁగప్పి కొనునొ ?

వెజ్జులెవరేని నీ మేన విషమయమ్మ
లైన మందులు వ్రాయ, రోగార్త జనము
చేతులంబడి నలిగి నశించె దేమొ ?

అవసరమ్మున కెవఁడైన నప్పుదెచ్చి
వడ్డితోఁ దీర్పఁ బత్రంబువ్రాసి యొసఁగ
ధనిక జన గేహములలోన నినుపపెట్టె
లందు బంధింప బడెదొ ? ధర్మాధికృతులు
మరణ దండనములు వ్రాయ, మందభాగ్య
జనుల ప్రాణముల్ హరియింపఁజనెద వేమొ ?
తెల్లకాగితమా నాకుఁదెల్పఁగదవె !

తప్పఁదలచితి నిర్మల దర్పణమ్మ
వోని నీమేనఁ గుంచె చేఁబూని, చిత్ర
కారుఁడెవఁడేని చైతన్య కలితమైన
చిత్తరువు వ్రాసి రంజింపఁజేయునేమొ ?

కాక, కఠినాత్ముఁడెవఁడేని పీక నులిమి
చిత్తు కాగితముల బుట్టఁజేర్చి, నీకుఁ
గష్టపుం జాపు సేకూర్పఁగలఁడొ యేమొ ?."

ఇంతవరకు కాగితంపై వ్రాయటానికి వీలున్న విషయాలు చమత్కారంగా వర్ణించిన కాటూరి వేంకటేశ్వరరావుగారు తరువాత వ్రాసిన ఎంతో భావగర్భితమైన పాదాలు చూడండి.

19)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నీకుఁగీర్తిని గల్పింప నేరనట్టి
సోమరి జనమ్ములకు భావశూన్యులకును
చేటునకె గాకయున్న నీ చెలిమియేల ?"

ఇక్కడ పరోక్షంగా మంచి కవికి కావలసిన లక్షణాలు తెలిపారు. సోమరి తనం దరిచేరనీయకుండా శ్రమించి గురువుల నాశ్రయించి, గ్రంథ పఠనం జేసి వ్యుత్పత్తిని పెంపొందించుకోవాలి. పుష్కలమైన భావసంపద ఉండాలి. అలాటి కవులు వ్రాసిన కవిత కాగితానికి అలంకారమై శాశ్వతత్వాన్ని కలిగిస్తుంది. వ్యుత్పత్తిని సాధించలేని సోమరిపోతులు, భావశూన్యులు వ్రాసే వ్రాతలు మచ్చలేని కాగితానికి కళంకమే.

ఉత్తమమైన కావ్యం ఎలా ఉంటుందో కూడ కాటూరివారు చెప్పారు.

"కాలవాహినిలో మునుంగక, యుగమ్ము
లెన్ని కడ చన్నను ప్రతిధ్వనించు...."

అంతేకాకుండా ఇక్కడ రచనలో కాటూరివారు గొప్పచమత్కారం చూపించారు.

తెల్లకాగితాన్ని గురించి, కవిత్వాన్ని గురించి ఇంతగా చెబుతున్న ఈ కవి కూడ తెల్లకాగితం మీద, కవిత్వాన్నే వ్రాస్తున్నాడు. "నీదు భావిచరితమ్ము లెవరి కెరుక?" అనటంలో భావికాలంలో తన కవితకు లభించే ఆదరణను, గురించిన కవి ఆలోచన స్ఫురిస్తుంది.

"కాలవాహినిలో మునిగిపోకుండ, ఎన్ని యుగాలైనా ప్రతిధ్వనించే ఏ కవి గీతాలు నీవు ధరిస్తావో గదా!" అనటంలో కాలాన్ని జయించి ప్రతిధ్వనించే ఆ భావ గీతికా రచయిత తనే కాకూడదా! అనే భావం తొంగిచూస్తున్నది.

"నీదు, నొసట నే కవివ్రాయునో, రసమయమ్ము, పద్యమొక్కటి? ఎవరు చెప్పంగలారు? ఏమి కానున్నదో నీ అదృష్టరేఖ" అన్న కవిమాటల్లో, ఆ రసమయ పద్య నిర్మాత తానే కాకూడదా! అనే భావం ధ్వనిస్తుంది. ఇలా తన కవిత్వం శాశ్వతంగా నిలుస్తుందనే విశ్వాసాన్ని, మరోప్రక్క సంశయాన్ని కలబోసి గడుసుగా వ్యక్తం చేశారు కాటూరివారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇలాంటి చమత్కారాలు పింగళి సూరన కళాపూర్ణోదయంలో ఎన్నో ఉన్నవి. సుగాత్రీ శాలీనుల వృత్తాంతంలో మచ్చుకు అలాటి చమత్కారమొకటి చూడండి. సుగాత్రీ శాలీనుల కథ వ్రాసివున్న తాళపత్ర గ్రంథాన్ని ఒక విద్యార్థి, శాలీనుని తోటనుండి తెప్పాడు. గురువుగారు దాన్ని చదివి వినిపించమన్నారు. అక్కడ ఉన్న మణికంధరుడు మొదలయిన వారికి ఆ కథను వినిపించాడు శిష్యుడు. అంతా విన్న గురువుగారు—

"ఆ సుగాత్రి శాలీనుల యందు నరవింద భవుని కాంత కెంత దయయో యెరుంగము; నాకు నద్దేవి కలలోనవచ్చి; ఈ పుస్తకంబు నిత్యంబును ప్రాతఃకాలంబున జదువుకొనుమని ఇచ్చె...." (కళా.పూ.అ. 4. వ – 144)

ఈ పుస్తకం అంటే! ఏ పుస్తకం? సుగాత్రి శాలీనుల కథ ఉన్న పుస్తకం అదీ కళాపూర్ణోదయమేకదా! కళాపూర్ణోదయం ప్రతిరోజూ ఉదయం చదువుకోమని సరస్వతీదేవి పండితులకిచ్చిన కానుక అన్నమాట. యథార్థానికి సరస్వతీ చతుర్ముఖుల సంభాషణా విలాసమే కదా కళాపూర్ణోదయం.

తన పుస్తకం చదవటమేకాదు వినటం కూడా శ్రేయస్కరమే అంటూ గడుసుగా పింగళి సూరన గురువుచే చెప్పించిన పద్యం చూడండి.

"ఆ యనఘుల చరితముగా
దే! యీ పుస్తకములోనిదియు! మనకెల్లన్
శ్రేయస్కర మిది వినుటయు
పోయెం దద్దర్శనంపు బుణ్యోత్సవముల్" (కళా.పూ.అ. 4. ప. 58)

ఇక్కడ కూడా అదే చమత్కారం. సుగాత్రి శాలీనుల వంటి పుణ్యదంపతుల దర్శనం ఎలాగో ఇప్పుడు లభింపదు. కనీసం అలాంటి పవిత్రగాథ ఉన్న ఈ కళాపూర్ణోదయం చదివితే శ్రేయస్కరం అని కవి సందేశం.

పింగళి సూరన పట్టుబడి ఇక్కడ కాటూరివారి కవితలో తొంగి చూచింది. సూరన కావ్యాలను ఆమూలాగ్రం పఠించిన కాటూరివారిపై ఆ కవి ప్రభావం పడటంలో ఆశ్చర్యంలేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మాట పదునెరిగిన కాటూరివారు ఒక్క శబ్దంలో ఎంతో అర్థాన్ని సాధిస్తుంటారు. రాధాకృష్ణ పండితుని ప్రశంసిస్తూ వ్రాసిన పద్యం చూడండి.

"అమలోదాత్తమనీష' సర్వనిగమాంతాంభోనిధుల్ గ్రోలి, బో
ధమహాచంచల చంచలాద్యుతుల రాధాకృష్ణ చిన్మేఘ మ
భ్రమునన్ వ్రేలె, నబోధ ఘర్మ పరితప్త స్వాంత కేదార ఖం
డములం దద్వయ తత్త్వ సస్యములు పండన్ సర్వదిక్సీమలన్."

రాధాకృష్ణ పండితుడు సర్వవేదాంతాలను గ్రోలటం, సర్వదేశాలలో తత్త్వబోధ చేయటం, ఈ పద్యంలో ప్రశంసించబడింది. ఈపని చాలామంది భారతీయులు చేశారు. కానీ రాధాకృష్ణన్ ప్రత్యేకత వేరు. ప్రాచ్య పాశ్చాత్య తాత్త్విక ధోరణులను సమానంగా, అధ్యయనం చేసి సమన్వయం చేయటం, ఇటు భారతీయ తాత్త్వికుల మెప్పుల్ని అటు విదేశీయ తాత్త్వికుల మన్ననల్ని పొందటం ఆయన ప్రత్యేకత ఈ సమన్వయ దృక్పథానికి ఒకరకంగా రాధాకృష్ణ పండితుడు సృష్టికర్త. ఈ ప్రత్యేకత లన్నిటిని "అమలోదాత్త మనీష" అనే ఒక్క మాటతో స్ఫురింపజేశారు కాటూరి వారు.

అమలోదాత్త మనీష అనటంలోనే నిర్వచనోత్తర రామాయణంలోని తిక్కన తననుగూర్చి చెప్పుకొన్న పద్యం గుర్తుకు వస్తుంది.

"అమలోదాత్త మనీష నే నుభయ కావ్యప్రౌఢి బాటించు శి
ల్పమునం బారగుడన్ గళావిదుడు........"

తిక్కనకు సంస్కృత, ఆంధ్ర ఉభయ కావ్యప్రౌఢి-ఇక్కడ రాధాకృష్ణ పండితునకు సంస్కృత ఆంధ్ర ఆంగ్ల కావ్యప్రౌఢి. తిక్కన కవితాకళయందు, రాధాకృష్ణన్ బోధన కళయందు కోవిదులు. తిక్కన సంస్కృత, ఆంధ్ర, శైవ, వైష్ణవ ఉభయ కవిమిత్రుడు, రాధాకృష్ణన్ ప్రాచ్య పాశ్చాత్య వేదాంతవిదుడు- ఉభయవేదాంతులకు మిత్రుడు. ఇలా అల్పాక్షరాలలో అనల్పార్థరచన చేయటం కాటూరివారి ఘనత.

కాటూరివారికి సంగీతమంటే కూడ ఎంతో అభిమానం. ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసుడు ద్వారం వెంకటస్వామి నాయుడుగారి మీద "అమృతపాణి" అనే కవితను, నాదస్వర విద్వాన్ దాలిపర్తి పిచ్చిహరిని ప్రశంసిస్తూ ఒకపద్యం, "రాగరసావ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శారుడు" అనే పేరుతో త్యాగయ్యమీద కొన్ని పద్యాలు వ్రాశారు. వీరు కమ్మగా పద్యాలు చదివేవారట. కవిత్వానికి సంగీత స్పర్శ మనోహరంగా ఉంటుందని వీరు విశ్వసించినట్లు కనబడుతుంది.

"ఆవాహన" అనే కవితలో—

"అయ్యో కవి! గంటమును, దాటియాకుఁబూని
వచ్చితి విదేమి! నీదు విపంచియేది?" అంటారు.

కాటూరివారు సంగీత సాహిత్యాల సరసత్వమెరిగిన సుకవులు. కాటూరివారి కవితలో శృంగారం అంతగా లేకపోవటం కూడా మనం గమనించవచ్చు. కవులందరు భావకవిత్వపు వెల్లువలో ప్రేయసుల ఊసులతో ఊహా విహాయసంలో ఎగురుతున్న ఆ రోజుల్లో శృంగార భరితమయిన ఒక్క ఖండికైన, వారు వ్రాయకపోవటం విశేషమే. దేశభక్తి, గాంధేయవాదం, ఆధ్యాత్మికచింతనలే వీరి కవితలలో ఎక్కువ కనిపిస్తవి. విషయం యేదైనా దాన్ని తీర్చిదిద్దటంలో వేంకటేశ్వరరావుగారి శిల్ప చాతుర్యం అనల్పం.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

II. రూపకములు

దృశ్య కావ్యాన్నే రూపమని, రూపకమని, అంటారు. కావ్యాలలో వర్ణింప బడిన ఆయా సన్నివేశాలు, వ్యక్తులు, దృశ్యత్వం పొంది మన కన్నుల ముందు నిల వటం వల్ల, ఈ ప్రక్రియను రూపమని వ్యవహరించారు, ఆయా వ్యక్తుల రూపాన్ని స్వభావాన్ని నటులు తమకు ఆరోపించుకొని నటిస్తారు కాబట్టి రూపానికి రూపకమనే పేరు వచ్చింది. దీనికి నాట్యమనే పేరుకూడ ఉన్నదీ. భరతముని తన నాట్య శాస్త్రంలో ఈ రూపకాల్ని పది విధాలుగా చెప్పాడు. 1. నాటకము, 2. ప్రక రణము, 3. భాణము, 4. ప్రహసనము, 5. డిమము, 6. వ్యాయోగము 7. సమవాకారము, 8. వీధి, 9. అంకము, 10. ఈహామృగము అనేవే, ఆ పదీ రూపకాలు. వీటిలో ప్రసిద్ధమయినది నాటకం. అయితే వీటన్నిటిని నాటకాలనే పిలవటం అలవాటయిపోయింది. తదనంతర కాలంలో వీటిసంఖ్య కొంత పెరిగింది. విశ్వనాథుడనే లాక్షణికుడు పద్దెనిమిది ఉపరూపకాల్ని వివరించాడు. వీటిలో "నాటిక" ఒకటి. భరతముని కూడ "నాటిక" అంటూ ఒక రూపక విశేషాన్ని చెప్పాడు. ఆధు నిక కాలంలో కూడ "నాటిక" పేరుతో రూపక ప్రదర్శన విశేషంగా జరుగుతూనే ఉన్నది. అయితే అప్పటినుండి ఇప్పటిదాకా నాటిక ఒకేవిధంగా ఉన్నదా? అనే సందే హం రావటం సహజం.

భరతుడు చెప్పిన "నాటిక", విశ్వనాధుడు చెప్పిన "నాటిక" ఆధునిక కాలం లోని "నాటిక" ఒకటికాదు. నాటక లక్షణాలు, ప్రకరణము యొక్క లక్షణాలు, కలిసివున్న రూపకాన్ని భరతుడు "నాటిక"గా చెప్పాడు. ఇక విశ్వనాధుడు చెప్పిన నాటికకు నాలుగు అంకాలు-కథ కల్పితమైనది- స్త్రీ పాత్రలు ఎక్కువ- ధీరలలిత మైన రాజు నాయకుడు- శృంగారం ప్రధానరసము. ఇక ఆధునిక నాటిక వీటికి భిన్నమైనది. దీనికి ప్రాచీన ఏకాంకికలకు కొన్ని పోలికలున్నవి. ప్రదర్శనా కాలం, పాత్రలు తక్కువగా ఉండటమే, ఆ పోలిక. మిగిలిన విషయాలలో చాలా వ్యత్యాస మున్నది. నేటి నాటికపై ఆంగ్ల సాహిత్యంలోని "ప్లెలెట్" ప్రభావం చాలాఎక్కువ అని చెప్పవచ్చు. ఆధునిక నాటికల్లో ఈ విధమైన ఇతివృత్తమే ఉండాలని కాని, ప్రధాన రసాలుగా, ఏహో కొన్ని మాత్రమే ఉండాలనిగాని నియమంలేదు. పౌరాణిక చారిత్రక, సాంఘిక, ఇతివృత్తాలతో, అన్ని రసాలతో నేటి నాటిక విలసిల్లుతున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రేడియోలు వచ్చిన తరువాత "శ్రవ్య నాటిక" అనే మరో క్రొత్త ప్రక్రియ వచ్చింది. సాత్వికము, ఆంగికము, ఆహార్యము, వాచికము అనే నాలుగు అభినయాలతోనే ఏ రూపకమైన నడుస్తుంది. ఇతరుల సుఖదుఃఖాలను అభినయించటం సాత్వికం. శరీరపు కదలికలతో చేసే అభినయమే ఆంగికం. తగిన వస్త్రాలు భూషణాలు ధరించటం ఆహార్యం. రసోచితంగా పలికే మాటలు, పాటలు, పద్యాలే వాచికం. రంగస్థలం మీద రూపకం ప్రదర్శించేటప్పుడు ఈ నాలుగు విధాలైన అభినయాలను నటుడు ప్రదర్శిస్తాడు. కానీ రేడియో సంగతి వేరు.

రేడియో నాటికలో నటుని సాత్విక, ఆంగిక, ఆహార్య అభినయాలు మనకు కనిపించవు. అవి ఉండవలసిన అవసరంకూడ లేదు. ఒక్క వాచికం ద్వారానే భావ వ్యక్తీకరణం అంతా జరగాలి. అంటే శ్రోతకు మాట వినిపించి దృశ్యం ఊహించుకొనేటట్లు చేయాలి. ఈ ప్రక్రియలో, భావం సమర్థవంతంగా పొదగబడిన సంభాషణలు ఉండాలి. నటుడు దాన్ని తన వాచికంలో సంపూర్ణంగా వ్యక్తం చేయగలగాలి. రచయితకు, నటునికి కూడ రేడియో నాటికా నిర్వహణం అంత సులభమైనదేంకాదు. వాచికం ద్వారానే ఆయాపాత్రల వేషభాషల్ని కూడ చెప్పించవలసి వస్తుంది. అలా అని సుదీర్ఘమైన సంభాషణలు వ్రాసే వీలుండదు. దృశ్యం లేదుకాబట్టి, ఏ మాత్రం పెద్ద సంభాషణైనా విసుగు కలిగిస్తుంది. పదునైన చిన్న చిన్న సంభాషణలతో కథ నడపాలి. ఇది రచయితకు నటునికి కత్తిమీదసాము.

ఇక ఆధునిక నాటకాలల్లో భావ వ్యక్తీకరణకు చతుర్విధ అభినయాలేకాకుండా వాద్య సంగీత సహకారం కూడ లభిస్తున్నది. దాన్నే "బ్యాగ్రౌండ్ మ్యూజిక్" అంటున్నాము. నటుడు అభినయించబోయే భావానికి, చెప్పబోయే సంభాషణకు అనుగుణంగా రసోత్పాదనం చేస్తూ వైలెన్ మొదలయిన వాద్యాలు నాంది పలుకుతవి. అప్పుడు భావావిష్కరణ ఇంకా సంపూర్ణంగా జరిగే అవకాశమున్నది. రేడియో నాటికల్లో ఈ బ్యాగ్రౌండ్ మ్యూజిక్ ఎంతో ప్రయోజనకారి. దీనివల్ల శ్రోతలకు రసానుభూతి సుగమమౌతుంది. ఇప్పుడు బ్యాగ్రౌండ్ మ్యూజిక్ లేకుండా ఏ నాటిక, నాటకం ప్రదర్శింపబడటంలేదు.

ఈ రేడియో నాటికలలో కాటూరి వేంకటేశ్వరరావుగారు పదునైన, రసభరితమైన సంభాషణలు వ్రాశారు. అవి మన చెవులలో పడి కన్నులముందు దృశ్యరూపం ధరిస్తవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

1. మువ్వగోపాల

కాటూరి వారి నాటికల సంపుటిని "మువ్వగోపాల" అనే పేరుతో 1961లో త్రివేణీ పబ్లిషర్స్, మచిలీపట్నం వారు ప్రచురించారు. అయితే "మువ్వగోపాల" అనేది దీంట్లోని మొదటి నాటిక. ఆ పేరే ఈ పుస్తకానికి పెట్టారు. కాటూరివారు తన అసుంగు మిత్రుడైన దేవులపల్లికి పుట్టినరోజు కానుకగా 1961 అక్టోబరు 30వ తేదీన దీన్ని అంకితం చేశారు. దేవులపల్లివారు కాటూరివారితో "నా ఒడుపులు కొన్ని మీరు కొట్టేశారు" అన్నారట. కాటూరివారు కూడ "ఏదో కొంత వాసన తగిలింది" అని అంగీకరించారు. బహుశా అది గేయరచనలో ననుకుంటాను. పద్యరచనలో దేవులపల్లికి కాటూరికి అంత పోలికలున్నట్లు కనిపించదు.

కాటూరివారి రచనల్లో ప్రధానంగా కనిపించే భావావేశం ఈ నాటికల్లోను కనిపిస్తుంది. దీంట్లో "మువ్వగోపాల", "పునః ప్రతిష్ఠ", "నిగమశర్మ", "నాగార్జున కొండ", "డాక్టర్", "రాధ", "పెద్దన-కృష్ణరాయలు" అనే ఏడు శ్రవ్య నాటికలున్నవి.

"మువ్వగోపాల" నాటికలోని కథ 17వ శతాబ్దానికి సంబంధించినది. దీంట్లో, వరదయ్య అనే పేరుగల క్షేత్రయ్య కథను కాటూరివారు మనోహరంగ రచించారు. క్షేత్రయ్య పదాల్ని కలుపుకుంటూ సాగిన రచన ఇది. ఇది సంగీత రూపకం. రంగాజమ్మ, విజయరాఘవుల పాత్రలను కూడ నాటికలో ప్రవేశ పెట్టటం వల్ల కథకు చారిత్రకమైన విలువ కలిగింది. దీంట్లో క్షేత్రయ్య పొందిన రాజాదరాన్ని కూడ తెలియజేసారు. ఈ రూపకంలో మధురభక్తి భావన సర్వత్రా గుబాళిస్తున్నది. సాని వాడలలో సంస్కారవతులైన మోహనాంగి లాంటి స్త్రీలు, సంగీత సౌందర్య వ్యామోహాలలోపడి ఇల్లు వాకిలి పట్టకుండా తిరిగే యువకులు ఈ నాటికలో మనకు కనిపిస్తారు. ఆనాటి సామాజిక పరిస్థితులకిది దర్పణం. వారవనితలు, కవయిత్రులు కావటం రాజులు వారిని అత్యంతాదరంతో పోషించటం మనం చూడవచ్చు. విజయ రాఘవ నాయకుని ఆస్థానంలో కవయిత్రి రంగాజమ్మ, ఈ విషయాలను ఈ నాటికలో సూచించారు వేంకటేశ్వరరావుగారు. ఇది సంగీత ప్రాముఖ్యం కలిగి ఆనంద ప్రధానమైన నాటిక.

ఈ నాటికలో వరదయ్య నాయకుడు. మోహనాంగి నాయిక. వారిద్దరి మధ్య ప్రణయం దివ్య ప్రణయంగా చిత్రింపబడింది. వరదయ్య మోహనాంగిలో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విశ్వమోహనుని దర్శించాడు. క్షేత్రాల్ని సేవించి ఆత్మ, అనాత్మ వివేకం పొంది క్షేత్రజ్ఞుడైనాడు. తరువాత క్షేత్రయ్యగా పిలువబడ్డాడు. ఇతడు గొప్ప వాగ్గేయ కారుడు.

తెలుగు పలుకుబడులు కాటూరివారి రచనకు సహజాలంకారాలు. "ఆరి నీ తల్లి కడుపు బంగారంగాను" అంటూ నాటిక ప్రారంభమౌతుంది. తల్లి వరదయ్యతో "చేతి కక్కురకు వచ్చిన బిడ్డవు కొత్త గొడ్డు గోదా విచారించు కోకపోతే ఎలా చెప్పు" అంటుంది. ఇవి చక్కటి తెలుగు జాతీయాలు.

అట్లతద్దె పండుగనాడు వారవనితలు తోటల్లో దొడ్లల్లో పెద్ద పెద్ద చెట్లకు ఉయ్యాలలు వేసుకొని ఊగటం, అక్కడ ఊరులోని కుర్రకారంతా మూగటం మొదలైన నాటి సాంఘిక పరిస్థితుల్ని ఈ నాటిక మన కండ్లముందు నిలుపుతుంది.

2. పునః ప్రతిష్ఠ

రెండవ నాటిక "పునఃప్రతిష్ట" ఇందులో ఇతివృత్తం చారిత్రకం. దాయాదుల చేత రాజ్యం పోగొట్టుకున్న మనుమసిద్ధిని, తిక్కన గణపతి దేవుడి సహకారంతో తిరిగి సింహాసన ప్రతిష్ఠితుణ్ణి చేయటం ఇందులో విషయం. ఆనాటి సాంఘిక మత పరిస్థితులు దీంట్లో వివరింపబడ్డవి.

శైవ, వైష్ణవ జైనమతాల సంఘర్షణ, సమన్వయంకోసం హరిహరనాథతత్త్వాన్ని సృష్టించిన తిక్కన కృషి, మొదలైన మత విషయాలు-చోళ సామ్రాజ్యం బలహీనపడటం-వెలనాటి చోడుల, పల్లవుల పొత్తు-పల్లవుల విజృంభణ-కాకతీయ సామ్రాజ్యం దాని విస్తరణ-మనుమసిద్ధి దాయాదుల కలహం - నెల్లూరి సామ్రాజ్యపు కడగండ్లు-తిక్కన రాయబార నైపుణ్యంతో గణపతిదేవుడు మనుమసిద్ధికి బాసటగా నిలవటం-మొదలైన రాజకీయ విశేషాలు ఈ నాటికలో మనం చూడవచ్చు.

జన్నిగదేవుడనే నగర రక్షకుడు, గణపతి దేవుని మంత్రి శివదేవయ్యకు, తిక్కన చేతిలో జైనులు ఓడిపోయిన సందర్భంలో చెప్పిన సమాచారం చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జన్నిగదేవుడు : స్వయంభూ దేవాలయంలో తిక్కన సోమయాజిగారి ధర్మ ప్రవచనము, జైనులు ఓడిపోవటం తమరు వినే ఉంటారు.

శివదేవయ్య : అవును చూచాయగా విన్నాను.

జన్నిగదేవుడు : ఆ రాత్రి నుండి వీరజంగములు నగర మంతటా చెలరేగి పోయి నారు. వారి శివమఠులు పట్టపగ్గాలు లేకుండా వుంది. జైన వసతులన్నీ పెల్లగించి వల్లకాడు చేస్తున్నారు. ఈ ఉపద్రవం, తమతో మనవి చేసి పోదామని వచ్చాను.

శివదేవయ్య : మీరీ లోపల హనుమకొండలో జైనులందరిని కోటలోకి తరలించి జైనాలయాల చెంత కాపుదలగా ఉండండి. అత్యాచారాలు జరుగ కుండా కనిపెట్టి వుండండి. (మువ్వ 52 పే)

పై సంభాషణలో ఆనాటి వీరశైవుల ఆగడాలు, జైనులతో కలహాలేకాక, కాకతీయ రాజుల మత సహనం కూడ తెలియజేయబడింది. కాకతీయులు శైవులై కూడ మిగిలిన మతాల్ని సమానంగా ఆదరించారు.

తిక్కన గణపతి దేవునితో సంభాషిస్తూ

"ఆంధ్ర కర్ణాట ద్రావిడ దేశాలలో, వీర వైష్ణవ వీరశైవాలు, బౌద్ధ జైన ములు పరస్పరం స్పర్ధ వహించి ప్రజలను సంక్షోభ పెడుతున్నవి. పురుషకార హీనమైన సన్యాసము సంయమ మెరుగ వీరావేశము ఆంధ్ర ప్రజలను కర్మ భ్రష్టు లను చేస్తున్నవి........" అన్నాడు.

ఈ సంభాషణలో, ఆనాటి మత పరిస్థితుల్ని పూర్తిగా ప్రతిబింబింప జేశారు వేంకటేశ్వరరావుగారు. ఈ విషయాలు వివరిస్తేగాని తిక్కన ధర్మాద్వైతానికీ, హరి హరనాథ తత్త్వానికీ ప్రాముఖ్యత రాదు. ఇదే కాటూరివారి నాటక నిర్మాణ చాతుర్యం.

ఆనాటి సానివాడల సంగతి కూడ కాటూరివారు వదలి పెట్టలేదు.

తిక్కన శిష్యుడు గురునాథం, మరో శిష్యుడు కేతనతో-
"సానివాడకు వెళ్ళి వచ్చారా ఏమి" అంటాడు.

కేతన :- "సానివాడంటే అది సానివాడ కాదోయ్. అచటి పానక గోష్ఠులు, సంగీత సాహిత్యాలతో పొల్లిపోతూ వుంటాయి." అంటాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆనాడు గౌరవ భంగంలేని సామాన్య విలాసం సానివాడ సందర్శనం. అప్పటి సానివాడలు బూతులు కొంపలు కావు. సాంస్కృతిక కేంద్రాలు. ఈ విషయాన్ని ఒక్క మాటలో చిత్రించారు కాటూరివారు.

తిక్కన శివదేవయ్య సంభాషణలలో, దేశకవితా ప్రసక్తి కూడ వచ్చింది. వారి సంభాషణ చూడండి.

శివదేవయ్య : జైనుల పాలీ గ్రంథాలకు వీరశైవుల దేశ కవిత్వాలకు, ప్రజ తియ్యని నీటికి చేపలవలె ఎగబడుతున్నది................"

తిక్కన : కనుకనే నేను అరణ్య పర్వశేషమలా వదలి, విరాటపర్వాన్ని ఎత్తికొని దేశ కవితా సౌలభ్యాన్ని కూడా సాధించాలని చూస్తు న్నాను. సార్వజనీనమైన ధర్మ విషయంలో కూడ సౌలభ్యం సాధించదగిందే................

ఆంధ్రావళికి మోదం కలిగేటట్లు సులభశైలిలో దేశీయ కవితా ధోరణి మేళవించి రచన సాగించిన తిక్కన కవితా దృక్పథం, మతప్రచారంలో ఆనాడు పాలీ మొదలైన దేశ భాషలు వహించిన పాత్ర, ఇక్కడ మనం ప్రస్ఫుటంగా తెలుసుకోవచ్చు.

అయితే ఇంత మంచి పానకంలో ఒక పుడక. దాన్ని పుణక కూడదను కున్నా చేతికి తగులుతూనే ఉంది.

తిక్కన దీక్షబూని రాచకార్యాలన్నీ కట్టిపెట్టి భారత రచన చేస్తున్నాడు. ఈ లోపల మనుమసిద్ధి రాజ్యానికి శత్రువుల బెడద ముంచుకొని వచ్చింది. ఈ సందర్భంలో గురువుగారిని గురించి తిక్కన శిష్యులు గురునాథం, కేతనల సంభాషణ చూడండి.

గురునాథం : గురువుగారు రాచకార్యాలన్నీ కట్టిపెట్టింది, ఈ మహా కవిత్వ దీక్షావిధి కోసమేకదా! వారికిది హరిహరారాధనమే కాని కేవలం కావ్య రచన కాదు.

గురునాథం మాటలు చాలా గొప్పగా ఉన్నవి. తిక్కన భారతాన్ని కావ్య మని వ్రాయటంలేదు. హరిహరనాథుని కైంకర్యంగా రచన సాగిస్తున్నాడు. ఇది ఎంతో ఉదాత్తమైన భావన. అయితే తరువాత కేతన మాటలతోనే వచ్చింది చిక్కు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కేతన :- కావచ్చునుగాని గంగిరెద్దును అరకకు కట్టి పెట్టితే మాత్రం వాద్య ధ్వని వింటే ఆగుతుందా అందులోనూ తిక్కనమంత్రికి........

(మువ్వ 42 పే.)

ఈ నీచోపమానం లేకుంటా ఉంటే బాగుండేది. ఈ నలుసుకేంగాని "క్షత్రియుడు వాడి తప్పటం అగ్ని వేడితప్పడం వంటిది" లాంటి సూక్తులతో ఈ రచన ఎంతో రమణీయంగా ఉన్నది.

కాటూరివారు ఈ నాటికకు పేరు పెట్టడంలో కూడా ఎంతో నేర్పు ప్రదర్శించారు. పునఃప్రతిష్ఠ అంటే మనుమసిద్ధిని తిరిగి సింహాసన మెక్కించటమే కాదు, భారత రచనంతో వేదధర్మాన్ని ఉద్ధరించటంకూడా. ప్రదర్శన యోగ్యతలో, విషయంలో, శిల్పంలో ఈ నాటిక చాలా ఉన్నత ప్రమాణాలుగలిగి ఉన్నది.

3. నిగమశర్మ

మరొక నాటిక "నిగమశర్మ". రామకృష్ణుని పాండురంగమాహాత్మ్యంలోని కథ ఇది. నిగమశర్మ, నేతిబీరకాయలాంటివాడు. జూదరి, వారాంగనాలోలుడు, పూర్వీకులు సంపాదించిన ఆస్తి వీని చేతిలో కర్పూరంలా హరించుకుపోయింది. నిగమశర్మను చక్కదిద్దుదామని అతని అక్క అత్తింటినుండి వచ్చి తమ్మునికి బుద్ధులు చెప్పింది. వాడు విన్నట్లే విన్నాడు. పశ్చాత్తాపం నటించాడు. ఒకరాత్రి ఆమె నగలుకూడ హరించి ఇల్లువిడిచి పారిపోయాడు. దారిలో దొంగలు కొట్టారు. క్రింద పడిఉన్న నిగమశర్మను ఒక కాపు కొడుకు రక్షించాడు. వీడు చివరకు వాని భార్యనే తీసికొని ఉడాయించాడు. ఆమె పాము కాటుతో మరణించింది. తరువాత ఒక చండాలికను వివాహమాడాడు. అది, దాని పిల్లలు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి కాగా దుఃఖంతో అలమటిస్తూ, పండరిక్షేత్రాన్ని చేరి, నిగమశర్మ మోక్షాన్ని పొందాడు. రామకృష్ణుడు పేరు పెట్టని నిగమశర్మ అక్కకు "సుమతి" అని కాటూరివారు పేరు పెట్టారు.

కాటూరి వారీ కథను చక్కని నాటికగా మలచారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వేశ్యా భవనమే రంగస్థలంగా ఈ నాటిక ప్రారంభమౌతుంది. పాండురంగ మాహాత్మ్యంలోని

"సంధ్యకు ప్రార్థనాంజలి ఘటింపడుగాని
యెరగు నీర్ష్యా కషాయితల కర్థి
నాగమ వాదంబుతా గాదనడుగాని
విట వాదములు తీర్చు వేగిలేచి" (పాండు. అ. 3. ప. 12)

అనే పద్యానికి రూపకల్పన చేస్తూ నిగమశర్మ పాత్రను తీర్చిదిద్దారు కాటూరివారు.

ప్రారంభంలో ఒక వృద్ధ వేశ్య పాడుతుంటుంది :

"సానివారిళ్ళకు సరసాలకొచ్చే
రాజుకొడుకూ తెచ్చె రతనాలహారం
పగడాలపేరిచ్చె బచ్చు పోలయ్య
కందులమూటిచ్చె కాపు గంటయ్య
సోమయాజుల కొడుకు శ్రోత్రియపు బొజుగు
కుండలాలు సానికూతురికి దెచ్చె"

ఈ ఒక్క పాటలో నాటి వేశ్యా వ్యసనాల తీరంతా చెప్పారు కాటూరివారు. తృణమో ఫణమో, ప్రతివాడు భోగపుదేవతకు సమర్పించుకోవలసిందే. అది ఘనత. వార వనితలకు కూడా మణులు మాన్యాలే కావాలనిలేదు. కందులో పెసలో! వచ్చినవాడు తెచ్చినంత, తెచ్చిన దానికి ఇచ్చినంత.

నిగమశర్మ వారవనితల గీత నాట్యాలలో మునిగి తేలటమేకాదు విటుల తగాదాలుకూడ తీరుస్తుంటాడు.

ఈ నాటికలో వృద్ధ వేశ్య-"

"ఎవరు మాధవయ్యా! ఏం తెచ్చావు బావయ్యా ?

మాధవయ్య :- ఓసి నీ బావ వరస పాడుగాను ఇదిగో నల్లకుండ
ముసలిది :- పొడివుండ గుటకపడదు బావయ్యా
మాధవయ్య :- అవునవును మరిచాను ఇదిగో తెల్ల నీళ్ళు........

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వేశ్యవాటికలు వ్యసనాలకు ఎలా నిలయాలో, ఈ సంభాషణ తెలుపుతుంది. నల్లమందు, కల్లు, సారా, ఇదీ ఒకకాలంనాటిది కాదు. అలాంటిచోట్ల అన్నికాలాల్లో ఇదే వాతావరణం. ఇదీ కాటూరివారి కల్పన.

కాటూరివారు పాత్రలకు వ్రాసే సంభాషణలు అతిసహజంగా ఉంటవి. నిగమశర్మ అక్క వచ్చింది. ఆమె, తల్లి వాడి ప్రవర్తననుగురించి కొంతసేపు ముచ్చటించుకున్నారు. వంటకు వేళ మించిపోతున్నది. తల్లి "ఇక చాలుగాని మడిగట్టుకొని ఇంత అత్తెసరు పడెయ్యవే...." అంటుంది కూతురితో.

బ్రాహ్మణుల ఇళ్ళల్లో జరిగే అతి సహజమైన సంభాషణ ఇది. వార్చకుండా తగినంత నీరుపోసి అన్నం వండటానికి, అత్తెసరంటారు.

ఇక కాపు కోడలికి-నిగమశర్మకు కాటూరివారు వ్రాసిన సంభాషణ అద్భుతం. ఒక్కొక్కమాట ఒక రసగుళిక.

నిగమశర్మ :- వదినా! నమ్ము నమ్మకపో, నువ్వు ఆ కవ్వం తిప్పటంచూస్తే నాకు కళ్ళు తిరిగిపోతున్నవి.

రామకృష్ణుని రచనలో కాపు కోడలు, శశికళ—చారుకుచ పంజర — కుదురు పాలిండ్లపై కొంగుజారగ, కొప్పునీడ, ఊరక నవ్వు, చలదాలోలలోచన. బాగానే ఉన్నది. ఇది శ్రవ్య నాటిక. మరి ఈ కాపు కోడలని ఎలా చూపించటం! కాదు ఎలా వినిపించటం ?

ఎలానో కాటూరివారికి తెలుసు -

ఆమె చల్ల చేస్తున్నది. ఈ రోజుల్లోలాగా "చెంబా" ప్రమాణంలో ఉన్న, కవ్వంతో చిలికిలబడి "పాకెట్"పాల మజ్జిగ చేయటంగాదు. పెద్ద చెంబంత కవ్వపుగుత్తి-దానికి అయిదడుగుల పొడవైన కర్ర-ఆరడుగుల చల్ల గుంజ - కవ్వం కర్రను గుంజకోకట్టి ఉంచే రెండు త్రాళ్ళ బంధాలు - చుట్టకుదురు - దానిపై పెరుగు బాన-నిలబడి రెట్టకొద్దీ లాగి మజ్జిగ చేస్తేగాని వెన్న పడదు. ఇది ఒక అరగంట పైన పని. ఇలా మజ్జిగ చేయటానికి ముసలివాళ్ళకు ఓపిక ఉండదు. పిల్లలకు కవ్వం అందదు. ఇక అది పడుచువారికే తగిన పని. చల్ల మోతతోపాటు గాజుల మ్రోత. ఇవి చెవులకు వినిపించి, కాపు కోడలని మన కండ్లముందు నిలపటానికి, వేంకటేశ్వర్రావుగారు వేసిన సెట్టు: తీర్చిన సీను ఇది. కాపుకోడలు మజ్జిగ చేస్తున్నది. ఎదురుగా నిగమశర్మ ఏమన్నాడో విన్నారుగా!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అలాంటి త్రిప్పులాడిని చూస్తే కళ్ళు తిరగవూ! పాండురంగమాహాత్మ్యంలో లాగా ఆమేమన్నా వెకలి మగనాలా? మగడ్ని పొలానికిపంపి సరసానికి తగిన సమయాన్ని ఎన్నుకున్న దిట్ట. రామకృష్ణుని కాపుకోడలికి, తోడుకోడలు ఆమె పిల్లలు, అంతా ఉమ్మడికుటుంబం. చీకటి బడితేగాని నిగమశర్మతో సరసానికి అవకాశం రాదు. కాటూరివారు ఆ బాధ లేకుండా చేశారు. ఆమె, భర్త ఇద్దరే ఇంట్లో, అతడు పొలం వెళ్ళాడు. నిగమశర్మ ఇంట్లో ఉన్నాడు.

స్త్రీ :- (నవ్వుతూ) తిరుగుతై తిరగవూ ? పనీ పాటూలేక, నీడపట్టున కూకుండి, అంచుగట్టు కొత్తుండావులే! కళ్ళు మూసుకొని నోరుతెరు. ఇదుగో ఎన్నముద్ద- అదుగదే ఆ చిలిప్పనులే వద్దంటాను.

నిగమశర్మే కాదు, ఈ డైలాగు విన్న వాళ్ళెవరైనా కళ్లు మూసుకొని నోరు తెరవవలసిందే. అంచుకట్టుకొని రావటం అనేది అద్భుతమైన శబ్దం. గాయం మానటాన్ని అలా అంటారు. నిగమశర్మ దొంగలుచేసిన గాయాలుమాని కోలుకుంటున్నాడు. నీళ్లు అటూ ఇటూ పోకుండా చుట్టూ కట్ట వేయటంకూడ అంచు కట్టటమే! ఆమెచుట్టు నిగమశర్మ వలపుకట్ట కడుతూనే ఉన్నాడు. ఇంతవరకు సామాన్యులు, ఒక మాదిరి పాండిత్యం ఉన్నవాళ్ళు ఆనందిస్తారు. పండితులను చక్కిలిగింతలు పెట్టే మరో అర్థం చూడండి! అంచు అంటే చనుమొన. దీనికి తోడు, ఆమె "అదుగదే ఆ చిలిప్పనులే వద్దంటాను" అనటం! ఇక ఆ ధ్వనిలోఉన్న దృశ్యం మన కళ్ళముందు కవ్విస్తుంది.

నిగమశర్మ :- ఏం చెయ్యమంటావు వదినా ? పంట చేలోకి ఎద్దును తోలి దంటు కొరకవద్దంటే ఊరుకుంటుందా చెప్పు ?

నిగమశర్మ ఎద్దు- అచ్చేసిన ఆంబోతు- ఆమె పంటచేను. అద్భుతమైన ఉపమానం. "పునఃప్రతిష్ఠ"లో తిక్కన విషయంలోపడ్డ అప్పుకి వెయ్యిరెట్లు ఎక్కువ చెల్లించారిక్కడ కాటూరివారు.

స్త్రీ :- (నవ్వుతూ) ఓహో ఈ కాణతనాలు చాలించవ్వాయి! లేకుంటే బుగ్గలు పిసికి బూరెలొండి పెడతాను.

నిగమశర్మ :- అంతకంటె కావలసిందేముంది గాని, వదినా! నిన్నొకటడుగు తానూ-నన్నిక్కడినుంచి వెళ్ళిపొమ్మంటావా! ఉండిపొమ్మంటావా?

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్త్రీ :- నిన్నేవరైరా కట్టేసారా యెల్లకుండా? యేకాపాళా లేకుండా ఒకటే సరాగాలు చెతుర్లూనూ.

నిగమశర్మ : అట్లాదారికిరా మరి.

"ఒంటిపాటెరుగవో ఒయ్యారి వదినా
సయ్యాటలకె ప్రొద్దు జారేను వదినా
కళ్ళనీలాలు పెదవుల్ల ముత్యాలు
ఒలికేను మా వదిన కులుకుతుంటేను"

స్త్రీ : చాల్లే పిల్లాడా, పదాలాడుదుగాని ఆయనొచ్చే యేళయింది. రేపు గంగ జాతరకు పప్పులొండుకోవాలి కూడాను.

నిగమశర్మ : మీరంతా జాతరకెళితే నేనొంటిగా ఉండగలనా ? నువ్వే చెప్పు వదినా

స్త్రీ : పోనీ! నే జతుంటాలే నీకు, సరేనా.

నిగమశర్మ : బలే ఒదినా

"వదిన చెంతను ఉంటె పై కుంఠమున్నట్లె
వదిన లేకుంటె అమవాస చీకట్లె"

స్త్రీ : అమ్మా! ఎంతాశే! (ఇద్దరూ నవ్వుతుంటారు)

ఇలా సంభాషణలు వ్రాయటం అనితరసాధ్యం. "వదినా నిన్నొకటడుగుతాను" అని నిగమశర్మ కొంత వ్యవధానం ఇచ్చి, ఆమె ముఖ కవళికలు చూచి తరువాత సంభాషణ కొనసాగించినట్లు గుర్తుగా రచనలో అయిఫన్‌గుర్తు మనం గమనించవచ్చు.

ఆమె "చాల్లే పిల్లాడా" అని సంబోధిస్తుంది. ఈ సంభాషణ అత్యంత సహజం: చదువుకున్న స్త్రీలు అలాంటి సందర్భాల్లో "ఛ! పొండి" అన్నట్లు, పల్లెల్లో సామాన్య స్త్రీలు, తమకంటె, చిన్న యువకుల్ని ఇలానే అంటారు. ఆమె "అమ్మా ఆశా!" అనటం కూడా ఎంతో సహజంగా ఉన్నది. సహజంగా సరసంగా ఇలాటి సంభాషణలు వ్రాసిన కాటూరి బహుధా ప్రశంసనీయుడు. ఈ సన్నివేశాన్ని వారు చిత్రించిన తీరుకు వ్యామోహపడి, సంభాషణ అంతా ఉదాహరించకుండా ఉండలేకపోయిన, నా అశక్తతకు విచారించటంలేదు.

ఎన్ని చూపించాలో, అన్నీ చూపించి, అశ్లీల ద్వంద్వార్థ ప్రయోగం ఎంత చేయాలో, అంతాచేసికూడ, ఒక శృంగార సన్నివేశాన్ని రక్తి కట్టించలేని నేటి సినిమా దర్శకులు, రచయితలు, దీన్ని ఒకసారి చదివితే బాగుండు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పురుష స్వభావానికి తగ్గట్లు నిగమశర్మ పొంగుపాటు, స్త్రీ స్వభావానికి తగ్గట్లుగా కాపుకోడలి నర్మ గర్భ ప్రసంగం, పాత్రోచితమైన భాష, సన్నివేశ కల్పనం అద్భుతం. వేంకటేశ్వరరావుగారు ప్రబంధ పరమేశ్వరునికి వారసుడు; కవిబ్రహ్మకు అనుచరుడు, అంటే తప్పేముంది !!

4. నాగార్జునకొండ

"నాగార్జున కొండ" అనేది చారిత్రకావలోకనంతో సాగిన మహాక నాటిక. ఇది 1960 మార్చి 15 సారంగి పత్రికలో అచ్చయింది. నాగార్జునుని దగ్గర నుండి నాగార్జున సాగరం వరకు జరిగిన బౌద్ధమత చారిత్రక పరిణామం దీంట్లో సూచింపబడింది. కాలాన్నిబట్టి భాషలో మార్పు చూపించారు వేంకటేశ్వరరావుగారు. శాతవాహన, ఇక్ష్వాకుల కాలంనాటి బౌద్ధ హిందూ మత పరిస్థితులు, రాజులు హిందూ మతాన్ని, రాణులు బౌద్ధమతాన్ని అవలంబించటం, మొదలైన చారిత్రక విశేషాలు దీంట్లో చోటుచేసుకున్నవి. కథారంగం అన్ని భాగాలకు నాగార్జున పర్వత ప్రాంతమే!

ఈ కథ నాలుగు భాగాలుగా సాగింది. ఇవి వేరువేరు కాలాలకు సంబంధించినవి. సూత్రధారుడు వీటిని అనుసంధానం చేశాడు.

ప్రథమభాగంలో, గౌతమీపుత్ర శాతకర్ణి, నాగార్జునాచార్యుడు, నాగబంధునిక ప్రధాన పాత్రలు. ఇది క్రీ.శ॥ 1వ శతాబ్దానికి చెందిన విషయం. బౌద్ధమతం ఆ కాలంలో బాగా ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తున్నది. నాగార్జున పర్వతం దగ్గర బౌద్ధస్తూప నిర్మాణ విషయం ఈ భాగంలో వివరించబడింది. బౌద్ధమత సూక్తులతో కథాప్రారంభం చేసి, ఆ మతాధిక్యతను కాటూరివారు చెప్పకనే చెప్పారు.

రెండవ భాగం ఇక్ష్వాకుల కాలంనాటిది. వాసిష్ఠీపుత్ర శాంతమూలుడు అప్పటిరాజు. ఈ భాగం వేదప్రవచనంతో ప్రారంభమౌతున్నది. అంటే ఈ కాలంలో వైదిక మతానిది పై చెయ్యి అన్నమాట. ఈ రాజు యజ్ఞసూగాది క్రతువులు చేసి బ్రాహ్మణులకు దానాలు చేశాడు. ఈయనను రెండవ శ్రీరామచంద్రప్ర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూర్తిగా ప్రజలు కీర్తించారు. ఈ రాజులు బౌద్ధమతాన్ని కూడ ఆదరించారు. అయితే వేదమతంపైపు మొగ్గు చూపారు. ఆనాటి పరిస్థితులను వివరించే ఈ సంభాషణ చూడండి.

దీక్షితులు : అయితే చయనులా! నాకు తెలియకడుగుతాను. వర్ణాశ్రమ ధర్మ పాలకుడైన మహారాజు యజ్ఞ సదస్సులో, ఈ బోడి బౌద్ధ శ్రమణకులు సిద్ధం కావటం విపరీతంగా లేదూ ?

చయనులు : ఇందులో విపరీతమేమున్నది. ఈ ఇక్ష్వాకు వంశం ఆనాటి శాతవాహన వంశంలాగే సకల ధర్మాలను రక్షిస్తున్నది....

దీక్షితులు : ....నువ్వు చూచావో లేదో! మహారాజు చేసిన దానాలొక ఎత్తు, వారి రాణీవాస స్త్రీలు బౌద్ధారామాలకు చేసిన దానాలొక ఎత్తూను.

దీనినిబట్టి రాజులు వైదిక మతాన్ని, రాణులు బౌద్ధమతాన్ని ఆదరించారని చెప్పవచ్చు. అయితే మతసహనం సర్వత్రా కనిపిస్తున్నది.

మూడవభాగం వీరపురుష దత్తుడు, రాజ్యం పాలించిన 3వ శతాబ్దానికి సంబంధించినది. వీరపురుషదత్తుని కుమారునికి, అనారోగ్యం కలగటం, బ్రాహ్మణులు శివాభిషేకాలు చేయించటం, గుణం కనిపించలేదని, ఆ బాలుణ్ణి తథాగతుని సేవకు రాజు అర్పించటం, వ్యాధి నిదానించటం మొదలైన విషయాలు ఈ భాగంలో వర్ణింపబడినవి. శివస్కందశర్మ, వీరపురుషదత్తుడు ఇందులో ముఖ్యపాత్రలు. ఆ రాజు మితిమీరిన బౌద్ధాభిమానంలో శివలింగాన్ని తన్నటాన్ని, బ్రాహ్మణులను పీడించటాన్ని కాటూరివారు ఇక్కడ చిత్రించారు. వైదికమతం కడగండ్లపాలు కావటం, రాజులు మత సహనం కోల్పోవటం, ఇక్కడ మనం గమనించవలసిన ముఖ్య విషయాలు.

నాలుగవ భాగం 20వ శతాబ్దానికి సంబంధించిన విషయం. బౌద్ధమతం అంతరించటం. ఇటీవల పరిశోధకులు ఆప్రాంతాన్ని త్రవ్వి బౌద్ధ శిల్పాలను వెలికి తీయటం, అక్కడి స్థూపాల శిల్ప చాతుర్యం, మొదలైన విషయాలు ఈ భాగంలో వర్ణింపబడినవి. తరువాత నాగార్జున సాగరం ఆనకట్ట నిర్మాణం సూచింపబడింది.

చివర కృష్ణవేణిపై కమ్మని పాటతో నాటికకు భరతవాక్యం పలికారు. కాటూరివారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

5. డాక్టర్

డాక్టర్ అనేది ఈ పుస్తకంలోని ఏకైక సాంఘిక నాటిక. ఎల్లోపతి డాక్టర్ల దాబు దర్పం విలాస జీవితం, శాస్త్రీయ దృక్పథం పేరుతో ఇతరుల విశ్వాసాలను హేళన చేయటం, చివరకు స్వవిషయం వచ్చేసరికి సామాన్య మానవుడికన్నా ఎక్కువ ఆదుర్దా పడటం ఈ నాటికలో చిత్రించారు కాటూరివారు.

రోగి వెంకట్రావు, అతని తల్లి విశాలాక్షమ్మ, ఎల్లోపతి డాక్టరు ప్రధానంగా వీరి మధ్య సాగుతుంది కథ. వెంకట్రావుకు జబ్బు చేసినపుడు విశాలాక్షమ్మ అభిషేకాలు, వీభూదులు, ఆయుర్వేదవైద్యం వీటిని గురించి తాపత్రయపడుతుంటే, అన్నీ సూపర్‌స్టిషన్లని, పథ్యం అక్కరలేదని, తన వైద్యమే చాలని హేళనగా మాట్లాడతాడు డాక్టరు. వ్యాధి యేమిటో తెలుసుకోవాలని ప్రతి రోగికి, అతడి బంధువులకు ఆదుర్దా వుంటుంది. కొంతమంది డాక్టర్లు, రోగాన్ని చెబితే అధైర్య పడతారనో, మరి కొంతమంది వారికే తెలియకనో! మొత్తానికి ఎక్కువమంది మందుల్ని గురించి తప్ప వ్యాధిని గురించి మాట్లాడరు.

రోగి : డాక్టరుగారూ! అసలేమిటంటారీ బాధ.

డాక్టరు : బాధే అంటారు. మళ్ళీ మాట్లాడితే పెయినంటారు, ఇంకా మీకుసందేహం తీరకపోతే ఎక్స్‌క్రూషియేటింగు పెయినంటారు. సరా!

తల్లి : అదేమిటండీ. సూదిమందిస్తారా యేం?

డాక్టరు : ఎబ్బే సూదిమందు కాదండీ దబ్బనం మందు.

ఇదీ! ఆ డాక్టరు వరస. పూర్వకాలం పెద్దవాళ్ళకేవో నమ్మకాలుంటవి. వాటి వల్ల నిజంగా ఇబ్బంది ఉంటే నచ్చచెప్పటం, లేకపోతే ఉపేక్షించటం. అంతేగాని వారి మనస్సులను నొప్పించే విధంగా ప్రవర్తించటం సంస్కారంగాదు.

చివరకు ఆ డాక్టరుకే జబ్బు చేస్తుంది. తన మందులమీద తనకే నమ్మకం కుదరదు. తోటి డాక్టర్లను నమ్మడు. వీభూది అభిషేకాలకోసం అర్రులు చాస్తాడు. చదువుకున్న ఆయన భార్య సూపర్‌స్టిషనని వీటిని కొట్టేస్తుంది. డాక్టరుకు కోపం వస్తుంది. జాతకాలు—జ్యోతిష్యం—గ్రహదోషాలు ఇవన్నీ ఇప్పుడు డాక్టరుకు కావలసి వచ్చినవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

డాక్టర్ : విన్నావా! శివుడికి అభిషేకం చేయిస్తే మంచిదంటారాయన. అమ్మవారికి శుక్రవారప్పూజ కూడ చేయించమన్నాడు నీచేత.

భార్య : గంగానమ్మకు చద్ది నైవేద్యం అక్కర్లేదుగద! పనిలో పని అది కూడా చేయించుదాం. మళ్ళీ ఆవిణ్ణొదిలి పెడితే ఏమి ఆగ్రహిస్తుందో.

డాక్టరు : మీ చదువుకున్న ఆడవాళ్ళ కొచ్చిన పొయ్యే కాలమే యిది. ఇంత పచ్చి మెటీరియలిజమ్ పనికిరాదు సుమా.

భార్య : (నవ్వుతూ) అది కాదండీ మరీ యింత సూపర్‌స్టిషనై తే యిన్నాళ్ళ వైద్యమెలా చేస్తున్నారంటా!

ఇదీ వరస. చివరకు డాక్టరు విశాలాక్షమ్మకే కబురు పెడతాడు. ఆమె వేంక టేశ్వరస్వామికి భార్యాభర్తలచేత ముడుపు కట్టించి, పూజలు, పునస్కారాలు చేయి స్తుంది. డాక్టరు వ్యాధి నయమవుతుంది.

వెనుకటివాళ్లు ఆధునిక విజ్ఞానాన్ని నమ్ముతున్నారు. ఆధునికులు మాత్రం ప్రాచీన విశ్వాసాల్ని, దైవభక్తిని మూఢాచారాలని కొట్టి పారేస్తున్నారు. మానసిక ఆరోగ్యానికి దైవభక్తీ, శారీరకారోగ్యానికి ఔషధం రెండూ అవసరమే. విశాలా క్షమ్మ మాటల్లో కాటూరివారి సందేశం ఇది.

"వ్యాధి- చేతిలోనూ ఉంది మనసులోనూ ఉంది, శరీరానికి మందు పడాలి; మనస్సుకు భక్తి కుదరాలి."

ఇక ఈ నాటికలో సంభాషణలు ఎంతో హాస్య రసస్ఫోరకంగా ఉన్నవి. కాటూరివారి రచనలలో సున్నితమైన హాస్యం చిప్పిలుతుంది.

వెనుకటి ముసలివాళ్ళు ఇంగ్లీషుపదాల్ని అపభ్రంశంగా ఉచ్చరిస్తుంటారు. అక్కడ హాస్యం పుడుతుంది.

విశాలాక్షమ్మ యూక్లిప్టస్ అనటానికి "యూకిలీసు" అంటుంది. డాక్టరు కాస్తా ఆమె నోటిలోపడి "డాకుటారు" అయినాడు. ఇంజక్షన్ "సూదిమందు"యింది.

హాస్యం సన్నివేశగతంగాను, సంభాషణలోను ఉంటుంది. ఈ నాటికలో సంభాషణ లాధారం చేసికొని హాస్యం వెల్లివిరిసింది. సందర్భాన్నిబట్టి, అన్న ఒక మాట హాస్యం కలిగిస్తుంది. దీన్ని ఇక్కడ వివరించటం కష్టం. అదే మాటను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విడిగా చూస్తే ఏమీ ఉండదు. ఇలాటి రచన ఎవరికి వారు చదివితేనే ఆనందం. ఉదాహరణకు :

డాక్టరుకు జబ్బు చేసినపుడు సిద్ధాంతిగారు, డాక్టరు భార్యను శుక్రవారం పూజలు చెయ్యమని చెబుతాడు.

"వారికి జబ్బేమిటి నేను పూజ చెయ్యటమేమిటి" అంటుందామె.

విశాలాక్షమ్మ "పిచ్చితల్లీ! నీకు కాకపోతే మరెవరికి. భర్తకోసం భార్య, భార్య కోసం భర్తానూ! ఇవ్వాళ పూజ తప్పించుకుంటే మాత్రం రేపింకోటి తప్పుతుందా" అంటుంది.

డాక్టరు భక్తి విశ్వాసాన్నివ్వమని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానంటాడు.

భార్య : "ఇకనేం తాయెత్తు కూడా కట్టించుకోండి. నేను కూడ నమ్మకమైన పని మనిషినివ్వు భగవంతుడా అని ప్రే చేద్దామనుకుంటున్నాను."

ఇలా సున్నితమైన హాస్యంతో సాగే ఈ నాటికలో కాటూరివారు నాటి సాంఘిక పరిస్థితులను కూడా చిత్రించారు. విశాలాక్షమ్మ ఆయవారపు బ్రాహ్మణ్ణి 'అన్నయ్యా' అని పిలవటం, ఆమె డాక్టరింటికివచ్చి నాయనా! తండ్రీ! అంటూ ఆ దంపతుల్ని కొడుకు, కోడలుగా భావించి సహాయం చేయటం, ఆనాటి పల్లె ప్రజలలో ఉన్న అర్థికాంతరాల్ని పరిగణించని అన్యోన్యతకు, ఆత్మీయతకు నిదర్శనం.

6. రాధ

"రాధ" అనేది ముద్దుపళని రాధికాసాంత్వనాన్ని అనుసరిస్తూ వ్రాసిన ఏక పాత్ర సంభాషణ. ఒక విధంగా ఏకపాత్రాభినయం. శ్రవ్యమేకాని, దృశ్యం కాదు కాబట్టి ఏకపాత్ర సంభాషణ అన్నారనుకుంటాను.

రాధ కృష్ణుని మేనత్త. వారి అనుబంధం జగద్విఖ్యాతం. నీల కృష్ణుని మేనమామ కూతురు. ఆమెను కృష్ణునికిచ్చి చిన్ననాడే పెండ్లి చేశారు. ఆమె ఈదేరే దాకా రాధ పెంపకంలోనె పెరిగింది. రాధే వారిద్దరికి శోభనం జరిపించింది. కృష్ణుడు ఇళతోపాటు మామగారింటికి వెళ్ళాడు. రాధ వారిని పంపనైతే పంపిందిగాని, కృష్ణుని ఎడబాటుకు సహించలేకపోయింది. నీళ అసూయతో కృష్ణుణ్ణి రాధ దగ్గరకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాకుండా చేయాలని ప్రయత్నించింది. చిలుక రాయబారాలు, విరహాలు, ఉపాలంభనాలు మామూలే. చివరకు రాధాకృష్ణులు ఏకమైనారు. ఇది రాధికా సాంత్వనంలోని కథ.

ముద్దుపళని రాధికా సాంత్వనం, పెద్దలకు మాత్రమే అన్న పుస్తకం. దాంట్లో ఎక్కడ చూచినా అవధులు మీరిన శృంగారం కనిపిస్తుంది. అది అప్పటి బూతు కావ్యం. ఇప్పుడైతే బ్లూ ఫిలిం. ఆ కావ్యాన్ననుసరించి కాటూరివారు వ్రాసిన "రాధ" రచనలో రసభారం తప్ప, కనీసం కుచభారం కూడ ఎక్కడా కనబడదు. ముద్దుపళని కావ్యం బూతులబుంగ, కాటూరివారి చేతిలో శృంగార కలశంగా మారింది. రాధికాసాంత్వనంలో రాధాకృష్ణుల ప్రేమ ఐహికంగా కనుపిస్తుంది. అక్కడక్కడా రాధ, కృష్ణుని దైవత్వాన్ని స్మరించినా, ఆ భావాలకంత ప్రాముఖ్యం లేదు. కాటూరి వారి రాధాకృష్ణులు, మధురభక్తికి ఆలంబనాలు. అద్వైతమూర్తులు.

కాటూరివారి రచన పూర్తిగా రాధికా సాంత్వనానికి అనుసరణగాదు. దాన్ని ఆధారంగా చేసికొన నిర్మించిన స్వతంత్ర రచన. కొన్నిచోట్ల మూలాన్ని అనుకరించారు. మరికొన్నిచోట్ల స్వతంత్రించారు. మరికొన్నిచోట్ల మెరుగుపెట్టారు.

ఇళవెంట అత్తగారింటికి వెళ్ళిన కృష్ణుణ్ణి తలుచుకుంటూ రాధికాసాంత్వనంలో రాధ ఇలా అంటుంది.

> "కలలోనైనను బాయక
> కలకాలము నున్న విభుడె కసుగాయకునై
> పలచన చేసె నటన్నం
> జెలియా ! మగవారిచనువు చెడ్డదిసుమీ." (రాధికా. అ. 3. ప. 36)

ఇక్కడ ముద్దుపళని ఇళను కసుగాయతో పోల్చింది. కసుగాయ అంటే పనికిరాని పచ్చికాయ.

ఇక కాటూరివారు "పెళ్ళిపోయావా! కృష్ణయ్యా! ఆపెయ్య వెంట దగిలి, వెళ్ళే కవివన్నె కోడెలాగ!....ఆ పసికాపు కన్నెవెంటబడి పోయావా" అనిపించారు రాధచేత. (మువ్వ. పే. 142.)

శబ్ద ప్రయోగంలో కాటూరివారి నైపుణ్యం అమోఘం. పెయ్య పేరు, ఆవు పేరు, కట్టుకారుకొచ్చిన ఆవుదూడని పెయ్య అంటారు. ఒకసారి ఈనిందంటే ఆవే! నీళ అప్పుడే రజస్వలైన పెయ్య, కృష్ణుడు నల్లని కోడెదూడ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇక రాధికా సాంత్వనంలోని కసుగాయ; కాటూరివారి చేతిలో "పసికాపు కన్నె" అయింది.

కసుగాయ అంటే పనికిరాని పచ్చికాయ, లేతపిందె. ఇక "పసికాపుకన్నె" అనే మాటలోని సారస్యం చూద్దాం.

"పసి" అటే "లేత" అని "పశువు" అని అర్థాలున్నవి. "కాపు" అంటే "కాయటం", "కావలి కాయటం" అనే అర్థాలున్నవి. కాపులో అరసున్నా ఉంటే వ్యవసాయదారుడు. కాటూరివారి కాలానికే అరసున్నా లరిగిపోయినవి కాబట్టి ఇక్కడ ఎలా అయినా అర్థం చెప్పుకోవచ్చు.

పసి అంటే పచ్చికాయ. కాపు అంటే కాయటం అనే అర్థం తీసికుంటే, "పసికాపు" అంటే లేతకాపు అని అర్థం. అంటే తొలికాపు! కాకపోతే లేదోటకాపు. లేతకాయ బాగోదుగాని, లేదోటకాయకేం! తొలికాయలు దక్కటంకంటె అదృష్ట మేముంటుంది. ఇళ, కృష్ణుడి దృష్టిలో అలాంటిదే.

ఇక రాధ దృష్టిలో ఇళ "పసికాపు", పశువుల్ని కాసేది, అంటే అనాగరికపు కన్య. కాకపోతే అర్భకురాలు, ఆపైన వ్యవసాయదారుడి కూతురు. ఇంతకు ఇళ ముగ్ధ, రాధ ప్రౌఢ అని భావం.

ముద్దుపళని కసుగాయకంటె కాటూరివారి "పసికాపు కన్నె" నిస్సందేహంగా బాగుంది. కాటూరివారి పదప్రయోగ నైపుణ్యం ఇలా ఉంటుంది.

అయితే ముద్దుపళని కూడ ఒకచోట "పసికాపు పడతి" అని ప్రయోగించింది.

"కసు పసికాఁపు పడంతుల
చను జక్కవ లలరజేయు శౌరి నఖంబుల్." (రాధికా అ. 2, ప. 35)

ఇవికూడ రాధ అన్న మాటలే. ఇక్కడ కృష్ణుడనుభవించేది చక్రవాకాల్లాంటి కుచములున్న చిన్ని గొల్ల పడుచుల్ని. మరి ఇళ! కసుగాయ! రాధ కసి చూచారా! దానికి తగ్గట్లు ముద్దుపళని పదప్రయోగం విశిష్టంగా ఉన్నది.

ఆ కవయిత్రి పదప్రయోగ పైచిత్రి జీర్ణించుకున్న వేంకటేశ్వరరావుగారు, ఇళకు జరిగిన అన్యాయాన్ని సముచిత పద ప్రయోగంతో నివారించారు. జక్కవ చనుల గొల్ల కన్యలలాంటిదే, నీళ కూడ, అని సమర్థించారు. అందుకే నీళను "పసికాపు కన్నె" అన్నారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మహౌకటి చూద్దాం! రాధను పరిత్యజించమని ఇళ కృష్ణుణ్ణి కోరింది. ఆ సంగతి తెలిసిన రాధ ఇళను దూషిస్తూ రాధికా సాంత్వనంలో—

"విను వెన్నుకు బండ్లవచ్చు వితమాయెగదే" అన్నది.

(రాధికా. ఆ. 3. ప. 16)

ఇక కాటూరివారా సందర్భంలో "ఇంతలో నీ అరచేతికి పండ్లు వచ్చినట్లు కళ్ళకు పొరలు గ్రమ్మవలెనా" అని రాధతో అనిపించారు. (ముద్దు. పే. 146)

ఒకదానిని మించి మహౌకటి, రెండూ ఔచిత్య సంఘటితాలే. ముద్దుపళని వీపుకు పండ్లు తేవటం బాగోలేదని, కాటూరివారు అరచేతికి పండ్లు తెచ్చారని అనుకోకూడదు.

పండ్లు అంటే ఫలాలు, దంతాలు అని రెండర్థాలున్నవి. ముద్దుపళని విషయంలో పండ్లు అంటే దంతాలే! మనకంటే చిన్నవారిమీద వాత్సల్యాన్ని ప్రదర్శించేటప్పుడు, వాళ్ళ తల, వీపు నిమరటం సర్వసాధారణం. వెన్ను తట్టటం అంటే ధైర్యం చెప్పటంలాగా వెన్ను నిమరటమంటే వాత్సల్యం చూపించటం అనే భావం స్ఫురిస్తుంది. రాధ నీళపై అలానే వాత్సల్యం చూపించింది. ఆ వాత్సల్యమే కృష్ణుణ్ణి ఆమెకు దూరంచేసింది. ఇది వీపు నిమురబోతే, వీపు చేతిని కొరికినట్లు లేదూ! అదే వెన్నుకు పండ్లు రావటమంటే. ఈ మాటలనటానికి ముందు "నీశెంత దాని బిసాదెంత! నా సౌందర్యం, నా నేర్పు, నా సంగీతం, నా నాట్యం ముందు అదెంతా!" అంటూ రాధ పలికిన మాటల్లో కృష్ణుడు నీళవశమైనాడన్న ఉక్రోషం, ఈర్ష్య వ్యక్తమౌతున్నది. ఇక్కడ రాధ పరాధీనమైన పతికోసం పరితపించే సామాన్య స్త్రీ.

కాటూరివారి రాధ, కృష్ణ తత్వాన్ని తెలుసుకున్న అద్వైతమూర్తి. ఆమె మాటలు చాలా లోతైనవి. ఆమె మాటల పూర్వాపరాలు చూడండి.

"సత్యభామా జాంబవతులకంటే అధికురాలవు కావుగదే నీవు. ఈ రాధతో పే నీకు వంతులటే పెట్టిపిల్లా! ఇంతలోనే నీ అరచేతికి పండ్లువచ్చినట్లు, కళ్ళకు పొరలు గ్రమ్మవలెనా! మూడులోకాలకు పట్టుపడని వెన్నదొంగ నీ కన్నెవయసుకే, నీ కసిగాటు వలపులకే దక్కునటే!"

ఇది రాధ సంభాషణ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇక్కడ పండ్లు అంటే ఫలాలని అర్థం. అరచేతికి పండ్లురావటం అంటే, ఆసించిన అనుభవం గుప్పిట్లో దొరకటం. "మూడు లోకాలకూ కూడా పట్ట శక్యం గాని కృష్ణుడు నీ అరచేతిలో చిక్కిన పండనుకుంటున్నావా! గుటుక్కున మ్రింగ డానికి. ఎంత పెర్రిదానివే" అని రాధ మందలింపు. ఇక్కడ రాధలో కృష్ణతత్త్వాన్ని గ్రహించిన దివ్యప్రేమ మనకు దర్శనమిస్తుంది.

కాటూరివారు ముద్దుపళనిని అనుసరించినట్లే అనుసరించి, ఇక్కడ అధిగ మించారు.

కాటూరివారు స్వతంత్ర ప్రవృత్తి గలవారు. ఒకర్ని అనుసరించటం ఆయనకు అంతగా ఇష్టముండదు. అనుసరించినట్లు కనబడినా ఏదో కొంత మార్పు చేయక మానరు.

ఇళకు కృష్ణుణ్ణి అప్పగించినందుకు వాపోతూ రాధికా సాంత్వనంలో రాధ బాధ చూడండి.

"సొమ్ములియ్యవచ్చు సమ్మద మియవచ్చు
నియ్యరాని ప్రాణ మియ్యవచ్చు
దనదు విభుని వేఱు తరుణి చేతికినిచ్చి
తాళవశమె యెట్టి దానికైన" (రాధ అ. 1 ప. 74)

ఈ సందర్భంలో కాటూరివారు స్వల్పంగా మార్చారు.

"లోకంలో కాంతలు కాంతులకు తనువిస్తారు - మనసిస్తారు, అంతేకాని కాంతుణ్ణే, మరో కాంతకు ధారపోసి నావలె వలపోసే వారుందురటనే"

(మువ్వ పే. 145)

అక్కడ ముద్దుపళని రచన సమయోచితంగా ఉంది. "మరో స్త్రీకి సొమ్ము లివ్వవచ్చు. "సమ్మద" అంటే బహుమానం, "సమ్మదము" అంటే సంతోషం, ఇవీ ఇవ్వవచ్చు. చివరకు ప్రాణంకూడా ఇవ్వవచ్చు, భర్త నిస్తారా?" అంటుంది రాధికా సాంత్వనంలోని రాధ.

కాటూరివారి రాధ "భర్తకు మనసిస్తారు తనువిస్తారేకాని, భర్తనే మరెవ్వ రైనా ఇస్తారా" అంటుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రస్తుత సమస్య ఒక స్త్రీ మగానికెకు ఏమి ఇవ్వవచ్చు, ఏమి ఇవ్వ కూడదు, అనేదేకాని, భర్తకు ఏమివ్వాలనేది కాదు. మూలం జోలికిపోకపోతే కాటూరివారి రచన బాగున్నది.

రాధ పాత్ర చాలా విశిష్టమైనది. ఆమె సర్వస్వం కృష్ణునికే అర్పించి మిగిలిన అన్ని బంధాలు బాంధవ్యాలు త్రెంచుకున్నది.

> ఏడుదు బంధుల; మగనిన్;
> ఏడుదు ధనధాన్యగేహ విభవము లెల్లన్
> ఏడుదు ప్రాణము లొడలన్;
> ఏడంగా జాల హరిని వేయననేలా? (రాధికా అ. 2. ప 68)

కృష్ణుని ప్రేమకోసం రాధ ఎన్నో అవమానాలు భరించింది. కృష్ణుడుమాత్రం ఆమెను మరచి ఇళతో కులుకుతున్నాడు. ఆ ధూర్త గోపాలుడితో రాధ విరసోక్తులు చూడండి.

> గోముఖ వ్యాఘ్రమై గుదిగొను మాయత్త
> వదినగారికి మారు పలుకరాదు
> మగడైతె యేవేళ మండుచునుండును
> మామగారంతకు మంటమారి
> పెదబావగారైతె బెబ్బులివలె దూకు
> చినబావ చేకత్తి పెట్టడవల
> నిరుగు పొరుగు వారలే యమదూతలు
> తోడి కోడలి కెదురాడ గూడ
>
> దన్నదమ్ములు గన మేకవన్నె పులులు
> సొరిది, నిందజి కనుగట్టి సున్నపెట్టి
> నేను నినుజేర, నీవందు దానిగోర
> బ్రతుకు బాగాయ ధూర్తగోపాలరాయ (రాధికా అ. 4. ప. 81)

ఇలా రెండు పద్యాలల్లో ముద్దుపళని వ్యక్తంచేసిన భావాల్ని కాటూరివారు మూడు పంక్తులలో అంత సమర్థవంతంగానూ చెప్పారు. అనుకున్న ఒక్క భావాన్ని చెప్పటానికే సరయినపదం కోసం వెదుక్కోవాలి. అలాంటిది అనేక భావాల్ని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యక్తీకరించగలిగిన పదాలు కాటూరివారి కలంలోనుంచి జాలువారుతుంటవి. వారి భావాల్ని ఎలా వ్యక్తం చేశారో చూడండి.

"తెగుదారినై మగణ్ణి, అత్తమామలను, ఈలువును, ఇలువరసను పోనాడి, మాధవుని వలపే నాకు సర్వము అనుకొన్నాను. అనుకొన్నందుకు నా బ్రతుకిలా పదట గలియవలెనా................ఇంతలు సేయ తెగించిన ఆ ధూర్తుని ఎంతని తెగడుదునే" (ముద్దు పే. 145)

ముద్దుపళని - రాధ ఎవరెవరితో బాధలుపడ్డదో, ఎవర్ని వదలిపెట్టిందో పెద్ద లిస్టే ఇచ్చింది. కాటూరివారు - అత్తను, మామను, మగణ్ణి తృణీకరించినట్లు చెప్పారు. ఇదీ చాలు, అంతా చెప్పినట్లే. "మొన్న గాలికి గడ్డపారలు కొట్టుకొని పోయినవి" అన్నప్పుడు ఆకులుకూడ కొట్టుకొని పోయినవని చెప్పాలా? మొగుడికి, అత్తామామకే దిక్కు లేకపోతే తోడికోడలు, బావ - వారి సంగతి చెప్పేదేముంది?

ఇక - ఈలువు - ఇలువరస. రెండుమాటలతో ముద్దుపళని చెప్పని విషయాల్నికూడ కాటూరివారు చెప్పారు. "ఈలువు" అంటే పాతివ్రత్యము - మానము - ధైర్యము - కులాచారము - మనస్సు - సద్వర్తనము ఇన్ని అర్థాలున్నవి, ఇక "ఇలువరస" అంటే వంశానుక్రమము, కులమర్యాద, పాతివ్రత్యము, అభిమానము, ఇన్ని అర్థాలు.

ఇలువరస పుట్టింటికి సంబంధించింది. వంశాచారం మెట్టినింటిది. కులాచారం యాదవకులానికి సంబంధించినది. పాతివ్రత్యం వ్యక్తికి సంబంధించినది. మనసు, జీవి ఉనికికే సంబంధించిన విషయం. ఇక మిగిలిందేముంది. ఏమైనా సమర్పించవచ్చుగాని, మనస్సును సమర్పించటం ఒక్క యోగులకే సాధ్యం. మరి రాధను కాటూరివారు భౌతిక పరిధినుంచి సుమారం నడిపించి ఆధ్యాత్మికపు అందలాన్నెక్కించారు.

రాధికా సాంత్వనంలో ముద్దుపళని సృష్టించిన రాధ మనసు నిరంతరం రెండు విధాలుగా సంచరిస్తుంటుంది. కాసేపు కృష్ణుని అలౌకిక దివ్యసౌందర్యాన్ని భావించి ఆత్మానందానుభూతిని పొందుతుంది. మరి కాసేపు కృష్ణుని భౌతిక సౌందర్యం దర్శించి శృంగారానుభవం కోసం వెంపర్లాడుతుంది. రాధ దివ్యభావన చూడండి,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"దొరకునా నెమ్మేను పరవశమందంగ
వటపత్రశాయి కౌగిటమెలంగ" (రాధికా అ. 2, ప. 23)

"ముజ్జగంబులు వెన్నుని బొజ్జకున్న
తెఱగు వివరించు దారి నా ద్రివళులమరు" (రాధికా అ. 2. ప. 33)

మరి కొన్నిచోట్ల భౌతికవాంఛలతో కలత చెందుతుంటుంది.

"ఆనడ లామెఱుంగు లొడ లాకవు నందను"

"మాటలు ముద్దుపద్దులును మక్కువ పెక్కులు మ్రొక్కుసొక్కులున్
గాటపు కౌగిలింతలు - వగల్ గిలిగింతల మీటు వింతలున్
మాటి మాటికి న్గవయు మాలిమి...." (రాధికా అ. 2, ప. 59)

"హరిపేరురము జూచినంత జన్గుబ్బలు
సిగ్గుమాలిన రైక చిటులనుబ్బు" (అ. 2, ప. 66)

ఇలా ఎన్నో ఆధ్యాత్మిక భౌతిక భావాల సమ్మేళనం ముద్దుపళని రాధ.

ఇక కాటూరి వారి విషయంలో రాధ భౌతికభావాల్ని దివ్యశృంగార భావాలల్లో లీనంచేసి ఆమెను అద్వైతమూర్తిగా తీర్చిదిద్దారు. వారు రాధచేత పలికించిన మాటలు చూడండి.

"ఒరులుచూస్తే దృష్టి తగిలీనని నా నల్లనయ్యను పైట చెరగులో దాచుకున్నాను. అమ్మలక్కలకు మాలిమయ్యాడని నా గాగరాబొందుకు కట్టి వేసుకున్నాను........చిట్టి చేతులుచాచి నన్నలుముకపోతూ నా దేహాన్ని పవిత్రం చేసిన వల్లభుడు"........ (మువ్వ పే. 143)

"నా తీరుపులో నేరుపులో పెరిగిన కోదెవయసు కృష్ణమ్మ చిలిపికన్నుల సొలపునవ్వుల, నా దేహాన్ని ఆత్మను తమవంకకు చేదికొంటూ ఉంటే"....

(మువ్వ పే. 144)

"తాను రెప్పవేయక, నన్ను వేయనీయక నా కౌగిట కరిగిపోయే రాజగోపాలుడు"

ఇలా ఆమె భౌతికభావాల్ని చిత్రించిన కాటూరివారు, కృష్ణణ్ణి ఆమె ఆదిదేవునిగా భావించినట్లుకూడా రచించారు.

"నన్నేలుకొనుచే పై కుంతంగా పెంచుకొనే సామి"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"రాధను కృష్ణుడే ఎరుగు - కృష్ణుణ్ణి రాధే ఎరుగును. మా రసమయవిహారం ఎరిగినవారికే ఎరుక"

ఇలా సాగిన ఈ రచనలో రాధ ఆధ్యాత్మికభావన తొంగిచూస్తున్నది. ముద్దుపళని రచనలో వాచ్యంగాఉన్న ఇలాటి భావాలు కాటూరివారి రచనలో ధ్వనించినవి.

ఈ నాటిక ముగింపు చాలా విశిష్టంగా ఉన్నది.

"యదునాథా! నిన్ను పాయనూలేను, పట్టనూలేనురా! నీవే యీ చలచిత్త నేలుకోగదరా! దామోదరా! రాధా మోహనా! నాలో సకలలోకాలు సుఖించెగదరా! ఏదీ కనులు మూత పడకమున్నే నిన్ను నాలో దాచుకొందురా! మాధవా! రమాధవా! రాధా........"

ఇక్కడ రాధ, కృష్ణునిలో లీనమైపోయింది. కృష్ణునిలోఉన్న సకలలోకాలు ఆమెలోను ఉన్నవి. వారు అద్వైతమూర్తులు. ఇదే కాటూరివారి రచనలోని విశిష్టత.

రాధ కృష్ణుని ప్రేమను శంకిస్తూ

"నీవన్నీ కల్లమాటలే—జానా! నాలుకతో ముక్కంటుకో నమ్ముతాను" అంటుంది. ఇలాటి మాటలు చిన్న పిల్లలంటారు. ఇది తెలుగు పలుకుబడి. పైగా కృష్ణుని కౌగిలిలో రాధ పసిపిల్లే. కొందరు భావిస్తున్నట్లు వారి ప్రేమ కామదూషితం కాదని, పసి పిల్లలప్రేమలాగా పవిత్రమని చెప్పటానికే వెంకటేశ్వరరావుగారు రాధ కలాటి సంభాషణ వ్రాశారు. రాధాకృష్ణులు ప్రకృతి, పురుషులు.

7. పెద్దన - కృష్ణరాయలు

"పెద్దన-కృష్ణరాయలు" ఇది స్వర్గ సమావేశం. స్వర్గంలో వారిద్దరు కలుస్తారు. వారి సంభాషణలో రాయల తరువాత విజయనగర పరిస్థితులు పొందు పరచబడ్డవి. తిమ్మరుసుపై రాజకుమార హత్యానేరం మోపి కన్నులు తీయించిన కథ రాయలవారికి సంబంధించినది కాదని, రాయల మరణానంతరం జరిగిందని కాటూరి వారు దీంట్లో చిత్రించారు.

రాయల పెద్దనల సంభాషణతో నడిచే ఈ నాటికలో, ఆముక్త మాల్యద, మను చరిత్రల కవితా విశేషాలు, మనుచరిత్ర అవతారికలోని పద్యాలను, రాయలు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆముక్త మాల్యద అవతారికలో స్వీకరించటం మొదలైన విషయాలు ప్రస్తావింప బడినవి.

పింగళి సూరన, భట్టుమూర్తి, తెనాలి రామకృష్ణుడు ఈ ముగ్గురూ అష్టదిగ్గజాలల్లో లేరనే వాదాన్ని పరాస్తం చేస్తూ, వారు పిన్నవారని రాయల కాలంలో ఆస్థానానికి వచ్చి పోతున్న బాలకవులని వీరు నిర్ధారించారు.

చివర ఈ నాటిక సందేశంలో కాటూరివారి గాంధేయవాదం కనుపిస్తుంది. రాయలు, తాను యుద్ధాలుచేసి హిందూ ధర్మాన్ని ప్రతిష్ఠించటంలో లోపం ఉన్నదని, అందువల్లనే తన తదనంతరం రాజ్యం ఛిన్నాభిన్నమైందని, అశోక చక్రవర్తిలాగా ప్రేమబలంతో అంతర్బహిశ్శత్రువులను జయించి ధర్మరాజ్యాన్ని స్థాపించగలమా! అనే ఊహ వస్తున్నదని పలుకుతాడు.

పెద్దన "అటువంటి పుణ్యకాలం వచ్చి భూమిపై స్వర్గం అవతరించినప్పుడు దాన్ని కీర్తించే భాగ్యం అస్మదాదులకు కూడా కలుగుతుందేమో! నా ప్రభువును కథానాయకుని చేసి ఆ శాంత మహాభారతం రచించే పుణ్యం కోసం నేనూ ఎదురు చూస్తాను." అంటాడు.

ముగింపులో కాటూరివారు తన ఆదర్శభావనను చక్కగా అందించారు. భారతదేశానికి మనం కోరవలసింది, రాయలనాటి కళా, కవితా పోషణలతో సుఖ శాంతులు వెల్లివిరిసిన స్వర్ణ యుగాన్ని- కానీ దాంట్లో యుద్ధాల్ని మాత్రం మినహాయించాలి. అశోకుడి కాలంనాటి యుద్ధంలేని సమాజాన్ని, ప్రేమే మతమై వెల్లివిరిసే రాజ్యాన్ని వారు కోరుతున్నారు. అది మరేదో కాదు గాంధేయవాదం పునాదిగా నిర్మింపబడే భారతదేశం.

ఈ నాటికలో రెండే పాత్రలుండడం కూడ ఒక ప్రత్యేకత. ఒక ప్రయోగం.

కాటూరివారి రచనల్లో చమత్కారం, సంప్రదాయ ప్రీతి, సామాజిక స్పృహ, గాంధేయవాదం సర్వే సర్వత్రా గుబాళించే సౌరభాలు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

8. శ్రీనివాస కల్యాణం

శ్రీనివాస కల్యాణం కాటూరి వారు రచించిన యక్షగానం. గీత, నృత్యాభినయాల సమ్మేళనమే ఈ ప్రక్రియ. దీంట్లో ఇతివృత్తం ఏదైనా స్వీకరించవచ్చు. రచనా ప్రక్రియ దృశ్యంగాని, శ్రవ్యంగాని, కావచ్చు. రేడియోలో ప్రసారమైనది కనుక, శ్రవ్య యక్షగానంగా శ్రీనివాస కల్యాణాన్ని మనం చెప్పవచ్చును.

గీతం రాగాన్ని ఆశ్రయించిన వాచికాభినయం, నృత్యం లయ, తాళాలను ఆశ్రయించిన ఆంగికాభినయం, ఆహార్యం కొంత ఉండనే ఉంటుంది. ఈ యక్షగానంలో కథకుడు, సూత్రధారుడు, కథను నడిపారు. అక్కడక్కడ శ్రీనివాస, లక్ష్మి, బ్రహ్మ, వరాహదేవుల పాత్రలు స్వయంగా సంభాషణ సాగించినవి. అంటే పాత్రారోపమున్నదన్నమాట. అందువలన దీనిని యక్షగాన రూపకం అనవచ్చు.

దీంట్లో కథ అందరకు తెలిసిందే. కశ్యప, అత్రి, భరద్వాజాది ఋషులు పంపగా, త్రిమూర్తులలో యజ్ఞ ఫలార్హు దెవరో తెలిసికొనటానికి భృగు మహర్షి, ముందు బ్రహ్మలోకానికి వెళ్లాడు. శారదతో సరస సల్లాపాలాడుతున్న బ్రహ్మ హఠాత్తుగా వచ్చిన ఋషిని చూచి మొగం ముడుచుకున్నాడు. రజోగుణ ప్రధానుడైన బ్రహ్మ యజ్ఞ ఫలానికి అర్హుడుగాడని భావించి, తనను నిర్లక్ష్యం చేసినందుకు భూమిమీద ఆలయం లేకుండా పోవాలని శపించి, భృగు మహర్షి కైలాసం వెళ్ళాడు. అక్కడా ఇదే పరిస్థితి. శివుడు, పార్వతి ఏకాంతంలో ఉన్నారు. చెప్పకుండా లోపలికి జొరబడ్డ ఋషిని చూచి పార్వతి సిగ్గుపడింది. శివుడు కోపగించాడు. ఈశ్వరునికి శరీరపూజ లేకుండా శపించి, తమోగుణ ప్రధానుడైన ఇతడు కూడ యజ్ఞఫలానికి అనర్హుడంటూ, ఋషి వైకుంఠం ప్రవేశించాడు. అక్కడ నారాయణుడు లక్ష్మీదేవిని వక్షాన ధరించి నిద్రిస్తున్నాడు, తనను గౌరవించలేదని ఆగ్రహించిన భృగు మహర్షి విష్ణు వక్షాన పాద తాడనం చేశాడు. కళ్లు తెరచిన విష్ణువు ఋషికి నమస్కరించి అర్ఘ్య పాద్యాదులతో పూజించి "ఏమి ఆనతి" అని అడిగాడు. విష్ణువు శాంత చిత్తానికి భృగుడు సంతోషించి, ఇతడే సత్వ గుణశాలి అని, యజ్ఞ ఫలానికి అర్హుడు ఇతడేనని నిశ్చయించుకొని, తన ప్రవర్తనకు తానే సిగ్గుపడి స్వామిని పూజించి భూలోకానికి తరలివెళ్ళాడు. కాని భృగు పాద తాడనం చేత అవమానం పొందిన లక్ష్మి, ఆ చేష్టను ఆమోదించిన విష్ణువును వదలి, భూలోకం లోని కొల్లా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పురానికి వచ్చింది. అమెను పెదకుతు విష్ణువు కూడ భూలోకానికి వచ్చాడు. వరాహ గిరిపై సంచరిస్తున్న నారాయణుడు, ఆకాశరాజు కుమార్తె పద్మావతినిచూచి వరించటం, వకుళాదేవి సహకారంతో పద్మావతీ శ్రీనివాసుల కల్యాణం జరగటం ఇందలి కథ.

కందార్థాలు, ద్విపదలు, సీసాలు, వృత్తాలు, దరువులతో యక్షగాన సంప్రదాయం ప్రకారం సాగిన రచన ఇది. కథలో పెద్ద మార్పులేవీలేవు. రచన పాఠటానికి అనుగుణంగా రసవత్తరంగా సాగింది.

కాటూరి వారి వర్ణనలలో, ఉపమానాలలో, సన్నివేశ కల్పనలలో గ్రామీణ వాతావరణం తొంగిచూస్తుంటుంది. విష్ణువు వరాహ గిరిపై పుట్టలో పరున్నాడు. ఆయనను సేవించటానికి బ్రహ్మ ఆవుగా, శివుడు దూడగా, లక్ష్మి గొల్లపడుచుగా వచ్చి, ఆవును, దూడను, చోళరాజుకమ్మారు. ఆ ఆవు ప్రతిరోజు తన పాలను పుట్టలోని నారాయణ మూర్తికి ధారపోస్తున్నది. యజమాని ఆవుపొదుగులో పాలు లేకపోవటం గ్రహించి, కాపరిని మందలించగా, వాడు ఆవుచర్యను గమనించి దాన్ని తిట్టే సందర్భం చూడండి.

"తెల్లమాయె దీని యాగడమ్ము నాపయిం
దప్పుపెట్టె ముచ్చుకాన! తప్పిపో నేర్తువే
ఔనె గోవు కాన,"................. (పే. 17)

"కాన" అనేది చక్కటి తెనుగు పలుకుబడి. ప్రేమకు, క్రోధానికి ఉపయోగపడే ఒకే మాట ఇది. చిన్న పిల్లల్ని "ముండకాన" అని "ఛడవకాన" అని ముద్దుగా అనటం మనం వింటుంటాం. నీటినే కోపంలో తిట్లుగా కూడ వాడుతుంటారు. ఇక్కడ దూషణగా కాటూరి వారు "కాన" అనే పదాన్ని ఉపయోగించారు.

"ఎల్లి"అనే శబ్దం కూడ అలాటిదే. శ్రీనివాసుడు "ఎల్లి వివాహం కదా" అంటాడు. ఎల్లి అంటే రేపు. ఎల్లి మాటను అంతగా వాడకపోయినా, ఎల్లుండి అనే మాటను మనం నిత్యం వాడుతూనే ఉన్నాం.

గిత్త కన్నుల శ్రీనివాసుడనటం కూడ క్రొత్త పలుకుబడి.

"గిత్త కన్నుల శ్రీనివాసుడు డోయ వేసాన పెడలె" (26. పే)

కోడెదూడను ఉపమానంగా చెప్పటం మామూలే. కాని దాని కండ్లను ఉపమానంగా స్వీకరించటంలోనె ప్రత్యేకత ఉన్నది. కోడె కన్నులవంటి కన్నులు గల శ్రీనివాసుడని దీనిభావం. మృగాక్షి, హరిమధ్య, లాంటి సంస్కృత శబ్దాలకంటె

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అందమైన శబ్దమిది. శ్రీనివాసునికి—కోడెకు! అతని కన్నులకు—కోడెకన్నులకు! సంపూర్ణంగా సాదృశ్యం ఉండటమే ఇక్కడి విశిష్టత. పల్లెటూళ్ళల్లో బాగా బలిసిన కోడెల చూపులను చూస్తే ఈ ఉపమాన సారస్యం తెలుస్తుంది. ఆ కోర చూపుల్లో పొగరు, ఠీవి చూచితీరవలసిందే. గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరిగిన కాటూరి వారికి ఇలాటి ఉపమానాలు కూర్చటంలో మక్కువ ఎక్కువ. ఉపమానాలేకాదు, అనేకమైన గ్రామీణ విషయాలు వీరి రచనలో చోటు చేసుకుంటవి.

శ్రీనివాసుడు తన వివాహానికి ఆహ్వానిస్తూ "అన్నా! వరాహదేవా! ఈ పెండ్లికి మీరే పెద్దలై భూదేవి సమేతంగా విజయం చేసి మమ్మ ఆశీర్వదించాలి" అన్నాడు.

వరాహ దేవుడు "నాయనా! నీవొక ఇంటి వాడవు కావటం సంతోషం. మరి ఇక్కడ ఈ క్షేత్రమంతా పంటసుఖం తిరిగి ఉంది. కనుక ఇల్లు కదలటం పడదు ...." అన్నాడు.

తిరుపతి కొండలపైన పంట, వరాహదేవుని సంగతి అలాఉంచి వ్యవసాయ దారులకు పంట కాలం ఇలాటిదే, కంకులు వేసింది మొదలు నూర్పిడిదాకా, అన్న పెళ్లైనా, చెల్లెలు పెళ్లైనా, వారు ఇల్లు కదలరు. ఈ గ్రామీణ రైతాంగ లక్షణాన్ని కాటూరివారిక్కడ ప్రవేశ పెట్టారు.

ఆవు నారాయణుడున్న పుట్టలో, పాలు వర్షిస్తున్నప్పుడు గోపాలుడు దాన్ని కొట్టబోగా, శ్రీనివాసునికి తగలటం. గొడ్డలి దెబ్బకు రక్తం చిమ్మిన శ్రీనివాసుణ్ణి చూచి గొల్ల పడిపోవటం జరిగింది. ఇదంతా చూచి ఆవు పరుగెత్తుకుంటూ వస్తున్నది. అక్కడ కాటూరివారి శబ్ద ప్రయోగం చూడండి.

"ఆ గోవు, అంబే అని అడలుకొను, మట్ట ఎగబట్టి, ఒక్క పరుగున చోళ రాజు సన్నిధిలో పోయి పడింది."

(పే. 18)

మట్ట ఎగబట్టటమనే మాట, పల్లె జీవితంతో ప్రమేయం లేనివారికి అర్థం కాదు. మట్ట అంటే ఆవు మొదలైన వాటి తోక అని అర్థం. కొబ్బరి, తాటి మట్టల్లాగా, మొదలు లావుగా చివర సన్నగా తోక ఉండటంవల్ల, ఈ శబ్దం వాడుకలోకి వచ్చి ఉండవచ్చు. ఆవులు, కోడెలు మొదలైనవి ఉత్సాహ ఉద్వేగాలు పొందినపుడు తోక మొదలునుండి చివరిదాకా ఒంటికి అంటకుండా ఎత్తి పరుగెత్తుతుంటవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దీర్ఘాపేక్షింతి, నిశ్చేష్టితత్వాన్ని పొందినపుడు తోక రెండుకాళ్ళ సందుకు ముడుచు కుంటవి. ఎవరైనా ఉత్సాహంగా ఉద్వేగంగా పరుగెత్తుకొని వస్తుంటే "వీడు తోక ఎత్తాడని, తోకమట్ట ఎగబట్టి పరుగెత్తుకొస్తున్నాడని, నిరాశతో వెనుదిరిగితే తోక ముడిచాడని, తోకమట్ట జారిందని" అనటం పల్లె ప్రజల నానుడులు.

కాటూరివారి రచన ఏదైనా, ధ్వని చమత్కారాలు పుష్కలంగా ఉంటవి. శ్రీనివాసుడు ఎరుకలసానిగా చెప్పిన సోదీ చూడండి.

"తెరల మరుగున దాగు ఎరుక
మరపు మడతల దోగు ఎరుక
ఎరుక జెప్పేనమ్మ ఎరుక"

నారాయణుడు చెప్పే సోదీ సామాన్యం కాదుగదా. జన్మాంతర సంస్కారాలను, స్మృతులనూ వెల్లడించే ఎరుక అది.

అలాగే మంగళస్నానానికి రమ్మని ఈశ్వరుడు పిలిచినపుడు శ్రీనివాసుడు "సిరిలేని పెండ్లి నేనొల్లను" అన్నాడు. ఇక్కడ లక్ష్మీదేవి లేని పెండ్లి నాకక్కర్లేదని అర్థం వచ్చినా, ఆ కాలంలో అప్పుడప్పుడే ముదురుతున్న కట్నాల పిచ్చి గల పెండ్లి కొడుకులను కూడ ఈ మాటలు గుర్తు చేస్తున్నవి.

ఇక ఒకటి రెండు చమత్కారాలు : శ్రీనివాసుని వివాహానికి దేవతలు పనులు చేసిన తీరు కాటూరివారు ఎలా వర్ణించారో చూడండి.

"పిలువ నేగెను చుట్టముల షణ్ముఖుడు, సమా
గతులను మదనుడు గారవించె
వరుణుండు నీళ్ల కావడి భుజమ్మున బూనె
పాచకత్వమ్మూనె పావకుండు
అనిలుండు గంధమాల్యమ్ములు సమకూర్చె
ధనదుండు వెచ్చంపుబనులు చూచె
తొవలరాయండంత దివియలు వెలుగించె
సాగించె నింద్రు డచ్చరులమేళ
మొజ్జరిక మూనె నిక్ష్వాకు వంశగురుడు
ప్రమథ గణము పూరించె తౌర్యత్రికమ్ము
అన్నిటికి దానెయయ్యె పద్మాసనుండు
వకుళ కనుపోయి మోదబాష్పములు వెలిగె !" (పే. 44)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆయా దేవతల స్వభావాన్ని బట్టి ఆయా పనులు చేసినట్లు చెప్పాడు. బాగానే ఉన్నదీ. వరుణునిచేత నీళ్ళకావడి మోయించటంలోనే కాటూరివారి చమత్కార మున్నదీ. వరుణుడు నేలమీదైతే నదులను ప్రవహింపజేసేవాడే. పోనీ వాన కురిపించుదామంటె పెండ్లికి ఆటంకం గదా! మరిక కొండలపై నీరు చేర్చే మార్గం కావడి వేసుకోవటమే. ఎక్కడ పడితే అక్కడ నీళ్లదొరకని కొండలు, గుట్టల ప్రాంతమైన తిరుపతిలో ఎంతవారైనా కావడి మోయక తప్పని ఆనాటి పరిస్థితుల్ని కూడ ఇక్కడ కాటూరి వారు సూచించారు.

శ్రీనివాసుడు లక్ష్మీదేవితో "నాకు ఈ బ్రహ్మాదులంతా తిరిగి పెండ్లి తలపెట్టారు. నేనేమో వద్దని నిన్ను పిలవనంపించాను" అనగానే—

లక్ష్మీదేవి : "బాలెందు మీరలీయఖిల కుటుంబకు
లిల్లాలు లేకున్న నెట్లు గడచు
....
ఇంతకా సుదతి పేరడుగవచ్చునాకో" (పే. 46)

అన్నదీ. శ్రీనివాసుడు పెండ్లికూతురు పేరు చెప్పలేదు.

లక్ష్మీదేవి "పద్మసంభవా! పేరు చెప్పుటకు మీ అయ్య సందేహిస్తున్నాడు నీవైనా చెప్పరాదా" అంటుంది.

బ్రహ్మ ఇప్పటివాడా! సృష్టి మొదలైన నాటివాడు. విష్ణువు ఆయన తండ్రి ఇంకెంత ముసలివాడో. ఆ వృద్ధునికి మరో భార్య కావలసి వచ్చిందని వెక్కిరింపు.

ఈ విధంగా కవితా చమత్కృతులతో గ్రామీణ జీవితాన్ని, తన కాలపు సామాజిక స్థితిగతుల్ని కలిపి వర్ణించటం కాటూరివారి విశిష్టత.

ఆకాశరాజు పూర్వజన్మలో కాళహస్తిలోని ఒక బ్రాహ్మణుడని, కులభ్రష్టుడై చివరకు వెంకటాద్రిని దర్శించి పాప పరిహారం పొంది ఉత్తమజన్మ పొందాడని, అలాగే పద్మావతీదేవి గతజన్మలో వేదవతి అని, వారి పూర్వజన్మ వృత్తాంతాలు కూడ, ఇక్కడ అనుసంధానం చేయబడ్డవి. 1957 ప్రాంతంలో ఆకాశవాణి విజయవాడ వారు ప్రచారం చేసిన ఈ యక్షగానాన్ని, 1984లో తిరుమల తిరుపతి దేవస్థానంవారు ప్రచురించారు. ఇది శ్రవ్యంగానే కాక దృశ్యంగా కూడ ప్రదర్శించటానికి తగిన యక్షగానం.

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

III. వ్యాసములు

కాటూరి వారి వ్యాసాలు మామూలు విమర్శన వ్యాసాలలాగ కేవలం విషయ ప్రధానాలుగా ఉండవు. విమర్శనాత్మకంగా, అంతకన్నా రసాత్మకంగా సాగే వచన కావ్యాలవి. సాహిత్య దర్శనం వీరి వ్యాస సంపుటి. దీన్ని 1967లో కాటూరి కవితాలత - విజయవాడ వారు ప్రచురించారు.

ఈ సాహిత్య దర్శనంలో 1. విమర్శకళ, 2. శంభుదాసు సాత్వికత, 3. రవీంద్రుడు-తపోవన సందేశం, 4. నవల—సంఘ సంస్కారం, 5. మా బాపిరాజు, 6. పేరిగాడు, 7. ఆశు కవిత్వం, 8. విదురుని విందు, 9. మధురభారతి - మా బుచ్చి సుందరుని స్మృతి, 10. సరస్వతీ చతుర్ముఖుల శృంగారం, 11. మా గురుదేవులు, 12. చిత్రశాల అనే వ్యాసాలున్నవి. ఇవి వేనికవే! దేని పోకడ దానిదే! విషయంలోనే కాక రచనా విధానంలోనూ వైవిధ్యం ఉన్నదీ. సాహిత్య దర్శనం అనే పేరుగల యే వ్యాసం దీంట్లో లేకపోవటం మరొక విశేషం. కొంతమంది వ్యాస సంపుటిలోని ఏదో వ్యాస శీర్షికను మొత్తం గ్రంథానికి శీర్షికగా పెడుతుంటారు. ప్రచురణ కర్తలు ఆయా వ్యాసాల ప్రయోజనం స్ఫురించేటట్లు ఈ పుస్తకం పేరుపెట్టారు. నేను ఈ పుస్తకంలో వ్యాసాల వరుసను పాటించకుండా, విషయాన్ని బట్టి ఒకదాని తరువాత ఒకటి పరామర్శిస్తాను.

1. విమర్శ కళ

ఈ పుస్తకంలో మొదటి వ్యాసం విమర్శ కళ. వీరి విమర్శన దృష్టి వేరు. సాధారణంగా విమర్శన వ్యాసాలు, విషయ ప్రధానంగా శాస్త్రీయ విశ్లేషణలో సాగిపోతుంటవి. కానీ కాటూరివారి వ్యాసాలలో కళా విశ్లేషణ ఎక్కువ. వీరి అభిప్రాయాన్ననుసరించి, కావ్యానికి శబ్దార్థాలు, తాత్పర్యం, వ్యాకరణం, ఛందస్సు, రసము, ధ్వని, అలంకారం వరకు వివరించటం మాత్రమే, విమర్శకాదు. ఒక కళావిదుడు, తన మనోభావాల్ని కలం ద్వారానో కుంచె ద్వారానో వ్యక్తం చేయటానికి ప్రయత్నిస్తాడు. శబ్దాలు-రంగులు భావాన్ని కొంతవరకే వ్యక్తపరచగలవు. కళాకోవిదుని మిగిలిన మనోగత భావ కళారూపాన్ని, అంతకు మించిన సౌందర్యాన్ని పట్టి పాఠకునికి అందించేదే సరైన విమర్శ. దీన్ని వీరు విమర్శకళ అన్నారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కళ అనేది అనేక విషయాలను కలిపి రూపొందించిన సృష్టి. ఒక కావ్యాన్ని శబ్ద, అర్థ, అలంకార, రస ధ్వనులుగా; ఒక పాటను రాగ, తాళ, సాహిత్యాలుగా విడదీయటం కాటూరివారి దృష్టిలో ఆ కళా రూపాన్ని విచ్ఛిన్నం చేయడమే. ఇది భౌతిక శాస్త్రజ్ఞులు చేసే పని. ఒక పదార్థాన్ని విచ్ఛిన్నం చేసి వారు తత్త్వాన్ని గ్రహిస్తారు. శిల్పి చేసిన శిల్పంలో, కవియొక్క కవిత్వంలో, గాయకుడి సంగీతంలో, రసమయమైన రూపాంతరాన్ని దర్శించినవాడే నిజమైన విమర్శకుడు. విమర్శ అంటే కాటూరివారి దృష్టి ఇది. వారి రచనలు కూడ దీనికి అనుకూలంగానే ఉన్నవి. సుమారు అరవై ఖండికలున్న పన్నీటి జల్లులో భావం స్ఫుటంగా వాచ్యం చేసిన వాటిని వ్రేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. మిగిలినవన్ని కాటూరివారి అభిప్రాయానుగుణంగా వ్యాఖ్యానించవలసినవే.

విమర్శ కళకు ఉపపత్తులుగా రెండు సన్నివేశాల్ని వారు ఈ వ్యాసంలో వివరించారు. అది ఒక అజంతా గుహా చిత్రం. దాంట్లో ఒక బాలుడు నిలబడి ఉన్నాడు. వాడి బుజాలపైన చేతులుంచి, మరో స్త్రీ మూర్తి బాలుడి వెనుక నిలిచి ఉంది. ఆ ఇద్దరి చూపులు సుదూర తీరాలకు సాగుతున్నవి. ఆ ఇద్దరు మాతాపుత్రులని, గుమ్మం దగ్గర నిలువ బడ్డారని చెప్పినంత మాత్రాన విమర్శ పూర్తికాదు. ఆ చిత్రం యొక్క లక్ష్యం చెప్పాలి. "అది బౌద్ధ గాథా చిత్రం. వారు భక్తితో నమ్రతతో ఎదురు చూస్తున్నది బుద్ధుని కోసం, వారు యశోధర. రాహులులను స్ఫురింపజేస్తున్నారు" అంటూ విమర్శకుడు వ్యాఖ్యానించినపుడే ఆ చిత్రం కరుణ రసావలంబమై పాఠకుని మనస్సుని కరిగిస్తుంది.

వీరిచ్చిన మరొక ఉదాహరణ మల్లీశ్వరి సినిమాలోని ఒక సన్నివేశం. "మల్లీశ్వరి"లో నాయికా నాయకులు చాలా రోజుల ఎడబాటు తరువాత రహస్యంగా ఒక చోట కలుసుకున్నారు. మల్లీశ్వరి చెలికత్తె దూరంగా నిలబడ్డది. కెమేరా చెలికత్తె మీదనుండి, మల్లీశ్వరి, బావల మీదకు తిరిగింది. వెన్నెల్లో వారెన్నో ఊసులు పోతున్నారు, ఉద్వేగం చెందుతున్నారు. కెమేరా టక్కున వారిమీద నుండి చెలికత్తె మీదకు మళ్ళింది. చెలికత్తె సిగ్గుతో తటాలున నవ్వుతూ మొగం అవలకు త్రిప్పుకున్నది. ఆ చెలికత్తె నవ్వుల్లో, ముఖ కవళికల్లో నాయికా నాయకుల ఏ మనోహర సన్నివేశాన్ని దర్శకుడు చూపించదలచుకున్నాడో! చూపించాడో! దాన్ని వ్యాఖ్యానిస్తే అదే విమర్శ కళ. వేంకటేశ్వరరావు గారి దృష్టిలో విమర్శ అంటే ఇది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ సంకలనంలో విషయ వివరణే ప్రధానంగా గలవ్యాసాలు కొన్నైతే, మరి కొన్ని భిన్నమైన ప్రత్యేకతలు గలవి. సాధారణంగా వ్యాసాలే వ్యాఖ్యానాల్లాగా ఉంటవి కాబట్టి, వాటికి వ్యాఖ్యానం చేయవలసిన అవసరం ఉండదు. కానీ కాటూరివారి వ్యాసాలు ప్రత్యేక కళారూపాలవటం వల్ల కొంత వివరించవలసి వస్తున్నది.

2. మా బాపిరాజు

"మా బాపిరాజు" అనేది ఒక విలక్షణమైన వ్యాసం. ఇది వ్యక్తి చిత్రణకు సంబంధించినది. వ్యక్తిత్వం అంటే ఆ మనిషి భౌతిక రూపం, మానసికతత్త్వం, వ్యక్తిత్వం అందరు వ్యక్తులకు ఉంటుంది. రసత్వం మాత్రం కళావేత్తలకే ప్రత్యేకం. కళావిదుడు సృష్టించిన కవిత్వం, చిత్రలేఖనం, శిల్పం మొదలైన కళారూప స్వభావాలే అతని రసత్వం, లేకపోతే రసాకృతి అందాం. రసజ్ఞత వేరు, అది రసాన్ని ఆనందించే స్థితి. వ్యక్తిత్వం యొక్క ప్రభావం, కళాసృష్టి మీద కొంత ఉండవచ్చు. వ్యక్తిత్వంలో అతని కళారూపచ్ఛాయలు కనుపించనూ వచ్చు. ఈ వ్యాసంలో బాపిరాజుగారి వ్యక్తిత్వాన్ని కాటూరివారు చిత్రించారు. బాపిరాజుగారి స్వభావం, స్వరూపం, ఆధ్యాత్మిక దృష్టి, జీవన పరిణామం అక్కడక్కడా ఆయన కళాసృష్టికి సంబంధించిన విషయాలు కూడా ఇందులో చూడవచ్చు.

ఉత్తమ శ్లోకుడు బాపిరాజు, శశికళా సృష్టి, కళలు-స్త్రీల ప్రకృతి, వ్యవహార దక్షతా లోపము, బాపిరాజు- అల్పసంతుష్టుడు, శిశుప్రకృతి, బాపిరాజు పాండిత్యము, అతీంద్రియ దృష్టి, రెండు దశలు అనే తొమ్మిది అంశాలతో సుమారు ఇరవై రెండు పేజీల దాకా సాగిన వ్యాసమిది.

బాపిరాజు ఉత్తమ శ్లోకుడు. ఆ కాలంలోని కవులందరికి తలలోని నాల్కలా మెలిగి అందరి అభిమానాన్ని పొందాడు. బాపిరాజుగారిని చాలా మంది "బాపి బావ" అని పిలిచేవారట. బాపిరాజుగారు కూడ చాలామంది మిత్రుల్ని బావగారని సంబోధించేవారట. ఈ బావ పిలుపు ఏదో వరసకు, సరసానికి కాదు. ఆ పిలుపులో ఎంతో విశ్వాసం, ఎంతో మాధుర్యం, ఎంతో పావిత్ర్యం ఉండేదంటారు కాటూరి వేంకటేశ్వరరావుగారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బాపిరాజుగారు మిత్రుల ఇంటికి వస్తే, వంటింట్లో ఉన్న అక్క, చెల్లెళ్ళను, వాకిట్లో ఆడుకొనే మేనల్లుళ్ళను, మేనగోడళ్ళను ఎంతో అప్యాయంగా పలకరించే వారు. వారితో ఇష్టాగోష్ఠి తరువాతే బావగార్ల పరామర్శ. వారి మాటలు గ్రీష్మ కాలంలో వచ్చే పైరగాలులు, వారి ఆప్యాయత మంచి గంధం పూత. "బాపిరాజు మగవాండ్ర కక్కగారును, ఆడవాండ్ర కన్నగారు" మగవాళ్ళ కేదైనా ఇంటి సమస్యలొస్తే సాధారణంగా అక్కగారికే చెప్పుకుంటారు. భార్యతో చర్చిస్తే తల్లికి కోపం, తల్లితో చర్చిస్తే భార్యకి అసంతృప్తి. అక్కగారే అలాంటి సమయాలల్లో కష్టసుఖాలు చెప్పుకోటానికి తగింది. ఆమెకు సలహా లిచ్చే స్వతంత్రం కూడ ఉంటుంది. పాండురంగ మాహాత్మ్యంలో, నిగమశర్మకు హితం చెప్పింది అక్కగద. అలాగే స్త్రీలు ఏమైనా సమస్యలొస్తే అన్నకు చెప్పుకుంటారు. అంటే బాపిరాజుగారు స్త్రీ పురుషులందరికి అంత ఆత్మీయంగా ఉండే వారన్నమాట.

బాపిరాజుగారు చాలా అల్పసంతోషి. ఆయన కవితనో, కథనో చిత్రలేఖనాన్నో మెచ్చుకుంటే చాలు, ఏనుగు నెక్కించినంత సంతోషపడేవారట. ఇక ఆయన పిల్లవాళ్ళలో పిల్లవాడు. వాళ్ళతో ముద్దు మాటలు మాట్లాడుతూ, పిట్ట కూతలు కూస్తూ, పారాడుతూ వాళ్ళకు కథలు చెబుతూ అన్నీ మరచి పోయేవాడట. పిల్లలకు లాగే క్రొత్తవారి దగ్గర వారికి కొంత ముఖబిడియం కూడ ఉండేదట.

బాపిరాజుగారు కాటూరివారు మంచి మిత్రులు. బాపిరాజుగారి పాండిత్యాన్ని గురించి వారు "అతడు పుట్టుకవి, పుట్టు శిల్పి.... అతని సకల రచనలందు స్వభావోక్తి తక్కువగా అతిశయోక్తి ఎక్కువగా నుండును. ఉత్ప్రేక్షలాతని సొత్తే. నిజమునకాతడు ప్రబంధకవుల రాసిలోనివాడు. అతని ప్రతిభా దర్పణమందు ప్రతిఫలింపని విద్యయనుచు లేదు." అని ప్రశంసిస్తూనే "భాషా పాండితి మాత్రమాతని కించుక కొరవడిన మాట నిజము. శబ్దదోషము లెడనెడ అతని రచనలందు కన్పించు చుండును" అంటూ లోపాన్ని కూడా చెప్పారు. అయితే ఆ దోషాలు ఆయన ప్రతిభలో కరగిపోతవని, శబ్దజ్ఞానమే జ్ఞానమనుకొనే వారికి మాత్రమే బాపిరాజు పండితుడుగా కనుపించక పోవచ్చునని సమర్థించారు. బాపిరాజుగారు బహుగ్రంథ పఠనం చేశాడని ప్రశంసించారు.

బాపిరాజు ఏకరువుపెట్టే ప్రాచీన ఆంధ్ర గాథలన్నిటికి ఉపపత్తులు కనిపించేవి కావు. శాతవాహన, ఇక్ష్వాకుల కాలంనాటి చిత్రలేఖన శిల్ప విశేషాలెన్నో చెబుతుండేవారట. "హిమబిందు" నవలలో ఆంధ్ర సామ్రాజ్య విశేషాలెన్నో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చిత్రించారు. ఈ విషయాలల్లో శాస్త్రీయపద్ధతి కంటే ఆయనలో అతీంద్రియ దృష్టే ఎక్కువగా కనిపించే దంటారు కాటూరివారు.

ఆ కాలపు కవులందరికి ఈ అతీంద్రియ శక్తి గొడవ ఉన్నదేమో! విశ్వనాథ వారు వేంగి క్షేత్రంలో ప్రాచీన పల్లవ, చాళుక్యుల గాథలు నాకు స్ఫురిస్తున్నవి. అంటూ "ఈ అతీంద్రియ శక్తి నాకెట్టు లబ్బె" అన్నారు. ఆ కవుల ఆంధ్రాభిమానం అలాంటిది.

బాపిరాజు జీవితంలో మొదటి దశలో, ఆస్వాల్డు కూల్డ్రే శిష్యరికంతో జాన పద జీవన మాధుర్యం రంగరించి పల్లె పదాలు, వీధి నాటకాలు, మొదలైన దేశీయ రచనలు చేశారని, తదనంతర కాలంలో ప్రమోద కుమార చటోపాధ్యాయ శిష్య రికంలో వీరికి రసమార్గం సిద్ధించిందని ప్రాచ్య పాశ్చాత్య కళా రీతుల్ని మేళవించి అద్భుతమైన చిత్ర లేఖన కవిత్వాలను వెలయించారని బాపిరాజుగారి జీవిత పరి ణామాన్ని వివరించారు కాటూరివారు.

ఈ విషయాలలా ఉంచి ఈ వ్యాసంలో రెండు ముఖ్య విషయాలున్నవి. సంశయాస్పదమైనది ఒకటి, సర్వోత్కృష్టమైనది మరొకటి. "కళలు-, స్త్రీల ప్రకృతి" అనే విషయం అనేక సందేహాలకు తావిచ్చేదిగా ఉన్నది. శశికళా సృష్టి సర్వో త్కృష్టమైన విషయం.

కళలు-స్త్రీల ప్రకృతి అనే అనుబంధ శీర్షిక క్రింద కాటూరివారు కవుల స్వభావాన్ని గురించి చర్చించారు. కవులకే కాదు, కళావేత్తలందరిలో స్త్రీ ప్రకృతి అధికంగా ఉంటుందని వీరు వివరించారు. స్త్రీలకు శాస్త్రబుద్ధి కన్న సౌందర్య దృష్టి యెక్కువ. తార్కికమైన ఆలోచన కన్నా ప్రేమానురాగాల వైపు మొగ్గు చూపు తారు. భావలౌల్యం స్త్రీలకు అధికం. కళలకు కావలసిన లక్షణాలు కూడ ఇవేనని కాటూరి వారి అభిప్రాయం.

కాటూరివారి మాటల్లో "బాపిరాజుది సంప్రదాయ బద్ధము ఆచారపరాయణము నగు స్త్రీ ప్రకృతి. అతనిలోనే కాదు కళావంతులందరిలో నీస్త్రీప్రకృతి ఎక్కువ పాళ్లుండును." ఇక్కడ కళావంతులనే శబ్దాన్ని కూడ వారు చిత్రంగానే ప్రయోగిం చారు.

మరొకచోట "పురుషులు కాలహరణమునకై వినోదము కోసరము, విశ్రాంతి కొరకు కళలను ఆశ్రయింతురే కాని వానియందు సహజాభిరతిచే గాదు. అట్లుగాక

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్వభావము చేతనే పురుషుడు కళారక్తుడగునేని వానిది స్త్రీ ప్రకృతియని చెప్పదగును. అట్టి పురుషునకు వ్యవహార దక్షత లోపించి స్త్రీ సాదృశ్యము లభించును" అన్నారు. మరి ఇలాంటి అభిప్రాయం కాటూరివారికెందుకు కలిగిందో తెలియదు. కొందరలా ఉంటే ఉండవచ్చు. అంతమాత్రం చేత దీన్ని సాధారణ సత్యంగా చెప్పవచ్చా ?

కవులకు కళావిదులకు వ్యవహార దక్షత తక్కువగా ఉంటుందని లౌకిక విషయాలల్లో అంత నైపుణ్యం ఉండదని కాటూరివారి అభిప్రాయం. తన అభిప్రాయాన్ని సమర్థించుకుంటూ, శ్రీనాథుడు వ్యవసాయంలో నష్టపోవటం ఇందువల్లనే నంటారు. నన్నయ లోకజ్ఞత్వం కూడ లోకస్వభావాన్ని గ్రహించటం వరకేగాని, ప్రవర్తించటంలో సంశయమేనని వీరినమ్మకం. మరి! మంత్రి దండనాథ పదవులు నిర్వహించి రాజ్యాల భవితవ్యాన్నే నిర్దేశించిన కవిబ్రహ్మ మాటేమిటి? పెద్దన విషయం ఏమనాలి! శ్రీనాథుడు కూడ, పరస్పరం శత్రువులైన రాజుల దగ్గర ఏక కాలంలో సన్మానం పొందాడు. వెల్గోటివారు తీసికొనిపోయిన రెడ్డిరాజుల కళారిని తిరిగి తీసికొనివచ్చాడు. ఇదంతా దక్షత, లోకానుభవం లేకుండా సాధ్యపడదు. శ్రీనాథుడికీ దుస్థితి కలగటానికి కారణం కాలం ఖర్మం, వ్యవసాయంలో అనుభవంలేకపోవటమే ! అసలు రాయల లాంటి రాజకవులే చాలామంది ఉన్నారు గదా.

ఇంతకు కాటూరివారు తేల్చిన విషయమేమంటే బాపిరాజుగారు స్వభావంచేత కళారక్తుడని అందువలన స్త్రీ సాదృశ్యం ప్రాప్తించి వ్యవహార దక్షత లోపించిందని!

కాటూరివారు బాపిరాజుగారి స్త్రీ ప్రకృతిని అనేక విధాలుగా వర్ణించారు. "బాపిరాజునకు బిడ్డలను గనుట యొక్కటి చేతగాకపోయెనే కాని తక్కిన శిశుపోషణాదిక మెల్ల సహజముగా నలవడెను." "స్త్రీలకు రహస్య గోపనశక్తి చాలదందురు. ఆ మాట ఎంత నిజమో తెలియదుగాని బాపిరాజు నోటిలో మాత్రము నువుగింజ నానెడిదికాదు." ఇలా బాపిరాజుగారి స్త్రీప్రవృత్తిని వర్ణించిన కాటూరివారు అంతటితో తృప్తిపడక, వారి రూపంలో ఉన్న స్త్రీ కవళికలను కూడా వర్ణించారు.

బాపిరాజుగారు, కాటూరివారు చెప్పినట్లు, స్త్రీల లక్షణాలు కలిగి ఉండటం యదార్థమే కావచ్చు. కాని అలా ఉండటానికి వారూహించినట్లు కళావేత్త కావటం కంటె వేరే కారణమున్నట్లు నాకనిపిస్తుంది. తరువాత అంశంలో దాన్ని వివరిస్తాను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శశికళా సృష్టి

"శశికళాసృష్టి" అనే విషయం గహనమైంది. కాటూరివారు సూచనగా చెప్పిన ఈ విషయాన్ని కొంత విపులీకరిస్తాను. విశ్వశక్తిని, విశ్వసౌందర్యాన్ని అనాదిగా మానవులు ఉపాసిస్తూనే ఉన్నారు. సాధారణంగా కళాభిరుచి కలవారు విశ్వసౌంద ర్యాన్ని అభిమానిస్తారు. అందులో కొందరు ఆ సౌందర్యాన్ని ఒక మూర్తిగా భావించి ఆరాధిస్తారు. సిద్ధి పొందినవాడు అజరామరమైన కళాఖండాలు సృష్టించగలుగుతాడు.

ధ్యానం, భావన ఈ రెండు సిద్ధికి ఆవశ్యకాలు. మనం ఎలాటి సౌందర్యాన్ని ఉపాసిస్తున్నాము! ఏరూపంతో పోల్చుకుంటున్నాము! ఆ సౌందర్యమూర్తితో ఎలాంటి అనుబంధాన్ని పెట్టుకుంటున్నాము! ఇదంతా భావన. ఆ రూపాన్ని, గుణాన్ని నిరంత రం మనసులో తైలధారలాగా అవిచ్ఛిన్నంగా చింతించటం ధ్యానం.

ఉపాసనాకాండలో ఎన్నోరూపాలతో, ఆయా కామ్యాలకు అనురూపాలైన దేవతలు, మంత్రాలు నిర్దేశింపబడ్డవి. అంటే ఆ విశ్వశక్తిని, సౌందర్యాన్ని, కొందరు ఋషులు, మంత్ర ద్రష్టలు ఆయారూపాలల్లో దర్శించారన్నమాట. వారు నిర్దేశించిన మార్గంలో ఆ సాధనను కొందరు చేస్తుంటారు. ఇది సాంప్రదాయికమైన విషయం.

కొందరు కవులు ముఖ్యంగా భావకవితాకాలంలో ఊహా ప్రేయసులను సృష్టించుకున్నారు. కొందరు కవుల విషయంలో యదార్ధ జీవితంలో ఏదోకొంత అనుబంధం గలిగిన స్త్రీలకు రూపాంతరాలే ఊహాప్రేయసులుకావచ్చు. మరికొందరు కవులు విశ్వసౌందర్యాన్ని అన్వేషిస్తూ రూపాల్ని ఊహించుకుంటూ, క్రొత్త పేర్లు పెట్టుకున్నారు. అలాంటివారిలో కృష్ణశాస్త్రి, రవీంద్రులను కాటూరివారు ఈ వ్యాసంలో ఉదాహరించారు. వీరిరువురి ఊహాసుందరి ఊర్వశి. ఆమె పాలసముద్రం మధించి నపుడు పుట్టిందని, అక్షయయౌవనవతని, అందరి హృదయాలలో వసంతరాగం తొలక రింపజేస్తుందని, అభవఅని, సద్యోయావన అని లోకమెల్ల ఆమెను వలపసను ఆమె ఎవ్వరికి గృహిణికాదని అనేక విధాలుగా వారు ఆమెకు రూపకల్పన చేశారు. అయితే వారు సాధన చేశారే కాని సిద్ధిని పొందలేదని కాటూరి వారభిప్రాయం. తన అభిప్రా యానికి నిదర్శనంగా "అతీంద్రియభోగ్యమైన ఆ వస్తువు ఆలింగనమున ఇముడదు" అన్న రవీంద్రుని వ్యాఖ్యాన్ని వేంకటేశ్వర్రావుగారికూడ ఉదాహరిం చారు.

విశ్వ సౌందర్యారాధనలో, నిర్దిష్టమైన భావనగాని, నిశ్చలమైన ధ్యానంగాని లేకపోతే, సౌందర్య స్పృహ, స్ఫురణే కాని సిద్ధి కలుగదు. ఎవరైతే ఊర్వశిని ఒక

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిర్దిష్ట రూపంలో భావించి, ధ్యానించి తన మనస్సును ఆమెకు గృహంగా చేస్తారో వారికి ఆమె గృహిణి అవుతుంది. చాలామందికి ఆ సౌందర్యాన్ని భావించి తబ్బిబ్బు కావటమేకాని దాన్ని సిద్ధించుకొనే నేర్పు ఓర్పు ఉండవు. రవీంద్రుడన్నట్లు అభౌతిక రూపాలు భౌతిక బాహుల్లో ఇముడని మాట నిజమే కాని, సాధకుడు కూడ తన అభౌతికరూపాన్ని గుర్తించి సాధన చేస్తే అది సాధ్యమౌతుంది. అభౌతికరూపాన్ని సూక్ష్మ శరీరమని కొందరు యోగులు చెబుతుంటారు.

విశ్వశక్తిని సౌందర్యాన్ని అధీనం చేసుకోవటం ఆ ఒక్క సర్వేశ్వరునికే సాధ్యం. మిగిలిన సాధకులకు ఒక లేశం, చిన్ని శకలం లభించినాచాలు - అదే మేరువు. ఆ సౌందర్య స్ఫురణ మాత్రం చేతనే దేవులపల్లి రవీంద్రులు అంత గొప్పవారైనారు గదా! మరో ప్రమాదమున్నది ఆ సిద్ధి లభించిన కళావేత్త ఆత్మ తృప్తితో ఆనందంతో తన్మయ స్థితిలో పడి కళాసృష్టిని మానివేయవచ్చుకూడ. అతడు తన ఆనందానికి అనుభూతికి రూపం ఇస్తే గద మనం ఆనందించే కళా రూపాలు ఆవిర్భవించడం.

బాపిరాజు శశికళనుద్దేశించి "నీకు ఇవతలా, నాకు అవతలా తెరయున్నదే బాలా" అన్న మాటలను పురస్కరించుకొని కాటూరివారు చేసిన వ్యాఖ్యానం, పై విషయాల్ని అనుసరించే ఉన్నది.

"ఈ తెరను చించివేసినను ప్రయోజనము లేదు, ఈ తెరలనే పట్టుకొని భాగవతమాడినను ప్రయోజనములేదు. తెరలవంటివి, అద్దాలవంటివి యీ రూపములు. వానిని రసరూపములొనర్చినపుడే కదా కళలకు సార్థకత లభించును"

(సాహి. ద. పే 50)

అంటే ఆ సౌందర్యాన్ని సిద్ధించుకోవటమేకాదు. దాన్ని కళారూపంలోకి అనువదిస్తేనే సార్థకత లభిస్తుందని దీని భావం.

శశికళ బాపిరాజు ఊహాప్రేయసి మాత్రమేగాదని ఉపాస్య దేవతని కాటూరి వారు సూచించారు. ఇలాంటిపేర్లు గల దేవతలు యక్షిణీమండలంలో ఉన్నారు. వారు వెన్నెల దేవతలు. శక్తి సంపన్నలు, సౌందర్యమూర్తులు, కళాభిరతలు, కళాప్రసాదినులు. అలాటి యక్షిణీ దేవతను శశికళపేరుతో బాపిరాజు ఉపాసించి ఉండవచ్చును. ఈ సందర్భంగా కాటూరివారి మాటలను చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"అలకాపుర వాసియగు ప్రియురాలికి బాపిరాజు శశికళయని పేరు పెట్టుకొనెను. అతని పాటలు, కథలు, చిత్రలేఖనములు సన్నియు నాయకీణిని భూమిపై అవతరింప జేయు సాధనములే. శారద రాత్రులలో గోదావరీ తీరపు టిసుకతిన్నెలలో దరళ చంద్రికా రేఖపై యామె బాపిరాజునకు దర్శనమిచ్చినది. (సాహి. ద. పే. 49)

"ఆదేవిని ప్రసన్న నొనర్చుకొనుటకై బాపిరాజు, అలమటించి అల్లాడి పోయి నాడు చీదరగొని, శివమెత్తునట్లు తన్ను దానేవెంటాడుకొనుచు తిరిగెను"

(సాహి. ద. పే. 50)

"బాపిరాజు శశికళా సాక్షాత్కారమునకై కొండలు తిరిగి, గోనలు వెదకి ప్రతి రూపమును బలుకరింపుచు పాటలు పాడికొనియెను, చిత్రములు రచించెను. అతని కళా భాండారమంతయు శశికళా చరిత చిత్రితమని చెప్పవచ్చును. ఇట్లు కళారాధనతో దృప్తి నందక బాపిరాజు శశికళ కుపాసనా కాండగూడ నిర్మించెను. అతని కళా పీఠమున నాదేవికి నర్చనలు షోడశోపచారములు నివేదనలు జరుగుచుండెడివి."

(సాహి. ద. పే. 51)

కాటూరివారి వాక్యాలనుబట్టి బాపిరాజు ఎంత తీవ్రంగా శశికళను ఆరాధించాడో మనం గ్రహించవచ్చు.

వేంకటేశ్వర్రావు గారు 1958 నవంబరు 8-కృష్ణా పత్రికలో బాపిరాజును గురించి మరొక వ్యాసం వ్రాశారు. ఆ వ్యాసాన్ని, ఉపాసనా కాండలోని కొన్ని విషయాల్ని పరిశీలిస్తే బాపిరాజుగారి స్త్రీల ప్రకృతి, శశికళారాధనలను గురించి ఒక సమగ్రమైన అవగాహన కలుగుతుంది.

దేవతలను ఉపాసించేటప్పుడు అంగన్యాస కరన్యాసాలంటూ ఒక ప్రక్రియ ఉంటుంది. తానారాధించే దేవతా స్వరూపాన్ని తన శరీరమందు ఆరోపించుకోవటమే అందులో విశేషం. తీవ్రసాధన చేసినపుడు ఉపాస్య దేవత స్వరూప స్వభావాలు ఉపాసకునికి సంక్రమిస్తవి. అరుదుగా ఏదైనా దేవత తనంతట తానే ఎవరో ఒక రిని ఆవేశించవచ్చు. అలా ఆవేశించటానికి ఆదేవతను గురించిన ఆతని పూర్వ జన్మ సాధనకారణంకావచ్చు. అప్పుడు అనాయాసంగా ఆ వ్యక్తికి మహత్వం కలుగు తుంది. ఇలాంటప్పుడు కూడ ఆదేవతా లక్షణాలు ఆవ్యక్తికి సంక్రమిస్తవి. ఈ విషయాలలా ఉంచుదాము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బాపిరాజుగారిని ఒక వెన్నెల దేవత ఆవహించిన ఉదంతాన్ని కాటూరివారు 1958 నవంబరు, కృష్ణా పత్రిక వ్యాసంలో వివరించారు.

బాపిరాజుగారు ఆయన శిల్ప, చిత్రకళాగురువు ఆస్వాల్డు కూల్డ్రే ఇద్దరూ అజంతా మొదలైన కళా నిలయాలను, ప్రకృతి సౌందర్యం వెల్లివిరిసే ప్రాంతాల్ని తిలకించటానికి వెళుతుండేవారు. వారొక రాత్రి అరణ్య ప్రాంతంలో చిక్కుపడ్డారు. చుట్టూ లతలు, వృక్షాలు, ప్రక్కనే సెలయేరు, అక్కడక్కడా రాళ్ళు-పైన పండు వెన్నెల. ఆ మనోహర సౌందర్యాన్ని దర్శిస్తూ వారక్కడే ఉండిపోయారు. కూల్డ్రేకి అంతదూరంలో బాపిరాజు ఒక రాయి మీద నడుంవాల్చాడు. చల్లగాలికి కునుకు పట్టింది. అప్పుడు ఒక అద్భుత దృశ్యం కూల్డ్రే కంట బడింది. వెన్నెల రూపం పొందిందా అన్నట్లు ఒక స్త్రీ మూర్తి బాపిరాజుపై వాలింది. ఆ దృశ్యాన్ని కూల్డ్రే ఒక బొమ్మగా గీశాడు. ఆ విషయాన్ని వివరిస్తూ బాపిరాజు స్వయంగా వ్రాసుకున్న గేయాన్ని కాటూరివారు ఉదాహరించారు.

"కొండ తిరిగీ కోన తిరిగీ
కోన మధ్యను కొండ వాగును
బండ రాళ్ళను పతన మయ్యే
పండువెన్నెల పరుగులెత్తే లోయ చేరానే

అడవి చెట్లు నిడివి లతలూ
జడులు రాలే కడిమిపూలూ
చెట్ల మీదే చంద్రబింబం
చెట్ల కొమ్మల చంద్రకిరణం
చెట్ల పూవుల వెన్నెల వయ్యావే

గండ శిలపై మేను వాల్చితి
కొండ వాగూ పాట పాడెను
వాగు పాటలో చిన్ని పులుగులు
మూగ గొంతుల శ్రుతులు కలిపేను
వెండి వెలుగులు నన్ను ముంచేనే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జలజల సాగే వాగు మధ్యను
శిలా తల్పం పవ్వళించీ
కలలు కంటూ నిదురపోతిని
నిదుర పోయే నాపై వాలితివే

నాపై వాలిన నిన్ను చూచి
గురువు కూర్డేరి చిత్రం లిఖియించె
ఎండిమియానని చిత్రం పేరుంచె

చంద్రలోకం తూర్పు దెసలో
సూర్య లోకం పశ్చిమంలో
చిన్నిలోకం ఒకటి ఉన్నాదే
ఓ నా వెన్నెల చిన్నారి పడుచా
ఆలోకమేలే కన్నె రాణివి నువ్వేనులే"

పై గేయంలో "ఎండిమియా" అనే పేరు కూర్డేరి గీసిన చిత్రానికి పెట్టిన ట్లున్నదీ. ఎండిమియా గ్రీసుదేశపు బాలుడు. అతనిపై కూడ ఒక దేవత ఇలానే ఆవహించిందట ఆ కథ రెండువేల ఏండ్ల క్రిందటిదని ఆ వ్యాసంలో వివరింప బడింది.

పై వ్యాసం చదివిన తరువాత నేను, శశికళ బాపిరాజుగారి ఉపాస్య దేవత అనే నిర్ణయాని కొచ్చాను. అయినా ఏదో సందేహం. ఒకసారి గుంటూరులో పూజ్యులు డా॥ ప్రసాదరాయ కులపతులతో సంభాషిస్తున్నప్పుడు యక్షిణీ దేవతల ప్రసక్తి వచ్చింది. బాపిరాజుగారి విషయం చెప్పి "మాష్టారూ ! యక్షిణీ దేవతల్లో శశికళ అనే దేవత ఏమైనా ఉన్నదా! ఆ దేవతలు ఎలాంటివారు" అని అడిగాను. "చాలా అందంగా ఉండే వెన్నెల దేవతలు వారు, ఉపాసించినవారి కోరికలు తీరుస్తారు" అంటూ యక్షిణీ తంత్రంలోని ఈ శ్లోకం వినిపించారు.

"కామప్రదా కామదాత్రీ
కామినీ కామరూపిణీ
చంద్రికా యక్షిణీ దేవీ
సర్వాభీష్ట ప్రదాయినీ"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ విషయాలే కాకుండా, ఈ వ్యాసంలో మరికొన్ని కాటూరివారి వాక్యాలు కూడ బాపిరాజు శశికళను సంప్రదాయ సిద్ధంగా ఆరాధించినట్లు నిరూపిస్తున్నవి.

"బాపిరాజుది సంప్రదాయ బద్ధము, సాచార పరాయణమునగు స్త్రీ ప్రకృతి"

"నవీనులలో ననేకులకు రుచింపని యీ ప్రతిమార్చన మందు బాపిరాజున కింతటి యభినివేశమున కాతని యాస్తిక్యమే కారణము" (సాహి. ద. పే. 51)

పై విషయాలన్నీ పరిశీలించిన తరువాత బాపిరాజుగారిలోఉన్న స్త్రీల ప్రకృతికి కవశికలకు, ఆయన చేసిన శశికళోపాసనే కారణమని స్పష్టంగా చెప్పవచ్చు.

3. పే రి గా డు

కాటూరివారి వ్యాసాలు వేటికవే ప్రత్యేకం. "పేరిగాడు" అనే వ్యాసంలో పేరిగాడి స్వగతం సుమారు మూడు పేజీలున్నది. దానిపై విమర్శ నాలుగు పేజీల దాకా సాగింది.

ఒక పద్యమో, నాటక భాగమో ఉదాహరించి దాని ఆధారంగా విమర్శ సాగించటం మామూలు పద్ధతే. అయితే ఈ వ్యాసంలో కాటూరివారు పేరిగాడికి వ్రాసిన స్వగతం, వేదంవారి నాటకంలోది కాదు. దానికి పేరడీ లాంటిది. "నాకీ రేడియోలు, గీడియోలు తెల్డు. పిలం మేంటి కిలుం? రికార్డులంట" మొదలయిన ఆధునిక విషయాలా సంభాషణలో ఉన్నవి.

ఒక పేరడీని తీసికొని దానిమీద నుండి విమర్శ సాగించటం ఈ వ్యాసంలోని ప్రత్యేకత. పేరడీ రచనతో మనకు ఆనందాన్ని, విమర్శతో ఉపదేశాన్ని ఒకే ప్రయత్నంలో అందించారు కాటూరివారు.

ఆరునెల్లు చక్రవర్తి పదవి అనుభవించి సునాయాసంగా తనది కాదన్నట్లు వదలి పూర్వ జీవితాన్ని సంతోషంగా స్వీకరించి, ఏ ఫలితాన్ని ఆశించని పేరిగాణ్ణి, పదవిపోతే తల్లడిల్లిపోతూ తాము నిద్రపోక, ఎదుటివారిని నిద్రపోనివ్వని నేటి నాయకులతో పోల్చి వీరి అధమత్వాన్ని పేరిగాడి ఔన్నత్యాన్ని, ఇక్కడ చెప్పారు.

ప్రధానంగా ఈ వ్యాస ప్రయోజనాలు రెండు. ఒకటి సున్నితమైన హాస్యమెలా ఉంటుందో చెప్పటం. రెండవది నేటి నాయకులను మందలించటం. ఈ రెండు విషయాలలో కాటూరివారు తమ లక్ష్యాన్ని సాధించారనే చెప్పాలి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పదవి పోయిన పేరిగాడు, గతవైభవాన్ని తన కులంవాళ్ళతో చెప్పటం, వాళ్లు నమ్మకపోవటం, రాజసభలో వాడు పడ్డ పాట్లు, పొరపాట్లు వివరించి హాస్యమెలా ఉండాలో చెప్పారు వేంకటేశ్వర్రావుగారు. అనూహ్యంగా లభించిన రాజయోగానికి అతడు తృప్తిపడక పోవటం, మర్యాద మీరక పోవటం, అధికార దుర్వినియోగానికి పాల్పడక పోవటం మొదలయిన వాడి సుగుణాల్ని మెచ్చుకున్నారు. "సెక్రటరీల సహాయం లేకుండా ఒక్కమాట మాట్లాడలేని నేటి మంత్రులు పేరయ్యకంటే ఎందులో అధికులు! కానీ వీరి పదవీ వ్యామోహం, అధికార దుర్వినియోగం దుర్భరం" అంటూ నా ఓటు పేరయ్యకే అని తేల్చిచెప్పారు.

కాటూరివారు, మన సాహిత్యం మొదటినుండి పద్య కావ్య మయం కావటం వల్ల హాస్యరసానికి అంతగా చోటు లభించలేదని శతకాలల్లో, చాటువుల్లో ఏదో కొద్దిగా హాస్యం పోషింపబడిందని, వీరేశలింగంగారి ప్రహసనాలు, గురజాడవారి కన్యాశుల్కం, పానుగంటివారి రచనలు ఆ లోటు తీర్చాయని వివరించారు. వేదం వారు ప్రతాపరుద్రీయంలో పేరిగాడి పాత్ర ద్వారా హాస్యాన్ని బ్రతికించినందుకు వారిని ప్రశంసించారు. హాస్య ప్రయోజనాన్ని ఈ వ్యాసం చక్కగా వ్యక్తపరిచింది.

మనల్ని ఉడికించి, ఎత్తిపొడిచి, ఏడిపించేది మంచిహాస్యం కాదని, నేటి సినిమాలల్లో కోతిగంతులు, వెకిలిచేష్టలు, అసభ్యాలేకాని హాస్యరసంగాదని, మనలో లోపాలు, లేకితనాలు, మనకు చూపెట్టి-నవ్విస్తూనే సదుపదేశం చేసేది నిజమయిన హాస్యమని కాటూరివారు వివరించారు. అలాటి ఉత్తమమైన హాస్యానికి వేదంవారి పేరిగాణ్ణి మన ముందు నిలిపారు.

"నిజమైన హాస్యం మెదడునుంచి ఉద్భవించేదికాదు. హృదయం నుంచి స్రవిస్తుంది. హాస్యమంటే వెక్కిరింతకాదు, నిరసనకాదు, దాని సుస్వరూపం ప్రేమ అంటారు వేంకటేశ్వర్రావుగారు.

ఈ వ్యాసంలో పేరిగాణ్ణి ఆధారం చేసికొని చమత్కార రచన సాగిస్తూనే నేటి నాయకుల లోపాలు గమనించండంటూ మనకు చక్కని ఉపదేశంకూడా చేశారు. అంటే కాటూరివారు తాను చెప్పిన హాస్యరస స్వరూపానికి, ప్రయోజనానికి, ఈ వ్యాసాన్ని లక్ష్యంగా మలచారన్నమాట. లక్ష్య లక్షణాల్ని ఒకేచోట పొందుపరచిన ఇలాటి ప్రతిభ అసామాన్యం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

4. విదురుని విందు

"విదురుని విందు" అనేది మరొక ప్రత్యేకతగల వ్యాసం. శ్రీభట్టాచార్యులు చిత్రించిన త్రివర్ణచిత్రం దీనికి ఆధారం. విదురుడు కృష్ణునికిచ్చిన ఆతిథ్యం, చేసిన సేవలు, ఆ దివ్య పురుషుణ్ణి స్పృశించి పొందిన ఆనందం ఇందులో వర్ణింపబడ్డవి. ఈ వ్యాసంలో ఆ చిత్రంలోని రంగుల్ని గురించి కాని, భంగిమల్ని గురించి కాని విమర్శలేదు. వ్యాసం చివరలో మాత్రం "ఆ వర్ణములు సౌమ్యములు సుకుమారములు సాత్వికములు" అన్నారు. ఇవన్నీ రంగులకు చెప్పిన గుణాలు. రూపం మాటలేదు. అందువల్ల అవి ఎలాటి రంగులో తెలియదు. ఇక ఈ వ్యాసంలో సాగిన వివరణ ఆ చిత్తరువు యొక్క భావ విశిష్టతకు కళాత్మకు సంబంధించినది. చిత్రకారుడు ఈ చిత్రంద్వారా ఏమి చెప్పదలుచుకున్నాడో దాన్ని కాటూరివారు వ్యాఖ్యానించారు. ఈ వ్యాసాన్ని వారి కళావిమర్శకు లక్ష్యంగా భావించవచ్చు.

చిత్ర భంగిమలనుగాని, వర్ణ సమ్మేళనాన్నిగాని, రూపకల్పననుగాని ఈ వ్యాసంలో పరామర్శించలేదు. అందువల్ల అసలు వ్యాసానికి ఆధారమైన ఆ బొమ్మ మన మనస్సుకు తట్టదు. అసలు కాటూరివారి ఉద్దేశ్యం కూడ చిత్ర స్వరూపం చెప్పటంకాదు. చిత్రకారుడు ఏ భావాన్నయితే రేఖల్లో రంగుల్లో నిబంధించాడో! దాన్నే అక్షరరూపంలో వ్యక్తం చేయటమే వారి ఉద్దేశ్యం. అంతేకాదు రంగుల్లో ఇమిడని భావాల్ని అక్షరాల వలలో బంధించే ప్రయత్నం కూడ చేశారు.

విదురుడు తన యింటికి వచ్చిన కృష్ణునిచూచి ఎలా సంభావించాడో, ఎలాటి అనుభూతి పొందాడో ఈ వ్యాసంలో వర్ణింపబడింది. కొంతసేపు యశోదానందనుడని, మరికొంతసేపు శంఖచక్రధరుడనీ, మరొకసారి ద్రౌపదీ మానరక్షకుడని భావిస్తూ, చివరకు అవేమీకాదు, రూపెత్తిన తన స్వానుభూతి అని సమాధానపడ్డాడు. కృష్ణుణ్ణిచూచిన విదురుడు చిరకాల ప్రవాసం తరువాత తిరిగి వచ్చిన తండ్రిని దర్శించిన కుమారుడిలాగా పులకించిపోయాడు.

విదురుడి భావాల్ని వివరించడంలో కాటూరివారు గొప్ప ఆధ్యాత్మికదృష్టిని ప్రదర్శించారు. జీవాత్మకు పరమాత్మే తండ్రి. జన్మపరంపరలతో పరమాత్మునికి దూరమైపోవటమే ప్రవాసం. తిరిగి తండ్రిని గుర్తించటం జీవి సుకృత విశేషం. విదు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రుని ఆనందమదే. ఆ సంతోషం ఎక్కడ జారిపోతుందోనని కృష్ణుణ్ణి స్పృశించి, వదలలేక, అవధిలేని ఆనందాన్ని పొందుతున్నాడతడు. ఆ చిత్రం వేసిన భట్టాచార్యులవారు తన సృష్టిని చూచి తానే సంతోషిస్తున్నారు. అలానే ఈ విషయానికి అక్షర రూపమిచ్చిన కాటూరివారూ ఆనందిస్తూనే ఉన్నారు. ఈ ముగ్గుర్ని కలిపివేసిన ముచ్చటైన ముడే ఈ వ్యాసం ముగింపు.

ఈ వ్యాసం ముగింపు చాలా విశిష్టంగా ఉన్నది. ఇక్కడ వారు వ్యక్తంచేసిన భావాలు లోతైనవి. కవి తన మనసులో భావానికి అక్షరరూపమిస్తూ, సరిగా అది తన హృదయానికి ప్రతిబింబంగా ఉందా! లేదా అని మాటిమాటికి మార్చి తీర్చిదిద్దుతుంటాడు. చిత్రకారుడు తన మనోనేత్రం ముందు నిలిచిన రూపాన్ని రకరకాల రంగులతో రేఖలతో చిత్రిస్తూ తన హృదయంలో రూపానికి అది సరయిన ప్రతిబింబమా కాదా! అనుకుంటూ సవరిస్తుంటాడు. ఫలించిన తమ కృషికి కవి, చిత్రకారుడు ఇద్దరూ ఆనందం పొందుతారు. విదురుడు కూడ తన మానసవీధిలోని భగవానుని రూపం ఎదురుగా కనిపిస్తుంటే స్పృశించి ఆనందిస్తున్నాడు. కవి ఆనంద స్థితి, చిత్రకారుడి ఆనందస్థితి ఈ రెండూ విదురుడి ఆనందస్థితిలో మనకు సాక్షాత్కరిస్తున్నవి." ఇది కాటూరివారి ముగింపు వాక్యాల సారాంశం.

కవితానందం, చిత్రలేఖనానందం రెండూ రసానందాలే. భక్తుడు భగవంతుణ్ణి దర్శించినపుడు పొందే ఆనందం బ్రహ్మానందం. రసానందం బ్రహ్మానందంలో పర్యవసిస్తుందని దీని భావం.

చిత్రలేఖనానందం భట్టాచార్యుల వారిది; కవితానందం కాటూరివారిది. కాటూరి వారు కూడ ఇందులో విదురకృష్ణుల అనుబంధాన్ని తనివితీర వర్ణించారు. వీరిద్దరు పొందే ఆనందం విదురుడు పొందే బ్రహ్మానందంలో లీనమౌతున్నది. అంటే విదురుడు పొందిన బ్రహ్మానందాన్ని, చిత్రంలో చిత్రించిన భట్టాచార్యునికి దీటుగా అక్షరరూపంలో నేను చిత్రించానని కాటూరివారు చెబుతున్నారన్నమాట. భట్టాచార్యుల వారిది వర్ణచిత్రమైతే వీరిది అక్షర చిత్రం. రెంటి లక్ష్యం విదురుడు పొందుతున్న బ్రహ్మానందమే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

5. మధురభారతి–మా బుచ్చి సుందరుని స్మృతి

"మధురభారతి—మా బుచ్చి సుందరుని స్మృతి" అనేది మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రిని గురించిన స్మృతివ్యాసం. మాధవపెద్ది కాటూరివారికి మంచి మిత్రుడు. ఆయన మరణం వేంకటేశ్వరరావుగారికి తీరని ఆవేదన కలిగించింది. శాస్త్రి గారిని గురించి వారి మనసులో మెదలుతున్న స్మృతిశకలాల సంధానమే ఈ వ్యాసం. మొదట తమ అనుబంధం, తరువాత శాస్త్రిగారి స్వరూప స్వభావాలు, ఆ తరువాత రేఖామాత్రంగా కవితా సమీక్ష. ఈ విధంగా సాగింది రచన. కొండను అద్దంలో చూపించినట్లు కాటూరివారు మాధవపెద్దిని ఈ వ్యాసంలో చూపించారు.

తన పద్యాలు కాటూరి వారికి వినిపించి "బాగున్నవా?" అని అడగటం శాస్త్రి గారికి పరిపాటి. ఆ విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ-

"బాబుగారు నిజం చెప్పండి" అని గడ్డం పుచ్చుకొని అడిగెడి మా బుచ్చయ్య నెట్లు మరవగలను. వీధివెంట నడచుచునే పద్యములు వినిపించుచు, చప్పున అడ్డము తిరిగి నిలబెట్టి, ఏమంటారు నా మామూలు ధోరణిలో ఉన్నావా? అనెడి మిత్రసత్త ముడు, కావ్యైక జీవనుడు మా బుచ్చన్న కన్నులలో మెదలుచునే యున్నాడు."

(సాహి. ద. 102 పే)

అంటారు కాటూరివారు. ఇవి వారి అనుబంధాన్ని సూచించే వాక్యాలు.

"కన్నులలో మెదలుచునే యున్నాడు" అంటూ మన కండ్లముందు శాస్త్రిగారి రూపాన్ని నిలిపారు. పొట్టిగా, లావుగా ఉండే శాస్త్రిగారు తనను గురించి తానే చెప్పుకున్న పద్యాన్ని ఉదాహరించి వారి హాస్య ప్రియత్వాన్ని కూడ చూపించారు కాటూరివారు.

"ఒక లంబోదరుడైన పుత్రకుడు మున్నున్నట్టిదే నీకు జా
లక కాబోలును సృష్టి చేసితివి ఈ లంబోదరుం గూడ" అంటారు

మాధవపెద్ది మృత్యుంజయ శతకంలో.

"విశాలమైన ఆ ఫాలతలము—ఒత్తయిన కనుబొమలు, కొట్టవచ్చినట్లుండు ఆ ముక్కు, శరీరమునకు స్థౌల్య మాపాదించు ఆ బొజ్జ "ఎగ్రదోయ దిగజారు నెద్ది మాధవపెద్ది" అని ఆయన చెప్పికొనినట్లే ఎంత ఎగలాగినను బొడ్డు క్రిందకి జారి పోవు ఆ పంచెకట్టు! ఆడుగో! మా సుందరరామ వామనుడు .... బొత్తములు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లేని ఆ చొక్కా, ఎంత తుడిచినను ఊటలూరు ఆ పొడుము చారికలు, మడిచి చంకన పెట్టికొన్న ఆ పైపంచయు! అయ్యో-"

ఇలా కాటూరివారు బచ్చి సుందరరామశాస్త్రిగారిని మన ముందు నిలిపారు. ఒక వ్యక్తి అక్షర రూపాన్ని ఇలా నిర్మించే ప్రతిభ కాటూరివారికి పెన్నతో పెట్టిన విద్య.

తరువాత శాస్త్రిగారికి విజయవాడలో జరిగిన సువర్ణ ఘంటా కంకణ సత్కారము, ముట్నూరివారితో శాస్త్రిగారికి కల అనుబంధం, కవిత్వమంటే వళ్లు తెలియక, పొడుంకాయ, పైపంచె దారిలో జారవిడిచే! వారి అయోమయం, ఇలా ఎన్నో విషయాలు ఈ వ్యాసంలో ప్రస్తావింపబడ్డవి.

శాస్త్రిగారి పాండిత్యాన్ని, వారి చమత్కార చాటువులను పంచవటి, శబరి మొదలైన ఖండకావ్యాలల్లోని పద్యాలను ఉదాహరిస్తూ చక్కగా వివరించారు వేంకటేశ్వరరావుగారు. ఈ వ్యాసమొక గద్యస్మృతి కావ్యం

6. సరస్వతీ చతుర్ముఖుల శృంగారం

పింగళి సూరన కళాపూర్ణోదయమొక అద్భుతమైన కావ్యం. అందులో అనేక చిత్రాతి చిత్రపములున్నవి. ఎన్ని అంటే! బ్రహ్మ సృష్టిలో ఎన్ని ఉన్నవో అన్ని. సరస్వతీదేవి కటాక్షం ఉంటే కాని అవి అర్థం కావు. ఆ కథాకల్పనమే వేరు. బహు కథాకదంబమది. ఏ కథ ఎక్కడ ప్రారంభమౌతుందో! ఎక్కడ ఆగుతుందో! మరేకథ ఎక్కడ అనుసంధింపబడుతుందో. ఆలోచనాపరులకు గాని ఆ చిక్కు విడివడదు. చమత్కారం స్ఫురించదు. మామూలు వారి కవి కాశీమజిలీ కథలే. "సరస్వతీ చతుర్ముఖుల శృంగారము" అనే వ్యాసంలో సరస్వతీ చతుర్ముఖుల శృంగార ఘట్టాన్ని చక్కగా విశదీకరించారు. ఆ సన్నివేశంలోని అన్వయక్లేశాన్ని తొలగించి మధ్యమధ్యలో పాఠకుడికి అందకుండా దూరంగా నిలిచే రసకళలాల్ని అందుబాటులోకి తెచ్చి కవి ఆశించిన ఆ సన్నివేశ సమగ్ర రసస్వరూపాన్ని పాఠకుడి కన్నుల ముందు నిలిపారు కాటూరివారు.

సరస్వతీ చతుర్ముఖుల విలాసవృత్తాంతంలో దాగి ఉన్న తాత్విక సత్యాన్ని కూడ వారు విపులీకరించారు. బ్రహ్మ-సరస్వతుల ప్రణయానికి, భూలోకంలో జరిగే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కథకు గల లింకు సులభంగా అందదు. దాన్ని చక్కగా వ్యక్తం చేశారు వేంకటేశ్వర్రావుగారు. భూలోక వృత్తానికి ఆ దంపతుల విలాసమే మూలమని చెప్పటమే ఈ వ్యాస లక్ష్యం. కాటూరివారి ఈ వ్యాసం చదివిన తరువాత సూరనగారి కళాపూర్ణోదయం చదివితే మనకు సులభంగా రససిద్ధి కలుగుతుంది.

7. మా గురుదేవులు

కాటూరివారికి వారి గురువులు వేంకటశాస్త్రిల్లవారికి గల అనుబంధాన్ని తెలియజేసే వ్యాసం. ఈ వ్యాసం శాస్త్రిగారి స్వరూపస్వభావాల్ని రేఖామాత్రంగా తెలియజేస్తున్నది. అవధానాలలో ఈ జంటకవుల నిర్వహణం, వారివారి ప్రత్యేకతలు కొద్దిగా పరామర్శింపబడ్డవి.

అవధానాలలో బరువంతా తిరుపతిశాస్త్రిగారి కెత్తి, వేంకటశాస్త్రిలుగారు చమత్కార ప్రసంగంతో సభను ఆకట్టుకునేవారని, కమ్మని కంఠంతో వారు పద్యం జగన్మోహనంగా చదివేవారని ఆ పద్యం చదివే తీరు ఆ కాలం కవులకు ఒరవడిగా ఉండేదని వారి పాండిత్యాన్ని వివరించారు. వేంకటశాస్త్రిగారికి ముక్కోపి, కలహప్రియుడు అనే అపప్రథ రావటాన్ని ఉటంకిస్తూ వారి సత్యప్రియత్వం, నిర్మొగమాటంగా, సూటిగా మాట్లాడటమే, అలాటి అపార్థాలకు కారణమైనదని, వాస్తవానికి వారు నిరాడంబరులు, నిగర్వులని వివరించారు.

కడియంలో వారు ఎందరో విద్యార్థులకు భోజనంపెట్టి చదువు చెప్పటం, ఆస్థాన కవిగా గౌరవం పొందటం మొదలైన ఎన్నో విశేషాలు ప్రస్తావిస్తూ ఒక శిష్యుడు శాస్త్రిలవారిపై చెప్పిన పద్యాన్ని కాటూరివారు ఉదహరించారు. అది ఆ మహనీయుని రూపాన్ని మన కండ్లముందు నిలుపుతుంది.

"నొసటం గుంకుమబొట్టు కేలనొక పొన్నుం గఱ్ఱ పాదమ్ములన్
పెసపా పోసులుదాల్చి మేముదుకుటన్ పెల్లైన గుండంచు మే
ల్వెస నంబంచులు జార కట్టికొని క్రేవన్ మేముగాన్ తోట కుం
బసరున్ సంజలనేగు మా గురుని రూపందేను ధ్యానించెదన్"

ఈ వ్యాసం కాటూరివారి గురుభక్తి ఎంతటిదో మనకు తెలుపుతుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

8. చిత్రశాల

"చిత్రశాల" అనేది ప్రసంగ వ్యాసం. ముట్నూరివారి స్మృతి చిహ్నంగా నిర్మింపబడే ఒక మందిరానికి శంకుస్థాపన సందర్భంగా చేసిన ప్రసంగమిది. దీంట్లో ఆంధ్రుల చరిత్ర–సంస్కృతి, శాఖా చంక్రమణంగా స్థాలీపులాకంగా చర్చించ బడింది.

ఇప్పటివరకు వివరించిన వ్యాసాలన్నీ కాటూరివారి కళా విమర్శ దృక్పథానికి దగ్గరగా ఉన్నవే. వీరికి వస్తువుమీద కంటే దాని గుణంమీద అభిమానం ఎక్కువ. అందువలన వీరి వ్యాసాలల్లో శాస్త్రీయ దృక్పథంకంటె సౌందర్య దృక్పథం ఎక్కువగా కనుపిస్తుంది.

ఈ వ్యాసంలో అహింసయొక్క గొప్పదనాన్ని ప్రశంసించారు కాటూరివారు. "హింస మానవుని ప్రళయము దెసకు, అహింస సృష్టి దెసకు ఆకర్షించుచుండును" అంటూ వారి అభిప్రాయాన్ని తెలిపారు.

యుద్ధంవల్ల మానవ సంస్కృతి నాశనమౌతుందని, ప్రపంచం ఆనందంలో పుట్టి ఆనందంలో లయిస్తున్నదని, ప్రజలకు అలాటి ఆనందాన్ని కవులు, శిల్పులు పంచగలుగుతారని, కవుల, శిల్పుల ఘనతను కాటూరివారు కీర్తించారు. ఈ వ్యాసంలో వివరించతగ్గ విశేషాలు ఎక్కువగా లేవు.

9. శంభుదాసు సాత్వికత

పై వ్యాసాలకు భిన్నంగా మరి నాలుగు వ్యాసాలిందులో ఉన్నవి "శంభుదాసు సాత్వికత" "రవీంద్రుడు–తపోవన సందేశము" "నవల-సంఘ సంస్కారము" "ఆశు కవిత్వము" అనేవవి. వీటిలో ఆపే శాఖా చంక్రమణంలేకుండ ఉపపత్తులను చూపుతూ విషయ వివరణం చేశారు. ఈ నాల్గింటిని విమర్శన వ్యాసాలని, మిగిలిన వాటిని వచన కావ్యాలంటే బాగుంటుంది.

"శంభుదాసు సాత్వికత"లో కవులు-వారి సాత్విక రాజస ప్రవృత్తులను సోదాహరణంగా వివరించారు. ఎఱ్ఱన సత్వ గుణసంపన్నుడంటూ ఆయన గ్రంథాల నుండే పద్యాలను ఆధారంగా చూపారు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ఈజోటిన్ నిను బోలు సత్కవులు లేరీనాటి కాలమ్మునన్" అనిపించుకొన్న శ్రీనాథుడు; "ఆ సేతు హిమాచలం దాకా నిన్ను ఎదిరించగల కవులేరీ! నీవు శారదా స్వరూపుడివి; అనిపించుకొన్న! రామకృష్ణుడు" "అమలోదాత్త మనీష నే నుభయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పమునన్ బారగుడన్ గణావిదుడ" నని చెప్పుకొన్న తిక్కన్న; నానా రుచిరార్థ సూక్తినిధిని, అని చెప్పుకొన్న నన్నయ, సంస్కృత కవులు, కాళిదాసు, జయదేవుడు వీరందరు రజోగుణ ప్రధానులని కాటూరివారు వివరించారు.

ఎఱ్ఱన హరివంశము, నృసింహ పురాణాలలోనుంచి ఉపపత్తులు చూపుతూ ప్రబంధ పరమేశ్వరుడు పరమసాత్వికుడని నిరూపించారు కాటూరివారు. రజోగుణం కవితా సృష్టికి కారణమైనా సత్వగుణంగల కవులు ఎంతో సంయమనంతో కావ్య నిర్మాణం చేస్తారని అలాటి ప్రతిభ కవిత్రయాని కున్నదని, కాటూరివారి వ్యాస సారాంశం. ఈ వ్యాసంలో తమ వంశ ప్రదీపకుడైన ఎఱ్ఱనపై వేంకటేశ్వరరావుగారికి గల అభిమానం వ్యక్తమౌతున్నది.

10. ఆశుకవిత్వం

"ఆశు కవిత్వం" అనే వ్యాసం మామూలు పద్ధతిలో విషయ విశ్లేషణతో కూడిన వ్యాసం. దీంట్లో అటే ప్రత్యేకతలు లేవు.

అప్రయత్నంగా జేసే శీఘ్ర రచనను ఆశువంటారని; మరొక విధంగా ఆలోచిస్తే, భావ తీవ్రతగల కవిత్వాన్నికూడ ఆశువుగానే పరిగణించవచ్చని వివరిస్తూ ఒక వలపుకాడు చెప్పిన పద్యాన్ని కాటూరివారు ఉదాహరించారు.

జొన్న చేనుకాడ సొగసుకత్తెను జూచి
నిన్న పేలనుంచి నిదురరాదు
దాని నన్ను గూర్చి దయజూపు మాధవా
పొన్నపూలుదెచ్చి పూజసేతు

(సా. ద. పే. 79)

పూర్వకాలంలో నాగరకులు సాయం వేళలలో ఉద్యానవనాలల్లో సంగీత, సాహిత్యగోష్ఠులు నిర్వహించేవారని, దాంట్లో స్త్రీలుకూడ పాల్గొనేవారని వివరించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆశు కవితా పద్ధతుల్ని తెలియజేస్తూ శతలేఖినీ కవిత్వం, అష్టావధానాలను వివరించారు. అష్టావధానానికి కొప్పరపు సోదరకవులను ఉదాహరణగా పేర్కొన్నారు.

అవధానాలలో ఆశువు యొక్క ప్రాముఖ్యం తెలుపుతూ జంటకవులు అందులో వారి గురువులు, తిరుపతి వేంకటకవులను గురించి, వారి ఏకాగ్రతను గురించి తెలియజేశారు.

ఆశుకవితలో సాహిత్యవిలువల్ని పరామర్శిస్తూ, శతఘంట కవనం, అష్టావధానాలలోకంటె, మామూలు ఆశువులో సాహిత్యవిలువలు ఎక్కువగా ఉండే అవకాశ మున్నదంటారు వేంకటేశ్వర్రావుగారు.

శ్రీనాథుని దగ్గరనుంచి తిరుపతి, కొప్పరపు కవులదాకా ఆశువుచేతనే కవులు రాజులను, ప్రజలను సమ్మోహితులను చేశారని, ఇది ఎంతో ఆకర్షణగల ప్రక్రియ అని అభిప్రాయపడ్డారు.

ఇది విషయప్రధానమైన వ్యాసం. రచన సూటిగా సరళంగా సాగింది.

11. నవల - సంఘ సంస్కారం

"నవల-సంఘ సంస్కారం" కూడ ఎంతో శాస్త్రీయ దృక్పథంతో సాగిన రచన. ఎక్కడా ఊహలు, కల్పనలు, వర్ణనలు లేవు. విషయ ప్రధానంగా సాగిన వ్యాసమిది.

నవల కావ్యత్వం—ఆధునిక సామాజిక విషయాలు చిత్రించటానికి నవలా ప్రక్రియ ఎలా సమర్థవంతంగా ఉంటుంది- ఆంగ్ల సాహిత్య ప్రభావం- మొదటి నవల రాజశేఖర చరిత్ర రచన, మొదలైన ఎన్నోవిషయాలు దీంట్లో చర్చించబడినవి.

శ్రవ్య దృశ్య కావ్యాలలోని మేలు గుణముల సమన్వయమే నవల అని వీరు వివరించారు. అడివి బాపిరాజు, విశ్వనాథ, బుచ్చిబాబు మొదలైన ప్రముఖ నవలా రచయితల ప్రస్తావనకూడ ఈ వ్యాసంలో ఉన్నది.

లోకం కామవశమై ఉంటుందని, కామ నిర్వహణంవల్లనే సుఖం కొనసాగు తుంటుందని వారభిప్రాయపడ్డారు. "పురుష ప్రయత్నంవల్ల కామాన్ని అనుభవించటానికి తగిన ధనం లభిస్తుంది. ఆ ప్రయత్నంలోని హెచ్చు తగ్గుల్నిబట్టి ధన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంపాదనలో వ్యత్యాసాలు కలుగుతుంటవి. ఆ ధనాన్నిబట్టి భోగాలలో హెచ్చు తగ్గులు సమాజంలో ఏర్పడతవి. అయితే అందరికి కనీసం కొంతైనా సౌఖ్యం లభించేటట్లు అర్థ కామాల వ్యవస్థ ఉండాలి" అంటారు కాటూరివారు.

"సంఘంలో వ్యష్టి సమష్టుల సంఘర్షణవల్ల నే నూతనాచారములు పుడతాయని వారన్నారు. వ్యక్తి స్వేచ్ఛ లేకపోతే సమాజం అభివృద్ధి పొందదు. అలా అని వ్యక్తి స్వేచ్ఛ మితిమీరితే సంఘ సుస్థితికి భంగం కలుగుతుంది. కాలానుగుణంగా నీటిమధ్య సమన్వయం సాధిస్తేనే ప్రగతి" అంటూ ఈ తరానికి వారు సందేశ మిచ్చారు.

ఆంగ్లేయుల పరిపాలనలో వారి సభ్యత, సంస్కారాలు, సాహిత్యం, మన ప్రజలపై ప్రభావం చూపించినవని, వాటివల్లే స్త్రీ పునర్వివాహం, విగ్రహారాధనపై నిరసన మొదలైన అభిప్రాయాలు సమాజంలో ప్రవేశించినవని కాటూరివారు ఈ వ్యాసంలో తెలిపారు.

కందుకూరివారి రాజశేఖర చరిత్రతో ప్రారంభమైన నవలా ప్రక్రియ సమాజానికి చేసిన బాగోగులు వివరించారు. కందుకూరి, విశ్వనాథ, బాపిరాజుల నవలా తత్త్వాన్ని ఈ వ్యాసంలో విశదీకరించారు కాటూరివారు.

12. రవీంద్రుడు - తపోవన సందేశం

"రవీంద్రుడు - తపోవన సందేశం" అనే వ్యాసం భారతీయ సంస్కృతిపై పాశ్చాత్య నాగరకతా ప్రభావాన్ని తెలియజేసే చక్కటి రచన. కాటూరివారికి రవీంద్రుడంటే ఎంతో అభిమానం.

మానవునిలో దివ్యత్వం మేల్కొల్పాలని చాలామంది పెద్దలు చెబుతుంటారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "దైవత్వం సంగతి అలా ఉంచండి మానవత్వమే లోపిస్తున్నది. ఆ మానవత్వాన్ని మేల్కొల్పటానికే బుద్ధుని మొదలు గాంధీ దాకా కృషి చేశారు" అంటాడు కాటూరివారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ వ్యాసంలో గ్రీకు నాగరకత, ప్రాచీన భారతీయుల దృష్టి, నేటి స్థితులను గురించి రవీంద్రుని భావాల్ని కాటూరివారు వ్యక్తం చేశారు. చివరిగా ప్రేమే తరగని ఐశ్వర్యమని దానితోనే విశ్వకళ్యాణం జరుగుతుందన్న రవీంద్రుని అభిప్రాయాలకు పట్టం గట్టారు.

భారతీయ ఋషులు బోధించిన సంయమనం, పాశ్చాత్యులు బోధించిన పురుషకారం రెంటి ప్రాముఖ్యత దీంట్లో వివరించబడింది. ఈ రెండూ సమన్వయం చేసి కొనవలసిన అవసరాన్నికూడ ఈ వ్యాసం మనకు గుర్తు చేస్తుంది. ఇది రవీంద్రుడి సందేశాన్ని తెలుగువారికి అందించే ప్రయత్నం.

వ్యక్తి వేరు, అతనిలోని కవి వేరు. కాని ఆ వ్యక్తి జన్మాదికాలు, తల్లిదండ్రుల సంస్కారం, అతని జీవనవిధానం మరెన్నో విషయాలు ఆ కవితామూర్తి రూపుదిద్దుకోటంలో దోహదం చేస్తవనేది నిర్వివాదాంశం. ఈ విషయాలన్నీ సమగ్రంగా పరిశీలించినపుడే కవి కవితా స్వరూపం పూర్తిగా గోచరిస్తుంది. రసదృష్టిగల కాటూరి వారి వ్యాసాలు సాహితీభావ వీచికల్నే గాని భౌతికరూపాల్ని అంతగా మన కన్నులముందు నిలుపవు. ఈ సంపుటిలో అధికమైన వ్యాసాలు ఇదే ధోరణిలో సాగినవే. కాటూరి కవిది కళాదృష్టి; రస వృష్టి.

—)o(—

FORWARDED FREE OF COST, AND WITH THE COMPLIMENTS OF THE DEPT. OF EDUCATION, GOVT OF INDIA, NEW DELHI

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

IV. అనువాదములు

కాటూరివారు సంస్కృత - ఆంధ్ర, ఆంగ్ల, భాషలలో నిష్ణాతులు. స్వతంత్ర రచనలేకాక వీరి అనువాదాలుకూడ ఆంధ్ర భాషా యోషకు వెలలేని ఆభరణాలే. సంస్కృత, ఆంగ్ల భాషల్లోనుండి పద్య గద్యాల్ని, నవలలనూ, నాటకాల్ని వీరు తెనిగించారు.

—: కాటూరివారి సంస్కృత అనువాదాలు :—

1. దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రం – మూలం ఆదిశంకరుల రచన— 1956
2. శివాపరాధ క్షమాపణ స్తోత్రం – మూలం ఆదిశంకరుల రచన— 1959
3. సౌందర్య లహరి – మూలం ఆదిశంకరుల రచన—
4. ప్రతిజ్ఞా యౌగంధరాయణము – మూలం భాసుని నాటకం – సర్వోదయ గ్రంథమాల, దక్షిణభారత హిందీ ప్రచారసభ ప్రచురణ— 1967
5. స్వప్న వాసవదత్తము – మూలం / భాసుని నాటకం – సర్వోదయ గ్రంథమాల, దక్షిణ భారత హిందీ ప్రచారసభ ప్రచురణ— 1967.

—: కాటూరివారి ఆంగ్ల అనువాదాలు :—

1. నల్ల కలువ - మూలం అలగ్జాండరు డ్యూమాస్ రచించిన "బ్లాక్ టు లివ్" అనే ఫ్రెంచినవల — 1938 జూన్‌నుండి అక్టోబరువరకు కృష్ణా పత్రికలో ప్రచురింపబడింది. 1944లో నవ్య సాహిత్య పరిషత్తు - గుంటూరువారు ప్రథమంగా పుస్తకంగా ముద్రించారు. 1965లో కాటూరి కవితాలత – విజయవాడవారు ద్వితీయ ముద్రణ కావించారు.
2. సీత పెండ్లి - మూలం ఎ.యస్. పి. అయ్యర్ నాటికలు — వావిళ్ళవారిచే 1938లో ప్రచురింపబడినది.
3. ముగ్గురు మూర్తులు - మూలం ఎ.యస్.పి. అయ్యర్ రచించిన "త్రి మెన్ ఆఫ్ డెస్టినీ" అనే నవల — వావిళ్ళవారిచే 1950లో ప్రచురింపబడింది.
4. మహాత్మాగాంధీ చరిత్ర - మూలం ఫ్రెంచిభాషలో రోమిన్ రోలాండ్ రచనకు యల్. వి. రామస్వామి అయ్యర్ ఆంగ్లానువాదం - 1958లో కల్చరల్ బుక్స్ ప్రయివేట్ లిమిటెడ్‌వారు ప్రచురించారు. నాకు గ్రంథం లభించ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లేదు. ఈ సమాచారానికి యల్. వి. రామస్వామి అయ్యర్‌గారి గ్రంథపీఠికే ఆధారం.

5. మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ - మూలం మహాదేవీ దేశాయి ఆంగ్ల రచన- 1959లో కల్చరల్ బుక్స్ ప్రయివేటు లిమిటెడ్ మద్రాసువారు ప్రచురించారు.

6. కవీంద్ర కథ - మూలం లీలామజుందారు, రవీంద్రుని గురించి చేసిన ఆంగ్ల రచన — 1961లో సాహిత్య ఎకాడమీ, ఢిల్లీ వారు ప్రచురించారు.

7. సత్య శోధన - మూలం భరతన్ కుమారప్ప రచించిన గాంధీగారి సంక్షిప్త జీవిత చరిత్ర — 1977లో త్రివేణీ పబ్లిషర్సు - మచిలీపట్టణంవారు తృతీయ ముద్రణం కావించారు.

అది ఏ భాషా గ్రంథమైనా అనువాదం చేసేటప్పుడు కాటూరివారు మూలాన్ని అనుసరిస్తూనే తెలుగు జాతీయాలు, పలుకుబడులు, సామెతలు ప్రయోగించటం ద్వారా దానికి తెలుగుదనం తీసికొనివస్తారు. కొన్నిచోట్ల అన్యభాషా నామాల్ని, సంబోధనల్ని సంస్కృతీకరించటమో తెలుగు పలుకుబడికి దగ్గరగా సవరించటమో చేస్తుంటారు. ఇక శ్లోకాలను పద్యాలుగా అనువదించేటప్పుడు రసానుకూలంగా, కొన్నిచోట్ల విస్తరించటమూ, మరి కొన్నిచోట్ల సంగ్రహించటమూ వీరి పద్ధతి. ఆ అనువదించేది నాటకాలైతే సముచితమనుకొన్నచోట్ల శ్లోకాలను వచనాలుగానే వీరు అనువదింవారు.

1. సంస్కృతానువాదములు - పద్య కావ్యములు

జీవిత ఉత్తరార్థంలో వేంకటేశ్వరరావుగారిలో తాత్త్వికచింతన బాగా పెరిగింది. అరవయ్యోపడిలో పడ్డ తరువాత భక్తిరస ప్రధానమైన కావ్యాలను రచించటమే కాకుండా అలాంటి కావ్యాలను సంస్కృతంనుండి అనువాదంకూడ చేశారు. వాటిలో శంకరాచార్య కృతమైన "దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రం" "శివాపరాధ క్షమాపణ స్తోత్రం" "సౌందర్య లహరి" ముఖ్యమైనవి. ఆచార్య శంకరులు ఎంత గొప్ప యోగో, అంత గొప్పకవి. ప్రకృతి సౌందర్యమెంత రసవత్తరమో వీరి కవిత్వమంత రసవత్తరం. శంకరుల రచనలోని ఆధ్యాత్మిక, భక్తి, భావనలే కాకుండ కవితా సౌందర్యంకూడ కాటూరివారిని ఆకర్షించి ఉంటుంది. ఈ పద్యానువాదాలు చక్కటి తెలుగు పలుకుబడితో స్వతంత్ర రచనలుగా భాసిస్తున్నవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రం

కాటూరివారు దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రాన్ని 1956లో అనువాదం చేశారు. మూలంలోఉన్న పన్నెండు శ్లోకాల్ని తెనిగించారు. దాంట్లో ఒకటి రెండు పద్యాలు : చూడండి.

మూలం : "చితాభస్మాలేపో గరళమశనం దిక్పటధరో
జటాధారీ కంఠే భుజగపతిహారీ పశుపతిః
కపాలీ భూతేశో భవతి జగదీశైకపదవీం
భవానీ త్వత్పాణిగ్రహణ పరిపాటీఫలమిదమ్"

అనువాదం: "తనకేమున్నది చేదుమేత మెయిపూతల్ బూదియుంగాక, పా
పనగల్ ప్రేల దిగంబరుండయి జటాభారమ్ముతో బిచ్చపుం
బునుకం దాల్చి చరించు నా పశుపతిన్, భూతేశు విశ్వాధినా
ధుని గావించెను నీ కరగ్రహణ మెంతో వింత కాత్యాయనీ!"

పద్యం ఎత్తుగడే కడు రమణీయం. "తనకేమున్నది చేదుమేత అనటం ఎంత కమ్మని పలుకుబడి.

మరొక శ్లోకాన్ని చూడండి. దానికి కాటూరివారు చేసిన అనువాదం భావ స్ఫూర్తితో, చక్కని తెలుగు పలుకుబడితో సహజంగా ఉన్నది.

మూలం : "జగదంబ విచిత్రమత్ర కిం పరిపూర్ణా కరుణాస్తి చేన్మయి।
అపరాధ పరంపరావృతం నహి మాతా సముపేక్షతే సుతమ్॥

అనువాదం: "నిండు మనమున నను గరుణించి ప్రోచు
ట బ్రమది కాదు సూ జగదంబ! నీకు
సుతుని యపరాధములు పరశ్శతము లేని
కడుపునం బెట్టుకొనుగాదె కన్నతల్లి!"

నిండు మనము, అనేది చక్కటి ప్రయోగం. కడుపున పెట్టుకోవటం అనేది చక్కటి తెలుగు పలుకుబడి. కొడుకు ఎన్ని తప్పులుచేసినా తల్లి కడుపులో పెట్టుకుంటుంది, అనటంలో మాతృత్వంలోఉన్న గొప్పతనం చక్కగా వ్యక్త మయింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సౌందర్య లహరి

కాటూరివారు సౌందర్యలహరిలో శ్లోకాలు చాలా అనువాదం చేశారు. అవి సహజ సుందరంగా ఉన్నవి. ఏ అనువాదాంశం చదివేటప్పుడు అది అనువాద మనిపించదో! ఇక్కడ మూలంలో ఏమి చెప్పి ఉంటారు? ఒకసారిచూస్తే బాగుండు అనే ఆలోచన పాఠకుడికి రాదో అది నిర్వివాదంగా ఉత్తమ అనువాదం. అనృత దోషం చుట్టుకుంటుందని భయంతప్ప, అలాటి రచనలు స్వతంత్రాలే. కాటూరి వారి అనువాదాలు ఆ కోవకు చెందినవే.

సౌందర్య లహరిలో మొదటి శ్లోకానికి అనువాదం పరిశీలిస్తే కాటూరి వారి ప్రతిభ తెలుస్తుంది.

మూలం : "శివ శ్శక్త్యా యుక్తోయది భవతి శక్తః ప్రభవితుం
న చే దేవం దేవో న ఖలు కుశలః స్పన్దితుమపి,
అతస్త్వా మారాధ్యాం హరిహరవిరించాదిభిరపి
ప్రణన్తుం స్తోతుంవా కథమకృతపుణ్యః ప్రభవతి॥ (శ్లో 1)

ఇది ఆదిశంకరుల శ్లోకం. దీనికి కాటూరి అనువాదం చూడండి.

అనువాదం: "ఈవొక యింత తోడుపడ నెంతకు నేనియు నేర్చుబో శివుం
డీవటు మిన్నకున్న యెడ నెందులకుం గొఱగాడు శక్తిరో!
దేవతలున్ త్రిమూర్తులు నుతించి భజించెడి నిన్ను మ్రొక్క నీ
సేవలొనర్చ పున్నెములు సేయరు నాఁడును నేఁడు మాదృశుల్"
(ప. 1)

కొందరికి పద్యం ప్రారంభించటంలో నేర్పు, మరికొందరికి పద్యం ముగింపులో ప్రతిభ ఉంటుంది. కాటూరివారి పద్యాల ఎత్తుగడ పరమాద్భుతంగా ఉంటుంది. "ఈ వొక యింత తోడు పడనెంతకు నేనియు నేర్చుబో శివుండు" అనటంలో చక్కని తెలుగు పలుకుబడి, మంచి ఎత్తుగడ పాఠకుల్ని ఆకర్షిస్తుంది.

ఆదిశంకరుల శ్లోకానికి చక్కని తెలుగు పలుకుబడితో కాటూరివారు చేసిన అనువాదం మరొకటి చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూలం . "కిరీటం వైరించం పరిహర పురః కైటభభిదః
కఠోరే కోటీరే స్ఖలసి జహి జమ్భారిమకుటం
ప్రణమ్రేష్వేతేషు ప్రసభముపయాతస్య భవనం
భవస్యాభ్యుత్థానే తవ పరిజనోక్తి ర్విజయతే." (శ్లో. 29)

బ్రహ్మేంద్రాదులు అమ్మవారికి మ్రొక్కుతున్నారు. ఈ లోపల స్వామివారు వస్తున్నారు. ఆమె తొట్రుపాటుతో ఎదురుపోతున్నది. అప్పుడు చెలికత్తెలు "అమ్మా! ఇది బ్రహ్మకిరీటం, ఇది ఇంద్రుని కిరీటం. కాలికి తగులుతుందేమో జాగ్రత్త" అని అమ్మవారికి హెచ్చరిక చేస్తున్నారు. ఇది పై శ్లోక భావం. ఇక కాటూరివారి అనువాదం చూడండి.

అనువాదం : 'పదిలముదేవి! త్రోవనదె పద్మజుమస్తకిరీట, మౌల న
ల్లదె మధువైరి రత్నమకుటాగ్రము, తొట్రిలెదేమొ తల్లి! అ
య్యది త్రిదశేంద్రుమౌళి' యని, యగ్రమునన్ శివురాక గాంచి నీ
వెదురుగ నేగుచో భటుల హెచ్చరికల్ విజయమ్ము నందుతన్."
(ప. 27)

"పదిలము దేవి" అనటం ఎంతో సహజ సుందరం. మామూలుగా మనం జాగ్రత్త అన్నట్లున్న దాపలుకుబడి. ఆ పరిజనులు చేయిపెట్టి, బ్రహ్మాదిదేవతల కిరీటాలు చూపిస్తున్నట్లు మన కండ్లముందు ఒక మనోహర దృశ్యం సాక్షాత్కరిస్తుం దిక్కడ. సమర్థుడైన కవి అనువాదం చేసేటప్పుడు మక్కికి మక్కి దించడు. భాషా సంప్రదాయాన్ని పాటించి కొన్ని శబ్దాలు మార్చటమో, తొలగించటమో, క్రొత్తవి చేర్చటమో చేస్తుంటాడు. ఒక్కొక్క భాషకొక్కొక్క శక్తి ఉంటుంది. సంస్కృత శబ్దానికి భావగోపన సామర్థ్యం ఎక్కువ. తెనుగు తేటయిన భాషగదా. అందువలన కొన్ని సంస్కృత శబ్దాలు తెలుగులోకి అనువదిస్తే బాగుండవు. ఇలాటి ఔచిత్యాలను పాటిస్తూ కాటూరివారు అనువాదం చేశారు.

అలాంటి కొన్ని శ్లోకాలను మీ ముందుంచుతాను.

మూలం : "నరం వర్షీయాంసం నయనవిరసం నర్మసు జడం
తవాపాంగాలోకే పతితమనుధావన్తి శతశః
గళద్వేణీబన్ధాః కుచకలశవిస్రస్తసిచయా
హఠాత్త్రుట్యత్కాఞ్చ్యో విగళితదుకూలా యువతయః." (శ్లో. 13)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనువాదం: "పరువంబేటికి, ప్రాయమేమిటికి, రూపంబేల, నర్మక్రియా
సరసత్వం బదియేల నీదగు కటాక్షంబున్నచో వృద్ధవా
నరునేనీ మరులూని ప్రాయపు నెలంతల్ పయ్యెదల్ జార
న్నెరి కొప్పుల్ విరజార, కాంచికలునున్ జీరాడ వెన్నాడరే."

(ప. 13)

ఈ పద్యం చదువుతుంటే దీనికొక మూలమున్నదనిపించదు. అచ్చమయిన తెలుగు పలుకుబడి, ధారాశుద్ధి, భావస్ఫూర్తితో ఈ పద్యం సహజ సుందరంగా ఉన్నది.

ముసలివాడైనా, కురూపి అయినా రతి క్రీడలయందు జడుడైనా, నీ కటాక్షం ప్రసరించిన వానివెంట యువతులు, మన్మథునిగా భావించి—కొప్పులు వీడగా, కలశ ముల వంటి స్తనములపై నుండి పైటలు జారగా, మొలత్రాడులు తెగగా, చీరలు జారగా వెంటబడుదురు అని సంస్కృత శ్లోక భావం.

ఈ భావాన్నే విధానం మార్చి తెలుగువారి సంభాషణ కనుగుణంగా, హృద యానికి హత్తుకునేట్లు వ్రాశారు వేంకటేశ్వరరావుగారు. యౌవనమెందుకు, వయసెం దుకు, అందమెందుకు, శృంగార సరసత్వమెందుకు, నీ దయ ఉంటే చాలు, ముసలి కోతినైనా యౌవనవతులైన స్త్రీలు పైటలు జారగా, కొప్పులు వీడగా, మొలనూళ్ళు జీరాడగా వెంటబడతారు. అని తెలుగుపద్య భావం.

ఇది తెలుగువాడి మాటతీరు. తిక్కన పద్యం సౌరు. "కుచకలశ విస్రస్త సిచయాః" అనే దానికి అనువాదంగా "పయ్యెదల్ జార" అని సరిపెట్టారు వేంక టేశ్వరరావుగారు. వృద్ధుడు, శృంగారజడుడు, కురూపి అయిన మానవుణ్ణి వృద్ధ వానరం అనటం మంచి చమత్కారం. ముసలికోతి అలాంటి జనులకు ఉపమానం అన్నమాట. దాని వెకిలిచేష్టలు వేరే చెప్పాలా !

పదప్రయోగంలో కాటూరివారి కున్న నేర్పు అసామాన్యం.

మూలం : "విభక్త త్రైవర్ణ్యం వ్యతికలితలీలాంజనతయా
విభాతి త్వన్నేత్రత్రితయ మిద మీశానదయితే
పునస్స్రష్టుం దేవాన్ ద్రుహిణహరిరుద్రానుపరతాన్
రజస్సత్వం బిభ్రత్తమ ఇతి గుణానాం త్రయమివ."

(శ్లో. 53)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనువాదం: "కలుషుల నీసు నీదు తిగకన్నుల గాటుక రేఖ దిద్దుటన్
దొలకెడి మూడు వన్నియలు దోచెడి దీర్చినటుల్ నటేశ్వరీ!
ప్రళయ విలుప్త రూపులగు బ్రహ్మహరీశ్వరులన్ సృజింపగా
దలచి రజమ్ము సత్త్వమును దామసమున్ ధరియించితేమొకో!"

(ప. 45)

అమ్మవారి కాటుక దిద్దబడిన మూడు కండ్లు, తెలుపు, నలుపు, ఎరుపు మూడు రంగులు గలిగి, ప్రళయంలో లయించిన బ్రహ్మ, రుద్రాదులను తిరిగి పుట్టించటానికి ధరించిన సత్త్వ రజస్తమోగుణములా! అన్నట్లు ప్రకాశిస్తున్నవి అని ఈ పద్య భావం.

కాటూరివారి అనువాదంలో యథాతథంగా ఆ భావం పొందు పరచబడింది. అయితే అక్కడ శంకరులు "ఈశానదయితే" అని పార్వతీదేవిని సంబోధించగా కాటూరివారు "నటేశ్వరీ" అని సంబోధించారు. ఆమె జగన్నాటక సూత్రధారిణి, నటరాజు భార్య, అంతేకాకుండా కన్నులలో వివిధ భంగిమలు, వివిధ భావాలు ప్రదర్శించటం, నటులకే సాధ్యం. ఈ విధంగా ఆ పదాన్ని ఎంతో ఉచితంగా ప్రయోగించారు కాటూరివారు. ఇలా చాలా శ్లోకాలు ఉదాహరించవచ్చు.

ఒక చాటువుకు అనువాదం

నవ్వులతోట అనే హాస్యరస పత్రిక ఒకటి బెందరులో ఉండేది. ఈ పత్రికకు పద్యాలు వ్రాస్తూ ఒకప్రాచీన చాటువును కాటూరివారు అనువదించారు. 1934లో అచ్చయిన ఈ పద్యానికి మూలశ్లోకం కూడ వారు అక్కడ పొందుపరచటం వల్ల ఇది అనువాదమని తెలుస్తుంది. లేకపోతే ఇది అనువాదమనే భావమేరాదు.

మూలం : "యుగపత్స్వ గండ చుంబనలోకా పితరౌ నిరీక్ష్య హేరంబః
తన్ముఖమేళన కుతుకీ స్వాననమపనీయ పరిహసన్పాయాత్

అనువాదం: "చెక్కులు ముద్దులాడ నిరుచెంతల జేరిన తల్లి దండ్రులన్
టక్కరి చూపులన్ గని తటాలున ఆత్మముఖాంబుజమ్ము వెన్
చక్కికిలాగి, వారిముఖ సారసయుగ్మము మేళవింపగా
ఫక్కున నవ్వు విఘ్నపతి ప్రాపగు నవ్వులతోటకెప్పుడున్."

27)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పార్వతీ పరమేశ్వరులు వినాయకుణ్ణి ముద్దుపెట్టుకుంటున్నారు. ఆ కొంటె కుఱ్ఱాడు హఠాత్తుగా ముఖాన్ని వెనక్కు లాక్కున్నాడు. దాంతో ఆ దంపతుల ముఖాలు ముద్దుపెట్టుకున్నాయి. ఈ చమత్కారాన్ని మూలానికి తీసిపోకుండా నీరసం కాకుండా చక్కని పద్యంగా మలచారు కాటూరివారు.

2. సంస్కృత అనువాదములు - నాటకములు

కాటూరివారు భాసుని సంస్కృత నాటకాలైన ప్రతిజ్ఞా యౌగంధ రాయణం, వాసవదత్తలను అనువదించారు. వీటిని ఎన్నుకోవటంలో విశేషమున్నది. నాటకంలో ఉండదగిన ప్రధాన రసాలు వీర శృంగారాలు మాత్రమే. అందుకే వీరరస ప్రధానమైన ప్రతిజ్ఞాయౌగంధరాయణాన్ని, శృంగారం ప్రధానరసంగా గల వాసవదత్తను అనువదించారు. నాటకంలో అయిదు అంకాలుండాలి. కాని ప్రతిజ్ఞలో నాలుగు అంకాలే ఉన్నవి. అందువల్ల దీన్ని నాటిక అంటున్నారు లాక్షణికులు. వాసవదత్త మాత్రం ఆరు అంకాలతో పరిపూర్ణమైన నాటకంగా భాసిస్తున్నది. ఈ రెండుకథలు ఒకదానికొకటి అనుబంధమైనవే. ముందు ప్రతిజ్ఞ, తరువాత వాసవదత్త కథలు ఒకదానివెంట మరొకటి సాగినవి. ఈ రెంటినీ అనువదించటానికి ఇదికూడా ఒక కారణం కావచ్చు.

వాసవదత్త కథ-సంభోగ, విప్రలంభ శృంగారాల రెంటితో రమణీయంగా సాగింది. పద్మావతీ ఉదయనుల మధ్య సంభోగ శృంగారం, వాసవదత్త ఉదయనుల మధ్య విప్రలంభ శృంగారం ఉన్నా చివరలో వాసవదత్త ఉదయనులు కలవటం, ఉదయనుడు వాసవదత్త పద్మావతీ దేవులతో సుఖించటం వలన విప్రలంభ శృంగారం సంభోగ శృంగారంలో పర్యవసించింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భాసుడు - కాటూరివారు

సంస్కృత నాటక కర్తలలో భాసుడు సుప్రసిద్ధుడు. కాళిదాసంతటివాడు, భాసుడి ప్రతిభకు నమోవాకాలర్పించాడు. ఆయన నాటక నిర్మాణ చాతుర్యం అపూర్వం. జాతీయాలు, అర్థ స్ఫూర్తి గల పదాలు, పాత్రోచితమైన భాష, ప్రదర్శన యోగ్యమైన సన్నివేశాలు ఇలా ఎన్నో సుగుణాలు ఆ నాటకాలలో కనిపిస్తవి. భవభూతి మొదలైన కవుల నాటకాలల్లో కనుపించే సుదీర్ఘమైన సంభాషణలు, స్వగతాలు, రంగస్థలం మీద నటులు ఏకబిగిన ఉచ్చరించటం కష్టం. ఒకవేళ ఎవరైనా శ్రమపడి పది నిముషాలు ఆ సంభాషణ చెప్పినా, ఒకే పాత్ర అంతసేపు మాట్లాడటం చేత ప్రేక్షకులకు విసుగుపుట్టటం తథ్యం, కాని భాసుడి నాటకాలలా కాదు. సంభాషణలు, సులభంగా చిన్నవిగా ఉండి నటుడు శ్రమ లేకుండా ఉచ్చరించటానికి వీలుగా ఉంటవి. రెండు మూడు వాక్యాలను మించి సంభాషణ లుండవు. నాటక దర్శనంలో ప్రేక్షకులకు ఆలోచించే వ్యవధానముండదు. అందువల్ల నటుడి నోటి నుంచి వచ్చినమాట వచ్చినట్లు ప్రేక్షకుడి మనసు కెక్కాలి. భాసుడు ఇది బాగా తెలిసినవాడు. ఆయన ప్రయోగించే పదునైన పదాలు హృదయాల్ని తాకుతవి. ఇక శ్లోకాలు సులభ సుందరాలు. పాత్రల మనోధర్మాన్ని చిత్రించటంలో భాసుడు అసామాన్యుడు.

భాసుని సాహితీ సౌరభాల్ని గ్రహించినవారు కాటూరివారు. సహజ సుందరమైన భాసుని శైలి వీరికి నచ్చి ఉంటుంది. కాటూరి వారికి కూడ జాతీయాలపై, సామెతలపై మక్కువ ఎక్కువ. అనేక భావాలు ప్రతిఫలించే రత్నశలాకల్లాంటి పదాలు ఏరి ఏరి కూర్చటం వీరికి కూడ ఇష్టమే. అందువల్లనేమో! అదే లక్షణాలున్న భాస నాటకాలపై వీరికి మనసు పోయింది. మరో గొప్ప విశేషమేమంటే భాసుడు తన కాలపు వ్యావహారిక సంస్కృతాన్ని ఉత్తమ పాత్రలకు, స్త్రీ నీచ పాత్రలకు ప్రాకృతాన్ని వాడాడు. కాటూరివారు దానికి తగినట్లు వ్యావహారిక భాషలోనే అనువాదం చేశారు. భాష పాత్రోచితంగా ఉన్నది. భాసుడి నాటకాలలో సమకాలీన జీవితం ప్రతిచోట ప్రతిబింబిస్తుంది. పాత్రల ఆకారాల కంటే, స్వభావాలను చిత్రించటం భాసుడికి చాలా ఇష్టం. ఆ పాత్రల ఆహార్యాన్ని ఆయన అంతగా వర్ణించడు. మనోభావాల్ని విశ్లేషిస్తుంటాడు. కాటూరి వారిదీ కూడా ఇలాంటి ప్రవృత్తే. ఆయన నాటకాలల్లో కూడా, పాత్రల స్వభావ చిత్రణమే ఎక్కువగా కనిపిస్తుంది. ఈ సాదృశ్యాలే కాటూరివారికి భాసనాటకాలపై మనసు పోవటానికి, అనువదించటానికి కారణాలుగా భావించవచ్చు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రతిజ్ఞా యౌగంధరాయణము - కథా సంగ్రహం

పాండవ వంశజుడైన శతానీకుని కుమారుడు సహస్రానీకుడు. కౌశాంబిని రాజధానిగా చేసికొని వత్స రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు. సహస్రానీకుని భార్య మృగావతి. ఆమె ఒకనాడు ఎర్రని నీళ్ళున్న కొలనులో స్నానం చేస్తూండగా గండభేరుండ పక్షి ఒకటి ఎత్తుకొని పోయి ఉదయగిరిపై వదిలి పెట్టింది. అప్పటికే గర్భవతిగా ఉన్న ఆమె ఆ ప్రాంతంలోనే ఉన్న జమదగ్ని ఆశ్రమం చేరింది. ఆశ్రమంలో ఆమెకు జన్మించిన కుమారుడే భాసుని కథానాయకుడైన ఉదయనుడు. బాలుడైన ఉదయనుడు ఒకనాడు ఒక కిరాతుని చేతికి చిక్కిన పామును విడిపించి, దానికి ప్రతిఫలంగా దోయవాడికి తన తండ్రి పేరు చెక్కి ఉన్న తన ముంజేతి కంకణాన్ని ఇచ్చాడు. వాసుకి తమ్ముడైన ఆ సర్పరాజు తనను రక్షించిన ఉదయనుడికి ఘోషవతి అనే వీణను బహూకరించాడు. ఆ వీణను పలికిస్తే చాలు, ఎంత మదించిన అడవి ఏనుగైన మచ్చికై పట్టుబడుతుంది. అతడు ఉదయనుడికి ఒక మంత్రం కూడ ఉపదేశించాడు. ఆ మంత్రోపదేశం పొందిన స్త్రీ చేతి తములపాకులు ఎండవు, ఆమె గ్రుచ్చిన పూలదండ వాడదు, ఆమె దిద్దిన తిలకము చెదరదు.

ఉదయనుడిచ్చిన కంకణాన్ని అమ్ముతున్న దోయవాడు రాజభటులకు పట్టుబడ్డాడు. వాడి ద్వారా మృగావతి, ఉదయనుల జాడ తెలిసికొని, సహస్రానీకుడు వారిని నగరానికి రప్పించాడు. ఇది ఉదయనుడి పూర్వకథ.

క్రమంగా ఉదయనుడు చక్రవర్తి అయినాడు. గొప్ప సంగీత విద్వాంసుడైన ఇతనికి వీణా వాదనంతో అడవి ఏనుగులను పట్టటం ఒక వ్యసనంగా మారింది. అదే కాలంలో అవంతీ రాజ్యాన్ని ఉజ్జయిని రాజధానిగా ప్రద్యోతుడనే రాజు పరిపాలిస్తున్నాడు. అతడు గొప్ప పరాక్రమవంతుడై చండ మహాసేనుడనే బిరుదు పొందాడు. ఆయన కుమార్తె వాసవదత్త. తన కుమార్తెకు తగిన వరుడు ఉదయనుడేనని మహాసేనుడు భావించాడు. కాని ఆ రాజ్యాల మధ్య వైరం ఉన్నది. ఏదో విధంగా ఉదయనుణ్ణి తన రాజ్యానికి రప్పించి ఆయన చేత కుమార్తెకు సంగీతం చెప్పించాలని, ఆ అనుబంధం ప్రణయబంధంగా మారితే సంతోషించాలని అభిలషించాడు. నీల వర్ణం గల ఒక కృత్రిమగజం వింధ్యారణ్యాలలో ఉంచబడింది. ఏనుగుల వేటకు వచ్చిన ఉదయనుడు ఆ మోసంలో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చిక్కుకున్నాడు. వీణ వాయిస్తూ సమీపించగానే మాయాగజంలో దాగిన భటులు ఒక్కసారిగా బయటికి వచ్చి రాజును బంధించి ఉజ్జయినికి తరలించారు.

ప్రద్యోతుడు భావించినట్లే ఉదయనుడు వాసవదత్తకు గురుత్వం వహిస్తూ ఆమె ప్రణయంలో పడ్డాడు. ఆమె కూడ ఉదయనుణ్ణి వలచింది.

ఇక్కడ ఉదయనుడి మంత్రులు యౌగంధరాయణుడు, రుమణ్వంతుడు, విదూషకుడైన వసంతకుడు, ఉదయనుడికి జరిగిన ప్రమాదం తెలుసుకున్నారు. శత్రువుని వంచించి ఉదయనుణ్ణి తిరిగి సురక్షితంగా తీసికొని వస్తానని యౌగంధరాయణుడు ప్రతిజ్ఞ చేశాడు. ఉన్మత్తుని వేషంలో యౌగంధరాయణుడు, శ్రమణకుని వేషంలో రుమణ్వంతుడు, విదూషకుడు, కొందరు గూఢచారులు ఉజ్జయిని ప్రవేశించారు.

ప్రద్యోతుడి దగ్గర "నలగిరి" అనే శ్రేష్ఠమైన ఏనుగు ఉన్నది. యౌగంధరాయణుడు దానికి వెర్రెక్కించే ఏర్పాట్లు చేశాడు. విచ్చలవిడిగా పరుగులు పెడుతున్న దాన్ని అదుపుచేసే మార్గాంతరం లేక మహాసేనుడు ఉదయనుణ్ణి చెర విడిపించి ఘోషవతి సహాయంతో నలగిరిని అదుపు చేయవలసిందిగా కోరాడు. అంతకు ముందే వాసవదత్త ఉదయనులు కూడబలుక్కున్నారు. ఆమె జలక్రీడల మిషతో భద్రావతి అనే ఏనుగును అధిరోహించి బయలుదేరింది, ఉదయనుడు ఆమెతో సహా భద్రావతిపై కౌశాంబి చేరుకున్నాడు. చేసేదిలేక ప్రద్యోతుడు ఉదయన, వాసవదత్తల చిత్రపటాలకు కళ్యాణం జరిపించి, తరువాత అల్లుణ్ణి కుమార్తెను ఆదరించాడు.

ఇదీ ప్రతిజ్ఞా యౌగంధరాయణంలోని కథ, దీని తరువాత జరిగిన కథ వాసవదత్తము.

అనువాదపు తీరు తెన్నులు

కొటూరివారు భాసనాటకాల్ని అనువదించిన తెన్ను ప్రాచీనమైనదే. తెలుగువారి సంభాషణ తీరు, తెలుగు నుడికారాలు, సామెతలు ఉపయోగించి వీరు రచనకు తెలుగుదనం తీసుకొని వస్తుంటారు. సంస్కృత సంబోధనల్ని యథాతథంగా కాకుండ తెలుగువారు ఎలా సంబోధించుకుంటారో అలా అనువాదం చేస్తుంటారు. రసానుకూలంగా మూలాన్ని సంగ్రహిస్తుంటారు. మరికొన్నిచోట్ల విస్తరిస్తుంటారు. వీరి అనువాద సరళి మూలానికి దగ్గరగానే సాగుతుంటుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ నాటక అనువాదాల్ని పరిశీలిస్తే ముఖ్యంగా మనమీ క్రింది విషయాలు గమనించవచ్చు. శ్లోకాలను పద్యాలుగా అనువదించారు. కొన్నిచోట్ల శ్లోకాలను వచనంగా అనువాదం చేశారు. కొన్ని చోట్ల వచనాన్ని వచనంగానే అనువాదం చేశారు. కొన్ని చోట్ల వచనాన్ని పద్యంగానో, పాటగానో అనువాదం చేశారు. ఇది కాటూరివారి అనువాదపు తీరు.

సాధారణంగా కవులు సంస్కృత శ్లోకాలను అనువదించేటప్పుడు సంస్కృత సమాసాలనే తెలుగు విభక్తి ప్రత్యయాలు తగిలించి వాడుతుంటారు. మరికొందరు పట్టుబట్టి అచ్చ తెనుగు శబ్దాలు ప్రసిద్ధమైనా, కాకపోయినా ఏరి ఏరి ఉపయోగిస్తారు. మొదటి వారికి సంస్కృత శబ్ద సమాస సౌందర్య లోభం, రెండవ వారికి తెలుగు శబ్దాలే వాడాలనే పట్టుదల గొప్ప. పాఠకుడికి అర్థం కావటమనేది వారికి తరువాత విషయం. మొదటి వారిని "అయ్యా! తమ పద్యం అర్థం కావటం లేదు" అంటే "సామరి పోతులకు అర్థం కాదు. అమరం కంఠస్తం చెయ్యి! నిఘంటువులు చూడు! అయినా నేను వ్రాసింది నీలాంటి వాళ్ళకోసం కాదు" అంటూ దండిస్తారు. మరి రెండవ వారిని అదే ప్రశ్న వేస్తే "అవును అర్థంకాదు! ఎందుకర్థం అవుతుంది. పరాయి మోజు అలాంటిది! అసలు తెలుగు మీద అభిమానముంటేగా అర్థం కావటానికి" అంటూ కూకలేస్తారు. పాఠకుడు రెండు చెంపలూ వాచిపోయి తలదించు కొంటే, ఇదంతా చూస్తున్న, పుస్తకమే ముట్టని మౌనమహాశయుడు- వీడికి సంస్కృతం, తెలుగు రెండూ రావు కామోసు అంటూ నవ్వేసి వెళ్ళిపోతాడు.

కవయిత్రి మొల్ల పాఠకుడి కష్టాన్ని గ్రహించి, సంస్కృత అనువాదం ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో స్పష్టంగా చెప్పింది.

"మును సంస్కృతంబు దేటగ
దెనిగించెడి చోట నేమితెలియక యుండన్
దనవిద్య మెరయు గ్రమ్మర
ఘనమగు సంస్కృతము చెప్పగా రుచియగునే" (రామా. పీఠి. 16)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"తేనెసోక నోరు తీయన యగురీతి
తోడ నర్థమెల్ల తోచకుండ
గూఢ శబ్దములను గూర్చిన కావ్యమ్ము
మూగ చెవిటి వారి ముచ్చటగును" (రామా. పీఠి. 17)

తెలుగులోకి అనువాదం చేసేటప్పుడు తెలుగు శబ్దాలు వాడటం ధర్మం. ఎక్కడైనా సంస్కృత శబ్దాలు వాడితే మహాపరాధం కాదు. తెలుగు, సంస్కృతం ఆదినుండే కలిసి పెనవేసుకొని పోయినవి గద! ఏమైనా పాఠకుడికి సులభంగా అర్థం కావాలనేది ప్రథమంగా యోచించవలసిన విషయం. ఇలా పర్యాలోచన చేసి నప్పుడు తెలుగు శబ్దాలను ఎక్కువగా వాడుతూ తెలుగువాడికి "ఇది సంస్కృతము" అనిపించనంతగా నిత్య వ్యవహారంలో కలిసిపోయిన సంస్కృత శబ్దాలను కలుపు కుంటూ తెలుగు పలుకుబడి సాధిస్తూ "ఇక్కడ మూలాన్ని చూస్తే బాగుండు" అనే అభిప్రాయం పాఠకుడికి కలగకుండా చేసిన అనువాదం సర్వశ్రేష్ఠమనిపిస్తుంది.

కాటూరివారి అనువాదానికి పైన భావించిన సుగుణాలన్నీ ఉన్నవి. పిల్లిని మార్జాలమనటంగాని, దేవుణ్ణి దయ్యమనటం గాని వీరు చేయరు.

ప్రతిజ్ఞా యౌగంధరాయణం - అనువాద విశేషాలు

—: శ్లోకాలకు పద్యానువాదం :—

ఉదయనుడు ప్రద్యోతుని సైనికులకు చిక్కిన ఉదంతాన్ని హంసకుడు యౌగంధరాయణునితో చెబుతున్న సన్నివేశం.

"శత్రువుల మోసాన్ని తెలిసికొని ప్రభువు ప్రద్యోతుని సైనికులతో తలప డ్డాడు" అని హంసకుడు చెప్పినపుడు యౌగంధరాయణుడు పలికిన శ్లోకం, దానికి కాటూరివారి అనువాదం చూడండి ఎలా ఉన్నదో:

మూలం : "ప్రీతితో వంచనాం ప్రాప్య మానీ సత్వ ముపాశ్రితః !
శూర శ్చైరాయనస్థశ్చ కిమన్యత్ ప్రతిపద్యతే."
(అం. 1. శ్లో॥7 - కల్యాణీగ్రంథ మండలి ప్రచురణ - 1962)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనువాదం: "పగరు వంచించి తలమీటి వచ్చినపుడు
మగటిమి దలిర్ప బల్మియు(దెగువచూప
దివురటయకాక వేఱొండు తెన్నుగలదె
మానధనులైన బలుపోటు మానిసులకు ? (అం. 1. శ. 5)

కాటూరివారు పై పద్యంలో మగటిమి, బలిమి, తెగువ, తెన్ను మొదలైన అందరికి అర్థమయ్యే చక్కని తెలుగు శబ్దాలు వాడారు. "మానీ సత్వ ముపాశ్రితః" అన్నదానికి "మానధనులైన బలుపోటు మానిసులు" అని చేసిన అనువాదం చాలా చక్కగా ఉన్నది. మానధనుడు అనేమాట ప్రతివాడు వాడే పదం. మామూలు వాడు ఇది సంస్కృత శబ్దం అంటే ససేమిరా ఒప్పుకోడు. సంస్కృత కవిత్వం చేమంతి చెండు, తెలుగు కవిత్వం మల్లె మొగ్గలమాల. సంస్కృత శబ్ది భూయిష్టమైన కవిత్వానికి సమాస ఘటనం సౌందర్యాన్ని తెస్తుంది. తెలుగు పదాలు ఎక్కువగా ఉన్న కవిత్వానికి లలితమైన ఆలతి, అలతి పదాలే అందం. ఈ రహస్యమెరిగి కాటూరి వారు పై పద్యాన్ని అలాగే రచించారు.

ఇక కాటూరివారి కవితలో కదిపితే చాలు, జాతీయాలు, తెలుగు పలుకుబడులు కొల్లలు.

"తలమీరి వచ్చినపుడు" అంటే "నెత్తిమీదకు వచ్చినపుడు" అని,
"వేఱొక తెన్ను గలదె" అంటే "ఇంకోదారేముంది." అని,
"బలుపోటు మానిసి" అంటే "బలే పోటు మగాడు" అని,
"మగటిమి దలిర్ప" అంటే "మగతనం చూపించాలి" అని.

ఇవి నిత్యం తెలుగు ప్రజలనోట వినిపించే మాటలే, ఛందానికి ఒదిగి పద్యమై పోయినవి.

ఇక పద్యం మొత్తం భావం.

"పగవారి మోసంతో అంతా నెత్తిమీద కొచ్చినపుడు, మానధనులైన వాళ్ళు తెగించి మగతనంతో పోట్లాడటం కంటే వేరే దారేముంది." ఇది తెలుగువాడి అత్యంత సహజమైన భావ వ్యక్తీకరణం.

ప్రథమాంకం చివర ఉదయనుణ్ణి రక్షిస్తానని ప్రతిజ్ఞచేసి యౌగంధరాయణుడు ఉత్సాహముంటే మానవుడు ఏమైనా సాధించగలడంటూ, పలికిన శ్లోకానికి కాటూరి అనువాదం ఎంతో భావస్ఫూర్తి కలిగి ఉన్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూలం : "కాష్ఠా దగ్ని ర్జాయతే మథ్యమానాత్
భూమి స్తోయం ఖన్యమానా దదాతి
సోత్సాహానాం నా స్త్యసాధ్యం నరాణాం
మార్గారబ్ధాః సర్వయత్నాః ఫలన్తి. (అం. 1. శ్లో. 18)

అనువాదం : కాష్ఠము మథింప మథియింపఁ గలుగు నగ్ని,
నేల త్రవ్వంగ త్రవ్వంగ నీరు వాడము,
ఫల మొసగు సక్రమారబ్ధములగు పను, ల
సాధ్యమేయుండ దుత్సాహశక్తి యున్న. (అం. 1. ప. 15)

పై పద్యంలో సంస్కృత, తెలుగు శబ్దాలు పాలు, తేనెలాగా కలిసిపోవటం మనం గమనించవచ్చు. మూలంలోని శబ్దాలు సులభంగా ఉండటం వల్ల వాటినే స్వీకరించారు. అయితే "ఖననం" అనే సంస్కృత శబ్దాన్ని మాత్రం త్రవ్వటం అని మార్చారు. నిత్య వ్యవహారంలో ఖననం అనే మాటను చచ్చిన వాళ్ళను పాతిపెట్టటం అనేఅర్థంలో వాడుతుంటారు. అందువల్లనే దాన్ని వదలిపెట్టారు. మూలంలోని మథ్యమాన, ఖన్యమాన, అనే శబ్దాలకు కాటూరివారు తెలుగులో "మథింప, మథియింప," "త్రవ్వంగ, త్రవ్వంగ" అని క్రియాపదాన్ని రెండుసార్లు ప్రయోగించి చక్కగా అనువదించారు.

ద్వితీయాంకంలో తన కుమార్తెకు తగిన వరుడు ఎలా ఉండాలో కంచుకితో చెబుతూ, మహాసేనుడు పలికిన శ్లోకానికి కాటూరివారి అనువాదం అనితరసాధ్యం.

ఒక విషయాన్ని గురించి తెలుగువాళ్ళు ఎలా మాట్లాడుకుంటారో ఆలోచించి దాన్ని పద్యంలోకి మలచినట్లుగా కాటూరి వారి అనువాదం కనుపిస్తుంది.

మూలం : కులం తావ చ్ఛ్లాఘ్యం ప్రథమ మభికాంక్షే హి మనసా
తత స్సానుక్రోశం మృదురపి గుణో హ్యేష బలవాన్।
తతో రూపే కాన్తం న ఖలు గుణతః స్త్రీజనభయాత్
తతో వీర్యోదగ్రం నహి న పరిపాల్యా యువతయః॥
(అం. 2. శ్లో. 4)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనువాదం: "అన్నిటికంటె ముఖ్యము సదన్వయశాలిత అంతకంటె మా
కన్నెను గండ్లనద్దు కొనఁగల్గు దయార్ద్రిత ముఖ్య, మింక రూ
పోన్నతి కేమిగాని - అది యుండక మెచ్చదు స్త్రీ జనమ్ము, శౌ
ర్యోన్నతి లేని వాఁడు సతినోమఁగ నేర్చునె? ఇన్ని యుండినన్.
(అం. 2. ప. 3)

వరుణ్ణి వెదికే ఆడపిల్ల తండ్రి మనస్తత్త్వాన్ని, భాసుడు ఈ శ్లోకంలో అత్యంత సహజంగా చిత్రించాడు. దాన్ని కాటూరివారు సమర్థంగా అనువదించారు.

వరునికి అన్నిటి కంటె ముఖ్యం మంచి వంశం. అంతకంటె ముఖ్యం మా అమ్మాయిని కండ్లకద్దుకొని ప్రేమగా చూచుకొనే వాడు కావటం. ఇక అందం అంటారా! అది లేంది ఆడవాళ్ళు మెచ్చనే మెచ్చరు గదా. మరి! పరాక్రమం లేని వాడు ఎలాగూ భార్యను రక్షించుకోలేడు.

ఇది ఒక ఆడపిల్ల తండ్రి భావన, సంభాషణ. ఇక కండ్లకద్దు కోవటమనేది తెలుగుజాతీయం.

రాజు, రాణీ తమ కుమార్తె వివాహాన్ని గురించి మాట్లాడుకుంటున్నప్పుడు రాజు పలికిన సంస్కృత శ్లోకానికి కాటూరి వారి అనువాదం ఒక సామెతలాగా ఉన్నది.

మూలం : అదత్తేత్యాగతా లజ్జా దత్తేతి వ్యథితం మనః ।
ధర్మస్నేహాన్తరే న్యస్తో దుఃఖితాః ఖలు మాతరః ॥
(అం. 2. శ్లో. 7)

అనువాదం: "ఈడు వచ్చుకన్నె ఇంటనుండిన సిగ్గు,
ఒరులకిచ్చి సేయ నొదవుఁ జింత;
ఒకట ధర్మభీతి, యొకట నెయ్యము బట్టి
లాగఁ దల్లిహృదయ మూఁగులాడు."
(అం. 2. ప.4)

ఈ పద్యంలో "ఈడు వచ్చు కన్నె యింట నుండిన సిగ్గు, ఒరుల కిచ్చి సేయ నొదవు జింత" అనేది ఒక సామెతగా భాసిస్తున్నది.

ఉదయనుడు పట్టుబడ్డాడని కంచుకి మహాసేనుడితో చెప్పినపుడు రాజు సంశయంతో పలికిన శ్లోకానికి అనువాదం కూడా చాలా గొప్పగా ఉన్నది. దీంట్లో మూలంలో భావాన్ని కాటూరివారు కొంత విస్తరించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూలం : "న శ్రద్ధధా ష్యుదయనగ్రహణం త్వయోక్తం
వ్యావర్తనం కరతలై రివ మన్దరస్య
యస్యాహవేషు రిపవః కథయన్తి శౌర్యం
యౌగంధరాయణ మతాని చ నః స్వనన్తి." (అం. 2. శ్లో. 9)

అనువాదం: "ఈవు వచించి తేని మఱి యే నెటునమ్ముదు ? మందరాగమున్
జేవ దలిర్ప హస్తములచేఁ గదలింతురు గాక, శత్రుధా
త్రీవర నుత్య విక్రమునిఁ దెత్తురె, వత్సనృపాలు బందిగా
నీవును నేను మున్ను వినమే, మతి గీష్పతి వాని ప్రగ్గడన్."
(అం. 2. ప. 5)

శ్లోకంలో ఉన్న విషయాలన్నీ అనువాదంలోకి వచ్చినవి. ఈ పద్యంలో అధి కంగా ఉన్నది యౌగంధరాయణునికి, గీష్పతిని అంటే బృహస్పతిని ఉపమానంగా చెప్పటం. ఈ చేర్పు సమయోచితమే కాకుండా యౌగంధరాయణుని ప్రతిభను వ్యక్తం చేసేదిగా కూడా ఉన్నది.

కాటూరివారి పద్యం ఎత్తుగడ చూడండి.

"ఈవు వచింతువేని మఱి యేనెటు నమ్ముదు."

"నువ్వు చెబితే మాత్రం నేనెలా నమ్ముతాను." ఇది తెలుగువాడు మాట్లాడే పద్ధతి. మనం సహజంగా మాట్లాడుకుంటున్నట్లు పద్యాన్ని నడపటంవల్ల అది స్వతంత్రమైన తెలుగు పద్యమనిపిస్తుందేగాని అనువాదమనిపించదు. కాటూరివారి పద్యాలకున్న ముఖ్యమయిన ఆకర్షణలలో ఎత్తుగడలొకటి.

మనం ఒక విషయాన్ని గురించి ప్రసంగించేటప్పుడు కొన్ని హేతువులు, వాటి కార్య కారణ సంబంధం, మన తార్కిక దృష్టితో చర్చించి చివరలో నిశ్చితాభి ప్రాయం చెబుతాం. తీవ్రమైన విషయంగాని, ఉద్వేగ భరితమైన విషయంగాని మాట్లాడేటప్పుడు మన నిశ్చితాభిప్రాయ వాక్యం ముందు చెప్పి, తరువాత హేతు ప్రత్యయ వివరణ చేస్తాం. ఇలా ప్రసంగం, విషయాన్నిబట్టి జరుగుతుంటుంది. మరి కొన్ని సందర్భాలలో పాత్రలను బట్టి కూడ ఇలాటి సంభాషణా వైఖరి ఏర్పడుతుంది. రాజులేక అంతటి వాడొకడున్నాడనుకోండి; వాడు తన నిశ్చయం ముందుచెప్పి తరువాత వివరిస్తే వివరిస్తాడు లేకపోతే లేదు. అదే మరొకడు, రాజుతో సంభాషిస్తున్నాడనుకోండి; అనేక ఉపపత్తులు చూపించి, చివరగా తన నిశ్చితాభిప్రాయం చెబుతాడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ విషయాలన్నిటికి తెనుగు గురువు తిక్కన. ఈ విషయాలకు ఉదాహరణలుగా తిక్కన కవిత్వంలో కొన్ని వందల పద్యాలు చూపించవచ్చు. ఇదంతా ఎందుకు చెప్పవలసివచ్చిందంటే కాటూరివారు కూడ తిక్కన కవితా కళామృతాన్ని ఒక్క పుడిసెడు త్రాగాడు కనుక.

ఇక్కడ మాట్లాడుతున్నది రాజు మహాసేనుడు. విషయం ఉద్వేగ భరితమైనది. అందుకే రాజు నిశ్చయ వాక్యాన్ని ముందు చెప్పాడు. తరువాత కారణం వివరించాడు.

ఉదయనుణ్ణి ఉజ్జయిని తీసికొని వచ్చినందుకు నిదర్శనంగా కాంచుకేయుడు ఘోషవతి వీణను మహాసేనుడికి సమర్పించాడు. ఆ వీణను ఉద్దేశించి రాజు పలికిన శ్లోకం, దానికి కాటూరివారి అనువాదం చూడండి.

మూలం : "శ్రుతిసుఖమధురా స్వభావరక్తా
కరజముఖోల్లిఖితాగ్ర ఘృష్టతంత్రీ!
ఋషివచనగతేవ మంత్రవిద్యా
గజహృదయాని బలాద్వశీకరోతి! (అం. 2. శ్లో. 12)

అనువాదం: "వాలారుగొనగోళ్ళ లీలమీటినఁ దేనె
జాలులై, వీనులకు సంతర్పణమ్ములౌ
పూలపాటలుపాడు పుట్టురత్నమ వీవు
మఱగించి మదకరుల మచ్చిక యొనర్తువట
ఘోషవతి యెట నేర్చుకొంటివే మంత్రములు." (అం. 2. ప. 6)

పై పద్యంలో సంతర్పణ, రత్నము, మదకరులు, మంత్రములు అనే నాలుగు సంస్కృత శబ్దాలున్నవి. ఇవైనా మామూలు వ్యక్తులకు తెలుగు శబ్దాలలాగా కనిపించేవే. సంస్కృత శబ్దాలను సమాసంగా కూర్చి సౌందర్యం తీసికొని రావచ్చు. ఒకటి రెండు అందంగా లేని పదాలు కూడ అందమైన సమాసంలో పడ్డప్పుడు సర్దుకొని పోతవి. తెలుగు శబ్దాలలాకాదు. వీటిని ఒకదాని తరువాత ఒకటి పేర్చి అందం తేవాలి. ఎంతో నేర్పున్న కవిగాని ఈ పని చేయలేడు. సుమారుగా సమానమయిన మాత్రలుగల శబ్దాల్ని ఒద్దిక గలవాటిని పేర్చినప్పుడే ఆ అందం సిద్ధిస్తుంది. కాటూరి వారిలో ఈ నేర్పు అమోఘం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇక తేనెజాలులు, వీనులకు సంతర్పణములు, పూలపాటలు మొదలైన మాటలు నవ్యకవులు ఎక్కువగా వాడారు. ఈయన కూడ నవ్యకవులలో ఒకరేగద. అంతే కాదు. 1944లో నవ్యసాహిత్య పరిషత్తుకు అధ్యక్షులుగా కూడ ఉన్నారు. నండూరి "పూలబాసలు తెలుసు ఎంకికి" అనటం ఇక్కడ మనకు గుర్తుకువస్తుంది.

"కరజముఖోల్లిఖితాగ్ర ఘృష్టతంత్రీ" అన్నదానికి "వాలారు గోనగోళ్ళ లీల మీటిన" అనే అనువాదం బాగున్నది. "తేనెజాలులై వీనులకు సంతర్పణములా" అనేది మూలం యొక్క సౌందర్యాన్ని ఇనుమడింపచేసింది. "పూలపాటలు పాడు పుట్టురత్నము నీవు" అనేది మూలంలో లేని భావం. "ఎట నేర్చుకొంటివె మంత్రములు" "ఈమంత్రాలు ఎక్కడ నేర్చుకున్నావే" అనేది చక్కని తెలుగు పలుకుబడి. ఈ చిన్న పద్యంలో తెలుగు పలుకుబడి, మూలానికి మెరుగు పెట్టటం, భావాన్ని విస్తరించటం మొదలయిన ఎన్నో విశేషాలు మనం చూడవచ్చు.

ఉదయనుడు వాసవదత్తతో వెళ్ళిపోతున్న సందర్భంలో యౌగంధరాయణుని చారుడైన గాత్రసేవకుడు తన వాళ్ళను హెచ్చరిస్తు పలికిన శ్లోకం కూడా చక్కగా అనువాదం చేయబడ్డది.

మూలం : "నవం శరావం సలిలైస్సుపూర్ణం
సుసంస్కృతం దర్భకృతోత్తరీయం!
తత్తస్య మా భూన్నరకం స గచ్ఛేత్
యో భర్తృపిండస్య కృతే న యుధ్యేత్." (అం. 4. శ్లో. 2)

అనువాదం: "స్వామి యుప్పుబులుసు సాపడి యున్నాళ్ళు
గలను సేయ కిపుడు తొలగిరేని
ముందు గతులు దప్పుఁ బుడిసెడు నీరమ్ము
పుట్టబోదు, నరకమును ధృవమ్ము." (అం. 4. ప. 2)

"ఉప్పు పుసులు సాపడి" అంటే "ఉప్పు పులుసు తిని"
"ముందు గతులు" అంటే "పుట్టుగతులు"

"పుడిసెడు నీరమ్ము పుట్టబోదు" అంటే "నీ ముఖాన కాసిని నీళ్ళు కూడా పుట్టవు" ఇలా తెలుగు పలుకుబడులన్నీ ఈ పద్యంలో ఒదిగిపోయినవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మొత్తం భావమిది. "రాజుగారి ఉప్పు పులుసు తిని, ఇప్పుడు యుద్ధం చేయకుండా తప్పుకుంటే వాడికి పుట్టుగతులుండవు. వాడి మొహాన కాసిని నీళ్ళయినా దొరకవు. వాడు నరకానికి పోవటం ఖాయం."

కాటూరివారు అనువాదం చేసేటప్పుడు మూలశ్లోకాన్ని మననం చేసికొని, అదే భావాన్ని తెలుగువారు ఎలా వ్యక్తం చేస్తారో ఆలోచించి దాన్ని పద్యంలో పెడతారనే విషయాన్ని మనకు మరొకమారు ధృవీకరించే పద్యమిది.

యౌగంధరాయణుడు ఉదయనుణ్ణి విడిపించే ప్రయత్నంలో మహాసేనుడి సైనికులకు పట్టుబడ్డాడు. జనమంతా ఆయన్ని చూడడానికి విరగదోసుకొస్తున్నారు. భటులు వారిని తొలగండని హెచ్చరిస్తున్నారు. యౌగంధరాయణుడు అలా చేయవద్దని వారిని చూడనివ్వండంటూ పలికిన శ్లోకానువాదం చక్కని జాతీయంతో గుబాళిస్తున్నది.

మూలం : "పశ్యన్తు మాం నరపతేః పురుషాః ససత్త్వా
రాజానురాగనియమేన విపద్యమానం!
యే ప్రార్థయన్తి చ మనోభిరమాత్యశబ్దం
తేషాం స్థిరీభవతు నశ్యతు వాభిలాషః." (అం. 4. శ్లో. 7)

అనువాదం: "శూరతగల్గు రాజపురుషుల్, సచివత్వము నాససేయు న
వ్వారలు, స్వామికై యిటు విపన్నుడనౌ నన్నుఁ జూడరండు! మీ
కోరిక నేటితోఁ గడుఁ దగుల్కొని నూల్కొని గాటమౌటయో,
బారెడు మూరెడై తఱుఁగ బాటి నశించుటొ తేటతెల్లమౌ."
(అం. 4. ప. 7)

"ఓ రాజ పురుషులారా! స్వామికోసం ప్రమాదంలో చిక్కిన నన్నుచూడండి. మీలో ఎవరికైనా మంత్రిత్వం మీద ఆశ వుంటే, స్థిరపడడమో బారెడు మూరెడై చివరకు నశించటమో తేలిపోతుంది. ఇది దీని భావం. "బారెడు మూరెడు కావటం" చక్కటి సామెత. ఈ సామెత మూలానికి మెరుగు పెట్టింది.

—: శ్లోకాలకు వచనాలకు గేయానువాదం :—

ఇప్పటివరకు శ్లోకాలకు పద్యానువాదాలు చూచారు. ఒకచోట శ్లోకాన్ని గేయంగా అనువాదం చేశారు, కాటూరివారు. కల్లుతాగిన గాత్ర సేవకుడి శ్లోకం దాని అనువాదం చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూలం : "ధన్యా స్సురాభి ర్మత్తాః ధన్యా స్సురభి రసులిప్తాః
ధన్యా స్సురాభి స్స్నాతాః ధన్యా స్సురభి స్సంజ్ఞాపితాః."
(అం. 4. శ్లో. 1)

అనువాదం: "ఒళ్ళు దెలకుండాను కల్లు తాగాలి
కల్లుతో ఒళ్ళంత కలియ బులమాలి
కల్లులో మునగాలి ఒళ్ళు దెలియాలి
చావాలి కల్లుతో సొరగ మెళ్ళాలి
కల్లు ముంతెప్పటికి చల్లగుండాలి." (అం. 4. గే. 1)

ఇది పల్లెటూళ్ళలో తప్పెట వాయిస్తూ చిందేస్తూ పాడే పాట లయలో వున్నది.

మహాకవి వచనాన్ని గేయంగా కాటూరివారు అనువాదం చేశారు. ఉన్మత్తుడి వేషంలో ఉన్న యౌగంధరాయణుడు విదూషకుడితో పలికిన వచనాన్ని కాటూరివారు గేయంగా అనువదించిన తీరు చూడండి.

మూలం :

యౌ : "అహమపి విలపిష్యామి, ఇంద్రో బద్ధో భోః! ఇంద్రోబద్ధోభోః."
(అం. 3 పే. 39)

అనువాదం: "పట్టినా రింద్రుణ్ణి చెఱపట్టిరన్నో!
ఇంద్రుణ్ణి పట్టినా రింద్రుణ్ణి మెన్నో." (అం. 3 పే. 36)

—: సంస్కృత వచనానికి తెలుగు వచనానువాదం :—

శ్లోకాన్నేకాదు వచనాలను అనువాదం చేసేటప్పుడు కూడ కాటూరివారు తన ప్రత్యేకతను నిలుపుకున్నారు.

ఉదయనుడు ప్రద్యోతుని సైనికులకు చిక్కిన ఉదంతాన్ని హంసకుడు యౌగంధరాయణునితో చెబుతున్నాడు.

మూలం : "తతో భర్తా వతీర్యాశ్వా దాగమ్య దేవతానాం ప్రణామం కృత్వా గృహీతా వీణా! తతః పృష్ఠత ఏకకృత నిశ్చయఇవమహాన్ కంఠీరవ స్సము త్పన్నః" (అం. 1. పే. 11)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనువాదం: "ఏలిన వారంతట గుఱ్ఱాన్నిదిగి, దేవతలకు ప్రణామం చేసి, వీణను చేతబట్టారు. ఇంతలో వెనుక దిక్కునుండి ఏదో కంఠధ్వని పెడబొబ్బ వలె వినిపించింది. (అం. 1 పే. 8)

"భర్తా" అనే శబ్దాన్ని "ఏలినవారని", కంఠీరవ శబ్దాన్ని పెడబొబ్బని అనువదించారు. ఈ రెండు చక్కటి తెలుగు శబ్దాలు.

మూర్ఛనుండి తెప్పరిల్లిన ఉదయనుణ్ణి చూచి మహాసేనుడి సేవకులు అన్న మాటలను, హంసకుడు యౌగంధరాయణునితో చెబుతున్నాడు.

మూలం. "తతః ప్రత్యాగత ప్రాణమిదానీం భర్తారం ప్రేక్ష్యానేన మమ భ్రాతా హతో౽నేన మమ సుతో మమ వయస్య ఇతి...." (అం. 1. పే. 13)

అనువాదం: "అదిగో లేవాడురా నా అన్నను జంపినవాడు! నా తమ్ముణ్ణి వీని పొట్టనే పెట్టినామురా! నా కొడుకును మ్రింగిన దీతడేరా!" (అం. 1 పే. 14)

పొట్టన పెట్టుకున్నాడు, మ్రింగాడు అనేవి తెలుగు జాతీయాలు.

అలానే హంసకుడు నెత్తుటితో తడిసిన నేలపై జారి ఒక భటుడు పడ్డాడని చెబుతూ—

మూలం: "రుధిరపటల పిచ్ఛిలాయాం భూమౌ" అంటాడు. (అం. 1 పే. 10)

కాటూరివారు "నెత్తుటి వఱ్ఱోడిన బురదనేలపై" అని, దాన్ని అనువదించారు.

తృతీయాంకంలో పిచ్చివాడి వేషంలో ఉన్న యౌగంధరాయణుడు చేతితో మల్లచిప్ప ఎత్తుకొని పోయినప్పుడు, విదూషకుడు పలికిన పలుకులు, వాటి అనువాదం చూడండి.

మూలం: "అవిధా ఏష ఉన్మత్తకో మమ మోదకమల్లకం గృహీత్వా హసమానః ఫేనాయమాన మలినవర్షారథ్యోదక మివేత ఏవాధావతి. తిష్ఠ తిష్ఠోన్మత్తక! తిష్ఠ. అనేన దండకాష్ఠేన శీర్షం తే భినద్మి." (అం. 3, పే. 36)

అనువాదం: "ఈ వెఱ్ఱిముండాకొడుకు నా కుడుముల మల్ల ఎత్తుక పారిపోన్నాడు. ఆ నవ్వు చూడు! ఆ పరుగు చూడు! వీధిలో నురుగులు గట్టుతూ పరిగెత్తే మురుగు కాలవలాగ; ఏమిరా నాయనా! నీ అవతారము! ఆగు ఆగు వెఱ్ఱివెధవా! ఆగుతావా, లేదా? ఇదిగో, ఈ వెదురు కఱ్ఱతో నీ తల చిదుగగొడుస్తాను; ఆగకపోతివాంఛే." (అం. 3, పే. 34)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇది అనువాదమనిపించనే అనిపించదు. పారిపోన్నాడు—వెట్టిముండాకొడుకు- ఏమిరా నాయనా, నీ అవతారం — ఆగుతావా లేదా - నీ తల చితకబొడుస్తాను. ఈ మాటలతో ఇది అతి సహజమైన తెలుగు సంభాషణై పోయింది.

బంధీకృతుడైన ఉదయనుడు వాసవదత్త ప్రేమలో పడ్డాడని యౌగంధరాయణునితో విదూషకుడు చెప్పగా, యౌగంధరాయణుడు "అదేశకాలే లలితం కామయతే స్వామీ కుతః" అంటాడు. దాన్ని "కామలీల కింత చక్కని దేశకాలాలు దొరికినందుకు చెప్పాలి. ఔరౌరా !" అని అనువదించారు.

దీంట్లో సంస్కృతంలో లేని సున్నితమైన చమత్కారం కూడా ఉన్నది.

చతుర్థాంకంలో త్రాగిన గాత్రసేవకుడు అత్తమామల్ని గురించి పలికిన మాటల్ని కాటూరివారు సహజ సుందరంగా అనువాదం చేశారు.

మూలం : "పానాగారా న్నిష్క్రాంతో దృష్టోఽస్మి మమ శ్వశురేణ సురుష్టేన అమృత మల్ల కేన ఘృతమరిచలవణ చూషితో మాంసఖండో ముఖే ప్రక్షిప్త శ్చ. స్నుషా రజ్యతి పీతా యది. శ్వశ్రూ ర్నను దండోద్యతా భవతి." (అం. 4, పే. 52)

అనువాదం: "మొన్న కల్లుపాకలోంచి వస్తుంటే మా మామ చూచి మండిపడ్డాడు. దాచడమెలాగా ? మిరియాలా వుప్పా వేసి నేతిలో వేగిచిన మాంసం ముక్క నోట్లో, చేతిలోనేమో కల్లుముంత ! మరి దాగడమెట్లాగంటా? కోడలు పిల్లేమో తాగి మీదబడుతుందాయె. అత్త లంజ కఱ్ఱుచ్చు కెంట బడుతుందాయె ! ఎల్లా సచ్చేది ?" (అం. 4. పే. 47)

ఈ సంభాషణ వింటే, ఒక త్రాగుబోతు సేవకుడి సంసారం మన కండ్ల ముందు నిలుస్తుంది. "కోడలుపిల్ల, అత్తలంజ" ఈ రెండు మాటలు చాలు సహజత్వానికి. రజ్యతి అంటే సంతోషపెట్టటం, మూలానికి అర్థం కోడలు త్రాగి సంతోషపెడుతుందని; దానికంటె త్రాగి మీదపడుతుంది అనటం ఎంతో సహజంగా ఉన్నది.

పట్టుబడిన యౌగంధరాయణునితో మహాసేనుడి మంత్రి భరతరోహకుడు-

29)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూలం : అపరోక్ష రాజ్య వ్యవహారో భవానితి బ్రవీతి. సమరావ జితేషు శత్రుషు కి మాహ శాస్త్రం ?" (అం. 4. పే. 62)
(విజయవాడ కల్యాణీ గ్రంథ మండలి ప్రచురణ-శుభకృతు)

అనువాదం: "సరేకాని, రాజనీతియంతా మీకు కొట్టిన పిండిగదా! రణ విజితుడైన వైరి పట్ల శాస్త్రమేమి చెప్పుతున్నది!"

ఇక్కడ "కొట్టిన పిండి" చక్కని జాతీయం.

ఈ అనువాదం చేసేటప్పుడు కాటూరివారు సుమారు ఇరవై శ్లోకాలను పద్యాలుగా కాక వచనాలుగా అనువదించారు. ఎక్కువ పద్యాలుండటం నాటక ప్రదర్శనా యోగ్యతను తగ్గిస్తుంది. అందువల్ల ఔచిత్యాన్ని పాటించి వారలా చేశారు.

1. అం—13 శ్లో; 2. అం—1 శ్లో; 2. అం-5 శ్లో; 2. అం-10 శ్లో; 2. అం—11 శ్లో; 2. అం—13 శ్లో; 3. అం-1 శ్లో; 3. అం-2 శ్లో; 3. అం—3 శ్లో; 3. అం-4 శ్లో; 4. అం-10, 11, 12, 13, 14, 15, 16, 17, 18, 19, 20, 23, 24 శ్లోకాలు. వీటన్నిటిని వచనంగానే అనువదించారు.

ఈ నాటకం అనువాద మనిపించదు. తెనుగు స్వతంత్ర నాటకంగానే భాసిస్తుంది. కాటూరివారి తెలుగు పలుకుబడులతో కూడిన రచనా శైలికి ఇది ఒక నిదర్శనం.

స్వప్న వాసవదత్తము – కథా సంగ్రహం

ఉదయనుడు వేట తమకంలో పడి రాజ్యపాలనను సరిగా పట్టించుకొనటం లేదు. తన ప్రభువు సార్వభౌముడౌతాడని ఆశించిన యౌగంధరాయణునికి నిరాశే ఎదురయింది.

అదే కాలంలో మరొక బలమైన రాజ్యం మగధ; దాని ప్రభువు దర్శకుడు. అవంతీ ప్రభువు ఎలాగూ ఉదయనుడి మామగారే. ఇక మగధను లోబరుచుకుంటే చక్రవర్తిత్వం సిద్ధించినట్లే. కానీ యుద్ధంలో మగధను గెలవటం తేలికకాదు. దీనికి తోడు, దర్శకుడి సోదరి పద్మావతిని వివాహం చేసికొన్నవాడు చక్రవర్తి అవుతాడని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దైవజ్ఞులు చెప్పారు. వాసవదత్తను అమితంగా ప్రేమిస్తున్న ఉదయనుడు ఆమె ఉండగా పద్మావతిని వివాహం చేసికోడు. అలాంటి పరిస్థితులలో యౌగంధరాయణుడు వాసవదత్తను ఒప్పించి ఒక పథకం తయారు చేశాడు.

మగధకు సమీపంలో లావణకం అనే ప్రాంతంలో ఉదయనుడు వాసవదత్తా సహితంగా విడిదిచేశాడు. రాజు వేటకు పోయిన సమయంలో విడిదిని తగుల బెట్టించి, దాంట్లో వాసవదత్త, ఆమెను రక్షించబోయిన యౌగంధరాయణుడు మరణించినట్లు ప్రచారం జరిగింది. ఉదయనుడు దుఃఖించాడు.

మగధరాజైన దర్శకుని తల్లి, ఆశ్రమంలో తాపసిగా ఉన్నది. ఆమెను దర్శించటానికి ఆమె కుమార్తె పద్మావతి తపోవనానికి విచ్చేసింది. అప్పుడే యౌగంధరాయణుడు వృద్ధబ్రాహ్మణ వేషంలోను, వాసవదత్త అవంతిక వేషంలోను, అక్కడికి వచ్చారు. యౌగంధరాయణుడు "ఈమె నా సోదరి, భర్తను ఎడబాసి ఉన్నది. కొన్ని రోజులు తమ దగ్గర ఉంచుకొని కాపాడవలసినది" అని పద్మావతిని అర్థించాడు. ఆమె అంగీకరించింది.

మగధరాజు వాసవదత్త మరణవార్త విన్నాడు. ఉదయనుడి ఐశ్వర్య పరాక్రమాలు తెలిసినవాడు కావటం వల్ల తన సోదరి పద్మావతిని ఆయనకిచ్చి వివాహం చేశాడు. అక్కడే అవంతిక వేషంలో ఉన్న వాసవదత్త రాజు కంటబడకుండా తప్పించుక తిరుగుతున్నది.

ఒకనాడు, పద్మావతికి తలనొప్పివచ్చి సముద్రగృహంలో ఉన్నదని అవంతికకు కబురు వచ్చింది. ఇదే విషయం ఉదయనుడికి కూడ తెలిసింది. ఆయన అక్కడికే బయలుదేరాడు. ఇంతకూ, పద్మావతి అక్కడకు చేరకముందే రాజు సముద్రగృహం ప్రవేశించి, శయ్య ఖాళీగా సిద్ధం చేసి ఉండటంలో విశ్రమించాడు. అంతలోనే కునుకు పట్టింది. అదే సమయంలోవాసవదత్త అక్కడికి వచ్చి దుప్పటి కప్పుకుని పరున్న రాజును పద్మావతిగా భ్రమించి ప్రక్కనే శయ్యపై పరున్నది. ఉదయనుడు "వాసవదత్తా" అంటూ కలవరిస్తున్నాడు. భర్తను గుర్తించిన ఆమె, ఆయన కలలోని సంభాషణకు బదులు పలికింది. అంతలో యౌగంధరాయణుని రాజకీయతంత్రం గుర్తుకు వచ్చి, వెంటనే అక్కడి నుండి తొలగిపోబోగా, ఆమెను పట్టుకుంటానికి నిద్రలోనే వెంబడించిన రాజు, ద్వారం తలకు తగలటం వల్ల మేల్కొ-

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

న్నాడు. ఆమె అందకుండా పోయింది. ఇది కలా నిజమా! అని వితర్కించుకుంటూ నిజమేనని భావించాడు ఉదయనుడు.

ఇంతలో మహాసేనుడు - తన కుమార్తె మరణవార్తకు చింతించి, అల్లుణ్ణి పరామర్శించటానికి ఒక దాదిని పంపాడు. ఆమె వస్తూ వాసవదత్త, ఉదయనుల చిత్రపటాన్ని తన వెంట తెచ్చి ఉదయనుడికిచ్చింది. ఈ చిత్ర పటంలో ఉన్న వాసవదత్త, తన అంతఃపురంలో ఉన్న అవంతిక ఒక్కరేనని పద్మావతి గుర్తించింది. యౌగంధ రాయణుడు తన రాజకీయ తంత్రాన్ని వివరించి క్షమాపణ కోరాడు. ఉదయనుడు ఇద్దరు భార్యలతో సార్వభౌమత్వాన్ని పొంది సుఖించాడు.

ఇది "స్వప్న వాసవదత్తము"లోని కథ.

ఈ రెండు నాటికలలో కథ వరుసగా జరిగింది. ఇక వాసవదత్త అనువాదంలో కాటూరి వారు చేసిన మార్పులు, చూపించిన నేర్పులు చూద్దాము.

స్వప్న వాసవదత్తము - అనువాద విశేషాలు

వాసవదత్తను కూడ, ప్రతిజ్ఞా యౌగంధరాయణం పద్ధతిలోనే కాటూరి వారు అనువదించారు. ఇవి వారి జీవిత చరమాంకంలోని రచనలు. భాస నాటకాలను చాలామంది అనువదించారు, అయితే కాటూరి వారి ప్రత్యేకత కాటూరివారిదే! ఆ అనువాదపు సొగసుల్ని కొంత పరికించండి.

కాటూరివారు కొన్ని శ్లోకాలను పద్యాలుగా మరికొన్నిటిని వచనాలుగా అనువదించారు. మరికొన్ని చోట్ల సంస్కృత వచనాన్ని తెలుగులోకి పద్యంగా మార్చారు. ఇక వచనాన్ని వచనంగా అనువదించటం మామూలే.

—: శ్లోకాలకు పద్యానువాదం :—

అవంతిక వేషంలో వాసవదత్త, పరివ్రాజక వేషంలో యౌగంధరాయణుడు తపోవనానికి వచ్చారు. అదే సమయంలో మగధరాజు సోదరి పద్మావతీ దేవి కూడ అక్కడికి వచ్చింది. భటులు అక్కడి వారినందర్ని తొలగిపొండని హెచ్చరిస్తున్నారు. ఈ హెచ్చరికలు విన్న యౌగంధరాయణుడు పలికిన శ్లోకం దాని అనువాదం చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూలం : "ధీర స్యాశ్రమసంశ్రితస్య వసత స్తుష్టస్య వన్యైః ఫలై
ర్మానార్హస్య జనస్య వల్కలవత స్త్రాసస్సముత్పాద్యతే
ఉత్సిక్తో వినయా దపేతపురుషో భాగ్యైశ్చలై ర్విస్మితః
కోయం భో ! నిభృతంతపోవన మిదం గ్రామీకరోత్యాజ్ఞయా"
(అం. 1. శ్లో. 3)

(రాజమండ్రి-శ్రీ సూర్యనారాయణ గ్రంథమాల ప్రచురణ)

అనువాదం: "తరుమూలమ్మె గృహమ్ము, వల్కలము వస్త్రం, బాకులుం గూరలుం
బరమాన్నమ్ముగఁ గాలమున్ గడుపు సమ్మాన్యుల్ తపోరాసులన్
వెఱపించున్ జలభాగ్య మత్తుఁడగు నీవీఁటిండి యెవ్వండో ! శాం
తరసావాల తపోవనం బితని యానన్ మాలసంతయ్యెడిన్."
(అం. 1. ప. 2)

ఈ పద్యం ఎత్తుగడ చాలా బాగున్నది. "తుష్టస్య వన్యైః ఫలైః" అన్న దాన్ని "ఆకులుం, కూరలుం బరమాన్నమ్ముగ గాలమున్, గడుపు" అని చేసిన అను వాదము తెలుగు పలుకుబడితో రమణీయంగా ఉన్నది.

కాటూరి వారి అనువాదంలో మరొక విషయం కూడ మనం గమనించ వచ్చు. గ్రామీణ పాత్రల, మధ్య తరగతి ప్రజల సంభాషణలలో ఎక్కువ తెనుగు శబ్దాలను, నాగరకులు, ఉన్నత వర్గ ప్రజల సంభాషణలలో ఎక్కువ సంస్కృత శబ్దాలను వీరు ప్రయోగించారు. యౌగంధరాయణంలో గ్రామీణ పాత్రలు ఎక్కువ. వెర్రివాడి వేషంలో ఉన్న యౌగంధరాయణుడు, శ్రమణకుడి వేషంలో ఉన్న రుమణ్వంతుడు మొదలైనవారు కూడా గ్రామీణ ప్రజలలోకే వస్తారు. అందువల్ల తెలుగుదనం ఎక్కువగా యౌగంధరాయణం అనువాదంలో కనపడుతున్నది. ఇక వాసవదత్త కథ అంతా అంతఃపురాలలో నడిచిందే. ఒక్క తపోవనంలో మాత్రమే గ్రామీణ వాతావరణం కనిపిస్తుంది. బ్రాహ్మణ వేషంలో ఉన్న యౌగంధరాయణుడు, వత్స రాజు, పద్మావతి, అవంతిక వేషంలో ఉన్న వాసవదత్త అందరూ నాగరకులు. అందు వల్ల వాసవదత్త అనువాదంలో తెలుగు శబ్దాలు కొంచెం తక్కువనే చెప్పాలి. ఇప్పటికి కూడా అంలేగద. నాగరక ప్రజల సంభాషణలో దొర్లినన్ని సంస్కృత శబ్దాలు, గ్రామీణ ప్రజల సంభాషణలలో ఉండవు. వాసవదత్తలో బ్రహ్మచారి పాత్ర గ్రామీణ జీవితానికి సంబంధించినది. అతడు మధ్యాహ్న సమయంలో తపోవనం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లోకి ప్రవేశించి అక్కడి వాతావరణాన్ని ప్రశంసిస్తూ పలికిన శ్లోకానువాదం తెలుగు శబ్దాలతో ఎంతో సహజ సుందరంగా ఉన్నది.

మూలం : విస్రబ్ధం, హరిణా శ్చరం త్యచకితా దేశాగతప్రత్యయా
వృక్షాః పుష్పఫలై స్సమృద్ధవిటపా, స్సర్వే దయారక్షితాః
భూయిష్ఠం కపిలాని గోకులధనాన్యక్షేత్రవత్యో దిశో
నిస్సన్దిగ్ధ మిదం తపోవన మయంధూమోహి బహ్వాశ్రయః
(అం. 1. శ్లో 12)

అనువాదం : వెఱలేని చూడ్కి నెనరుచింద నిచ్చోట
లేళ్లు మచ్చికమీఱఁ గ్రేళ్ళుఁదాటు
ఏపుగాఁ గూరిమి ప్రోపున బెరిగి కై
వ్రాలె దరుల్ పుష్ప ఫలభరమున
ఉరుద్రాడు దామెన లెఱుఁగ కల్లదె చెర
లాడుచున్నదీ కరియాల మంద
కనుజూపు మీర నెక్కడఁ గన్న నాగేటి
కఱ్ఱు మోపెఱుఁగని గన్నెబీళ్ళు
ఆజ్య గంధమ్ముళలం దాల్చినట్టి ధూమ
వల్లరులు మింట నలుదెస నల్లుకొనుచు
ముకుటము దన్పె; నిద్ది తపోవనమ్మె,
యగుసు మున్మాటికిని సందియమ్ములేదు. (అం. 1. ప. 10)

ఈ పద్యంలో "తరులు", "పుష్ప ఫలభరము", "ఆజ్యగంధము", "ధూమ వల్లరులు", "ముకుటము", "తపోవనము" అనే మాటలు దప్ప అన్నీ తెలుగు శబ్దాలే. మూలంలో శార్దూల వృత్తం తెనుగులో సీస పద్యంగా అవతరించింది. ఇక్కడ కాటూరి వారు మూలంలో భావాన్ని విపులీకరించారు. కొంత పెంచారు. "హరిణాశ్చరంత్యచకితా" అనేదాన్ని వెఱలేని చూడ్కి నెనరుచిందనిచ్చోట లేళ్లు మచ్చిక మీఱ గ్రేళ్లు దాటు" అని మూలంలో భావాన్ని విపులీకరించారు. మూలంలో సంచరిస్తున్న లేళ్లు అనువాదంలో గంతులు వేసినవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"భూయిష్ఠం కపిలాని" అనే దాన్ని
ఉరుద్రాడు దామెన తెలుగ కల్లదె చెర
లాడుచున్నది కరియాల మంద" అని అనువదించారు.

ఇక్కడ మూలంలో కంటే అనువాదంలో విశేషాలెక్కువగా ఉన్నవి. మూలంలో లేని ఉరుత్రాళ్ళ దామెనలు ఆవులకున్నట్లు వీరు చిత్రించారు. "ఉరుత్రాడు" అంటే ఆవులకు పాలు తీసేటప్పుడు వెనుకకాళ్ళకు బంధంగా కట్టే త్రాడు. దామెన అంటే మూడు నాలుగు శాఖలుండి ప్రతి శాఖకు కొన్ని పలుపులు గల కట్టుత్రాళ్ల గుత్తి. ప్రతిశాఖకు కొన్ని పశువులను కట్టివేస్తారు. అవి ఒకదాని కొకటి కట్టు బడి ఉండటమే కాని ఇంకొక కట్టుకొయ్య అంటూ ఉండదు. అలాటి తాడునే బంతి అని కూడ అంటారు. జొన్న, సజ్జ మొదలైన కంకుల్ని, వరిని నూర్చటానికి సుమారు ఒక ఇరవై పశువుల్ని ఆ త్రాళ్ళకు కట్టి కుప్పమీద తిప్పుతారు. దాన్ని బంతి కట్టడం అంటారు. ఇది పశువుల సామూహిక బంధన ప్రణాళిక. ఆవుకు బంధమేయకుండా, పాలు తీయకూడదని సంప్రదాయం. కపిలధేనువు పాలు హోమానికి, దేవతార్చనకు శ్రేష్ఠమైనవి. అక్కడ అన్నీ కట్టిఆవుల మందలే. వాటికి కాళ్ళకు, మెడలకు బంధాలున్నవి. అయినా వాటికా సంగతి తెలియటం లేదు. అంటే ఉన్న చోటునుండి కదలవలసిన అవసరం లేనంతగా పచ్చిక ఉన్నదన్న మాట. మరే బాధలు లేవని కూడ అర్థం.

"కనుచూపు మేర నెక్కడ గన్న నాగేటి; కఱ్ఱు మోపెరుగని గన్నె వీళ్ళు." అంటూ ఆశ్రమ వాతావరణాన్ని చక్కగా వ్యక్తీకరించారు కాటూరివారు. అక్షేత్రం అనే శబ్దాన్ని తెలుగులో నాగలి కఱ్ఱు మోపని కన్నెవీడుగా అనువదించారు. కన్నెవీడు అనే ప్రయోగం అమోఘంగా ఉన్నది. అంటే అవి సేద్యపు భూములు కావన్న మాట. వ్యవసాయం కూడా హింసాయుతమైనదే. అందువల్ల ఋషులు సహజంగా పండే ఫలాల్ని లభించే దుంపల్ని తింటుంటారు. ఆ విషయం సూచించటానికే కాటూరివారలా వ్రాశారు. "నిస్సన్దిగ్ధమిదం తపోవనం" అన్నదాన్ని "ఇద్ది తపో వనమ్మెయగును ముమ్మాటికి సందియమ్ములేదు" అని అనువదించారు. ముమ్మాటికి అనేది చక్కని తెలుగు పలుకుబడి.

ఆశ్రమ వాటికలో కాంచుకేయుడు సూర్యాస్తమయాన్ని గురించి చెప్పిన శ్లోకా నికి అనువాదం కూడా చాలా మనోహరంగా ఉన్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూలం : "ఖగా వాసోపేతా స్సలిల మవగాఢో మునిజనః
ప్రదీప్తోఽగ్ని ర్భాతి ప్రవిచరతి ధూమో మునివనం
పరిభ్రష్టో దూరా ద్రవి రపి చ సంక్షిప్త కిరణో
రథం వ్యావర్త్యా సౌ ప్రవిశతి శనై ర స్తశిఖరం" (అం. 1. శ్లో 16)

అనువాదం : సంధ్యాకషాయిత సలిలావగాహమ్ము
సల్పజొచ్చిరి కావి దాల్పులెల్ల
అపర సంధ్యా ముఖాభ్యర్చనల్ గొనువొంటె
హవ్యవాహనుఁడు సప్తార్చి వెలిఁగె
కలకలారావ సంకులముగా బారులు
గట్టి గూండ్లకుఁ జేరు ఖగకులమ్ము
హోమధూమాంబుదస్తోమ మాశ్రమవృక్ష
నిశ్రేణికలమీదఁ నింగిఁబ్రాకె
రవియు దౌదౌల సంక్షిప్త రశ్మియగుచుఁ
జిలుక వన్నియ యేడు తేజీలతోడి
తేరు నిలపెట్టి తా దిగజారె ననఁగ
నల్లనల్లనఁ జేరె నస్తాద్రి శిఖరి (అం. 1. ప. 14)

"సలిల మవగాఢోమునిజనః" (మునులు నీటిలో స్నానం చేస్తున్నారు) అన్న దాన్ని "సంధ్యాకషాయిత సలిలావగాహమ్ము సల్ప జొచ్చిరి కావిదాల్పులెల్ల" అని అనువదించారు. ఇది మూలానికెంతో మెరుగుపెట్టింది. సాయం సంధ్యలోని ఎఱ్ఱదనం ప్రతిఫలించి తటాకాలల్లో నీళ్ళు ఎఱ్ఱగా ఉన్నవి. దాంట్లో స్నానం చేస్తున్న ఋషులు కట్టుకొన్నవి కాషాయ వస్త్రాలు. అంతా ఒకచే కాషాయరంజితమైన దివ్యతేజము. సూర్య మండలంలో ఉండేది నారాయణుడు; నీరు నారాయణుని నివాసము. ఋషులు నారాయణ జపతత్పరులు. ఆ సంధ్య అంతా నారాయణమయంగా ఉన్నది. ఇంత సొగసు మూలంలో వ్యక్తం కాలేదనే చెప్పాలి.

ఖగా వాసో పేతాః" (పక్షులు గూండ్లకు చేరుతున్నవి) అన్నదాన్ని.

కల కలారావ సంకులముగా బారులు
గట్టి గూండ్లకుఁ జేరు ఖగకులమ్ము" అంటూ అనువదించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూలంలో అంతగా రూపుకట్టని సంధ్యా దృశ్యం. అనువాదంలో అత్యంత సహజంగా, సుందరంగా మన కళ్ళ ముందర నిలుస్తుంది.

"పరిభ్రష్టో దూరాత్ రవి రపి చ సంక్షిప్తకిరణో రథం వ్యావర్త్యా సౌ ప్రవిశతిశనై ర స్తశిఖరం. (సూర్యుడు కూడ రథాన్ని వెనుకకు మరలించి సంక్షిప్త కిరణుడై అస్తాద్రి చేరాడు.)

దీన్ని ఒక తేటగీతి క్రింద విస్తరించి వ్రాశారు.

"చిలుక వన్నియ యేడు తేజీలతోడి' తేరు నిలపెట్టి తాదిగజాఱె ననఁగ" అన్నది వీరు పెంచిన విషయం. చిలుక వన్నియ గల ఏడు గుర్రాలు అనటం విశిష్టం. చిలుకలో అనేక వర్ణాలు ఉండటం, సూర్యకిరణాలలో ఏడు రంగులున్నవని ఆధునిక విజ్ఞానశాస్త్రం చెప్పటం, ఆ ఏడురంగులే సూర్యుడి సప్తాశ్వాలని భావించటం, మొదలయిన అంశాలు ఈ రూపకల్పనకు దోహదం చేసి ఉండవచ్చు. సూర్యుడికి హరిదశ్వుడనే పేరు కూడా ఉన్నది. హరిద్వర్ణము అంటే చిలుకపచ్చ, చిలుకవన్నె ఏడు తేజీలు అనటం చక్కని తెలుగు పలుకుబడి. అంతేకాకుండ సంధ్యా సమయంలో సూర్యకిరణాలు చెట్లమీదుగా ప్రసరిస్తూ ఆకుపచ్చరంగు ఎక్కువగా పులుముకోవటం మనం చూడవచ్చు. ఈ కారణం చేత కూడ ఈ వర్ణన చాలా సొంపుగా ఉన్నది.

రథాన్ని అస్తాద్రిపై నిలిపి తాను రథం దిగాడు అనటం, మనోహరమయిన వర్ణన. సూర్యబింబం కనపడకుండా పోతుంది. కాని ఎట్టిటి వెలుగు పడమటి కొండపై కొంతసేపు నిలిచే ఉంటుంది. అది ఎవడి కాంతో, వాడులేడు, కాంతి మాత్రం ఉన్నది. ఇది అత్యంత సుందరం.

ఉదయనుడు పద్మావతిని వివాహం చేసుకున్నాడన్న మాటేగాని వాసవదత్త వియోగ వేదన నుండి తేరుకోలేదు. అదే విషయం చెబుతూ రాజు పలికిన శ్లోకం దాని అనువాదం చూడండి, ఎంత సహజ సుందరంగా ఉన్నదో.

మూలం : శ్లాఘ్యా మవన్తినృపతేస్సదృశీం తనూజాం
కాలక్రమేణ పునరాగతదారభారః
లావాణకే హుతవహేన హృతాంగయష్టిం
తాం పద్మినీం హిమహతా మివ చిన్తయామి. (అం. 5. శ్లో. 1)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనువాదం: ఆమెందోయె నవంతిరాజసుత, నేనంతటన్ వెండియున్
జాయం గైకొని గేస్తునై తినని స్వాస్థ్యంబాత్మ కొక్కింత లే
దాయెన్, మంచునఁగ్రగ్గు తమ్మివలె నాఁడయ్యగ్ని నిర్దగ్ధయై
మాయంబైన లతాంగి సౌరె మదిలోమారాకు హత్తించెడిన్
(అం. 5. ప. 1)

ఈ పద్యం ఎత్తుగడే చాలా అందంగా ఉన్నది. "ఆమెందోయె" అనేది చాలా చక్కని తెలుగు పలుకుబడి. ఏదైనా స్వల్పకాలంలో దూరమైన అనుభవాన్ని చెప్పేటప్పుడు ఆ! అయింది పోయిందీ! అంటాడు తెనుగువాడు. అదే ఛందో బంధంలో "ఆమెంబోయె" అయింది. "మదిలో మారాకు హత్తించెడిన్" అనేది మూలానికి దిద్దిన మెరుగు. మారాకు హత్తించటం అనేది కూడ మంచి తెలుగు పలుకుబడి.

"హిమహతా మివ పద్మినీం" అనేదాన్ని "మంచున గ్రగ్గుతమ్మి" అని అను వదించారు. ఇంతకంటె అందంగా అనువదించటం అసాధ్యం. పైన ఇవన్నీ చక్కటి తెలుగు పదాలే! ఇంక ఏమార్పు చేసినా మూలంలోని భావసౌందర్యం అను వాదంలో నుంచి జారిపోతుంది. ఆ మూలాన్ని కూడా కొద్దిగా పరామర్శిస్తాను.

మంచు పడ్డప్పుడు తామరపుష్పం రేకులు రాలిపోయే మాట నిజమే. అయితే అవి వికసించిన పుష్పానికే. పర్యవసానంగా ఆ పుష్పం కాయగా మారుతుంది. మంచు ఇతర పుష్పాలకు మేలు చేస్తుంది, ఒక్క తామర పుష్పానికే కీడు. వాసవ దత్త స్థితి కూడ అంతే. యౌగంధరాయణుని ప్రయత్నం అందరికి మేలే. ఒక్క వాసవదత్తకే కష్టం. చివరకు ఆమె కష్టం కూడ ఉన్నతమైన సౌఖ్యానికే దారి తీసింది. ఉదయనుడు సార్వభౌముడైనాడు. ఆమె మహారాజ్ఞి అయింది. "పద్మినీం హిమహతా మివ" అంటే ఇది. మూలంలోని ఈ భావమంతా తెలుగు పద్యంలోకి వచ్చింది. అలాంటి శబ్దాలు సంఘటించటంలోనే కాటూరివారి ప్రతిభ కనబడుతుంది.

—: సంస్కృత వచనం-తెలుగు పద్యం-మూలానికి మార్పులు :—

ఇప్పటివరకు మూలంలో ఉన్న శ్లోకాలను పద్యాలుగా అనువదించటం చూచాము. ఇక మూలంలో వచనాన్ని తెలుగు పద్యంగా అనువదించిన పట్టులను, మూలాన్ని పెంచిన సన్నివేశాల్ని పరిశీలిస్తాను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నాలుగవ అంకంలో మూలంలో ఒక సంభాషణను విస్తరించి పద్యంగా వ్రాశారు కాటూరివారు.

విదూషకుడు, ఉదయనుడు ఉద్యానవనంలోకి వచ్చారు. అక్కడ చెదిరిన పూలచెట్లను చూచి, పద్మావతి అక్కడే ఉన్నదని వారు భావించిన సందర్భమిది.

మూలం : విదూ : తత్రభవతీ పద్మావతీ హాగత్య నిర్గతాభవేత్

అనువాదం: ఇదిగో పద్మావతీదేవి ఇలా వచ్చి వెళ్ళినట్లున్నది.

మూలం : రాజు : కథం భవాన్ జానాతి ?

అనువాదం: ఎలా తెలిసింది నీకు.

మూలం : విదూషకుడు : ఇమా నపచిత కుసుమాన్ శేఫాలికా గుచ్ఛకాన్ ప్రేక్ష తాం తావ ద్భవాన్.

అనువాదం: ఇదిగో పూవులూడ్చిన ఈ శేఫాలికలు చూస్తే మీకు తెలియటంలేదూ ?

మూలం : రాజు : అహో విచిత్రతా కుసుమస్య! వసన్తక ....వసంతక! అస్మి న్నేవాసేనా శిలాతలే పద్మావతీం ప్రతీక్షిష్యావ హే!

ఇక్కడ రాజు సంభాషణను మూలంలో కంటె పెంచారు కాటూరివారు. "వసంతకా ఈ వన్నె వన్నె పూలు చూసావా! ఎంత యింపుగా ఉన్నవో!............ దేవి వచ్చేవరకు ఈ రాతిపలక మీదనే కూర్చుంటాను." అంతవరకు మూలానికి సరయిన అనువాదమే. ఇక ఈ క్రింది పద్యం పెంపు.

"ఇదె! కదుష్ణమైన దీ శిలాఫలకమ్ము,
ననలు బాదహతుల నలఁగిపోయె
నిచట విశ్రమించి, యింతంత మసుగాంచి
ఇంతి యెవరొ దొలఁగియేగె నిజము." (అం. 4. ప. 3)

మూలంలో రాజు విచిత్రంగా ఉన్నవి అని చెప్పిన పూలు ఎక్కడున్నవి చెట్లకా? మరొక చోటనా? పూలు కోయబడిన శేఫాలికలను గదా విదూషకుడు చూపుతున్నది? ఇదొక సందేహం !

కేవలం పూలు కోయబడి ఉండటంవల్ల, విదూషకుడు చెప్పినంతమాత్రాన ఉదయనుడు పద్మావతి అక్కడికి వచ్చిందని నమ్మాడా? మరి అతనికి సొంత ఆలోచన ఏమన్నా ఉన్నదా! ఈ రెండు ఆలోచనల పర్యవసానమే కాటూరివారు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చేసిన పెంపుదల. ఈ పెంపుదలలోని ఔచిత్యం కథలో కొంత వెనక్కిపోయి చూస్తే గాని స్ఫురించదు.

అవంతికా వేషంలో ఉన్న వాసవదత్త, పద్మావతి ఉద్యానవనానికి వచ్చారు. అప్పుడు చెలికత్తె "ఈ చలువరాతి పలకమీద కొంచెం విశ్రమించండి నేనీ లోపల పూలు కోసుకవస్తాను" అనటం వారా అరుగుమీద కూర్చోవటం జరిగింది. అంతలో చెలికత్తె పూలు కోసుకొనివచ్చి "చూడండి చిన్నమ్మగారూ! మణిశిల పలుకులవలె ఎలా వున్నవో యీ పువ్వులు నా దోసిట్లో" అన్నది. వాసవదత్త ఆ పూలను, "అవునవును ఎంతో చూడముచ్చటగా నున్నవి" అని ప్రశంసించింది. "ఇంకా కోసి తెమ్మంటారా" అన్నది చెలికత్తె. "వద్దు........ ఆర్యపుత్రుడు (ఉదయనుడు) చెట్లకు పూలు కోయకుండా ఉంటేనే మెచ్చుకుంటారు" అన్నది పద్మావతి. తరువాత వాసవదత్త పద్మావతితో నీకు ఉదయనుడంటే అంత ఇష్టమా అనటం, ఆమె తన ప్రేమను వ్యక్తం చేయటం, అవంతిక రూపంలో వున్న వాసవదత్త రాజుపై తన ప్రేమను కూడ వ్యక్తం చేయటం మొదలయిన విశేషాలతో కథ సాగింది. మూలానికి అనువాదానికీ ఇక్కడ ఏమీ తేడాలేదు. మనం ఇక్కడ రెండు విషయాలు గమనించవచ్చు. కొన్ని శేఫాలికా లతల నుండే చెలికత్తె పూలు కోసింది, కొన్నిటికి ఇంకా చాలా పూలు ఉన్నవి. ఇది మొదటి విషయం. చెలికత్తె దోసిట్లో పూలు ఏమి చేసిందో మూలంలో లేదు. ఇది రెండవ విషయం. అసలు చెలికత్తె పూలు కోసే సన్నివేశానికి నాటకంలో ప్రత్యక్ష ప్రయోజనం కనపడదు. ఉదయనుడికి పూలపై ఉన్న మక్కువ, పద్మావతీ వాసవదత్తలకు ఆయన పైన ఉన్న ప్రేమ వ్యక్తం గావటానికే ఈ సన్నివేశం ఉపయోగపడింది. అందువల్లనే చెలికత్తె దోసిట్లో పూల ప్రసక్తి అంతటితో ఆగిపోయింది. ఈ ఆగిపోయిన సంఘటనల్ని ఆధారంగా తీసికొని ఉదయనుడి ప్రజ్ఞా విశేషాలు ప్రతిఫలించేలా కాటూరివారు మూలాన్ని పెంచారు.

ఆ చెలికత్తె దోసిట్లో పూలను అవంతిక, పద్మావతులు కూర్చున్న అరుగుమీద పోసి ఉంటుంది. రాజు అటువైపు పూలు కొన్ని చెట్లకు లేకుండా కొన్నిటికే ఉండటం చూచాడు. మరికొన్ని అరుగుమీద ఉండటం చూచాడు. ఎదురుగా వున్న చెట్ల నుండి కోసిన పూలు అక్కడే అరుగుమీద కనబటం వాటిమీద పాదముద్రలుండటంతో రాజుకు పద్మావతి అక్కడే ఉన్నదని ధృవపడింది. ఉదయనుడు శిలా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఫలకం మీద కూర్చున్నాడు. వెంటనే అది కొద్దిగా వేడిగా ఉన్న విషయం గ్రహించాడు. ఈ అరుగుమీద ఉన్నవాళ్ళు కొన్ని క్షణాలముందే అరుగుమీద నుండి తన రాకతో ఎటో తొలగిపోయారని నిశ్చయానికొచ్చాడు. ఈ కల్పన ఉదయనుడి బుద్ధి కుశలతను పరిశీలనా దృష్టిని విప్పి చెప్పింది.

ఈ అంకంలోనే ఇలాటి మరో పద్యం మూలంలోలేని భావాలను నింపుకొని ఇంపుగా కనబడుతున్నది.

రాజు, విదూషకుడు అరుగుమీద కూర్చున్నారు. ఉదయనుడి కంటబడటం ఇష్టంలేని వాసవదత్త, పద్మావతి, చెలికత్తెలతో ప్రక్కనే ఉన్న పూపొదలో దూరారు. రాజును విదూషకుణ్ణి వీళ్ళు చూస్తున్నారు. వారి మాటలు వీరికి వినబడుతున్నాయి. కానీ రాజుకు వారక్కడున్నట్లు తెలియదు. విదూషకుడికి తెలుసు. ఇదీ సన్నివేశం. ఇక రాజు, విదూషకుడు ఏమి మాట్లాడుకుంటున్నారో వినండి.

విదూషకుడు : అప్పటి వాసవదత్తా దేవి మీద మీకు ఎక్కువ యిష్టమా ఇప్పటి పద్మావతీదేవి మీదనా.

విదూషకుడి ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పలేదు కాని చివరకు ఇలా చెప్పాడు."

మూలం : "పద్మావతీ బహుమతా మమ యద్యపి రూపశీలమాధుర్యైః
వాసవదత్తాబద్ధం న తు తావ న్మే మనో హరతి." (అం. 4, శ్లో. 4)

అనువాదం : "మధురవర్తన రూపసంపన్న మిగుల
గూర్చునాకు బద్మావతి గుణసమేత;
అయ్యు. వాసవదత్తా సమర్పితమగు
హృదయమును జూఱఁగొననేర దేమిసెప్ప" (అం. 4, ప. 5)

అసలు భాసుడు ఈ సన్నివేశాన్ని ఎందుకు కల్పించాడో కొద్దిగా ఆలోచిద్దాం. వాసవదత్త కనులముందే పద్మావతీ ఉదయనుల వివాహం జరిగింది. ఆమె, తన భర్త మరో స్త్రీతో సుఖాలు అనుభవిస్తుంటే తాను బ్రతికి ఉండే మరణించిన దానిలాగా ఉండవలసి వచ్చింది. పైన మారువేషంలో పరాయి పంచన ఉండటం! ఆమె ఎంత తల్లడిల్లి పోతుందో! ఏమై పోతుందో! కానీ ఏమీ కావటానికి వీల్లేదు. రాజకీయం అలా ఉన్నది. ఉదయనుడికి తనమీద ప్రేమ ఉన్నట్లు వింటే ఆ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కొంత ఊరట చెందుతుంది. అందుకే విదూషకుడి ద్వారా ఈ సన్నివేశ కల్పన చేశాడు భాసుడు. అదీ అలా ఉంచుదాం.

కాటూరివారు పై పద్యం తరువాత మరో పద్యం ఉదయనుడితో పలికించారు. ఇదీ మూలంలో లేదు.

"పరుసమాడిన నేను బద్యముల్ దాఁబల్కు,
నొరులు నన్ గొనియాడ నుప్పొంగిపోవుఁ జెలి
కలికి వేళ మెఱింగి కథలు సెప్పునునాకు,
అకట! వాసవదత్త ఆలియుఁ జెలియునై
నా సుఖమె సుఖముగా, నా వెతయె వెతగాఁగ
బంటును బ్రెగడయై పలుగతుల ననుగొల్చె." (అం. 4, ప. 6)

భాసుడు కల్పించిన సన్నివేశంలో ఉదయనుడి సంభాషణ వాసవదత్తకు సంతోషం కలిగించింది. మరి పద్మావతి సంగతేమిటి. అసలే ఈ మొగుడు రెండోపెండ్లి వాడు. పైన మొదటి భార్యను మరువలేని వాడు. ఆమె పైకి "నేటికి కూడ వాసవదత్తాదేవి గుణాలు ఇలా స్మరిస్తున్న ఆర్యపుత్రుల దాక్షిణ్యమే దాక్షిణ్యం" అన్నది కాని ఉదయనుడి మాటలకు లోపల బాధపడదా? ఇదే ఆలోచన కాటూరివారి చేత తరువాత పద్యం వ్రాయించింది. ఈ పద్యంవల్ల తాను వాసవదత్తను ఎందుకు మరచిపోలేక పోతున్నాడో ఉదయనుడు చెప్పినట్లయింది. అదే సమయంలో అలాటి ఉత్తమ లక్షణాలు అలవరచు కొమ్మని పద్మావతికి బోధించినట్లయింది.

"నేను కఠినంగా మాట్లాడితే వాసవదత్త దాన్ని మృదువుగా మార్చేది. నన్ను ఇతరులు పొగుడుతుంటే ఉప్పొంగిపోయేది. కథలు చెప్పేది. సేవకునిగా, మంత్రిగా సేవలందించేది. భార్యా, చెలికత్తె అయిన ఆమెను ఎలా మరువగలను" అంటాడు ఉదయనుడు.

పద్మావతీ ఉదయనుల వివాహం జరిగి ఆట్టే కాలం కాలేదు. అందువల్ల వాసవదత్త చేసిన పనులన్నీ చేసే అవకాశం ఆమెకు రాలేదు. భర్తతో ఇంకా అంత చనువు కూడ ఏర్పడలేదు. అందువల్ల ఈ మాటలు విన్న పద్మావతి తాను కూడా అలానే ప్రయత్నించి భర్త ప్రేమను వాసవదత్త కంటే ఎక్కువ పొందాలని భావిస్తుందే కాని భర్త మాటలను తప్పు పట్టదు. బాధపడదు. భాసుడు వాసవదత్త విషయమే ఆలోచించాడు. కాటూరివారు పద్మావతి కష్టాన్ని కూడ గుర్తించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూలంలో పద్మావతి ఉదయనుడి దాక్షిణ్యాన్ని ప్రశంసించిన దానికన్న అనువాదంలో పద్మావతి పలికిన మాటలు మనస్ఫూర్తిగా అన్నవి. కాటూరివారు ఎంత ఔచిత్యాన్ని పాటించి ఇక్కడ నూతన విషయాన్ని కల్పించారో వారి కవితా హృదయమెంతటిదో మనం గమనించవచ్చు.

అయిదవ అంకంలో కూడా ఇలాంటి పెంపుదలే మరొకటున్నది. సముద్ర గృహంలో శయ్యపై కలత నిద్దురలో ఉన్న రాజు, అక్కడ పద్మావతి ఉన్నదను కొని వెళ్ళిన వాసవదత్త కలుసుకున్నారు. స్వప్నంలో రాజు మాట్లాడుతున్నాడు. దానికి వాసవదత్త సమాధానం చెబుతున్నది. రాజు హఠాత్తుగా ఆమె చేయి పట్టుకున్నాడు. యౌగంధరాయణ తంత్రం భగ్నమౌతుందని ఆమె అక్కడి నుండి త్వరగా వెళ్ళిపోయింది. రాజు ఆ నిద్రలోనే లేచి ఆమె వెంట వెళ్ళబోయాడు. అంతలో ద్వారబంధం తగిలి మెలుకువ వచ్చింది. ఇంతలో అప్పటిదాకా బయటికి వెళ్ళిన విదూషకుడు వచ్చాడు. వారి సంభాషణ, ఆ సందర్భంలో కాటూరివారు విస్తరించి వ్రాసిన పద్యం చూడండి.

మూలం ; రాజు :- వయస్య ప్రియమావేదయే, ధరతేఖలు వాసవదత్తా

సంస్కృతంలో ఈ ఒక్కమాటే రాజు విదూషకుడితో అన్నాడు కాటూరివారు దాన్ని యథాతథంగా అనువదించటమే కాకుండా అధికంగా మరో పద్యం కూడ రాజు చేత పలికించాడు.

అనువాదం ; నెచ్చెలీ నీకొక మంచివార్త చెప్పనా! వాసవదత్త బ్రతికే ఉన్నదోయీ!

ఇంత వరకు ఇది మూలానికి అనువాదం. తరువాత రాజు పలికిన పద్యమిదీ

"నిజతనూ విభ్రమైకాస్త్రనిహతి, రెప్ప
తలుపులన్ ఛిన్న మొనరించి, కలికి నాదు
కంటిద్వారము నిచ్చమై గడచి పోయి
హృదయ గేహము జొచ్చె, నింకేమి చెప్ప ? (అం. 5 ప. 8)

రాజు కలత నిద్రలో ఉన్నాడు. వాసవదత్తతో మాట్లాడాడు. ఆమె బదులు చెప్పిన మాటలు విన్నాడు. ఆమె తన చేయి పట్టుకున్న స్పర్శ గ్రహించాడు. తాను కూడ ఆమె చేయి పట్టుకున్నాడు. ఆమె వెళుతుంటే వెంట పరుగెత్తాడు. అయితే ఇదంతా నిద్రవంటి మెలుకువలో జరిగింది. పూర్తి మెలుకువ వచ్చిన తరువాత చూస్తే ఆమె కనిపించలేదు. అప్పుడు "ఆమె తన శరీర సౌందర్య భ్రాంతిలో నన్ను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముంచి నా రెప్పలనే తలుపులను పగులగొట్టి కంటి ద్వారం గుండా హృదయ మందిరంలో ప్రవేశించింది. అందుకే ఇంతకు ముందు చూచిన ఆమె ఇప్పుడు కనబడకుండా పోయింది" అన్నాడు. ఉదయనుడు వాసవదత్తను చూచాడు. వాసవదత్త బ్రతికే ఉన్నదని-విదూషకుడితో చెబుతున్నాడు. అయితే ఆ మాటల వెనుక కొంత సంశయం లేకపోలేదు. నిస్సందేహంగా వాసవదత్త బ్రతికి ఉన్నట్లు రాజు నమ్మితే విదూషకుడు చెప్పింది వింటాడా? క్షణంలో ఆజ్ఞలు జారీ అయ్యేవి. అధికారులు శోధించి సత్యం సాధించేవారు. రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా! అసలు ఉదయనుడే సంశయంలో ఉన్నాడు. ఇన్ని రోజులుగా మరణించినట్లు భావిస్తున్న వాసవదత్త బ్రతికి ఉన్నట్లనిపిస్తున్నా! అది ధృవపడలేదు. ఈ సందిగ్ధ స్థితి భాసుడి నాటకంలో వ్యక్తం కాలేదు. దాన్ని కామారివారు వ్యక్తం చేశారు. ఇక్కడ రాజు సంభాషణను పద్య గతంగా పెంచటంలో ఆశించిన ప్రయోజన మదే!

ఇదే సందర్భంలో రాజు పలికిన మూలంలోని శ్లోకాన్ని వచనంగా అనువదించారు. అంతటితో ఆగక మూలంలోని భావాన్ని పెంచి మరో పద్యంగా వ్రాశారు.

రాజు, వాసవదత్త బ్రతికే ఉన్నదనగానే విదూషకుడు "ఇంకెక్కడి వాసవదత్తండీ మీకు మతిపోయినట్లున్నది! అయ్యో ఆమె పోయి ఎంత కాలమయినదండీ" అన్నాడు. సమాధానంగా రాజు పలికిన శ్లోకమిది.

మూలం : "శయ్యాయా మవసుప్తం మాం బోధయిత్వా సఖే గతా
దగ్ధేతి బ్రువతా పూర్వం వఞ్చితోస్మి రుమణ్వతా." (5వ అం. 8శ్లో)

ఈ శ్లోకానికి వచనానువాదం :

"వట్టిదోయి, ఆ మాటలన్నీ వట్టివి. శయ్యపై నిద్రిస్తున్న మమ్మ మేల్కొలిపి ఇప్పుడేగదా! దాటిపోయినది. అగ్ని దగ్ధమైనదని చెప్పి రుమణ్వంతుడు మోసగించాడు మమ్ము. ఇంత ఎందుకు." ఇంతవరకు మూలానికి అనువాదం, తరువాత పద్యం విస్తరణ-

"వన్నె గులుకఁ బద్మావతీ వదనమందు
దిలక మేనాడు గంటినో తెలిసె నపుడె
జీవములతోడ నున్నది దేవి, యయ్య
వంతికయటంచు, శంకింప వలవదింక." (అం. 5, ప. 9)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరిశీలిస్తే ఇలా పెంచిన దాంట్లో ఔచిత్యం, కాటూరివారి ప్రతిభ ద్యోతక మౌతుంది. వాసవదత్త మరణవార్తను గురించి మొదటినుండి ఉదయనుడికి కొంత సందేహమున్నదీ. అదీ అప్పుడప్పుడు వ్యక్తమయినదీ కూడ. ఉద్యానవనంలో విదూషకుడు రాజును "మీకు పద్మావతి అంటే ఇష్టమా వాసవదత్త అంటే ఇష్టమా" అని అడిగాడు. "పద్మావతి సౌందర్యంలో, సౌజన్యంలో చాలా గొప్పదే కానీ నా మనసు వాసవదత్తనుండి మరలి రావటంలేదు" అన్నాడు రాజు. తిరిగి రాజు విదూషకుణ్ణి నీకెవరు ఇష్టమో చెప్పమన్నాడు. విదూషకుడు "వాసవదత్తాదేవి మీద నాకు చాలా గౌరవం. పద్మావతీదేవి నాకు చాలా పిండివంటలు పెడుతుంది. అందు వల్ల ఆమె నాకు నచ్చింది" అన్నాడు. అప్పుడు రాజు పలికిన మాట చూడండి.

మూలం : భవతు భవతు వసన్తక సర్వమేతత్ కథయిష్యే దేవ్యై వాసవదత్తాయై
అనువాదం: సరేలే వుండు. ఈ మాటలన్నీ వాసవదత్తతో చెప్పి నీ పని పట్టిస్తాను.

అయితే విదూషకుడు, ఇంకెక్కడి వాసవదత్త అనటం రాజు విషాదంలో పడటం జరిగిందనుకోండి. అయినా ఉదయనుడి హృదయంలో వాసవదత్త బ్రతికి ఉన్నదనే స్ఫురణ లేకపోతే చాలాకాలం తరువాత అలాటి మాట రాదు.

మరొక విషయం :

దివ్యుల అనుగ్రహం, ఋషుల దీవెనలు, పొందినవాడు పాండవ వంశ సంజాతుడు, మహాప్రజ్ఞాశాలి అయిన ఉదయనుడు-ఇల్లు తగలబడి నీ భార్య మరణిం చిందంటే గ్రుడ్డిగా నమ్ముతాడా? పైగా తనున్న పరిసరాలల్లోనే మారువేషంలో వాసవదత్త తిరుగుతుంటే ఏ మాత్రం అనుమానం రాదా? అయితే యౌగంధరాయ ణుడు వాసవదత్తను రక్షించబోయి మరణించాడని చెప్పటం, అతడు కనిపించకుండా పోవటం, మంత్రులపైన అపారమైన గౌరవ విశ్వాసాలుండటంవల్ల, తనకు అంత రంగిక మిత్రుడు, విదూషకుడైన వసంతకుడు కూడ వాసవదత్త మరణించినట్లు చెప్పటంతో నమ్మక తప్పలేదు. అయినా ఆ సందేహం ఆయన్ను పీడిస్తూనేఉన్నది. వాసవదత్త బ్రతికున్నదేమోనని వీలయినప్పుడల్లా అన్వేషిస్తూనే ఉన్నాడు. ఈ విష యాన్ని వ్యక్తం చేయటానికే కాటూరి వారీ పద్యాన్ని వ్రాశారు. ఇదికూడ ఉదయనుడి పరిశీలనా శక్తిని వ్యక్తం చేసి ఆయన గొప్పదనాన్ని నిరూపించేదే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉదయనుడు, వాసవదత్తకు తాను వాసుకి సోదరుడివల్ల పొందిన మంత్రాన్ని ఉపదేశించాడు. ఆ మంత్రం నేర్చిన స్త్రీ గ్రుచ్చిన పూలదండ వాడదు. ఆమె పెట్టిన తిలకం చెదరదు. అవంతికా వేషంలో ఉన్న వాసవదత్త పద్మావతిదేవిని నిత్యం పూలదండలతో అలంకరిస్తున్నది. తిలకం దిద్దుతున్నది. ఉదయనుడు, ఆ తిలకం, దండల ప్రత్యేకతను గమనించాడు. అవంతిక వాటిని అలంకరిస్తున్నట్లు తెలుసుకున్నాడు. అవంతికే వాసవదత్త అని అనుమానం వచ్చింది. అయితే సామాన్యుడి లాగా ఇంట్లో జొరబడి అనుమానం తీర్చుకోవటం కుదరదు. రాణాంతఃపురాలు, వారి మర్యాదలు వేరు. పైన పద్మావతి ఆమెను బ్రాహ్మణ ముత్తైదువుగా భావించి రక్షిస్తున్నది. ఆమె రాజుకు కనిపించే అవకాశంలేదు. అత్యంత ఆప్తుడైన వసంతకుడు కూడ వాసవదత్త జీవించి ఉన్నదనే అనుమానాన్ని ఎప్పటికప్పుడు ఖండిస్తున్నాడు. ఇక చేయగలిగిందేముంది! ఇది ఉదయనుడి పరిస్థితి. ఇప్పుడు అవకాశం వచ్చింది కాబట్టి, వాసవదత్త బ్రతికే ఉన్నదన్న తన నిర్ణయానికి బలంగా పద్మావతి ధరించిన పూలదండల్ని, తిలకాన్ని ఉదాహరించాడు. ఈ కల్పన వెనుక ఇంత ఆలోచన ఉన్నది. కాటూరివారి వివేచన ఔచిత్యం ఈ పెంపుదలలో మనం గమనించవచ్చు.

తరువాత వసంతకుడు, మీ భావం తప్పని, ఈ ఊళ్ళో అవంతి అనే యక్షిణి తిరుగుతున్నది, ఆమె మీకు కనిపించి ఉంటుందని రాజుకు చెప్పాడు. రాజు దాన్ని తిరస్కరించాడు. అలా రాజు వాసవదత్త బ్రతికే ఉన్నదని తన నిశ్చితాభిప్రాయం ప్రకటించటానికి కాటూరివారి కల్పన మరింత బలం చేకూర్చింది.

—: సంస్కృత వచనానికి తెలుగు వచనానువాదం :—

ఇంతవరకు శ్లోకాలను పద్యాలుగా కాటూరివారు ఎలా అనువదించారో వివరించాను. వచనాన్ని వచనంగా అనువదించేటప్పుడు కూడా ఎంతో నేర్పు ప్రదర్శించారు. జాతీయాలు, తెలుగు పలుకుబడులు ఉపయోగించి నాటకానికి తెలుగుదనం తీసుకొనివచ్చారు.

ప్రధమాంకంలో కొన్ని విశేషాలు చూద్దాము. తపోవనంలో చెలికత్తె ఉదయనుడికి పద్మావతినిచ్చి వివాహం చేసే విషయాన్ని ప్రస్తావిస్తూ తాపసితో పలికిన మాటల్ని, తెలుగుదనం ఉట్టిపడేటట్లు కాటూరివారు అనువదించారు.

మూలం : అస్తి రాజా ప్రద్యోతో నామోజ్జయిన్యాః !
స దారకస్య కారణాత్ దూతసంపాతం కరోతి. (అం. 1, పే. 5)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనువాదం: చిత్తం. ఉజ్జయినీ ప్రభువులు ప్రద్యోత మహారాజులుంగారున్నారే, వారి కుమారులకు మా చిన్నమ్మగారి నడిగింపారండి.

పెండ్లి సంబంధాల విషయంలో మా అమ్మాయికి వాళ్ళ అబ్బాయినడిగామని, వాళ్ళ అబ్బాయికి మా అమ్మాయి నడిగారని అనటం తెలుగువారి సంభాషణ తీరు. చెలికత్తె మాట విన్న తాపసి అన్న మాటల అనువాదం కూడ బాగున్నది.

మూలం : అర్హా ఖల్వియ మాకృతి రస్య బహుమానస్య.... (15 పే)

అనువాదం: బాగున్నది. ఈ బంగారు తల్లికి తగిన సంబంధమే అది....

ఇక్కడ "బంగారుతల్లి" అనేది మన పెద్దవాళ్ళందరూ పిల్లల్ని గురించి వాడే మాటే. బహుశః ఈ మాట వాడని తల్లిదండ్రులుండరేమో.

యౌగంధరాయణుడు వాసవదత్తను పద్మావతి దగ్గర న్యాసముంచిన తరువాత చెలికత్తె వాసవదత్తను గురించి ఇలా అన్నది.

మూలం : సుష్ఠు ఆర్యాభణతి అయమస్యనుభూత సుఖేతి పశ్యామి. (అం. 1, పే. 8)

అనువాదం: అమ్మగారు బాగా సెలవిచ్చారు. నాకుకూడ ఈయమ్మగారు బాగా బతికిన వారనే తోస్తున్నది.

ఇక్కడ అమ్మగారు, "బాగా బతికినవారు" అనే మాటలు ఈ సంభాషణకు తెలుగుదనం తీసుకొని వచ్చినవి.

వాసవదత్తను పద్మావతి దగ్గర విడచి యౌగంధరాయణుడు వెళుతున్నప్పుడు పద్మావతి ఇలా అంటుంది. (అం. 1, పే. 8)

మూలం : ఆర్యస్య భగినీ కార్యేణ వినోత్కంఠిష్యతే.

అనువాదం: వెళ్ళితె వెంగ పెట్టుకోదు గదా వారి చెల్లెలు.

వెంగ పెట్టుకోవటం అనేమాట కృష్ణాజిల్లా మాండలికం అందునా తూర్పు కృష్ణాలో ఎక్కువగా వాడతారు. పశ్చిమ కృష్ణాలో, తెలంగాణాలో "మనాది" అనే మాట ఈ అర్థంలో ఉపయోగిస్తుంటారు. ఇది మనోవ్యాధి నుంచి వచ్చిన అపభ్రంశ శబ్దం.

చతుర్థాంకంలో మరొక సన్నివేశమిది. పద్మావతీ వాసవదత్త ఉద్యాన వనంలో ఉన్నారు. చెలికత్తె దోసిటినిండా పూలు కోసుకొని వచ్చి, వారితో పలికిన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మాటల్ని అనువదించటంలో మూలంలో లేని క్రొత్త భావాన్ని స్ఫురింపజేశారు వేంకటేశ్వర్రావుగారు. అది చూడండి.

మూలం : పశ్యతు పశ్యతు భర్తృదారికా అర్దమనశ్శిలా, పట్టకై రివ శేఫాలికా కుసుమైః పూరితం మే అంజలిం. (అం. 4, పే. 28)

అనువాదం: చూడండి చిన్నమ్మగారు మణిశిల పలుకులవలె యెలా ఉన్నవో యీ పువ్వులు నా దోసిట్లో.

"భర్తృదారిక" అన్న శబ్దాన్ని చిన్నమ్మగారు అని అనువదించారు.

అక్కడే వాసవదత్త ఉండటంవల్ల పద్మావతిని చిన్నమ్మగారంటే చిన్న భార్య అనే అర్థం పాఠకుడికి స్ఫురిస్తుంది. వాసవదత్త పెద్దమ్మగారు, పద్మావతి చిన్నమ్మగారు. అయితే సేవకులు ఇంట్లో ఉన్న పెద్దవయసు స్త్రీని పెద్దమ్మగారని, చిన్నవారిని చిన్నమ్మగారని పిలవటం తెలుగు ప్రాంతంలో మామూలే. వారిమధ్య ఉన్న బంధుత్వం కూడా పరిగణించరు. వారు అత్తాకోడళ్ళు, తల్లికూతుళ్లు, అక్కచెల్లెళ్లు కూడా కావచ్చు. ఇక్కడ అమ్మగారు అనేది గౌరవ వాచకం మాత్రమే. అయితే ఇక్కడి సందర్భాన్ని బట్టి చిన్నమ్మగారంటే చిన్నభార్య అనే అర్థం ధ్వనించింది.

రాజు, విదూషకుడు ఉద్యానవనంలో సంచరిస్తుండగా అక్కడే వాసవదత్త, పద్మావతి మాధవీలతా మంటపంలో గోప్యంగా ఉన్నారు. వసంతకుడు ఎండ తీవ్రంగా ఉన్నదంటూ రాజును ఆ మాధవీలతా మంటపంలోకి వెళ్దాం రమ్మన్నాడు. ఆ మాటలకు, రాజు కంటపడటం ఇష్టంలేని పద్మావతికి, వసంతకుడి మీద కోపం వచ్చింది. అప్పుడు ఆమె అన్న మాటలకు అనువాదం చూడండి.

మూలం : సర్వ మాకులం కర్తుకామ ఆర్యవసంతకః కిమిదానీం కుర్మః

అనువాదం; చెఱపనచేట! ఈ వసంతకయ్య ఎప్పుడూ ఇంతే. ఇప్పుడేమి చేతును.

"చెఱపన చేట" అంటే పనులు చెడగొట్టేవాడని అర్థం. ఇది అచ్చమైన తెలుగుమాట.

రాజు, విదూషకుడు లతా మంటపంలో ప్రవేశించకుండ, చెలికత్తె అక్కడున్న తుమ్మెదల్ని రేపింది. అవి వసంతకుడి వెంటబడ్డవి. విదూషకుడి మాటలు చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూలం : దాస్యాః పుత్రైర్మధుకరైః పీడితోస్మి.

అనువాదం: ఈ తుమ్మెద తొత్తుకొడుకులు ముసురుకొని చంపేస్తున్నారు.

తొత్తు అంటే దాసీ అని అర్థం. కానీ దాసీపుత్రులన్న దానికంటె తొత్తుకొడ కనేది తెలుగులో తీవ్రమైన దూషణగా భావిస్తారు. మాటకు మాట అనువాదం చేసినట్లూ ఉన్నది, మూలంలో భావం తెలుగులో సహజంగా, ప్రస్ఫుటంగా వ్యక్తం చేసినట్లూ అయింది.

రాజు విదూషకుణ్ణి "నీకు వాసవదత్త అంటే ఇష్టమా పద్మావతి అంటే ఇష్టమా చెప్పు" అని అడిగాడు. అతడు చెప్పలేదు. "నీచేత చెప్పించి తీరతాము" అన్నాడు రాజు. విదూషకుడి సమాధానం అనువాదం చూడండి.

మూలం : తేనహి నశక్యం శ్రోతుం.

అనువాదం: మరే ఆ పప్పులు మన దగ్గర ఉడకవు.

పప్పులుడకటం అనేది చక్కని జాతీయం. ఇలా ఒక్క కాటూరివారే అనువదించగలరు.

కాటూరివారు సుమారు పది శ్లోకాలదాకా సంస్కృతంలో ఉన్నవాటిని వచనంగానే తెనిగించారు: 1 అం. 2, 7 శ్లోకాలు, 4వ అం. 7, 8 శ్లోకాలు-5 అం. 8 శ్లో- 6వ అం. 7, 9, 12, 14, 15 శ్లోకాలను వచనాలుగానే అనువదించారు:

ఈ రెండు నాటకాలని పరిశీలించినపుడు, ప్రతిజ్ఞలో పద్యరచన, వాసవదత్తలో గద్యరచన మంచి పాకాన పడ్డట్లు తోస్తున్నది. జాతీయాలు, తెలుగు పలుకుబడులు ప్రతిజ్ఞ పద్యాలలో ఎక్కువగా కనబడుతవి. అయితే వాసవదత్తలో ప్రతిజ్ఞలోకంటే మూలాన్ని పెంచిన సన్నివేశాలు కూడా ఉన్నవి. కాటూరివారి భాస నాటకానువాదాలు అత్యంత సహజ సుందరాలు, మనోహరాలు అనటంలో సందేహం లేదు.

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

3. ఆంగ్లానువాదములు – జీవిత చరిత్రలు

కాటూరివారు ఆంగ్లంలో రచింపబడ్డ గాంధీ మహాత్ముని జీవిత చరిత్రను, రవీంద్రుని కథను, అబుల్ కలామ్ అజాద్ జీవిత చరిత్రను తెనిగించారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించటమే వీరి ఈ అనువాదాల లక్ష్యంగా కనబడుతున్నది. ఈ అనువాదాలు సాధారణ పాఠకులకు కూడ అర్థమయ్యేటట్లు సరళ గ్రాంధికంలో సాగినవి. అనువదించటానికి ఈ గ్రంథాల్ని ఎన్నుకోవటంలోనే కాటూరివారి జాతీయభావం వ్యక్తమౌతున్నది.

సత్య శోధన

గాంధీ మహాత్ముని స్వీయ చరిత్రను "సత్య శోధన" అనే పేరుతో పిల్లలకు పనికివచ్చేటట్లు కాటూరి వారొక గ్రంథం రచించారు. ఈ పుస్తకానికి మూలం భరతన్ కుమారప్ప ఆంగ్లంలో రచించిన సంక్షిప్త గాంధీ చరిత్ర. పద్నాలుగు భాగాలుగా ఈ పుస్తకం రచింపబడింది. ప్రథమ భాగంలో గాంధీజీ బాల్య యౌవ నాలు-రెండో భాగంలో లండనులో విద్యాభ్యాసం—మూడో భాగంలో భారతదేశంలో ఆయన బారిష్టరు జీవితం—నాలుగవ భాగంలో దక్షిణాఫ్రికా పర్యటన—అయిదవ భాగంలో గాంధీజీ తిరిగి భారతదేశం రావటం-ఆరవ భాగంలో రెండవసారి దక్షిణా ఫ్రికా యాత్ర-ఏడవ భాగంలో తిరిగి స్వదేశాగమనం-ఎనిమిదవ భాగంలో మూడవ మారు దక్షిణాఫ్రికా ప్రయాణం - తొమ్మిదవ భాగంలో పూనాలో ఆశ్రమ స్థాపనం-పదవ భాగంలో చంపారణ్య ప్రాంతంలో నీలిమందు పండించే కర్షకుల అగచాట్లు - పదకొండవ భాగంలో అహమ్మదాబాదు కూలిజనం, వారి సమస్యలు తీర్చటము - పన్నెండవ భాగంలో ఖేడా సత్యాగ్రహం - పదమూడవ భాగంలో గాంధీ భారత రాజకీయ ప్రవేశం - పద్నాలుగవ భాగంలో ఖాదీ ఉద్యమం, ఇలా సాగింది గ్రంథ రచన.

—: గాంధీ కథా సంగ్రహం :—

కాటూరివారు ఈ గ్రంథం వ్రాయటంలో ముఖ్యోద్దేశం ఆదర్శప్రాయమైన గాంధీజీ జీవిత విశేషాలు పిల్లలకు తెలియజేయటమే. అందువల్లనే ఈ పుస్తకంలో గాంధీజీ బాల్య విద్యాభ్యాస విశేషాలను విస్తరించి వ్రాసినంతగా రాజకీయ జీవిత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విశేషాలను వ్రాయలేదు. గాంధీజీ జీవితంలో నీతి, ధార్మిక భావనలకు సంబంధించిన ఘట్టాలకే ఎక్కువ ప్రాముఖ్యమిచ్చినట్లు కనబడుతుంది. గాంధీజీ లండన్ ప్రయాణం వరకు జరిగిన కథాభాగం అంటే ప్రథమ భాగంలో ప్రతి విషయం క్రింద కొన్ని ప్రశ్నలీయబడినవి. విద్యార్థులు ఆ ప్రశ్నలకు సమాధానంగా గాంధీజీ బాల్య విశేషాలను వ్యాసాలుగా వ్రాయాలని, అధ్యాపకులు అలా వ్రాయించాలని కాటూరి వారి ఉద్దేశంగా కనబడుతుంది. ఈ అనువాదంలో గాంధీ ఆదర్శప్రాయమైన జీవితకథ సంక్షిప్తంగా చెప్పటమే కాటూరివారి ప్రధాన లక్ష్యం. ఈ పుస్తకం రచన మొత్తం ప్రథమ పురుషలో సాగింది.

జాతిపిత, మహాత్ముడు, మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ 1869 సం॥ అక్టోబరు 2వ తేదీన పోరుబందర్‌లో జన్మించాడు. వీరి తండ్రి కరంచంద్ గాంధీ పోరుబందరు సంస్థానంలో ముఖ్యమంత్రి. ఈయన ధర్మబుద్ధి కలవాడు, ధీరుడు, సత్యప్రియుడు, వ్యవహారదక్షుడు. ఇక గాంధీగారి తల్లి ఉత్తమ గృహిణి, విష్ణుభక్తురాలు. కఠోర నియమాలు పాటిస్తూ భారతీయ ఆచారాలను ఆచరించేది ఆమె. ప్రతి రోజు సూర్యదర్శనం చేసికొనిగానీ భోజనం చేసేది కాదు. భర్తకు రాచకార్యాలలో సలహాలు కూడా ఇస్తుండేది. కరంచంద్ పోర్‌బందరు నుండి రాజకోటకు మకాం మార్చటంవల్ల అక్కడ సబర్బన్ స్కూలులో గాంధీ విద్యాభ్యాసం సాగింది. చిన్నతనంనుండి గాంధీ పెద్ద మేధావి కాదు, కాని నిజాయితీపరుడు. ఆయనకు లెక్కలు బాగా వచ్చేవి కావు. ఒకసారి పరీక్షాధికారి విద్యార్థుల్ని కెటిల్ (Kettle) అనే శబ్దం వ్రాయమన్నాడు. అందరూ సరిగానే వ్రాశారు. గాంధీ తప్పు వ్రాశాడు. ఉపాధ్యాయుడది గమనించి ప్రక్కవాడి దాంట్లో చూచి వ్రాయమని సైగ చేశాడు. గాంధీకి అది తప్పుగా తోచి అనుసరించలేదు. ఆయన ఒకనాడు "శ్రావణ పితృభక్తి"అనే నాటకం చదవటం తటస్థించింది. కావడిలో మోస్తూ వృద్ధులైన తల్లిదండ్రుల్ని సేవించిన ఆ బాలుడి చరిత్ర ఆయన మనసుపై చెరగని ముద్రవేసింది. అది గాంధీ పితృభక్తిని మరింత పెంచింది. మరొకమారు ఆయన హరిశ్చంద్ర నాటకాన్ని దర్శించాడు.ఆ చక్రవర్తి సత్య సంధత గాంధీని ఎంతో ముగ్ధుడ్ని గావించింది. గాంధీ సత్యనిష్ఠను, అప్పటినుండి అలవరచుకున్నాడు. ఈ రెండు నాటకాలు గాంధీ జీవితాన్ని ఒక మలుపు తిప్పినవంటే అతిశయోక్తి కాదు. చిన్ననాడే సత్యవర్తనవల్ల పాఠశాలలో, ఇంటి దగ్గర ఆయన ఎంతో గౌరవం పొందుతుండేవాడు. వ్యాయామమన్నా, ఆటలన్నా ఆయనకు అంత ఇష్టం లేదు. తీరిక దొరికినప్పుడల్లా తల్లిదండ్రుల సేవ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చేసేవాడు. ఆయన సంస్కృతం కూడా అభ్యసించాడు. తదనంతర కాలంలో హైందవ బాలబాలికలు తప్పనిసరిగ సంస్కృతం అధ్యయనం చేయాలని ఆయన హితం చెబుతుండేవారు. పెండ్లి అంటే మేళాలు, క్రొత్తబట్టలు, విందులు అనుకునే 13 సంవత్సరాల వయస్సులోనే గాంధీకి, కస్తూరిబాకు వివాహం జరిగింది. అయితే భార్యమీద పెత్తనం మాత్రం చేస్తుండేవాడు. నా అనుమతి లేకుండా ఎక్కడికి పోకూడదు అని ఆమెను శాసించేవాడు. ఆమె వినేదికాదు. ఆ బాలదంపతులు కీచులాడుకొనేవారు. గాంధీ బాల్యంలో బలహీనంగా ఉండేవాడు. దయ్యాలు, పాములు, దొంగల మాట చెబితేనే పారిపోయేవాడు. చీకటి అంటే తగని భయం. బలంగా ఉండే ఒక విద్యార్థి మిత్రుడు మాంసం తినటం వల్లనే ఆంగ్లేయులు బలవంతులైనారని, తన బలానికి కూడా అదే కారణమని, మాంసాహారం స్వీకరించమని గాంధీకి బోధించేవాడు. చివరకు ఒకరోజు గాంధీ మేక మాంసం తిన్నాడు. కాని ఆ రాత్రంతా కడుపులో మేక అరిచినట్లు అనిపించి, క్షణం క్షణం మెలుకువ వచ్చి చెయ్యకూడని పని చేసానని బాధ పడ్డాడు. తరువాత మాంసం తినటం మానుకున్నాడు. సిగరెట్లు త్రాగుతూ నోట్లోనుండి పొగ మేఘాలు ఊదేవారిని చూచి తాను కూడా అలా చేస్తే బాగుంటుందని ఉబలాటపడేవాడు. పినతండ్రి కాల్చి పారేసిన ఎంగిలి సిగరెట్ పీకలు కాల్చేవాడు. అవీ దొరక్కపోతే నౌకర్ల జేబులోనుంచి చిల్లర పైసలు దొంగిలించేవాడు. నిర్భయంగా అందరి ఎదుట పొగత్రాగలేని అశక్తతకు బాధపడి ఉమ్మెత్త గింజలు తిని ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. కానీ ధైర్యం చాలక మానేశాడు. మరొకసారి తాను చేసిన పాతిక రూపాయల అప్పు తీర్చటానికి అన్నగారి చేతిబంగారు కడియంలో చిన్నముక్కను కత్తిరించాడు. అయితే ఈ దోషాన్ని ఒక కాగితం మీద వ్రాసి తండ్రికిచ్చి క్షమాపణ వేడుకున్నాడు. గాంధీగారి పదియారవ ఏట ఆయనకు పితృవియోగం కలిగింది. ఒక దాది రామనామం జపిస్తే దయ్యాలంటే భయం ఉండదని చెప్పటంతో, రామనామ జపం గాంధీ అలవరచుకున్నాడు. ఈ సంస్కారమే తదనంతర జీవితంలో గాంధీ గొప్ప ఆధ్యాత్మిక జీవిగా రూపొందటానికి ఉపయోగపడింది. స్కూలు చదువు ముగిసిన తరువాత గాంధీ బారిష్టరు చదవటానికి ఇంగ్లాండు వెళ్ళాడు. విదేశ ప్రమాణానికి కొందరు అడ్డంకులు చెప్పారు. చెడు అలవాట్లకు లోనవుతాడని తల్లి భయపడింది. అయితే మగువ, మాంసం మద్యం ముట్టనని తల్లి దగ్గర ప్రమాణం చేసి గాంధీ లండన్ చేరుకున్నాడు. ఇది ప్రథమాధ్యాయంలో వివరింపబడిన కథ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇంగ్లండులో శాకాహార వ్రతం గాంధీకి క్రొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. అక్కడున్న అతని మిత్రుడు, ఇక్కడ మాంసాహారం తినక తప్పదని మందలించేవాడు. గాంధీ తల్లికిచ్చిన వాగ్దానం గుర్తుకు రావటంతో ఆ పని చేసేవాడు కాదు. చివరకు లండన్‌లోని షారింగ్‌టన్ వీధిలో ఒక శాకాహార భోజనశాల కనిపించింది. తరువాత కాలంలో గాంధీ అక్కడే భోజనం చేసేవాడు. ఈ కష్టకాలంలో ఆయనకు రాముడిపై భక్తి పెరిగింది. గాంధీ అక్కడ ఆంగ్ల సభ్యతా సంస్కారాలు అలవాటు చేసుకున్నాడు. టోపీ, నెక్ టై, జేబు గడియారం వగైరా హంగులన్నీ అమర్చుకున్నాడు. నాట్యం కూడా నేర్చుకుంటానికి ప్రయత్నించాడు. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడటం అభ్యసించాడు. అయితే ఈ వేషం అంత ప్రయోజనకారి గాదని త్వరలోనే గుర్తించాడు. న్యాయశాస్త్రంతోపాటు ఆంగ్ల భాషా పాటవం పెరగటానికి లండన్ మెట్రిక్యులేషన్ పరీక్ష వ్రాశాడు. ఫ్రెంచి, లాటిను భాషలు కూడా ఎంతో శ్రమకోర్చి ఆయన అధ్యయనం చేశాడు. లండన్‌లో ఉన్నప్పుడు గాంధీ పొదుపరితనం అలవరచుకున్నాడు. ఒకే గదిలో ఉంటూ స్వయంగా వండుకొని భోజనం చేసేవాడు. అక్కడ శాకాహార ప్రాశస్త్యాన్ని ప్రచారం చేయటానికి ఒక సంఘం కూడా ఏర్పాటు చేశాడు.

లండన్‌లోనే గాంధీ భగవద్గీతను, బైబిలును ఆరనాల్డు వ్రాసిన, "లైట్ ఆఫ్ ఏషియా" అనే బుద్ధ చరిత్రను కూడా అధ్యయనం చేశాడు. ఇలా భిన్న మతాలతో పరిచయం అప్పుడే గాంధీకి ఏర్పడింది.

గాంధీ 1891 జూన్‌లో బారిష్టరు పరీక్షలో ఉత్తీర్ణుడై లాయరు ప్రాక్టీసుకోసం బొంబాయి వచ్చాడు. మొట్టమొదటిసారిగా, ఒక స్మాల్ కాజ్ కోసం కోర్టులో వాదించటానికి సిద్ధపడిన గాంధీ కాళ్ళు, చేతులు చల్లబడి, కండ్లు తిరిగి వాదించలేక కూర్చున్నాడు. తిరిగి రాజకోటవచ్చి ప్రాక్టీసు మొదలు పెట్టాడు. ఎంతో కొంత రాబడి ఏర్పడింది. ఈ లోపల మరో వ్యవహారం ఆయన నెత్తి పైకి వచ్చింది. పోరుబందరు రాణాకు గాంధీగారి అన్నగారు మంత్రిగా ఉండేవారు. ఆయన ప్రభుత్వానికి నష్టం కలిగే విధంగా సలహాలిచ్చాడని ఆయనపై అభియోగం మోపబడింది. దాన్ని విచారించే బ్రిటీషు అధికారికి, గాంధీకి లోగడ లండన్‌లో కొంత పరిచయమున్నది. దాన్ని పురస్కరించుకొని అన్నకు సహాయం చేద్దామని ఆ అధికారి దగ్గరకు వెళ్లాడు.

32)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ దురంహంకారి గాంధీ మాటలు వినలేదు సరికదా సేవకుడితో బయటికి గెంటించాడు. ఈ అవమానంతో రోషించిన గాంధీ ఆ అధికారిపై చర్య తీసుకుందామని పెద్ద వకీళ్ళను సంప్రదించగ, వారు బ్రిటీషు అధికారుల వైఖరి అలాగే ఉంటున్నదని వారి జోలికి పోవటం చాలా నష్టాన్ని కలిగిస్తుందని గాంధీకి హితం చెప్పారు. గాంధీ అవమానం దిగ్రమింగి ఊరుకున్నాడు. ఇంతలో పోరుబందరులోని వర్తకులు కొందరు దక్షిణాఫ్రికాలో వారికున్న వ్యవహారం పరిష్కరించటానికి గాంధీని తమ ప్రతినిధిగా దక్షిణాఫ్రికాకు వెళ్ళవలసిందిగా కోరారు. దాంతో గాంధీ మొదటి సారి దక్షిణాఫ్రికా వెళ్ళాడు.

దక్షిణాఫ్రికాలో దర్బాను కోర్టులో, వర్తకుల కేసు విచారణకు ఉన్నది. గాంధీ తలపాగాతో కోర్టుకు హాజరయివాడు. మేజిస్ట్రేటు తలపాగా తీసేయమని ఆదేశించాడు. గాంధీ దానికి నిరాకరించాడు. మొదటిసారిగా దక్షిణాఫ్రికాలో నల్లవారికి జరుగుతున్న అవమానాలు గాంధీకి అనుభవంలోనికి వచ్చినవి. భారతీయ వ్యాపారి అబ్దుల్లా గాంధీ గారికి ఆతిధ్యమిచ్చాడు. కోర్టు పనిమీద గాంధీ ప్రిటోరియాకు వెళ్ళవలసి వచ్చింది. ఆయన రైలులో మొదటి తరగతి పెట్టెలో ఎక్కాడు. తోటి తెల్లవారు ఆయనను తమతో పాటు కూర్చోనివ్వలేదు. లగేజీ వ్యానులో ఎక్కమన్నారు. గాంధీ నిరాకరించాడు. నేను కూడా మొదటి తరగతి టిక్కెట్టు కొన్నానని వాదించాడు. ఈ లోపల ఒక పోలీసు కానిస్టేబులు వచ్చి సామానులు విసిరేసి గాంధీని రైలుపెట్టెలోనించి క్రిందికి త్రోసివేశాడు. చివరకు ఎదో విధంగా ప్రిటోరియాకు చేరుకున్నాడు. ఈ ప్రయాణంలో ఆయన గుర్రపు బండి కూడ ఎక్కవలసి వచ్చింది. దాంట్లో ఆయనకు కూలీలకు లభించే స్థానం కూడా లభించలేదు. తెల్ల ప్రయాణీకుల పాదాలచెంత కూర్చోమని కండక్టరు ఆయన్ను ఆదేశించాడు. ఎదురు మాట్లాడిన గాంధీని వాడు ఎడాపెడా కొట్టాడు. మిగిలిన ప్రయాణీకులు మందలించటం వల్ల వాడు అప్పటికి ఆగాడు. భగవంతుణ్ణి ధ్యానిస్తూ గాంధీ అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణం చేశాడు. ఆయనకు ఎక్కడా హోటలు గది కూడ దొరకలేదు. భారతీయుల్ని ఎంత విద్యావంతులైనా కూలీలుగానే దక్షిణాఫ్రికాలో ఉన్న బ్రిటీషు ప్రభుత్వం పరిగణించేది. మొదటి, రెండవ తరగతి రైలు ప్రయాణం భారతీయులకు నిషేధం. ఈ విషయాలన్నీ గాంధీకి చాలా బాధ కలిగించినవి. అక్కడ వర్ణ విద్వేషానికి వ్యతిరేకంగా పోరాటం సాగించాలని నిశ్చయించుకున్నాడు. భారతీయులకు మూడు పౌన్లు తలపన్ను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విధింపబడేది. వారికి ఓటు హక్కు లేదు. రాత్రి 9 గంటల తర్వాత వీధిలో సంచరించకూడదు. రాచబాటలలో వారు నడవకూడదు. గాంధీ ఒకసారి అలా నడిచి పోలీసుల చేత దెబ్బలు కూడా తిన్నాడు. గాంధీ అక్కడ వాది ప్రతివాదుల మధ్య రాజీచేసి వ్యవహారం చక్కబెట్టాడు. ఇంతలో భారతీయులకు ఓటు లేకుండా చేసే చట్టం ఒకటి రాబోతున్నట్లు వార్తలొచ్చినవి. భారతీయుల హక్కుల్ని రక్షించటానికి మొదటిసారిగా నేటాలు పట్నంలో "నేటాలు ఇండియన్ కాంగ్రెసు" సంస్థను గాంధీ స్థాపించాడు. భారతీయులకు తలపన్ను పీడను తొలగించగలిగాడు. మూడు మాసాలుండటానికి వెళ్ళి మూడు సంవత్సరాలుండి గాంధీ తిరిగి భారతదేశం వచ్చాడు. దక్షిణాఫ్రికాలోని భారతీయుల కష్టనష్టాలన్నీ ఇక్కడి ప్రజలకు ఉపన్యాసాల ద్వారా తెలిపాడు. ఈ విషయాలు వివరిస్తూ ఒక పుస్తకం కూడ వ్రాశాడు. ఆరు నెలల్లో తిరిగి ఆఫ్రికా రెండవసారి వెళ్ళాడు.

రెండవసారి దక్షిణాఫ్రికా పోయినపుడు గాంధీపై పెద్ద ఎత్తున దాడి జరిగింది. నేటాలులో ఉన్న తెల్లవాళ్ళను గురించి భారతదేశంలో నిందలు ప్రచారం చేశాడని, ఆ ప్రాంతాన్ని భారతీయులతో నింపటానికి ప్రయత్నిస్తున్నాడని గాంధీకి వ్యతిరేకంగా ప్రచారం సాగింది. ఓడ దిగటంతోటే అల్లరిమూకలు గాంధీని ముట్టడించి విపరీతంగా కొట్టారు. అలెగ్జాండరు అనే పోలీసు సూపరెన్టెంటు ఆయన భార్య గాంధీని రక్షించారు. గాంధీ ఈ రోజుల్లో తన వస్త్రాలను తానే ఉతుక్కునేవాడు. అక్కడి తెల్ల మంగళ్ళు ఈయనకు క్షౌరం చేయ నిరాకరించటంతో సొంత క్షౌరం కూడా చేసికొనేవాడు. మొదటిసారి గంజి ఎక్కువ కావటం వల్ల పిండి రాలుతున్న గుడ్డలతో, చేతగాని సొంత క్షౌరంతో, పిట్టలు పీకినట్లున్న తలకాయతో, కోర్టుకు పోయిన గాంధీ అక్కడి వారందరికీ పుష్కలంగా వినోదం అందించాడు. గాంధీ కస్తూరిబా అన్యోన్యంగా ఉన్నా అప్పుడప్పుడు కీచులాడుకోవటం కద్దు. తన గుమాస్తాల గదులు శుభ్రం చేయమని భార్యను కోరాడు గాంధీ. ఆమెకు కొంచెం కష్టమేసింది. అయినా ఆ పని చేస్తూనే ఉన్నది. నవ్వుతూ సంతోషంగా చెయ్యాలని ఏడుస్తూ పనిచేసే వాళ్ళకు నా ఇంట్లో చోటులేదని గదమాయించాడు. ఆమెకు కూడా కోపం వచ్చి "మీ ఇంట్లో మీరే ఉండండి నేను పోతున్నాను" అన్నది. గాంధీ రెచ్చిపోయి ఆమెను "ఫో! బయటికి" అంటూ వీధి గుమ్మందాకా నెట్టుకుంటూ వచ్చాడు. ఆమె కన్నీళ్ళు పెట్టుకుంటూ "మీకు సిగ్గులేదా! ఇంత ఒళ్ళు తెలియనికోపం ఎందుకొస్తుంది? ఇక్కడ నాకు తల్లా, తండ్రా ఎక్కడికి పోయేను? నిన్ను వివాహం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చేసికొని నమ్మి నీ వెంట దేశం వదలి వచ్చినందుకు ఇదేనా నువ్వు చేసే మర్యాద. ఇదీ చూస్తే చుట్టుప్రక్కల వాళ్ళు నవ్విపోతారు. ముందా తలుపు మూయ్యండి" అన్నది. గాంధీకి అప్పటికి గాని ఒళ్ళు తెలియలేదు. సిగ్గుతో తలవంచుకున్నాడు. పొరపాటు చేయటం మానవ సహజం దాన్ని గుర్తించి పశ్చాత్తాప పడటం ఉత్తమ లక్షణం. ఇలాటి లక్షణాలెన్నో ఉండటం వల్లనే గాంధీ మహాత్ముడైనాడు.

పూర్వకాలం నుండి కూడ ప్రముఖులు, రాజోద్యోగులు, ఇప్పుడు ప్రజా సేవకులనబడే నాయకులు, ప్రజలనుండి బహుమానాలు స్వీకరిస్తుండటం మనకు తెలిసిందే. కీర్తి, ధనం రెండూ పెనవేసుకొని వచ్చే ఆ ప్రక్రియను ఎవరు కాదంటారు. గాంధీ విషయం వేరు. దక్షిణాఫ్రికానుండి తిరిగి వచ్చేటప్పుడు ఆయనకు వెండి, బంగారు నగలు, రత్నాభరణాలు ఎన్నో బహూకరించారక్కడి ప్రజలు. వాటిని గాంధీ సొంతానికి వినియోగించుకోలేదు. ఒక ధర్మనిధిగా ఏర్పాటుచేసి అక్కడి ప్రజలకే ఉపయోగించాలని సంకల్పించాడు. కొడుకులు ఒప్పుకున్నారు. కస్తూరిబా ఒప్పుకోలేదు. ఆమె "వీరు అభిమానంతో ఇచ్చిన బహుమానాలు వదులుకోవటం నావల్లకాదు. మీకు, మీకు తాన అంటే తంధానా అనే కొడుకులకు, అవసరం లేకపోతే మానెయ్యండి" అన్నది. అయినా గాంధీ పట్టుదల ముందు ఆమె మాట నిలువలేదు. అక్కడి పెద్దలనే ఆ నిధికి ధర్మ కర్తలుగా పెట్టి లోభాన్ని జయించి ఇండియా తిరిగి వచ్చాడు. ప్రజా సేవకులు ప్రజారాధకులుగా ఉండాలని కానుకలు సొంతానికి వినియోగించుకోరాదని గాంధీ అభిప్రాయం.

గాంధీ భారతీయ కాంగ్రెసు ప్రవేశం చాలా విచిత్రంగా జరిగింది. 1901లో కలకత్తాలో కాంగ్రెసు మహాసభలు జరుగుతున్నవి. "శ్రీ దిన్షావాచా" దానికి అధ్య క్షుడు. గోసాల్‌బాబు, ఫెరోజిషామెహతా, భూపేంద్రనాథ్ బసు, గోఖలే ఆనాడు సంస్థలో ప్రముఖులు. మోహనదాస్ సభా ప్రదేశానికి దారి వెతుక్కుంటూ స్వచ్ఛంద సేవకుడిగా సభ జరగబోయే రిప్పన్ కళాశాలకు వెళ్ళాడు. గాంధీ అక్కడ చేసిన మొదటి పని అపరిశుభ్రంగా ఉన్న పాకీదొడ్లను చీపురుతో ఊడ్చి బాగుచేయటం. రెండోపని గోసాల్‌బాబు గుమాస్తాగా చేరి ఆయన చొక్కాల గుండీలు పెట్టటం. అప్పటికే గాంధీ దక్షిణాఫ్రికాలో గొప్ప భారతీయ నాయకుడిగా గౌరవం పొందాడని బారిష్టరని మనం మరచిపోకూడదు. అప్పటి కాంగ్రెసులో అందరూ పల్లకీ ఎక్కే వాళ్ళే! మోసేవాళ్ళు లేరు. ప్రథమంగా పల్లకి ఎక్కేవాళ్ళు మోసేవాళ్ళ ప్రత్యే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కంగా ఉండరని ఎవరు ఏది చేసినా గౌరవమేనని గాంధీ చేతల ద్వారా చెప్పటం మొదలు పెట్టాడు. గాంధీ కూడా ఆఫ్రికాలో నాయకునిగా గుర్తింపు పొందిన తరువాతనే, మన దేశంలో నాయకునిగా గుర్తింపు పొందాడన్నది నిజం. విదేశీయులు మెచ్చితే గాని మన ప్రజలకు నచ్చని రుగ్మత బహుప్రాచీనమైనది కావటం ఆశ్చర్యం. మొత్తానికి ఆ సమావేశంలో గాంధీజీ దక్షిణాఫ్రికా భారతీయులను గురించిన ఒక తీర్మానం ఆమోదింపజేశాడు.

గాంధీ మరోసారి ఆఫ్రికాకు వెళ్ళవలసి వచ్చింది. ఇంగ్లండ్ వలస మంత్రి చాంబర్లెయన్ దక్షిణాఫ్రికాకు వస్తున్నాడని, తమ విషయాలు వారితో చర్చించటానికి రావాలని అక్కడి భారతీయులు గాంధీకి తంతి పంపారు. కాని గాంధీ, చాంబర్లెయన్ సంప్రదింపులు భారతీయులకు ప్రయోజనం కలిగించలేదు. ఆ రోజుల్లో గాంధీ భగవద్గీతను తరచుగా చదివేవాడు. అది ఆయన ఉపదేశ గ్రంథంగా నిలిచింది. రస్కిన్ వ్రాసిన "అన్ టు ది లాస్ట్" అనే గ్రంథం కూడా గాంధీపై ఎంతో ప్రభావం చూపించింది. కాయకష్టం అంటే గౌరవం. అన్ని వృత్తుల మీద సమాన దృష్టి, సమష్టి సౌఖ్యం అనే అభిప్రాయాలు అప్పటి నుండి గాంధీలో బాగా బలపడ్డవి. గాంధీ "వెస్టు" అనే మిత్రునితో కలిసి 1904వ సం॥లో ఒక పొలంలో "ఫోనిక్సు వసతి" అనే ఆశ్రమం స్థాపించి "ఇండియన్ ఒపీనియన్" అనే పత్రికను ప్రచురించాడు. నేటాలు ప్రాంతంలో ఉన్న "జూలూ" జాతి వారప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. అప్పుడు పోలీసు దెబ్బలచే క్షతగాత్రులైన వారికి గాంధీ ఎంతో సేవ చేశాడు. కస్తూరిబా కూడా ఆయనతోనే ఉన్నది.

గాంధీ పట్టుదల తెలిపే ఒక సన్నివేశం వివరిస్తాను. కస్తూరిబాకు అనారోగ్యం చేసింది. దర్బానులో ఆమె శస్త్రచికిత్సకు ఏర్పాట్లు జరిగినవి. ఆమె బలహీనంగా ఉండటంవల్ల మత్తుమందు ఇవ్వకుండానే ఆపరేషన్ చేశారు. ఆమె ఆ బాధను భరించింది. ఆమె ధీరత్వం అలాటిది. ఆపరేషన్ తరువాత ఆమె బలహీనంగా ఉన్నది. వైద్యుడు "ఆమె కోలుకోవాలంటే గోమాంస సారం తప్పనిసరిగా ఇచ్చి తీరాలి" అన్నాడు. గాంధీ "కస్తూరిబా అభిప్రాయం ఎలా ఉంటే అలా చెయ్యండి" అన్నాడు డాక్టరుతో. ఆమె దానికి ససేమిరా అంగీకరించలేదు. నరజన్మ ఎత్తి ఇలా శరీరాన్ని కలుషితం చేసుకోవటం కంటే మరణమే మేలని నొక్కి చెప్పింది. డాక్టరు తన నిస్సహాయతను ప్రకటించాడు. గాంధీ కస్తూరిబాను ఇంటికి తీసికొని వచ్చి ప్రకృతి చికిత్స ప్రారంభించాడు. "ఉప్పు, పప్పుదినుసులు తినటం మానేస్తే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యాధి కుదురుతుంది. అలా చేయి" అని ఆమెను పలుమార్లు బ్రతిమాలాడు. ఆమె ఒకనాడు చిరాకుగా "ఒకరికి చెప్పటం తేలికే! తనదాకా వస్తేగాని తెలియదు"అన్నది. వెంటనే గాంధీ "నాకే అనారోగ్యం వస్తే డాక్టరు ఏదీ మానమంటే అది మానతాను. ఇప్పుడు నీవు అన్నావు కాబట్టి ఒక సంవత్సరం పాటు పప్పు, ఉప్పును మానుతు న్నాను అన్నాడు. ఆమె భర్త మాటలకు బాధపడి "నేను మీరు చెప్పినట్లు మానే స్తాను మీ పట్టుదల వదలండి." అని ఆయన్ను ఎంతగానో వేడుకున్నది. అయితే గాంధీ ఆమెను సమాధానపరచి సంతోషంగా సంవత్సరకాలం తన ప్రతిన చెల్లించు కున్నాడు. "కస్తూరిబా" ఆరోగ్యం బాగుపడింది: అయితే ఆ సన్నివేశం గాంధీ సత్యాగ్రహానికి మొదటి ఘట్టంగా నిలిచింది. అంతలో దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు పాసు చేసింది. దాని ప్రకారం ఎనిమిది సంవత్సరాలు పైబడ్డ భార తీయులందరు తమ పేర్లను రిజిష్టరు చేయించుకొని, అనుమతి పత్రాలు పొందాలి, అవి లేనివారికి జరిమానా లేక బహిష్కరణ శిక్ష విధింపబడుతుంది. గాంధీ సత్యా గ్రహం పేరుతో ఆ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం నడిపాడు. క్రైస్తవ ఆచారం ప్రకారం జరిగిన వివాహాలు తప్ప, మిగిలినవి చెల్లవని మరొక రూలు వచ్చింది. దీంతో అక్కడ ఉన్న భారతీయులందరు మహిళలతో సహా ఉద్యమంలో చేరారు. గాంధీ సత్యాగ్రహం విజయవంతమయింది. మూడు పౌనులు తలపన్ను రద్దయింది. భారతదేశంలో శాస్త్రీయ వివాహాలన్నీ ఆఫ్రికాలో కూడా చెల్లుబడి అయినవి. సుమారు 21 సంవత్సరాలు గాంధీ దక్షిణాఫ్రికాలో గడిపి అక్కడి భారతీయులకు ఎంతో మేలు చేశాడు.

గాంధీ తిరిగి భారతదేశం వచ్చాడు. గోఖలే ఆయనను ఎంతో ఆదరించాడు. 1915లో అహమ్మదాబాదులో గాంధీ ఒక ఆశ్రమం నిర్మించాడు. దాంట్లో సుమారు పాతికమంది స్త్రీ పురుషులు ఏకభాండాశనులుగా ఉండేవారు. ఇంతలో ఒక హరిజ నుడు ఆశ్రమంలోకి చేరటంతో ఆశ్రమానికి ధనసహాయం చేసేవారికి ఆగ్రహం కలి గింది. అయినా గాంధీ దాన్ని లెక్కచేయలేదు. ఆశ్రమానికి ఏ సహాయం లభించక పోతే, మాలగూడెంలో నివాసం ఏర్పాటు చేసుకుంటానికి, కూలినాలి చేసి వార్ని వారు పోషించుకుంటానికి సిద్ధపడ్డారు. గాంధీకి భగవంతుడిపైన అపారమైన విశ్వాసం. ఏదో రకంగా భగవంతుడు సహాయం చేస్తాడని నమ్మి ఉన్నాడు; అనుకున్నట్లుగానే ముక్కు ముఖం తెలియని ఒక శేట్ పదమూడువేలరూపాయలు ఆశ్రమానికి దానం చేశాడు. దాంతో వారి కష్టాలు గట్టెక్కినవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

1917లో చంపారణ్య ప్రాంతంలో నీలిమందు పండించే రైతులకు, భూస్వాములకు తగాదాలు ఏర్పడ్డవి. భూస్వాముల దోపిడీని మాన్పించి, కర్షకులకు సహాయపడ్డాడు గాంధీ. అహమ్మదాబాదులో ఫ్యాక్టరీ కార్మికులకు, న్యాయమైన కూలి ఇప్పించటానికి ఎంతో కృషి చేశాడు. వారిచేత సమ్మె చేయించాడు. చివరకు తాను నిరాహారదీక్ష చేసి వారి కోరికలు సాధించిపెట్టాడు. వెంటనే మరొక సంఘటన జరిగింది. ఖేడా మండలంలో కరువు వచ్చింది. శిస్తు రిమిషను ఇవ్వమని ప్రజలు మొరపెట్టుకున్నారు. ప్రభుత్వం పంట బాగానే పండిందంటూ బలవంతంగా పన్నులు వసూలు చేస్తున్నది. గాంధీ రంగంలో ప్రవేశించాడు. జప్తుచేసిన పంటను, ప్రభుత్వాన్ని లెక్కచేయకుండా ప్రజలు తెచ్చుకొనటానికి సిద్ధపడ్డారు. సామూహిక అరెస్టులు జరిగినవి. చివరకు పేద రైతులకు పన్ను మాఫీ చేయబడింది.

గాంధీగారు మేకపాలు త్రాగేవాడని అందరికీ తెలుసు. దానికి ఒక విచిత్రమైన కారణమున్నది. గాంధీకి ఒకసారి జిగట విరోచనాలు పట్టుకున్నవి. ప్రాణం మీదికి వచ్చింది. గాంధీ సహజంగా ఔషధాల్ని సేవించేవాడు కాదు. కానీ డాక్టరు ఔషధాలతోపాటు పాలు సేవించటం తప్పదని నిర్బంధించాడు. "ఆవు, గేదెల్ని పాల కోసం హింసించటం చూచి ఆ దుర్మార్గ ఫలితాలైన పాలను విసర్జించాను" అన్నాడు గాంధి. "ఆవు, గేదె పాలే గదా త్రాగనన్నారు, మేకపాలు త్రాగండి" అన్నాడు వైద్యుడు. కస్తూరిబా వంత పాడింది. అక్కడి నుండి గాంధీ మేకపాలు త్రాగటం ప్రారంభించాడు.

గాంధీ బాగా కోలుకోక ముందే రౌలట్ శాసనం వచ్చింది. వల్లభాయికి రాజగోపాలాచారికి దాన్ని ఎలా ప్రతిఘటించాలో తోచలేదు. గాంధీ ఒక క్రొత్త ఉపాయం కనిపెట్టాడు. ప్రజలందరు ఆ రోజు హర్తాళ్ చేయాలి. తమ పనులన్నీ మానుకొని ఉపవాసం చేసి దేముణ్ణి ప్రార్థించాలి. ఇది నూతన ప్రయోగం. 6-4-1919లో దేశంలో మొత్తం హర్తాళ్ జరిగింది. ఇలాంటివి తెలియని తెల్లవాళ్ళు తెల్లబోయారు. తరువాత ఖాదీ ఉద్యమం నడిపాడు గాంధీ. ఇలా సత్యాగ్రహాన్ని ఆయుధంగా చేసికొని భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చి జాతిపితగా నిలిచాడు గాంధీ మహాత్ముడు.

కొటూరివారు గాంధీ కథను సామాన్యుల కోసం ముఖ్యంగా పిల్లలకోసం అనువదించాడు. అందుకే గాంధీ లండన్ వెళ్లేదాక జరిగిన కథలో ప్రతి అధ్యాయం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చివర కొన్ని ప్రశ్నలు వ్యాసాలకు పనికివచ్చే విషయాలు ఇచ్చారు. తరువాత కథ క్లుప్తంగా రచించారు. ఆయన సత్యాగ్రహం, అహింసా విధానం, పట్టుదలను సూచించే పట్టుల్ని మాత్రం వదలలేదు.

అ ను వా ద వి శే షా లు

కాటూరివారి అనువాదంలో మంచి తెలుగు మాటల్ని వాడాలనే పట్టుదల కనబడుతుంది. "టీచరు" అనే మాటకు, "అయ్యవారని" "ఒజ్జ" అని అనువాదం చేశారు. "వలస దేశ మంత్రి" అనకుండ, "వలసప్రగ్గడ" అని అనువదించారు. "ఆర్డినెన్సు" అనేదాన్ని "ఆతురశాసనం" అన్నారు. జైలులో పెట్టటం అనకుండా "బందె పెట్టారు" అని అనువదించారు. గుజరాతును ఘూర్జర దేశమన్నారు. "లయ్యర్" అనే మాటని "అబద్ధాల కోరు" అనకుండా "కల్లరీడు" అన్నారు. "మీట్ను" మాంసం అనకుండా "ఎరచి" అని అనువాదం చేశారు. "ఫ్రండ్" అనే మాటను స్నేహితుడనకుండా "నెయ్యుడు" అన్నారు. గుర్తుకు రావటం అనటానికి బదులు "యాదకు" రావటం అన్నారు. "వొంగిలించు" అనటానికి "తెక్కలించు" అని, "బ్రోకరు" అనే మాటకు "పొసుగకాడు" అని అరుదైన అందమైన తెలుగు పదాల్ని వాడారు. ఒకచోట భార్య తన మాట వినలేదని గాంధీ చెపుతున్న సందర్భంలో "కస్తూరిబా చెంత ఈ పప్పులుడకలేదు" అని, స్నేహితుడి ప్రోద్బలంతో మాంసం తిన్నప్పుడు "నా బ్రతుకు బండలాయెను" అని, జాతీయాలు ఉపయోగించారు. ఇవి మచ్చుకు చూపించిన కొన్ని. ఇలాటివి ఎన్నో ఉన్నవి. "మై ఎక్స్పర్ మెంటు విత్ట్రూత్" అనే గాంధీ రచనకు సరితూగేటట్లు "సత్యసాధన" అని తన పుస్తకానికి పేరు పెట్టారు కాటూరివారు. తెలుగు పదాలు, సామెతలు వాడటం ఆయన రచనకు ప్రాథమిక లక్షణం కాగా, పిల్లలకు మహాత్ముని చరిత్రను బోధించాలనేది ప్రత్యేక లక్ష్యంగా ఈ రచనలో గోచరిస్తుంది. ఈ రోజుల్లో విద్యార్థులకు ఇలాంటి మహనీయుల చరిత్రల్ని పాఠ్యాంశాలుగా పెట్టకపోవటం వల్ల ఎంత నష్టం జరుగుతుందో ఎవరూ గమనించటంలేదు. చిన్నతరగతుల దగ్గర్నుండి దేశభక్తులు, త్యాగమూర్తులైన వారి జీవిత విశేషాలు పిల్లలకు తెలిపితే వారు ఉత్తమ పౌరులు కావటానికి దోహదం చేసిన వాళ్లమౌతాము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవీంద్ర కథ

ఆధునిక భారతదేశ చరిత్రలో 18 వ శతాబ్దం ఉత్తరార్థం, 19 వ శతాబ్దం పూర్వార్థం ఒక మహత్తరమైన కాలం. ఆ రోజుల్లో రాజకీయ సాంఘిక రంగాల్ని నడిపించిన వారిలో ప్రముఖుడు మహాత్మా గాంధీ. కళా సాంస్కృతిక రంగాల్ని వెలిగించినవారిలో ప్రముఖుడు విశ్వకవి రవీంద్రుడు, ఆధ్యాత్మిక రంగాన్ని ప్రభావితం చేసిన వారిలో ఘనుడు వివేకానందుడు. 1861లో ఠాగూరు, 1863లో వివేకానందుడు, 1869లో గాంధీ జన్మించారు. వివేకానందుడు ఆధ్యాత్మిక ప్రబోధం ద్వారా భారతీయ ఘనతను ప్రపంచానికి చాటితే, ఠాగూరు సాహిత్య సౌరభం ద్వారా మనదేశానికి గుర్తింపు తెచ్చాడు. వీరిద్దరి తర్వాత వచ్చిన గాంధీ ప్రపంచానికి అపూర్వమైన అహింసాయుధాన్ని ఇచ్చాడు. దాంతో దేశానికి స్వాతంత్ర్యమే తెచ్చాడు. వీరిలో ఠాగూరు, గాంధీ కాటూరివారికి అభిమానులు. కాటూరివారి జీవన విధానం పైన గాంధీ ప్రభావం, కవితా వైఖరిపైన ఠాగూరు ప్రభావం మనకు ప్రస్ఫుటంగా కనబడుతుంది. పన్నీటిజల్లు కావ్యంలో గాంధీని గురించి, రవీంద్రుణ్ణి గురించి కాటూరివారి కవితలున్నవి. రవీంద్రుడి "గార్డెనర్" గేయానికి అనువాదం "తోట మాలి". రవీంద్రుని శతజయంతిని పురస్కరించుకొని కాటూరివారు వ్రాసిన మరో గేయం "నివేదనము". కాటూరివారి "కవీంద్ర కథ" అనే రవీంద్రకథ, లీలామజుందార్ ఆంగ్లరచనకు అనువాదం. సాహిత్య ఎకాడమీ ఢిల్లీవారు 1961లో దీన్ని ప్రచురించారు. ఇది రవీంద్రుడి జీవిత రేఖల్ని, సాహితీ సౌరభాల్ని వెదజల్లుతుంది. బాలురకోసం ప్రత్యేకించి వ్రాసిన ఈ పుస్తక రచన రవీంద్రుడి శతజయంతి సంవత్సరంలో జరిగింది.

రవీంద్రుడు 1861లో కలకత్తాలో జన్మించాడు. రవీంద్రుడి తండ్రి దేవేంద్రనాథ్ ఠాగూరు. ఠాగూర్లు బ్రాహ్మణులు, రవీంద్రుడిది పండిత వంశం. వీరు జమిందార్లు కూడా. రవీంద్రుడికి బడి బందిఖానాగా తోచేది. ఇంటి వద్దే ఆయన తన విద్యాభ్యాసాన్ని సాగించాడు. చిన్ననాడే అతడు సంస్కృత, ఆంగ్ల భాషల్లో మంచి పాండిత్యాన్ని సంపాదించాడు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం బాగా అభ్యసించాడు. ఇక కవిత్వం సంగతి చెప్పవలసిందే లేదు. అది ఆయనకు పుట్టుకతోనే సంక్రమించిన కళ. ఆయన తన పదిహేనవ సంవత్సరంలోనే దేశభక్తి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గేయాలు వ్రాసి, స్వయంగా గానం చేస్తుండేవాడు. ఆయనకు భగవంతుడు మంచి కంఠం కూడా ఇచ్చాడు. "వనఫూల్" (అడవి పూలు) ఆయన మొదటి పద్య కావ్యం. "వాల్మీకి ప్రతిభ" అనే యక్షగానం ఆయనకు ఎంతో పేరు తెచ్చింది. రవీంద్రుడి భార్య మృణాలినీ దేవి. ఆయన ఎన్నో పల్లెల్ని దర్శించి గ్రామీణ జీవితాన్ని దాంట్లోని సౌందర్యాన్ని గ్రహించాడు. పల్లె జీవనం ప్రతిఫలించే ఎన్నో రచనలు చేశాడు. ఆయనకు భార్యావియోగం కలిగినప్పుడు తన పిల్లలకు తానే తల్లై ఎన్నో పద్యాలు పాటలు చెప్పి లాలించాడు. అవి "క్రెసెంటు మూన్" అనే పేరుతో ఇంగ్లీషు భాషలో తరువాత వెలువడ్డవి.

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని ఆయన ఎన్నో దేశభక్తిగేయాలు రచించాడు. 1912లో ఆయన ఇంగ్లాండును దర్శించాడు. అక్కడ డబ్ల్యు.బి.యాట్సు అనే కవీశ్వరుడితో, రోథెన్‌స్టీను అనే చిత్రకారుడితో పరిచయమయింది. వారి ప్రోత్సాహంతో తన కవితలను ఆంగ్లంలోకి రవీంద్రుడు అనువదించాడు. అవి పండితుల మన్ననలు పొందినవి.

రవీంద్రుడు 1901లో కళలు, విద్యలు నేర్పటానికి "శాంతినికేతన్" స్థాపించారు. శాంతి నికేతనానికి చేరువగా శ్రీనికేతన్ అనే మరో సంస్థను చేతి వృత్తులు, వ్యవసాయం నేర్పటానికి స్థాపించారు. రవీంద్రుడు విదేశాలలో సంచరించిన తరువాత ప్రపంచ ప్రజలమధ్య అవగాహన, అనురాగం, శాంతిసాధనకు మార్గాలని గ్రహించాడు. ప్రతివాడు తాను ఇతరులకు నేర్పవలసింది వారి దగ్గర నుండి నేర్చుకోవలసింది ఉందని భావించి శాంతినికేతన్‌లో "విశ్వభారతి" అనే మరో సంస్థను రూపొందించారు. 1915లో బ్రిటీషు ప్రభుత్వం "సర్" బిరుదుతో విశ్వకవిని సత్కరించింది. అయితే జలియన్ వాలా బాగ్‌లో బ్రిటీషు ప్రభుత్వం అమాయకులను వధించిన దానికి నిరసనగా ఆ బిరుదాన్ని పరిత్యజించాడు రవీంద్రుడు.

రవీంద్రుడు తాను బెంగాలీలో వ్రాసిన గేయాల్ని ఆంగ్లంలోకి "గీతాంజలి" అనే పేరుతో అనువదించాడు. దానికి నోబెల్ బహుమతి వచ్చింది. బహుమతిగా వచ్చిన లక్ష ఇరవై వేల రూపాయలు శాంతినికేతన్‌కే సమర్పించాడు.

రవీంద్రుడు ప్రపంచానికిచ్చిన బహుకృతులలో "గీతాంజలి", భారత దేశానికిచ్చిన బహుకృతులలో "జనగణమన" చిరస్మరణీయాలు. ఆయన విశ్వకవి. 1941లో ఠాగూరు అమరుడైనాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరివారు చాలా క్లుప్తంగా 14 పేజీలల్లో సులభంగా, సుందరంగా పిల్లలకే గాదు, పెద్దలకు కూడ ప్రయోజనకరంగా రవీంద్ర కథను చిత్రించారు.

మౌలానా అబుల్ కలామ్ అజాద్

మౌలానా అబుల్ కలాం అజాద్ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న మహమ్మదీయ నాయకులలో ముఖ్యుడు. ఈయన చరిత్రను ఆంగ్లంలో మహదేవ దేశాయిగారు 1940లో రచించారు. ఆ గ్రంథానికి తెనుగుసేత కాటూరివారు చేశారు. ఇందులో భాష సులభంగా ఉన్నది. సామాన్య పాఠకులకు జాతీయ నాయకుల్ని గురించి చెప్పటమే ఈ రచన యొక్క ముఖ్యోద్దేశము.

కాటూరివారు ఈ గ్రంథాన్ని అనువదించేటప్పుడు మూలంలో పద్యాల్ని గేయాలుగా, పద్యాలుగా చక్కగా అనువదించారు. ఉరుదు భాషలోకి అనువదింప బడ్డ కొరానుకు మౌలానా వ్రాసిన పీఠికలో పద్యాలకు తెలుగు అనువాదమిది.

"అగుదు నాచారహీనుఁడ, నట్టె శ్రోత్రి
యుఁడ నగుదు; నాకు నీరెండు నొక్కతీరె."
"జ్ఞానదీప మెందుండిన నే నచటికిఁ బయనింతును
గాదెనిండ ధాన్యమున్నఁ బోదు గింజ లేఱకొనంగ."
"జీవనంపుటూటఁ జేరఁగా ఖిజరు దూ
రాధ్వమును గమించి యలసిపోయె;
ఏను దానిచెంత కేగ కింకొక యూట
దరిసి, దప్పిదీఱఁ ద్రావికొంటి."

(సంస్కృతి ప్రచురణ-1959-పే. 33)

మౌలానా 1888వ సం॥లో జన్మించాడు. ఈయన తండ్రి ఖైరుద్దీన్ ఢిల్లీ నగరంలో నివసిస్తుండేవాడు. ఈయన మతగురువు, పండితుడు, భక్తుడు. వీరి పూర్వీకుల్లో షేక్ జమాలుద్దీను దెహ్లావి అనే సాధుపుంగవుడు అక్బరు పాదుషా ఆస్థానంలో ఎంతో గౌరవం పొందాడు. ఆయనకు రహింతుల్లా అలి అనే బిరుదుం డేది. అయన కొన్ని ముస్లిం మతగ్రంథాల్ని కూడ రచించాడు. ఇక మౌలానా మాతామహుండు షేక్ మహమ్మద్ జహీర్ కూడ గొప్ప పండితుడు. తల్లివంక, తండ్రివంక ఉన్న సంస్కారం, పాండిత్యం అజాద్‌కు సంక్రమించింది. తండ్రి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కొన్నిరోజులు మక్కాలో ఉండటంవల్ల, ఈయన బాల్యం అరేబియాలోనే గడిచింది. 1892 తరువాత ఈ కుటుంబం బొంబాయిలో స్థిరనివాసం ఏర్పరచుకున్నది.

మౌలానా ప్రతిభ బాల్యంలోనే వ్యక్తమౌతుండేది. పధ్నాలుగు సంవత్సరాల ప్రాయంలోనే ఆయన "లిసానస్ సిదిక్" (సత్యవాణి) అనే పత్రికను నడిపారు. తదనంతర కాలంలో మౌలానా "అల్ హిలా" ("చంద్రరేఖ") అనే ఉర్దూ వార పత్రికను స్థాపించి హిందూ ముస్లిం ఐక్యతకు పాటుపడటం, ఆ పత్రికద్వారా స్వాతంత్ర్యోద్యమ భావాల్ని ప్రచారం చేసిన విషయం ఇందులో వివరించబడింది. సున్నితమైన చమత్కారాలతో, బ్రిటీషువారికి మెత్తగా తగిలే వ్యంగ్య రచనలతో, ఆ పత్రిక విశేషంగా జనాదరణ పొందిందట. రెండవ ప్రపంచ యుద్ధ విశేషాలు, జర్మనుల సైనిక పాటవాన్ని, ఆనాటి రాజకీయ పరిస్థితుల్ని గురించిన వివరణ కూడ ఈ గ్రంథంలో మనం చూడవచ్చు.

1920 ప్రాంతంలో గాంధీ, మౌలానా ఆజాద్‌లు కలుసుకున్నారు. గాంధీ సిద్ధాంతాలు ప్రచారం చేయటంలో ఆయన ఎంతో శ్రమించారు. మంచి వక్త, పండితుడైన మౌలానా గాంధీకి ఎంతో తోడ్పడ్డాడు. గాంధీజీ రూపొందించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో మౌలానా పాత్ర ప్రముఖమైనది. ఈ విషయాలు కూడ ఈ గ్రంథంలో చోటు చేసుకున్నవి.

ప్రసక్తానుప్రసక్తంగా స్వాతంత్ర్యోద్యమంలో ఆలీ సోదరుల కృషి, ఖిలాఫత్ ఉద్యమం, మోతీలాల్, చిత్తరంజన్‌దాస్, లాలా లజపతిరాయ్‌ల కృషి కూడా ఇందులో వివరించబడింది. ఈ నాయకులందరు మౌలానాకు మిత్రులే !

గోవధ విషయంలో హిందూ ముస్లిములకు వివాదం ఏర్పడిన సందర్భంలో సామరస్యం కోసం మౌలానా చేసిన కృషి కూడా ఈ గ్రంథంలో మనకు కనబడు తుంది.

పూర్వాచార పరాయణుల వంశంలో జన్మించినప్పటికి మౌలానా కొంత హేతువాద దృష్టి కూడా కలిగి ఉండేవాడట. జైల్లో ఉండగా మౌలానా ఖురాన్‌కు వ్యాఖ్యానం వ్రాశాడుట. ఆ వ్రాతప్రతిని బ్రిటీషు అధికారులు స్వాధీనం చేసికున్నారు. జైలు నుంచి విడుదలైన తరువాత సగం కాలిపోయిన స్థితిలో ఆ పుస్తకం ఆయనకు దక్కిందట.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గాంధీ మౌలానా మాటలకు ఎంతో విలువ ఇచ్చేవాడు. ఆయన సలహాలు స్వీకరించేవాడు. అజాద్ గంభీరుడు, ఉదారుడు, నిరాడంబరుడు. ఈయన డ్రాయింగు రూముకు పుస్తకాలే అలంకారాలు. మౌలానాకు ధూమపానం తప్ప మరే వ్యసనాలు లేవని, నాటకాది వినోదాలు ఆయనకు పెద్దగా ఇష్టం ఉండేదికాదని, ఉత్సవాలలో పాల్గొనేవాడు కాదని, మౌలానా వ్యక్తిత్వం ఈ గ్రంథంలో చిత్రింపబడింది. బీహారు కర్షకులకు, జమీందారులకు భూమిశిస్తు విషయంలో ఏర్పడ్డ తగాదాలను మౌలానా పరిష్కరించిన విషయం కూడా పుస్తకంలో ఉన్నది. ముస్లిమ్‌లీగ్‌ను ఆయన సమర్థించలేదు.

ఈ గ్రంథంలో భాష సరళంగా పిల్లలకు పనికివచ్చేటట్లు ఉన్నది. అయితే దీంట్లో మౌలానా వ్యక్తిగత విషయాల కంటే స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పాత్రను గురించే ఎక్కువ వివరించబడింది. ముస్లిం-హిందూ ఐక్యతకు దోహద పడుతుందనే అభిప్రాయం కూడా దీన్ని అనువదించటంలో కాటూరి వారికి ఉండి ఉండవచ్చు.

4. ఆంగ్లానువాదములు – నవలలు

కాటూరివారు, "అలెగ్జాండర్ డ్యూమాస్" ఆంగ్లంలో రచించిన "బ్లాక్ టులిప్" అనే నవలను "నల్లకలువ" అనే పేరుతోను, ఎ. యస్. పి. అయ్యర్ ఆంగ్లంలో రచించిన "త్రీ మెన్ ఆఫ్ డెస్టినీ" అనే నవలను ముగ్గురు మూర్తుల పేరుతోనూ అనువదించారు. మొదటి నవలలోని కథ విదేశీయమైనది. రచయిత కూడ విదేశస్తుడే. రెండవ నవలలో కథ మనదేశంలో జరిగింది. రచయిత మన దేశీయుడే. "నల్లకలువ" నవల రచనకు చారిత్రకమైన నేపథ్యం ఉన్నా ప్రధానంగా అది ప్రేమకథ. ఇక రెండవది పూర్తిగా చారిత్రకమైనది. ఈ రెండు నవలల్లో విదేశీయమైన అన్యభాషా నామాల్ని కాటూరివారు సంస్కృతీకరించారు. సరళ గ్రాంథికంలో రచన సాగింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నల్ల కలువ

ఈ నవలలో కథ, హాలెండు దేశానికి సంబంధించింది. ఏడవ శతాబ్దంనాటి కథ ఇది. డివిటు వంశానికి చెందిన "జాను" "కోర్నీలయసు" అనే ఇద్దరు సోదరులు అప్పటిదాకా ఉన్న రాచరికాన్ని కూలద్రోసి ప్రజాస్వామ్యాన్ని నెల కొల్పారు. వారు దేశభక్తులు. వారి పరిపాలనలో ప్రజలు స్వేచ్ఛను, సుఖాన్ని అనుభ వించారు. దేశ ఆర్థికస్థితి కూడా మెరుగుపడింది. ఆ కాలంలో ఫ్రాన్సు దేశానికి, హాలెండుకు విరోధాలుండేవి. అప్పుడు ఫ్రాన్సుదేశాన్ని పరిపాలిస్తున్న పదహారవ లూయీ చక్రవర్తితో స్నేహాన్ని పాటిస్తూ, డివిటు సోదరులు దేశానికి శత్రుభయాన్ని తొలగించారు.

ఈ మంచి పనులే వారికి ప్రాణాంతకమైనవి. రాచరికం పునరుద్ధరించాలని కొందరు కుట్ర సాగించారు. ఈ సోదరులు ఫ్రాన్సు రాజుతో స్నేహం చేయటం వారికి సాకుగా దొరికింది. డివిటు సోదరులు దేశాన్ని శత్రువుకు అప్పగిస్తున్నారని ప్రచారం జరిగింది. అరంజి రాజవంశానికి చెందిన, "విలియం" అనేవాడ్ని చేరదీసి వాడికి రాజనీతి, యుద్ధవిద్యలు అన్నీ నేర్పి సైన్యాధిపతిని చేశాడు "జాను" మహా శయుడు. ఇది పాముకు పాలుపోసినట్లయింది. విలియం సింహాసనంపై కన్ను వేశాడు. కుట్రను ప్రోత్సహించాడు. కొందరు బలవంతంగా "జాను" ప్రధానిచేత, "విలియం"ను రాజుగా ప్రకటింపజేశారు. అంతటితో ఊరుకోక ఆ సోదరులపైన రాజద్రోహ నేరం మోపి కారాగారంలో వేశారు. తమకు ప్రమాదం తప్పదని తెలిసిన ఆ సోదరులు, తమ దగ్గర ఉన్న కొన్ని రాజకీయ రహస్య పత్రాల్ని, లేఖల్ని ఒక సంచీలో సీలు వేసి, తమ శిష్యుడు వాన్ బారల్ వంశానికి చెందిన "కార్నీలియసు" అనేవాడికి పంపుతూ, తమ దగ్గరున్న బైబిలు పుస్తకంలో మొదటి పేజీ చించి దానిపై, ఆ ఉత్తరాల్ని నాశనం చేయమని, ఒక లేఖకూడా వ్రాసి పంపారు. ఇక్కడ గురువు పేరు, శిష్యుని పేరు "కార్నీలియసు" కావటం విచిత్రం. అయితే వంశాలు వేరు. తనను ఇంతవాడ్ని చేశారనే కృతజ్ఞత ఏ మాత్రం లేని విలియం, వారు బ్రతికుంటే తన అధికారానికి ప్రమాదమని భావించి వారిని తుద ముట్టించటానికి పన్నాగం పన్నాడు. ప్రజల్ని వారిపై రెచ్చగొట్టాడు.

గ్రైఫస్ అనేవాడు కారాగృహానికి కాపలాదారు. వాడి కుమార్తె రోజా. ఉత్తమురాలైన ఆమె, ఆ సోదరులను దొడ్డి ద్వారం గుండా జైలు నుండి తప్పిం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చింది. అయినా కోపోద్రిక్తులైన ప్రజల బారినుండి వారు తప్పించుకోలేకపోయారు. ప్రజలచేత వారు చిత్రవధ కావించబడ్డారు. విలియం కళ్లు చల్లబడ్డవి. ఇది ఈ నవలకు పూర్వరంగం. ఇక అసలు ప్రేమకథ మొదలు అవుతుంది.

డివిటు సోదరుల శిష్యుడు కొర్నీలియసుకు పూలతోటలు పెంచటమన్నా, నూతన పుష్పజాతుల్ని సృష్టించటమన్నా ఎంతో ఇష్టం. ఇతనికి పొరుగింట్లో "బాక్సులు" అనేవాడు నివశిస్తున్నాడు. అతడు కూడ పుష్ప కర్షకుడే. కొర్నీలియసు బాక్స్టలును పట్టించుకొనేవాడు కాదు. కాని బాక్సులు మాత్రం కొర్నీలియసు పూలపాదుల్ని తన ఇంటి నుండే సూక్ష్మదర్శిని ద్వారా పరిశీలిస్తూ అసూయను దిన దిన ప్రవర్థమానంగా పెంచుకున్నాడు. అదే సమయంలో "హార్లెము" నగరంలోని పుష్పప్రియ పరిషత్తు, నల్లకలువ పూవు సాధించిన వారికి లక్ష వరహాలు బహుమతిని ప్రకటించింది. బాక్సులు మొదలైనవారు అది అసాధ్యమని ప్రయత్నం చెయ్యలేదు. కొర్నీలియసు మాత్రం నల్లకలువ సృష్టికోసం కృషి చేస్తూనే వున్నాడు. చివరకు పూలమడిలో ఆ నల్లకలువ మొలకల్ని రూపొందించగలిగాడు. ఇది గమనించి బాక్సులు రెండు పిల్లుల్ని తెచ్చి వాటిని ఒక దానితో ఒకటి తాడుతో కట్టి రాత్రి పూట పూలమడిలో వదిలాడు. అవి అటూఇటూ గుంచుకోని, కరుచుకోని త్రొక్కి ఆ మడిని పాడుచేసినవి. తాడు రాపిడికి అన్ని మొక్కలు తల్లక్రిందులైనవి. అదృష్టవశాత్తు నల్లకలువ మొక్కలకు ఏమీ కాలేదు. అది బాక్సులుకు తెలియదు. డివిటు సోదరులు రహస్య పత్రాల సంచీని కొర్నీలియసుకు పంపటం, అతడు దాన్ని ఒక పెట్టెలో దాచటం బాక్సులు గమనించాడు. ఆ అసూయాపరుడు విషయం అధికారులకు తెలిపాడు. వారు కొర్నీలియసు ఇంటిని ముట్టడించి ఆ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. డివిటు సోదరులు వ్రాసిన లేఖ నల్లకలువను రూపొందించే త్వరలో అతడు చదవకపోవటం, ఆ ఉత్తరాలను నిర్మూలించలేకపోవటం వల్ల, అతడు దోషిగా దొరికిపోయాడు.

కొర్నీలియసు కారాగారంలో బంధింపబడ్డాడు. అతడు తనతోపాటు తాను సాధించిన కలువ దుంపల్ని మాత్రం తేవటం మరచిపోలేదు. వాటిని ఆ బంధిఖానాలోనే పెంచటానికి ప్రయత్నించాడు. ఇంతకు ఆ కారాగార పాలకుడు గ్రైఫసే. క్రూరుడైన వాడు ఒకరోజు మెట్లపై క్రింద బడ్డాడు. కొర్నీలియసు అతడి చేతికి కట్టు కట్టి ఎంతో సేవ చేశాడు. ఇతని సౌజన్యం గ్రైఫస్ కూతురు రోజాను ఆకర్షించింది. వారు క్రమంగా ప్రేమలో పడ్డారు. కొర్నీలియసు విచారణకు పిలుపు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వచ్చింది. అతని కంటె అతన్ని ప్రేమించిన రోజా కన్నీరు మున్నీరుగా విల పించింది. కార్నీలియసు నల్లకలువల వృత్తాంతం అంతా చెప్పి, ఆమెకు మూడు కలువ దుంపలు దాచిన పొట్లమిచ్చాడు. ఆ దుంపలు, డివిటు సోదరులు ఉత్తరం వ్రాసిన కాగితంలో పొట్లంకట్టబడి ఉన్నవి. ఆ ఉత్తరం మాటే మరచిపోయిన కార్నీ లియసు దాన్ని చదవనేలేదు. ఆ ఉత్తరం రాజుకు చూపిస్తే, ఆ వ్యవహారంలో అతని దోషం లేదని తేలిపోయేది. అతని దురదృష్టం ఆ పని చేయనివ్వలేదు. ఆ దుంపల్ని ఎలా పెంచాలో చెప్పి నల్లకలువ వల్ల వచ్చే బహుమాన ద్రవ్యాన్ని ప్రియురాలికి కానుకగా సమర్పించాడు కార్నీలియసు.

విలియం ప్రభువు కార్నీలియసును విచారించి దేశద్రోహులైన డివిటు సోదరులకు చెందిన రహస్య పత్రాలు దాచాడనే నేరంపై ఉరి శిక్ష విధించాడు. కానీ అతని మంచితనం కొందరి వల్ల విన్నవాడై ఆ శిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా తగ్గించాడు. రోజా ప్రేమ కార్నీలియసు కారాగార క్లేశాన్ని తగ్గించింది. నల్ల కలువ దుంపల్లో ఒకదాన్ని కార్నీలియసు జైల్లోనే పెంచుతున్నాడు. ఒక దుంపను దాచి పెట్టాడు. మరొక దాన్ని రోజాకు పెంచమని ఇచ్చాడు.

కార్నీలియసు జైల్లో పడ్డ తరువాత బాక్ట్సలు అర్ధరాత్రి అతనింట్లో చొరబడి నల్లకలువ మొక్కల కోసం వెదికాడు. అవి దొరకలేదు. వాటిని తస్కరించ దలచి, జాకబు అనే మారు పేరుతో, గ్రైఫసుతో స్నేహం చేసి, రోజాను, కార్నీ లియసును గమనిస్తూ వచ్చాడు. కారాగారంలో పెంచబడుతున్న మొక్క గ్రైఫసు కంటబడింది. అందులో ఏదో గూడుపుఠాణీ ఉందని భావించి దాన్ని నలిపివేశాడా దుర్మార్గుడు. కార్నీలియసు ప్రాణం పోయినంత పనయింది. తన కిచ్చిన దుంపను రోజా తన గదిలోనే పెంచింది. దానికి నల్లకలువ పూచింది. దాన్ని హార్లెము నగరానికి తీసికొనిపోయి పుష్పప్రియ పరిషత్తు అధ్యక్షుడు, హారిసన్‌కు చూపించి బహుమతి గెలుచుకోమని కార్నీలియసు ఆమెకు చెప్పాడు. ఇంతలో జాకబ్ పేరుతో ఉన్న బాక్ట్సలు దాన్ని దొంగిలించి ముందుగా హార్లెము నగరానికి చేరాడు. రోజా కూడా అక్కడికి చేరి తన కలువ అపహరింపబడిన విషయం ఆ అధికారికి ఫిర్యాదు చేసింది. అతడు మొదట్లో ఆమె మాటలు నమ్మలేదు. ప్రభువు విలియం కూడా ఆ సభకు ఆహ్వానితుడుగా వచ్చాడు. రోజా ఆయనకు విషయం మొరపెట్టుకున్నది. విలియంకు ఆమె మాటల్లో సత్యమున్నట్లు తోచింది. విలియం స్వయంగా విషయం విచారిస్తున్నాడు. రోజా బాక్ట్సలును ఎన్ని కలువ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దుంపలు నీవు సాధించావు అని అడిగింది. అతడు మూడు దుంపలు సాధించానని ఒకటి చెడిపోయిందని, రెండవ దానికి ఈ పూవు పూచిందని మూడవది ఇంటి దగ్గర ఉన్నదని చెప్పాడు. అప్పుడు రోజా "ప్రభూ అది మోసం, మూడవ దుంప ఇదిగో నా దగ్గర" ఒక దుంప కారాగారంలో కార్నీలియస్ పెంచుతుంటే మా తండ్రి నాశనం చేశాడు. రెండవది నేను పూయించిన పూవు. మూడవది ఇదిగో" అని తన దగ్గర పొట్లంలో ఉన్న దుంపను చూపింది. ఆ పొట్లం కట్టిన కాగితం పైన ఏవో అక్షరాలున్నవి. ఇప్పటి దాకా దాన్ని ఆమె కూడా చదవలేదు. తీరా ఆ కాగితం డివిటు సోదరులు కార్నీలియసుకు వ్రాసిన ఉత్తరమే. ఆ లేఖల్ని తగులబెట్టమని వ్రాశారా సోదరులు. ఆ ఉత్తరంలో విషయం కూడా విలియంకు వివరించి "ప్రభూ కార్నీలియసు ఆ ఉత్తరాన్ని చూడలేదు. వాటి రహస్యాలతో అతనికి ప్రమేయం లేదు" అంటూ మొరపెట్టుకున్నది. విలియం కార్నీలియసును నిర్దోషిగా నమ్మి చెర విడిపించాడు. బాక్స్టలు శిక్షించబడ్డాడు. రోజా, కార్నీలియసుల వివాహం వైభవంగా జరిగింది.

విశేషాలు

ఈ నవలలో తెలుగు వాతావరణం అంతగా సాధింపబడలేదనే చెప్పాలి. "హారిసన్" అనే పేరును, హరిసేనుడు అని సంస్కృతీకరించటం మరొక విశేషం.

"మహా జనో యేన గతస్సంపథా" (198 పే)
"శేషం కోపేన పూరయతే"

మొదలైన సంస్కృత సూక్తులను కూడా కాటూరివారు ప్రయోగించారు.

గ్రైఫసు కలువ మొక్కను ధ్వంసం చేసినపుడు కార్నీలియసు పొందిన ఆవేదనను, భావాల్ని కాటూరివారు చక్కని పూలపాటగా రచించారు.

"ఇలచేదె కడుపులోఁ బొలసి నునుసెగ లెగయు
నులివెచ్చనగు రహోజ్వలను బిడ్డలము
క్రొంబ్రొద్దు పొడుపులును కొదమ నీహారములు
కూర్మి మీ బగఁ గన్నకూఁతులము మేము

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వాయుదేవుడు మాకు (దండ్రి
వారిదేవత మాకు(దల్లి
స్వర్గలోకము మాకు జన్మస్థలమ్ము

వలతురట మము నరులు, వలచి గాసియొనర్చి
వలపుననె మా ప్రాణములు హరించేరు!
వేరె భూమికి మాకు విడరాని బంధమ్ము,
వేరె యాధారమ్ము, వేరె ప్రాణమ్ము:
స్వర్గమునకు అంగచాచేము మేము
స్వర్గమ్మునకు(గేలు సాచి లేచేము"

ఇదొక "పుష్ప విలాపము"
"వింజం బాకిడినట్లు"
"గుమ్మడి కాయల దొంగ"

మొదలైన సామెతల్ని వీరు ఈ అనువాదంలో చక్కగా ప్రయోగించారు.

ముగ్గురు మూర్తులు

—. రచయిత పరిచయం :—

ఎ. యస్. పంచాపకేశ అయ్యరు ఆంగ్లంలో రచించిన "త్రిమెన్ ఆఫ్ డెస్టినీ" అనే నవలకు "ముగ్గురు మూర్తులు" కాటూరివారి తెలుగు సేత. అలెగ్జాండరు చంద్రగుప్తుడు, చాణుక్యుడు ఈ ముగ్గురే ముగ్గురు మూర్తులు. అయ్యరుగారు ఎం.ఎ. పట్టా పుచ్చుకొని ఆనాటి ఉన్నతమైన పరీక్ష ఐ.సి.యస్. ప్యాసయినారు. వీరు బారిస్టరు పట్టాన్ని కూడా పొందారు. బందరులో జిల్లా జడ్జిగా పనిచేస్తున్నప్పుడు అయ్యరుగారికి కాటూరివారికి స్నేహం ఏర్పడింది. అయ్యరుగారు గొప్ప జాతీయవాది. సంస్కరణ కాంక్ష, చారిత్రక దృష్టి వారి రచనలలో కనబడే విశేషాలు. సీత పెండ్లి, ధర్మపథము, భావబంధనము అనే నాటికలు సంస్కరణ దృష్టికి, ముగ్గురు మూర్తులు, బాలాదిత్య నవలలు వారి చారిత్రక శోధనకు నిదర్శనాలు. ఈ రెండు భావాలా ఉన్న కాటూరివారు వీటిలో కొన్నిటిని అనువదించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సాంచీ స్థూపం మీద సింహవాహనులైన ఇద్దరు పురుషుల బొమ్మలున్నవి. ఒకరి చేతిలో పద్మం మరొకరి చేతిలో ద్రాక్ష గుత్తి ఉన్నది. పద్మం ధరించినవాడు చంద్రగుప్తుడని, ద్రాక్షగుత్తిని ధరించినవాడు సెల్యూకస్ అని అయ్యంగారు భావించారు. ఆపైన ఎన్నో స్వదేశీయ, విదేశీయ చారిత్రక గ్రంథాల్ని పరిశీలించి, కళా చారిత్రక దృష్టిని మేళవించి రూపొందించిన గ్రంథమిది. ఇది కేవలం కథా ప్రధానమయినది కాదు. ఆనాటి సాంఘిక రాజకీయ పరిస్థితులతో గుచ్చెత్తిన రచన. ఇది చిన్న అక్షరాలలో మూడువందల పుటలు మించి ఉన్నది. మామూలు అక్షరాలయితే అయిదువందలు దాటుతుంది. ఈ అనువాద గ్రంథాన్ని 1950లో వావిళ్ళవారు ప్రచురించారు. ఈ రుచిర కదంబాన్ని రుచి చూపించటమే నేను చేయగలిగింది. ఆసాంతం ఆరగిస్తే ఉండే ఆనందం వేరు.

ఈ కథ క్రీస్తుపూర్వం మూడువందల ఇరవై యేళ్ళ నాటిది. ఈ నవలలో అలెగ్జాండరు ప్రాక్పశ్చిమ ఖండాలను ఏకంచేసి, మానవాళినంతా ఒకటిగా నిలపటానికే ప్రపంచ విజయానికి నడుంకట్టినట్లు చెబుతాడు. ప్రపంచ విజేత అయిన తరువాత భారతదేశంలో తత్త్వ విచారంలో కాలం గడుపుతానంటాడు. ఇక ఆర్షధర్మాన్ని ప్రతిష్ఠించటం చంద్రగుప్తుడి లక్ష్యం. నంద వంశ నిర్మూలనం ప్రాథమిక లక్ష్యంగా పెట్టుకున్నా! శ్రుతి స్మృతి విహితమైన నూతన ఆర్థిక రాజకీయ వ్యవస్థ సాధించటానికే తన శక్తియుక్తులు ధారపోశాడు ఆచార్య చాణుక్యుడు.

—:క థా సం గ్ర హం:—

భారతదేశంపై దండెత్తి వచ్చిన అలెగ్జాండరును మొదట కలిసిన ప్రముఖుడు తక్షశిలరాజు అతని కుమారుడు అంభి. గ్రీకులకు గజ యుద్ధం తెలియదు. ఆ రహస్యాలు వారికి నేర్పింది వీరే. తమ శత్రువైన పర్వతేశ్వరుణ్ణి జయించాలనే కాంక్షతో వీరు గ్రీకుల పక్షాన చేరారు. అయితే అప్పటిదాకా ఆ ఆస్థానంలో ఉన్న చాణుక్యుడు, తన ప్రభువు విదేశీయులకు తొత్తు కావటం సహించలేక, తక్షశిలను వదలి వచ్చాడు. కాశీలో పండితుల్ని జయించాడు. ఈయనకు విష్ణుగుప్తుడని, కౌటిల్యుడని, వాత్స్యాయనుడని, ద్రామిళుడని, చాణుక్యుడని పేర్లున్నవి. అలా సంచారం చేస్తూ చాణుక్యుడు మగధ రాజధాని పాటలీపుత్రం చేరాడు. ఆ రాజ్యాన్ని నవనందులు పాలిస్తున్నారు. నిత్య సంతర్పణం జరిగే భోజనశాలలో నందులు తమ ప్రక్క-

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పండిత శ్రేష్ఠుడికంటూ ఒక పీట, బంగారు పళ్ళెం ఉంచారు. అక్కడ మామూలుగా ఆస్థాన పండితుడు కూర్చునేవాడు. చాణుక్యుడు ఆ పీఠమెక్కాడు, ఎవరు చెప్పినా వినడు. ఇంతలో నందులు వచ్చారు, ఆ పీఠం దిగమని ఆజ్ఞాపించారు. "ఇక్కడ ఏ పండితుడైనా నన్ను గెలిస్తే అలానే చేస్తాను. ఇది పండిత శ్రేష్ఠుడి స్థానంగదా" అన్నాడు; చాణుక్యుడు. మదించిన నందులు అతన్ని జుట్టుపట్టి ఈడ్చారు. ఆగ్రహోదగ్రుడైన ఆ పండితుడు నందవంశం నిర్మూలిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. అక్కడే ధర్మశాలాధికారిగా ఉన్న చంద్రగుప్తుడితో ఇతనికి పరిచయం ఏర్పడింది. చాణుక్యుడు రాజనీతిలో, మంత్ర, తంత్రాలలో ఆరితేరినవాడు. ఇతని జన్మస్థలం కేరళ ప్రాంతం.

చాణుక్యుణ్ణి గురించి తెలిసిన, నందుల మంత్రి రాక్షసుడు, ప్రతిగా మరొక తాంత్రికుణ్ణి వెదకటం మొదలుపెట్టాడు. ఈలోపల చాణుక్యుడు తన మిత్రుడు ఇందు శర్మను, జీవసిద్ధి అనే పేరుతో బౌద్ధ భిక్షువుగా పాటలీపుత్రానికి పంపాడు. ఇతడు కూడ తాంత్రికుడే. తన మహిమలతో అచిరకాలంలోనే ప్రజల్ని ఆకట్టుకున్నాడతడు. నందులకి వార్త తెలిసి ఆయనను కోటలోకి ఆహ్వానించారు. తన తంత్రం చేత కోటలో వ్యాధులు సృష్టిస్తూ ఇది చాణుక్యుడి ప్రభావమని వారిని నమ్మించాడు. పూర్వం నందుల తండ్రి ఒక బ్రాహ్మణ బాలకుడ్ని చంపి కోటలో ఒక గదిలో పాతిపెట్టాడు. ఆ విషయం చంద్రగుప్తుడి ద్వారా తెలుసుకున్న జీవసిద్ధి, కోటలో బ్రాహ్మణ శవమున్నదని, దయ్యమైన దాన్ని, చాణుక్యుడు మీ మీద ప్రయోగిస్తున్నాడని, చెబుతూ ఆ అస్థికలను బయటికి తీశాడు. దాంతో నందులకు నమ్మకం కుదిరింది. తన మంత్రబలంతో చాణుక్యుడి ప్రయోగానికి ప్రతిక్రియలు చేస్తున్నానంటూ నందులకు ఆప్తుడైపోయాడతడు. చంద్రగుప్తునికి ప్రజాదరణ పెరగటం గమనించి అతణ్ణి బంధించాలనుకున్నారు నందులు. ఆ వార్త ముందుగానే జీవసిద్ధి తెలియజేయటం వల్ల అతడు తప్పించుకొనిపోయి చాణుక్యుణ్ణి కలుసుకున్నాడు.

చంద్రగుప్తుడు తన పూర్వకథను చాణుక్యుడితో ఇలా చెప్పాడు. మగధ సామ్రాజ్యానికి మహానందుడు రాజు. ఆయన క్షత్రియ పట్టమహిషి సునందాదేవి ఆమె కిద్దరు కుమారులు. నందుడికి శూద్రురాలైన భార్య మురు. ఆమె కుమారుడు మౌర్యుడు. ఇదిలా ఉండగా మహాపద్మడనే క్షురకుడు రాజుగారి మెప్పుపొంది క్రమంగా సైన్యాధిపతి దాకా ఎదుగుతూ వచ్చాడు. ఈతని తండ్రి క్షత్రియుడు, యువ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కుడు, అందగాడు, నేర్పరి అయిన మహాపద్ముడు సునందాదేవికి అభిమాన పాత్రుడైనాడు. ఒకరాత్రి రహస్యంగా మహానందుణ్ణి, సునందాదేవి ఇద్దరు కుమారుల్ని సంహరించి, మహాపద్మనందుడనే పేరుతో సింహాసనమెక్కాడు మహాపద్ముడు. తరువాత సునందాదేవిని పట్టమహిషిని చేసికొన్నాడు. వారి సంతానమే నవనందులు. అందులో పెద్దవాడు సుకల్పనందుడు, చిన్నవాడు ధననందుడు. మౌర్యుడి ధైర్య సాహసాల్ని చూచి అతణ్ణి సైన్యాధిపతిని చేశాడు మహాపద్మనందుడు. తన కుమారులు మనుమలు నూర్గురితో మౌర్యుడు రాజును సేవిస్తున్నాడు. ఇంతలో రాజు మరణించటం, నవనందులు రాజ్యానికి రావటం జరిగింది. నందులు మౌర్యుడి పలుకుబడికి అసూయపడి వందమంది మౌర్యుల్ని ఒక నేలమాళిగలో ఒక్కరోజుకు సరిపడే ఆహారముంచి బంధించారు. ఈ పన్నాగం తమను చంపటానికేనని గ్రహించిన మౌర్యుడు, అందరికంటె చిన్నవాడు, మేధావి, శౌర్యవంతుడైన మనుమడు చంద్రగుప్తుణ్ణి, బ్రతికుండి నందులపై పగ దీర్చమని ఆదేశించి, అందరితో ప్రాణత్యాగం చేశాడు. అందరి ఆహారం తానేతింటూ దాంట్లో పడి ఉన్నాడు చంద్రగుప్తుడు. ఈ లోపల సింహళం నుంచి ఒక సింహం ఉన్న బోనుతో కొందరు వచ్చి తలుపులు తీయకుండా సింహాన్ని బయటికి తీసే మొనగాడెవడన్నా ఉన్నాడా అని సవాలు చేశారు. అప్పుడు నందులకు బాలమేధావి చంద్రగుప్తుడు గుర్తుకువచ్చాడు. నేలమాళిగ తలుపులు తీసి చంద్రగుప్తుడొకడే బ్రతికి ఉండటం చూసి అతడ్ని తీసికొనిపోయారు. ఆ సింహం కదలికలు ఒకే రకంగా ఉండటం చూచి అది లక్కబొమ్మని గ్రహించి, బాగా కాల్చిన ఇనుపకడ్డీని ఆ సింహంపై ఉంచాడు చంద్రగుప్తుడు. అది కరిగి బయటికి ప్రవహించింది. నందులు ఆ బాలుడివల్ల ప్రమాదం లేదని భావించి ఆదరించారు. ధర్మ శాలాధికారిగా ఉన్న ఆ చంద్రగుప్తుడే ఇప్పటి చాణక్య మిత్రుడు.

రాక్షస మంత్రి చారులు చాణుక్యుణ్ణి, చంద్రగుప్తుణ్ణి బంధించటానికి శతవిధాల ప్రయత్నిస్తుంటే తప్పించుకొని వారు హస్తినాపురం చేరారు.

ఒక ప్రక్క అలెగ్జాండరు ఆంభి తోడ్పాటుతో, పర్వతకుడి రాజ్యాన్ని, పుష్కలావతిని, కుశధ్వజాన్ని, వైశాలిని జయించి సింధూ తీరం దాకా ఆక్రమించాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ ప్రాంతాలన్నీ జయించిన అలెగ్జాండరు తక్షశిల విశ్వవిద్యాలయాన్ని, అక్కడి ఆచార్యుల్ని, విద్యార్థుల్ని చూచి ఆశ్చర్యపోయాడు. వేద, జ్యోతిష, గణిత, వైద్య శాస్త్రాల అధ్యయనం అక్కడ జరిగేది.

విపాశానదీ తీరం దాకా జయించిన అలెగ్జాండరు ముందుకు సాగలేక పోయాడు. గంగా, యమునలు దాటి మగధ దేశాన్ని జయించే ధైర్యం యవనులకు లేకపోయింది. అలెగ్జాండరు తిరుగు ముఖం పట్టి పర్వతకుని రాజధాని వృషపాలంలో విడిది చేశాడు. అక్కడికి చాణుక్య, చంద్రగుప్తులు వెళ్ళి మగధను గెలవటానికి సహకరించమని అలెగ్జాండరును కోరారు. చంద్రగుప్తుడు తన చక్రవర్తిత్వాన్ని అంగీకరించి సామంతుడైతే సహాయం చేస్తానన్నాడు యవన ప్రభువు. చంద్రగుప్తుడు నిరాకరించాడు. మాటా మాటా పెరిగింది. అలెగ్జాండరు చంద్రగుప్తుణ్ణి బంధించి చెరలో వేశాడు. పర్వతకుని భార్య స్వర్ణమయి. ఆమె మేనకోడలు శాంతవతి. ఈమె రహస్య మార్గం ద్వారా చంద్రగుప్తుణ్ణి చెరనుండి తప్పించింది. శాంతవతి సింహపురాధీశుని ఏకైక సంతానం. ఆమె ప్రేమలో పడ్డ చంద్రగుప్తుడు శాంతవతిని వివాహం చేసికొని సింహపురానికి ప్రభువైనాడు.

అలెగ్జాండరు భారతదేశం వదలి వెళ్ళగానే చంద్రగుప్తుడు యవన ప్రతినిధుల్ని సంహరించి కొన్ని రాజ్యాలు ఆక్రమించాడు. క్రీ.పూ. 321వ సంవత్సరం సెప్టెంబరులో చంద్రగుప్తుడు, కామరూప, కళింగ, కిరాతక సేనలు బాసటగా నిలువగా మగధను ముట్టడించాడు. నంద సైన్యాధిపతి భద్రశాలుడు అసమర్థుడు, గర్వి. సైన్యంలో అతనికి వ్యతిరేకత ఉన్నది. రాక్షస మంత్రి మాట పెడచెవిన బెట్టి సైన్యాన్ని అంతా పాటలీపుత్ర రక్షణకే ఉంచి ఎవరి దుర్గాల్ని వారే రక్షించుకోమని దుర్గాధిపతులకు కబురు పంపారు నందులు. అల్ప సైన్యం గల దుర్గాధీసులు కొందరు భయంచేత, మరికొందరు భక్తి చేత చంద్రగుప్తుడికి లొంగిపోయారు. ప్రజలను బాధించరాదని సైనికుల్ని చంద్రగుప్తుడు శాసించాడు. లొంగిన దుర్గాధిపతుల్ని గౌరవించాడు. ప్రజలందరు చంద్రగుప్తుడికి స్వాగతం పలికారు. మగధను ముట్టడించిన చంద్రగుప్తుడి సేనలు నందులను సంహరించి కోటను సులభంగా వశం చేసుకున్నవి. రాక్షస మంత్రి కోట వదలి వెళ్ళిపోయాడు. చాణుక్యుడి తంత్రం వల్ల రాక్షస మంత్రి ప్రయోగించిన విషకన్య నుండి చంద్రగుప్తుడు రక్షింప బడ్డాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాక్షసుడు భార్యాపిల్లల్ని చందనదాసు అనే మిత్రుడి ఇంట్లో ఉంచి, పర్వతకుని కుమారుడు మలయకేతువు నాశ్రయించి చంద్రగుప్తుణ్ణి, చాణుక్యుణ్ణి సాధించాలని ప్రయత్నించాడు. చాణుక్యుడి తంత్రం వల్ల అవేమీ కుదరలేదు. రాజద్రోహం నేరం క్రింద చందనదాసును బంధించి కొరత వేయండని ఆజ్ఞాపించాడు చాణుక్యుడు. మిత్రుడి ప్రాణాలు రక్షించటానికి బయట పడ్డాడు రాక్షసుడు. చాణుక్య, చంద్రగుప్తులు అతణ్ణి ఆదరించి మగధ రాజ్యానికి మంత్రిగా ఉండమని కోరారు. అతడు చంద్రగుప్తుడి పరాక్రమానికి, వినయానికి సంతోషించి ఒప్పుకున్నాడు. మహామేధావైన శత్రువును మిత్రుడిగా, మంత్రిగా మార్చిన ఘనత చాణుక్యుడికి దక్కింది.

చాణుక్యుడు ఆర్ష ధర్మ సంస్థాపన కోసం దిగ్విజయం చేయమని చంద్రగుప్తుణ్ణి కోరాడు. పశ్చిమదిక్కుగా విజయయాత్ర సాగింది. రాజులందరు సంధి చేసుకొని సామంతులైనారు. కాశ్మీరం దాకా ఆయన రాజ్యంలో కలిసి పోయింది. మాళవ సౌరాష్ట్రపతులు ఆప్తవర్గంలో చేరిపోయారు. అంభి చంద్రగుప్తుడికి లొంగకుండా ఆత్మహత్య చేసికొన్నాడు. ఉజ్జయినీ ప్రభువు వత్సరాజు తన కుమార్తె దుర్ధరాదేవిని చంద్రగుప్తుడికిచ్చి వివాహంచేసి బంధువర్గంలో చేరిపోయాడు. ఆంధ్ర సార్వభౌముడు సత్యశ్రీ శాతకర్ణి మగధ సార్వభౌముడు చంద్రగుప్తుణ్ణి ఉజ్జయినీలో కలిశాడు. ఇద్దరు పరస్పర స్నేహ సహకారాలతో ఆర్ష ధర్మాన్ని రక్షించటానికి ప్రతిన బూనారు. తిరిగి రాజధాని చేరుకున్నారు చాణుక్య చంద్రగుప్తులు.

అలెగ్జాండరు సేనాని సెల్యూకస్‌కు చంద్రగుప్తుని విజయ వార్తలు తెలిసినవి. తన ప్రభువు జయించిన భారత భూభాగం చంద్రగుప్తుడి వశం కావటం సహించలేక భారతదేశంపై దండెత్తి వచ్చాడు. ఆయన వెంట ఆయన కుమార్తె కూడా వచ్చింది. మలయకేతువు మొదలైన రాజులతో రహస్య ఒప్పందం చేసికొన్నాడు సెల్యూకస్. వారు పైకి సరేనంటూ యుద్ధరంగంలో అతణ్ణి చక్రబంధంలో ఇరికించారు. ఇది చాణుక్యుడి మంత్రమే. చివరకు చేసేది లేక సెల్యూకస్ సంధి చేసుకొని తన కుమార్తెను చంద్రగుప్తుడికిచ్చి వివాహం చేసి వచ్చిన దారినే తిరుగు ముఖం పట్టాడు.

చంద్రగుప్తుడు ఆర్ష ధర్మానుసారం పరిపాలించాడు. అతని కుమారుడు బిందుసారుడి పట్టాభిషేకంతో ఈ నవల ముగిసింది. అయితే అలెగ్జాండరుతో ముడివేసి అందరు చెప్పుకొనే పురుషోత్తముడి కథ ఇందులో కనపడదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

-: వింతలు, విశేషాలు :-

అప్పటి భారతదేశంలో నూట పద్దెనిమిది దేశాలున్నవి. ఆ రోజుల్లో సింహళాన్ని నాగద్వీపం అనేవారు. ఇప్పటి ఒరిస్సా దశార్ణవ దేశంగా పిలువబడేది. అండమాన్ నికోబార్ దీవులలో దిగంబరులు, నరమాంస భక్షకులు ఉండేవారు. రబ్బరు చెట్లను అప్పటికే గుర్తించారు. సముద్రనాధశ్రేష్ఠి మలయానుండి రెండు రబ్బరు బంతుల్ని తెచ్చి చంద్రగుప్తుడికి బహూకరించాడు. కేరళలో ఉన్న బ్రాహ్మణులు శాకాహారులు. అక్కడి బ్రాహ్మణులు, క్షత్రియులు మొలకు మాత్రమే వస్త్రాలు ధరించేవారు. నీచ జాతులవారు మాత్రం తమ నీచ శరీరం అందరికి కనబడకూడదని శరీరం నిండా వస్త్రాలు ధరించేవారు. వైద్యులకు, జ్యోతిష్యులకు, పురోహితులకు రాచకార్యాలలో ప్రాముఖ్య ముండేది. పన్నులు అప్పుడే ఉన్నవి. భూమి పన్ను ముఖ్యం. విశాలమైన రహదారులు, వాటికి రెండు ప్రక్కల చెట్లు, అరక్రోసు కొకచోట దూరం తెలిపే కొలత రాళ్ళు ఉండేవి. దొంగతనం లేదు. శిక్షలు తీవ్రంగా ఉండేవి. కొన్ని నేరాలకు జీవితాంతం చెరువులు త్రవ్వటమో, రోడ్లు వేయటమో శిక్షగా విధించేవారు. అబద్ధపు సాక్ష్యానికి శిక్ష మరణమే. దొంగతనం చేస్తే చేతులు నరికేవారు. మద్యపానం చేసినా, స్త్రీలను బలాత్కరించినా ముఖం మీద కాల్చి ముద్రలు వేసేవారు. కొన్ని నేరాలకు రాళ్ళతో కొట్టి చంపే శిక్ష విధించేవారు.

కవులను, కళాకారులను రాజులు పోషించారు. చంద్రగుప్తుడి కాలం వాడే భాసుడు. ఆయన నాటకాల్ని దేశంలో చాలా చోట్ల ప్రదర్శించేవారు. చంద్రగుప్తుడు ఆయన్ని, ఒక అగ్రహారమిచ్చి సత్కరించాడు. చాణుక్యుడి అర్ధశాస్త్రం రాజకీయాలకు, ఆర్ధిక విషయాలకు, పరిపాలనకు ప్రమాణ గ్రంథంగా ఉండేదీ. అర్ధశాస్త్ర ప్రతులు అన్ని ప్రాంతాలలో ఉన్నవి. గ్రీకు రాయబారి మెగస్థనీసు చంద్రగుప్తుడి ఆస్థానానికొచ్చి ఈ విషయాలన్నీ తెలుసుకున్నాడు.

మనం నమ్మలేని ఆనాటి నిజాలు కొన్ని ఈ నవలలో ఉన్నవి. కాత్యాయనుడనే చంద్రగుప్తుడి మంత్రి మెగస్థనీసుతో అలాంటి వెన్నో చెప్పాడు. నాటి భారతదేశంలో అరుదుగా కనిపించే తెల్ల ఏనుగులు, రెక్కల పాములు, పశువుల్ని కూడా అవలీలగా మింగే తేళ్ళు ఉండేవట. బంగారు గనులు తొలిచే నక్కలంత పరిమాణంలో ఉండే చీమలుండేవి. బంగారం ఎత్తుక పోతారనే భయంతో ఆ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సౌరంగాల దగ్గరికి ఎవర్నీ రానిచ్చేవి కావట. "నా బంగారు బొక్కలో వేలు పెడితే కుట్టనూ" అన్న చీమ సామెత అందుకే పుట్టిందేమో! ఏనుగు దంతాలల్లో మంచి ముత్యాలు దొరికేవట. సముద్రంలో బ్రహ్మాండమైన తాబేళ్లుండేవట. వాటి చిప్పల్లో నూరు కడవల నీళ్ళు పట్టేవట. హిమాలయాల్లో ఇరవై ఏడు అంగుళాల కిరాతులనే మనుష్యులు ఉండేవారట. వాళ్ళకు ముక్కులుండవు. ప్రక్క వేసుకొని పడుకోవటానికి చాలినంత పెద్ద చెవులుండేవట. ఒంటికంటి మానవులు, మడిమలు ముందుకు, పాదాలు వెనక్కు తిరిగి ఉన్నవారు ఉండేవారట. ఇలా ఎన్నో ఆ కాలపు వింతలు ఈ నవలలో వివరింపబడ్డవి.

ఆనాటి సాంఘిక ఆచారాల్ని కూడా ఈ నవల ద్వారా మనం గ్రహించవచ్చు. తక్షశిలా ప్రాంతంలో పెండ్లికి పూర్వమే వరులు వధువులతో శృంగార చేష్టలు చేయటం ఒక పరీక్షగా ఉండేది. హిదుకుష పర్వత ప్రాంతంలో కొన్ని జాతులవారు చచ్చిన పితరుల శరీరాలు తినేవారట. ఇది వింటుంటే పాండురాజు మరణిస్తూ జీవం పోయిన తరువాత తన శరీరం తినమని కొడుకులకు చెప్పాడని, మిగిలినవారు దానికి అసహ్యించుకోగా సహదేవుడు మాత్రం తిన్నాడని, అందువల్లే అతడు త్రికాలజ్ఞుడైనాడనే ఒక పుక్కిటి పురాణకథ నాకు గుర్తుకు వస్తున్నది.

జంతుబలులు విశేషంగా జరిగేవి. జంతువుల నవరంధ్రాలు మూసి చంపేవారు. వికలాంగమైన పశువు దేవతలకు ప్రీతి కాదని వారి అభిప్రాయం. రాజులు అనేక శయన మందిరాల్ని భద్రతా దృష్టితో ఉపయోగించేవారు. ఏ రోజు ఏ శయన మందిరంలో రాజు నిద్రిస్తాడో ఎవరికీ తెలియదు. క్రయ విక్రయాలలో ఏదోవంతు పన్ను ఉండేది. అప్పటి వ్యవహారిక సంవత్సరం, శ్రావణ మాసం నుండి ఆషాఢమాసం దాకా ఉండేది. సంవత్సరానికి 354. రోజులు ఏనుగులకు తగిలిన గాయాలకు వేడినీళ్ళతో కాపు పెట్టి వెన్న వ్రాసేవారు. పెద్ద పుండ్లు పడితే ఔషధంగా అప్పుడే చంపిన పంది నెత్తురు, మాంసం వేసి కట్టుగట్టేవారు. వాటి కండ్ల వ్యాధులు నివారించటానికి ఆవు పాలను కండ్లలో పోసేవారు. చెరకుపంట, చక్కెర అప్పటికే మనదేశంలో ఉన్నవి. వృద్ధాప్యాన్ని నివారించటానికి ఔషధాలుండేవి. అలాటి వాటిని చంద్రగుప్తుడు సెల్యాకస్‌కు బహూకరించాడు. అప్పటి

35)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రజలకు నదులకు ఆనకట్టలు కట్టే నేర్పు కూడా ఉన్నది. మగధలో కరువు వచ్చి నప్పుడు శోణానదికి అడ్డంగా సేతువు నిర్మింపజేశాడు చంద్రగుప్తుడు.

ఈ నవలలో గ్రీకు నామాల్ని వేంకటేశ్వరరావుగారు సంస్కృతీకరించారు. అలెగ్జాండరు-అలీసాందరుగా, సెల్యూకస్-శల్యకేశ్వరుడుగా, ఒలంపస్-అలింపాళగా, హెరుక్యులస్-హరకులేశుడుగా, మిడాస్-మయదాసుగా, మెగస్థనీసు-మేఘస్థానుడుగా, మారిపోయారు. ఇలా మారిస్తే ఉచ్చారణ సౌలభ్యం మాట అటుంచి విదేశ వాతావరణం పోయింది. ఈ నవల వల్ల వినోదం కంటే విజ్ఞానమే ఎక్కువ లభిస్తుంది. కాటూరివారి రచన సరళ గ్రాంథికంలో మనోహరంగా సాగింది.

5. ఆంగ్లానువాదములు - నాటికలు

ఎ.యస్.పి. అయ్యరు ఆంగ్లంలో వ్రాసిన మూడు నాటికలను కాటూరివారు "సీత పెండ్లి", "ధర్మపథము", "భావబంధనము" అనే పేర్లతో తెలుగులోకి అనువదించారు. దీన్ని వావిళ్ళవారు 1938లో ప్రకటించారు. అప్పుడు కాటూరి వారు ఆంధ్ర జాతీయ కళాశాల బందరులో ఆంధ్రోపన్యాసకులుగా పని చేస్తున్నారు. ఈ మూడు నాటికల్లో మరుగుపడుతున్న పాత సంప్రదాయాల్ని, చిగురిస్తున్న సంస్కరణల్ని మనం చూడవచ్చు. సీత పెండ్లిలో బాల వితంతువుల పునర్వివాహ సమస్యను చిత్రించి దానికి పరిష్కారం కూడా చూపారు. ధర్మపథం నాటికలో దైవభక్తి, సత్యాహింసల గొప్పదనం వివరించబడింది. భావబంధనంలో స్వేచ్ఛ పేరుతో స్త్రీలు అతిగా ప్రవర్తించటం వల్ల వచ్చే కష్టనష్టాలు, దాన్ని పరపురుషులు దుర్వినియోగం చేసే తీరు వివరించబడింది.

సీత పెండ్లి

శ్రీనివాసులు ఒక షాపు గుమాస్తా. అతని భార్య మంగళ. సీత ఆ దంపతుల కూతురు. వయస్సు పద్నాలుగేండ్లు. మంగళ తన కూతురుకు త్వరగా పెండ్లి చేయాలనే ఉద్దేశ్యంతో భర్తను లక్ష్యపెట్టకుండా ఒక సంబంధం ఖాయం చేసింది. పెండ్లి కొడుకు పేరు వెంకటప్పయ్య, క్షయరోగి. ఆ సంగతి మంగళకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తెలియదు. భర్త అతని అనారోగ్యం గురించి విన్నానని చెప్పినా ఆమె నమ్మలేదు. అయిదు వందల కట్నమిచ్చి పెండ్లి జరిపించారు. నెల తిరగకుండా ఆమె వితంతువయింది.

ఇక శ్రీనివాసులు వ్యసనపరుడు. పరస్త్రీ వ్యామోహం కలవాడు. తాను పనిచేసే రత్నయ్యను మోసం చేసి తప్పుడు లెక్కలు వ్రాసి డబ్బు తిన్నాడు. అది బయట పడింది. ఆ బాకీ క్రింద ఇల్లు కట్టాడు. ఆ ఇల్లైనా శ్రీనివాసులు ప్రయోజకుడై సంపాదించినది కాదు. మంగళే పాలూ పెరుగు అమ్మి, కష్టపడి చాకిరిచేసి కొనుక్కున్నది. ఇల్లు ససేమిరా స్వాధీనం చేయనని మంగళ మొండిపట్టుపట్టింది. చేతయితే కోర్టుకు పొమ్మన్నది. చివరకు మూడేళ్ళు, అద్దె యిచ్చే షరతుమీద ఆ ఇంట్లో ఉండేటట్లు, ఆ లోపల బాకీ తీర్చకపోతే ఇల్లు వదులుకొనేట్లు రత్నయ్యతో ఒప్పందానికి వచ్చారు.

మంగళ సుదీర్ఘంగా ఆలోచించింది. పనికిరాని పరువుకుపోతే మాడి చావవలసి వస్తుందని భర్తకు వివరించింది. ఆమె పాల వ్యాపారం, అతడు కూరగాయల వ్యాపారం ప్రారంభించారు. బాకీలు తీరినవి. శ్రీనివాసులు అల్లుడు రాజగోపాలం. అతడు సీతకు రెండో పెండ్లి చేయమని ఆ దంపతులకు నచ్చచెప్పాడు. మొదట్లో శ్రీనివాసులు అంగీకరించలేదు గాని కూతురు స్థితి చూచి మనస్సు మార్చుకున్నాడు. అచ్యుతం పర్షియాలో ఒక నూనె కంపెనీలో పని చేస్తున్న ఆంధ్రుడు. అతడు సీతను చేసుకుంటానికి ఇష్టపడ్డాడు. అచ్యుతం, సీతల వివాహం జరిగింది. ఆమె అచ్యుతంతో విదేశాలకు వెళ్ళింది. దీన్ని భగవంతుడి కటాక్షంగా భావించి వారు చేసిన ప్రార్థనతో నాటకం ముగిసింది.

ఈ నాటికలో స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి సాంఘిక, పునరుజ్జీవన విశేషాలు మనం చూడవచ్చు. ఈ నాటికలో, వ్యసనపరుడై, స్త్రీ లోలుడై సంసారాన్ని గుల్ల చేసుకొని, తన వ్యసనాల కంటే స్త్రీ పునర్వివాహం ఘోరమని భావించే శ్రీనివాసులు, కట్నాల బాధకు తట్టుకోలేక వయస్సు మీరిన వాళ్ళకిచ్చి పెండ్లిచేయటం వల్ల దురదృష్టంలో త్రోయబడ్డ సీతలాంటి బాల వితంతువు, ఆనాటి సామాజిక పరిస్థితికి అద్దం పడతారు. సంసారం కష్టాలల్లో చిక్కుకోగా శ్రమ జీవనాన్ని భర్తకు బోధించి, తానూ ఆచరించి కష్టాలల్లోంచి కుటుంబాన్ని గట్టెక్కించిన మంగళ పాత్ర, అప్పుడే సమాజంలో ముందడుగు వేస్తున్న స్త్రీలకు ప్రతీక. రాజగోపాలం, సీతకు రెండో పెండ్లి చేయటానికి కృషి చేయటం, అచ్యుతం ఆమెను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వివాహం చేసుకోవటం, ఆనాటి యువకుల్లోగల సంస్కరణాభిలాషను సూచిస్తున్నది. ఈ నాటికను అనువదించటంలో కాటూరివారి సంఘ సంస్కరణ దృష్టి మనం గమనించవచ్చు.

లాక్షణిక దృష్టితో చూస్తే ఆరు అంకాలున్నవి, కాబట్టి దీన్ని నాటక మనాలి. అయితే నాంది ప్రస్తావనలు లేవు. చివరలో మాత్రం ఈ గేయమున్నది.

"నిదురింపగా మేము నిర్నిద్రుదై నీవు
జాలిపై మా దుఃఖజాలము హరించేవు
కటిక చీకటు లలము కాళరాత్రుల నీవు
విజ్ఞాన కళికాళి వెలిగించెదవు తండ్రి........ నిదురింపగా ...."

ఇది భరత వాక్యం లాంటిది. మిగిలిన నాటక లక్షణాలన్నీ దీంట్లో వెదకటం నిష్ప్రయోజనం.

ధ ర్మ ప ధ ము

ఇది ఏకాంకిక. దీంట్లో కథ తక్కువ, ధార్మికమైన చర్చ ఎక్కువ. ఆధునికులకు దైవంపై విశ్వాసం సన్నగిల్లటం ఈ నాటికలో మనకు కనిపిస్తుంది.

రంగరాజు ఒక బారిస్టరు. ఆయన భార్య సుభద్ర. తల్లి నాగమ్మ, కూతురు మంగమ్మ, కొడుకు సూరయ్య. నాగమ్మకు దైవభక్తి ఎక్కువ. వెనుకటి కాలం మనిషి. సుభద్రకు ఇవేమీ గిట్టవు. ఆమెకు క్లబ్బులు, షికార్లు, అధునాతనమైన వేషభాషలపైన మక్కువ ఎక్కువ. మద్య, మాంసాలయందు కోరిక అధికం. తల్లి కుమారుడికి ఆధ్యాత్మిక విషయాలపైన ఆసక్తి కలిగించాలని ఆనందస్వామి అనే సన్యాసిని ఇంటికి ఆహ్వానించింది. రంగరాజు, రామకృష్ణ వివేకానందుల గ్రంథాలు చదివినప్పుడు కలిగిన సందేహాల్ని స్వామీజీ వల్ల నివృత్తి చేసుకున్నాడు.

దేవాలయాల ప్రశస్తిని, విగ్రహారాధన అవసరాన్ని ఆనందస్వామి రంగరాజుకు ఉపదేశించాడు. పూర్వం సమాజంలోని వర్ణ వ్యవస్థ, సమాజ శ్రేయస్సు కోసం ఎలా పని చేసిందో కూడా, స్వామి వివరించారు. రాధాకృష్ణుల సంబంధాన్ని గురించి రంగరాజు ఆ యోగిని అడిగాడు. వారిద్దరిది జీవాత్మ, పరమాత్మల సంబంధం అన్నాడు యోగి. ఆనందస్వామితో జరిగిన సంభాషణ వల్ల రంగరాజులో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మార్పు వచ్చింది. సత్యాహింసలపైన, తీర్థయాత్రల పైన ఆసక్తి కలిగింది. మధు మాంస సేవనం మాని ప్రశాంత సాత్వికజీవనాన్ని గడపాలని భావించాడు. మొదట్లో భార్య ప్రభావంవల్ల ఆధ్యాత్మిక విషయాలలో అనాసక్తి ఉన్నా, ఆనందస్వామి పరిచయంతో అతడు సంప్రదాయపు గాడిలో పడిపోయాడు.

భా వ బం ధ న ము

ఈ నాటకం "ధర్మ పథము" నాటికకు అనుబంధమే. ఒకే వ్యక్తులకు సంబంధించినవే రెండు కథలు. కాకపోతే ఈ నాటకంలో తిమ్మరాజు పాత్ర క్రొత్తగా ప్రవేశించింది. రెండు రూపకాల కథకు వ్యవధానం కూడా లేదు. ధర్మపథంలో రంగరాజుకు ఆధ్యాత్మిక విషయాలు ఆనందస్వామి బోధించాడు. ఆనందస్వామి గురువు బ్రహ్మానందయోగి. రంగరాజు ఆయన దగ్గర కూడా కొన్ని విషయాలు తెలుసుకున్నట్లు "ధర్మపథము" రూపకాన్ని బట్టి మనకు తెలుస్తుంది. ఈ నాటకం ప్రారంభంలో సుభద్ర భర్త రంగరాజుతో "క్రిందటి వారం ఆనంద స్వామిని సందర్శించింది మొదలు........" అని సంభాషణను ప్రారంభిస్తుంది. అంటే ఈ రెండు రూపకాల కథకు వ్యవధానం ఒకవారమన్నమాట.

ఈ నాటకంలో ఏడంకాలున్నట్లు శీర్షికలు తెలుపుతున్నవి. కానీ చిత్రంగా ఒకటవ అంకం తరవాత నాల్గవ అంకం ఉన్నది. రెండు, మూడు అంకాలేమైనవో తెలియదు. రంగరాజు తీర్థయాత్రలను చేసే సంకల్పం భార్యకు చెప్పటం, ఆమె ఇవన్నీ మూఢాచారాలని నిరసించటం, రంగరాజొక్కడే చివరకు తీర్థయాత్రలకు బయలుదేరటం, ప్రథమాంకంలో కథ. రంగరాజు ప్రయాణ సన్నాహాలతో ఈ అంకం ముగుస్తుంది. ఇక నాల్గవ అంకం ప్రయాణం నుండి తిరిగివచ్చిన రంగరాజు తన యాత్రానుభవాలు భార్యతో చెప్పటంతో ప్రారంభమౌతుంది. మధ్యలో కథ జారిపోయినట్లు కనబడదు. వావిళ్ళవారు అంకాలకు వరుస నెంబర్లు తప్పు వేసేపని చెయ్యరు. మరి రెండు, మూడంకాలు ఏమైనవి?

అయ్యరు గారి రచనల్లో ఆర్ష ధర్మం పట్ల అనురక్తి, ఆధునిక సంస్కరణల పట్ల ఆసక్తి రెండూ కనబడుతవి. ఈ దృష్టితో పరిశీలిస్తే మూడవ అంకంలో రంగరాజు బ్రహ్మానందస్వామితో మాట్లాడిన వేదాంతవిషయాలు ఉండి ఉండవచ్చని పిస్తుంది. ప్రథమాంకంలో రంగరాజు భార్యతో "రేపు నేను ఆవడికి వెళ్ళి బ్రహ్మా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నంద యోగి దర్శనము చేయవలెను" అంటాడు. అయితే ఆ యోగిని దర్శించిన కథాంశం తరువాత నాటకంలో లేదు. "ధర్మపథము" అంతా వేదాంత చర్చే కాబట్టి ఈ అంకం చర్విత చరణమై పాఠకులకు విసుగు కలిగిస్తుందనే భావంతో ఈ అం కాన్ని ఎత్తివేసి ఉంటారు. అలానే మూడవ అంకంలో రంగరాజు తీర్థయాత్రలకు సంబంధించిన విశేషాలు ఉండి ఉండవచ్చు. ప్రయాణ మార్గాలు, మజిలీలు వగైరా లకు సంబంధించిన విషయాలు అంత ఆసక్తికరంగా ఉండవు కాబట్టి, ఆ అంకం కూడా ఎత్తివేసి ఉండవచ్చు. అయితే ఆ అంకాలు అసలు ఉన్నట్లు గుర్తుగా నెంబర్లు వేసేటప్పుడు మాత్రం ఒకటి తరువాత నాలుగు వేసి ఉంటారు. ఇదీ వావిళ్ళ వారు చేశారో, అనువాదకులు కాటూరి వారు చేశారో చెప్పటం కష్టం. మొత్తానికి ఇది ఏడు అంకాల నాటకం. నాయకుడు, నాయిక కాక ప్రతినాయకుడు కూడా ఉన్నాడు.

ప్రతినాయకుడు అనటం కంటే తిమ్మరాజును విలన్ అంటేనే బాగుంటుంది. ఇతడు రిటైర్డు మిలటరీ ఉద్యోగి, మధు మాంస మిత్రుడు, రంగరాజుకు దాయాదీ, భూస్వామి, రంగరాజులో ఆధ్యాత్మిక ధోరణి ప్రారంభం కావటం, సుభద్రకదీ నచ్చక పోవటం, తిమ్మరాజుకు పండుగయింది. ప్రాచీనమయిన ఆచారాల్ని మూఢనమ్మకా లంటూ అతడెప్పుడూ నిరసించేవాడు. సుభద్ర ఆధునిక భావాలని ప్రశంసించేవాడు రంగరాజు సన్యాసుల్లో కలిసిపోతున్నాడని మొసలి కన్నీరు కార్చేవాడు. ఇతని మాటల్లోపడే అమాయకురాలు సుభద్ర, భర్తవెంట యాత్రలకు పోవడానికి తిరస్క రించి ఇంట్లోనే ఉండిపోయింది.

తిమ్మరాజుకు మంచి అవకాశం దొరికింది. అతడు మాటకారి, యుద్ధంలో తన ప్రతాపం గురించి కథలు కథలుగా చెప్పేవాడు. క్షత్రియుడైన ఆమె భర్త మాంసం తినటం, మద్యం త్రాగటం వదిలిపెట్టటంపై, విచిత్రమైన విమర్శలు చేసే వాడు. అది పౌరుష హీనమైన చర్యగా చిత్రించేవాడు. అమాయకురాలైన సుభద్ర తన భర్త దేవుడు, దయ్యము, ఉపవాసాలంటూ ప్రవర్తించటం, ఏదో లోపంగా అవమానంగా భావించింది. ముందునుంచే క్లబ్బులకు తిరగటం, పదిమంది పురు షులతో చనువుగా మాట్లాడటం ఆమెకు అలవాటే. రంగరాజు కూడా ఆధునికత పేరుతో దాన్ని అనుమతించాడు. భర్త ఇంటలేక పోవటంతో కాలక్షేపానికి ఆమె తిమ్మరాజింటికి తరచుగా వెళుతుండేది. స్త్రీలకి స్వాతంత్ర్యం కావాలనే సుభద్ర కోరికకు తిమ్మరాజు అభ్యుదయ భావాల ఉపన్యాసాలు కూడా తోడైనవి. తిమ్మరాజు భార్య, రంగరాజు భార్య అన్నదమ్ముల పిల్లలు కావటం కూడ, తిమ్మరాజింటికి ఆమె

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాకపోకలకి దోహదం చేసింది. వంటింట్లోకి కుందేలొస్తున్నదని తిమ్మరాజు ఉవ్విళ్ళూరు తున్నాడు. పాపం ఆమె మాత్రం ఆ విషయం గమనించలేదు. ఎంతసేపటికీ ఆధునిక వ్యామోహమే ఆమెను పట్టి పీడిస్తున్నది. సుభద్ర దురదృష్టం ఒక రోజు కళ్ళు తెరిచింది. ఆమె, తిమ్మరాజు మాంసాహారం కడుపునిండా ఆరగించారు మద్యపానం కూడా మొదలుపెట్టారు. సుభద్ర దృష్టిలో ఇదంతా ఆధునికత-"సోషల్ బిహేవియర్" తిమ్మరాజు మనసులోని దుష్టభావం ఆమె పసిగట్టలేదు - కావాలని ఆమెను వాడు తప్ప త్రాగించాడు. ఒళ్ళు తెలియని స్థితిలో, ఆమె పవిత్ర జీవనానికి చరమగీతం ఆలపించాడు. సుభద్ర మళ్ళీ తిమ్మరాజు గుమ్మం త్రొక్కలేదు.

సుభద్ర పశ్చాత్తాపంతో కృంగి పోయింది. అయినా చేతులు కాలిన తరువాత ఆకుల ప్రయోజనం ఏముంటుంది. రంగరాజు తిరిగివచ్చిననాడే ఏమీ తెలియనట్లు తిమ్మరాజు అతణ్ణి పరామర్శించటానికి వచ్చాడు. అప్పటిదాకా తిమ్మరాజంటే గౌరవం చూపిస్తున్న సుభద్ర అతణ్ణి అసహ్యించుకోవటం, ఎదురుగా లేకుండా వెళ్ళి పోవడంతో రంగరాజుకు అనుమానం వచ్చింది. ఆమెను నిగ్గదీసాడు. ఆమె యదార్థం చెప్పి క్షమించమని వేడుకున్నది. రంగరాజు చాలా బాధపడ్డాడు. క్షత్రియ ధర్మ ప్రకారం ఆమె చేసిన దానికి వెంటనే నరికివేసే వాణ్ణని, తన గురువు పశ్చాత్తాప పడిన వారిని క్షమించమనటం వల్ల, నేనిక తప్పు చేయనని ఆమె కృష్ణ భగవానునిపై ప్రతిజ్ఞ చేసి చెప్పటం వల్ల వదలి పెడుతున్నానని వాపోయాడు.

మరుసటి రోజు తెల్లవారుజామున పూజా మందిరంలోకి రంగరాజు భార్యను పిలిచాడు. "పాల పాత్రను చేత్తో పట్టుకొని, చేసిన తప్పు స్వామి ఎదుట అంగీకరించు, నిన్ను విడిచిపెడతాను. ఇక నీతో సంసార సంబంధం ఉండదు" అని గంభీరంగా చెప్పాడు. ఆమె "నాకు బ్రతకాలని లేదు. క్షమిస్తే పూర్వం లాగా మీ సాహచర్యాన్ని అంగీకరించండి. లేకపోతే చంపివేయండి." అన్నది. "నీ వంటి పతితురాలితో నాకు సంబంధమెట్లు ?" - "మీరు లండన్‌లో నున్న రోజులలో ఆ సామాన్య కాంతలతోనేమి చేసితిరో జ్ఞప్తికి తెచ్చుకొనుడు. ఆయపరాధమును మీరు నాతో చెప్పినపుడు నేనది మనః పూర్వకముగా సహించి, ఇన్నాళ్ళు మీతో కాపురము చేయుచున్న సంగతి స్మరింపుడు .... తప్పు ఎవరికైనను వచ్చును ...." అన్నది ఆమె.

రంగరాజుకు ఆవేశం వచ్చింది. మాటా మాటా పెరిగింది. భార్యను హత్య చేశాడు. తనకు తానే పోలీసులకు లొంగిపోయాడు. మరణశిక్ష పడింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ నాటకం మనకెన్నో సామాజిక సత్యాలు చెబుతున్నది. సమాజం మారినట్లు కనబడుతుంది, నిజంగా పూర్తిగా మారదు. పురుషులు స్టేజీల మీద స్త్రీలకు స్వేచ్ఛ కావాలని ఉపన్యాసాలు చెబుతారు. స్వవిషయం దగ్గరకు వస్తే సంశయమే. స్త్రీ స్వాతంత్ర్యం గురించి చెప్పేవన్నీ కథలు - కాకరకాయలే. కొం: మంది నాగరికత పేరుతో గొప్ప సంస్కారవాదులమని ఫోజుపెట్టి, మా భార్యలకు మేమెంతో స్వేచ్ఛ నిచ్చామంటూ వారిని వెంటవేసుకొని తిరుగుతుంటారు. వారు క్లబ్బులకు పోవటాన్ని అనుమతిస్తారు. ఇదంతా గొప్పకోసమే. లోపల భార్యపైన వాళ్ళ కుండే అనుమానాలిన్నీ అన్నీ కావు. ఏదో సాకుతో నిత్యం కలహించుకుంటుంటారు. స్త్రీకి స్వేచ్ఛ ఇస్తున్నామని ప్రగల్భాలు పలికే పురుషులు ఏ బస్సులోనో తన భార్యకు పరాయి మొగవాడి చెయ్యితాకితే ఉగ్రుడై పోతాడు. "ఏమిటా పూసుకు రాసుకు నిలబడటం" అంటాడు. సంధికాలంలో భేషజాల వల్ల స్త్రీలు ఎలా నష్టపోతారో తెలియజేయటమే ఈ నాటక లక్ష్యం. ఇప్పటికి కూడా ఆ పరిస్థితి పూర్తిగా మారిందని నేననుకోను.

స్వాతంత్ర్యోద్యమంరోజుల్లో జైల్లోపడ్డ ప్రతివాడు దేశభక్తుడే. ఏ కారణంతో వాడు జైల్లో పడ్డాడో అందరికి తెలియదుగదా! విడుదలైన తర్వాత ఖద్దరు టోపీతో జనానికి టోపీ పెట్టిన మహానుభావులు లేరంటారా ?

దేశ స్వాతంత్ర్యం కోసం, స్త్రీ స్వేచ్ఛకోసం జైల్లోపడ్డవారికి మిగిలిన వారికి తేడా తెలిపే ఒక గేయాన్ని 7వ అంకం చివర మనం చూడవచ్చు.

"రాతి గోడలు గావు కారాగృహమ్ము
లినుపకటకటాలును బోను లనగరాదు
పాపరహితులౌ శాంతుల పాలిటి కవి
బంధములు గావు ; వరతపోవనులు గాని."

త్యాగమూర్తులకు జైళ్లు అలాంటివి. అవే పాపమతులకు నరకాలు అంటూ చక్కని సందేశాన్ని రచయిత అందించాడు. ఈ నాటిక ఎంతో లోతైన భావాలతో గొప్ప సందేశాన్నిస్తున్నది.

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

V. పూర్ణపురుషుడు కాటూరి

కాటూరి వారి జీవనయాత్ర, ఆపే మలుపులులేని రహదారిలో సాగింది. 15 అక్టోబరు 1895 నుండి 25 డిశంబరు 1962 దాకా సాగిన అరవై ఏడు సంవత్స రాల వారి జీవితం, సుదీర్ఘం కాకపోయినా, సుసంపన్నం. విభిన్నమైన అను భూతులకు, అనుభవాలకు, నిలయం. వేంకటేశ్వర్రావుగారు కవి - అధ్యాపకుడు - పత్రికా సంపాదకుడు - కాంగ్రెసు కార్యకర్త, గాంధేయవాది. ఒకరితో స్నేహమే గాని సంఘర్షణ వారెరుగరు. ఒకర్ని మాట అనటం పడటం రెండూలేవు. టి. వి. యం. అయ్యవారు చెప్పిన పద్యం వీరి వ్యక్తిత్వాన్ని సమగ్రంగా ప్రదర్శిస్తున్నది.

ఆకృతి నుదాత్త భావ
స్వీకృతి సంస్కారముద్ర వెల్గిన యతడు
ప్రాకృతుడు తెనుగు నుడి గుడి
నాకల్పము పసిడి గంటమై రవణించున్

(స్రవంతి - కాటూరి సంస్మరణ సంచిక - జూన్ 1963)

బందరు హైస్కూలులో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారి శిష్యరికంతో కాటూరి వారిలో మొలకెత్తిన కవితాభిమానం, లక్ష్మీకాంతంగారి సాంగత్యంతో చిగురించింది. 1917 ప్రాంతంలో బందరు బుట్టాయపేటలో ఉన్న సీతారామాంజనేయస్వామి దేవాలయంలో వీరిరువురు ఆంజనేయస్వామి ముందు కూర్చొని చెరొక పాదం చెబుతూ మారుతీ శతకాన్ని రచించారు. అదే వారి జంట కవిత్వానికి అంకురార్పణ. 1923లో వీరు రచించిన "తొలకరి" ప్రకటింపబడింది. 1932లో "సౌందరనందం" అచ్చు పడింది. ఈ కావ్యంతో "పింగళి కాటూరి" జంట కవులుగా ఆంధ్ర సాహి త్యంలో స్థిరమైన స్థానాన్ని ఆక్రమించారు. గురువులు చెళ్లపిళ్ల వారితో కలసి 1945లో ఆకాశవాణి సాహిత్య కార్యక్రమంలో పాల్గొనే అదృష్టం వీరికి దక్కింది.

కృష్ణాపత్రిక 1902 వ సం॥లో కొండా వేంకటప్పయ్యగారు, దాసు నారాయణరావుగార్ల సంయుక్త సంపాదకత్వంతో ప్రారంభమయినది. 1903 సం॥లో సహాయ సంపాదకులుగా ప్రవేశించి 1906 నాటికి ముట్నూరి కృష్ణారావుగారు కృష్ణా పత్రిక సంపాదకులైనారు. 1945 జూన్‌దాకా మరణించేంత వరకు ముట్నూరివారే కృష్ణా పత్రికకు సంపాదకులు. 1945 జులై నుండి 1953 అక్టోబరు 3 దాకా కాటూరివారు సంపాదకులు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరి వారు ముట్నూరి వారి దర్బారు కవి. కృష్ణారావుగారికి వేంకటేశ్వ రావుగారి మీద విశ్వాసం, అభిమానం రెండూ! అందుకే తన మరణానంతరం, కృష్ణాపత్రికకు కాటూరి వారిని సంపాదకులుగా నియమిస్తూ వీలునామా వ్రాశారు. తానొక్కడే కొంత కాలం, కోలవెన్ను రామకోటీశ్వరరావుగారితో కలసి కొంత కాలం, కమలాకర వేంకట్రావుగారితో కలసి కొన్ని సంవత్సరాలు, కాటూరివారు కృష్ణాపత్రిక సంపాదకత్వం నెరపారు. ఏదో రెండు మూడుతప్ప కాటూరివారి రచనలు చాలావరకు కృష్ణాపత్రికలో ప్రచురింపబడ్డవే. కాటూరివారి సంపాదకీయాలు కవితాధోరణిలో సాగే వచన రచనలు. అప్పుడప్పుడు ఆ సంపాదకీయాలు చంపూ కావ్యాలుకూడ. "మా గ్రామం", "రసమంజరి", "పన్నీటి జల్లు", "వడగళ్ల" మొదలైన శీర్షికలతో ఆనాడు కృష్ణాపత్రిక సర్వజన మనోభిరామంగా ఉండేది.

1918 నుండి సుమారు 1958 దాకా, కాటూరివారి రచనలు కృష్ణాపత్రికలో ప్రచురింపబడ్డవి. అప్పటికి, సంపాదకుడు కాకపోయినా 1935 డిశంబరు సంక్రాంతి సంచిక సంపాదకత్వ బాధ్యతను ముట్నూరివారు ప్రత్యేకంగా వేంకటేశ్వరరావు గారికి అప్పగించారు. కృష్ణాపత్రికతో అనుబంధం కాటూరివారి జీవనస్రవంతిలో ఒక భాగం.

కాటూరి వారు గుప్తదాతలు. వారు వరంగల్లు ఏదో ఉపన్యాసమివ్వటానికి వెళ్ళారు. అక్కడ చిలకమర్తి రామానుజాచార్యులుగారనే కవి కళ్యాణ రాఘవమనే తన కృతిని పరిశీలించమని ఇచ్చారు. దాన్ని బందరుతెచ్చి చదివి, లక్ష్మీకాంతంగారి చేత పీఠిక వ్రాయించి, ముద్రింపించి, త్రివేణి భావరాజు నరసింహారావుగారితో చెప్పి, పుస్తకాలు అమ్మి డబ్బు పంపే ఏర్పాటు చేశారు. ఇలా ఎన్ని చేశారో వివరించటం సాధ్యంకాదు.

వేంకటేశ్వరరావుగారిది ఋషి వాక్కు. భారత సాహిత్య ఎకాడమీ పక్షాన, కావ్యమాల అనే పద్యసంకలనాన్ని వీరు కూర్చారు. దాంట్లో ఆరుద్ర పద్యాలు వేస్తూ, ఆరుద్ర రచనల లిస్టులో "సినీవాలి" అనేది ఉన్నట్లు వ్రాశారు. నిజానికి అప్పటికి అలాటి కావ్యమేదీ ఆరుద్ర వ్రాయలేదు. కానీ ఆ పేరుపై మోజుతో తరువాత కావ్యం వ్రాసి కాటూరివారి చేతనే పీఠిక వ్రాయించారు. ఆ రకంగా పొరపాటున దొర్లినా, కాటూరివారి మాట సత్యమయింది. ఆ పీఠికలో వారు వ్రాసిన గేయం చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. అది ! నవ్య కవిత్వమా, విప్లవ కవిత్వమా అని భ్రాంతి కలిగించే వచన కవిత. మచ్చుకు రెండు పంక్తులు చూడండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"విరిగిన ఎముకల గూళ్లూ
తరిగిన చర్మపు డోళ్లూ
పాచిపట్టిన కాళ్లూ - వ్రేళ్లూ - గోళ్లూ
ఈచుకపోయిన వరిమళ్ల
నేటి బ్రతుకులు వట్టి కుళ్లూ, గవుళ్లూ
చేతికందని భోగాలకోసం
మూతి మీసాలపై తేనె కోసం
వల్ల కాళ్లలో బొల్లి గద్దల్లా
కుళ్ళిన కురుపులపై ఈగల్లా
కల్ల బొల్లి నక్కల్లా
ముళ్ళకంపపై కాకుల్లా
అల్లా! అల్లా
వీళ్ళతో ఎల్లా
కడుపునిండా తినలేరు కమ్మగా బతకలేరు
వడిగల జీవితపు నూలు వడకలేరు
మూర తక్కువా, కోరికెక్కువా
బారలు చాస్తారు, దూరం చూస్తారు
పరుగులు తీస్తారు
నురుగులు మేస్తారు – ఎందుకో"

అంటూ ఆధునిక జీవనంలోని వెగటును వర్ణించిన ఈ గేయాన్ని మామూలుగా వినిపిస్తే కాటూరి వారిదని ఎవరూ నమ్మరు. క్రొత్తదనంపై వారి కోరికకు ఇది నిదర్శనం. అయితే దీంట్లోకూడ మనుచరిత్రలోని మీసాలపై తేనెలు, స్వాతంత్ర్యసమరంలోని ఖాదీ ఉద్యమం తొంగిచూస్తున్నవి. ప్రాత క్రొత్తల మేలు కలయిక అంటే ఇదే. కాటూరివారు వచన కవితలు వ్రాసి ఉంటే నేటి వచన కవులు తలమీద పెట్టుకోవలసి వచ్చేదో, తల పట్టుకోవలసి వచ్చేదో!

వేంకటశాస్త్రిగారికి కాటూరివారంటే అమితమైన వాత్సల్యం. చెళ్లపిళ్ల వారి అంతిమఘడియల్లో కాటూరివారు వారిదగ్గర లేరు. చివరిక్షణాల్లో వేంకటశాస్త్రిగారు తన కుమారుడు దుర్గేశ్వరశాస్త్రిగారిని పిలిచి తానెప్పుడు ధరించే సేలువను, శిష్యుడు, కాటూరి కివ్వమని చెప్పారు. తండ్రి మరణానంతరం వారా ఆజ్ఞను నిర్వర్తించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"ప్రాణపదంబుగా విలిచి పల్కిన నీ తుదియాజ్ఞ సేలువున్
నేనిడినాడ శిష్యునకు నీవిడినట్టులు వేంకటేశ్వరుం
డానయనాంతబాష్పకణుడై గ్రహియించె జుమా! గురూ! భవ
న్మానసశాంతికిన్ దుది ప్రణామమిదే! మము బ్రోచుచుండుమా"

ఈ విధంగా గురువు ఆదరానికి పాత్రులైనవారు వేంకటేశ్వరరావుగారు.

ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార సంఘానికి, కాటూరివారు ప్రతిజ్ఞా యౌగంధ రాయణం, స్వప్న వాసవదత్త అనువాదాలనే కాక, కావ్యతోరణం, ప్రహ్లాదచరిత్ర అనే రెండు సంకలన గ్రంథాల్ని కూడ అందించారు.

కావ్యతోరణాన్ని 1953 సం॥లో సర్వోదయ గ్రంథమాల - విజయవాడవారు ప్రచురించారు. దీంట్లో నన్నయ భారతంలోని దుష్యంతోపాఖ్యానం, శ్రీనాథుని కాశీఖండంలోని గుణనిధి కథ, ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యంలోని ఏనుగు, పాము కథ, కంకటివారి ఉత్తర రామాయణంలోని సీతా పరిత్యాగ ఘట్టము ఉన్నవి. ప్రతి దానికి కాటూరివారు పీఠిక వ్రాశారు. అది ఒక్కొక్కటి ఒక సాహిత్య వ్యాసం. ప్రతి పద్యానికి టీక తాత్పర్యాలు వ్రాశారు. అందులో ఎన్నో విశేషాలు చోటు చేసుకున్నవి. ప్రహ్లాద చరిత్ర కూడ ప్రతి పద్యానికి టీక తాత్పర్యాలతో పిన్నలకు పెద్దలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నది. దీన్ని 1954 సం॥లో సర్వోదయ గ్రంథమాల, విజయవాడ వారు ప్రచురించారు.

కాటూరు వేంకటేశ్వరరావుగారు గొప్ప రాజకీయవేత్త. 1931 సం॥లో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించింది మొదలు చివరిదాకా సమకాలీన రాజకీయాలను గురించి వారికున్న అవగాహన, అనుశీలనము చాలాగొప్పది. 1962 సం॥ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా, ఆంధ్రప్రభ ఉప సంపాదకుడు శ్రీ గోవిందుని రామశాస్త్రిగారికిచ్చిన ఇంటర్వ్యూ చూస్తే, ఆనాటి రాజకీయాల్ని గురించి వారికిగల స్పష్టమైన భావాల్ని మనం గ్రహించవచ్చు. ఆ తరువాత నాలుగు మాసాలే వారు జీవించారు. ఆంధ్రప్రభ 1962 ఆగష్టు 15 మంగళవారం నాడు ప్రచురింపబడ్డ ఆ ఇంటర్వ్యూలో కొన్ని భాగాలు చూడండి.

ప్రశ్న :- మనకు స్వాతంత్ర్యం వచ్చి పధ్నాలుగు సంవత్సరాలయింది. ఈ సుదీర్ఘ కాలంలో ఏమి సాధించాము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరి వారి సమాధానం :- అన్ని జీవిత రంగాలనూ, రాజకీయా లాక్రమించుకొని కలుషితం చేశాయి. సాధారణ మానవుడు మరింత అస్వతంత్రుడై నాడు. ఇవాళ సంఘాన్ని శాసిస్తున్నది ఎవరయ్యా అంటే అధికారంలో ఉన్న రాజకీయ నాయకుడు. అధికారంలో వున్న రాజకీయ నాయకుల ప్రాపకం అనుగ్రహం లేనిదే ఎవడూ జీవించలేని స్థితి వచ్చింది. సాహిత్యం, శిల్పం, సంగీతం, విద్య, సాంస్కృతిక రంగం - అన్నింటికి అతడే నాయకుడు - ఉపదేశకుడు - శాసకుడు. ఇలాంటి దుస్థితి బ్రిటీషువారి హయాంలో కూడలేదు.

ప్రశ్న :- దీనికి నివారణోపాయం ఏమిటంటారు? మీ వంటి పెద్దలు, సాహితీ వేత్తలు నడుంకట్టి రంగంలోకి వచ్చి సరిఅయిన విలువలను ఎందుకు బోధించరాదు.

జవాబు :- మావంటి వారి ప్రబోధాలను, యివాళ వినిపించుకొనే వారెవరు? ఈనాటి వింత పరిస్థితులలో ఇంటలెక్చువల్స్‌కు ప్రాధాన్యం తగ్గిపోయింది. సంఘానికి కవులే ఉపదేశకులు.

ప్రశ్న :- ప్రస్తుత అవ్యవస్థ స్థితి ఎలా వచ్చింది ?

జవాబు :- మన రాజకీయాల ఫలితం అది....ఇవాళ మనం రాజకీయ నాయకుల అనుగ్రహం లేనిదే బ్రతకలేము. ఉద్యోగానికి వారి ప్రాపకం, వ్యాపారానికి, వ్యవసాయానికి ఏపని చేయటానికైనా వాళ్ళ గుప్పెటలో ఉన్నాము. ఆఖరికి మన పిల్లలకు చదువు చెప్పించుకోవాలన్నా వీలులేదు.

ప్రశ్న :- అయితే మనం ఏమి చెయ్యాలి ?

జవాబు :- ప్రస్తుతం ఏమీ చెయ్యలేము. ఈ ప్రవాహం ఇలా వెళ్ళవలసిందే........ మానవుణ్ణి సన్మార్గంలో నడిపించటానికి పూర్వం నాలుగు చెక్కు ఉండేవి. ఒకటి అంతరాత్మ, రెండు సంఘం, మూడు ప్రభుత్వం, నాలుగు దైవ భీతి. ఇవాళ అంతరాత్మ మరుగున పడిపోయింది. స్వార్థం విజృంభించి నపుడు అంతరాత్మ ఏమీ చేయలేదు. అందువల్ల దాని భయంలేదు. పోతే ఇవాళ సంఘం ఎక్కడుంది? మనం ఏపని చేసినా సంఘం ఏమీచేయదు. మనది వ్యక్తుల సమూహమే కాని సంఘం కాదు. సంఘపు కట్టుబాట్లు సడలి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పోయాయి. వ్యష్టివాదం ప్రబలంగా ఉంది. ఇక ప్రభుత్వ భయం, దాని భయం బలవంతుడికి లేదు. ఇక దైవభీతి అందుమా! నేడు పుణ్య పాపాల విలువలే మారిపోయాయి. ఎవరికీ వాటిలో నమ్మకం లేదు.

ప్రశ్న :- ఇదంతా మన దుష్ట రాజకీయాల ప్రభావమేనంటారా ?

జవాబు :- తప్పకుండా! మేధావి వర్గాలను అణచివేసి, ఎప్పుడైతే రాజకీయవేత్త విజృంభించాడో; పాలక వర్గానికి, ఎప్పుడైతే మేధావివర్గాలు లొంగిపోయి వారి ప్రాపకము కోసము ప్రాకులాడుతున్నాయో, ఆ సమాజం చాలా దుర్గతతో తీసుకుంటుంది.

ప్రశ్న :- మీరు కొన్నాళ్ళు పత్రికా సంపాదకులుగా ఉన్నారు. ఈ స్థితిలో పత్రికలు చేయగలిగింది ఏదీ లేదా ?

జవాబు :- మా కాలంలో పత్రికా రచన, జర్నలిజం, ఒక పవిత్రమయిన విధ్యుక్త కృషి. అప్పుడు మేము పూర్తిగా స్వతంత్రులం. ఇవాళ స్వతంత్రంగా సత్యాన్ని చాటగలిగిన పత్రికా రచయితలు, సంపాదకులు ఏరి? మీరంతా అస్వతంత్రులు. నేడు పత్రికా రచన ఒక భారీ వ్యాపారం.

ప్రశ్న :- మీ అభిప్రాయాన్ని గట్టిగా వెల్లడి చేయవచ్చునా ?

జవాబు :- నిర్భయంగా; స్వాతంత్ర్యానికి పూర్వం, సత్యవాదులయిన జర్నలిస్టులు, సంపాదకులు ఉండేవారు. ఇవాళ మన పత్రికారంగం చాలా అస్వతంత్ర మయింది. నేను అల్లా అన్నానని నిర్భయంగా చాటండి.

(గూడూరి నమశ్శివాయగారి డైరీ నుండి)

పరమ సాత్వికులైన వేంకటేశ్వరరావుగారు ఇలా అన్నారంటే వారికి ఎంత బాధకలిగిందో! అప్పటికే పెరిగిన అవినీతి వృక్షం ఇప్పుడు ఊడలు దిగింది. ఇప్పుడు ఇలా ఇంటర్వ్యూ ఇవ్వటం కూడ ప్రమాదకరమేమో! గాంధీ మన ప్రాచీన సంప్ర దాయాలపైన నవసమాజాన్ని నిర్మించటానికి ప్రయత్నించాడని, నెహ్రూ పాశ్చాత్య సంప్రదాయాలపై నూతన సమాజాన్ని నిర్మించ యత్నిస్తున్నాడని, ఇది విఫలం అవుతుందని కాటూరివారు భావించారు.

తాను ఆచరించని విషయాన్ని ఇతరులకు బోధించే తత్త్వం వారికి లేదు. ఇదీ గాంధీ ప్రభావం. ఈ విషయంలో భావరాజు నరసింహారావుగారొక సంఘటన చెప్పారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరివారు అనారోగ్యంతో మంచంలో ఉన్నారు. వారు వీరు వచ్చిచూసి వెళ్తున్నారు. వారి గ్రామం నుండి ఒక రైతు మిత్రుడు వచ్చాడు. అదీ ఇదీ మాట్లాడిన తర్వాత.

"వేంకటేశ్వర్రావుగారు! మా వాడు ఈ మధ్య విపరీతంగా పేకాడుతున్నాడు. దీనికితోడు చుట్టలు, ఇల్లు పట్టకుండా తిరుగుతున్నాడు! మీరంటే ఎంతో గురివాడికి కాస్త చెప్పి పుణ్యం కట్టుకోండి" అన్నాడు.

"మనకు వాడికి చెప్పే అర్హత ఉన్నదా ! మనం చేసిందీ అదేగా! మావాడికే నేను చెప్పలేదు. నేను చుట్టలు తాగుతూ, వాణ్ణి త్రాగవద్దని ఎలా మందలించేది" అన్నారట వేంకటేశ్వర్రావుగారు. అది ప్రక్క గదిలో ఉన్న వేంకటేశ్వర్రావుగారి కుమారుడు కొండలరావు విని పశ్చాత్తాపపడి "ఈరోజు నుండి నేను చుట్టలు త్రాగను" అని తండ్రితో చెప్పి మానేశారట.

చివరిరోజుల్లో తనజీవితలక్ష్యం గురించి పదేపదే కాటూరివారు చెబుతుండేవారు. ఆ విషయాల్ని రాచకొండ నరసింహమూర్తిగారు వేంకటేశ్వర్రావుగారు మరణించిన తరువాత ఒక వ్యాసంలో వివరించారు.

"నాకు మోక్షం అక్కరలేదు - లోకంలో పుట్టాలి - అందంగా పుట్టాలి - కాస్త కలిగినింట పుట్టాలి - విద్యావంతుణ్ణి కావాలి - మంచి శీలవంతుడనై పుట్టాలి- అదిలేకపోతే ఏం ప్రయోజనం - సుఖం, దుఃఖం అన్నీ అనుభవించాలి - ఒకే రుచిగల పదార్థంతో భోజనం రుచించదు. జీవితం రసభరితమైయుండాలి - తీపితిని చేదుమేయని బ్రతుకేం బ్రతుకు.... (1971 సంక్రాతి సంచిక - ఆంధ్రప్రభ డైలీ)

జీవునికేది సౌఖ్యమో, జీవితానికేది లక్ష్యమో సంపూర్ణంగా తెలిసిన కర్మయోగి కాటూరి.

—: మరొక కాటూరి వంశం :—

కాటూరు గ్రామంలోనే మరొక కాటూరు వంశమున్నది. మరీ చిత్రమేమంటే ఈ రెండు కుటుంబాలకు వియ్యపు పొత్తు ఉండటం. ముందు కల్పటంవారై, తరువాత కాటూరి వారైన వేంకటేశ్వర్రావుగారి కుటుంబానిది శ్రీవత్స గ్రోతం. రెండవ కుటుంబం వారిది హరితస గోత్రం. వీరు కూడ సాహిత్య వ్యాసంగం గలవారే. వీరి వంశంలో కాటూరి రవీంద్ర త్రివిక్రమ్ వర్తమానంలో మంచి రచయితగా పేరు తెచ్చుకున్నాడు. సుమారు ఆరు వందల కథలు, కొన్ని నవలలు, రేడియో నాటికలు వీరు రచించారు. వీరి తండ్రి వేంకట సుబ్బారావుగారు వేంకటేశ్వర్రావుగారికి సమకాలికులు. ఈ రెండు కుటుంబాలు అన్యోన్యంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరి వారి మిత్రులు

పింగళి లక్ష్మీకాంతం :- కాటూరి వారి మిత్రులలో ప్రప్రథమంగా చెప్పుకో దగ్గవారు పింగళి లక్ష్మీకాంతంగారు. వీరు 10 జనవరి 1894 నుండి 10 జనవరి 1972 దాకా జీవించారు. జన్మస్థలం కృష్ణాజిల్లా చల్లపల్లి తాలూకా చిట్టూరుపు గ్రామం. తండ్రి వేంకటరత్నం, తల్లి కుటుంబమ్మగార్లు. వీరు ఆంధ్ర, వేంక టేశ్వర విశ్వవిద్యాలయాలల్లో చాలాకాలం ప్రొఫెసరుగా పని చేశారు. గురువులు తిరుపతి వేంకటకవులలాగా, పింగళివారు కాటూరివారు జంటకవులు. సౌందర నందం వీరి ప్రసిద్ధ కావ్యం.

బంధువు లేక మానసులు బాల్యసఖుల్ సహపాఠులున్ సమ
స్కంధులు పింగళాన్వయుడు కాంతుడు, కాటురి వేంకటేశుడున్
సుందరనంద రాగరస శోభిత వృత్తము రమ్య తత్త్వమీ
సౌందరనంద సత్కృతిని సల్పిరి దేశికు డిచ్చ మెచ్చగన్

భావమొక్కడు గాగ భావన మొక్కడై
రసభావపరిణతి యెసగ జేసి
సరసార్థమొకడుగా శబ్దమింకొకడయి
శబ్దార్థ సామరస్యముఘటించి
సూత్రమొక్కడుగాగ చిత్రణ మొక్కడై
ప్రాణవత్పాత్రముల్ పాదుకొల్పి
తెరయెత్తుటొకడుగా దెరదించుటొక్కడై
రంగనిర్వహణమ్ము రక్తినిలిపి

సుందరీనంద జీవితానంద మట్లు
పరమమగు కోటికెక్కిన బంధుభావ
మిత్రభావము లిమ్మెయి మేళగించి
సృష్టిజేసితి మీకావ్య శిల్ప మూర్తి

వారి అనుబంధాన్ని చెప్పటానికి సౌందరనందంలోని ఈ రెండు పద్యాలు చాలు.

దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి :- దేవులపల్లి 1897లో జన్మించారు. కాటూరి వారికి జీవిత ఉత్తరార్థంలో దేవులపల్లితో అనుబంధం బాగా పెరిగింది. మావాడు కృష్ణమాయలో పడిపోయాడని, లక్ష్మీకాంతంగారు బాధపడేవారట. కవితా ధోరణుల్లో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరికీ దేవులపల్లికి అంతగా పోలికలు లేవు. ఆభిరుచులుకూడ వేరు "మువ్వ గోపాల" రూపకాల సంపుటిని కాటూరివారు కృష్ణశాస్త్రిగారికి అంకితం చేశారు. "కృష్ణ పక్షం" దేవులపల్లి ప్రసిద్ధ కావ్యం.

గూడూరు నమశ్శివాయ :- వీరు 5 మే 1917న. బందరుతాలూకా వల్లమన్నాడులో జన్మించారు. తండ్రి మల్లయ్యగారు. తల్లి బాయమ్మగారు. దత్తత చేసుకున్నవారు పినతండ్రి వియ్యన్నగారు. విజయవాడవస్తే వేంకటేశ్వరరావుగారు వీరింట్లోనే దిగేవారు. 10 మార్చి 1933లో వల్లూరి వేంకటసుబ్బయ్యగారి దత్తకుమార్తె రాజేశ్వరమ్మగారితో వీరికి వివాహం జరిగింది. వల్లూరివారు గొప్ప నటులు మొదటి తెలుగు సినిమా ప్రహ్లాదలో హిరణ్యకశిపుడుగా, ద్రౌపదీ మానసంరక్షణంలో భీముడుగా వీరు నటించారు. నమశ్శివాయగారికి, తిరుపతి వేంకటకవులు మొదలు నేటిదాకా ఉన్న ఎందరో కవి పండితులతో ప్రత్యక్ష పరిచయమున్నది. పినతండ్రి వియ్యన్నగారి వైద్యానికి, కవి పండిత సాంగత్యానికి వీరు వారసులు. వీరు వారి గ్రామంలోని శివాలయానికి ధర్మకర్తలు. అంతకంటే సాహితీ ధర్మకర్తలంటే బాగుంటుంది. ఏ కవి, విమర్శన వ్యాసం, లేక కవిత, పత్రికలలో ప్రచురింపబడ్డా, వీరు తీసి భద్రపరుస్తారు. వీరు ఎన్నో అపూర్వగ్రంథాల్ని భద్రపరిచారు.

ఈ డెబ్బై సంవత్సరాలప్రాయంలో ఎవరైనా ఏదైనా పుస్తకం అడిగితేచాలు, తూలుతూ లేవవలసిందే, గోడ పట్టుకుని నడిచి ఆ పుస్తకం వెదికి వారికివ్వవలసిందే. వారేకాదు వారి ధర్మపత్ని కామేశ్వరమ్మగారు కూడా అంతే. "ఈ ముసలాయన్ని ఎందుకు ఇబ్బంది పెడతారు" అని ఇంటికొచ్చిన వారిమీద విసుక్కోదు. సరికదా, ఆమెకూడ ఆ పుస్తకాలు వెదకటంలో భర్తకు సహకరిస్తుంది. ఈ గ్రంథ రచనకు కావలసిన కాటూరివారి మూలగ్రంథాలన్నీ వారే ఇచ్చారు. ఇలాటి దంపతులు చాలా అరుదు. ఈ సత్కృతులకు భగవంతుని ఉపకృతి ఏమో తెలియదుగాని, మేమిచ్చేది మాత్రం ఒక నమస్కృతి.

డా॥ భావరాజు నరసింహారావుగారు కాటూరివారి గ్రంథాల్ని సాహితీలోకానికి అందించటంలో తోడ్పడ్డ మిత్రులు. వీరు ప్రచురణకర్తలు. ఒకనాటి త్రివేణి అధినేతలు. ఆనాటి కవుల రచనలన్నిటిని ముద్రించి ప్రచారంచేసిన సాహితీసేత్తలు. బాపిరాజు, తుమ్మల, విశ్వనాథ, జలసూత్రం, పింగళి నాగేంద్రరావు మొదలైన కవులతో కాటూరి వారికి చక్కని సంబంధాలున్నవి. ఊట్ల కొండయ్య, రాచకొండ నరసింహమూర్తి మొదలైనవారికి కాటూరివారు గురువులు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జీవిత చరమాంకంలో కాటూరివారు క్రోటు కాన్సరు వ్యాధికి గురయినారు విశాఖపట్టణం, మద్రాసు, హైద్రాబాదు నగరాలలో చికిత్స పొందారు. ప్రయోజనం కనబడలేదు. చివరి రోజుల్లో విజయవాడ దుర్గాగ్రహారంలో ఉండేవారు. వ్యాధి తీవ్రం కావటంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. కాలం ముందడుగు వేసింది. భౌతికకాయానికి వెనుకడుగు పడింది. పింగళి కాటూరి జంటలో వెనుక పూసిన పువ్వు ముందుగా సత్యలోకంలోని సరస్వతీదేవిపాదాలపై వ్రాలింది. మిగిలిన పుష్పం చెన్నుడరిగి చెదరిపోయింది.

కాటూరివారి వంశము నాటికి నేటికి పండితవంశమే. శంకరయ్య, కొండయ్య గార్ల ఉమ్మడికుటుంబానికి ఆస్తి, మూడువందల ఎకరాల పొలం, మూడువందల పశుగణం, మూడు ఎకరాల నివేశన స్థలంలో లోగిళ్ళు. శంకరయ్యగారి కుమారుడు వేంకటకృష్ణయ్య. కొండయ్యగారు నిస్సంతు. వేంకటకృష్ణయ్య కుమారులు రామకృష్ణయ్య, వేంకటేశ్వర్రావు, శంకర్రావులు. వేంకటేశ్వర్రావు చినతాత కొండయ్య గారికి దత్తత. ఈ ముగ్గురిలో రామకృష్ణయ్య నిస్సంతు. శంకర్రావుగారి కుమారులు, వేంకటకృష్ణశర్మ., భాస్కర్రావులు. ఇందులో భాస్కర్రావు రామకృష్ణయ్యగారికి దత్తత. వేంకటకృష్ణశర్మగారు గుడివాడలో వుంటారు. వీరు సాహిత్యాభిమానులు. శంకర్రావుగారికి ఏడుగురు స్త్రీ సంతానం. రమాదేవి, యమునాదేవి, జ్యోతిర్మయి, శశికళ, భార్గవి, మధురలాలస, వరలక్ష్మి అనే చక్కటి పేర్లు, వేంకటేశ్వర్రావుగారే వారికి పెట్టారట. శంకర్రావుగారి అల్లుళ్ళలో యమునాదేవి భర్త నంబూరి వేంకటేశ్వర్రావుగారు రచయిత. చివరి కుమార్తె వరలక్ష్మి భర్త దావులూరు సీతారామాంజనేయులుగారు మంచి వక్త, ప్రయోక్త, సాహిత్యాభిమాని. ఆకాశవాణి ఉద్యోగి.

వేంకటేశ్వర్రావుగారి కుమారులు కొండలరావు, విజయసారథి, రఘురామయ్య గార్లు. కొండలరావుగారి కుమారుడు నాగేశ్వర్రావు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకిలో పెద్ద పదవిలో ఉన్నారు. వీరికి సాహిత్యంలో మంచి ప్రవేశమున్నది. ఇక విజయసారథిగారు స్వయంగా రచయిత, కథకుడు, ఆకాశవాణి ఉద్యోగి. రఘురామయ్య గారు సాహిత్యాభిలాషి. సీతమ్మ, వరలక్ష్మి, స్వాతి, లీలాదేవి అనేవారు కుమార్తెలు. వారి కుటుంబాలు సుసంపన్నంగా ఉన్నవి. ఈ విధంగా కాటూరి వారి కుటుంబం మూడుపువ్వులు ఆరుకాయలులాగా విలసిల్లుతున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరి వారి చమత్కృతులు

కాటూరి వారు సంభాషణా చతురులని చాలామంది చెబుతుంటారు. ఆ చమత్కారాలు ధ్వని ప్రధానాలు, వ్యంగ్యార్థ విలసితాలు. వేంకటేశ్వరరావుగారికి సన్నిహితంగా మెలగిన పెద్దల నుండి సేకరించిన కొన్నిటిని ఇక్కడ వివరిస్తాను.

కాటూరివారు పెద్ద భూస్వాములు. గ్రామంచుట్టూ ఉన్న ఆ పొలంలో తోటలు, మోటలు, చెఱువులు. కొండయ్యగారి దత్తపుత్రుడు కావటంవల్ల వేంకటేశ్వరరావుగారిది నూటయాభై ఎకరాల పొలం. అయితే అదెక్కడున్నదో కూడ వారికి తెలియదు. అన్న రామకృష్ణయ్యగారో, తమ్ముడు శంకరరావుగారో ఆ వ్యవహారాలు చూడవలసిందే. దీనికి సంబంధించిన ఒక చమత్కార సన్నివేశం.

వంగతోటలో నిగనిగలాడుతూ చక్కని కాయలు ఉదయం సూర్యరశ్మికి మెరుస్తున్నవి. వాటిమీద వేంకటేశ్వరరావుగారి చూపుపడ్డది. కాయలు కోస్తున్నారు. ఇంతలో ఒక రైతు అటుగావచ్చి "ఏమిటి! అయ్యగారూ వంకాయలు కోస్తున్నారు" అన్నాడు. అది ఆ రైతు పొలమేమోనని కాటూరి వారికి అనుమానమొచ్చింది. వారు నవ్వుతూ "ఏమోయ్! చూశావా! దేవుడెంత గొప్పవాడో వీటిని ఎంత అందంగా సృష్టించాడు, పొలం ఎవరిదైతేనేం!" అన్నారట.

రైతు ఆశ్చర్యంగా "అయ్యా ఇది తమరిచేనే" అన్నాడు.

కాటూరి వారు పొరపాటు గ్రహించారు. "అవునోయ్! నాకా మాత్రం తెలియదా! నేనంటున్నది-నేనేకాదు, నువ్వుకూడ ఇవి కోసుకోవచ్చని" అన్నారట ముసిముసి నవ్వులతో.

(గూడూరి నమశ్శివాయగారు చెప్పింది)

♦ ♦ ♦

ఒకరోజు బాపిరాజుకు కాటూరికి జరిగిన సంభాషణ

బాపిరాజు : బావగారూ! మీరు, నేను, విశ్వనాథ మన్మథనామ సంవత్సరంలో పుట్టాం. అందరం కవులమయినాం. చూచారా! ఎంత చిత్రంగా ఉందో!

కాటూరి : నా ముఖం లాగున్నది. మన్మథనామ సంవత్సరంలో పుడితే అందంగా ఉండాలిగాని కవులు కావటం ఏం ఖర్మం!

ఈ ముగ్గురిలో కాటూరివారు అందంగా ఉంటారు. ఇది ఇక్కడి ధ్వని.

(నమశ్శివాయగారు చెప్పింది)

♦ ♦ ♦

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పడుకోబోయేటప్పుడు రాత్రికి కావలసిన చుట్టల్ని చుట్టుకొని పడుకోవటం కాటూరివారి అలవాటు. ఆ సందర్భంలో ఒక మిత్రుడితో సంభాషణ.

మిత్రుడు : వేంకటేశ్వర్రావుగారూ ! మీరేమిటి ఎప్పుడూ పడుకోబోయే ముందు చుట్టలు చుట్టుకుంటారు.

కాటూరి : నేనేమిటి ఆదిశేషుడు కూడ చుట్టలు చుట్టుకునే పడుకుంటాడు.

పాండిత్యానికి ఆదిశేషుణ్ణి చెబుతారు. శేషుణ్ణి తనకు ఉపమానంగా చెప్పటం లోనే ఉన్నది ధ్వని. ఇదీ వారి గడుసుదనం.

• • •

ఒకసారి కాటూరి 'పౌలస్త్య హృదయం'లోని "ఎల్లి నినుజేరి పవళించు నేమి యెఱుగనట్లు తరంగ లాలితుండగుచు శౌరి" అనే పద్యాన్ని ఒకటికి రెండుసార్లు అంటున్నారట ఏదో ఆలోచిస్తూ, ప్రక్కనే ఉన్న ఒక మిత్రుడు "ఆ శౌరి ఇప్పుడు కూడా సముద్రం మీద పవళిస్తున్నాడా!" అన్నాడు.

కాటూరి : లేదు! ఆ నల్లనయ్య సముద్రాల మీద పవళించటం లేదు. అవన్నీ తెల్ల వాళ్ళ అధీనంలో ఉన్నవిగాదా!" అన్నారట చమత్కారంగా.

• • •

శ్రీమాన్ కోగంటి సీతారామాచార్యులవారు వేసవి శలవుల్లో కాటూరివారి ఇంటికి వెళ్ళటం వారం పదిరోజులు కవితా గోష్ఠులతో కాలక్షేపం చేయటంమామూలు. పండితులతో కాటూరివారు తమ ఇంట్లో దర్బారు నిర్వహించే వారట. తన ఉత్తరాలు పోస్టాఫీసుకు వెళ్ళి తానే తెచ్చుకోవటం వారికి అలవాటు. ఒకరోజు పోస్టా ఫీసుకువెళ్ళగా కోగంటి వారికి తన కేరాఫ్ అడ్రసుతో వచ్చిన ఒక కార్డు కనబడింది. కిరాణాకొట్టు వాడొకడు తనబాకీ పంపమని ఆచార్యుల వారికి వ్రాశాడు. ఆ పైకాన్ని అక్కడి కక్కడే మనియార్డరుచేసి, ఆ ఉత్తరం చించిపారేసి, ఏమీ తెలియనట్లు ఇంటికి వచ్చారు వేంకటేశ్వర్రావుగారు. రెండు రోజుల తర్వాత-

కోగంటి : అయ్యా నాకు శలవు ఇప్పించండి! వెళ్ళి వస్తాను.

కాటూరి : తొందరేముంది వారంరోజు లుండి పోదురుగాని!

కోగంటి : అలాకాదులెండి! చిల్లర దుకాణంవాడికి కొంత పైకం ఇవ్వాలి — ఇంకా కొన్ని పన్లు.

కాటూరి : అవన్నీ వేంకటేశ్వరుడున్నాడు గదా! వాడే చూసుకుంటాడు. ఉండిపొండి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కోగంటి వారు కాదనలేక కొన్ని రోజులున్నారు. వేంకటేశ్వరుడంటే స్వామివారనుకున్నారు వారు. ఇంటికి తిరిగి వచ్చిన తరువాత జరిగిన విషయం తెలిసింది. తరువాత కలసినప్పుడు "ఏం! వేంకటేశ్వరరావుగారూ ఇలా చేశారు" అన్నారట కోగంటి.

కాటూరి : "ఏం చెయ్యను వాడు నన్ను మీ కేరాఫ్ అని వ్రాసె" అన్నారట నవ్వుతూ.

(కోగంటి వారు చెప్పింది)

• • •

కాకినాడలో ద్వారం వేంకటస్వామి నాయుడుగారికి, వేదుల సత్యనారాయణ శాస్త్రిగారికి సన్మానం జరుగుతున్నది. కాటూరి వారు అధ్యక్షులు.

కాటూరి · "ఈ కాకినాడలో నల్లటివాళ్ళకు తప్ప ఎర్రటి వాళ్ళకు సన్మానాలు జరగవు లాగున్నది." అంటూ ప్రసంగం ప్రారంభించారు.

కాటూరివారు ఎర్రగా, వేదుల, ద్వారం వార్లు నల్లగా ఉండటం కాకి నాడ కావటం ఇందులో చమత్కారం. (కోటగిరి విశ్వనాథరావుగారు చెప్పారు)

• • •

ఒకరోజు ఉదయం దేవులపల్లి, కాటూరి ఒకరి భుజాన ఒకరు చేతులేసుకొని కరుణశ్రీ గారింటికి వచ్చారట.

కరుణశ్రీ "రండి, రండి! కృష్ణార్జునులులాగ వచ్చారు" అన్నారు. అందరూ కూర్చొని ఏదో మాట్లాడుకుంటున్నారు. ఈలోపల జీడిపప్పువేసి చేసిన వేడివేడి ఉప్మా లోపల్నించి వచ్చింది. అందరూ తింటున్నారు.

తలపంకిస్తూ కాటూరి "కరుణశ్రీ! ఒకమాట. ఇందాకటి నీ ఉపమ కంటే ఈ ఉపమా చాలా బాగున్నది" అన్నారు వారి చమత్కారానికి అందరూ నవ్వారు.

(కరుణశ్రీగారు చెప్పింది)

• • •

కోలవెన్ను రామకోటీశ్వరరావుగారు త్రివేణి, కృష్ణా పత్రికలకు సంపాదకులు. కాటూరి వారికి ఆప్తమిత్రులు. వారి దత్తత కుమారుని ఉపనయనం నరసరావుపేటలో వారి స్వగృహంలో జరుగుతున్నది. కాటూరి వారు స్వయంగా డబ్బు తనదో, వారిదో తెలియకుండా ఖర్చుపెట్టి భారీగా ఏర్పాట్లు చేశారు. ఉపనయనం అయిపోయింది. మరుసటి రోజు రాత్రి అంతా భోజనాలకు కూర్చున్నారు. కాటూరివారి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జాడలేదు. ఎక్కడ ఎక్కడ అని అంతా వెదుకుతున్నారు. అప్పుడు కాటూరివారు వస్తూనే చిరాగ్గా.

"ఏమయ్యా రామకోటేశ్వర్రావు! పిల్లవాడికి ఉపనయనం చేశావు! మాలాంటి కవులకు సత్కారాలు పాడూ ఏం లేవా?" అన్నారు.

ఎవరో అన్నారు "ఏమిటి ఈ ఉపనయనానికి తనజేబులో డబ్బే ఖర్చుపెట్టిన వేంకటేశ్వర్రావు ఇలా మాట్లాడుతున్నాడు" అని. వేంకటేశ్వర్రావుగారు "అవును ఇప్పుడూ అదే చేశా. ఆ క్లబ్బులో వెధవలు జేబులు ఖాళీ చేశారు. రేపు ఇంటికి పోవాలంటే సన్మానం చేయకపోతే ఎలా!" అన్నారు. జరిగింది కనిపెట్టి అందరూ నవ్వుకుంటున్నారు. అదిచూచి కోలవెన్నువారు "ఈయనకు ఆపేక, చుట్ట మానెయ్యమని వందసార్లు చెప్పాను" అన్నారు.

"అవి రెండూ మానేస్తే ఇక నేను ఏం చెయ్యటానికట" అంటూ కాళ్ళు కడుక్కుంటానికి వెళ్ళారు కాటూరి వారు (భావరాజు నరసింహారావుగారు చెప్పింది)

• • •

ఒకరోజు కాటూరి, గూడూరి, మరికొందరు మిత్రులు ఏదో మాట్లాడుకుంటున్నారు. ఇందులో ఒకాయన బాపిరాజు శశికళ ఫలానా, దేవులపల్లి వారిట్లా, విశ్వనాథ వారట్లా అంటూ ఏవో కవుల ఆంతరంగిక విషయాల్ని చర్చకు పెట్టాడు. కాటూరి మౌనంగా వింటున్నారు. ఈ లోపల రాచకొండ నరసింహమూర్తిగారు లోపలికివస్తూ "మహాకవులకు నమస్కారం" అన్నాడట. వెంటనే కాటూరివారు నన్ను పెద్దమనిషి అనండి చాలు. ఆ మహాకవి! వద్దు" అన్నారట. అందరూ నవ్వులు. అప్పటిదాకా జరిగిన సంభాషణ తెలియని రాచకొండవారి కంగారు.

(గూడూరి నమశ్శివాయగారు చెప్పింది)

• • •

కొండలరావుగారి కుమారుడు ఒకరోజు కాటూరివారి ఒళ్ళో కూర్చున్నాడు. ఈయన చుట్ట కాలుస్తున్నాడు. ఆ పిల్లవాడు "తాతయ్యా నాక్కూడా చుట్ట ఇవ్వవా?" అన్నాడు. కాటూరివారు "చుట్టే ఇంకేమన్నా ఉన్నదా! నీకు నేను చుట్టఇస్తే మీనాన్న వచ్చి 'మా అబ్బాయికి చుట్ట కాల్చటం నేర్పుతావా!' అని నన్ను కొడతాడు. మీ నాన్ననడుగు మీనాన్న ఇమ్మంటే ఇస్తా" అన్నారట.

కొండలరావుగారు కూడ చుట్ట కాల్చేవారు. ఇది ఇందులో చమత్కారం.

(కాటూరి విజయసారధిగారు వ్రాసింది)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సు మాం జ లి

కాటూరి వారికి అందరూ మిత్రులే. వార్ని ఎందరో ప్రశంసించారు. డా॥ బాలాంత్రపు రజనీకాంతరావుగారు కాటూరి వారిని స్మరించిన పద్యం చూడండి.

చేతవొగాకుపోరమును జీల్చుచు చిర్నగవాస్యమందు హం
దాతనరింప నాప్తకవి తల్లజుతోడనొ శిష్యుతోడనో
కై తలగూర్చి లోకము ప్రకారమునెంచుచు ముచ్చటింప నీ
కేతగు వేంకటేశ్వరకవీశ్వర! కైకొనవే సుమాంజలిన్

* * *

మల్లాది రామకృష్ణశాస్త్రిగారి పలుకులు చూడండి.

"కాటూరి వేంకటేశ్వరరావుగారు తేజస్వి - వర్చస్వి - మనస్వి - సరసముగ పలుకనేర్చినవాడే కాని మాటకారి గాడు - ఛాందసుడేగాని సారస్వతమూర్తి - మితభాషి, మృదుభాషి, ఋజుభాషి."

(కాటూరి మేష్టారు - పుస్తక ప్రపంచం ఫిబ్రవరి–1968)

* * *

నా గురువులు వావిలాల సోమయాజులుగారు కాటూరి వారి పౌలస్త్య హృదయం ప్రేరణకాగా "వాలిహృదయం" అనే ఖండకావ్యం వ్రాశారు. ఆంధ్రపత్రిక 1962 సం॥ ఉగాది సంచికలో ప్రచురింపబడింది. అది తరువాత "పరివర్తన" పేరుతో "శివాలోకం"లో ముద్రించబడింది. వారు కాటూరి వారిని గురించి నాతో అన్న మాటలు

"ఆయన సారస్వతయోగి—మేధావి—సర్వతోముఖ సంభాషణాచతురుడు"

* * *

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాటూరివారి మూర్తి ఎంత గంభీరమో హృదయం అంత నవనీతం. అందరు కవులు ఆయనకు మిత్రులే! ఆ విషయాన్ని సూచించే తుమ్మలవారి పద్యం చూడండి.

"ఒండొరులు చేరినపుడు కాటూరి కులుడు
మిక్కిలిగ నన్నె నన్నె ప్రేమించుననుచు
బెనగుదురు నీ ప్రసక్తిలో దెనుగువార
లెంత పండితుండవొ వేంకటేశ్వరకవి!"

* * *

టి.వి.యం. అయ్యవారు కాటూరివారి కవితా పైఖరిని ప్రశంసిస్తూ వ్రాసిన పద్యంలో చేమకూర పాకం కాటూరులో లభిస్తుందన్నారు.

"వన్నెలుచిందు కావ్యములు వ్రాయ వలంతులు లేరె! సాధు వి
ద్వన్నుతులీ మహాంధ్ర వసుధామణి దీపములెందరైన - లే
వెన్నెల సోయగాల మఱపించెడి కూర్పులు చేమకూర వెం
కన్నకు నబ్బెనున్నిపుడు "కాటూరి"కబ్బె ప్రసన్నమూర్తికిన్"

(స్రవంతి - కాటూరి సంస్మరణ సంచిక—జూన్ 1963)

* * *

కాటూరి వారు అందరికీ మాష్టారే. మల్లంపల్లి శరభయ్యగారు వారి కవితా తన్వంగికి భద్రమేనా అంటూ పలికిన పద్యం చూడండి.

"ఆరంబోసిన పండువెన్నెలలు నీహారాంబువుల్ మేల్మి బం
గారమ్మున్ దొవతేకు మెత్తనలు ముక్తాహారముల్ సాంద్ర క
ర్పూర క్షోదము గర్భకైతక దళమ్ముల్ కార్తికీశాలి కే
దార శ్రేణులు రూపుగొన్న కవితా తన్వంగికిన్ భద్రమే"

(స్రవంతి - కాటూరి సంస్మరణ సంచిక—జూన్ 1963)

గాంధేయవాదం - సంప్రదాయ ప్రీతి - కవితా చమత్కృతి - తెలుగువాడి మీసం - పౌరచట్ట షోకు అన్నీ కలిపి చూస్తే కనిపించేది కాటూరి మూర్తి. ఫలించేది సాహితీ రసస్ఫూర్తి.

ఆనందభరితమైన కవితామతల్లికి, ఆస్వాద చరితులైన రసజ్ఞులకు, రససిద్ధులైన కవులకు నమస్సుమాంజలి!!

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉపయుక్త గ్రంథములు

1. వాల్మీకి రామాయణము – మైలాపూర్ ప్రతి

2. రంగనాథ రామాయణము –
తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ-1989

3. భాస్కర రామాయణము –

4. ఉత్తర రామాయణం - కంకంటి పాపరాజు

5. దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రము – ఆదిశంకరులు

6. సౌందర్య లహరి – ఆదిశంకరులు

7. ప్రతిజ్ఞా యౌగంధరాయణము - భాసుడు

8. స్వప్న వాసవదత్తము - భాసుడు

9. ప్రభావతీ ప్రద్యుమ్నము – వావిళ్ల ప్రచురణ - 1958

10. రాధికా సాంత్వనము –
యం. యస్. కో. ప్రచురణ - 1972

11. భారతదేశ చరిత్ర-సంస్కృతి - భాగం-4 –
డా॥ అల్లాడి వైదేహి-తెలుగు అకాడమీ ప్రచురణ-1972

12. ఆధునిక ఆంధ్రదేశ చరిత్ర-ఆచార్య పి. రఘునాథరావు–
తెలుగు అకాడమీ ప్రచురణ-1987

13. పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు చరిత్ర సంగ్రహము-1935

14. కృష్ణా పత్రికలు

15. స్రవంతి - కాటూరి సంస్మరణ సంచిక - జూన్ - 1963

8113

—)o(—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

GURUKUL KANGRI LIBRARY
Accession 21513
Class on
Cat on
Tag etc.
Checked
Any Other

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

Katurivari Sahithi Samalochanamu
By Pingali Venkata Krishna Rao, M. A.

గ్రంథకర్త పరిచయం

జననం :— కృష్ణాజిల్లా గోకరాజుపల్లె గ్రామం; 21—12—1942
తండ్రి :— రామగోపాలరావు
తల్లి :— లక్ష్మీనరసమ్మ
విద్యాభ్యాసం :— ప్రాథమిక విద్య స్వగృహంలో
హైస్కూలు విద్య :— కంచికచర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో
పి.యు.సి.—యస్.ఆర్.ఆర్. అండ్ సి.వి.ఆర్. కళాశాల విజయవాడ
బి.ఏ.—హిందూ కళాశాల గుంటూరు
బి.ఇడి. - ఆంధ్ర జాతీయ కళాశాల మచిలీపట్టణం
ఎం.ఏ. — ఆంధ్ర విశ్వవిద్యాలయం
ఉద్యోగం :— ఆంధ్రోపన్యాసకులు - శాతవాహన కళాశాల, విజయవాడ
సాహితీ వ్యాసంగం :— 1963 నుండి వివిధ దిన, వార పత్రికలలో సాహిత్య వ్యాసాలు - కవితలు - నవల ప్రచురితములు.
ఆంధ్ర సచిత్రవారపత్రికలో లిటరరీ పజిల్ నిర్వహణ.
ఇప్పుడు ప్రదర్శింపబడుచున్న రూపకాలు :—
వరూధినీ ప్రవరాఖ్యం — బాలధ్రువ
1971 నుండి ఆకాశవాణి విజయవాడ కేంద్రం ద్వారా పద్య, గేయ కవితలు, రూపకాలు, ప్రసారితములు.
సరస వినోదినీ నిర్వహణ
ఆంధ్రదేశం నలుమూలల సాహిత్య ప్రసంగాలు
భువనవిజయం, ఇంద్రసభ, కైలాస సాహితీసభ, ఇందిరామందిరం మొదలైన సాహితీ రూపకాలలో, తెనాలి రామకృష్ణ, ధూర్జటి, పింగళి సూరన, చేమకూర వేంకట కవి పాత్రల నిర్వహణ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar